


అఖిల

అఖిల భారత పత్రిక

జనవరి 2023

శ్రీ అరవిందుల కవితల్లో - భవిష్యవాణి



శ్రీ అరవిందుల కవితల్లో భవిష్యవాణి

గత యుగపు ప్రథమార్థంలో శ్రీ అరవిందులు మానవత యొక్క పోరాటాలు, తిరుగుబాట్లు చూశారు. ఒక విప్లవాత్మకమైన ఉద్రిక్తత ఒక పెను తుఫాను, సుడిగుండాలలో ఒక నూతన సృష్టి యొక్క బీజాలను కలిగి ఉంది. జ్యోతిర్మయమయిన భవిష్యత్తును మానవాళి సిద్ధింప చేసుకోవడానికి సహాయ పడటానికి ఆయన తన జీవితాన్ని అంకితం చేశారు.

శ్రీ అరవిందులు **150**వ జన్మదిన సందర్భంగా భవితను ప్రవచించే ఆయన కవితలు కొన్నింటిని కానుకగా ఒక చిరు పుస్తకం రూపంలో పొందుపరిచాము. ఇందులో కొన్ని ప్రకరణాలను సావిత్రి దీర్ఘమైన పద్యాలు మరియు గీతాల నుండి గ్రహించడం జరిగింది.

శ్రీ మాత చాలా చక్కగా పేర్కొన్నారు.

"శ్రీ అరవించులు భవిష్యత్తుకు చెందుతారు. ఆయన భవితకు రాయబారి. భగవత్ సంకల్పం రచించిన వైభవోపేతమైన భవిష్యత్తును మనం వేగవంతంగా సిద్ధింపచేసుకోవడానికి మార్గాన్ని ఇంకా ఆయన చూపిస్తూనే ఉన్నారు. మానవాళి ప్రగతికి భారతదేశం మహోత్సవాల గమ్యానికి చేరుకోవడానికి సహకరించాలని అందరూ ఒక దివ్య దృష్టి కలిగిన ఆకాంక్షతో ఈ తేజోవంత మైన కార్యంలో ఐక్యం కావాలి."

CWM 13:14

శ్రీ మాత



Bonne Année
Blessings

నూతన సంవత్సర శుభాకాంక్షలు

1967

మానవులు దేశాలు, ఖండాలు!
ఎన్నుకోవడం తప్పనిసరి:
సత్యమా లేక అగాధమా

1967 నూతన సంవత్సరం సందేశం గురించి

శ్రీమాతా మీరు ఎంపిక సత్యము అగాధాల మధ్య అన్నారు. అగాధం సరిగ్గా మన ఎదురుగానే నోరు తెరుస్తున్నట్లుగా ఉంది. కానీ అది మార్గం నుండి తొలగించబడుతుందని నమ్మకం ఉంది.

ఆ నమ్మకం న్యాయబద్ధమైనదే.

ఆ సందేశం ఇంకా నిద్రపోతున్న వారికి తమ నిద్దరతో తృప్తి చెందిన వారికి మాత్రమే.

*

మీ నూతన సంవత్సర సందేశంలో అగాధం అంటే అర్థం ఏమిటి మరొక విధంగా అడగాలంటే ఒక సాధకుడు దేనికి భయపడాలి?

ప్రస్తుతం చాలా ఉద్రిక్తతగా ఉంది. నాకు అంతా యుద్ధం చేయడానికి అన్నట్లు తమ స్థానాలను తీసుకున్నారు. అది మనుషులు తమ అంతర్జాతీయ సంబంధాలలో ఉంచే అండ వ్యామోహం.

అన్నింటి అడుగున భయం సార్వజనీనమైన అప నమ్మకం వారు తమకు ఆసక్తికరమని భావించేవి (ధనం, వ్యాపారం) ~~ఈ~~ మూడింటి కలయిక. మానవాళి యొక్క ~~ఈ~~ మూడు నిమ్నమైన వ్యామోహాలు రంగంలోకి ఎప్పుడు వస్తాయో దానిని నేను అగాధమని పిలుస్తాను.

ఎప్పుడైతే ఒక వ్యక్తి తన జీవితాన్ని దైవాన్ని తెలుసుకోవడానికి అంకితం చేయాలనుకుంటాడో అతను నిజాయితీగా ఉన్నట్లయితే అదే అతను సంకల్పం నిజాయితీగా ఉండి మనస్ఫూర్తిగా ప్రయత్నించినట్లయితే భయపడ వలసిన అవసరం ఎంత మాత్రం ఉండదు ఎందుకంటే సంభవించేదంతా, అతనికి జరగబోయేదంతా కూడా ఆ సిద్ధి కోసం అతనిని చాలా దగ్గర మార్గంలో తీసుకొని వెళుతుంది.

అది కృప యొక్క స్పందన. జనులు కృప అంటే వారికి జీవితంలో అన్నింటిని సులభంగా చేసి పెడుతుంది అనుకుంటారు అది నిజం కాదు.


కృప అనేది మీ ఆకాంక్షను సిద్ధంప చేసుకోవడానికి అత్యంత వేగవంతమైన సత్వరమైన సిద్ధిని పొందడానికి అన్నింటిని సమకూరుస్తుంది. అందువలన భయపడవలసినదేమీ ఉండదు.

నిజాయితీ లేకపోవడం వలన భయం కలుగుతుంది. మీరు సౌఖ్యవంత మైన జీవితము మీకు నచ్చిన పరిస్థితులు మొదలైనవి కావాలనుకుంటే, షరతులు, ఆంక్షలు పెడుతుంటే అప్పుడు మీరు భయపడాలి. కానీ సాధనలో దానికి ఏమాత్రం పాత్ర లేదు.

CWM 15:180 — *శ్రీమాత*

అనువాదం : డా॥ ఆర్. సరోజా ప్రసాద్





ఒకనాడు

మరికొంచెం

ఒకనాడు-
చితికినదంతా చితిలో కలిసినవాడు
మొగ్గలు విరులై విరబూసిననాడు
ఓ చిన్నిబాట, బృహత్తర లక్ష్యం
లేత స్పర్శ, దిగివచ్చెను దివ్యధామం

వేవేల శిఖరాలను దాటుతూ వెళ్ళాను,
ఆఖరు అద్భుత నగాన్ని కళ్లారా చూశాను
మునుపెవరూ తాకని మహా పర్వతం
అడుగేస్తే ఆకాశం, అంతులేని దైవం.

CWSA 2:542 - *శ్రీ అరవిందులు*

విజ్ఞానశాస్త్ర వీక్షణం

కలల సీమలో కనిపించిందొక చక్కని ప్రపంచం,
అందున దక్షత కోసం ప్రాకులాడే దేవతాత్రయం.
మొదటిది నియమం - కత్తి లాంటి వీక్షణం, కఠినమైన తిరస్కారం,
పరిమితులెన్నున్నా అలియని అతివిశ్వాసం, ఆరని శౌర్యం.
ఇక రెండవ దానికి వుంది కొండంత ఉత్సాహం,
గుండెల్లో ఆరని జ్యోతి. ఆమె కన్నుల చుట్టూ క్రీనీడ
నడకలో కరిగిపోతోంది. రగిలే ఆమె చూపులు
ఆత్మను దహిస్తుంటే, ఆమె తీరైన భావనలు
మనసును పోషిస్తున్నా, గుండెను ఎండగట్టుతున్నాయి.
ఒక దాని పేరు విజ్ఞానం,
రెండవ దాని పేరు మతం.
దిగివచ్చిందొక మూడవ దేవత
అలౌకికంగా, అగోచరంగా, అవిస్పష్టంగా,
ఈ లోకంలో స్థానం లేనట్టు,
లోకంపై పట్టు దొరకనట్టు,
దాని ఆత్మతేజంలో ఏకాంతంగా నిలిచింది.
విర్రవీగే వేలుపు విజయాలు వేలకు వేలు,
ఆమె స్తుతిలో తేలాడాయి సమస్త దేశాలు.
మరో దేవతను ఆశ్రయించారు కొందరు,
కొందరు తమోపూర్ణులు, మరి కొందరు ప్రేమరూపులు.
ఇక ఈమె అతిగర్వితే, సింహాసనాసీన. ఆమె వందిమాగధులు
చీకటి చచ్చిపోయిందని, లోకం మారిపోయిందని ఘోషిస్తుంటారు.
ఎన్నో తేటతెల్లమయ్యాయి, ఎంతో తెరిపిపడింది, తెలిసినట్టనిపించింది
మరెంతో మరుగునపడింది, చిమ్మ చీకట్లో మిగిలిపోయింది.
వాళ్లు భూమిపై చిందించిన తేజం,
అత్యద్భుతం, మహోన్నత సంజాతం.
కళ్ల ముందు కదలాడిందొక శతాబ్దపు పురోగమనం,
మానవ పరిశీలనకు తెరుచుకుంది లోకం
తరిగింది సంభ్రమం, తొలగింది ఆశ్చర్యం.
కాంతి, శబ్దాల నియమాలు అయ్యాయి అవగతం.
ఆమె ఆకొన్న చూపులో కాంతి గుట్టు రట్టు,

ఆమె శోధనకు నిలువదు పదార్థపు గడికట్టు.
దూరం దవ్వయ్యింది, సూక్ష్మం స్థూలమయ్యింది,
జటిలంలోని చిక్కు విడింది, విదితమయ్యింది.
పరిశీలిస్తూ, పరిశోధిస్తూ ఘన దేవత నడిచింది.
కరిగిస్తూ, కలియబెడుతూ ఠీవిగా సాగింది.
ఆమెది తారా సంచారం తెలిపింది గ్రహగతుల లాస్యం,
భూకంపాలకు, తుఫానులకు చెప్పింది జోస్యం.
సందేహం అన్నది శూన్యం, అబ్బురపాటుకు లేదిక చోటు.
భూగర్భపు పొరలలో దాగిన పాత నిజాలతో పాటు
రహస్యాలెన్నో ఆమె ముందు రాశులు పోసింది ప్రకృతి
ఉక్కు, ఉరుము పూన్చిన వింత రథాల ఆకృతి
నేలని అలరించింది. ఆకశపు హద్దుని అధిగమించింది,
ఆర్ణవాల అతిశయాన్ని, అట్టహాసాన్ని అణచివేసింది.
ధీరమైన ధీశక్తికి దూరపు భారం తరిగింది.
ఎదురులేని శక్తి ముందుకు దూసుకుపోయింది.
చిట్టచివరికి దాని వేలు దాని వైపే తిరిగింది
అసలెవ్వరు నీవు? ఎందు జనించావు?
మనోరూపాల బట్టి మనసును వెలకట్టజూసింది.
వేషం బట్టి వేషధారిని తెలుసుకోజూసింది.
అలా శ్రమిస్తున్న దేవత నిప్పుడు మరో దేవత ఎదుర్కొంది.
వన్నె తగ్గిన వేల్పును జూసి ఆ దేవత ఇలా అంది:
"భళీ! నీ శ్రమ అంతా చూశాను, విన్నా నీ విజయగాథలని,
అనుకుంటున్నావు నీ ఉనికికి అంతే లేదని.
నీ గర్వం నాకు తెలుసు. మరువబోకు ఓ నేస్తం,
మార్గమధ్యంలో ఒక యక్షుడు ఎదురుచూస్తాడు నీ కోసం.
ఎన్నో ప్రశ్నలకు తెలుసు నీకు సమాధానాలు,
అతడి ప్రశ్న వేస్తుంది నీ కాళ్లకు బంధనాలు.
బదులెరిగిన వాడికి అమరత్వం,
లేకుంటే మరణం నిశ్చయం.
వారి పార్థివ దేహాలు తుత్తునియలై
విసిరేయబడతాయి కాలపు రాదారులపై.
నేల మాళిగలలో అతిగా శ్రమించే నీవు

బతకాలనుకుంటే ఈ సత్యాన్ని తెలుసుకుంటావు.
అప్పుడు విజ్ఞానం నిండు విశ్వాసంతో అంది - "నేనీ మట్టిని,
దేహాన్ని, ధాతువుని, విత్తు నుండి పుట్టిన చెట్టుని.
ప్రాణంగల పదార్థాన్ని, రూపులో సామాన్యం, తీరులో అసమానం.
ఈ కణాలలో దాగి వుంది మానవ జన్మ రహస్యం.
ఆ కణాలే నేను, నేనే మరి ఆ కణ సముదాయం.
అని ఘోషిస్తోంది పదార్థం, విని తరించు ఆ సమాధానం.
షేక్స్పియర్ ఈ కణజాలమే; జీసస్ నేర్పిన భక్తి,
శిలువతో ఇల జయించిన ప్రేమ శక్తి.
సుదూర తారా కాంతి రహస్యం;
అరిభయంకర నెపోలియన్ మానసం.
అనంతతను కాదనే అనంతుడి వైపరీత్యం
మదిలో కలిగించింది చెప్పరాని విస్మయం.
ఆ వైచిత్రి వివరణని కోరింది.
వేదాంతం అంతం కాజొచ్చింది.
అంతలో మూడవ దేవత నా కళ్లు తెరిపించింది.
అప్పుడు భావిభువనాల ఉషోదయం కనిపించింది.
మన పాలిన పగళ్ల కావల భావిరవాలు,
వినిపించాయి రానున్న యుగాల కలస్వనాలు.
క్రమ్ముకుంటున్న కాంతులలో అందొక దేవత
మనిషితో - "నీ నిజ స్వభావం అనంతతత.
మరెన్నో అద్భుతాలు సాధించగలవు,
అనంతాల నడుమ పారాడే అనంతుడవు."
అప్పుడు మన నగాలలో పెల్లుబికిందొక పురాతన నగారా -
"ఓ పరమాద్భుతమా! మరువేషంలోని నేనే నీవు,
ఈ దేహకణాలు నన్ను బంధించలేవు,
కాంతిని వేగంలో అధిగమించాను,
ప్రాయంలో విశ్వాన్నే మించాను.
సమస్త లోకాల్లోను నేను ప్రచండ స్ఫూర్తిని,
పడినా పొరబడినా నేను అమృతమూర్తిని."

CWSA 2:204,205 *అనువాదం : డా॥ వి. శ్రీనివాస చక్రవర్తి*

వెన్నెల వెలుగులో

పరాత్పరుడు జన్మనెత్తడంతో
తాను లేస్తున్నాడిపుడు.
లోకాన్ని వ్యాపించిన విప్లవ ఆవృత్తులన్నీ మందడొకి ఆరంభాలే...
భూ మండలాన్ని వలయ వ్యాపితం చేయ
విసురగా విష్ణుచక్రం విసరబడింది.

పాతది నశించిపోతుంది, కాలం చెల్లిపోతుంది,
తొలగిపోయి, నశ్వరమై, తుడిచిపెట్టుకు పోతుంది;
మారు మ్రోగే ఇనుప పట్టీలు
దూరంగా తొలగిపోతాయి మానవుని విశాల విస్తరణకు దారినిస్తూ.

స్వేచ్ఛ, దైవం, అమృతత్వం; మూడూ ఒక్కటే
తగు నిడివిలో అవి సాక్షాత్కరిస్తాయి,
ప్రేమ, ప్రజ్ఞ, న్యాయం, హర్షోల్లాసం సంపూర్ణ శక్తి కలిసి
ఒక స్వచ్ఛతా ఆనందంలో ఏకమౌతాయి.

ప్రాచీనం ఎదరుచూచిన రోజు ఎట్టకేలకొస్తుంది,
పత్మోస్ దర్శించింది షెల్లీ కలగన్నది,
దర్శనంగా, ఒట్టి ఊహగా పరిగణించింది
హర్షభరిత నగరంగా, స్వర్ణయుగంగా అరుదెంచుతోంది.

ఆ లోహ యుగం ముగిసింది
కేవలం గతించే గతం తాలూకూ
చివరి తీవ్ర సంకోచం దేశాలను కుదుపుతోంది.
అది ముగిసే నాటికి
ఈ భూమి రుగ్మతలు తుడుచుకుపోయి
ఆమె అందమైన నుదుటితో వెల్గొందుతుంది.

ఇది మనిషి పురోగతి
ఇనుప యుగం సిద్ధం చేసే స్వర్ణయుగం
మనం పాపంగా పిలిచేది,
అంతరంగ లోతుల్లో మనిషి విడిచి పుచ్చే పరిత్యజ్యం
తన యాత్రలో చోదకుడు దారి చూపుతాడు

అతడెంతో సంఘర్షణతో, వేదనతో వదిలేస్తాడు తన జాడ్యాన్ని,
ఎందుకంటే అది మరల మరల వెనుదిరిగి వచ్చి అతుకుతుంది.
దుఃఖ జ్వాలలో భీకరంగా దహించుకుపోతేనే
మరింత మాధుర్యాన్ని, శక్తిని పుంజుకొనేందుకు అర్హత పొందుతాడు

అతడు మంచిలోకి పెనురెక్కలతో పైకి లేస్తాడు:
ఇదే అతని తీవ్ర అశాంతికి కారణమయినది,
మృత ప్రాయ వస్తు సమూహంతో
అమృత మయ మొనర్చ దలచి
అతడు అనంతాల నుండీ అరుదెంచినాడు;

వర్ధిల్లే ఆత్మతో శరీరాన్ని నింపేందుకు,
శ్రమనొందే భూమిపైకి విస్తరించు స్వర్గపు హక్కుగా
గ్రహించి, ఆసరగా నిలిచిన అమృత సంకల్పంతో.

CWSA 2:243-244 *అనువాదం : బి.హెచ్.పి. సాయిరాజు*

రూపాంతరం

నా శ్వాస సూక్ష్మంగా గలగలా
ఏరులా ప్రవహిస్తుంది
నా అంతర వ్యక్తులను దివ్య శక్తితో నింపుతుంది
రాక్షస సారాయిలా అపరిమితాన్ని నేను తాగాను
కాలం నా నాటక రచన లేదా శోభాయాత్రా స్వప్నం
ప్రకాశిస్తున్న నా కణాలు ఇప్పుడు ఆహ్లాద భరిత పథకం
నాడీ శాఖలను పరవశింపచేస్తూ మారుస్తున్నాయి
పరమానందమైన దారులన్నీ ముత్తియములు, స్ఫటికములతో
ఆ అజ్ఞాత వ్యక్తి, సర్వోతముని కొరకు
ప్రవహించడానికి
మాంస సహిత నాసికను నేను కాబోను
ప్రకృతికి, దాని మందకొడి నిబంధనలకు బానిసను కాను
సంకుచిత ఇంద్రియములకు నేను చిక్కువడను
పరిధిలేని నా ఆత్మ లెక్కించలేని దృష్టితో విస్తరిస్తుంది.
నా ఆత్మ నా దేహం భగవానుని సంతోష జీవన పరికరం
నా ఆత్మ మరణమెరుగని బృహత్ సూర్యకాంతి.

ఒక వేలుపు కృషి

అగాధం మధ్యలోతులూ, ఎత్తులూ
స్వర్ణ జల వృష్టితో పూరించబడ్డాయి
నీలి గిరుల దిగువన పర్వతశ్రేణిని
వాన విల్లు
ఒక తీరం నుండి మరో తీరానికి రెపరెపలాడిస్తుంది.

ధరిత్రి చాతీలో దివ్యాగ్ని వెలిగింది
మరణ రహితమైన సూర్యుల్ని
ఇక్కడ మండిస్తుంది;
విస్మయాఖాతం నుండి జన్మసీమితిలో
అవతార ఆత్మశక్తి ఉబలాట పడుతుంది.

యథార్థ ఆనంద రాజ్యముల బోలిన జ్వాలలుగా:
క్రిందకు స్వర్ణా రుణ సోపాన మార్గంలో ప్రయాణం
పరలోక మందలి ఉల్లాసవంతులైన పిల్లలు
ఉచ్ఛై స్వరంతో చీకటిని చిదిమేస్తున్నారు.

కొద్దిగానో, ఎక్కువగానో నవజీవితపు
ద్వారాలు రజిత కాంతితో చెక్కబడి ఉన్నాయి
ఆ గొప్ప లోకంలో కాంచనమయమైన
పైకప్పు, రంగురాళ్ళతో పరిచిన నేలలు నగ్నంగాను
కాంతివంతంగాను ఉన్నాయి.

స్వప్నాలను వారి తెల్లని గాలిలో
స్వర్ణ, నీలి ఉడుపుల కోసం వదిలివేస్తాను
అక్కడ భువిపై సరయిన రూపకల్పన చేయడానికి కదులుతారు
నీవే సజీవ సత్యమని!

CWSA 2:534-38 1935-1936

అనువాదం : కిరణ్‌బాబు

ఆసాధ్యం పిలుపు

ఒక దైవం మనలను ఇంకా సాధించవలసిన లక్ష్యాలకై కదిలించును.
మన విధి విస్తృత దొంతరలలో నిదురించుచున్నవి అవి,
ఈ లోకం నిశ్శబ్ద రెక్కల మాటున దాచబడెను
వాటి వాటి నాజూకు సంక్లిష్ట అసాధ్యతకు ఆశ్రయమిచ్చెను;

కానీ వణుకుతూ తెరుచుకుంటున్న సాధారణ ద్వారాల శబ్దం దాటి;
అపరిమిత అద్భుతాలెన్నో మన స్వప్నాలతో నిండిన కనులలోకి చూచుచున్నవి;
గొప్పవిధి, గంభీర దేవతలు మనయందున్నారు;
స్వర్గలోకపు వదనాలు, చేతులూ మనకు చేరువయ్యాయి.

ఊర్ధ్వమందు ప్రకాశిస్తున్నదేదో లోపలి అంధకారంలో వేచి ఉన్నది;
ఇంకా పొందవలసిన దివ్యానందం భవిష్యంలో అది మన జన్మహక్కు
మన ఆత్మల ప్రస్ఫుటం కాని సౌందర్యం అమోఘంగా ప్రకాశించును.

వారసులమై ఉన్నాం అనంతమైన విశాలతకు మనం
అసాధ్యమన్నది ఒక ముసుగు మృత్యువు అమృతత్వానికి మార్గం.

*

పరిణామము - 2

మనము చూడని తీర్పులో ఇంకా నెరవేరవలసినవి మిగిలే ఉన్నాయి;
మన మనసుకు అతీతమైన మనసు మన అవగాహనను కోరుచున్నది
మన ఊహలకందని పరిపూర్ణ సామరస్యముతో నిండిన జీవితము వేచి ఉన్నది నిగూఢముగా,
ఇంకా జన్మించని మానవుల కొరకై

నిర్జీవ భువి యొక్క అపరిపక్వ ఆరంభాలు,
చెట్లు మొక్కల అనాలోచితమైన కదలికలు మన ఆలోచనలు నిర్మించాయి
ఎటువంటి ఆలోచన అంటే దివ్యసమమైనటువంటి జన్మకొరకై
మన మర్త్యత్వం యొక్క మూసను విశాల పరిచినట్లు
మానవ సంకల్పం కానీ శక్తి కానీ సాధించలేంత ఘనత

శాశ్వతత్వంలో స్థితి పొందిన జ్ఞానం
మన సంఘర్షణ, బాధలకు అతీతం ఆనందం
ఇవన్నీ మన భవిష్యత్తులో అందుకోబోయే అత్యున్నత శిఖరాలు

రాతిబండ నుండి మనోతలానికి ఎదిగిన మానవా
ఇప్పుడు ఇంకా స్వంతమవని అద్భుతమగు ఉన్నత శిఖరాలను ఎదురుకో

CWSA 2:596-96 *అనువాదం : ఎ.జె. విక్రమ్*

పులి జింక

హరిత హృదయారణ్యంలో ఆనందంగా
గంతులు వేస్తూ, మెరుస్తున్న మీనాలతో
దివ్యదేహాకృతితో, సుతిమెత్తని పాద స్పర్శతో సంచరిస్తున్న ఆ జీవి
మరణానికి చేరువవుతున్నదా?
వీస్తున్న పిల్లగాలులు కొమ్మ రెమ్మల
ఆకుల సందుల్లో నుండి భయంతో విలపిస్తుండగా
అక్కడంతా అద్భుత కాంతిపుంజాలు నిశ్శబ్దంగా వ్యాపిస్తున్నాయి.
అక్కడొ హరిణాన్ని కబళించడానికి సిద్ధమై భారంగా శ్వాసిస్తూ సిద్ధమైంది.
ఆ మూగ జీవి ఏమాత్రం మరణ భయాన్ని
ఎరుగక కాసారంలో నీటిని
ఆఖరి శ్వాస పీల్చే వరకు ఆనందంగా త్రాగుతోంది.
ఏమాత్రం సందేహం లేకుండా ఆ సరోవర జలంలో తన నీడను దర్శిస్తోంది.
అంతే అకస్మాత్తుగా ఆ దేహం తునాతనకలై అక్కడికక్కడే ఆత్మను వదిలిపెట్టింది.
నిశ్శంకగా, నిర్భీతిగా, ప్రశాంతంగా
విహరించే ఆ వనం ప్రకృతి క్రూరత్వానికి బలయింది.
కానీ ! ఒకరోజు రావచ్చు!
ఆరోజు పులి వేటాడలేదు! ఆ క్రూర జంతువులన్నీ ఖండంలోనే

అంతర్ధానమైపోవచ్చు.
అప్పుడు హరిణాలన్నీ హర్షం వ్యక్తం చేస్తూ
హాయిగా కాసారాల్లోని జలాన్ని, చెట్ల నీడలను దర్శిస్తూ త్రాగవచ్చు!
పరాక్రమించి భయపెట్టే జాతి అంతరిస్తుంది.
సర్వ బలహీన జాతి క్రూర క్రీడలా అనంతరం
స్వేచ్ఛగా వ్యవహరించవచ్చు.
CWSA 2:583

ఓ అధివాస్తవిక శాస్త్రస్వప్నం

కలకన్నాడు
అవును కలకన్నాడు
ఓ గ్రంథి హ్యామ్లెట్ గ్రంథం వ్రాసినట్టు;
ఓ మత్స్యకన్య దివ్యజలాన్ని సేవించి అమరత్వం పొందినట్టు
హార్మోన్లన్నీ హడావిడిగా సమావేశమై ఇలియడ్, ఒడిస్సీ గ్రంథాలను రచించినట్టు
ఒకానొక థైరాయిడ్ గ్రంధి నగ్నంగా
ఓ బోధి వృక్షం క్రింద నిలబడి
దివ్య పరలోక కాంతులను వీక్షిస్తున్నట్టు
ఒక దివ్యాత్మ అష్టదళ చక్రంలో పరిభ్రమిస్తూ
గతితప్పి ఉదరం, మస్తిష్కాజ్ఞచే యూరపును జయించినట్లు
హెలెన్ గతి తప్పి క్రిందపడి స్వర్గంచేరి
అధివాస్తవిక లోకంలో విహరించినట్టు
ఓ శాస్త్రవేత్త పరమాణువులతో
ఆటలాడుకుంటూ భస్మీపటలమై
విశ్వకర్త ముందు మోకరిల్లినట్టు
ఓ భీషణ నాదం....
CWSA 2:614 *అనువాదం : డాక్టర్ టేకుమళ్ళ వెంకటప్పయ్య*

దాచిన ప్రణాళిక

సుదీర్ఘ రాత్రి అయినా
అది వ్యక్తి ముసుగు చిరు గర్వం
నేను కల కనను

మన జీవన పథకంలో
దేవుడు బహిర్గత పరిచే
అంశాలు అన్నీ కలిపి
ప్రకృతి వైశ్యక కార్యానికి అంతిమ ఫలం.
ఆమె కుక్షిలో ఒక మహా సన్నిధి పనిచేస్తుంది;
సుదీర్ఘమైన తన పర్వానికి సిద్ధపడుతుంది
చివరికి రాతిలో మృగంలో దేవత నక్కి చూస్తుంది
ఒక శాశ్వత ప్రభామయ మూర్తిమత్వం
మనసు పసిగట్టిన పరిధి నుండి విస్ఫోటిస్తుంది.
భవిష్యత్తు ఎరిగిన హృదయానికి ఒక సాక్ష్యాన్నిస్తుంది
జడప్రాయ బంధ ప్రకృతిలోనూ
ఏనాటి నుంచో కప్పబడిన ప్రతి నిశ్చేతన అంశంలోనూ
అభివ్యక్తను కాగలదు.
రహస్య అమోఘ ప్రణాళికను నెరవేర్చును
విశ్వవ్యాప్తంగా మనిషిలోని అమృతాత్మ.

CWSA 2:602 *అనువాదం : శ్రీ రామదాసు అమరనాథ్*

విజ్ఞానం - అజ్ఞాతం

కనిపించక మార్మిక లోతుల్లో ఎదుగుతున్నవి ప్రకృతి మూలాలు
ఈ కనిపించే ప్రతిదీ అదృశ్యంలో దాచుకొంది తన వేరును
అదృశ్యంగా కాపాడుతున్నది అనుకొన్నది కూడా
మరింకా గహన అదృశ్యంలో, అజ్ఞాతంలోనే ఉన్నది.

మనిషి విజ్ఞానశాస్త్రం నిస్తేజమైన ఒట్టి ఊహలనే కట్టుకుపోతుంది
జీవిస్తున్న దానంతటిని సూత్రాలతో ఒంపుత్రిప్పుతుంది;
ఆత్మలేని, ఒకమెదడు ఒక చెయ్యిది,
మన తదేక బాహ్య దృష్టి వెనుక చొచ్చుకొచ్చే నేత్రం ఉన్నది.

చూచే ఈ వస్తుజాలమంతా వాటి రూపంలో అవి లేవు;
మనం వెంబడించి, చేజిక్కించుకొన్న
ఈ ఆకారం వివిధ శక్తుల ముద్ద
వాటి ఆంతరిక విధానాలు తప్పించుకుపోతున్నాయి
ఒక విశాల చేతనలో మన ప్రమాణాల కావలిగా
దారిలేని నీరవ, అనంత, అజ్ఞాతాలను అనుసరిస్తూ పో.
అగాధాలను ఇప్పుడూ చేరగలవు.

*

మహా ప్రణాళిక

ఆమె హర్షోల్లాసానికి, వేదనకు, ఆమె సమ్మోనత్వానికి
ఆమె దరహాస వాయిద్య సంగీతానికి
మరులు గొలుపు జీవితం పిలిచే పిలుపుకు నేనిక చిక్కను
సద్దుమణిగె వేణుగాన లీలామయ క్షణాలు
రూపం, వర్ణం, క్లుప్త ఆనంద పారవశ్యం
నే వింటా నా విశాల ఆత్మ ఏకాంతంలో
ఈనశ్వర అధరాలు మెదలని నిశ్శబ్ద వేళ
ఆ స్వరం పలుకుతుంది
విశుద్ధ వస్తు విషయాల వింతను వెతుకుతా
చిరంతన నిశ్శబ్దం నుండీ పుడతా
మనిషి అంతరాత్మలో అవసరమొకటున్నది
ఈ ఉపరితల కాంతులు తీర్చలేవు దానిని
మనస్సు, జీవితం వాటి విభవం వాదోపవాదాలు
విస్తృత విషయానికి ఆలస్యపు అవతారికలు
పరమ దివ్య ప్రణాళికకు ఒక తికమక రేఖాకృతి
పరాత్పర చారిత్రక కావ్యానికి ఒక ముందుమాట

CWSA 2:606 *అనువాదం : సి హెచ్. హర్షవర్ధన్*

స్వర్ణకాంతి

మీ సువర్ణ తేజస్సు నా మేధో వలయంలోప్రవేశించిది.
ఆ కాంతి పరిష్వంగంలో నా మనోకుహరంలోని వెలసిపోయిన గదులు
జ్ఞానతేజాలంకృత అతీంద్రియోపరితలానికి ప్రతిగా విరిసినవి,
ఓ ప్రశాంత ఓజస్తేజోలంకరణం, ఓ ఓంకారజ్వాల
నా శిరస్సునుండి స్వరపేటికపై జాలువారింది మీ సువర్ణ తేజస్సు.
నా వాక్కంతా ఇప్పుడు వేద పదబంధ స్వరకల్పన
ఆ నిశ్చల చింతన, నా ఏకైక స్వరమా! నీ స్తోత్రమాలిక;
నా మాటలు సురాపానమత్తచిత్తములు, దైవోన్మత్తములు.
మీ అమృతత్వంలో నా మనుగడను మర్థించి
మీ స్వర్ణకాంతి ప్రవంతులు నా హృదయంలో సంగమించాయి.
ఇప్పుడు నా దేహం ఓ దేవాలయంగా ఎదిగింది, మీ ఆవాసంగా మారింది
దాని భావోద్వేగములన్నీ ఏకాగ్రతతో మీ వైపే మరలి ఉన్నవి.
ఇప్పుడు మీ స్వర్ణ కాంతులు నా పాదాలచెంత పారాడుచున్నవి
నే నున్న ధరిత్రి ఇపుడు మీ ఖేలావని, మీ పీఠం.

CWSA 2:605 — అనువాదం : ఎ. ఆదిశేషయ్య



భాగం - 2

(సావిత్రి నుండి)

ఒకరకంగాదు, అనేక రకాలుగా సావిత్రి భవిష్యత్తుకు సంబంధించిన కావ్యం. అన్నిటికంటె ముఖ్యంగా అది భవిష్యత్తును గురించిన శ్రీ అరవిందుల దర్శనానికి రూపం, లేక విశదీకరణ. మనిషికి ముందు వచ్చినదంతా, ఇంకా రావలసిన వున్న మరెంతో, దానంతట్నీ సంపూర్ణంగా సమస్త సారతత్వాన్ని అతి సుందరంగా వెల్లడించబడింది. ఆ తరువాత అశ్వపతి, సావిత్రి అనుభవాల ద్వారా మానవజాతి తప్పక అనుసరించవలసిన భవిష్యత్పథాన్ని మనకది చూపిస్తుంది. మానవజాతి ఏ అనుభవాల ద్వారా ముందుకు సాగాలో, కాలక్రమంలో, ఒక దివ్యతరమైన ఆధారం మీద అతని నూతన జీవితం నూతనంగా ప్రతిష్టితంగావాలో ఆ అనుభవాలనది మనకు చూపిస్తుంది. చివరగా, భవిష్యతు వైపు అధికాధికంగా అది పురోగమస్తున్న కొలదీ మానవజాతి అర్ధం చేసుకొనే కావ్యం అది. మేము ఎంపికచేసిన వాటిల్లో వేటియందు రాబోవు భవిష్యత్తును గురించి వెల్లడి చేయబడిందో, ఆ పాఠ్యాంశాలనే ఎన్నుకున్నాం. తిరిగి రెండింతలు చేయబడిన ధైర్యంతో, మనిషి అనివార్య భవిష్యత్తు వైపు మనం నడిచేందుకు వీలుగా, ఆశ, ఉత్సాహం, సంతోషాలతో నిండిపోవడమే దానిని చదువడమంటే.

భగవంతుడు తప్పక యెదుగుతాడు

ఆవిధంగా ముసుగు ధరించిన అతీతుడు తన గద్దెనెక్కు
భువి యెదను చంపనొక్కుతూ అంధకారము ప్రగాఢమైనపుడు
మనిషి దైహిక మనస్సొకటే దీపమైనపుడు
తన యింటిలోనికి అగుపించకుండా అడుగిడు వానివోలె
నిశియందు దొంగలా రహస్యముగ వదచు
సరిగ వినిపించని గొంతు పలుకు, అంతరాత్మ విధేయమగు
జీవితపు మూసుకుపోయిన ద్వారాలకు ఒక సోయగం, మాధుర్యము తెరచు
నిరోధించు ప్రపంచమును ఒక సౌందర్యము జయించు
ప్రకృతిని ఆశ్చర్యపరచు రీతిలో సత్య-వెలుగు బంధించు
భగవంతుని ఒక రహస్య పద్ధతి ఆనందించ హృదయంపై వత్తిడి పెట్టు

అనూహ్యముగ భువి యెదుగు దివ్యముగ
పదార్థమందు అధ్యాత్మ మెరుపు వెలిగించబడు,
దేహదేహమునందు పవిత్ర జన్మ రగిలించబడు
తారకల బృందగానమునకు నిశిమేల్కాంచు
పగళ్ళు ఒక సుఖకర తీర్థయాత్ర యగు
మన సంకల్పము శాశ్వతుని శక్తి క్రియాశక్తియగు
భావము ఆధ్యాత్మిక సూర్యుని కిరణమ్ములగు
ఎవరూ ఇంకను గ్రహించని దానిని కొద్దిమంది చూతురు;
పండితులు, పలికిన, నిదురించినపుడు గూడ భగవంతుడెరుగు
ఏలన సంభవించు దాని ఘడియ వచ్చు వరకు, మనిషి గ్రహించలేడు
కార్యం పూర్తి యగునంత వరకు నమ్మకం కలుగదు.

అనాచ్ఛాదిత దైవాన్ని ప్రపంచం తప్పక అభివ్యక్తీకరించు

అతడు, జీవితము, మరణము, మరో జీవితం ద్వారా తేలియాడుతూ సాగు,
మెలుకువ నిద్రాస్థితుల ద్వారా ఆతడు పయనించు
తన రహస్య స్థావరమునుండి ఆతనిపై ఒక శక్తివున్నది
తన స్వకీయ సృష్టి విధికాతనినది బంధించి ఉంచు
బలీయ బాటసారి విశ్రమించలేడు
మార్మిక యానమ్ము ఆగదెన్నడూ
మనిషి అంతరాత్మ నుండి అవిద్యా మసక తొలగి
ఆతని అంధకారాన్ని భగవంతుని ఉదయాలు అధిగమించు వరకు
ప్రకృతి ఉన్నంత వరకు, ఆతడును ఉండు
ఏలను, ఆతడు, ఆమె ఒక్కరే
ఆతడు నిదురించునపుడు సైతం, ఆమెనతడు తన యెదపై నుంచుకొను;
ఆమెను విడచు వారెవరైనా, ఆతడు విడచిపోలేడు
అజ్ఞేయ మందు ఆమె లేకుండ విశ్రమించలేడు
తెలుసుకొనవలసిన సత్యమొకటున్నది చేయనొక కార్యమున్నది;
ఆమె క్రీడ నిజము, ఆతడొక మర్మాన్ని సాఫల్యమొనరించు;
మాతృమూర్తి ప్రగాఢ ప్రపంచ చపలతయందు ఒక పథకముంది;
ఆమె బృహత్తర, లక్ష్య రహిత ఆటయందు ఒక ప్రయోజనముంది.

ప్రాణప్రథ ముషోదయము నుండి దీనినే ఆమె లక్షించినది
ఈ నిరంతరేచ్ఛను, తన క్రీడచే ఆమె కప్పివేసె
నిర్వ్యక్తిక శూన్యమందు ఒక వ్యక్తిని ఆమంత్రించ
సత్య-వెలుగుతో భువి బ్రహ్మాండ, సమాధి వ్రేళ్ళను తాడించు
నిశ్చేతన లోతులలో ఒక మూగ ఆత్మను మేల్కొలుపు
తన బ్రహ్మాండ నిద్రనుండి కోల్పోయిన దివ్యశక్తిని లేపు
కాలాతీత మహాశక్తి కనులు, కాలం నుండి చూడదగునట్లు
అనాచ్ఛాదిత దైవాన్ని ప్రపంచ మభి వ్యక్తము చేయు
దీనికోసమె ఆమె తన ధవళ అనంతతను విడిచె
అధ్యాత్మపై పలకరింపు భారాన్నామె మోపె
ఆ భగవత్తత్వపు బీజం, మనస్సులేని మహాకాశంలో పుష్పించు

సావిత్రి, పుట : 72-73

రేపటి మానవాతీత జాతి

ఆవిధంగా ఆతడు తన విశాలాత్మలోని కెదుగగా
ఆతని కదలికలను మానవజాతి తక్కువ తక్కువగా నిర్దేశించె;
ఒక మహనీయ జీవి, ఒక మహనీయ ప్రపంచాన్ని దర్శించె
మనసు వాయు సంచారాన్ని అడ్డుకొను హేతుబుద్ధి రక్షణ రేఖలను
అనంతంలో అంతరాత్మ వేయు మునకను
జ్ఞానానికై ఒక భయరహిత ఇచ్ఛ రద్దు చేయ సాహసించె
ఆతని ప్రథమ అడుగులు సైతం మన చిన్ని భువి-యెల్లలను భంగించె
ఒక విశాంతర స్వేచ్ఛామయ వాతావరణమందు తారాడె
రూపము మూర్ఛవేయు ప్రబల శక్తిచే ఆదుకొను హస్తములతో
ఒక అతిబలుని విల్లులా తేలికగా చేకొని
ఒక రహస్య, మూతబడిన గుహలో, నిద్రమత్తులో జోగువిడువబడె
మనషిలోనే ఉపయోగించబడకుండ నిదురించు శక్తులు.
మహిమనొక మామూలు చర్యగా నతడు చేయు
దివ్య కర్మంనొక సర్వసామాన్య అంశముగ మలుపు ద్రిప్పె
ఈ ఉచ్ఛస్థితియందు అద్భుతముగ సహజమయ్యె
మర్త్య హృదయాల కకావికలు చేయు ప్రయత్నాలు

ఎంతో సునాయాసంగా, రాచఠీవితో కొసాగించబడె
ప్రకృతి దైనందిన ఇచ్ఛకాలక్ష్యాలు ఎంతో ఉన్నతమైనవి;
ఆధ్యాత్మ కానుకలు గుంపులుగా ఆతని వద్ద కరుదెంచె;
అవి అతని జీవన సరళి ఆతని ప్రత్యేక హక్కు

సావిత్రి, పుట : 26-27

సర్వశక్తివంతుని జ్వాలామయ వైతాళికులు

(భవిష్యత్తు బిడ్డలు)

గతాన్నొక శివతాండవం బదాబదలు చేసింది
లోకాలు పతనమయ్యేటట్లు సాగిన గర్జన ఒకటి ఉండె
అగ్ని, మృత్యుఘోష భువిని మించిపోయె
ఆతని ఆకలి రూపొందించిన ప్రపంచాన్ని ఛేదించ ఉరుకులెట్టుచూ
విధ్వంసపు రెక్కల ఒక ధ్వని ప్రతిధ్వనుల రొదకలదు
నా చెవుల యందు రాక్షస రణన్నినాదంబు కలదు
కవచధారియైన నిశిని భయం, పుకారు వణికించి వేసె.
సర్వశక్తివంతుని వైతాళికులను చూచాను
జీవితం వైపు దిరుగు స్వర్గీయపుటంచు మీదుగా
పుట్టుకయనెడి తృణమణి వర్ణను మెట్లమీద గుంపులుగా
దివ్య నానాత్వపు పురోగాములుగా
ఉదయ తార మార్గాల నుండి వెలువడి
మన మర్త్య జీవన చిన్ని గదిలోనికి వచ్చారు
ఒక యుగపు సంధ్యను వారు దాటడం చూచాను
ఒక అద్భుత ఉషోదయపు సూర్యనేత్రాల బిడ్డలు
విశాల, ప్రశాంత లలాటాలు గల మహనీయ సృష్టికర్తలు
ప్రపంచ బ్రహ్మాండ అవరోధాల భంగించు వారు
ఆమె సంకల్ప భవిష్యత్తు చేరువారితో పోరాడు మల్లయోధులు
దేవతల గనులలోని శ్రామికులు
సమాచార సంబంధ రహితమగు దాని సందేశ వాహకులు
అమృతత్వపు వాస్తు శిల్పులు
పతనమైన మానవ పరిధిలోని వారరుదెంచిరి

ఇంకను అమృతత్వపు మోములు గలవారు
ఇంకను భగవానుని భావాలతో భాసించే స్వరముల వారు
ఆధ్యాత్మ వెలుగుతో దేహములు అందముగ చేయబడిన వారు
సంతసానికి సంబంధించిన సురాపాన దేవత కలశాన్ని దెచ్చుచు
ఒక దివ్యతర మానవుని నేత్రాల దరిచేరుచు
అంతరాత్మ సంబంధ, అగ్రాహ్యాగా నమ్మను పెదవులు గానం చేస్తూండగా
మహాకాల వరండాలలో ప్రతిధ్వనించు పద ధ్వనులచే
ప్రజ్ఞ, మాధుర్యం, బలం, ఆనందాల ఉన్నత పౌరహితులు,
సౌందర్యపు సూర్యతేజో మార్గాల ఆవిష్కర్తలు
ద్యివప్రేమ హసించు భగభగమను వరదలలో ఈదులాడు
ప్రహర్షపు బంగరు ద్వారాల లోపలే నర్తించువారు
వ్యధాభరితమౌ పృధ్విని వారి నడక మార్చివేయు
ప్రకృతి మోముపై వెలుగునది సమర్థించు.

సావిత్రి, పుట : 343-44 *అనువాదం : కె.వి. రావు*

మానవ హృదయంలో అధిదేవత ఎదుగును

“శక్తుల చేతను, విధిచేతను చోదితమగు ఓ భూతల వాసులారా,
అనంత భువన సంచయములందు, అతి చిన్న సాహసికులారా,
ఔన్నత్యము చేరుకోని మర్త్య సంతతిగా బందీలైనవారా,
ఎంతకాలము మీ మానసిక ఆవృత్తము లందు తిరుగాడు చుందురు?
లేశమాత్రపు వ్యక్తిత్వముల చుట్టు, అల్పవస్తు సంచయము చుట్టు, పరిభ్రమింతురు?
పరిణామరహితముగా, స్వల్పమాత్రపు జీవనము గడుపుట మీ ధ్యేయము కానేరదు.
వ్యర్థ పునరావృత్తము మీ జీవన లక్ష్యము కాజాలదు.
అనిమేష తత్వము నుండి మీరుద్భవించితిరి.
మీ చేతలు వేగవంతమగు సత్యపు ఆవిష్కరణలు కాగలవు.
మీ జీవనము, ఎదుగుతున్న దేవతల మారుతున్న ఆవాసములు కాగలవు.
మీయందు ఒకద్రష్ట గలడు, ఒక స్రష్ట గలడు.
మీ దినము లద్భుతములు, మహిమాన్వితములు.
ప్రకృతి కణములందు, పరమేష్ఠి శక్తులిమిడి యున్నవి.
మీ గమ్యమత్యంత ఉన్నతమైనది. మీ ముందది వేచియున్నది.

భౌతిక జీవనము సాగించు మర్త్యుడు, తన సంకల్ప బలముచే,
తన చేతలను, ఆధిభౌతిక ప్రణాళికలో ఇమడ్చగలడు.
ప్రస్తుతమాతడు, అజ్ఞానము నిండిన కన్నులతో జగతిని పరికించెను.
నిశ్చేతన నిండిన నిశిరాత్రిలో మేల్కొలుపబడి, ఇంకా మగత నిద్రలో
నున్నవాడు.
ప్రతీకల వంక పరికించుచున్నవాడు, సత్యమును విస్మరించినవాడు.
అయినను, ఆవృత్తముల భాగములను, అనిమేషుల దృష్టులతో నింపగలవాడు.
దైవత్వము మీ హృదయముల నుండి ఎదిగి వచ్చుగాక.
చైతన్యపు మలయమారుతములు సోకి, మీరు జాగృతులగుదురు గాక
మర్త్యమానసపు గోడలు కూలిపోగలవు. మీకది ద్యోతకము కాగలదు.
జీవన హృదిని, మూగవోయిన స్థితియందు వదలి వెళ్ళిన సందేశము మరల
వినిపించగలదు.
ఆదిత్యుని చూడగల చక్షువులతో, ప్రకృతిని దర్శించగలరు.
ఆది మధ్యాంత రహిత ద్వారముల చెంత మీ శంఖముల పూరించగలరు.
మీరు, భూతలపు మహాపరిణామమునకు, వైతాళికులు
మీరు వరగ్రహీతలు
విపత్కరమగు, ఆత్మచైతన్యపు శూన్యములను సునాయాసముగా దాటగలరు.
జాగృతి యందున్న జగన్మాతను మీరు దర్శించగలరు. స్పర్శించగలరు.
ఈ పాంచభౌతిక శరీరమందే, సర్వస్రష్టను సంధించగలరు.
సహస్రాధిక శరీరములందు, ఐక్యజీవనమును సాధించగలరు.
భూతలము, స్వర్గమునకు, తెరమరుగుననున్న సరిహద్దగును.
నీవు, నీవు సాగించు జీవనముచే, మరుగుపరచబడిన మహాజ్యోతివి.

సావిత్రి, పుట : 370



ఒక బీజం నాటబడును మృత్యువు భయంకర కాలంలో
స్వర్గపు శాఖ మానుష మృత్తికలో నాటబడును;
ప్రకృతి తన మర్త్య సోపానాన్ని అంగవేసి దాటగలదు;
మారని సంకల్పంతో విధి మార్చబడును.

*సావిత్రి పుట : **546***

అజ్ఞాత శక్తులు బయటకు వచ్చును

తాను నిర్మించిన జగతిలోనికి, దైవము దిగి రాజాలడనుచుంటివా?
అర్థరహిత శూన్యముల నుండి, సృష్టి ఆవిర్భవించినచో,
దేహరహిత బలము నుండి పదార్థము జాతమైనచో,
జీవనమచేతనమగు తరువు పై ప్రాకి,
దాని హరిత సంతోషములు, పచ్చలై, పచ్చని ఆకులై పరిఢవిల్లినచో,
దాని దరహాస సౌందర్యములు విరులై పుష్పించినచో,
బుద్ధి పరిజ్ఞానము, కందరములందు, నాడీమండలము నందు,
కణము నందు మేల్కాంచినచో,
మేధయందు నాడులను పరివేష్టించిన నల్లని పదార్థమును తలపులాక్రమించినచో,
దేహము నుండి తొంగిచూచు ఆత్మ, తన నిగూఢ స్థలమును విడిచిపెట్టిన ఎడల,
నామరహితమగు జ్యోతి, మర్త్యులపై ప్రసరించకుండునా?
నిద్రాణమై యున్న ప్రకృతి నుండి, అవ్యక్త శక్తులు ఎదగకుండునా?
ఇప్పటికే అజ్ఞానపు నిశి వైభవమున, మానస చంద్రుడుదయించెను. అందు,
జాజ్వల్యమానమగు సత్యము, తారకలవోలె, మినుకు మినుకుమన్న సంకేతములు పెల్లుబికినవి.
ఇప్పటికే మరణరహిత ప్రియతముని స్పర్శ, మా కనుభవైక వేద్యమగుచున్నది.
మందిర ద్వారము, కొలదిగానైన, తెరచియున్న ఎడల,
దైవము గుప్తముగా లోనికి ప్రవేశించకుండునే?
లేక నిద్రాణమైయున్న ఆత్మను ఆయన ముద్దాడకుండునే?
ఇప్పటికే, దైవము నా చెంత నుండెను. సత్యము చేరువయ్యెను.
అజ్ఞానియగు నాస్తికుడు దైవము నెరుగజాలడు. అంతమాత్రమున,
ఋషులు, కాంతుల నిరాకరింతురా? మునులు, ఆత్మ ఉనికిని త్రోసిపుచ్చుదురా?

సావిత్రి, పుట : 648-49

మృత్యువు రాత్రి అంతము

బృహత్తర శూన్యముల నుండి, మహిమాన్వితమగు ఈ సృష్టి ఆవిర్భవించినది.
దీని కొరకే, చైతన్యము, అగాధములకు దిగివచ్చినది.
పదార్థపు అవ్యక్త బలిమికి, తన శక్తుల ప్రసాదించినది, మేల్కొలిపినది.
నిశీథములందు, మందిర కాంతులను ప్రజ్వలింప జేసినది.

మృత్యువు ఏలు సీమలందు, అమరత్వమునకు దారులేర్పడినవి.
ఆధిభౌతిక పరిణామము, మందగతిని, పనిచేసినది.
మన జగతి సమస్తము, మట్టినుండి మొదలైనది. ఆకసమందంతమైనది.
ప్రేమ, చతుష్పాదముల ప్రచోదనమై యుండినది.
అంతట, అది పరవశించిన హృదియందు, మధురమగు మత్తైనది.
సంతస-మానసమందు, ఎడతెగని బంధమైనది. సాహచర్యమైనది.
అదియే, ఆధ్యాత్మిక జిజ్ఞాసల కనువైన ఆవాసమైనది.
ఏకాంతమగు ఆత్మ పరమేష్ఠికై ఆర్తి చెందినది.
మనుజుని ప్రేమించిన హృది, పరిమేష్ఠి ప్రేమతో ఉప్పొంగినది. పరవశించినది.
దేహమాతని ఆవాసమైనది. మందిరమైనది.
అంతట, మన ఉనికి, అద్వైతమగును. సంరక్షితమగును.
అన్నియు ఏకత్వము ననుభవించును. దేవునిలో ఒదిగిపోవును
ప్రేమికుడు, మూసియుంచబడిన, తన ఆవాసపు ద్వారము నుండి,
జగతి సమస్తమును, తన ఎదలోని కిముడ్చుకొనును.
నిశీథినియొక్క, మృత్యువు యొక్క వ్యాపారము లంతట అరికట్టబడును.
ఏకత్వము జయించినది. సంక్షోభము వీగిపోయినది.
అన్నియు విదితమైనవి. అన్నియు అనురాగముచే బంధితమైనవి.
అజ్ఞానము వైపు, వెతల వైపు, ఇప్పుడెవరు మరలగలరు?

సావిత్రి, పుట : 632-33

విభజన ఆగిపోవును

అచట ఆధ్యాత్మిక సంకల్పము యొక్క సుషుప్తియందు,
ఆతనికి ప్రకృతి పరిణామమునకు గుప్తమైన తాళపు చెవి కనిపించినది.
ఒక కాంతి ఆతనికి తోడైనది. కనిపించని దివ్యహస్తమొకటి
ఆతనిని స్పృశించినది. బాధలు మటుమాయమైనవి
నిశ్చలానంద సంరంభోహల మొదలయినది
అందు దివ్య ఆలింగనపు మాధుర్యమున్నది.
నిశీథిని ఆతనికి ఆది మధ్యాంతరహితుడి ముసుగై కనిపించినది
జీవన ఆరామమందు, మృత్యువు ఒక గదియని తెలియవచ్చినది
వినాశమందాతనికి, సృష్టియొక్క వేగము కనిపించినది.

నష్టము ఆధిభౌతిక లాభమునకు చెల్లించు మూల్యమైనది
నరకము స్వర్గ ద్వారములకు దగ్గరి దారియైనది.
అంతట మాయయొక్క అద్భుత కర్మాగారమందు,
అధశ్చేతనపు అచ్చు-యంత్రముల శాలలందు,
నిర్జించబడిన ప్రథమ నిశీథిని యొక్క పుటలు చించి వేయబడినవి
అజ్ఞానపు పునరావృత్తములు ఛేదించబడినవి
జీవకళ ఉట్టిపడుతున్న ప్రకృతి, ఆధిభౌతిక ఊపిరులను పీల్చుకొన్నది.
యాంత్రికమగు తన నియమావళిని త్రోసిరాజన్నది
బందిగా నుండిన ఆత్మతో కుదుర్చుకున్న అంగీకార పత్రము రద్దైనది.
అసత్యము, సత్యమునకు తాను హింసలకు గురిచేసిన దాని స్వరూపమును
తిరిగి ఇచ్చినది.

విషాద జనకములగు చట్టములు చెల్లనివైనవి
కాంతులీను గుణవిశేషములు వాటి స్థానమున వచ్చి చేరినవి
కుశలుడైన వ్రాయసగాడు కనిపించని తన వ్రేళ్ళతో,
అతి సుందరమైన లిపితో క్రొత్త శాసనములు తయారు చేసెను.
అవి ఆతని అత్యంత పావన పత్రములైనవి.
అందు పొందు పరచిన వివేకమును మానసము తేటతెల్లము చేయలేదు.
జగతి ఎదనుండి అధశ్చేతనము తరిమి వేయబడినది.
కట్టుబడిన తార్కిక జ్ఞానము స్వేచ్ఛావాయువులు పీల్చుకొన్నది.
జడమందు చేతన మేల్కొంచినది.
నల్లని అణువునందు, జడపదార్థమందు,
పడిలేచిన పదార్ధముల హృదయములందు,
స్వతంత్రమైన అనంత శక్తులకు
ఒక కృతజ్ఞతా గీతము
అనశ్వరమగు వజ్రలిపితో వ్రాయబడినది
ఆదిమధ్యాంత రహిత స్థితికి ఆధార భూతమైన పావన నామము లిఖించబడినది
జాగృతమై, హర్షోల్లాసములతో నిండిన కణ కణములందు,"
అవ్యక్త శక్తుల సంకేతాక్షరములు నాతడు కనుగొనెను.
అందు సమయ పరిధులను ఛేదించుటకై వేచియున్న

ప్రేమగీతము నిక్షిప్తమైయున్నది,
నిశ్చలానంద గ్రంథమందలి అద్భుత అధ్యాయమున్నది,
అధిచేతనాగ్నుల అమర సందేశమున్నది.
అంతట మర్త్య శరీరమందలి జీవన స్పందనలు స్వేచ్ఛాయుతమైనవి.
అతి స్వచ్ఛమైనవి.
నరకలోకపు మంటలారిపోయినవి. సంహరించుటకు సాధ్యము కానిదైనది.
ఆకస్మికముగా దాని మొగసాల యందున్న బృహత్ భాగము చీలిపోయినది.
మంత్రజాతమైన మహాసౌధము కూల్చబడినది.
వెలుపలికి వచ్చిన నిశీథిని స్వప్నమువలె అంతర్ధానమయినది.
ప్రాణియందు పరమాత్మని స్థానమున నిశీథిని యుండినది.
ఇప్పుడది ఖాళీయైనది. అందు నిశ్చలానందపు సన్నిహిత ఉదయరాగములు పైకి లేచినవి.
కాలపు సమ్మెటపోటుల గాయములన్నియు మటుమాయమైనవి.
ఇకపై ప్రకృతి హృదయమందు దుఃఖము మనజాలదు.
పరమాత్మ ఆగమనముతో వైరుధ్యమంతరించినది.
చేతన ప్రవేశించిన శరీరమందు, ఆత్మ తన జ్యోతుల వెలిగించినది.
పాంచభౌతికము, చైతన్యము మిళితమైనవి. ఏకత్వమును సాధించినవి.

సావిత్రి, పుట : 231-32

భూతలానికి, మనిషికి వరాలు

"ఓ చైతన్యమా, ఎన్నుకొనుము. మరల ఇవ్వబడని, ఉత్తమోత్తమ వరములందు, నీ అభీష్టము నెన్నుకొనుము.
నా అత్యున్నతమగు చేతన నిన్ను పరికించుచుండును.
రూపగుణాతీతమగు ప్రశాంత స్థితి నీ సొంతమగును. అన్నియు అందు విశ్రాంతి నొందును.
అదియే సంతసములు నిండిన అతి సూక్ష్మమగు అంతమని ఎరుగుము.
ఆది మధ్యాంతరహిత స్థితియందది ఒక బృహత్తర అంతర్ధానమగును.
అనంతములందు, అంతర్ధానమగు ఒక బిందువగును.
ఆరిపోయిన జ్వాలయొక్క అనుగ్రహ విశేషమగును.
అపరిమిత పారావారములందు మునిగిన చివరి లహరియగును.

సంచరించు తలపులు గొనితెచ్చు వెతల అంతమగును.
నీ ఆత్మయొక్క పావనయాత్రకు గమ్యమగును.
ఓ సంగీతమా, నీ లయ తాళములు అలసియున్నవని
గ్రహించుము, అంగీకరించుము.
ఓ పరీవాహమా, నీవు కట్టలు త్రెంచుకొని ప్రవహించుచుంటివి"
క్షణములు, ఆదిమధ్యాంతరహిత స్థితిలోనికి జారుకున్నవి.
తెలియరాని ఎదనుండి, ఎవరో ఎలుగెత్తిరి.
అతివ హృదయము నిశ్శబ్దమున సమాధానమొసగినది.
"ప్రభూ, నీవొసగు శాంతి ఉత్తమ వరమగును.
భీకర కాల ఘర్జనల నడుమ, దాని పదఘట్టనల నడుమ,
భూతలమున, మనుజుని ఆత్మకెంతేని అనువైనది.
నీ ప్రశాంతత, ఓ ప్రభూ, నీ ప్రసన్నతా హస్తముల మోయుచున్నది"
చిరు ద్వీపమును చుట్టుముట్టిన, అపరిమిత పారావారము వోలె,
మరొక్కమారు, అనశ్వర స్వరము గళము విప్పినది.
"అవ్యక్త ద్వారములు నీ ముందు తెరచి యున్నవి.
భూతలపు ముడిని విప్పుటకై, నా చైతన్యము క్రిందకు వంగినది.
భావరహితముతో, సంకేత రహితముతో ఏకమగుటకు ఉవ్విళ్ళూరినది.
గోడలు కూలవలె, కంచెలు తొలగవలె, స్వర్గము తేటతెల్లము కావలె.
అపరిమిత శక్తుల బృహత్ చక్షువులతో చూడుము.
తారకల విడదీయుము. నిశ్శబ్దములోనికి జారుకొనుము"
లోక విధ్వంసకారకమగు విరామమచట ఏర్పడినది. అది అత్యంత బృహత్తరమైనది.
ప్రాణికోటి ఆర్తనాదము లామె చెవిని తాకినవి.
నిశ్శబ్ద మావరించిన ఆమె ఆలోచనల నుండి,
అంచనాల కందని సాధ్వీమణి నైజమిట్లు పలికెను.
"ఓ ప్రభూ, నిన్ను చేరగోరు హృదయములందలి,
నీ ఏకత్వము నా మధురిమలు నిండిన, నీ అనంత కోటి ఆత్మలగును"
వెనుకకు మరలుచున్న బృహత్తర కెరటమువోలె,
ఆమె నదుపు చేయగోరు స్వరము, మరల వినిపించినది.

"కాందిసీకుల వంటి నా రెక్కలు, ఊర్ధ్వలోకములకు విస్తరించినవి.
చూడరాని వాటి ఆంతర్యముల నుండి,
నా శక్తులు బృహత్తరమగు, మహిమాన్వితముల పరికించినది.
అవి తీవిగా నిదురించినవి. సేదదీరినవి.
జగతి భీకర పరిభ్రమణములనవి అధిగమించినవి"
సమాధానముగా ప్రాణులు రోదించిరి.
అనునయమున సాధ్వి హృదయము బదులిచ్చినది.
"ప్రభూ, నీ శక్తి, అతివను ఆమె పతిని,
దుఃఖమున మునిగిన సర్వప్రాణులను, బంధించి గొనిపోవుటకనువైనది.
తల్లి ఒడిలోనికందరిని చేర్చదగినది."
సుదూరముగా, సెరాఫ్* యొక్క వీణాతంత్రులు మీటినటుల,
చిట్టచివరి హెచ్చరిక వినవచ్చినది.
"విశాలమగు నాఫాలనేత్రమును తెరచి,
స్వరరహితమగు నా ఆనందహేల నావిష్కరింతును.
నిశ్చల నిశ్శబ్ద సమాధియందు,
చలనరహిత సుషుప్తిలో అది పరవశించినది.
విజృంభించిన నా నాట్యహేల సేదదీరినది.
నా నృత్తము నుండియే హృదయ స్పందన లావిర్భవించినవి."
ఆమె ఆక్రందన, ఆర్తనాదము, నిశ్శబ్దమును ఛేదించినది.
అలుపెరుగని ఆరాధనాగీతమొక్కటి, ఆరోహణ సాగించినది.
ఆత్మలు ఐక్యతారాగము నందుకొన్నవి. రెక్కలు విప్పుకొన్నవి.
అతివ తన ఆవేదన వెలిబుచ్చినది.
"నీ పావన పరిష్వంగము, సకల దుఃఖ విమోచనము
నీ సంతసములు ప్రాణుల ఉచ్ఛ్వాస నిశ్వాసములగును.
నీ అనురాగ మహిమ, జలజల పారు సెలఏరులగును.
ఇవెల్ల నాకొసగుము. భూతలమునకు, మర్త్యుల చెంతకు గొనిపోవుదును."

సావిత్రి, పుట : 696-97

---

* సెరాఫ్ : రెక్కలు కలిగిన ఉత్తమశ్రేణి గంధర్వకాంత

భూతలము దేవుని గృహమవ్వును

ఓ ఆదిత్య-పదమా, భూతల-ఆత్మను,నీవు కాంతులకు చేరవేయగలవు
దైవమును నీవు మర్త్య జీవనములకు గొనితేగలవు;
భూతలము, నా కర్మభూమి యగుగాత, నా ఆవాసమగుగాత.
మర్త్యసమయమందు నీ చేతలు సంపూర్ణమైనంతనే.
భూతల మానసము, కాంతుల ఆవాసమగుగాత.
భూతల జీవనము, సుర్లోకము వైపు పెరుగు తరువగుగాత.
భూతలము, దైవము యొక్క తాత్కాలిక ఆవాసమగుగాత.
జ్ఞానశూన్యమగు మర్త్యదశనుండి, మేల్కొలుపబడి,
మనుజులు ఆదిమధ్యాంతరహిత కాంతి కిరణములచే ప్రభావితులగుదురు గాత.
నా మహిమచే, వారి తలపులు ఉత్థానమగు గాత
నా అనురాగ మాధుర్యము, వారి హృదయముల నింపుగాత.
నా అద్భుత శక్తులు, వారి చేతల చోదితము చేయుగాత.
నా సంకల్పము, వారి దివసముల పరమార్థమగుగాత.
నాయందు, నాకొరకు, నావలన, వారలు జీవింతురుగాత.

సావిత్రి, పుట : 699

కొందరు గాంచగలరు

అనిశ్చిత మధ్యే మార్గమును విడనాడిన వారలై,
అద్భుత ఆవిర్భావములను కొందరు దర్శింతురు.
నీ యందు నిగూఢమగు శక్తిని కొందరు కనుగొందురు.
వారలు అగమ్యగోచరమగు నడకను ఆరంభింతురు.
మహాబల సంపన్నమగు నవదివసము వైపు సాహసయాత్రికులగుదురు.
పరిమితుల మానసము నుండి పైకెగబ్రాకిన వారలై,
జగతి నేర్పరచిన బృహత్ప్రణాళికల వారు కొనుగొందురు.
సత్యమేదియో, సరియైనదేదియో, అత్యంత విశాలమేదియో, దానివైపు అడుగులు వేయుదురు.
నిగూఢమగు ఆది మధ్యాంత రహిత స్థితుల, వారలకు నీవు తెలియజెప్పుదువు.
విశ్వసంభూత కారకమగు, ఒకింత నిశ్చలానందహేల,
సర్వస్రష్టయగు దైవము యొక్క ఒకింత శక్తి,

సర్వద్రష్టయగు అద్భుతముల కాంతిపుంజము లొక్కింత వారలు దర్శింతురు.
కాని, దైవత్వపు గడియ చేరువైనంత,
జగజ్జనని జన్మనెత్తును.
దైవము మర్త్యునియందు జన్మించును.
నీ మర్త్య జీవనములు సిద్ధము చేసిన రూపముల గైకొనును.
అంతట మనుజులకు పరమ సత్యము బోధపడును.
మానసధారియగు ప్రాణికావల ఒక ప్రాణి యుండును.
అంచనాల కందని అనంతుడు, అశేషరూపముల ధారణ చేయును.
అది అశేష రూపముల ఏకత్వమగును. అత్యంత అద్భుతమగును.
మానసముచే స్పృశించరాని చేతనయొక్కటి గలదు.
దాని మాట ల వ్యక్తములు. దాని తలపులు నిగూఢములు.
అది భూతలమున ఆవాసము, మర్త్యుని యందు కేంద్రము లేనిదైనది.
అయినను అది తలపులన్నింటికి, చేతలన్నింటికి మూలమైనది.
విరాట్ సృష్టి దానినుండియే ఉద్భవించుచున్నది.
ఇచ్చోట అన్ని సత్యములకు అది మూలమైనది.
అది ఆదిత్యుని ఆవృత్తము వంటిది. మానసపు కొలది వెలుగు రేఖల కది మూలమైనది.
అది దైవమును మానవాళికి ప్రసాదించు అనంతమగు సుర్లోకమగును.
చైతన్యమును బృహత్తరము చేయుటకు మానవాళికి పిలుపునిచ్చు మహత్తర శక్తియైనది.
ఆతని పరిమిత యత్నముల న్యాయీకరించు మహోన్నత లక్ష్యమైనది.
ఆతడు కొలది ఆనందముల చవిచూచు వాహిక అయ్యెను.
కొందరు మహిమల గ్రహీతలగుదురు.
కొందరు ఆదిమధ్యాంతరహితుని రథములగుదురు.
వీరలు నవోత్థానపు వైతాళికులగుదురు. కాలమునకధినేతలగుదురు.
భూతల మానసమునకు వారలు ముక్తిప్రదాతలగుదురు.
మర్త్యపదార్థమునకు పరిణామకర్తలగుదురు.
రానున్న ఉత్తమ జాతులు ఆది శిశువులగుదురు.
అవతరించిన ద్వైత-శక్తి, దైవముయొక్క ద్వారముల తెరచును.
సనాతన అధిమానసము, భూతలకాలమును స్పర్శించును.
మర్త్యుని యందు, ఉత్తమ పురుషుడు జాగృతమగును.
నిగూఢముగానున్న అర్ధదేవత నావిష్కరించును.

లేక దైవముయొక్క కాంతిగా, దైవము యొక్క శక్తిగా ఎదిగిపోవును.
గుహాముఖమున నిగూఢముగానున్న దేవతను ఆవిష్కరించును.
అంతట పరమేష్ఠి, భూతలమును తాకును.
కాంతులీను ఆతని ఆధిభౌతికత ప్రకాశమును వెదచల్లును.
మానసమందు, హృదయమందు వెలుగులు నిండును. జీవనము, చేతలు,
చెప్పనలవిగాని, ఆయన అద్భుతముల కీర్తించును.
సుర్లోక అక్షరక్రమము వాడబడును. దివ్య సంకేతములు మెండగును.
సజీవమగు ఆతని ఆధిభౌతిక చైతన్యము ఎల్లెడల వ్యాపించును.
భేదమును, మరణమును నిర్ధారించు శాసనము నాతడు రద్దు చేయును.
అజ్ఞాన కారకములగు సమీకరణలు తొలగించబడును.
సౌందర్య నిర్వచనము, జీవన పరమార్థము బోధపడిన యాతడు,
అమరత్వ సిద్ధికి అర్హుడగును.
ఆతని పరిజ్ఞానము అనంతమగు ఆధిభౌతిక ఎల్లలు దాటినది.
ప్రకృతికి జీవనమందలి పూర్వ సంతసముల గొని తెచ్చినది.
లుప్తమైన సంతసముల లయబద్ధమగు హృదిస్పందన,
మరచిన పరవశముల పొలికేక,
భువన సంచయముల సృష్టికి కారణభూతమైన, ఆద్యమగు ఆనందహేల,
అన్నియు తిరిగివచ్చినవి.

సావిత్రి : 704-706





ఓ మానసమా, నిశ్చల నిరంతర ప్రశాంత స్థితికి ఎదిగిపొమ్ము
ఓ దివ్యపదమా! అమరగీతము నాలపించుము
బంగరు భవంతి నిర్మితమైనది, పవిత్ర జ్వాలల శిశువు జన్మించింది.

సావిత్రి, పుట : 699

అతిమానసము ఆతని నైజమునకు మూలమగును.
ఆదిమధ్యాంత రహిత సత్యము, ఆతని తలపులను, చేతలను మలచును.
అదియే ఆతని కాంతియగును. మార్గదర్శకమగును.
అంతట అన్నియు మారగలవు. అద్భుత క్రమమొక్కటి అరుదెంచును.
ఆతని యాంత్రిక విశ్వ-నైజమునది అతిక్రమించును, అధిగమించును.
ఇతోధిక బలసంపన్నమగు సంతతికి, మర్త్యజగతి ఆవాసమగును.
కాంతులీను ప్రకృతి ఔన్నత్యములందు, చైతన్యపు భూతలమందు,
శ్రేష్టుడగు మర్త్యుడు జీవనమునకు అధినాయకుడగును, పరిపాలించును.
భూతలమును సుర్లోకమునకు సహచరి చేయును.
జ్ఞాన శూన్యమగు మర్త్యుని హృదయమును, దైవము వైపు, సత్యము వైపు గొనిపోవును.
ఆతని మర్త్య నైజమును, దైవత్వము వైపు ఉత్థానము చేయును.
నిర్ధారిత సరిహద్దుల నుండి, విడుదలైన బలిమి,
మరణపు ఆకలిగొన్న కోరల కందని ఔన్నత్యముల కెదిగినది.
జీవన ఉపరితలములు, అనిమేషత్వపు భావనలతో కాంతులీనినవి.
దాని పునాదులపైని అంధకారమును కాంతు లాక్రమించగలవు.
అధీనము చేసికొనగలవు. అంతట పరిణామక్రమమునకు లోనైన కాలగమనమందు
అంతయు ఏకత్రాటి పైకి రాగలవు.
ఒక దివ్య సమన్వయము, సంతులనము, జగతి శాసనమగును.
సౌందర్యము, సంతసము, భూతల జీవనరీతుల పునర్నిర్ధారణ చేయును.
శరీరము సైతము, దైవమును స్మరించును.
ప్రకృతి మర్త్యదశనుండి పరాఙ్ముఖమగును.
చైతన్యజ్యోతులు, భూతలపు అంధబలిమికి మార్గదర్శనము చేయును.
జ్ఞానము, సాధకునికి, భావన ప్రసాదించును.
సత్యమునకు, దైవమునకు సాన్నిహిత్యము ఏర్పడును.

అధి మానసము, కాంతుల కొరకు జగతి నధీనము చేసికొనును.
ఉద్వేగ భరితమగు హృదయమును, దైవము ఎడ ప్రేమతో పరవశింపజేయును.
పైకెత్తిన ప్రకృతి శిరముపై కాంతి కిరీటముంచబడును.
ఆమె కదలని పునాదులపై, కాంతుల పాలన కనిపించును.

భూతలమున కంటెను మహత్తరమగు సత్యమొక్కటి, భూతలమును కప్పును.
మానసవీధులందు, దాని కాంతులు ప్రసరించును.
నిర్దుష్టమగు బలిమియొక్కటి, భావనకు ముంగామి యగును.
సర్వద్రష్టయగు మహాశక్తి, జీవనమును, చేతలను నిర్దేశించును.
మర్త్యహృదయములందు అనిమేషత్వపు అగ్నులు రాజుకొనును.

అధిచేతన ఆవాసమందు ఒక ఆత్మ మేల్కాంచును.
మానసము దైవదర్శనపు ఆవాసమగును. పావన మందిరమగును.
ఈ దేహము అంతర్దృష్టుల పరికరమగును.
దైవముయొక్క కన్నులకు కనిపించు బలిమికి, జీవనమొక వాహికయగును.
జగతి సమస్తము చైతన్యపు రూపుదాల్చిన ఆవాసమగును.
దేహముచే, జీవనముచే, దాచియుంచబడనిదగును.
మానసపు అజ్ఞానముచే మరుగు పడనిదగును.
సంభవములను చేతలను, నిర్దుష్టమగు హస్తమొక్కటి మలచుచుండును.
చైతన్యపు చక్షువులు, ప్రకృతి చక్షువులతో పరికించుచుండును.
చైతన్య శక్తి ప్రకృతి బలిమిని లోబరచుకొనును.
ఈ జగతి దైవముయొక్క ఉద్యానవనమందలి దివ్య ఆరామమగును.
భూతలము, దైవము యొక్క మజిలియగును.
మనుజుడు తన మర్త్య నైజమును మరచును.
సజీవమగు తన నశ్వర నైజమును విస్మరించును.
విశ్వసంచయములు, తమ ఆధిభౌతక ప్రజ్ఞను ఆవిష్కరించును.
సృష్టి రీతులు, తమ పురాతన పుంతలు త్రొక్కజాలవు.
జ్ఞాన శూన్యయగు, జీవ పరిణామ క్రమమందలి అధినాయక శ్రేణి,
దాని పునాదులందలి వివేకమునకు విముక్తి కలిగించినది.
రూపములందు నిగూఢముగా దాగియుండక,
చైతన్యమాతని జగతికి అధిపతియగును.
ప్రకృతి తన చేతల నియమమును, యథాపూర్వస్థితికి గొనిపోవును.
బాహ్యజగతి తనచే కప్పియుంచబడిన సత్యమును, తేటతెల్లము చేయును.
దర్శనమొసగిన దైవము అన్నింటా తన్ను తానావిష్కరించుకొనును.
చైతన్యము యొక్క కాంతి, శక్తి అన్నింటా ద్యోతకమగును.

తన అనుగ్రహ గమ్యమును చేరుకొనును.
క్రూరమగు పాలన కొనసాగింప బడినను,
తన చైతన్యపు గమ్యమును, మర్త్యుడు నిరాకరించినను,
అన్నింటా దాగిన నిగూఢమగు సత్యముయొక్క ఆధిక్యత కొనసాగును.
అన్నింటిని పరిపూర్ణము గావించు కాలగమనమందు,
ఆధిభౌతిక సంకల్ప గడియ ఆగమించవలె.
అన్నియు తమ పూర్వ నిర్ధారిత గమ్యముల చేరుకొనును.
మార్గములు ప్రకృతిచే నిర్ధారితములు. పరిణామరహితములు.
అవి జగతి ఆరంభముల శాసనములు
సృష్టి ఆంతర్యములందు గుప్తములు.
అచ్చోటయు ఉత్తమోత్తమ విజయమొక్కటి వేచియున్నది.
మరణమునకు అంతము అజ్ఞానపు మరణము సంభవములు కానున్నవి.

సావిత్రి, పుట : 706-708

మానవుడు - దివ్య మానవుడు

కాని, ముందుగా పరమసత్యము భూతలముపై కాలుమోపవలె.
మర్త్యుడు ఆదిమధ్యాంతరహిత కాంతులనాశించవలె.
ఆతని సంతతి సమస్తమును చైతన్యము స్పృశించవలె.
ఆతని జీవన సమస్తము అంతశ్శక్తుల ననుసరించవలె.
ఇదియు సంభవమగును. క్రొత్త జీవన మరుదెంచును.
అధిచేతన యొక్క సత్యమావిష్కరింప బడవలె.
విశిష్టమగు ప్రకృతియొక్క అంతశ్శక్తుల కిది రంగస్థలము కావలె.
ఆదిచేతనల భూతలము నది సత్యపు ఆవాసము గావించవలె.
అజ్ఞానము సైతము కాంతులీను అంగీకావలె.
సత్యముయొక్క బాహువులు, పాదములు కనిపించవలె
ప్రకృతి శిరముపై, సత్యమును ఆదిత్యుడు ప్రకాశించవలె ప్రకృతిని సత్యము, నడిపించవలె.
తన అధోతలపు అగాధముల నుండి, సత్యము, చూపు సారించవలె.
ప్రకృతి కధినాయకుడై, ఉత్తమనరుడు ఆవిర్భవించవలె.
ఆతని ఉనికితో భౌతికజగతి మార్పుచెందవలె.

ప్రకృతి నిశిరాత్రివేళ, ఆతడు సత్యపు మంటలు వేయును.
భూతలమున సత్యపు ఉత్తమ శాసనము నమలు చేయును.
మర్త్యుడు చైతన్యపు పిలుపు నందుకొనును.
దాగిన సాధ్యతల కాతడు జాగృతుడగును.
ఆతని హృదయమందు నిద్రాణమై యుండిన వన్నియు మేల్కొనును.
జగతి ఆవిర్భావములందు ప్రకృతి ఆశయములకు,
జ్ఞాన శూన్యమగు జగతిని, ఆతని ఆవాసము చేసిన చైతన్యపు ఆశయములకు,
ఆతడు జాగృతుడగును.
సత్యము వైపు, దైవము వైపు, నిశ్చలానందములవైపు, ఆతడు పురోగమించును.
దివ్య శాసనముల అర్థమును విశదీకరించును.
ఉత్తమోత్తమమగు ప్రణాళిక యందాతడు పరికరమగును.
ఉత్తమ సంజాతులు మర్త్యులకు చేయూతనొసగుదురు. వారల ఉత్థానమునకు తోడ్పడుదురు.
మర్త్యుడు తన ఔన్నత్యముల నధిరోహించుటకు ఉత్సుకతతో నుండును.
ఉపరితలమున నున్న సత్యము, అధోతలపు సత్యమును మేల్కొలుపును
జ్ఞాన శూన్యమగు జగతి సైతము బుద్ధి పరిజ్ఞానముగల బలిమియగును.
చైతన్యపు ఔన్నత్యములు, ప్రకృతియొక్క పునాదులు,
నిగూఢమగు వాటి ద్వంద్వ సత్యములకు చేరువగును.
తమయందున్న ఏకత్వము దైవమని గుర్తింతురు.
భౌతిక పదార్థము నుండి, చైతన్యము తొంగిచూచును.
పదార్థము చైతన్యపు మోమును ఆవిష్కరించును.
అంతట నరుడు, ఉత్తమోత్తమ నరుడు ఒక్కటగుదురు.
భూతల సమస్తము ఏకైక జీవనమగును.
ప్రాణి సమస్తము ఏకైక స్వరమును వినగలవు.
ఆంతర్యము లందలి చైతన్యముతో, మేళవింపుకు సమాయత్తమగును.
ఔన్నత్యముల ఆధిభౌతిక శాసనము ననుసరించుటకు శ్రమించును.
ఉదాత్తము, దివ్యము అగు ప్రచోదనలు, భూతలమును కదలించి వేయును.
మానవాళి ఆంతర్యములందలి చైతన్యము జాగృతమగును.
ప్రకృతి తనయందు దాగిన దైవత్వమును గుర్తించును. అనేకులు కొందరికి స్ఫూర్తి నొసగుదురు.

దిగివచ్చిన దైవత్వపు మహిమలు వారల కనుభవైకవేద్యమగును.
కానరాని ద్వారముల చెంత తలుపులు నాతడు తట్టుచుండును.
మనుజుల జీవనములు స్వర్గపు అనురాగములవైపు ఉత్థానమగును.
వారి మానసములు అవ్యక్త కాంతులు పంచుకొనును.
వారి హృదయములు పరవశ జ్వాలల పంచుకొనును.
మర్త్య శరీరములు ఆత్మ ఉనికిని తెలుసుకొనును.
మర్త్యదశకు బంధితులైన వారలు, తమ బంధముల సడలింతురు.
మానవమాత్రులు శుద్ధచైతన్య స్వరూపులుగా ఎదిగిపోవుదురు.
నిశ్శబ్దమున నుండిన దైవత్వము మేల్కొంచుటను వారలు తిలకింతురు.
అంతర్దృష్టుల కాంతి పుంజములు ప్రకృతి శిఖరముల స్పర్శించును.
ప్రకృతి లోతులను, ఒక ఆవిష్కరణ కదలించి వేయును.
సత్యము వారి జీవనముల కధినాయకుడగును.
వారి తలపులను, మాటలను, చేతలను సత్యమాదేశించును.
ఆకసమునకు చేరువగా వారలుత్థాన మైనటుల భావింతురు.
దేవతల కతి చేరువైనటుల భావింతురు.
కాంతులీను స్రవంతుల వలె, జ్ఞానము పరవళ్ళు ద్రొక్కును, వారివైపు ప్రవహించును.
అంధకారము నిండిన మానసము సైతము నవజీవన స్పర్శతో పులకించును.
ఉన్నతాదర్శముల జ్యోతులు రాజుకొనును. ప్రజ్వలించును.
జ్ఞానశూన్యమగు మర్త్యస్థితి నుండి తప్పించుకొనజూచును.

సావిత్రి, పుట : 708-710


దివ్యజీవనము

అజ్ఞానపు సరిహద్దులు చెరిగిపోవును.
ఇతోధికముగా ఆత్మలు, కాంతులందు ప్రవేశించును.
మానసములు కాంతులీనినవి. స్ఫూర్తి నొందినవి. ఆధిభౌతిక అధినాయకుని పిలుపు వినిపించినది.
జీవనములందు, అంతర్ జ్యోతుల కాంతులు చెలరేగినవి.
దివ్య ఆనందహేల కొరకు, హృదయములు పరితపించినవి.
మర్త్య సంకల్పములు, దివ్య సంకల్పముతో జతకట్టినవి.
అందరికి, చైతన్యపు ఏకత్వము అనుభవైక వేద్యమైనది.

మర్త్యలోక బుద్ధి పరిజ్ఞానమునకు ప్రతీకలైన, ఇంద్రియములు శక్తిమంతములైనవి.
అంతటా నిండిన నిశ్చలానందహేల, నాడీమండలమున ప్రవేశించినది.
అనిమేషత్వమునకు ప్రతీకలైన మర్త్యకాయముల ప్రవేశించినది.
దివ్యచైతన్యమొక్కటి, ప్రతి అణువునందు, జీవకణమునందు ప్రవహించినది.
ఊపిరులను, మాటలను, చేతలను, నిర్దేశించినది.
అంతట తలపులందు, ఆదిత్యుల జ్యోతులు ప్రకాశించినవి.
ప్రతి భావన దేవగాంధర్వ పరవశమైనది.
తరచుగా ఆంతర్యములందు, ఒక వేకువ ఉదయించినది.
నిద్రాణమైయున్న మానసావాసములందు, కాంతులు ప్రసరించినవి.
ప్రతి అంగమందును, నిశ్చలానందములు వెల్లువెత్తినవి.
ప్రకృతి ఇతోధిక బలముల సంతరించుకున్నది. ప్రతి అంగమందును అది అనుభవైక వేద్యమైనది.
దైవత్వమునకు ఆ విధమున భూతలపు దారులు తెరువబడును.
సామాన్యమగు ప్రకృతి, ఔన్నత్యములకు ఉత్థానమగును.
సామాన్యమగు చేతలందు, చైతన్యపు కాంతులు ప్రజ్వలించును.
సామాన్య వస్తు సంచయములందు దైవత్వము సాక్షాత్కరించును.
నిగూఢమగు దైవము నావిష్కరించుటకై, ప్రకృతి జీవించును.
మర్త్యజీవనము దివ్యజీవనమగును".

సావిత్రి, పుట : 710 — *- శ్రీ అరవిందులు*

అనువాదం : ప్రొ॥ తంబిశెట్టి రామకృష్ణ



Vol. 53, No. 1
January 2023


Date of Publication
1st January 2023

Registered: PY/41/2021-23

AKHILA - Akhila Bharata Patrika (Telugu)

Registered with the Registrar of Newspapers for India: No. 23593/72 (monthly)

Matter shall reveal the Spirit's face. — Sri Aurobindo



Owner: Sri Aurobindo Society
Printer: Swadhin Chatterjee for Sri Aurobindo Ashram press
Publisher: Pradeep Narang for Sri Aurobindo Society
Published from: Society House, 11 Saint Martin Street, Puducherry - 605001
Printed from: Sri Aurobindo Ashram Press,
No. 38, Goubert Avenue, Puducherry - 605 001, India
Editor: K. V. Rao

Single copy Rs. 30 **Annual Subscription Rs. 200 (in India)**


A Monthly Published by

SRI AUROBINDO SOCIETY-605001

అఖిల

అఖిల భారత పత్రిక

ఫిబ్రవరి 2023



అన్వేషకులకు ఆధ్యాత్మిక మార్గదర్శి

విషయ సూచిక

గమనిక : "ప్రార్థనలు, ధ్యానములు" ముద్రణకు వెళ్ళినపుడు ఈ క్రింది విషయాన్ని మదర్ జతచేశారు.

"తీవ్రమైన యోగిక సాధన జరుగుతున్న సంవత్సరాలో వ్రాసిన దినచర్య పుస్తకం నుండి సేకరించిన విషయాలతో తయారైంది. అన్వేషకులలో మూడు ప్రధాన వర్గాలకు చెందిన వారికి ఆధ్యాత్మిక మార్గదర్శిగా ఇది ఉపయోగ పడవచ్చు. తనపై తాను ఆధిపత్యం సాధించాలనుకొనే వారికి, దైవం చెంతకు తీసుకుపోయే మార్గాన్ని కనుగొనాలనుకొనే వారికి, దైవ కార్యానికి మరింత కింతగా తమను తాము అంకితం చేసుకోవాలని కాంక్షించే వారికి ఇది ఉపయోగపడచ్చు".

ఇచట భాగం రెండు ఈ పుస్తకం నుండి సేకరించిన కొన్ని విషయాలను అందిస్తుంది.

ప్రస్తావన
సృష్టికి గల ఒకే ఒక కారణం

మనం పరిగణనలోనికి తీసుకోవలసిన ఒకే ఒక విషయం దైవం. ఆతని ఇచ్ఛ, ఆతని అభివ్యక్తి, ఆతని ప్రకటన, వ్యక్తి యిక్కడున్నది అందుకోసమే. ఆతడు అదే గాక మరేం కాదు. నేను, నాది అనే సంవేదన అతనిలో ప్రవేశిస్తే, అతడెలా ఉండి తీరాలో అలా లేడని అది ఋజువు చేస్తుంది. అంతే. రాత్రికి రాత్రే ఇది జరుగుతుందని నేనడం లేదు. కాని నిజానికదే సత్యం.

ఎందుకనంటే ఈ క్షేత్రంలో, ఆధ్యాత్మిక క్షేత్రంలో కూడా చాలామంది (ఆధ్యాత్మిక జీవన విధానాన్ని స్వీకరించి యోగాభ్యాసం చేస్తున్న వారిలో అధిక సంఖ్యాకులని కూడా నేను చెప్పగలను) వ్యక్తిగత కారణాలు, అన్ని రకాలైన వ్యక్తిగత కారణాలచే అలా చేస్తున్నారు. జీవితం యెడల నిస్పృహ చెంది కొంతమంది, జీవితంలో సుఖం లేదని యితరులు, ఇంకా అధికంగా తెలుసుకోవాలని మరికొంత మంది, ఇంకా యితరులు, ఆధ్యాత్మికంగా గొప్పవారమవుదామని, ఇతరులకు బోధించడానికి విషయాలను తెలుసుకొందామని ఇంకొందరు, అలా చేస్తున్నారు. యోగాన్ని స్వీకరించడానికి, నిజానికి సహస్ర కారణాలున్నాయి. దైవానికి తనను తాను యిచ్చివేసుకొంటే, ఆయన సంకల్పించినట్లు తనను పూర్తిగా పరిశుద్ధంగా, తొట్రుపడకుండా ఉండేటట్లు తయారుచేసుకొంటాడనే అతి సరళమైన వాస్తవికత కారణంగా ఆధ్యాత్మిక జీవితాన్ని, యోగాభ్యాసాన్ని స్వీకరించేవారు ఎక్కువమంది లేరు. అయినా నిజానికిదే సత్యం.

ఇకనేమాత్రం, ఆయనకు, నీకుమధ్య భేదం లేదన్నంత వరకు యేవిధమైన వ్యక్తిగత ప్రతిచర్య జోక్యం చేసుకోలేని విధంగా దైవానికి సమగ్ర, సంపూర్ణ సమస్త సమర్పణగావడం అనేదే మన మనుగడకు గల ఒకే ఒక కారణం, ఒకే ఒక గమ్యం, ఒకే ఒక ఉద్దేశ్యం. ఇది ఆదర్శవంతమైన ధోరణి. జీవితంలోనూ, పనిలోనూ, ప్రతిదాని నుండి పరిపూర్ణంగా రక్షించబడ్తూ, అన్నింటికంటే నీకు యెంతో గొప్ప ప్రమాదకారియైన నీ ఆత్మ నుండి నిన్ను రక్షిస్తూ, నీ ఆత్మకంటె గొప్ప ప్రమాదకారి మరొకటి లేదు. (నీ ఆత్మ అంటే అహంకారిక ఆత్మ అనే అర్థంలో నేను చెప్తున్నాను)

CWM 7:189-90 — దీ మదర్

అక్టోబరు23, 1937

(దైవసేవ చేయాలనుకునేవారికి ప్రార్థన)

ప్రతి ఆటంకముపై విజయం సాధించే దేవా, ఓ మహిమాన్వితా!

నీ పనికి మేము ఏ మాత్రం అడ్డంకి కాకూడదు గాక!

నీ అభివ్యక్తీకరణని ఏదీ అడ్డుకోదు గాక!

ప్రతిక్షణం అన్ని విషయాలలో నీ సంకల్పం నెరవేరు గాక!

నీ సంకల్పం మాలో, ప్రతిమూలలో, జీవి ప్రతికార్యాచరణలో,

అత్యున్నత స్థాయినుండి శరీరంలోని అతి చిన్న కణాలవరకు నెరవేరాలని మేము ఇక్కడ నీ ముందు నిలబడి ఉన్నాము.

మేము ఎప్పటికీ నీకు విశ్వాసపాత్రంగా ఉండేలా మమ్మ అనుగ్రహించు!

మేము ఒకరినొకరు మినహాయించుకొని పూర్తిగా నీ ప్రభావంలో ఉండు గాక!

లోతైన తీవ్రమైన కృతజ్ఞతాభావాన్ని మేము ఎప్పటికీ విస్మరించకుండా మమ్మ అనుగ్రహించు!

ఏక్షణంలోనూ నీవు బహూకరించిన అద్భుతమైన వస్తు సంపత్తిని మేము ఎప్పటికీ వృధాచేయకుందుము గాక!.


మా ప్రతిఅణువు నీపనిలో సహకరించేలా సాక్షాత్కారానికి అందరూ సిద్ధంగా ఉండేలా అనుగ్రహించు.

సర్వసాక్షాత్కారానికి అధిపతీ, ఓ మహిమాన్విత దేవా!

నీ విజయంలో చురుకైన ఉత్సాహపూరితమైన, సంపూర్ణ అచంచలమైన విశ్వాసాన్ని మాకు ప్రసాదించు.

CWM 1:286

శ్రీమాత



ఆయన అక్కడ ఉన్నాడు కాబట్టే నిశ్చేతన తన పని చేస్తుంది,
ఆయన అక్కడ ఉన్నాడు కాబట్టే ఈ లోకం మరణించడం మరుస్తుంది.

సావిత్రి పుట. 681

ఆధ్యాత్మికత అంటే ఏమిటి

మన సాధారణ జీవితం అనేది తన నిజాత్మ నుండి వేరుపడి, దైవం నుండి వేరుపడి ఉండే సగటు మానవుడి చేతన. అలాగే అది మన శరీరం, మనసు, ప్రాణం యొక్క సాధారణ అలవాట్ల చేత ముందుకు తీసుకుని పోబడుతూ ఉంటుంది. ఇవన్నీ కూడా అజ్ఞానం యొక్క ధర్మాలను అనుసరించి ఉండేవి.

కానీ ఆధ్యాత్మిక జీవితం అనేది అందుకు పూర్తిగా విరుద్ధం అయినది. అది తిన్నగా చేతనలో జరిగే మార్పు నుండి వస్తుంది. సాధారణ చైతన్యం నుండి మార్పు చెంది, తన నిజాత్మ నుండి, దైవం నుండి వేరై అజ్ఞానంలో ఉండే స్థితి నుండి ఇంకొక ఉన్నత చైతన్యంలోకి మారి అందులో తన నిజాత్మను కనుగొని, దానితో ప్రత్యక్షమైన సజీవమైన కలయికను మొదటగా పొంది ఆపై దైవంతో ఐక్యం అవడం.

నిజమైన ఆధ్యాత్మిక అన్వేషి ఇటువంటి చేతనలో మార్పును మాత్రమే అన్వేషిస్తాడు. అది తప్ప అతనికి ఇంకేమీ ముఖ్యం కాదు.

CWSA 28:149

*

నీ అహం చేతనకు భిన్నంగా ఎప్పుడయితే ఇంకొక చేతనను ఎరుగనారంభిస్తావో అలాగే అందులో జీవిస్తూ, దాని ప్రభావంలో మరింతగా ఉంటావో అదే ఆధ్యాత్మికత.

ఆ చేతన అనేది విశాలం అనంతం స్వతః సిద్ధం. అహంకార వర్జితం... అయిన పరిశుద్ధ ఆత్మ చైతన్యం... దానిని ఆత్మ, బ్రహ్మము దైవము అని పిలుచుకోవచ్చు.

SABCL 23:877

ఆధ్యాత్మికత అనేది మన ఉన్నతమైన మేధాశక్తి గాని లేక ఆదర్శ వాదం కానీ మనస్సు ధర్మబద్ధత లేక నైతిక పరిశుద్ధత, నియమ నిష్ఠలతో జీవించడం కానీ, మతపరత్వం కానీ ఉన్నతమైన భక్తి శ్రద్ధలు, భావావేశాలు కానీ...కాదు. లేదా ఇటువంటి అద్భుతమైన విషయాల కలయిక కూడా కాదు.

ఇవన్నీ మనస్సుకు ప్రాణికానికి ఎన్నదగిన విలువను చేకూరుస్తూ ఆధ్యాత్మిక పరిణామానికి ప్రాథమికమైన సోపానాలుగా ఉంటూ... ఒక క్రమశిక్షణ, శుద్ధీకరణ అలాగే ప్రకృతికి ఒక సరైన రూపాన్ని ఇవ్వడానికి పనికి వస్తాయి. అయినప్పటికీ అవి ఇంకనూ మానసిక పరిణామానికి చెందినవే - ఇంకా ఆధ్యాత్మిక అనుభూతి, సాక్షాత్కారం, పరివర్తన ప్రారంభ దశ కూడా అచట నెలకొనలేదు.

ఆధ్యాత్మికత సారం ఏమిటంటే మన అస్తిత్వపు అంతరిక వాస్తవానికి మేల్కొనడం, అధ్యాత్మ, జీవాత్మ, అంతరాత్మ ఏదైతే మన మనస్సుకు, శరీరానికి, ప్రాణానికి విభిన్నమైనదో దానిని తెలుసుకొనుట, అనుభూతి చెందుట, దానిగా మారుట. అటువంటి విశ్వవ్యాప్త, విశ్వాతీతమే గాక మనలో వసించుచున్న ఆ పరమసత్యంతో సంపర్కంలోకి ప్రవేశించి దానితో సంపూర్ణ ఐక్యత చెంది, ఆంతరికమైన ఆకాంక్ష, పరిచయము, సంయోగము చెందడము, దానిలో ఎదగడము సరికొత్త స్థితిలోకి, పరిణామంలోకి, ఒక నూతన ఆత్మలోకి, నూతన ప్రకృతిలోకి మేల్కొనుట తత్ఫలితముగా అటువైపు తిరిగి, అలా మారి, మన పూర్తి అస్తిత్వం రూపాంతరీకరణ పొందుట.

CWSA 21:879-50

ఆధ్యాత్మికత అంటే అర్ధం... మనస్సు, ప్రాణం కంటే ఉన్నతమైన దాన్ని గుర్తించడం. మన సాధారణ మనో ప్రాణికాల సహజ స్వభాము కంటే ఉన్నత పరిశుద్ధ దివ్యచేతన కొరకు ఆకాంక్ష... మానవునిలోని నిమ్న తలాల అల్పత్వం నుండి, బంధంలో నుండి తనలోని ఉన్నత విషయాల కోసం, అంతరాత్మపైకి ఎగయడం లేదా లేవడం.

CWSA 20:121

ఆధ్యాత్మికత అంటే అర్ధం మానవుడు తనలో కొత్త అంతరిక జీవనం. అటువంటి జీవనానికి ఆధారం తనలోని నిజమైన, నిగూఢమైన, సమున్నతమైన, సువిశాలమైన ఆత్మ. అందులో నుండే మన ఉనికి ఈ విశ్వంలో పరిణామం చెందుతూ అభివ్యక్తి చెందుతున్నది. మన స్వీయ జీవనం రూపాంతరణ చెందుటకు అవకాశం కలిగించి అందు దివ్యత్వమును కనుగొనుటకు అవకాశము పూర్తిగా వికసించి అభివృద్ధి చెంది వున్నది. ఇప్పటి అపరిపక్వమైన రూపములు తదుపరి పరిపూర్ణతను సంతరించుకొనుచున్నవి. కేవలము

చూచుటయే గాక అట్టి దివ్య జీవితమును జీవించుటకు తగిన ప్రయత్నం చేయవలెను.

CWSA 26:270

ఈ దివ్యత్వ పరిపూర్ణత మనకు పైన ఎల్లప్పుడూ ఉన్నది. కానీ మానవుడు తన చేతనను దివ్యము గావించి, దానితో కర్మలు నిర్వర్తించుచు అలాగే ఆంతరికంగా బాహ్యంగా జీవించుచు ఒక దివ్య జీవనమును గడుపుటయే ఆధ్యాత్మికత. ఇంతకంటే తక్కువ అర్థములు ఆధ్యాత్మికతకు ఇచ్చినట్లయితే అది పొరపాటుగాను లేదా అపోహను కలిగించునది గానూ భావించవలెను.


CWSA 25:262-63

మన మానసిక పరిమితుల్ని, కాలమానాల్ని, పూర్తిగా వదిలివేసి సమస్త విషయాలకు ప్రభువైన, సర్వ ప్రాణికోటికి స్నేహితుడైన దైవం కరకమలాల్లో మనల్ని మనం అప్పగించుకోగల గట్టి విశ్వాసంతో కూడిన ధైర్యాన్ని మనం కల్గి ఉండకపోతే, అనంతమైన, చిరంతన ఆధ్యాత్మిక సత్యంలోకి పూర్తిగా ప్రవేశించడం మనకు సాధ్యం కాదు. మనల్ని మనం ఏమాత్రం చూచుకోకుండా, దేనికీ వెనుదీయకుండా, సందేహించకుండా ఒక్క ఉదుటున ఒక్క క్షణంలో కేవల సంపూర్ణ, అనంత, స్వేచ్ఛాయుత సాగరంలో మునిగిపోవాలి.

CWSA 23:208 - శ్రీఅరవిందులు

మనం అన్వేషించే దైవం ఎక్కడో మారుమూల ఉండి, మనకు అందనివాడు కాదు. అతడు స్వీయ సృష్టి కేంద్రంలోనే ఉన్నాడు. అతడిని మనం కనుగొనాలని అతడే కోరుకుంటున్నాడు. మన వ్యక్తిగత రూపాంతరీకరణ ద్వారా అతడిని తెలుసుకోగల సామర్థ్యంతో అతడిలో ఏకమవ్వడం, ఆఖరుగా అతడిని సచేతనంగా అభివ్యక్తం చేయడం, దీని కోసం మనల్నిమనం సమర్పించుకోవడం. ఇదే మన ఉనికికి గల కారణం.

CWM 13:347 - శ్రీమాత



అతడిలో నీవున్నావు కాబట్టే మనిషి ఆశతోను, ధైర్యంతోనూ ఉన్నాడు;
నీవు ఉన్నావు కాబట్టే మనుషుల్లోని అంతరాత్మ స్వర్గసీమల్ని ఆరోహిస్తుంది....

సావిత్రి, పుట. 513-14

శ్రీమాత! నేను ఆధ్యాత్మిక జీవనం జీవిస్తున్నానని నేను ఎల్లప్పుడూ గుర్తుంచుకోవడానికి నాకు సహాయపడేది ఏది?

సదా, సమస్తంలోను దైవసన్నిధి పట్ల ఎరుకతో ఉండడమే.

CWM 16:155

- శ్రీమాత


విభాగం - 2

అన్వేషకులకు ఆధ్యాత్మిక మార్గదర్శి

డిసెంబర్ 3,1912

నీ మార్గదర్శకత్వానికి పూర్తిగా ఆత్మవిశ్వాసంతో లొంగిపోయిన సమర్థతని క్రిందటి రోజురాత్రి నేను అనుభూతి చెందాను; ఏదయినా అవసరమయినది ఖచ్చితంగా తెలుసుకోవాలంటే, ఆ వ్యక్తి దానిని తెలుసుకుంటాడు. నీ ప్రకాశవంతమైన చైతన్యానికి మనసు ఎంత నిష్క్రియాత్మకంగాఉంటే, వ్యక్తీకరణ అంత స్పష్టంగా, తగినంతగా ఉంటుంది.

నీవు నాలో మాట్లాడుతున్నట్లుగా నేను నీ మాటలను విన్నాను. నీవు చెప్పిన దానిని వ్రాయటానికి నేను ఇష్టపడతాను. తద్వారా దాని ఖచ్చితత్వంలో నియమ సూత్రాన్ని కోల్పోకుండా ఉండేందుకు నేను ఇష్టపడతాను. ప్రస్తుతానికి నేను చెప్పినదాన్ని పునరావృతం చేయలేను. స్వీయ పరిరక్షణ, భద్రత కోసం ఈ శ్రద్ధ చూపడం, అవమాన పరచడం, నీపట్ల విశ్వాసం లేకపోవడమే అని నేను అనుకున్నాను. ఎందుకంటే నేను ఎలా ఉండాలో అలా నన్ను నీవు తయారు చేయగలవు, నా వైఖరిలో నీవు నా మీద నాలోపలే చర్య తీసుకొనేలా చేయగలవు. నీ సర్వశక్తికి హద్దులు లేవు. ప్రతిక్షణం ఖచ్చితంగా సాధ్యమయినంత పరిపూర్ణంగా ఉండవలసినది ఇదే. ప్రతి విషయంలో, ప్రతి చోటా నిన్ను చూడటం తెలిసిన వారికి భయం అనేది ఇక లేదు. అశాంతి లేదు; వేదన లేదు; పరిపూర్ణమైన శాంతి తప్పించి ఇంకోటి లేదు, సంపూర్ణమైన విశ్వాసం, తిరుగులేని పరమ శాంతియే.



డిసెంబర్ 5, 1912

శాంతి, నిశ్శబ్దంలో శాశ్వతమైనది అభివ్యక్తమవుతుంది; నీకు భంగం కలిగించే దేనినీ అనుమతించవద్దు; అప్పుడు శాశ్వతమైనది అభివ్యక్తమవు తుంది; అన్ని విషయాలలో సంపూర్ణ సమానత్వం కలిగి ఉండు. ఆ శాశ్వతమైనది అక్కడ ఉంటుంది. నిజమే. మేమే నిన్ను పొందే క్రమంలో మరింత తీవ్ర ఒత్తిడి, ఎక్కువ ప్రయత్నం పెట్టకూడదు. కృషి, తీవ్రతలు నీ ఎదుట ఒక పరదాగా అవుతాయి. నిన్ను చూడాలనే కోరిక పెట్టుకోకూడదు. ఎందుకంటే అది నీ శాశ్వత సన్నిధిని మరుగుపరిచే మరింత మానసిక ఆందోళన అవుతుంది. సంపూర్ణమైన శాంతి, ప్రశాంతత, సమానత్వంతో అంతా నీవై ఉన్నావు. ఈ సంపూర్ణమైన స్వచ్ఛమైన ప్రశాంత వాతావరణంలో ఏ కొంచెం ప్రకంపన ఉన్నా అది నీ అభివ్యక్తీకరణకి అడ్డంకి. తొందరపాటు లేదు, విచారం లేదు, ఏ ఆందోళనా లేదు, నీవు తప్ప ఇంకేమీ లేదు. ఎలాంటి విశ్లేషణ లేదా ఏ లక్ష్యం లేదు, ఎటువంటి సందేహం లేదు. నీవు మాత్రమే అక్కడ నెలకొని ఉన్నావు. ఎందుకంటే అంతా పవిత్ర శాంతితో పునీతం అయిపోతుంది.

ఈ ప్రపంచంలో ఉన్న అన్ని ధ్యానాల కన్నా ఇది చాలా ఉత్తమమయినది.

జూన్ 18, 1913

నీవైపు తిరగడానికి, నీతో ఏకం అవడానికి, అలాగే నీలో నీ కొరకు జీవించడం అనేది ఒక అత్యున్నతమైన సంతోషం, స్వచ్ఛమైన ఆనందం, మార్పులేని శాంతి. అది అనంతాన్ని శ్వాసించడం. శాశ్వతత్వంలో ఎగరడం, ఇక పరిమితులను సంవేదించకూడదు. ఇక సమయం, స్థానం నుండి తప్పించుకోవడం. అవి ఏవో వీరిని భయపెట్టినట్లు, మనుషులు ఎందుకు ఈ వరాల నుండి పారిపోతారు? అజ్ఞానము ఎంత వింత విషయము. అన్ని బాధలకి మూలం అది. అసలు విషయం, ఏదయితే సంతోషాన్ని ఇస్తుందో దానికి మనుషులని దూరం చేసి, పూర్తిగా పోరాటంతో బాధలతో రూపొందించబడిన ఈ సాధారణ ఉనికి అనే బాధాకరమైన పాఠశాలకు వారిని పంపే ఆ అస్పష్ట అయోమయ స్థితి ఎంత దయనీయమైనది.

CWM 1:10-22

నవంబర్ 28, 1912

బాహ్య జీవితంలో ప్రతిరోజు, ప్రతిక్షణం చేసే పని గంటలతరబడి మనం చేసే ధ్యానానికి, చింతనకు తప్పని సరిగా పూరకం కాదా? మనం ఒక్కొక్కదానికి ఇచ్చే సమయ నిష్పత్తి స్వీయ సాక్షాత్కారాన్ని పొందడానికి చేసే అభ్యాసానికి, స్వీయ సాక్షాత్కారానికి మధ్య మనం చేసే కృషి నిష్పత్తికి ఖచ్చితమైన ఒక బింబం కాదా?

ధ్యానానికి, చింతనకు కలయికే ప్రతిఫలం. అదే వికసించే పువ్వు, ప్రతి రోజు చేసే ఒక కార్యకలాపం పట్టెడ లాంటిది. ప్రకాశం కోసం అన్ని అంశాలు చింతన ద్వారా శుద్ధి చేయబడి, మృదువుగా మారి, పరిపక్వ దశకు చేరుకునేందుకు దానిమీద నుండి మరల మరల తప్పనిసరిగా వెళ్ళవలసి ఉంటుంది. సమగ్ర అభివృద్ధికి బాహ్య కార్యకలాపాలు అవసరం అయ్యేంత వరకు ఈ అంశాలన్నీ ఒకదాని తర్వాత ఒకటిగా అతి తీవ్ర పరీక్షను ఎదుర్కోవలసి ఉంటుంది.. అప్పుడు ఈ కార్యం నిన్ను అభివ్యక్తపరచుటకు ఒక సాధనంగా మారుతుంది. తద్వారా ఇతర చేతనా కేంద్రాలను, ఇదేవిధంగా కొలిమిలో కాల్చి, వాటిని ప్రకాశవంతం చేసి మేల్కొల్పవచ్చు. అందుకని గర్వం, తన పట్ల సంతృప్తి, ఈ రెండూ అన్నింటికంటే నికృష్టమైన అడ్డంకులు. మన చేతనలోని అసంఖ్యాకమైన అంశాలను సాది శుద్ధి పరచుటకు వచ్చిన చిన్న చిన్న అవకాశాలను కూడా వినమ్రతతో స్వీకరించాలి. తద్వారా అంశాలను అహంకారము నుండి విముక్తి పరచడం, అనవసరమైన వాటిని తిరస్కరించడం. స్వార్థాన్ని, వైయక్తిక దృష్టిని మరిచేలా వాటికి బోధపర్చడం వాటిని మృదువుగా మార్చడం, భక్తి, కరుణ, హుందాతనం ఇలా వ్యక్తిలోని రీతులన్నీ వాటికి అలవాటైనప్పుడు అవి ధ్యానములో పాలుపంచుకునేందుకు సిద్ధమై, సర్వ శ్రేష్ఠ సమర్పణతో వాటంతటవే నీతో మమేకమౌతాయి. కావున ఉత్తమ విషయాలు అయినప్పటికీ, అవి సుదీర్ఘముగా నెమ్మదిగా కొనసాగవలనన్న ఆలోచన నాకు ఉన్నది. హఠాత్తుగా వచ్చే పరివర్తనములు సమగ్రంగా మార్పు చెందలేవు. ఆ పరివర్తనములు, వ్యక్తి ధోరణిని మార్చి సూటి మార్గము నందు ప్రవేశపెట్టును అన్న మాట నిజమే గాని వాస్తవానికి లక్ష్య సాధనకు అసంఖ్యాకమైన వేర్వేరు అనుభూతులను పొందకుండా తప్పించుకోవడం జరుగదు.

CWM 1:6-7

ఫిబ్రవరి 21, 1914

ప్రతిరోజు, ప్రతిక్షణం కొత్తగా సమగ్రంగా చేసే నివేదనకు ఒక సందర్భంగా మారాలి. నివేదనము అత్యుత్సాహంతో, ఆత్రుతతో, తడబాటుతో, పని గురించి భ్రమలతో నిండి ఉండకూడదు. కానీ ప్రగాఢముగా, ప్రశాంతముగా, కార్యములలోకి చొచ్చుకుపోయి వాటిని పరివర్తనము గావించ తగినదిగా ఉండవలెను. శాంతితో వున్న ఏకాంత స్థితిలో మా మనసు ఎప్పుడూ నీయందే విశ్రాంతిని పొందు గాక.

ఆ విశుద్ధ శిఖరాగ్ర స్థాయి నుండీ వాస్తవాలను ఉన్నవి వున్నట్లుగా చూచే గ్రహింపుతో అస్థిరమైన వస్తు పరిస్థితుల వెనుకనున్న ఏకైక శాశ్వత సత్యమును దర్శించాలి.

ఓ ప్రభు, నా హృదయం ఏ ఆందోళనలు, ఆవేదనలు లేక నిర్మలంగా, ప్రశాంతంగా, దృఢంగా ఉన్నది. అన్నిటిలోనూ నిన్నే దర్శిస్తూ ఉన్నది. మా బాహ్య కార్యాచరణములు ఏమైననూ, భవిష్యత్తు మా కొరకు తన గర్భములో ఎటువంటి పరిస్థితులను దాచుకొని ఉన్ననూ, నీవే ఉన్నావనియు, నీవే మార్పులేని శాశ్వత సత్యం రూపములో ఉన్నావనియు, నీలోనే మేమందరము నివసించుచున్నాము అని నేను ఎరుగుదును.

పృథ్విపై అంతటా శాంతి నెలకొనుగాక.

*

నవంబర్ 29, 1913

ఎందులకు ఈ రణగొణ ధ్వని, ఎల్లవేళలా ఈ పనికిరాని, ఫలితం లేని ఆందోళనలు ఎందుకు; తుఫాన్‌లో చిక్కుకున్న కీటకాల గుంపు చెల్లాచెదురు అయినట్లుగా, ఈ ఆందోళన సుడిగాలిలో చిక్కుకున్న మనుషులు అల్లకల్లోకం కావడం ఎందుకు? సమస్త శక్తులు, సమస్త ప్రయత్నాలూ ఈ సుడిగాలిలో చిక్కుకుని వ్యర్థంగా మారడం ఎంత విషాదకరం? వారు ఎవరిచేత లేదా దేనిచేత లాగబడుతున్నారో కూడా తెలియక, త్రాడుతో కట్టబడిన తోలుబొమ్మలాగా నృత్యం చేయడం ఎప్పుడు ఆపుతారు? నిశ్శబ్దంగా కూర్చుని, తమ లోపలికి వెళ్లి తమను తాము తెలుసుకోడానికి వారికి సమయం ఎప్పుడు దొరుకుతుంది. వారికి, నీ అమూల్యమైన సంపదలకు నీ అనంతమైన వరాలకు మధ్యలో తెరగా ఉన్న అంతర్గత ద్వారాన్ని ఎప్పుడు తెరుస్తారు?

వారి అజ్ఞానమయ, అస్పష్ట జీవితం, వెర్రి ఆందోళనలతో దుర్వినియోగమౌతున్న జీవితం నాకు ఎంతో దుఃఖ భరితంగా, దయనీయంగా అనిపిస్తుంది. నీ ఉత్కృష్ట కాంతిలోని ఒక్క తేజోపుంజం, నీ ఒకే ఒక్క దివ్య ప్రేమ బిందువు ఈ బాధనంతటినీ ఆనంద సాగరంగా మార్చివేయును కదా!

ఓ ప్రభూ, నా ప్రార్థన నీవైపు సాగుతోంది.. ఎవరు వికసించిన నేత్రాలతో తమలోని జ్వలించే మూల కుహరంలో నిన్ను చింతన చేయగలరో వారు నీ శాంతిని, మార్పులేని ప్రశాంతతతో వచ్చే నిశ్చలమైన, ఎదురులేని బలాన్ని ఎట్టకేలకు తెలుసుకోగలరు.

నీవు అభివ్యక్తమయ్యే సమయం వచ్చినది.

అన్ని వైపుల నుండి ఆనంద సంకీర్తనముల ప్రవాహం వెల్లువలా ఉప్పొంగుచున్నది.

ఈ ప్రగాఢమైన వేళలో నేను భక్తితో నమస్కరిస్తున్నాను.

CWM 1:38

జనవరి 4, 1914

ప్రాపంచికమయిన తలపుల కెరటాలు నిరంతరం ఎదురు చూస్తున్నాయి. స్వల్పమయినదయినా ఏదో ఒక బలహీనత కోసం వేచి ఉన్నాయి. మన నిష్ఠ నుండి క్షణమాత్రం సడలినా, ఏ కొంచెం నిర్లక్ష్యత ఉన్నా అవి లోపలికి దూసుకొని వచ్చి మనలను అన్ని దిక్కుల నుండీ ముట్టడించి, ఎన్నో అసంఖ్యాకమయిన ప్రయత్నాల ఫలితాన్ని తన భారీ ప్రవాహంలో ముంచివేస్తాయి. అపుడా వ్యక్తి ఒక తమస్సులోకి ప్రవేశిస్తాడు. ఆహారము, నిద్రల అవసరాలు పెరుగుతాయి. మేధాశక్తి మేఘావృతమౌతుంది. అంతర దృష్టికి ముసుగు వేయబడుతుంది. ఈ ఉపరితల కార్యాల పట్ల తనకుండే ఆసక్తి స్వల్పమయినప్పటికీ అవి ఆ వ్యక్తిని పూర్తిగా ఆక్రమిస్తాయి. ఈ స్థితి అత్యంత బాధాకరంగా, శ్రమకరంగా ఉంటుంది. ఎందుకంటే ప్రాపంచికమయిన ఆలోచనల కన్నా మరేదీ అంత శ్రమభరితం అనిపించదు. శిథిలమయిన మనసు పంజరంలో చిక్కుకున్న పక్షిలా రెక్కలు చాపలేకపోయినా దూరతీరాలకు ఎగరాలని ఉవ్విళ్ళూరుతుంది.

బహుశా ఈ స్థితికి కూడా నేను చూడలేని, తనదైన ప్రయోజనం ఉండి ఉండవచ్చు. ఏది ఏమయినా నేను పోరాడాను. తల్లి చేతుల్లో పసిపాపలా

తన గురువు పాదాల వద్ద శ్రద్ధా భక్తులు కలిగిన శిష్యునిలా నీ విజయం పట్ల ప్రగాఢమైన విశ్వాసంతో నీ మార్గదర్శనానికి సమర్పణయై, నన్ను నీకు అప్పగించుకుంటాను.

CWM 1:46

ఫిబ్రవరి 13, 1914

గాఢమైన ఏకాగ్రత యొక్క నిశ్చల నీరవతలో నేను నా చైతన్యాన్ని నీ ఉత్కృష్టమయిన చైతన్యంతో ఏకం చేస్తాను. నేను నీవే అని గుర్తిస్తాను. ఓ సార్వభౌమ ప్రభూ, ప్రేమాన్విత గురుదేవా! నీ ధర్మము (న్యాయము) మాకు సుస్పష్టము, గ్రాహ్యతరము అగు గాక! మేము దానితోనే, దాని కొరకే జీవింతము గాక!

నా ఆలోచనలు నీవైపుకు ఎగసి నీతో మమేకమయిన సమయంలో సర్వమూ, ఎంత సుందరమూ, వైభవోపేతమూ, సరళమూ, నిశ్చలముగా ఉంటుందో, ఈ సర్వోన్నతమయిన స్పష్టమయిన దృష్టిని నిరంతరం నిలిపి ఉంచుకోవడం సాధ్యమయిన రోజు నుండి చాలా సులభమైన, దృఢమైన అడుగులతో జీవితం గుండా మనం అన్ని ప్రతిబంధకాలకూ పైన నిస్సంశయంగా నడిచి వెళ్ళగలుగుతాము. ఒకసారి నీ ధర్మం పట్ల ఎరుక కలిగిన తరువాత అన్ని అనుమానాలు, అన్ని సంశయాలు నిలిచిపోతాయన్నది అనుభవం ద్వారా నాకు తెలిసిన విషయం. మానవకర్మకున్న తీవ్రమయిన సాపేక్షతను స్పష్టంగా గ్రహించగలినపుడు, అదే సమయంలో ఆ వ్యక్తి చాలా ఖచ్చితంగా తన శరీరానికి తన క్రియాశీలతకూ ఏది అతి సాపేక్షమో తెలుసుకుంటాడు, అన్ని అవరోధాలు ఒక మాయాజాలంలా అదృశ్యమయి పోతాయి.

ఓ ప్రభూ! మా ప్రయత్నాలన్నీ మునుపటి కన్నా అధికంగా ఈ అద్భుత స్థితి యొక్క నిరంతర నిర్దిష్టత వైపు మొగ్గు చూపుతాయి.

నీ నిశ్చయాత్మక పరమశాంతికి ప్రతి హృదయం మేల్కొను గాక!

ఫిబ్రవరి 15, 1914

ఏకైక సత్య ప్రభూ! నీవే మా వెలుగు, తేజస్సు. మా జీవితపు ప్రాణశక్తి, పరమోన్నత ప్రేమ స్వరూపము. ఓ జగద్రక్షకా! నీ నిత్య సాన్నిధ్యానికి నేను మరింత, మరింతగా పరిపూర్ణంగా జాగృతమయేటట్లు అనుగ్రహించు. నా చర్యలన్నీ నీ ధర్మానికి కట్టుబడి ఉండనీ. నా మనసుకుండే భ్రాంతి నుండి, దాని కల్పనా జగత్తు నుండి నన్ను వేరుచేయి. పరమోత్కృష్టమయిన చైనత్యంతో నా చైతన్యం గుర్తించబడనీ, ఎందుకంటే అది నీవే కనుక.

నా సంకల్పం గమ్యాన్ని చేరే వరకూ నిరంతరం కొనసాగనీ. ఏదయితే మనస్సునూ, సోమరితనాన్ని విదిలించి వేస్తుందో. నాకు ఆ దృఢత్వాన్ని, శక్తినీ, ధైర్యాన్ని ఇవ్వు.

పరిపూర్ణ నిస్సంగత్వంలోని శాంతి, ఏ శాంతి అయితే నీ సమక్షపు అనుభూతి నిస్తుందో, నీ కార్యాన్ని ప్రభావవంతం చేస్తుందో, ఏ శాంతి అయితే దుస్సంకల్పంపై, అస్పష్టతపై సదా విజయవంతమవుతుందో అటువంటి శాంతిని ప్రసాదించు.

ప్రభూ నిన్ను ప్రార్థిస్తున్నాను. నాలోని సర్వస్వం నీతో తాదాత్మ్యత పొందేటట్లు అనుగ్రహించు. నేను కేవలం పరమోత్కృష్టమయిన నిన్ను సిద్ధింప చేసుకోవటానికే జాగృతమయిన ప్రేమ జ్వాలను కాక మరేమీ కాకుండుదను గాక!

ఏప్రిల్ 10, 1914

అకస్మాత్తుగా తెరఛేదింపబడింది. ప్రాచీరేఖ గోచరించింది. స్పష్టంగా చూడక ముందే నా సమస్త ఉనికి మహత్తరమైన కృతజ్ఞతా వెల్లువతో, నీ పాదాల వద్ద మోకరిల్లింది. ఈ లోతైన, సమగ్రమైన ఆనందం కలిగి ఉన్నప్పటికీ, అంతా నిశ్చలంగా ప్రశాంతంగా, ఒక శాశ్వతమైన నిశ్చల నీరవతతో ఉంది.

నాకు ఏ మాత్రం అవధులు లేనట్లుగా అనిపిస్తుంది. నేను శరీరపు ఎరుకను కలిగిలేను. ఏ విధమైన స్పందనలు, అనుభూతులు, ఆలోచనలు లేవు. స్వచ్ఛము, నిర్మలము, ప్రశాంతమయిన ఒక గాఢత, ప్రేమ, వెలుగులతో

చొరబడి, అవ్యక్తమయిన దివ్యానందంతో నిండి అది మాత్రమే నిలిచి ఉంటుంది. కేవలం అది మాత్రమే నేనుగా గోచరిస్తుంది. ఈ నేను అనేది ఎంతో స్వల్పమయినదిగా, మునుపటి నేను ఎంతో స్వార్ధపరంగా, పరిమితంగా అనిపిస్తుంది.

మా జీవిత గమ్యాలకు పరమోత్కృష్ట గురువయిన ఓ ప్రభూ! అవి నీవా? నేనా అనేది నేను చెప్పలేను.

అంతా శక్తి, ధైర్యము, బలము, సంకల్పము, అనంతమయిన మాధుర్యము, ఉపమాన రహితమయిన వాత్సల్యము.

ఈ అంతిమ దినాలలో గతం మరణించి ఒక నవ్య జీవనపు కిరణ పుంజం కింద సమాధి చేయబడి మరింత శక్తివంతంగా, ఈ పుస్తకపు అన్ని పుటలను చదువుతూ నేను చివరిసారిగా వెనుకకు సారించిన చూపు ఖచ్చితంగా మరణాన్ని గూర్చి నన్ను ఒప్పించింది. ఎంతో భారాన్ని తగ్గించింది. ఓ గురుదేవా ఒక పసిపాప వంటి నిరాడంబరతతో, దిగంబరతతో నేను నీ ముందు నిలిచి ఉన్నాను. అయినప్పటికీ నేను గ్రహించే ఒకే ఒక విషయం ఆ నిశ్చలమైన, నిర్మలమైన గాఢత.

ప్రభూ! నువ్వు నా ప్రార్ధనలకి సమాధానమిచ్చావు. నేను కోరుకున్న దానిని ప్రసాదించావు. నాలోని నేను అంతరించి పోయింది. అక్కడ కేవలమొక విధేయమైన ఉపకరణం - నీ అనంతమయిన, శాశ్వతమయిన వెలుగు, అవతరణలకు కేంద్రంగా నీ సేవలో ఉంచబడింది. నీవు నా జీవితాన్ని స్వీకరించి నీదిగా చేసుకున్నావు. నువ్వు నా సంకల్పాన్ని గ్రహించి నీ సంకల్పంతో జత చేసావు. నా ప్రేమను అంగీకరించి నీ ప్రేమతో మమేకం చేశావు. నా తలపులను స్వీకరించి దాని స్థానే పరమ చైతన్యాన్ని ఉంచావు.

అద్భుత అశ్చర్యాలతో ఈ తనువు తన నుదుటిని వంచి మూగగా సమర్పణారాధనలో నీ పాదధూళిని స్పృశిస్తుంది.

నీ నిశ్చలమైన ప్రశాంతత యొక్క రోచిస్సులో నీవు తప్ప మరేమీ ఉండదు.

CWM 1:122-23

జూన్ 23, 1914

ప్రభూ! మేము నీ శక్తిని అనుమానించి, దానికి అనర్హులై మధ్యవర్తులమై, ఆ రూపాంతర శక్తి యొక్క అధిక సామర్థ్యాన్ని తెరమరుగు చేస్తున్నాం. మాకు నమ్మకాన్నివ్వు.

మాకు నిజమయిన విశ్వాసాన్నివ్వు.

CWM 1:182

నవంబరు 17, 1914

అయ్యో, మహోన్నత మాతృమూర్తీ! నీసహనం ఎంతగొప్పది, ప్రతిసారీ దివ్యచేతన సంకల్పం లోపాలను సరిదిద్దడానికి తనను తాను వ్యక్తపరచడానికి ప్రయత్నిస్తుంది, వ్యక్తి తనకు జ్ఞానం ఉంది అనుకొని భ్రాంతి చెందగా ఆ దారితప్పిన అనిశ్చిత పురోగతిని వేగవంతం చేయడానికి, నిశ్చయమైన మార్గాన్ని కనుగొని, తడబడకుండా దానిపై స్థిరంగా నడవడానికి అతనికి శక్తిని ఇవ్వడానికి సహాయపడుతుంది, దాదాపు ఎల్లప్పుడూ అతను అలసిపోతూ హ్రస్వదృష్టిగల సలహాదారునిగా దైవాన్ని దూరంగా నెట్టివేస్తాడు.

అతను అస్పష్టమైన, అస్థిరమైన ప్రేమతో సిద్ధాంతపరంగా నిన్ను ప్రేమించటానికి సిద్ధంగా ఉన్నాడు కానీ అతని గర్వం, మనస్సు నిన్ను విశ్వసించడానికి నిరాకరిస్తుంది, నీ మార్గనిర్దేశం పాటించకుండా తనకు తానుగా సంచరించడానికి ఇష్టపడతాడు.

నీవు ఎప్పటిలాగే నవ్వుతూ నీ అలసిపోని దయతో ప్రత్యుత్తరమిస్తున్నావు : "మనిషిని గర్వించేలా చేసి, తప్పులో పడేసే ఈ మేధోశక్తి, ఒక్కసారి జ్ఞానోదయం పొంది, శుద్ధిచేయబడితే, అతనిని ప్రాపంచిక స్వభావంకంటే ఎంతో ఉన్నతంగా, అన్నింటినీ మించిన అభివ్యక్తీకరణను దాటి ప్రత్యక్ష స్పృహతో ఆ దైవసాంగత్యం వైపు నడిపిస్తుంది. ఈ విభజించే తెలివి, అతన్ని నీనుండి వేరుచేసేలా చేస్తుంది, అతను అధిరోహించాల్సిన ఉన్నత స్థానాలను వేగంగా పరిగణించేలా, విశ్వ అపారత సంక్లిష్టతలతో అతని పురోగతిని బంధించి ఆలస్యం చేయనివ్వకుండా చేస్తుంది, అయితే అది ఈ వేగవంతమైన ఆరోహణను ఏ మాత్రం ప్రభావితం చేయలేదు.

ఓ దివ్యమాతా, ఎల్లప్పుడూ నీమాట ఓదార్పునిస్తుంది, ఆశీర్వదిస్తుంది, ప్రశాంతంగా ప్రకాశవంతంగా ఉంటుంది, ఉదారమైన హస్తం దాగివున్న అనంతమైన జ్ఞానాన్ని అందరికి తెలిసేలా చేస్తుంది. నీ పరిపూర్ణ చింతనా వైభవం ఎంత ప్రశాంతంగా, ఉదాత్తంగా, స్వచ్ఛంగా ఉంది!

CWM 1:276

నవంబరు 20, 1914

ఓ పరమాత్మ!, నేను ఎల్లప్పుడూ ఖాళీ కాగితంలా మీముందు ఉండాలి, తద్వారా మీ సంకల్పం ఎటువంటి ఇబ్బంది లేకుండా వ్రాయబడుతుంది.

సాపేక్షిక ప్రపంచంలో నీ పరిపూర్ణ అభివ్యక్తీకరణను అనుమతించే శాశ్వత పునర్నిర్మాణం ఈపనికి ఆటంకం కలిగించకుండా గత అనుభవాల జ్ఞాపకాలను కొన్నిసార్లు ఆలోచన నుండి తీసివేయాలి.


ఒకవిలువైన అనుభవ ఫలితాన్ని కోల్పోవటానికి, విస్తారమైన ఉన్నతమైన స్పృహను వదులుకోవడానికి, తిరిగి అధోస్థితికి పడిపోవడానికి భయపడి, తరచుగా ఒకేవిషయంపై అంటిపెట్టుకుని ఉంటాడు.

ఇంకా, అదివివరో అని అతను దేనికి భయపడాలి? తన పరిమిత కారణాలకి ఈ మార్గం పూర్తిగా అర్థం కానప్పటికీ, అదిఏమైనప్పటికీ, తనకోసం గుర్తించిన మార్గంలో అతని ఆనందకరమైన ఆత్మతో ప్రకాశవంతమైన కనుబొమ్మలతో నడవలేడా?

ఓ దేవా! పాతఆలోచనా ఏర్పాటులను విచ్ఛిన్నం చేయి, గత అనుభవాలను రద్దుచేయి, నీకు అవసరమని భావిస్తే చేతన సంశ్లేషణను రద్దు చేయి, తద్వారా నీ పని మరింత మెరుగ్గా నెరవేరుతుంది, భూమిపై నీ సేవ పరిపూర్ణంఅవుతుంది.

CWM 1:274





ఏప్రిల్ 3,1914

నేను ఒక కొంగ్రొత్త జీవితంలోకి మరల జన్మిస్తున్నట్లు, గతానికి సంబంధించిన అన్ని అలవాట్లు, పద్ధతులు ఇంకేమాత్రం ఉపయోగ పడవన్నట్లుగా కనిపిస్తున్నది. నేను తలంచిన దానికి ఫలితాలన్నీ కలిపి, ఒక ముందస్తు సంసిద్ధతగా నాకు తోస్తుంది. ఇంకా నేనేమీ చేయలేదన్నట్లు ఆధ్యాత్మిక జీవితాన్ని జీవించలేదనట్లు నాకు భావన కల్గుతుంది. నాకేమీ తెలియదని, దేనినీ సూత్రీకరించే సమర్థత నాకు లేనట్లు, అసలైన అనుభవాలు ఆరంభంకావాల్సి ఉన్నట్లు నాకు ద్యోతకమౌతుంది. నా గతాన్ని మొత్తాన్ని దానిలోని దోషాల్ని, అలాగే దానిలోని విజయాల్ని అన్నీ ఖాళీచేసినట్లు, అంతా నిర్మూలనమైనట్లుగా ఉంది. ఇంకా తన జీవితాన్ని జీవించాల్సి ఉన్న ఒక నవజాత శిశువుకు మల్లే, అతనికంటూ ఏ పూర్వపు కర్మ లేనట్లు, ఏ పూర్వ అనుభవం నుండీ నేర్చుకొనే అవసరమే లేనట్లుగా ఉంది. ఒకవేళ పొరబాటు ఏమన్నా వుంటే అది ఇహ సరై పోగలదు.

నా పూర్వపు జ్ఞానం, నిర్ణయం, ఆఖరికి వ్యర్థమైన యోచన కూడా లేకుండా ఖాళీ అయిపోయి నేను దేనినీ తెలుసుకొనడానికీ, లేదా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించనట్లు, అబోధమైన, అమాయకమైన పిల్లవాడిగానే పూర్తిగా నన్ను

నేను సమ్మతించుకున్నట్లు ఏదో కొత్త సంభావ్యత నాముందు తెరుచుకుంటుంది. నాకు తెలుసు. నన్ను నేను పూర్తిగా వదిలివేసుకుని, నేనొక ఖాళీ పుటనవ్వాలి. దానిపై ఓ ప్రభూ! నీ ఆలోచన, నీ సంకల్పం, వక్రీకరణ ప్రమాదం లేకుండా స్వేచ్ఛగా లిఖించబడాలి.

ఒక బ్రహ్మాండమైన కృతజ్ఞత నా హృదయంలో ఉప్పొంగి వస్తుంది. నేను అన్వేషించుకుంటూ వచ్చిన ప్రవేశ ద్వారానికి నేను చేరానని అనిపిస్తుంది.

ఓ ప్రభూ! నేను తగినంత శుద్ధమై, అవైయక్తికమై, నీ దివ్యప్రేమతో మూర్తీభవింపబడి, దానిని ఖచ్చితంగా దాటగలగాలి.


ఏ ప్రతిబంధకం, ఏ అంధకారం లేకుండా నేను నీకు చెందేలా నన్ను అనుగ్రహించు.

CWM 1:116

శ్రీమాత శ్రీ అరవిందులను పాండిచ్చేరిలో **1914** మార్చి **29**వ తేదీన మొదటిసారి కలిశారు. ఆమె మార్చి **30**వ తేదీన తన డైరీలో ఇలా వ్రాసుకున్నారు :

"వేలాది జీవులు గాఢమైన అజ్ఞానంలో మునిగి ఉన్నారు. ఇది ఏమంత పెద్ద విషయం కాదు. మేము నిన్న దర్శించిన వ్యక్తి భూమిపై ఉన్నాడు. ఈ అంధకారంతా ప్రకాశంలోకి రూపాంతరీకరించబడే రోజు వస్తుందని ఆయన సన్నిధే నిరూపిస్తుంది. నిజంగా నీ రాజ్యం ఈ భూమిపై స్థాపించ బడుతుంది."





అదిగో, మేం దేవుని ముఖాన్ని చూచాం,
మా జీవితం దివ్యత్వంతో తెరుచుకుంది.

సావిత్రి, పుట. 719

నిత్య జీవితంలో ఆధ్యాత్మికతా సాధన

నీ స్వీయ ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించుకో

నీ ఆలోచనలను నియంత్రిస్తూ వాటిని పూర్తిగా సాధనవైపు మరలుస్తూ,

నీ చర్యలను నియంత్రిస్తూ, అన్ని వాంఛలను, అన్ని వ్యర్థమైన, బాహ్య సాధారణ కార్యకలాపాలను నిలిపివేసి పూర్తిగా సాధనవైపు మరల్చుతూ మరింత తీవ్రమైన ఆంతరిక జీవనాన్ని గడుపుతూ, సాధారణ విషయాలు, ఆలోచనలు, ప్రతి చర్యలు, చర్యల నుండి నిన్ను నీవు వేరే చేయుట ద్వారా నీవు నీ వాతావరణాన్ని సృష్టించుకోవచ్చు. అప్పుడు నీ చుట్టూ ఒక విధమైన వాతావరణాన్ని ఏర్పరచుకోవచ్చు.

ఉదాహరణకు ఏదైనా అసాధారణ విషయంగురించి చదువుట, మాట్లాడుట, ఏదైనా చేయుట కాకుండా నీవు మార్గాన్ని అనుసరించుటలో నీకు సహకరించే దానిని మాత్రమే చదివినపుడు, దైవ జ్ఞానం వైపు నిన్ను తీసుకు వెళ్ళే దానికి అనుగుణంగా నీవు వ్యహరించినపుడు మాత్రమే, బాహ్య విషయాలవైపు మరల్చే అన్ని వాంఛలను, ఆవేశాలను నీలోనే నిర్మూలించినపుడు, నీ మానసికాన్ని నీవు ప్రశాంత పరచి నీ ప్రాణిక పురుషుడిని శాంతింపజేసినపుడు, వెలుపలి నుండి వచ్చే సూచనలను పట్టించుకోకుండా, నీ చుట్టు ప్రక్కల గల వ్యక్తుల చర్యల నుండి నిరోధకంగా నిలిచినపుడు నీవు దేనికీ స్పందించని ఒక ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించ గలవు. అది పరిస్థితులపై లేదా నీవు జీవించే వారితో లేదా నీవు జీవించే స్థితిపై ఇక ఆధారపడదు. దానికి కారణం నీవు స్వంత ఆధ్యాత్మిక వాతావరణంతో చుట్టి వేయబడ్డావు. ఒకరి దృష్టిని పూర్తిగా ఆధ్యాత్మక జీవితం వైపు మరల్చుట ద్వారా ఆధ్యాత్మిక జీవితంలో సహాయపడేవాటిని మాత్రమే చదువుట ద్వారా ఆధ్యాత్మిక జీవిత వైపు తీసుకువెళ్ళే దానిని మాత్రమే ఆచరించుట ద్వారా నీవు దానిని పొందగలవు. అప్పుడు నీవు నీ స్వంత వాతవరణాన్ని సృష్టించగలవు. కానీ నీవు సహజంగానే అన్ని ద్వారాలను తెరచి నీకు ప్రజలు చెప్పేవాటిని వింటూ, ఈ సలహాలను, ఆ ప్రేరణలను అనుసరిస్తూ, బాహ్య విషయాల పట్ల కోరికలతో నిండియున్నప్పుడు నీవు నీలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించుకోలేవు. మిగతా అందరికీ ఉన్న సాధారణ వాతావరణమే నీకూ ఉంటుంది.

(CWM 6:356-57)

అనంతత్వం మనకు అందుబాటులోనే ఉన్నది. దానిలో మునిగిపోండి

నీవు దేనిపట్లనయినా విసుగు చెందితే, నీకు ఏదైనా బాధకరంగా లేదా అప్రియంగా ఉంటే నీవు ఆ సమయంలో శాశ్వతత్వం గురించి, అంతరిక్ష విశాలత్వం గురించి ఆలోచించడం ప్రారంభిస్తే, సమస్తం ఇంతకు మునుపే జరిగిందని, తరువాత కూడా జరుగుతుందని నీవు ఆలోచిస్తున్నట్లయితే, శాశ్వతత్వంలో ఈ నిమిషం వాస్తవానికి ఒక కదలాడే శ్వాసమాత్రమే. సమయ శాశ్వతత్వంలో దేని కారణంగానైనా చింతించడం చాలా తెలివి తక్కువగా అనిపిస్తుంది. ప్రతి ఒక్కరికీ దానిని గ్రహించడానికి సమయం కూడా ఉండదు. దానికి ప్రదేశం, ప్రాముఖ్యత ఉండదు. కారణమేమిటంటే శాశ్వతత్వంలో సెకను అన్నది వాస్తవానికి ఏమిటి?

ఎవరైనా దానిని గ్రహించగలిగితే... దానిని ఎలా ఉంచాలి?

... ఊహించండి. వ్యక్తి ఎంతగా చిన్నగా ఉన్నాడో చూడండి. ఈ చిన్ని భూమిపై అతను ఎక్కడ ఉన్నాడో, చైతన్యంలోని స్వల్పమైన సెకను ఆ క్షణానికి నాకు ఇబ్బంది కలుగ జేస్తోంది లేదా నీకు అప్రియంగా ఉంది అంటే... నీ ఉనికిలో అది ఒక సెకను మాత్రమే. నీకు మునుపే చాలా విషయాలు ఉన్నాయి. తరువాత కూడా ఎన్నో విషయాలు ఉంటాయి. ఇపుడు నిన్ను ప్రభావితం చేసేది బహుశా పది సంవత్సరాలలో నీవు మరిచిపోవచ్చు, నీవు దానిని గుర్తించుకుంటే, 'దానికి నేను అంత ప్రాధాన్యత ఎలా ఇచ్చాను? అని అనుకోవచ్చు. నీవు మొదట దానిని గ్రహించగలిగితే శాశ్వతత్వంలో సెకనుగా ఉన్న చిట్టివ్యక్తిని గ్రహించు. సెకను కూడా కాదు, నీకు తెలుసా, అవ్యక్తమైనది, శాశ్వతత్వంలో సెకనులో భాగం. ప్రపంచం మొత్తం దానికంటే ముందే వెల్లడైంది. ఇంకా వెల్లడవుతుంది, నిరవధికంగా... ముందు, తరువాత... అప్పుడు ఒక్కసారిగా నీకు జరిగిన దానిపట్ల నీవు కల్పించుకున్న ప్రాధాన్యత చాలా తెలివితక్కువగా నీకనిపిస్తుంది. యదార్థంగానే నీవు అనుభూతి చెందుతావు. నీ జీవితంలో ఒకరిపట్ల, నీకేమి జరుగుతుందో అనేదాని పట్ల, ఏదైనా ప్రాధాన్యత ఇవ్వడం ఎంత అర్థరహితమో నీకర్థమవుతుంది.

మూడు నిమిషాల వ్యవధిలో నీవు దానిని సరిగా చేసినట్లయితే అప్రియమైనదంతా తుడిచిపెట్టుకు పోతుంది. చాలా బాధకరమైన ఇబ్బందికూడా మాయమవుతుంది. ఈ విధమైన ఏకాగ్రత, అనంతత్వం,

శాశ్వతత్వంలో నిన్ను నిలుపుటద్వారానే మొత్తమంతా మారిపోతుంది. వారు దానినుండి పునీతులౌతారు. అన్ని బంధాల నుండి బయటపడతారు. ప్రతీ దానిపట్ల తీవ్ర దుఃఖాలు కూడా తొలగిపోతాయి. ఈ విధంగా సరైన మార్గంలో దానిని ఎలా చేయాలో తెలుసుకుంటే స్వల్పమైన నీ అహం నుండి బయటపడవేస్తుంది.

(CWM 6:345-46)

విశాలత్వ భావనలో నీవు మునిగిపోవద్దు. దానిలో స్నానమాడు. ఆనందంగా, ప్రశాంతంగా, నీ వ్యక్తిగత చైతన్యంలోని నాలుగు గోడల మధ్య తప్పించుకోనంతగా పరిమితమైపోతే అది వాస్తవానికి విచారకరంగా, తీవ్రంగా ఉంటుంది. కానీ అనంతత్వం మనకు అందుబాటులోనే ఉంది. జరుగువలసింది మనం దానిలోకి లాగబడటమే.

(CWM 17:188)

మరొక విధమైన ధ్యానం

ధ్యానం చేయడం చాలాకష్టం. చాలా రకాల ధ్యానాలు ఉన్నాయి... నీవు ఒక ఆలోచన పట్టుకుని ఒక ఫలితం పొందడానికే దానిని అనుసరించాలి. ఇది ఒక క్రియాశీలక ధ్యానం. ఒక సమస్యను పరిష్కరించాలనుకునే లేదా వ్రాయాలనుకునే వ్యక్తులు తాము ధ్యానం చేస్తున్నామని తెలియకుండానే ఈ మార్గంలో ధ్యానం చేస్తారు. ఇతరులు కూర్చుని ఒక ఆలోచనను అనుసరించకుండా ఏదో ఒక దానిపై దృష్టి కేంద్రీకరించడానికి ప్రయత్నిస్తారు. ఏకాగ్రతా శక్తి తీవ్రతరం చేయడానికి ఒక బిందువుపై సులభంగా దృష్టి కేంద్రీకరించు. ఒక బిందువుపై దృష్టి కేంద్రీకరించినపుడు సాధారణంగా జరిగే దానినే ఇది అందిస్తుంది. మానసికంగా, ప్రాణికంగా లేదా భౌతికంగా ఒక బిందువుపై ఏకాగ్రతను తగినంతగా సారించుటకు నీ సామర్థ్యం అంతటినీ ఏకం చేయుటలో నీవు సఫలమైతే ఒక నిర్ణీత క్షణంలో నీవు దాని నుండి మరొక చైతన్యతలంలోకి ప్రవేశిస్తావు. ఇతరులు అటువంటి వాస్తవిక నిశ్శబ్ద ప్రశాంతతను చేరుకొనుటకు తమ శిరస్సు నుండి అన్ని కదలికలు, ఆలోచనలు, భయాలు, ప్రతిక్రియల నుండి బయట పడుటకు ఇంకా ప్రయత్నిస్తూనే ఉంటారు. ఇది చాలా కష్టం. పాతికేళ్ళుగా ప్రయత్నిస్తూ, విజయం సాధించని వ్యక్తులు కూడా ఉన్నారు. వారికి ఇది ఎద్దు కొమ్ములతో

ఆడుకున్నట్లుగా ఉంటుంది.

మరొకవిధమైన ధ్యానం కలదు. దీనిలో పూర్తిగా యాంత్రికమైన ఆలోచనలు ఉన్నప్పుడు అన్ని ఆలోచనలను ఆపుటకు ప్రయత్నించకుండా నిశ్శబ్దంగా ఉండాలి. వీటిని ఆపుటకు నీవు ప్రయత్నిస్తే నీకు చాలా సంవత్సరాల సమయం పడుతుంది. అంతే కాకుండా ఫలితమెలా ఉంటుందో కూడా నీకు పూర్తిగా తెలియదు. దానికంటే, నీ చైతన్యమంతటినీ ఏకీకృతం చేసి సాధ్యమైనంత వరకు నిశ్శబ్దంగా, ప్రశాంతంగా ఉండు.

బాహ్య విషయాలపై నీకు ఎటువంటి ఆసక్తి లేకపోయినప్పటికీ, వాటిని పూర్తిగా విడిచిపెట్టు. ఒక్కసారిగా నీవు ఆకాంక్ష జ్వాలను ప్రకాశవంతం జేయి, ఆ జ్వాల పైపైకి పెరిగేందుకు నీవైపు వస్తున్న అన్నటినీ దానిలోకి త్రోసివేయి. నీవు దానిని నిన్నుగా గమనించు. నీవు నీ చైతన్యం, ఆకాంక్షల ఉన్నత స్థాయి వరకు చేరుకుని, దేని గురించి ఆలోచించకుండా... సాధారణంగా పైకి పైపైకి ఎగసిపడుతున్న ఆకాంక్షను మరింత తీవ్రతరం చేస్తూ మరింతగా స్థిరమైన ఏకాగ్రత నిలపాలి. అపుడు జరిగేది అత్యుత్తమమైనదిగా జరుగుతుందని నేను హామీ ఇవ్వగలను. అంటే నీవు ఇలా చేసినపుడు నీవు అధికమైన సంభావ్యతలను పొందవచ్చు. ఈ సంభావ్యతలు వ్యక్తి నుండీ వ్యక్తికి విభిన్నంగా ఉండవచ్చు. అయితే ఆందోళనలను నిశ్శబ్దంగా ఉంచటానికి ప్రయత్నించుట ఆకారాల వెనుక పరుగెత్తుట, సమాధానమిచ్చే శక్తులను పిలుచుట నా సమాధానాల కోసం నిరీక్షించుట వంటి అన్ని ఇబ్బందులు అవాస్తవమైన ఆవిరిలా అదృశ్యమైపోతాయి. ఈ జ్వాలలో చైతన్యంతో జీవించగలగడంలో నీవు విజయం సాధిస్తే, ఎగసిపడుతున్న ఆకాంక్షలో తక్షణమే ఫలితం నీకు కలుగకపోయినా, కొంత సమయం తర్వాత ఏదైనా జరుగుతుంది.

(CWM 4:104-05)

వ్యక్తిలో నుండి చీకటి మూలకాల్ని బయటకు తీసివేయడం

ప్ర : తల్లీ, మీరు పోయినసారి మనలో ఒక చీకటి మూలకం ఉంటుందని చెప్పారు. ఇది మన చేత పిచ్చి పనులు చేయిస్తుంది. ఒక వ్యక్తి సచేతనుడై ఉండగా, అది బయట పడాలి. దానిని ఎలా బయటకు తీయాలి?

జ : నీవే మొదటగా ప్రత్యేకంగా దాని పట్ల స్పృహలో ఉండాలి. నీలో ఒక చీకటి మూలకాన్ని నీ ముందు ఉంచు. నీ చేతనతో జోడించే ఈ పని అంతరంగ మనస్తత్వ శాస్త్రం పని. నీకు తెలుసా! ఒక వ్యక్తి తనను తాను చాలా శ్రద్ధగా అర్ధం చేసుకున్నపుడు దీనిని గమనించవచ్చు. ఉదాహరణకు నిన్ను నీవు గమనిస్తే, ఒక రోజు నీవు చాలా ఉదారంగా ఉన్నావని నీవు చూస్తావు. ఇది అర్ధం చేసుకోవడం సులభం. భావాలలో అనుభూతులలో ఆలోచనలలో, భౌతిక విషయాలలో ఔదార్యం. అంటే నీవు ఇతరుల తప్పులను, వారి ఆలోచనలను, బలహీతను, చెడు కదలికలను కూడా అర్ధం చేసుకుంటావు. ఇవన్నీ నీవే చూస్తావు. ఎందుకంటే నీవు మంచితనంతో నిండి వున్నావు. నీవే చెప్పుకొంటావు. "అవును. ప్రతి ఒక్కరూ తనకు చేయగలిగినంత చక్కగా చేస్తారు" అని.

మరొక రోజు లేదా మరుసటి నిమిషంలోనే నీలో నీవు ఒక రకమైన స్థిర శుష్కతను, చేదుదనాన్ని తీవ్ర స్థాయిలో తీర్పు చెప్పడం, భరించేంత వరకు కోపం పెంచుకోవడం, దుర్మార్గుడిని శిక్షించాలని కోరుకోవడం. దాదాపు ప్రతీకారం తీర్చుకునే ఆలోచనలు కలిగి ఉంటావు. పైన మాట్లాడిన వాటికి వ్యతిరేకంగా ఉంటావు. ఒకరోజు ఎవరైనా నీకు హాని చేస్తే నీవు ఇలా అంటావు. 'ఫర్వాలేదు. అతనికి తెలీదు' లేదా 'అతను వేరేలా చేయలేడు' లేదా 'అది అతని స్వభావం' లేదా 'అతను అర్ధం చేసుకోలేకపోయాడు' అని. మరుసటి రోజు లేక ఒక గంట తర్వాత నీవు ఇలా అంటావు 'అతను శిక్షించబడాలి. దానికి అతను మూల్యం చెల్లించాలి. అతను తప్పు చేశాడని అతనే అనుకోవాలి. ఒక రకమైన ఆవేశంతో, నేను మీ వస్తువులను తీసుకోవాలనుకుంటున్నాను. మీ కోసం వీటిని ఉంచాలనుకుంటున్నాను. నీకు అసూయ, సంకుచితత్వం వంటి అన్ని గుణాలు ఉన్నాయి. అది నీకు తెలుస్తుంది. ఇతర భావనకు ఇది చాలా విరుద్ధం.

ఇది చీకటి పార్శ్వం కాబట్టి, దానిని చూసిన క్షణంలో, ఎవరైనా దానిని చూసి 'అది నేనే' అని చెప్పకపోతే 'కాదు, ఇది నా నీడ, దీనిని నా నుండి నేను బయటకు విసిరివేయాలి' అని చెప్పినట్లయితే, అతడు దానిపై ఇంకో భాగానికి చెందిన కాంతి ఉంచాడు. ఒక వ్యక్తి వాటిని ముఖాముఖి తీసుకురావడానికి ప్రయత్నిస్తాడు. మరొక వ్యక్తి జ్ఞాన కాంతితో ప్రయత్నిస్తే, ఒకర్ని ఒప్పించడానికి

అంతగా ప్రయత్నించడు. ఎందుకంటే అది చాలా కష్టం. కానీ అతడు దానిని నిశ్శబ్దంగా ఉండమని బలవంతం చేస్తాడు... ముందుగా మరింత దూరంగా నిలబడాలి. అప్పుడు విసిరికొట్టాలి. తద్వారా దానిపై ఒక గొప్ప ప్రకాశాన్ని ఉంచితే అది ఇకపై తిరిగిరాదు. మార్చడం సాధ్యమయ్యే సందర్భాలు ఉన్నాయి. కానీ ఇది చాలా అరుదు. ఒకతీక్షణమైన ప్రకాశాన్ని ఉంచే సందర్భాలు ఉన్నాయి. అది దానిని రూపాంతరం చేస్తుంది. అంతేకాక అది నీకు సంబంధించిన సత్యంగా మారుస్తుంది. కానీ ఇది అరుదైన విషయం. మామూలుగా దానిలోని గొప్పతనం ఏమిటంటే 'లేదు ఇది నేను కాదు. నాకు ఇది వద్దు. ఈ యుద్ధంతో నాకు సంబంధం లేదు. ఇది నా వ్యక్తిత్వానికి విరుద్ధం' కాబట్టి అని పట్టుబట్టడం, తరిమివేయడం ద్వారా చివరకు దాని నుండి తనను తాను వేరు చేసుకుంటాడు.

అయితే తనలోని సంఘర్షణను చూసేందుకు స్పష్టత, నిజాయితీ ఉండాలి. సాధారణంగా ఈ విషయాలపై ఎవరూ దృష్టి పెట్టరు. ఒక తీవ్రస్థాయి నుండి మరో తీవ్రస్థాయికి పోతాడు. దాన్ని చాలా తేలిగ్గా ఉండే పదాలలో చెప్పాలంటే, ఒక రోజు నేను మంచివాడిని, మరొక రోజు నేను చెడ్డవాడిని. ఇలా చాలా సహజంగా అనిపిస్తుంది. లేదా కొన్నిసార్లు ఒక గంట పాటు మీరు మంచివారు, తర్వాతి గంటలో మీరు చెడ్డవారు, లేకుంటే కొన్నిసార్లు ఒకరి ద్వారా మీకు రోజంతా బాగుంటుంది. అకస్మాత్తుగా ఒకరు చెడ్డగా మారుతారు. ఒక నిమిషం పాటు చాలా చెడ్డగా ఉంటారు. ఒకడు మంచిగా ఉన్నందుకు మరింత చెడ్డవారు అవుతారు. దానిని అతడు గమనించడు. ఆలోచనలు మనస్సును దాటుతాయి. హింసాత్మకమైనవి, చెడ్డవి, ద్వేష పూరితమైన ఆలోచలు, మొదలైన వాటిని సాధారణంగా ఎవరూ పట్టించుకోరు. అయితే తప్పక దీనిపై దృష్టి పెట్టాలి. అది అమలైన వెంటనే మీరు దానిని చాలా గట్టిగా పట్టుకోవాలి (అమ్మ ఒక కదలిక చేస్తారు). ఆపై దానిని వెలుగులోకంటూ ఎత్తిపట్టుకొని 'వద్దు నాకు వద్దు, నువ్వు వద్దు, నాకు దీనితో ఎలాంటి సంబంధం లేదు. నువ్వు ఇక్కడి నుండి వెళ్ళిపోతున్నావు. ఇక తిరిగి రావు" (నిశ్శబ్దం తరువాత) ఇది ఒక విధమైనది. ఈ అనుభవాన్ని ఒక మనిషి నిత్యం అంటే... చాలా మట్టుకు ఔత్సాహికమైన కదలికతో, గొప్ప ఆకాంక్షను కల్గిఉన్నప్పుడు, ఉన్నట్లుండి దివ్య లక్ష్యం పట్ల సచేతనుడైనప్పుడు, దైవం వైపు ప్రేరణ కల్గినప్పుడు, దైవ కార్యంలో భాగాన్ని పంచుకొనే కోరిక

కల్గినప్పుడు, హర్షోల్లాసంతో గొప్ప శక్తితో తనకు తాను బయటకు వస్తాడు. మళ్ళీ కొన్ని గంటల్లో అతడు చిన్నచిన్న విషయాలకు దుఃఖపడతాడు. చాలా స్వల్పమైన వాటికి అతుక్కుపోతాడు. చాలా హీనమైన, సంకుచితమైన స్వార్థంలో మునిగిపోతాడు. అవివేకమైన కోరికతోఉండిపోతాడు. ఇక తక్కినవన్నీ ఉనికిలో లేకుండా ఆవిరైపోతాయి. ఇలా వ్యతిరేకమైన వాటికి అలవాటు పడ్డాడు. ఇవన్నీ ఇరుగు పొరుగు వారిలా ఎందుకు సౌకర్యంగా జీవిస్తున్నాయో అన్నదానిపైన ధ్యాస పెట్టడు. అందుకే తాను వాటిని కనిపెట్టి అవి తన చేతనలో కలగాపులగం అవ్వకుండా ఆపాలి. చీకటి నుండి వెలుగును వేరు చేసే బిందువును నిర్ణయించాలి. ఆ తరువాత ఆ నీడ నుండి విముక్తుడవ్వగలడు.

(CWM 6:262-64)

హడావిడిలో ఉన్నప్పుడు ఒక మనిషి ఉత్తమమైనది, సరైనది ఎలా చేయాలి?

ప్రశ్న : పని చేసినపుడు ఉత్తమంగా చేయాలనుకున్నపుడు, మనకు చాలా సమయం అవసరం. కానీ సాధారణంగా మాకు ఎక్కువ సమయం ఉండదు. మేము హడావిడిలో ఉన్నాము. అలా హడావుడిలో ఉత్తమమైనది, సరైనది ఎలా చేయాలి?

జవాబు : ఇది చాలా ఆసక్తికరమైన అంశం. నేను దాని గురించి ఒక రోజు మీతో వివరంగా మాట్లాడాలనుకున్నాను. సాధారణంగా మనుషులు తొందరలో ఉన్నప్పుడు వారు చేయాల్సిన పనిని పూర్తిగా చేయరు. లేదా తప్పు చేస్తారు. సరే మూడో మార్గం ఉంది. అది వ్యక్తిలోని ఏకాగ్రతను తీవ్రతరం చేయడం. మీరు అలా చేస్తే మీరు చాలా తక్కువ సమయంలోనే మీకు కావలసిన సమయాన్ని పొందవచ్చు. మనం ఒక సాధారణమైన ఉదాహరణ తీసుకుందాం. మీరు స్నానం మరియు దుస్తులు ధరించడానికి అవసరమైన సమయం వ్యక్తుల విషయంలో మారుతుంది కదా? కానీ సమయం వృధా చేయకుండా, తొందరపడకుండా ప్రతిదీ చేయడానికి అరగంట అవసరం అవుతుంది. అప్పుడు మీరు హడావుడిగా ఉంటే, రెండు విషయాలలో ఒకటి జరుగుతుంది. మీరు మంచిగా స్నానం చేయలేరు. దుస్తులు సరిగ్గా ధరించరు. కానీ మరొక మార్గం ఉంది.

అది దృష్టిని ఏకాగ్ర పరచడం, శక్తిని కేంద్రీకరించడం, చేసే ఆ పనిని గూర్చి

ఆలోచించడం, ఇతరమైనవి కావు. ఆ చేసేది తీవ్రస్థితిలో కాకుండా చేయాల్సింది మాత్రమే, ఖచ్చితమైన రీతిలో చేయడం, నిశ్చయంగా ఇది అనుభవించి చెబుతున్నది. నీవు అరగంటలో చేసే పనిని 15 నిమిషాల్లోనే పూర్తి చేయగలవు. బాగా చేయగలవు. అప్పుడున్న సమయాన్ని బట్టి, ఏదీ మరచిపోకుండా, దేనిని మిగల్చకుండా చాలా తేలిగ్గా తీక్షణ ఏకాగ్రత ద్వారా చేయగలవు.

ఓహ్ 'ఈ పని బాగా చేయాలంటే చాలా సమయం కావాలి" అనే వారికి ఇది ఉత్తమమైన జవాబు. అది వాళ్ళు అనుకొనేది. నిజం కాదు. నీవు చేసేది అది చదవడం,ఆడటం, పనిచేయడం, ఏదైనా కానీ దానికి ఒకే ఒక్క పరిష్కారం : అది ఏకాగ్రత, శ్రద్ధా శక్తిని పెంచుకోవడం, దానిని నీవు సాధించినప్పుడు ఇక నీకు అలసట ఉండదు. సహజంగా ప్రారంభంలో ఆత్రుత తగ్గిపోతుంది. నిన్ను విసుగుకు గురిచేసి నీవు విచ్ఛిన్నమై, అన్ని రకాల విషయాల చేత మింగబడి, నీవు చేసే దానిపై దృష్టి పెట్టనివ్వని దానిని పట్టించుకోని సమయం నీ కొస్తుంది. ఒక వ్యక్తి ఏకాగ్రత శక్తి ద్వారా మామూలు కంటే ఎంతో గొప్పగా, త్వరగా తన పనులు చేసుకోగలడు.

ఈ విధంగా పనిని నీ అభివృద్ధికి సాధనంగా ఉపయోగించుకోగలవు. లేకపోతే 'అనాసక్తంగా' పని చేయబడాలనే ఒక అస్పష్టమైన భావనలో పడిపోతావు. ఇక్కడ పెద్ద ప్రమాదం ఉంది. ఎందుకంటే అనాసక్తత లేదా సమాన బుద్ధితో చేయడం అన్నదానిలో తికమక పడతాడు మనిషి.

CWM 4:137-38

ఖాళీ సమయాన్ని సద్వినియోగం చెయ్యటం

జీవితంలో చాలా భాగం ఖాళీగానే గడిచిపోతుంది. దీన్ని ఎవ్వరూ కాదనలేరు. అట్లా కొన్ని క్షణాలు కావచ్చు, మరింత సమయం కావచ్చు. దాన్ని మనం పట్టించుకోము. లేదా ఏదో అనవసరమైన వ్యాపకం పెట్టుకుని కాలక్షేపం చేస్తాము. ఇది సహజమే. చిన్నా పెద్దా ఎవరైతేనేం, విసుగూ విరామం లేకుండా ఏదో విధంగా కాలక్షేపం చేస్తారు. కాలక్షేపమే వారి లక్ష్యం! ఇదొక తెలివితక్కువ తనం!

మంచిదే దానికంటే ఉత్తమమార్గం ఉంది. అది స్మరించడం.

ఇంతకంటే ఉత్తమమైన మార్గం మరొకటి ఉన్నది. నీ దగ్గర సమయం

ఉన్నప్పుడు అది ఒక గంట కావచ్చు, కొన్ని నిమిషాలు కావచ్చు. అప్పుడు నీకు నీవు ఇలా చెప్పుకో 'ఎట్టకేలకు నేను ఏకాగ్రంగా, నన్ను నేను ఉద్దేశ్యానికి అనుగుణంగా జీవించడానికి, శాశ్వతమైనది, నిజమైనదాని కోసం నన్ను నేను సమర్పించుకోవడానికి నాకు ఖాళీ దొరికింది". ఇలా చేయడానికి నీవు శ్రద్ధ తీసుకొంటే బయట పరిస్థితుల చేత బాధింపబడవు. నీవు వేగంగా మార్గంలో ముందుకు పోతున్నావని చాలా తొందరగానే గుర్తించగలవు.

అనవసర పనులలో కాలం గడపటం, చేతనను మందగించే రచనలను చదవటం, కూడని పనులు, ఇంతకంటే ఇంకా నిష్ప్రయోజన కరమైన పనులు ఎన్నో ఉన్నాయి. నేను వాటిని ఇప్పుడు ప్రస్తావించటం లేదు. జీవితంలో కాలం వృధాగా గడిపి, జీవిత చరమాంకంలో "అయ్యో! మూడు వంతుల కాలాన్ని వృధా చేసుకున్నానే" అని పశ్చాత్తాపపడుతూ, మిగిలిన వాటిని త్వరత్వరగా ముగించటం, పరితాపంతో కృంగిపోవటం, మంచిది కాదు. పోయిన కాలాన్ని తిరిగి తీసుకురాలేకపోగా, అప్పుడు రెండింతల కాలాన్ని వెచ్చించుదామనుకున్నా కుదరదు. దానికంటే మితంగా, సంతులనంగా, సహనంగా, నిశ్చలంగా ఉంటూ నీకిచ్చిన అవకాశాన్ని చేజార్చుకోకుండా ఉండాలి. చెప్పేదేమిటంటే నిజమైన ఉద్దేశ్యానికి వినియోగించుకొనేందుకు వెచ్చింపబడని క్షణం నీ ఎదుట ఉంది.

నీవు చేయడానికి ఏమీ లేనప్పుడు చికాకు పడతావు. స్నేహితుల దగ్గరికి, అక్కడకి, ఇక్కడికి పరుగెత్తుతావు. ఎటో నడుచుకుంటూ పోతుంటావు. ఉత్తమమైనదే మాట్లాడుకోవాలంటే పని జరగని వాటిని గూర్చి నేను ప్రస్తావించను. వీటికి బదులుగా ఆకాశం ఎదుట కూర్చుని నిశ్చలంగా లేదా చెట్టు దగ్గరో, సముద్రం ఒడ్డునో ఎక్కడ వీలైతే అక్కడ (ఇక్కడ అన్నీ ఉన్నాయి) ఇదిగో ఈ విషయాలను గ్రహించడానికి ప్రయత్నించు.

నీవు ఇక్కడ ఎందుకు జీవిస్తున్నావు, ఎలా జీవించాలో తెలుసుకునేదెలా, నీవు చేయాలనుకొనే దానిని గూర్చి యోచించడం, ఏది అసలు చేయబడాలి, నీ జీవిత వేదనలోనుండి, అజ్ఞానం, అసత్యం నుండి తప్పించుకొనే ఉత్తమ మార్గమేమిటి....?

(CWM : 250,251)

ప్రతిరోజూ అంతరంగంలోకి వెళ్ళడం అత్యావశ్యకం

మనం చదువుతాం, అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాం, విశదీకరిస్తాం, తెలుసుకోవడానికి ప్రయత్నిస్తాం. కానీ ఒకే ఒక్క క్షణంలో కలిగే అనుభవం వందల వివరణలు, వేలాది శబ్దాలు తెలిపే దానికంటే అధికంగా బోధపర్చు తుంది.

కాబట్టి మొదటి ప్రశ్న : "అనుభవాన్ని ఎలా పొందాలి?"

నీ లోపలికి వెళ్ళు. అది మొదటి మెట్టు.

అప్పుడలా తగినంత లోతు వెళ్ళి ఆ లోపల వున్న యథార్థ స్థితిని పొందడం, వికాసోన్ముఖంగా నిన్ను నీవు విశాలపర్చుకోవడం, క్రమ పద్ధతిలో, పరిమితం అన్న భావన పోగొట్టుకొని, విశ్వమంత విశాలమవ్వడంలో నీవు విజయాన్ని పొందడం. ఈ రెండూ ప్రారంభ ప్రయత్నాలు. ఈ రెండు చాలా గొప్ప నిశ్చల, శాంత సమత్వ స్థితుల్లో జరగాలి. ఈ శాంతి, ఈ సమత్వ స్థితి మనస్సులో నీరవతను, ప్రాణికంలో నిశ్చలస్థితిని కలుగజేస్తుంది.

ఈ ప్రయత్న,ఈ ప్రయాసను చాలా పట్టుదలతో ఎప్పుడు నవీకరించుకొంటూ ఉండాలి. కొంతకాలం గడిచిన పిమ్మట నీలో ఉన్న సహజమైన యథార్థత, బయట నీవు గ్రహించిన సాధారణమైన బాహ్య చేతనలోని యథార్థకు ఎంతో భిన్నమైనదని గ్రహించడం మొదలు పెడతావు. సహజంగానే అనుగ్రహం పనిచేయడం ద్వారా అకస్మాత్తుగా నీలోని తెర తొలగిపోతుంది. నీవు ఒక్కసారిగా నిజమైన సత్యంలోకి ప్రవేశించగలవు. అది జరిగినప్పటికీ, అనుభవానికి సంబంధించి పూర్ణ ప్రభావాన్ని, పూర్తి మూల్యాన్ని పొందాలంటే నీవెప్పుడూ ఆంతరిక స్వీకరణా స్థితిలో ఉంటూనే ఉండాలి. దానిని చేయాలంటే నిత్యం నీ అంతరంగంలోకి వెళ్ళడం అత్యావశ్యకం.

CWM : 10:19-20

కృతజ్ఞత అనే జ్వాల ఎప్పుడూ జ్వలించాల్సిందే.

కృతజ్ఞత కల్గి ఉండాలి. ప్రతివ్యక్తిలోనూ అజ్ఞానం, అపార్థాలు, అహంకారం, దాని తిరుగుబాటు, నిరోధం ఎన్ని ఉన్నా వ్యక్తిని నడిపించే పరమాత్మ యొక్క అద్భుత అనుగ్రహాన్ని మరచిపోకూడదు.

కృతజ్ఞత అనే విశుద్ధ జ్వాల నునువెచ్చగా, మధురంగా అస్పష్టత, అహంకారాన్నంతటిని నశింపజేస్తూ, ప్రకాశవంతంగా మన హృదయం ఎప్పుడూ జ్వలిస్తూ ఉండాలి. పరమాత్మ అనుగ్రహం కోసం జ్వలించే కృతజ్ఞత సాధకుని గమ్యానికి నడిపిస్తుంది. అతడు ఎంతగా కృతజ్ఞుడిగా, అణుకువతో ఉంటాడో అంతగా అనుగ్రహం కార్యాచరణను గ్రహించ గల్గుతాడు. అతడు నడిచే మార్గం కుదించుకుపోతుంది.

వైట్ రోజెస్ 26-06-1964

అన్ని చర్యలకంటే, బహుశా ఆ ఒక్కటే ఎంతో హర్షాన్ని అందించగలదేమో? మిశ్రితం కాని హర్షోల్లాసం, అహంకారం చేత మలినం కాని అమిశ్రిత హర్షోల్లాసం, అదే అయత్న సిద్ధమైన కృతజ్ఞత.

ఇది చాలా ప్రత్యేకమైనది. ఇది ప్రేమ కాదు. ఇది ఆత్మ సమర్పణ కాదు. ఇది చాలా హర్షోల్లాస భరితమైనది. చాలా పూర్ణమైనది. దానికదే సాటి అయిన ఒకానొక ప్రత్యేకమైన దివ్య ప్రకంపనం. అది నిన్ను విశాల పర్చుతుంది. నిన్ను నింపుతుంది. అది ఎంతో తీక్షణమైన ప్రకంపనం.

మానవ చేతన చేరుకోగల ప్రకంపనాల్లోకల్లా ఇది చాలా నిర్దిష్టంగా నిన్ను నీ అహంకారం నుండి బయటకు లాగి పడేస్తుంది. నీవెప్పుడైతే ~~ఈ~~ ప్రకంపనలోని స్వచ్ఛతలోకి ప్రవేశించగలవో, వెనువెంటనే ప్రేమ ప్రకంపనంలోని శ్రేష్ఠత దీనిలోనూ ఉన్నదని గ్రహిస్తావు.

అది దిశారహితమైనది. చివరగా కృతజ్ఞత అతి ప్రధానమైన ప్రేమ ప్రకంపనకు చెందిన కొద్దిపాటి తేడాతో ఒకే మాదిరిది. - శ్రీమాత

స్పిరిట్యువల్ సిగ్నిఫికెన్స్ ఆఫ్ ఫ్లవర్స్ పుట. 122

అనుబంధం

దిలీప్‌కుమార్ రాయ్ చివరి రోజులు

1979 సెప్టెంబర్ చివరిలో ఆరోగ్య కారణాల రీత్యా వైద్యులు పూణే వదిలివేయమని సలహా ఇచ్చారు. దాదాజీ (దిలీప్‌కుమార్ రాయ్‌ని ప్రేమతో దాదాజీ అని పిలుస్తారు)ఆయన శిష్యుల్లో ఒకరికి ఆరోగ్యం మెరుగుపడడానికి స్థలామార్పిడి అవసరమని వైద్యులు తెలిపారు.

బలమైన అయిష్టత మరియు బలీయమైన భయం దాదాజీ శిష్యసంతతిలోని ఒకరి హృదయాన్ని పట్టుకొంది. "మనం ఈసారి బొంబాయికి వెళ్లవద్దు దాదా. అక్కడ ఏదో ఘోరం జరుగుతుంది". కానీ దాదాజీ మొండిగా ఉన్నారు. నీ ఆరోగ్యం మెరుగుపడుతుంది. కాబట్టి మనం వెళ్ళాలి, అని దాదాజీ అన్నారు. దాదాజీ ఆమె విన్నపాన్ని పట్టించుకోకపోవడం, 30ఏళ్ళలో ఇదే మొదటిసారి. అయన సెప్టెంబరు 30న తమ బృందం వారితో కలిసి బొంబాయి బయలుదేరాడు.

మరుసటిరోజు తెల్లవారుజామున, దాదాజీ గొప్ప ఆనందోత్సాహాలతో నిద్ర లేచారు. అద్భుతం, అద్భుతం అని పులకించాడు. నేను చూసిన కలలో రాధారాణి నన్ను ఆశీర్వదించింది. ఆమె నా ఎదురుగా నిలబడి ఉండడం నేను చూశాను. ఆమె సౌందర్యాన్ని వర్ణించడం చాలా కష్టం. నేను ఆనంద పరవశంలో, మా తండ్రిగారు రాధారాణి పై స్వరపరచిన పాట పాడటం మొదలుపెట్టాను. 'కీదియే షాజబో మధుర్ మూరోతి'.

పాట పాడిన తర్వాత, నేను ఆమె పాదాలపై పడ్డాను. రాధారాణి నన్ను, ముగ్ధమైన చిరునవ్వుతో చూస్తూ ఇలా చెప్పింది 'మళ్ళీ పాడు. చాలా ఎంతో అందంగా ఉంది'. నేను ఆనందంతో మళ్ళీ పాడాను. ఓ పుత్రా ఏమి మనోహరం, ఎంత కారుణ్యం, రాధారాణి కలలో నన్ను ఆశీర్వదించింది.

రాధారాణి ఆశీర్వాదం వలన మీరు, అద్భుతమైన దర్శనం పొందారు. దీని గురించి మాకు ఇంకా చెప్పండి అని ఒక భక్తుడు అడిగాడు. అవును, ఇది గొప్పవరం, నేను దానిని ఒక పద్యరూపంలో ఉత్తమంగా వివరించగలను.

దాదా తియ్యని బెంగాలీలో ఒక అందమైన కవితను వ్రాసాడు. దానిని తన బెంగాలియేతర స్నేహితుల కోసం ఆంగ్లంలోకి అనువదించాడు.

దాదాజీ ఆరోగ్యం బాగానే ఉంది. ఆయన గీతను బెంగాలీలోకి అనువదిస్తున్నాడు. రోజుకు 8 నుండి 9 గంటలు పనిచేస్తూ, తన అనువాదాన్ని చదవడం, పఠించడం, పాటడం చేస్తున్నాడు. మధ్యాహ్నం,రాత్రి భోజనం తర్వాత వాలుకుర్చీలో విశ్రాంతి తీసుకోవడం, ఒక గంట లేదా అంతకంటే ఎక్కువ సమయం చదవడం ఆయనకు అలవాటు. రోజూ రాత్రి సావిత్రి, రామకృష్ణ కథామృతం, గీత, ఉపనిషత్తులు చదివేవాడు. ఆయన తరచుగా ఓడ్‌హౌస్ చదివేవాడు.

బొంబాయిలో ఆయన మధ్యాహ్నం భోజనం తర్వాత ఒక గంట లేదా అంతకంటే ఎక్కువ సమయం గీతపై తన అనువాదం, రాత్రి భోజనం తర్వాత అర్ధరాత్రి వరకూ పనిచేశాడు. సాయంత్రాలలో ఆయన చక్కని ఉపన్యాసాలు ఇచ్చాడు. భక్తులతోకలసి పాడాడు. ప్రతిచోటా ఆనందాన్ని సామరస్యాన్ని పంచాడు. ఆయనని కలిసిన ఎవరైనా, ఆయన చుట్టూ ఈ ఆనందాన్ని అనుభవించసాగారు.

రెండు సంవత్సరాల క్రితం, దాదాజీ తన స్నేహితుడు శ్రీగంగా శరణ్ సిన్హాతో కలసి, శ్రీ జయప్రకాశ్ నారాయణ్‌ని చూడటానికి వెళ్ళాడు. మరుసటి రోజు దాదాజీ గురించి జయప్రకాష్‌జీ "ఆయన అద్భుతమైన మనిషి, ఆయన చుట్టూ ఆనందంతో కూడిన 'ఆరా'ని కలిగి ఉన్నాడు అని శ్రీ సిన్హా మరోసారి చెప్పారు.

నవంబర్ 11న దాదాజీకి కొంచెం దగ్గు వచ్చింది. అది రెండు రోజుల్లో ఉబ్బసంగా మారింది. చిక్కులు ఏర్పడ్డాయి. రోజూ ఆయన బాత్‌రూమ్‌కి నడిచి వెళ్ళి స్నానం చేయాలని పట్టుపట్టేవాడు. అందుకు వైద్యులు అనుమతించారు.

17వ తేదీ సాయంత్రం ఆయన తిరిగి వస్తుండగా దాదాపుగా కుప్పకూలి పోయాడు. ఆ తర్వాత తన మంచాన్ని వదలలేదు. జ్వరం కొన్ని రోజులు కొనసాగింది. అయితే వారం రోజుల్లో ఆయన మెరుగుపడ్డాడని, చాలా బాగుంది అని వైద్యులు చెప్పారు. దాదాజీ వేరే రాగంలో ఒకటి పాడారు. నాకు అర్ధం కాలేదు. కానీ అర్ధం చేసుకోకపోవడం కూడా ప్రణాళికలో ఒక భాగమని నాకు తెలుసు. నాకు ఎందుకు అర్ధం కాలేదో నాకు తెలుసు. ఆయన చెప్పడం ఇలా ప్రారంభించాడు.

"నా కోసం దుఃఖించకు. మరణం ఒక విషాదం కాదు, వ్యర్ధమైన జీవితమే ఒక విషాదం."

మరణం గురించి ఎందుకు మాట్లాడుతున్నావు దాదా? వైద్యులు, మీరు చాలా బాగున్నారని చెప్పారు. మీరు మళ్ళీ మీ కాళ్ళతో మీరు నడవగలిగారు అని ఒక భక్తుడు అన్నాడు.

"దాదాజీ చిరునవ్వుతో వైద్యులు ఒక ఆహ్లాదకరమైన భ్రమలో ఉన్నారు" అన్నారు అప్పుడు ఆయన కళ్ళు మిలమిలా మెరిశాయి.

దాదాజీ నవంబర్ 23న తన స్వదస్తూరిలో ఒక బెంగాలీ పద్యం వ్రాసాడు. దానిని ఆఖరి ప్రార్థన అని పిలిచాడు.

ఈవిధంగా కాదు ప్రభూ! ఆ విధంగానూ కాదు, ఇప్పుడు నీ మార్గం ప్రేమ. ఆ మార్గంలో నేను నడుస్తాను. ఈ పదాలు ప్రభూ! లేదా ఆ పదాలు కాదు, ఆ క్షణాన మీరు మాత్రమే ప్రేమ అని నేను అంటాను.

రా నా చేయి పట్టుకో. నీవు నా జీవితపు వెలుగు అని నేను పిలుస్తాను. నన్ను నడిపించు, నడిపించు.

నేను దేనినీ అడగను. నా సర్వస్వం ఇస్తాను. నా హృదయం జ్వలిస్తోంది. నీడలన్నీ పోయాయి

నవంబర్ 23, 1979లో

గీతలోని ఆరవ అధ్యాయంలోని 40వ శ్లోకాన్ని మననం చేస్తూనే ఉన్నాడు. తన స్వంత దస్తూరితో తన డైరీలో

"నా మిత్రమా ఇప్పుడు లేదా ఇక మీదట, నిజమైన ఆకాంక్షా పరులు ఎవరూ బాధపడకూడదు అని బెంగాలీ సంస్కృతంలో వ్రాసుకున్నారు." - డికె రాయ్

దాదాజీ సాధారణ స్థితిలో లేకున్నా నవ్వుతూ సంతోషంతో, చైతన్యం నిండి ఉన్నాడు. (ఆయన చాలా సమయం నిశ్శబ్దంగా అంతర్ముఖం అయి ఉండేవాడు) ఆయన ప్రేమతో నిండి ఉన్నాడు. ఆయనకు చేసిన చిన్న సేవకు కృతజ్ఞతతో - ఎవరినీ ఇబ్బంది పెట్టడానికి ఇష్టపడడు - "నేను మిమ్మల్ని చాలా ఇబ్బందులు పెడుతున్నాను. కానీ నేను మిమ్మల్ని సరైన దారిలోకి తీసుకురాలేదని మీరు అనుకోవద్దు. నా బిడ్డలైన మిమ్మల్ని సాధ్యమైనంత గొప్పమార్గంలో చేర్చాను" అన్నాడు.

నవంబర్ 26న అతను ఇలా అన్నాడు 'దాదాజీ ఎందుకు పుట్టాడు, జీవితంలో అతని లక్ష్యం ఏమిటి అని ఎవరైనా మిమ్మల్ని అడిగితే, నా సంగీతం, సాహిత్యం, లేదా నా ఆకాంక్షకు సంబంధించి దేని గురించి మాట్లాడకండి. దాదాజీ ప్రేమించడానికే పుట్టాడు.

అందరినీ ప్రేమించడం, వివక్ష లేకుండా ప్రేమించడం భగవంతుడిని ప్రేమించడం అనేది జీవితంలోని లక్ష్యం" ఇంకా ఇలా అన్నాడు.

దైవానుగ్రహం, భూమిపై ఉన్న గొప్ప వాస్తవమని నేను గ్రహించాను.

నేను మరణాన్ని కోరను, జీవితం కోసం ఆరాటపడను. ఫిబ్రవరి చివరిలో దాదాజీ బెంగాలీలో ఒక పంక్తిని చెప్పి 'కులోహూయే ఉలో చూయ్ తొమారో తపోన్' నీ సూర్యుడిని తాకినపుడు చీకటి కాంతి అవుతుంది. నేను ఆ సూర్యుడిని తాకాను' అని అన్నాడు.

డిసెంబర్ మొదటి వారంలో దాదాజీ ఇలా అడిగారు. నేను ఏదైనా ఆస్తి కలిగి ఉన్నానా? దేవాలయం గురించి? 'దాదాజీ మీకు ఎలాంటి ఆస్తి లేదు. మనం దాని ధర్మకర్తలు లేదా సేవకులు మాత్రమే" అని చెప్పారు మీరు.

నా దగ్గర ఏమైనా వ్యక్తిగత ఆస్తులు, ధనం ఏమైనా ఉన్నాయా? అని అడిగారు. 'లేదు దాదాజీ. మీరు వ్యక్తిగతంగా ఏదీ కలిగి ఉండకూడదని ఎప్పుడూ పట్టుబట్టారు అని ఒక భక్తుడుసమాధానం చెప్పాడు.

"నేను చాలా సంతోషిస్తున్నాను. నేను దేవుని నామంలో బిక్షకుడిగానే చనిపోతాను" అని ఆయన మళ్ళీమళ్ళీ పలికాడు.

నేను ఎప్పుడూ నిజాయితీతో ఉండాలనే కోరుకొంటున్నాను. నాలో ఆత్మవంచన లేకుండా నేను ఎల్లప్పుడూ జాగ్రత్త వహించడానికి నేను భగవంతుడిని తప్ప మరేమీ కోరుకోలేదని మీకు తెలుసు. నేను భగవంతుని పేరిట భిక్షువుగా చనిపోతాను.

నా ఆరోగ్యం గూర్చి ప్రార్థించకండి. ప్రభువు చరణాలయందు నా సంపూర్ణ సమర్పణ కోసమే ప్రార్థించండి

ఇది విచిత్రం. అలాగే నిజం కూడా. ఎలాంటి ఆందోళన కాని రుగ్మతకు చెందిన విచారం కానీ ఆయనకు లేదు. ఆయన గదిలోకి ప్రవేవించే వారికి ప్రగాఢ శాంతి వాతావరణం అనుభవం అయ్యింది. 'నేను చాలా గాఢమైన శాంతితో ఉన్నాను' అని మళ్ళీ మళ్ళీ పలుకుతున్నారు. నేను గొప్ప ఆనందంలో ఉన్నాను. మీరున్నారా అని జనవరి 3వ తేదీన అడిగారు. 'నా జీవనంలోనూ, నా మరణంలోనూ ఓ దేవా నాతోఉండు"

ఆయన నాతో ఉన్నాడు. నేను ఆయనతో ఉన్నాను. నా గురుదేవుడు శ్రీ అరొబిందో నాకు లేఖలో వ్రాశారు. కాబట్టి అదే నాకు మంత్రం. ఎలాంటి గొప్ప గురువు నాకున్నారు! నేను ధన్యుణ్ణి!!

నాకెలాంటి బంధాలు లేవు, పశ్చాత్తాపాలు లేవు. నేను స్వతంత్రుణ్ణి.

నేను బంధ విముక్తుణ్ణి. ఇంతకు ముందే దాదాజీ వ్యాధితో ఉన్నప్పుడు అన్నారు 'మృత్యు లోయ గుండా వెళ్ళాను. అతడిని ప్రత్యక్షంగా చూచాను. మనుషులంతా వాంఛించే గొప్ప ఆనందాన్ని నేను అనుభవించాను' అని.

"చాలా మంది శ్రీ అనిర్వాణ్ లాంటి గొప్ప యోగులు సహస్రారం గుండా తమ శరీరాన్ని త్యజించారు. నాకు ఆ కిటుకు తెలుసు. నేను ఆ విధంగా వెళతాను" (ఆయన అదే మార్గంలోనే శరీరాన్ని విడిచాడు) అన్నారు.

ఆయన శిష్య సంతతిలో ఒకరు ఆయనను "మీరు దైవాన్ని ధ్యానిస్తూనే ఉన్నారా" అని. మరి నీవేమి ఆలోచిస్తున్నావ్ నేను నిరంతరం ఆయన ధ్యానంలోనే ఉన్నాను. నాలో ప్రగాఢ శాంతి నెలకొన్నట్లుగా సంవేదిస్తున్నాను. సమర్పణ ఇప్పుడు సంపూర్ణమైంది. ఆ మురళీ నాదం వినిపిస్తూనే ఉంది. తియ్యగా, గట్టిగా... దానిని నేను వింటున్నాను (ఆయన వేణు గానాన్ని డిసెంబర్ 17, 1975 నుండి వింటున్నాడు. అది ఆగలేదు)

శయ్యమీద ఉండి ఆయనకు సంబంధించిన ఈ కొన్ని అంశాలను ఏడు రోజుల పాటు వ్యక్తపరిచారు. సౌందర్యం, ప్రజ్ఞ, వినోదం, ప్రేమ అని సదా పలుకుతూ ఉండేవారు. ఎప్పుడు దేనిపైనా ఫిర్యాదు చేయలేదు. కొంచెం కూడా మూల్గలేదు. నిశ్చలంగా ఆయనకు చేసే సపర్యలకు అంగీకరించారు. రోజుకి 13 ఇంజక్షన్‌లు ఇంకా పైగానే చెయ్యాల్సి వచ్చేది. ఎప్పుడూ వద్దన లేదు. అప్పుడప్పుడు నేను మీకు సహకరిస్తున్నాను కదూ! అనే వారు.

ఆయన ఎప్పుడు ఇలా పలికేవాడు "నా శారీరక బాధతో సిగ్గుపడుతూ పోరాడుతున్నాను. ప్రభువు నాకెంతో బాధను ప్రసాదించాడు". ఎంతో అబ్బురపరిచే ధైర్యంతో, సహనంతో దానిని ఆయన మోశాడు. ఎప్పుడు చూచినా ప్రతి ఒక్కరిని చిరునవ్వుతో, ఒక ప్రేమ పలుకుతో ప్రోత్సాహకంగా ప్రవర్తించేవాడు.

శారీరక వేదన, బలహీనత ఎంత ఉన్నా దాదాజీలో అద్భుతమైన జ్ఞాపక శక్తి, చమత్కార ప్రవృత్తి ఎప్పటిలాగే ఉన్నాయి. జనవరి 6వ తేదీకి ముందు ఒక శిష్యుడు ఒక పుస్తకంలో ఏదో భాషితం కోసం వెతుకుతుంటే 'దేని గురించి చూస్తున్నావ్?' అని అడిగారు దాదాజీ.

ఆ శిష్యుడు సమాధానమిచ్చాడు

"ఈ నీలోని ఆత్మ నిజమై ఉన్నది" అని.

ఆ! అది 'హేమ్‌లెట్' లోని వాక్యం అని దాదాజీ తడుముకోకుండా పలికారు. పాలోనియస్ తన కుమారుడు లెరెటస్‌కి చెప్పిన మాటలు. ఆ పై వాక్యం 'నీలో ఉన్న ఆత్మ నిజమై ఉన్నది' అనికదూ! దాన్నే రేయింబవళ్ళు స్మరించాలి, అనుసరించాలి. అప్పుడు నీవు అసత్యపూరితం కాలేవు. అన్నింటికన్నా ఆత్మ అనేది నిజం అది తప్పక అనుసరించాలి.

నా మనస్సు చాలా నిర్మలంగా ఉంది. నా జ్ఞాపకశక్తి ఇంకా పదునుగా ఉందో లేదో చూసుకోవడానికి నేను భాగవతం, మహాభారతం, రవీంద్రనాథ్ ఠాగూర్, సావిత్రి, గీత నుండి వివిధ శ్లోకాలను పఠిస్తూ ఉంటాను.

మరొకరోజు ఆయన చాలా మగతగా అనిపించినపుడు ఆయన శిష్యుడిని ఇలా అడిగాడు "ప్రహ్లాదుడి భగవంతుని స్తోత్రం మీకు గుర్తుందా దాదాజీ" అని.

సంస్కృతమా లేక నా ఆంగ్ల అనువాదమా? అని దాదాజీ అడిగారు. సంస్కృతం ఇప్పుడు ఒక్కసారి కూడా తడబడకుండా మొత్తం శ్లోకం తన శ్రావ్యమైన గాత్రంతో చదివాడు.

డిసెంబర్ మధ్యలో నెమ్మదిగా కారుమేఘాలు కమ్ముకోవడం ప్రారంభించాయి. ఆయన మెరుగైనట్లు వైద్యులు కనుగొన్నారు. కానీ ఆయన శిష్యులలో ఒకరికి, ఒక రకమైన నిస్సహాయత, గాఢమైన భయం ఎలాంటి కారణం లేని భయం కల్గింది. అది ఆశ పెట్టుకోలేని భయం, నిర్వేదం చెందలేని భయం. అతడు ప్రకాశవంతమైన ముఖం వైపు చూసి ప్రార్థించాడు. జనవరి 6వరకు ఆయన తన బలం అని చెప్పుకున్న ఆయన శిష్యురాలిని పిలిచారు. అప్పుడు పూర్తిగా నిస్సహాయంగా, బలహీనంగా ఉన్నారు. ఆమెను దాదాజీ 1949 నుండి 1980 వరకు ఒక్క రోజు కూడా వదిలి ఉండలేదు. (జూన్ 1979లో ఆమె 18 రోజులు ఆసుపత్రిలో ఉన్నప్పుడు మాత్రమే ఆమె అతనికి దూరంగా ఉండిపోయింది.)

1వ తేదీన ఏదో జరిగినట్లు ఆమె దాదాజీతో ఇలా చెప్పింది. వెళ్ళిపో దాదా. నన్ను ఎప్పటికీ విడిచి ఉండననే వాగ్దానం నుండి నిన్ను విముక్తుడిని చేస్తున్నాను. నీ ఆనంద భూమికి వెళ్ళు. నీ గురువు వద్దకు, ఠాకూర్ శ్రీరామకృష్ణుని వద్దకు. నీ ప్రభువు వద్దకు వెళ్ళు అని ఆమె దాదాజీకి చెప్పింది.

ఆమె మాటలు విని అందరూ నిర్ఘాంత పోయారు.

జనవరి 6, 1980 దాదాజీ ఇలా అన్నారు 'నా చేతులు కడగండి. నేను భగవంతుని పాదాలు తాకాలి' మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఆమె దాదాజీని అడిగింది. "దాదా మీరు స్వస్థత పొందడానికి మీ సంకల్పాన్ని ఉపయోగించకూడదు అనుకుంటున్నారా?"

31 సంవత్సరాలలో మొట్టమొదటి సారిగా, దాదాజీ ఆమె ప్రశ్నకు సమాధానం ఇవ్వలేదు. ఆయన కేవలం నవ్వి, చాలా ఆప్యాయంగా ఆమెను ఆశీర్వదించాడు.

నీళ్ళు కూడా త్రాగలేనంత బలహీనంగా ఉన్నా, ఇచ్చిన టీ స్పూన్ గంజి అతని నాలుకపై ఉండేటప్పటికి గాలిపైపులోకి వెళ్ళినప్పటికీ, అతను కూర్చోవడానికి నిరాకరించలేదు. నర్సుకు ధన్యవాదాలు తెలిపి, అందరినీ చూసి ఆప్యాయంగా నవ్వారు.

మధ్యాహ్నం 2.30 గంటలకు వైద్యులు పరీక్షించి బాగానే ఉన్నట్లు నిర్ధారించారు. కార్డియోగ్రామ్‌లో అంతా బాగా ఉన్నట్లు తెలిపారు.

ఆయన చివరి మాటలు "జై గురు - జై హరి.'

అప్పుడు ఒక విచిత్ర ఘటన జరిగింది. మధ్యాహ్నం 3.40కి హరేకృష్ణ మందిరం మీద సూర్యాస్తమయం అయ్యింది.

- దాదాజీ భక్తుడు

మార్చి 9,1980. భవన్స్ జర్నల్ సౌజన్యంతో.

Vol. 53, No. 2
February 2023

Date of Publication
1st February 2023

Registered: PY/41/2021-23

AKHILA - Akhila Bharata Patrika (Telugu)

Registered with the Registrar of Newspapers for India: No. 23593/72 (monthly)

Matter shall reveal the Spirit's face. — Sri Aurobindo



Flower on the Cover Page:

Realisation

(Significance of the Gulmohar flowers given by the Mother)

Botanical name: Delonix regia

Owner: Sri Aurobindo Society
Printer: Swadhin Chatterjee for Sri Aurobindo Ashram press
Publisher: Pradeep Narang for Sri Aurobindo Society
Published from: Society House, 11 Saint Martin Street, Puducherry - 605001
Printed from: Sri Aurobindo Ashram Press,
No. 38, Goubert Avenue, Puducherry - 605 001, India
Editor: K. V. Rao

Single copy Rs. 30 **Annual Subscription Rs. 200 (in India)**

A Monthly Published by

SRI AUROBINDO SOCIETY-605001

అఖిల

అఖిల భారత పత్రిక

మార్చి 2023

సాధన, యోగం, రూపాంతరీకరణ

(పూర్ణయోగ పర్యావలోకనం ప్రత్యేక సంచిక)




విషయ సూచిక



సంపాదకీయం :

మనకర్థమైన పూర్ణయోగపు బహువిధ అన్వయం చాలా విశాలమైనది. పూర్ణయోగ పర్యావలోకనం యెంత సుసంపన్నమైనదో, యెంత విశాలమైనదో అంతకంటె అధికంగా, దానిని దైనందిన జీవితంలో యెలా అన్వయింప జేయాలో, సాధకుని ఆధ్యాత్మిక జీవితంలో దానినెలా ఆచరించాలో తెలిపేందు కొక ప్రయత్నమిది. పూర్ణ యోగాన్ని సంపూర్ణంగా మాటలలో పెట్టలేకపోయి నప్పటికీ దాని నడకెలా సాగుతుందో, చేతన, ఆంతరిక, బాహ్య లోకాలలో ఆధ్యాత్మికత, దివ్యత్వం యెలా యెదుగుతాయో తెలిపే ఒక రేఖా చిత్రణ యిది. సాధన, యోగం, రూపాంతరీకరణల వివిధ పార్శ్వాలను ఈ ప్రత్యేక సంచికలో స్పృశించడం జరిగింది.

అనువాదం : కె.వి. రావు



యోగం - నాలుగు శక్తులు అంశాలు

యోగం నాలుగు శక్తులను, అంశాలను కలిగి ఉంది. స్వచ్ఛత, స్వతంత్రత, సంపూర్ణత్వం, ఆనందం. ఎవరైతే విశ్వాతీత, విశ్వ, లీలామయ వైయక్తిక దైవానికి చెందిన తన అస్తిత్వంలో ఈ నాలుగు శక్తులను పొందుతాడో అతడు సంపూర్ణ యోగి అవుతాడు.

దేవుడు ప్రకటించే అభివ్యక్తులన్నీ పూర్ణ పరబ్రహ్మ అభివ్యక్తులే.

- శ్రీఅరవిందులు.

CWSA 12:93

సాధన, తపస్సు, ఆరాధన, ధ్యానం

యోగాభ్యాసమే సాధన. అధో ప్రకృతిని జయించటానికి, సాధన ఫలితాలు పొందటానికి కావలసిన సంకల్పానికున్న ఏకాగ్రత తపస్సు.

దైవాన్ని పూజించటం అంటే ఆరాధన, ప్రేమ, ఆత్మార్పణ, దైవానికై ఆకాంక్ష, నామ జపం, ప్రార్థన. ఆంతరికంగా ఉన్న జ్ఞానం పై ఏకాగ్రత సాధించటమే ధ్యానం. ధ్యానం అంటే సమాధి స్థితిలోకి వెళ్ళటం. ధ్యానం, తపస్సు, ఆరాధన, సాధనలోని భాగాలు.

సాధనకు సమయం, సహనం అవసరం

సాధన అనేది సమయం తీసుకొంటుంది. దీనికి సహనం అవసరం. గ్రహణ స్థితిలో లేని మనసు వెనుక తరచుగా సమయాను సారం స్వచ్ఛమైన వివేక కార్యం జరుగుతుంటుంది.. అప్పుడు అన్నీ చలన రహితంగా, మాంద్యంగా కనిపిస్తాయి; కానీ ఒక వ్యక్తి సహనాన్ని, నమ్మకాన్ని కలిగి ఉంటే ఆయా సమయాల్లోకి చేతన వెళుతూ అసాధ్యమనుకునే వాటిని సాధ్యం చేయటానికి నూతన ఆవిష్కరణలు చేస్తుంది. ఉద్వేగానికి గురి కావటం ఎప్పుడూ తప్పిదమే- ఈ మార్గంలోని అన్ని ఆటంకాలు తొలగి పోవటానికి ఆ కాలంలో పట్టువిడువని ప్రయత్నమే అనుసరించాల్సిన నియమం.

దైవం కోసం నిజమైన సాధన

దైవానికై ఆకాంక్షకు ఒకే ఒక ప్రశ్న. అది నీ జీవిత లక్ష్యమా? అంతర అస్తిత్వం అవసరమా కాదా? అనేది ఒకరి స్వయం సాధన అనేది వేరే విషయం- ఒకరు దానిని గ్రహించ వచ్చు లేక వదలి వేయవచ్చు. నిజమైన సాధన దైవం కోసమే.అది ఆత్మకు అవసరమైనది. నిరాశతో కుంగిపోయి వదిలివేయాలను కొన్న క్షణాల్లో కూడా దానిని వదలిపెట్టలేరు.

CWSA 29:240

హృదయంలోను, భృకుటిలోను ఏకాగ్రత

హృదయం, శిరస్సులోని రెండు కేంద్రాలపై ఏకాగ్రతలు ఉపయోగ

పడతాయి. ఒక్కొక్కటి ఒక్కొక్క ఫలితాన్ని ఇస్తుంది. మొదటిది చైతన్య పురుషను తెరచి భక్తిని తెస్తుంది. ప్రేమను మదర్‌తో ఐక్యపర్చి, హృదయంలో ఆమె సన్నిధిని, స్వభావంలో ఆమె శక్తిని కార్యాచరణతో పొందేలా చేస్తుంది. రెండవది మనస్సు ద్వారాన్ని తెరచి దాని కంటే ఉన్నతంగా ఉన్న వాస్తవాత్మ జ్ఞానాన్ని అధిరోహించి శరీరానికి ఆవల నున్న ఉన్నత చేతనను శరీరంలోకి అవరోహణం చేయిస్తుంది.

CWSA 29:326

సాధన అవసరం

సాధారణ ప్రకృతి అలవాటు అవరోహణకు ఆటంకం కాకపోతే అప్పుడు సాధన అవసరం ఏముంది? ఒక్క క్షణంలో ఉన్నత చేతన నీవద్దకు దిగి, నీవు అతి మానవుడిగా ఒక్క క్షణంలో మారడానికి నిన్ను ఆటంక పరిచేది ఏది? అది ఏమిటంటే అధో ప్రకృతి మొండివ్యతిరేకత. దాని నుండి తట్టుకోవాలంటే సుదీర్ఘ సాధన అవసరం.

CWSA 31:487

సాధనకు ఉత్తమ ప్రవర్తనా ధోరణి

సాధనకు ఉత్తమ ధోరణి ఏమిటంటే నీవు మదర్ పై ఆధారపడాలి. నిజంగానే ఆమె శక్తి నీలో సాధన చేస్తుంది.

CWSA 31:276

ప్రతి సాధకుడు తన ప్రత్యేక సాధనను కలిగి ఉంటాడు

ప్రతి సాధకునికి తన ప్రత్యేక సాధన ఉంటుంది. తన స్వంత కష్టాలు, తను అనుసరించే స్వంత మార్గం ఉంటుంది. తనకు దైవానికి మధ్య మాత్రమే అతని సాధన ఉంటుంది; ఇందులో ఇతరులెవరూ భాగస్వాములు కాలేరు.

CWSA 31:630

నిశ్చలతకు ఆధారం - దైవిక శక్తిని పనిచేయడానికి అనుమతించడం

సాధన అనేది ఉచ్ఛ సంకల్పం, పాతశక్తుల మధ్య పోరాటానికి చెందిన అంతర్గత వేదనను తీసుకువచ్చినచో, మేము ఆ రకమైన మనోసాధనని కోరుకోము. మన యోగ సంకల్పం అదికాదు, నిశ్చలతను నీవు తిరిగి పొందాలని నీవు దానితో ప్రయాణించాలని మేము కోరుకుంటున్నాము. నిశ్చలత ఆధారం కల్గిఉండటం, దైవికశక్తిని నీలో దృఢంగా, నిశ్శబ్దంగా పనిచేయడానికి అనుమతించడం అనేది ఎప్పుడూ చాలా మంచి పద్ధతి. ఏదో పెద్ద వ్యక్తిగత శ్రమచేసి, కల్లోలం, సంఘర్షణ, ద్వారా కొనసాగించాల్సిన అవసరంలేదు. వెనక్కివచ్చి మరొకసారి నిన్ను నీవు తెరచి ఉంచి, నీవు లోగడ చేసిన విధంగా - అప్పుడు నీకు ఇది వరకటి నిద్ర లేక ఆరోగ్యం ఒకటి రెండు రోజుల్లో లభించి, ఎక్కువ శ్రమ లేకుండా, అంతర్గతంగా నీవు ఎదుగుతావు - శ్రీమాత శక్తి, కృప నిన్ను నడిపించనివ్వు.

(CWMS 31 : 746)

యోగం, సాధన, ధ్యానం

దైవంతో ఐక్యం అవ్వడం యోగం, దైవంతో ఐక్యం అవ్వడానికి నీవు ఏమి చేసావో అది సాధన. సాధారణ మానవ చైతన్యం నుంచి తొలగి దైవిక చైతన్యంతో నీవు సంబంధం పెట్టుకోవాలి. దానికొరకు నీవు శ్రీమాతని ఎప్పుడూ పిలుస్తుండాలి, ఆమెకు నీవు తెరవబడి ఉండాలి, ఆకాంక్షించాలి, ఆమె నీలో పనిచేయాలి, నీవు సిద్ధంగా ఉండటం కోసం ప్రార్థించాలి - కోరికలు, చంచలత్వం, మనస్సు, ప్రాణికాల కల్లోలాలను తిరస్కరించాలి. ధ్యానం అంటే మనస్సు, ప్రాణికాన్ని నిశ్చలం చేయడం, శ్రీమాత శాంతిని ఆకాంక్షించడం, శ్రీమాత సన్నిధి, ఆమె ప్రకాశం, శక్తి మరియు ఆనందం మీద ఏకాగ్రత ఉంచడం.

(CWSA 32:135)

దైవికశక్తి శూన్యంలో పని చేయలేదు

సాధన అనేది అవసరము, దైవికశక్తి శూన్యంలో పని చేయలేదు. కానీ ప్రతి మనిషి తన స్వభావానికి అనుగుణంగా శ్రీమాత కార్యం అతడి లోపల అతడి కోసమై పని చేస్తున్నది అని అతడు సంవేదించే చోటికి అది నడిపిస్తుంది.

అప్పటి వరకు సాధకుడి ఆకాంక్ష, స్వీయకార్యాలు శ్రీమాత కార్యాలకు మద్దతు ఇవ్వడం, అతని మార్గంలో అడ్డు వచ్చినవాటిని తిరస్కరించడం అనేది చాలా అవసరము, అనివార్యమైనది.

CWSA 32:137

సాధన లక్ష్యం

ప్రతి జీవి ఆ విశ్వశక్తికి పరికరం. కాబట్టి అది శ్రీమాతకి చెందుతున్నది అన్నది నిజం. ఒకరు చైతన్యం లేకుండా ఉండి అసంపూర్ణంగా ఉండే బదులు చైతన్యంతో ఖచ్చితమైన పరికరంగా మారడం అనేది సాధన లక్ష్యం. నీవు ఇకపై అధమస్వభావం అజ్ఞానపు నెట్టివేతకు విధేయత చూపకుండా, శ్రీమాతకి లోబడి, నీలో పనిచేసే శ్రీమాత ఉన్నతమైనశక్తి గురించి తెలుసుకున్నప్పుడు మాత్రమే నీవు సచేతనంగా, పరిపూర్ణమైన సాధనంగా ఉంటావు. కాబట్టి ఇక్కడ కూడా నీ అంతర్ దృష్టి పూర్తిగా నిజం.

CWSA 32:243


దివ్యశక్తికి నిన్ను నీవు తెరిచి ఉండటం

నిన్ను నీవు దైవశక్తికి తెరచి ఉంచడం అనేది సాధనకు అవసరం. తాను అలా తెరవబడి ఉంటే అవసరమైన అవగాహన లేక జ్ఞానం వాటంతట అవే ఆధ్యాత్మిక అనుభవంద్వారా వస్తాయి.

CWSA : 25-448.

శ్రీ అరవిందులు





భాగం-2

యోగం

చాలా యోగాలు ఉన్నాయి

అనేక యోగాలు ఉన్నాయి, అనేక ఆధ్యాత్మిక పద్ధతులు, మోక్షం, పరిపూర్ణతవైపు మార్గాలు, అనంతాత్మకు చెందిన దైవం వైపుకు మార్గాలు ఉన్నాయి. ప్రతీదానికి ఒక ప్రత్యేకమైన లక్ష్యం, ఒక వాస్తవికత దాని విలక్షణమైన విధానం, దాని ప్రత్యేకమైన పద్ధతి, దాని సహాయక తత్వశాస్త్రం దాని అభ్యాసం ఉన్నది. ఈ సమగ్రయోగం అన్ని విధానాల సారాన్ని తీసుకొంటుంది. వాటి అన్ని లక్ష్యాలని, పద్ధతులని, విధానాల (సారపరంగానే కాని వివరణల్లో కాదు) సమన్వయం చేస్తుంది. ఇది అన్నింటిని స్వీకరించే తత్వశాస్త్రంగా, అభ్యాసంగా నిలుస్తుంది.

CWSA 12:357

మనస్సు ఆలోచనా మార్గం కాని లేక, హృదయం ద్వారా కర్మలలో సంకల్పంవల్ల, మానసిక స్వభావం మార్పు, శరీరంలో ప్రాణశక్తి స్వేచ్ఛాయుత మవ్వడం, ఇదంతా సరిపోదు. ఇవన్నీ పరస్పరం కలుపుకొని జరగాలి. మన భావనలో పరిణితి ద్వారా శరీర చేతన నుండి పదార్థ నిశ్చేతన వరకూ కూడా దైవం పట్ల సచేతనమై దైవంతోనే ప్రకాశభరితం కావాలి.

పరమాత్మతో ఏకమై ఉండటం, పరమాత్మతో కలిసి జీవించడం, పరమాత్మతో ఏకస్వభావాన్ని కలిగిఉండటం, ఇదే మనయోగ లక్ష్యం కావాలి.

CWSA 12:357

యోగం అంటే ఏమిటి?

ఏ యోగమైన దాని ప్రత్యేక లక్షణం దృష్ట్యా చూసినప్పుడు పరిమితులకు లోబడి ఉన్న అజ్ఞానమయ బాహ్యచేతన నుండి మనకు, ప్రపంచానికి సంబంధించిన ఉత్తమమైన, లోతైన వాస్తవికత లేదా పరమాత్మ లేదా ఆ పరతత్వ ఉనికిలోనికి ప్రయాణించడం, ~~ఈ~~ అజ్ఞానమయ బాహ్య చేతన వల్ల అది కప్పబడి ఉంది. ప్రతిదానికీ అంతర్లీనంగా ఒక వాస్తవికత ఉంది. ఆ వాస్తవికత ప్రతి దానిలో ఉండి, విస్తరిస్తుంది. ఇప్పుడు మనకు కనపడుతున్న ప్రపంచంలా కాకుండా ఆ వాస్తవికత మరో విధంగా ఉంది; దానిలో మనం మన ఆలోచన, జీవితం, చర్యల ద్వారా అస్పష్టంగా కదులుతున్నాము. మనం ఆ వాస్తవికతను మన మతం, తత్వశాస్త్రం ద్వారా అర్థం చేసుకోవడానికి, చేరుకోవడానికి ప్రయత్నిస్తాము. చివరికి కొంత పాక్షికంగా, మరికొంత పూర్తిగా నేరుగా ఆధ్యాత్మిక అనుభవం పొందుతాము. ఆ ఆధ్యాత్మిక అనుభూతినే, ఆ పద్ధతినే, సాక్షాత్కారాన్నే మనం యోగం అంటున్నాము.

CWSA 12:361

సమగ్ర యోగం అంటే ఏమిటి?

సమగ్ర యోగం భగవంతుని సంపూర్ణ - సాక్షాత్కారానికి, పూర్తి స్వీయ-సాక్షాత్కారానికి, మనలోని అన్ని అంశాల పరిపూర్ణతకు, చేతన పరిపూర్ణం కావడానికి, మన స్వభావ పూర్తి పరివర్తనకు మార్గం. మరోచోట ఉన్న శాశ్వత పరిపూర్ణతలోకి తిరిగి వెళ్లిపోవడం కాదు, ఇక్కడ జీవిత పూర్తి పరిపూర్ణతను ఇది సూచిస్తుంది.

ఇది సమగ్ర యోగ లక్ష్యం, కానీ దానిని సాధించే పద్ధతిలో కూడా అదే సమగ్రత ఉంది, ఎందుకంటే పద్ధతిలో సంపూర్ణత లేకుండా లక్ష్యం సమగ్రంగా సాధించబడదు, భగవంతుని వైపు పూర్తిగా మళ్లడం, పూర్తిగా తెరుచుకోవడం, మనల్ని మనం (మన స్వభావాల్లోని అన్ని అంశాలను ఎంచుకునే మార్గాలను, కదలికలను) పూర్తిగా భగవంతునికి ఇచ్చి వేసుకోవడం ద్వారా లక్ష్య సాధన సమగ్రంగా సాధించబడుతుంది.

మన మనస్సు, సంకల్పం, హృదయం, శరీరం, బాహ్య, అంతర్గత, అత్యంత అంతర్గత ఉనికి, అతిచేతన, ఉపచేతన, చేతనలకు సంబంధించిన అన్ని అంశాలను తప్పక భగవంతునికి సమర్పించవలసి ఉంటుంది. ఈ అంశాలన్నీ సాక్షాత్కారానికి,పరివర్తనకు ఒక సాధనంగా మారి ఉద్దీపనంలో పాల్గొనాలి. ఈ అంశాలన్నీ మానవ చేతన, స్వభావం నుంచి దివ్య చేతన స్వభావానికి పరివర్తన చెందాలి. ఇది సమగ్ర యోగ లక్షణం.

CWSA 12:358

పూర్ణ యోగ అర్థం

పూర్ణ యోగం అంటే **1.** ఒక వ్యక్తి తన మనస్సుతోనో (జ్ఞానం), హృదయంతోనో (భక్తి), లేకపోతే సంకల్పంతో చేసే పనులతోనో (కర్మ యోగం) దైవాన్ని చేరుకోవడానికి బదులుగా, ఆ వ్యక్తి తనలోని అంశాలన్నిటితో (శక్తులు, చేతనలతో) దైవాన్ని చేరుకోవడానికి ప్రయత్నం చేయడం. అంటే ఈ మూడు మార్గాలను, ఇతర మార్గాలను ఒకే యోగంలో ఏకం చేయడం (దైవంతో ఐక్యం చేసే మార్గం), తద్వారా తనలోని సర్వస్వాన్ని (చేతనలోని అన్ని అంశాలను) భగవన్మయం చేయడం (అంటే తన ఉనికిలో, చైతన్యంలో, భగవంతుని సన్నిధిని, చేతనను, శక్తిని, ప్రకాశాన్ని, ఆనందాన్ని ప్రాప్తింప జేసుకోవడం.

2. ఒక వ్యక్తి భగవంతుని సాక్షాత్కారాన్ని అంతరాత్మలో, జీవాత్మలో మాత్రమే కాకుండా, తన సమస్త ప్రకృతి (స్వభావం)లో కోరుకోవడం(అంటే నిమ్న మానవుని స్థాయి నుంచి దైవిక ఆధ్యాత్మిక ప్రకృతి (స్వభావం)గా మారడం).

3. ఒక వ్యక్తి జీవితం కోసం మాత్రమే కాకుండా ఆవల జీవితం కోసం దైవాన్ని అన్వేషిస్తాడు. తద్వారా జీవితం కూడా భగవంతుని సాక్షాత్కారాన్ని పొంది, దివ్యమైన భగవంతుని స్వభావ అభివ్యక్తిగా మారుతుంది.

CWSA 29:373

ఈ యోగం ఉద్దేశ్యం

ఈ యోగం అతిమానసంలో భగవంతునితో సచేతనంగా ఐక్యం కావడానికి, ప్రకృతి (స్వభావ) రూపాంతరీకరణను ఉద్దేశ్యంగా కలిగి ఉంది. సాధారణ యోగాల్లో వ్యక్తి మనసును దాటుకొని నేరుగా ఎటువంటి లక్షణాలు లేని విశ్వాతీత నిశ్శబ్దంలోకి వెళ్లి, అక్కడ నుంచి అత్యున్నత స్థాయిలోకి అదృశ్యం కావడానికి ప్రయత్నించడమే ఉంటుంది. మనసును అధిగమించి, సచ్చిదానంద నిశ్చల, క్రియాశీలకమైన రెండు స్థితుల దివ్య సత్యం లోకి ప్రవేశించడం, వ్యక్తిలోని అన్ని అంశాలను సత్యంలోకి లేవనెత్తడం ఈ యోగ ఉద్దేశ్యం.

CWSA 29:373

సమగ్ర యోగ లక్ష్యం

సమగ్ర యోగంలో అనుసరించే యోగ మార్గం ఇతర యోగాలకు భిన్నమైన ఉద్దేశ్యంతో ఉంది, - దీని లక్ష్యం సాధారణ అజ్ఞాన ప్రపంచ చేతన నుండి దివ్య చేతనలోకి ఎదగడమే కాకుండా ఆ దివ్యచేతన అత్యున్నత శక్తిని అజ్ఞానమయ మనస్సు, జీవితం, శరీరాలలోకి తీసుకుని వచ్చి, వాటిని పరివర్తనం చేసి, భగవంతుని భూమి మీద అభివ్యక్తీకరించి, పదార్థంలో దివ్య జీవనాన్ని సృష్టించడం. ఇది చాలా కష్టమైన లక్ష్యం, కష్టమైన యోగం; చాలా మందికి, చాలావరకు ఇది అసాధ్యం అనిపించవచ్చు. సాధారణ అజ్ఞాన ప్రపంచ చేతనలోని అన్ని శక్తులు ఈ యోగాన్ని వ్యతిరేకించి తిరస్కరిస్తాయి. ఈ యోగాన్ని నిరోధించడానికి ప్రయత్నిస్తాయి, ఈ యోగ సాక్షాత్కారాన్ని పొందే క్రమంలో సాధకుడు తన స్వంత మనస్సులో, జీవితంలో, శరీరంలో అత్యంత మొండి అడ్డంకులను కనుగొంటాడు. నీవు ఈ ఆదర్శాన్ని హృదయ పూర్వకంగా అంగీకరించగలిగితే, అన్ని ఇబ్బందులను ఎదుర్కోగలిగితే, గతాన్ని దాని బంధాలను వదిలివేసి, ఈ దివ్య సంభవత కోసం ప్రతిదీ వదులుకోవడానికి, ప్రతిదాన్ని పణంగా పెట్టడానికి సిద్ధంగా ఉన్నప్పుడు మాత్రమే నీవు యోగంలో అంతర్గతంగా ఉన్న సత్యాన్ని అనుభవం ద్వారా కనుగొనడానికి అవకాశం ఉంటుంది.

CWSA 29:412

ఈ యోగ సాధన ఏ విధమైన నియమాల (చేయవలసినవి, చేయకూడనివి), ద్వారా జరుగదు. నిర్దిష్టమైన ధ్యాన పద్ధతి గాని మంత్రాలు లేకపోతే ఇతర మార్గాల ద్వారా గాని ఈ యోగ సాధన సాగదు. కానీ ఆకాంక్ష, స్వీయ అంతః ఏకాగ్రత, స్వీయ ఊర్ధ్వముఖ ఏకాగ్రత, దైవ ప్రభావానికి, మనకంటే పైన ఉన్న భగవంతుని శక్తికి, దాని పనితీరుకి, హృదయంలోని భగవంతుని సన్నిధికి తెరచుకోవడం, పైవాటికి విరుద్ధమైన ప్రతి దానిని తిరస్కరించడం ద్వారా ఈ యోగ సాధన కొనసాగుతుంది. విశ్వాసం, ఆకాంక్ష, శరణాగతి ద్వారా మాత్రమే మన ఈ తెరచుకోవడం సాధ్యమవుతుంది.

CWSA 29:19-20

ఈ యోగం - ఆరోహణ, అవరోహణల ద్వివిధ సాధన

ఈ యోగాభ్యాసము ద్వివిధం - ఒక వైపు చేతన ఉన్నత తలాలకు ఆరోహణ క్రమంలో వెళ్తుంది, మరొకవైపు భూ చేతనలోకి ఉన్నత తలాల శక్తిని దింపి చీకటి, అజ్ఞానానికి చెందిన శక్తిని బయటకు తీసి ప్రకృతిని రూపాంతరీకరిస్తుంది.

CWSA 30:416

ఈ యోగంలో మోక్షం, విశ్వాతీత స్థితి రెండూ ఉన్నాయి

ఇక్కడ అభ్యసించే యోగంలో ముక్తి, విశ్వాతీత స్థితి రెండూ ఉన్నాయి. అయితే అది ముక్తి లేదా నిర్వాణాన్ని కూడా ఇస్తుంది. అది వచ్చినట్లయితే మొదటి దశగానే సిద్ధి ప్రాప్తిస్తుంది. చివరి దశగా కాదు. విశ్వాతీత స్థితికి లేదా దాని వైపుకే నిష్క్రమణం జరిగితే అది సాధించిన శక్తి, ప్రకాశం, చైతన్య అవరోహణతో కూడిన ఆరోహణ అవుతుంది. అటువంటి అవరోహణల ద్వారా ఇక్కడ ఆధ్యాత్మిక ఉన్నత పరివర్తనను సాధించాలి.

CWSA 29:499

జ్ఞానం, భక్తి, కర్మలు మొ॥ వాటికీ తగిన స్థానాలు ఉన్నాయి

పూర్ణయోగం జ్ఞానం, భక్తితో పాటు కర్మచేస్తుంది అంటే చేతనా ప్రకాశం, ఆనందం, ప్రేమ, సంకల్పం, శక్తి చేసే కార్యాల్లోఉంటాయి. ధ్యానం, ఆరాధన, దైవ సేవ కూడా ఈ యోగంలో వాటి స్థానాన్ని అవి కల్గి ఉంటాయని ప్రవహిస్తూ ఉన్నాయని దయచేసి గుర్తుంచుకోండి.

CWSA 29:223

పూర్ణయోగంలోని నూతనత్వం

నా యోగం అన్ని అంశాలలో సరికొత్తది అని నేను ఎప్పుడూ చెప్పలేదు. నేను దానిని పూర్ణయోగం అని పిలిచాను. అంటే పాతయోగంలోని సారాల్ని ఇది గైకొంటుంది. అనేక ప్రక్రియలు దీనిలో ఉన్నాయి. దాని నూతనత్వం దీని లక్ష్యంలోనే ఉంది. దృక్పథం విధాన సంపూర్ణతలోనే ఉంది.

పాత యోగములతో పోల్చినపుడు ఇది నూతనమైనది

1. ఎందుకంటే ఇది ప్రపంచం నుండి నిష్క్రమణ, స్వర్గంలోని జీవితం లేదా నిర్వాణములపై లక్ష్యముంచదు. ఇది జీవితం, అస్థిత్వంలో మార్పును తీసుకు వస్తుంది. అనుషంగికంగా లేదా యాదృశ్చికంగా కాకుండా ఒక విభిన్నమైన కేంద్ర వస్తువుగా ఉంటుంది. ఇతర యోగములలో అవరోహణ ఉన్నట్లయితే అది మార్గంలో ఒక ఘటన లేదా ఆరోహణ ఫలితం మాత్రమే. ఇక్కడ ఆరోహణ వాస్తవమైన విషయం. ఇక్కడ ఆరోహణ అనివార్యమైనది. కానీ నిర్ణయాత్మకమైనది. తుది లక్ష్యంగా అవరోహణ దీని ఫలితమే. ఆరోహణ ద్వారా లభించే నూతనచైతన్య అవరోహణయే సాధనకు ఆమోదం, ప్రమాణం. తంత్రం, వైష్ణవంలో కూడా జీవితం నుండి విరమణయే ముగింపుగా ఉంటుంది. దివ్య జీవన సాఫల్యతయే ఇక్కడ లక్ష్యం.

2. ఎందుకంటే మేము కనుగొన్న లక్ష్యం కేవలం ఒక వ్యక్తి శ్రేయస్సు కోసం ఒక వైయక్తికమైన దైవ సాక్షాత్కార సాధన కాదు. ఇక్కడ ఈ పృథ్వికోసం సముపార్జించబడాలి. అది సార్వజనీనం, కేవలమొక ఇంద్రియాతీత వైశ్విక సాధన కాదు. ఇంకా వ్యవస్థీకృతం కాని లేదా నేరుగా భూచేతనలో లేని ఒక చేతన మహాశక్తి (అతిమానసం)ని సాధించి తేవడం, ఆఖరికి అది ఆధ్యాత్మిక జీవితంలో కూడా లేదు. కాని ఇక్కడ అది స్థాపించబడాలి. నేరుగా క్రియాశీలకమవ్వాలి.

3. ఈ ఉద్దేశ్యాన్ని నెరవర్చుకోవడానికి ఒక విధానం ముందే నిర్ణయించ బడింది. ఈ ఉద్దేశ్యం ముందున్న లక్ష్యం వలె అది సంపూర్ణమైనది, సమగ్రమైనది. అంటే స్వభావం, చేతనలు సమూలంగా సమగ్రంగా పరివర్తన చెందడం, దీనిలో పాత విధానాలను పాక్షికంగానే అనుసరిస్తూ ఇంకా భిన్నమైన వాటిని కూడా దాటుకొంటూ వెళ్ళడం. పూర్వపు యోగాల్లో ఇది సిద్ధించినట్లుగా,

సంపూర్ణంగా దీనిని ప్రతిపాదించినట్లుగాను నేను ఈ విధానాన్ని ఎక్కడా గుర్తించలేదు. ఇది ఇంతకుమునుపే ఉన్నట్లుగా ఉంటే ఈ మార్గం మలచడం కోసం అంతరిక సృష్టిలో నా జీవితం 30 యేళ్లు వృథా చేసి ఉండేవాణ్ణి కాదు. అలా అయ్యుంటే తేలిగ్గా స్వారీ చేసుకొంటూ తీర్చిదిద్దిన, సుభద్రంగా ఆ సర్వజనుల రహదారి వెంట సురక్షితంగా వెళ్ళి నా గమ్యం చేరగల్గేవాణ్ణి. మన యోగం పాత పోకడల్లో మళ్లీపోవడం కాదు. ఇది ఒక ఆధ్యాత్మిక సాహస కృత్యం.

CWSA 29:399-401

శ్రీమాతను ఆశ్రయించిన ప్రతి ఒక్కరూ యోగాన్ని ఆచరిస్తున్నవారే

శ్రీమాతను ఆశ్రయించిన ప్రతి ఒక్కరూ నా యోగాన్ని ఆచరిస్తున్నారు. పూర్ణ యోగాన్ని అంటే యోగంలోని అన్ని పార్శ్వాలను స్వయంకృషితో నిర్వహించి నెరవేర్చుకోవచ్చని అనుకోవడం చాలా తప్పు. ఏ మానవుడూ అలా చేయలేడు. ప్రతి ఒక్కరూ చేయవలసింది ఏమిటంటే, శ్రీమాత చేతిలో తనను తాను సమర్పించుకోవడం. సేవ ద్వారా, భక్తి ద్వారా, ఆకాంక్ష ద్వారా ఆమెకు అర్పించుకోవడం. అప్పుడు శ్రీమాత తన ప్రకాశం, శక్తి ద్వారా అతనిలో పనిచేస్తుంది. తద్వారా సాధన జరుగుతుంది. పెద్ద పూర్ణయోగిగా లేదా అత్యున్నత జీవి కావాలనే ఆశయం కలిగి ఉండడం, నేను ఆ దిశగా ఎంత మేరకు వచ్చాను అని తనను తాను ప్రశ్నించుకోవడం కూడా పొరపాటే. శ్రీమాతకి అంకితం కావడంలో అర్పించుకొనుటలో ఆమె నీవు ఎలాఉండాలని భావిస్తున్నావో అలా ఉండటమే సరయిన వైఖరి. మిగిలినది శ్రీమాత నిర్ణయించి నీలో జరిపిస్తుంది.

CWSA 31:151-152 — *- శ్రీఅరవిందులు*

నీ అన్ని కదలికలను దైవానికి అర్పించు

యోగం అంటే దైవంతో ఐక్యత. ఐక్యత అనేది అర్పణ ద్వారా జరుగుతుంది. అది నిన్ను నీవు దైవానికి అర్పించుకోవడం ద్వారా ఏర్పడుతుంది. నీవు ప్రతి దశలోనూ దైవానికి చెందిన వాడివని భావించాలి. నీవు ఏమి ఆలోచిస్తున్నా లేదా చేస్తున్నా, ఎల్లప్పుడూ నా ద్వారా దైవ చేతన పనిచేస్తున్నదనే నిరంతర అనుభవం నీకు ఉండాలి. నాకు స్వంతం అని పిలవగలిగేదీ లేదు, ప్రతీదీ దైవం నుండి వస్తుంది అని భావించి దానిని

మూలానికే తిరిగి అర్పించాలి. దీనినంతా గ్రహించగలినపుడు నీవు సామాన్యంగా జాగ్రత్త వహించని లేదా శ్రద్ధ చూపని అతి చిన్న విషయం కూడా ఇకపై ఎంతో అర్థవంతమైనదిగా అవుతుంది.

నీ సాధారణ సమర్పణలను వివరణాత్మక సమర్పణలుగా నీవు చేయాలి. దైవ సన్నిధిలో నిరంతరం జీవించు. నిన్ను నడిపిస్తున్నది అలాగే నీవు చేస్తున్న ప్రతి పనినీ చేయిస్తున్నది ఆమె సన్నిధియే అనే భావనలో జీవించు. ప్రతి మానసిక చర్య, ప్రతి ఆలోచనయే కాకుండా నీ అన్ని కదలికలను అర్పించు. అత్యంత సాధారణ, బాహ్య కార్యాలను అనగా తినుట, నీవు తింటున్నపుడు నీ ద్వారా ఆ దైవమే తింటున్నట్లు నీవు భావించాలి. నీవు నీ కదలికలన్నింటినీ ఒకే ఉన్నత జీవితంలోకి ప్రోగుచేయగలిగినపుడు నీవు విభజనకు బదులుగా ఐక్యత పొందుతావు. దైవానికి నీ స్వభావంలోని ఒక భాగం ఇవ్వడంతో మిగిలిన భాగాలు వాటి సాధారణ త్రోవల్లోనే మామూలు విషయాల్లోనే మునిగిపోయి ఉంటాయి. జీవితమంతా స్వీకరించబడుతుంది. నీలో పూర్ణమైన పరివర్తన క్రమంగా జరుగుతుంది.

CWM 3:23-24 - *శ్రీమాత*


యోగ శక్తి

యోగమంటే దైవంతో ఐక్యం కావడం. విశ్వాతీతం (విశ్వంపైన) లేదా విశ్వాత్మకం (విశ్వం) లేదా వ్యక్తిగతంగా లేదా మన యోగంలోనే ఈ మూడు ఉన్నాయి. ఒక చిన్న అహం, వ్యక్తిగత మనస్సు, వ్యక్తిగత ప్రాణికం మరియు శరీరం ద్వారా పరిమితం కాని చేతనలోకి రావడం లేదా సర్వోన్నతం లేదా సార్వత్రిక (విశ్వ) చేతనతో లేదా ఒక గాఢ చేతన ద్వారా తన స్వీయాత్మ పట్ల, ఆంతరిక పురుషుని పట్ల, తన అస్తిత్వ సత్యం పట్ల ఎఱుకను కలిగి ఉండటం, యోగ చేతనలో ఒక వ్యక్తికి విషయాల గురించి తెలియడం మాత్రమే కాదు శక్తుల గురించి, అంతే కాదు శక్తుల వెనుక గల చేతన గురించి కూడా తెలుస్తుంది. ఆ వ్యక్తి తనలోనివి మాత్రమే కాకుండా విశ్వంలోనివి అన్నీ తెలుసుకోగలడు.

నూతన చేతన వృద్ధితో ఒక శక్తివెంట ఉంటుంది. దానితో ఒక్కసారిగా వృద్ధి చెందుతుంది అది ఏర్పడటానికి పరిపూర్ణం కావడానికి సహాయ పడుతుంది. ఈ శక్తియే యోగ శక్తి. ఇది ఇక్కడ నిద్రాణంగా ఉంటుంది.

మన ఆంతరిక జీవి (చక్రాలు)లోని అన్ని కేంద్రాలలో చుట్టబడి, ఆధారంలో ఉంటుంది. దీనిని తంత్రాలలో కుండలినీ శక్తిగా పిలుస్తారు. కానీ అది మనపైన, మన తలపైన దైవశక్తిగా ఉంటుంది. అక్కడ చుట్టబడి, ముకుళించుకొని నిద్రాణంగా ఉండదు. అక్కడ జాగృతంగా, జ్ఞానవంతంగా, శక్తివంతంగా, విశాలంగా, విస్తృతంగా ఉంటుంది. అది అభివ్యక్తీకరణ కోసం వేచి ఉంటుంది. ఈ శక్తికి - శ్రీమాత శక్తికి మనల్ని మనం సమర్పించుకోవాలి. మనస్సులో అది దైవిక మానసిక శక్తిగా లేదా ఒక విశ్వమానస శక్తిగా వ్యక్తమవుతుంది. వ్యక్తిగత మనస్సు చేయలేని ప్రతీదాన్ని అది చేయగలదు. అప్పుడు అది యోగ మానసిక శక్తి. అది వ్యక్తమై ప్రాణికంలో లేదా భౌతికంలో పనిచేస్తున్నప్పుడు అది యోగ జీవశక్తిగా లేదా యోగ శరీర శక్తిగా స్పష్టమవుతుంది. ఇది ఈ అన్ని రూపాలలో బాహ్యంలోకి, పైకి, దిగువ నుండి విస్తృతంగా వ్యాపిస్తూ ఉప్పొంగుతూ ఉంటుంది. లేదా దిగువకు ప్రవహించి వివిధ అంశాలకు ఒక నిర్దిష్ట శక్తిగా మారుతుంది. అది శరీరంలో క్రిందికి ప్రవహిస్తూ పనిచేస్తూ దాని పాలనను ఏర్పరుస్తుంది. పై నుండి విస్తృతంమౌతూ వ్యాపిస్తుంది. మనపై ఉన్నతమైన వాటితో మనలో అల్పమైన వాటిని కలుపుతుంది. వ్యక్తిని విశ్వతత్వం లేదా సంపూర్ణత్వం లేదా కేవలం విశ్వాతీత బ్రహ్మానికి చేరుస్తుంది.

CWSA 30:422 — *శ్రీ అరవిందులు*



యోగం ప్రధాన ప్రక్రియ

యోగ సిద్ధికి రెండు రాజమార్గాలు

పరమశాంతి, నిశ్చల నీరవతలు సిద్ధించడానికి అత్యంత కచ్చితమైన మార్గం, అవి పైనుంచి దిగిరావడం, చూడ్డానికలా యెప్పుడూ కన్పించనప్పటికీ, వాస్తవంగా నిజానికి అవి సిద్ధించేది యెల్లప్పుడూ అలాగే - చూడ్డానికలా యెప్పుడూ జరుగదు. ఎందుకనంటే సాధకునికి ఆ ప్రక్రియ యెరుక యెల్లప్పుడూ ఉండదు. తనలో శాంతి నెలకొంటున్నదని అనుకొంటాడు లేదా కనీసం, అభివ్యక్తమౌతున్నదని అనుకుంటాడు. కాని అది యెప్పుడు ఎలా సిద్ధించిందో అతనికి తెలియదు. ఆధ్యాత్మిక శాంతి నిశ్చల నీరవత మాత్రమే గాక, వెలుగు, శక్తి, జ్ఞానం, ఉన్నత దృష్టి, ఆలోచన, ఆనందము, ఉన్నత చేతనకు సంబంధించిన సమస్తము ఊర్ధ్వం నుండి దిగి వస్తాయనేది సత్యం. కొంతవరకు అవి లోనుండి రావడం కూడా సాధ్యం కావచ్చు. ఇలా ఎందుకు జరుగుతుందంటే చైత్యపురుష సరాసరి వాటికి తెరుచుకుంటుంది. అవి మొదట అక్కడికి వచ్చి, అంతరాత్మ నుండి తక్కిన అస్తిత్వంలో తమకు తాము తెలుపుకుంటాయి, లేక అంతరాత్మ ముందుకు రావడం వల్ల అలా జరగవచ్చు. యోగ-సిద్ధికి రెండు రాజమార్గాలు; ఒకటి లో నుండి బయటకు రావడం, లేక రెండు పై నుండి దిగిరావడం. బాహ్య ఉపరితల మనసు లేక భావావేశ పూరిత ప్రయత్నం, ఏదో విధమైన తపస్సు, వేటిలో దేనినో రూపొందిస్తున్నట్లు కన్పిస్తుంది. రెండు మౌలిక మార్గాల ఫలితంతో పోలిస్తే, దీనివల్ల లభించే ఫలితాలు మామూలుగా అస్థిరమైనవి, శకలం వంటివి. అందుచేతే 'ఉన్మీలనం' మీద ఈ యోగంలో మేము పట్టుబడుతున్నాం. ఆంతరిక మనసు, ప్రాణికం, భౌతికం, మనలోని లోలోపలి భాగమైన అంతర్మాతకు ఉన్మీలనం, మనసుకు పైనున్న దానివైపుకు ఉన్మీలనం. సాధనా ఫలాల కోసం ఉన్మీలనం ఈ యోగంలో అపరిత్యాజ్యం.

CWSA 30:323-24

అత్యున్నత ఆధ్యాత్మిక ఆత్మ

మన మూర్తిత్వం, దైహిక అస్తిత్వం వెనుక సైతం, గాక దానికి ఊర్ధ్వంలో పూర్తిగా దానిని అధిగమించి, అత్యున్నత ఆధ్యాత్మిక ఆత్మ ఉన్నది. ఆంతరిక కేంద్రాలలో అత్యున్నతమైనది అత్యంత లోతైనది హృదయంలో ఉన్నట్లుగానే,

శిరసులో ఉంది. కాని సరాసరి పరమాత్మకు తెరుచుకునే కేంద్రం, సూక్ష్మ శరీరమని పిలువబడేది, పూర్తిగా భౌతిక శరీరానికి బయట శిరసుపైన ఉంది. ఈ పరమాత్మకు రెండు పార్శ్వాలున్నాయి. దానిని సాక్షాత్కరింపజేసు కున్నప్పుడు ఫలితాలు ఈ రెండు పార్శ్వాలకు సంబంధించినవై ఉంటాయి. విస్తృత శాంతి, స్వేచ్ఛ, నిశ్చల నీరవతల స్థితియైనది, స్థితిశీల పార్శ్వం. నిశ్చలనీరవ పరమాత్మ ఏ విధమైన కర్మ లేక అనుభవం చేత విచలితుడు గాడు. అది వాటిని నిష్పాక్షికంగా బలపరచుతుంటుంది గాని ఏ విధంగానూ వాటికి మూలంగా కన్పించదు. పైగా వాటి నుండి విడివడి, వాటిని గురించి పట్టించుకొనకుండా ఉదాసీనయై ఉంటుంది. మరొక పార్శ్వం గతి శీలమైనది, ఒక జగదాత్మగా లేక పరమ ఆధ్యాత్మగా దాని అనుభవం కలుగుతుంది. ఇది సకల జగత్కర్మకు ఆధారంగావడమే గాక, దానికి మూలం, అది దానిని తనలోనే జరిగేటట్లు చేస్తుంది. మన భౌతిక అస్తిత్వాలను పట్టించుకొనే భాగం మాత్రమే గాక, దానికావలగా ఉన్నదాన్నంతా, ఈ ప్రపంచం, ఇతర లోకాలను, విశ్వానికి సంబంధించిన అతి భౌతిక అలాగే భౌతిక సీమలన్నింటినీ పరిగణనలోనికి తీసుకొనే భాగం. పైపెచ్చు సమస్తమందలి యేకైకంగా మనం పరమాత్మను సంవేదిస్తాం. అంతేగాక, వ్యష్టి జన్మ లేక జగదస్తిత్వం సమస్తాన్నీ అతిశయించిపోయిన విశ్వాతీతమైనదిగా, సమస్తానికీ ఊర్ధ్వంలో ఉన్నదానిగా కూడా సంవేదిస్తాం. సమస్తమందలి యేకైకాన్ని విశ్వజనీన పరమాత్మను పొందడమంటే అహం నుండి ముక్తంగావడం. చేతనలో అహం ఒక చిన్న శకలం అన్నా అవుతుంది లేక మన చేతన నుండి మొత్తంగా అదృశ్యమన్నా యైపోతుంది. అది అహం, నిర్వాణం. సమస్తానికీ ఊర్ధ్వాన ఉన్న విశ్వాతీత ఆత్మలోనికి వెళ్ళడం జరిగితే, జగచ్చేతన, కర్మకు సైతం పూర్తిగా అతీతంగా వెళ్ళగలిగేటట్లు మనల్ని చేస్తుంది. లయం, మోక్షం, నిర్వాణం అని పిలువబడే, ప్రపంచం నుండి సంపూర్ణ విముక్తికి అది దారి అవుతుంది.

CWSA 30:325-26

ఊర్ధ్వోన్మీలన అనుభవాలు

ఊర్ధ్వానికి ఉన్మీలనం అవ్వడం అనేది అవశ్యం శాంతికి, నిశ్చలనీరవతకు నిర్వాణానికి మాత్రమే దారి తీస్తుందని అనుకోగూడదనే విషయాన్ని గమనికకు తీసుకోవాలి. ఒక గొప్ప కాలక్రమంలో ఒక అనంత శాంతి, నిశ్చల నీరవత, మనపైన నిజం చెప్పాలంటే శిరసుపైన, భౌతిక అతి భౌతిక ఆకాశంలోనికి

విస్తరించుకొంటూ పోయే కాలక్రమంలో ఒక గొప్ప అనంత శాంతి, నిశ్చల నీరవత, వైశాల్యతల యెరుక పొందడం మాత్రమే గాక, సమస్త శక్తి వున్న ఒక విశాల దివ్య క్రియాశక్తి, సమస్త జ్ఞానమూ కల ఒక విశాల దివ్యవెలుగు, సమస్త ఆనందము, ప్రహర్షిమూ, ఒక విశాల బ్రహ్మానందము అయిన యితర విషయాలను యెరుగ గలుగుతాడు. ప్రప్రథమంలో అవి యేదో సారభూతమైనవిగా, అనిర్దేశ్యమైనవిగా, కేవలమైన యేదోగా కన్పిస్తాయి. వీటిలో దేనిలోనైనా నిర్వాణం సాధ్యమే అన్నట్లు కన్పిస్తుంది. ఈ దివ్య క్రియాశక్తిలో అన్ని క్రియా శక్తులూ, ఈ దివ్య వెలుగులో అన్ని వెలుగులూ ఈ బ్రహ్మానందంలో సమస్త సంతోషం, ఆనందం సాధ్యమేనని కూడా మనం దర్శించగలుగుతాం. ఈ సమస్తమూ మనలోనికి దిగి వస్తాయి. శాంతి ఒక్కటి మాత్రమే గాక వాటిల్లో ఏదైనా లేక అవన్నీక్రిందికి రాగలవు. కాకపోతే అత్యంత సురక్షితమైనది, మొదట ఒక పరిపూర్ణ స్థిరత, శాంతిని క్రిందికి తీసుకురావడం. ఎందుచేతనంటే అది మిగతాది దిగిరావడాన్ని మరింత సురక్షితం చేస్తుంది. లేని యెడల అంతటి దివ్య క్రియాశక్తి, దివ్య వెలుగు, దివ్య జ్ఞానం లేక బ్రహ్మానందాలను బాహ్య ప్రకృతి నిలుపుకోవడం, భరించడం కష్టంగావచ్చు. ఇవన్నీ కలిసి మనం ఉన్నత ఆధ్యాత్మిక లేక దివ్య చేతన అని అనేదాన్ని తయారు చేస్తాయి. అది హృదయం ద్వారా పనిచేస్తుంది. అది మొత్తం ప్రకృతిని అంశం తర్వాత అంశంగా స్వీకరించి దానితో వ్యవహరిస్తుంది. తిరస్కరించ వలసిన దానిని తిరస్కరిస్తూ, ఉన్నతీకరించవలసిన దానిని ఉన్నతీకరిస్తూ, సృజించవలసిన దానిని సృజిస్తూ పనిచేస్తుంది. అది సమన్వయ పరుస్తుంది, సామరస్యపరుస్తుంది, స్వభావంలో ఒక నూతన వలయంను ప్రతిష్టిస్తుంది. అతిమానస క్రియాశక్తిని, అస్తిత్వాన్ని క్రిందికి తీసుకురావడం సాధ్యపడేంత వరకు, సాధన లక్ష్యం అదే అయితే, ఒక ఉన్నతతర, మరింత ఉన్నతతర క్రియాశక్తిని, ఉన్నతతర ప్రకృతి శ్రేణిని కూడా అది క్రిందికి తీసుకురాగలదు. ఇదంతా కూడా హృదయకేంద్రములోని చైత్యపురుష కర్మచే సిద్ధం చేయబడుతుంది, చైత్యపురుషచే సహకారమందించబడుతుంది, యింకా ముందుకు తీసుకుపోబడుతుంది. అది అధికంగా ఉన్నీలనమై ముందుకు వచ్చి, చురుకుగా తయారైతే, దివ్యక్రియాశక్తి పనిచేయడం వేగవంతం, సురక్షితం, తేలిక అవుతుంది. హృదయంలో మరింత అధిక ప్రేమ, భక్తి, సమర్పణ వృద్ధి చెందుతాయి, సాధన పరిణామం మరింత వేగం, పరిపూర్ణం

అవుతుంది. ఎందుకనంటే, అవతరణ, రూపాంతరీకరణలో, అదే సమయంలో దైవంతో పెరుగుతుండే సంపర్కం, యేకంగావడం యిమిడి వున్నాయి.

సాధన ప్రాథమిక హేతు బద్ధత

అది సాధన ప్రాథమిక హేతుబద్ధత. ఇక్కడ అత్యంత ప్రాముఖ్యంగల రెండు విషయాలేమిటంటే, హృదయ కేంద్రం, మనసు కేంద్రాలు, వాటివెనుక, వాటి పైన ఉన్న సమస్తానికీ ఉన్మీలనంగావడం, అది స్పష్టం. ఎందుకనంటే హృదయం చైత్యపురుష, ఉన్నతతరచేతనకు మనసుకేంద్రాలు తెరుచుకొంటాయి. చైత్యపురుషకు, ఉన్నతతర చేతనకు మధ్య సంబంధం కలిగించే గ్రంధి, సిద్ధికి ప్రధాన ఆలంబన. మొదటి ఉన్మీలనం హృదయంలో కేంద్రీకరించడం ద్వారా మనలో అంతరాత్మ ద్వారా అభివ్యక్తమై మొత్తం స్వభావాన్ని తన హస్తగతం చేసుకొని నడిపించే అభివ్యక్తంగావడానికై దైవాన్ని పిలువడం ద్వారా జరుగుతుంది. సాధనకు సంబంధించిన ఈ భాగంలో, ఆకాంక్ష, ప్రార్థన, భక్తి, ప్రేమ, సమర్పణ, ప్రధాన ఆధారాలవుతాయి. దీనితో పాటు, మనం అకాంక్షించే దాని మార్గంలో అడ్డుగా నిలబడే దాన్నంతా తిరస్కరించడం కూడా వుంటూంది. శిరములో (ఆ తరువాత, దానికి పైన) చేతనను కేంద్రీకరించడం ద్వారా, ఒక ఆకాంక్ష, ఒక పిలుపు, దివ్యశాంతి, శక్తి, వెలుగు, జ్ఞానం, బ్రహ్మానందాలను మొదట దివ్యశాంతి, లేక దివ్యశాంతి, దివ్య క్రియాశక్తి రెండూ కలిసి - అస్తిత్వంలోనికి దిగిరావాలనే, నిరంతర సంకల్పం, రెండవ ఉన్మీలనం జరుపుతాయి. నిజానికి కొంతమంది దివ్య వెలుగును, లేక మొదట బ్రహ్మానందాన్ని స్వీకరిస్తారు. లేక అకస్మాత్తుగా జ్ఞానం గ్రుమ్మరిల్లుడుతూ రావడం కొంతమందికి జరుగుతుంది. మరికొంతమంది విషయంలో, ఒక విశాల అనంత నిశ్చలనీరవత, దివ్య క్రియాశక్తి, దివ్య వెలుగు, లేక బ్రహ్మానందం, వారిపై మొదట తెరచుకోవడం జరుగుతుంది. తరువాత వారు అందులోనికి ఆరోహించడమో లేక, నిమ్న స్వభావంలోనికి ఇవి దిగిరావడం ప్రారంభం కావడమో జరుగుతుంది. మరి యితరులతో మొదట శిరసులోనికి, తరువాత హృదయస్థాయికి, ఆతరువాత నాభి, యింకా క్రిందికి మొత్తం దేహమంతటిలోనికి దిగిరావడమో జరుగుతుంది. అవతరణ, లేక దిగివస్తున్న స్పృహ లేకుండానే శాంతి, వెలుగు, వైశాల్యత లేక శక్తి లేకపోతే, జగచ్చేతనలోనికి సమాంతర ఉన్మీలనం లేక

ఆకస్మికంగా విస్తృతం అయిన మనసులో, జ్ఞాన విస్ఫోటనం, విశదీకరించలేని ఉన్మీలనం జరుగుతుంది. సర్వులకు అనువర్తించే కఠిన నియమమేం లేదు గనుక ఏది వచ్చినా దానినాహ్వానించాలి. కాని మొదట శాంతి రాకపోతే, హర్షాతిరేకంతో ఉబ్బిపోకుండా జాగ్రత్త పడాలి లేకపోతే సమతూకాన్ని కోల్పోతారు. ఏదేమైనప్పటికీ, ఉత్కృష్టమైన క్షణం, దివ్యక్రియాశక్తి, లేక మహాశక్తి, జగజ్జనని శక్తి దిగివచ్చి, పట్టు చిక్కించుకొన్న క్షణం. ఎందుకనంటే అపుడు చేతన వ్యవస్థీకరించబడడం మొదలౌతుంది. అది యోగానికి విస్తృతమైన పునాది అవుతుంది.

ప్రకృతి పురుషుల యెడబాటు

కొంతమందికి వేగిరంగా, హఠాత్తుగా వికసనం జరిగినప్పటికీ యేకాగ్రత వల్ల ఫలితం వెన్వెంటనే లభించదు. కాని చాలామంది విషయంలో దీర్ఘకాలం లేక కొద్దికాలం పడ్తుంది వాళ్ళందుకు తగినట్లు తయారు గావడానికి సన్నద్ధం కావడానికి. ముఖ్యంగా అదివరకే వాళ్ళ స్వభావం, ఆకాంక్ష, తపస్సుల వల్ల కొంత వరకు సన్నద్ధమై లేని వాళ్ళవిషయంలో అలా జరుగుతుంది. పాతయోగాల ప్రక్రియలలో ఒకటైన యేకాగ్రతతో సహకారపు తోడ్పాటుతో కొన్నిసార్లు ఫలితం రావచ్చు, “నేను మనసును కాదు”, “నేను ప్రాణికాన్ని కాదు”, “నేను శరీరాన్ని కాదు” అని అవిరామంగా చెప్పుకొంటూ తన నుండి మనః ప్రాణ, దేహాలతో తాదాత్మ్యాన్ని తిరస్కరించే, జ్ఞానమార్గ అద్వైతుని ప్రక్రియ ఉంది. వీటిని తన నిజాత్మ నుండి వేరైన వాటిగాచూస్తాడు. కొంతకాలం జరిగాక సమస్త మానసిక ప్రాణిక, భౌతిక ప్రక్రియలను, మనః ప్రాణ దేహాల అసలు స్పృహనే, బయటిదిగా బాహ్యకర్మగా కనిపించడాన్ని గమనిస్తాడు. అదే సమయంలో అంతరంగంలో వాటితో సంగరహితమై జగత్తు, జగదతీత పరమ ఆధ్యాత్మ సాక్షాత్కారంలోనికి ఉన్మీనలమౌతూ ఒక స్వయం భువమైన అస్తిత్వ స్పృహ పెరుగుతూ ఉంటుంది. సాంఖ్యుల పద్ధతి చాలా శక్తివంతమైన పద్ధతిఉంది. ప్రకృతి పురుషుల విడదీత. సాక్షిస్థానాన్ని మనసుమీద రుద్దుతాడు. మనః ప్రాణ, దేహాల సమస్త కర్మ నేను లేక నాదికాదు. అది ప్రకృతికి సంబంధించినది, బాహ్య నేను మీద అది రుద్దబడింది అంటాడు. నేను మాట్లాడని వాడిని, నిస్సంగుడిని, వీటికి నేను బద్ధుడనుగాను. తత్ఫలితంగా అస్తిత్వంలో ఒక విభజన పెరుగుతుంది. తనలో ఒక శబ్దం

చేయనిప్రత్యేక చేతన, మనః ప్రాణ దేహాల ప్రకృతి ఉపరితల క్రీడ నుండి తాను పూర్తిగా యెడంగా ఉన్నానని సంవేదించే విభజన పెరుగుతుంది. మామూలుగా యిలా జరిగినప్పుడు చాలా త్వరగా ఉన్నతతర చేతన శాంతిని, ఉన్నతతర దివ్యక్రియా శక్తిని, యోగ నడకనంతా క్రిందికి తీసుకురావడం సాధ్యపడుతుంది.

ఏకాగ్రతకు, పిలుపుకు స్పందిస్తూ దివ్యక్రియాశక్తే స్వయంగా తరచుగా క్రిందికి వస్తుంది. ఆ తరువాత యేవి అవసరమైతే, అది వాటిని చేస్తుంది, సహాయపడే, లేక అపరిత్యాజ్యమైన యితర యే ఆలంబనాలనైనా లేదా ప్రక్రియనైనా ఉపయోగిస్తుంది.

*

ఈ యోగంలో శరణాగతి లేదా సమర్పణ అనేది అత్యంత ఆవశ్యకం

ఇంకొక మాట ఏమిటంటే, పైనుండి దివ్య శక్తి అవతరించే క్రమంలో అది పని చేసే క్రమంలో కేవలం తనపై తాను ఆధారపడరాదు, గురువు మార్గనిర్దేశంపై ఆధారపడవలసి ఉంటుంది, అంతే కాక ఏమి జరిగుతున్నా అది గురువు నిర్ణయానికి, విచక్షణ కు, ఆదేశానికి వదిలి వేయాలి.

అటువంటి అవతరణ లో నిమ్న ప్రకృతిలోని కొన్ని శక్తులు మేల్కొనడం, ప్రేరేపితం కావడం సాధారణంగా జరిగే విషయమే, అవి ఆ అవతరణలో భాగమై దానిని స్వలాభం కోసం వాడుకునే ప్రయత్నం జరుగుతుంది.

దైవికము కాని శక్తి లేదా శక్తులు తమని తాము పరమోన్నతుడైన దైవం గా లేక దివ్యమాత గా తమని తాము ప్రకటించుకుని, సాధకుని శరణాగతిని సమర్పణను లేదా సేవను కోరడం కూడా చాలా సార్లు జరుగవచ్చు. వాటిని గనక అంగీకరించి నట్లైతే విపత్కర పరిణామాలు ఉంటాయి.

ఒక వేళ సాధకుడు తనలో దైవక్రియా కలాపానికి మాత్రమే తన అనుమతిని ఒసంగి, దైవం మార్గదర్శనానికి నిజమైన శరణాగతి లేదా సమర్పణ చేసి ఉన్న పక్షంలో అతని సాధన సాఫీగా జరిగిపోతుంది. ఇటువంటి వాటిని అనుమతించడం అలాగే అహంకారము, అహంకార పూరితమైన శక్తులను నిరాకరించుటవలన సాధనలో కావలసిన రక్షణ దొరుకుతుంది.

ప్రకృతి దారులన్నీ అనేకమైన ఉచ్చులతో కూడినవి, అహంకారం వేసే వేషాలు అనేకంగా ఉంటాయి, చీకటి శక్తుల రాక్షస మాయ సృష్టించే భ్రమలు

అత్యంత నైపుణ్యంతో కూడినవి, హేతుబుద్ధి నీకు పూర్తి మార్గదర్శనం చేయలేదు అది నీకే ద్రోహం చేయవచ్చు (అది పూర్తిగా నమ్మదగినది కాదు), ప్రాణికమైన కోరికలు ఎప్పుడూ మనతో ఉండి మనలను ఊరించు ఉసిగొలుపు పిలుపులతో నిన్ను ప్రలోభ పెడుతుంటాయి. ఈ కారణాల వల్లనే ఈ యోగంలో సంపూర్ణ సమర్పణ అని మనం పిలుచుకుంటున్న దానిని అత్యావశ్యకమైనదిగా నొక్కి చెప్పటం. (ఆంగ్లంలో సరెండర్ అనేది అంతా సమగ్రమైన పదం కాదు).

నీ హృదయ కేంద్రం కనక పూర్తిగా తెరుచుకుని, నీ ఆత్మ (చైత్య పురుషుడు) ఎల్లప్పుడూ పూర్ణ నియంత్రణలో ఉన్నట్లయితే, ఇంకా ప్రశ్నే లేదు అంతా భద్రంగా ఉన్నట్లే. ఎప్పుడైనా నీ ఆత్మ, నిన్ను ప్రకృతి పైకి లేవడంవలన మరుగున పడే అవకాశం లేకపోలేదు. చాలా కొద్ది మంది మాత్రమే అటువంటి ప్రమాదాలకు అతీతంగా ఉండగలరు, సరిగ్గా అలాంటి వారికే సమర్పణ అనేది సులువుగా సాధ్యం అవుతుంది. దైవం తో సంపూర్ణ తాదాత్మ్యత పొందినవారు లేక దైవానికి ప్రతినిధిగా ఉన్న వారి మార్గదర్శనం అనేది అత్యావశ్యకం, ఇంకా తప్పనిసరి అవుతుంది.

CWSA 30: 326-330

అతి మానసం నా ఒక్కని కోసం కాదు మొత్తం భూమి కోసం

దైవ సాక్షాత్కారం అంటే ఆత్మ సాక్షాత్కారం అనే అర్థం వస్తుంది. మానసిక ఆధ్యాత్మిక తలం లో ఆత్మసాక్షాత్కారం, భగవంతుని లేదా బ్రహ్మం యొక్క సాక్షాత్కారం, లేక అధిమానస తలంలో ఆత్మల సాక్షాత్కారం కానీ అనేక వేల మంది సాధించి ఉన్నారు. అది అతిమానసం తో పోలిస్తే సులభసాధ్యమైనదే. అంతే కాకుండా ఆత్మసాక్షాత్కారం పొందకుండా ఎవరూ అతిమానస సాక్షాత్కారం పొందలేరు.

సంపూర్ణ సత్త ఆ వైపుకు తిరుగకుండా ఎవరుగాని ఈ రెండూ సాక్షాత్కారాలలో ఏదైనా సంపూర్ణంగా పొందడానికి వీలు లేదు అనేది కూడా వాస్తవమే- వారిలో ఒక నిజమైన శక్తివంతమైన చేతన లేకుండా, వాస్తవికమైన గతిశీలమైన సాధన లేకుండా ఇవి సాధ్యం కావు.

అతిమానసం కొరకు నేను ఆకాంక్షించడం అనేది కేవలం నాకోసం కాదు, ఈ భూమి కోసం ఇక్కడ జన్మించే ఆత్మల కోసం కూడా అనేది వాస్తవం, అందువల్ల ఎవరైనా అతిమానసం కొరకు ఆర్థిస్తే నేను కాదనలేను. కానీ కొన్ని నియమాలు ఉన్నాయి. అతడు మొదట దైవ నిర్ణయాన్ని శిరసావహించవలసి ఉంది, తన ఆత్మ సమర్పణ కావించి (కర్మ, భక్తి, జ్ఞాన స్వయం పరిపూర్ణత ద్వారా) ఆత్మ సాక్షాత్కారం పొంది ఉండాలి.

రెండు వైపుల నుండి చలనం ఆవశ్యకత

మొట్టమొదట నిమ్నప్రకృతిని స్వాధీనం చేసుకోవాలి, అందులో ఉన్న నిమ్నసత్త కదలికలను దైవం వైపు కదిలే ఉన్నతమైన సత్త సహాయంతో విడుదల కావించాలి, అదే సమయంలో అన్ని కర్మలను, యోగములో జరిగే అంతరిక కర్మను సైతం పురుషోత్తమునిగా, అతీతునిగా, అంతర్యామిగా ఉన్న దైవానికి అర్పించివేయాలి. ఎప్పుడైతే ఉన్నతమైన సత్తగా ఎదిగిన పిదప, జ్ఞానమూ, స్వేచ్ఛ పొందాక అప్పుడు అన్ని ధర్మములను పరిత్యజించిసంపూర్ణ సమర్పణ కావించి, దివ్య చేతనలో దివ్య సంకల్పానుసారం దివ్యశక్తితో దివ్య ఆనందం లో జీవించవచ్చు.

మన యోగం గీత యోగం ఒక్కటి కాదు, అయితే గీతా యోగంలోని అన్ని ముఖ్యమైన అంశాలు ఇందులో ఉన్నాయి. మన యోగంలో సంపూర్ణ సమర్పణ అనే భావన, సంకల్పం, ఆకాంక్ష తో ప్రారంభిస్తాం. అదే సమయంలో నిమ్న ప్రకృతిని మనం తిరస్కరించాలి, అందులోనుండి మన చేతనకు విడుదల కలిగించాలి, నిమ్న ప్రకృతిలోని మన సత్తాను స్వేచ్ఛ వైపు నడిచే ఉన్నత ప్రకృతి సహాయంతో విడుదల కలిగించాలి. ఇలా రెండువైపుల నుండి ముందుకు సాగకపోతే వాస్తవికత లేని తామసికమైన సమర్పణ చేసే అవకాశం ఉంది, ప్రయత్నం కానీ తపస్సు కానీ లేకుండా అభివృద్ధి అనేది ఉండదు. దైవానికి కాక తమకు తాము సృష్టించుకున్న ఏదో ఒక భావనకు లేదా ఆహాన్ని మరుగుపరిచే దైవం యొక్క ఒకానొక రూపానికి లేక అంతకంటే తక్కువ స్థాయికి చెందిన దానికి రాజసికమైన సమర్పణ కూడా చేసే ప్రమాదం ఉంది.

CWSA 29:442

దైవం వైపు ఆరోహణ - అధిదేవత అవరోహణ

అతిమానస యోగం అనేది భగవంతుని వైపు ఒక్కసారిగా ఆరోహణ అలాగే అధిదేవత ఈ మూర్తీభవించిన స్వభావంలోకి అవరోహణ.

అంతరాత్మ, మనస్సు, ప్రాణం, శరీరం వీటన్నిటినీ ఒక కేంద్రీకృతమైన ఉన్నత ఆకాంక్ష ద్వారా మాత్రమే అధిరోహణ సాధించబడుతుంది. అనంతమైన శాశ్వతమైన దైవం వైపు సంపూర్ణమైన జీవుని పిలుపు ద్వారా మాత్రమే అవరోహణ సంభవిస్తుంది. ఈ పిలుపు ఈ ఆకాంక్ష ఉంటే, లేదా ఏ విధంగానైనా అవి పుట్టి, నిరంతరం పెరుగుతూ, సమస్త ప్రకృతిని స్వాధీనం చేసుకోగలిగితే, అప్పుడు మాత్రమే ఉన్నతమైన అతిమానస పరివర్తన సాధ్యమవుతుంది.

CWSA12:169-171

పిలుపు-ఆకాంక్ష

మొదటి షరతులు మాత్రమే; వాటితో పాటు, వాటి ప్రభావవంతమైన తీవ్రత ద్వారా సమస్త అస్తిత్వాన్ని పరమాత్మకి దగ్గర చేసే మార్గంగా ఉండాలి, సంపూర్ణ శరణాగతి చెందాలి.

ఈ మర్త్య అర్థచేతనకు, వెనుక, దీనికి పైన ఉన్న గొప్ప దివ్యచేతనను ఎలాంటి పరిమితులూ లేకుండా దాని అన్ని భాగాల్లోనూ, స్థాయిల్లోనూ, సమస్త ప్రకృతీ అందుకోగల విస్తృత ఉన్మీలనం. పరిణామంలో మనం ఎదుర్కోనే పరివర్తన ఒత్తిడికి మనస్సు, జీవితం, లేదా శరీరంలోని ఎటువంటి అసమర్థతకు లోనవ్వకుండా, కుంగిపోకుండా ఉండాలి. అంతులేని గ్రహణశక్తి ఉండాలి, మరింత బలమైన మరింత పట్టుదలతో కూడిన దైవశక్తి కార్యాచరణను భరించే సామర్థ్యం ఎల్లప్పుడూ పెరుగుతూ ఉండాలి. లేకపోతే గొప్పది శాశ్వతమైనది ఏమీ జరుగదు. యోగం అర్థంతపు ముగింపుకు లేదా జడప్రాయమైన ఆపుదలగా లేదా వివేకమైన చర్యతో వినాశకరమైన నిర్బంధంతో ముగుస్తుంది. అలాకాకుండా అది సమగ్రం, సంపూర్ణం కావాలి. విఫలం కూడ.

CWSA12:169-171

కానీ ఏ మానవ వ్యవస్థలోనూ ఈ అంతులేని గ్రహణశక్తి, విఫలం కాని సామర్థ్యం లేదు కాబట్టి, దైవిక శక్తి దిగివచ్చి వ్యక్తిగత శక్తిని పెంచి, ప్రకృతిలో పనిచేయడానికి పైనుండి ప్రవేశించే శక్తితో సమానమైన శక్తిని సమం చేస్తేనే అతిమానస యోగం విజయవంతమవుతుంది. వ్యక్తి తన వైపు నుండి భగవంతునికి ప్రగతిశీల సమర్పణ చేస్తేనే ఇది సాధ్యమవుతుంది. ఎల్లపుడూ విఫలం కాకుండా చూసుకోవాలి, మనం చేయవలసిన పనిని దైవ శక్తి మనతో చేయనివ్వడానికి కావలసిన ధైర్యంతో కూడిన సుముఖత మనలో ఉండాలి.

మనిషి తన స్వంత ప్రయత్నంతో మానవుని కంటే తనను తాను గొప్పగా చేసుకోలేడు; మానసిక జీవి తన స్వసహాయం లేని శక్తి ద్వారా తనను తాను అతిమానస శక్తిగా మార్చుకోలేడు. దైవిక స్వభావ అవరోహణ మాత్రమే మానవుడనే భాండాగారాన్ని దివ్యీకరిస్తుంది.

మన మనస్సు, జీవిత శరీరాల శక్తుల కోసం వాటి స్వంత పరిమితులకు కట్టుబడి ఉంటాయి. అవి ఎంత ఎత్తుకు పెరిగినా లేదా విస్తృతంగా విస్తరించినా, అవి తమ సహజమైన అంతిమ పరిమితుల కంటే ఎదగలేవు లేదా వాటిని దాటి విస్తరించలేవు. కానీ, ఇప్పటికీ, మానసికంగా మానవుడు తనకు మించిన వాటిని అందుకోగలడు, అతనిలో పని చేయడానికి, మనస్సు చేయలేనిది చేయడానికి ఒక అతిమానస ప్రకాశాన్ని, సత్యాన్ని, శక్తిని ఆహ్వానించగలడు. ప్రయత్నం ద్వారా మనస్సు పరిమితి దాటిన మనస్సు కాదు గనుక, అతి మనస్సు మాత్రమే మనస్సును తన సొంత పదార్థంగా మార్చగలదు.

మనిషి తనను తను గుర్తించి అప్రమత్తమైన సమర్పణ ద్వారా అతిమానస శక్తిని దాని లోతైన సూక్ష్మ అంతర్దృష్టి, అనువైన శక్తికి అనుగుణంగా అనుమతించినట్లయితే, అది మన ప్రస్తుత అసమగ్ర స్వభావాన్ని నెమ్మదిగా లేదా వేగంగా దివ్య పరివర్తన చెంది మారుస్తుంది.

CWSA12:169-171

ఈ అవరోహణ, ఈ పని ప్రమాదకరమైన పతనం, ప్రమాదం లేకుండా లేదు. మానవ మనస్సు లేదా ప్రాణికమైన కోరిక అవరోహణ శక్తిని పట్టుకుని,

దాని పరిమితమైన తప్పుడు ఆలోచనలు లేదా లోపభూయిష్ట, అహంభావ ప్రేరణల ప్రకారం దానిని ఉపయోగించడానికి ప్రయత్నిస్తే, - ఈ అత్యల్ప మర్త్యుడు ఆ గొప్ప శాశ్వతమైన స్వభావ మార్గాన్ని నేర్చుకునే వరకు అది కూడా కొంత వరకు అనివార్యం, అవరోధాలు-విచలనాలు, అంతమయి నట్లుగా కష్టమైన అడ్డంకులు, గాయాలు, కనబడే బాధలు ఇవేమి తప్పవు ఇంకా మరణం లేదా పూర్తిగా పతనం కూడా అసంభవం కాదు. మనస్సు, జీవితం, శరీరం భగవంతునికి స్పృహతో కూడిన సమగ్ర శరణాగతిని నేర్చుకున్నప్పుడే, యోగ మార్గం సులభంగా, సూటిగా, వేగంగా సురక్షితంగా మారుతుంది.

అంతరాత్మ - శ్రీమాత చేతిలో శిశువు

భగవంతునికి మాత్రమే సమర్పించబడాలి, అది దైవానికి మాత్రమే మార్గమై ఉండాలి మరెవరికీ కాదు. ఎందుకంటే మనలోని అస్పష్టమైన మనస్సు లేదా అపవిత్రమైన ప్రాణికం అనైతిక శత్రు శక్తులకు లొంగిపోయి వాటిని దైవంగా పొరబడటం కూడా సాధ్యమే. ఇంతకంటే ఘోరమైన లోపం మరొకటి ఉండదు. అందువల్ల మన సమర్పణ అన్ని ప్రభావాలకు లేదా ఒక ప్రత్యేక ప్రభావానికిలోనయ్యి గుడ్డిగా నిస్తేజమైనది, నిష్క్రియమైనదిగా ఉండకూడదు, చిత్తశుద్ధితో, స్పృహతో, అప్రమత్తంగా కేవలం ఒకే ఒక్కనికి మాత్రమే అది కూడా అత్యున్నతమైనదానికే సమర్పితమై ఉండాలి.

దైవానికి, అనంతమైన దివ్య మాతకి స్వీయ-శరణాగతి అంటే, అది ఎంత కష్టమైనప్పటికీ, మన ఏకైక ప్రభావవంతమైన మార్గం, మన ఏకైక ఆశ్రయం. శ్రీమాతకు ఆత్మార్పణ చేయడం అంటే మన స్వభావం ఆమె చేతుల్లో సాధనంగా ఉండటం, అంతరాత్మ శ్రీమాత చేతిలో శిశువుగా అయిపోవడం.

CWSA 12:169-171 — *- శ్రీ అరవిందులు*



రూపాంతరీకరణ అంటే....

పూర్ణయోగానికి సంబంధించిన ఆధ్యాత్మిక వాస్తవాల్ని, నిర్దిష్ట ఆధ్యాత్మిక భావనల్ని వ్యక్తపర్చడం కోసం 'అతిమానసం' మల్లేనే ఈ రూపాంతరీకరణ అనే శబ్దాన్ని నేనే స్వయంగా ప్రయోగిస్తున్నాను. బయట ఈ మనుషులు ఆ పదాలను ఏ భావనతో వాడుతున్నారో ఆ అర్థంలో నేను ఉపయోగించడం లేదు. ఆధ్యాత్మ 'ప్రభావం' చేత 'స్వభావంలో శుద్ధీకరణకు నేను చెప్పే రూపాంతరీకరణకు భేదం ఉంది; శుద్ధీకరణ అన్నది అంతరాత్మిక పరివర్తన లేదా అంతరాత్మిక ఆధ్యాత్మిక పరివర్తనలో ఒక భాగం మాత్రమే. ఈ పదానికి వివిధ భావనలతో కూడిన అర్థాలున్నాయి. సాధారణంగా ఈ పదం ధార్మిక, నైతికమైన అర్థంలోనే తీసుకోబడుతుంది. అది నా ఉద్దేశ్యానికి భిన్నమైనది. నేను చెప్పే ఆధ్యాత్మిక రూపాంతరీకరణ ఒక విధంగా క్రియాశీలకమైనది. (అది ఆత్మ విముక్తి లేదా అవతరణ అనేదే లేకుండా ఉత్తమంగా ఏకేశ్వరుని సాక్షాత్కారాన్ని పొందడం కాదు.) వ్యక్తి ఉనికిలోని అధోచేతన వరకు గల అన్ని భాగాల్లోనూ క్రియాశీలక, నిర్ణయాత్మక ఆధ్యాత్మిక చేతనను నింపుకొని రావడం. అది కేవలం ఆధ్యాత్మ ప్రభావంతోనే ప్రాథమికంగా శుద్ధీకరించుకోవడం, మనస్సును, హృదయాన్ని ఉద్దీపింపజేసుకోవడం, ప్రాణికాన్ని స్తిమ్మితపర్చడం ద్వారా జరగదు. అంటే దీనర్థం నిశ్చల, క్రియాశీలకమైన దివ్యచేతనను అన్ని భాగాల్లోకి దింపడం ద్వారా, ప్రస్తుత చేతనను దానితో సంపూర్ణంగా భర్తీ చేయడమన్నమాట! దానిని మనం మనస్సు, ప్రాణిక శరీరాలకు అతీతమైనదిగా ఏతెరచాటు లేనిదిగా, దేనితోను మిశ్రితం కానిదిగా కనుగొంటాం. ఇది చాలామంది విషయంలో కాదని కొట్టి పారేయలేని అనుభవానికి చెందిన అంశం. ఏ కొద్ది లోటుపాటు లేని సంపూర్ణ అవతరణ చాలా క్షుణ్ణంగా ఆ తెరను, మిశ్రమాన్ని తొలగించి వేసి, సంపూర్ణ ఆధ్యాత్మిక రూపాంతరీకరణను ప్రభావితం చేయగలదన్నది నాఅనుభవం. ఆత్మ చేయాలి, చేయగలదు, చేయడం అవసరం, లేదా చేయాల్సిన అవసరం లేదు అనే అధిభౌతిక, బౌద్ధికతర్కంతో దీనికి సంబంధమూ లేదు, దానికి విలువ కూడా లేదు. ఈ యోగంలో మాదిరిగా ఇతర మార్గాల్లో రూపాంతరీకరణం అన్నది వాటికి ప్రధానోద్దేశ్యం కాదు అని కూడా నేను జోడిస్తున్నాను. ఆ మార్గాలు గట్టిగా కోరే శుద్ధీకరణ, మార్పు అన్నది మోక్షానికి, జీవిత ఆవలికి దాటి

పోవడానికే నడిపిస్తుంది. ఆత్మకున్న బలీయమైన ప్రభావం నిస్సందేహంగా ఆపని చేయగలదు. ఒక నూతన చేతన స్వభావంలోకంటూ ఆ పాద మస్తకం అవతరించి జీవితాన్ని రూపాంతరీకరిచడం అన్నది ఆధ్యాత్మిక దృష్ట్యా ఈ జీవితం నుండి తప్పించుకు పోవడానికి అవసరంలేదు.

CWSA 29:403-404

రూపాంతరీకరణ అనే దానికి అర్థం

రూపాంతరీకరణ అంటే ఏదో కొంత స్వభావానికి సంబంధించిన మార్పుగా నేను భావించను. సాధుత్వం లేదా నైతిక పరిపక్వత లేదా యోగ సిద్ధులు (తాంత్రికులకు సంబంధించినవి) లేదా అతీత (చిన్మయ) దేహం అనేవిగా నేను తలంచడం లేదు. నేను ఈ రుపాంతరీకరణ ప్రక్రియను ఒక ప్రత్యేక భావంతో తీసుకుంటున్నాను. ఉనికికి సంబంధించి ఆధ్యాత్మిక పరిణామంలో ఒక దృఢమైన భరోసాతో కూడిన అడుగు వేయడానికి, ఊహించిన ఒకానొక నిర్దిష్టమైన, ఒక ప్రత్యేకమైన జాతికి సంబంధించి, చేతనతో ఒక సమూలమైన సంపూర్ణమైన పరివర్తన, ప్రాణిక, భౌతిక జంతు ప్రపంచంలో మానసిక జీవి మొట్ట మొదట కనిపించినప్పుడు ఆ బయటకు వచ్చిన చేతనలోని చిన్నపాటి నిర్ణయాత్మక ఘనకార్యం కంటే ఒక గొప్ప ఉన్నత జాతికి చెందిన ఒక సంపూర్ణమైన పెనుమార్పుతో కూడిన ముందడుగు. దానికి తగ్గిందేదయినా చోటు చేసుకొన్నా లేదా దానిని ఆధారంగా చేసుకొని ఒక నిజమైన ప్రారంభం కనీసం జరుగకపోయినా ప్రాథమిక ప్రగతి నెరవేరుపు వైపు జరుగకపోయినా నా ఉద్దేశ్యం నెరవేరనట్లే. ఒక పాక్షికమైన సిద్ధి గాని మిశ్రమంగా, అసంపూర్ణంగా ఏర్పడింది గాని నేను జీవితం, యోగం ద్వారా కోరేదాన్ని అందించదు.

CWSA 29:398

వ్యక్తిగత సిద్ధి, రూపాంతరీకరణం

నీవు రెండు విధాలుగా పొరపడ్డావు. మొదటిది దీనిని (మానసిక, ప్రాణిక, శారీరక రూపాంతీకరణను) సాధించే గొప్ప ప్రయత్నం కొత్తది కాదు. దీనిని కొందరు యోగులు సాధించారు. కాని అది నేను కోరుకునే పద్ధతిలో కాదని నేను విశ్వసిస్తున్నాను. వారు యోగసిద్ధిద్వారా సంభవించే వ్యక్తిగత సిద్ధిగా

దానిని సాధించారు అంతే తప్ప ప్రకృతి ధర్మానికి అనుగుణ్యంగా కాదు. రెండవది ఈ అతి మానస రూపాంతరీకరణం మానసిక ఆధ్యాత్మిక పరమైనది కాదు. అధిమానసిక, మానసిక ఆధ్యాత్మిక పరమైనది సాధించలేని మనస్సు, ప్రాణిక శరీరాల పరివర్తనం.

CWSA 29:414

ఈ యోగానికి, ఇతర ప్రాచీన యోగాలకున్న వ్యత్యాసం

ఈ యోగానికి పూర్వయోగాలకి మధ్య భేదం అని అంటే అవి అసమర్థమైనవి, నేను చెబుతున్న వాటిని నెరవేర్చలేనివి అని కాదు. వాటిని అవి చాలా సాధించగలవు. కాని అవి ఆత్మ సాక్షాత్కారం నుండీ నిర్వాణానికి లేదా ఏదో స్వర్గయానం లేదా జీవితాన్ని వదిలిపెట్టిపోయే దిశగా ముందుకు సాగుతాయి. ఈ యోగం జీవితాన్ని వదిలిపెట్టదు. ఈ అతిమానం అన్నది ఈ పార్థివ జీవన, అస్తిత్వాల రూపాంతరీకరణానికి ఆవశ్యకమైనది. ఆత్మను చేరుకోవడానికి కాదు. మొదట ఈ మనిషి ఆత్మను సాక్షాత్కరించుకోవాలి. తరువాత మాత్రమే అతడు అతి మనస్సును సాక్షాత్కరించుకోగలడు.

CWSA 29:405

ప్రతి భాగం ద్వారా దివ్యానందం

మేము పూర్ణయోగంగా పరిగణిస్తున్న సమన్వయ పూర్వకమైన యోగ లక్ష్యం మన స్వభావంలోని ప్రతి భాగం ద్వారా వేరుగా లేదా ఏక కాలంలో దైవానికి చెందిన ఆనందం, చైతన్యంతోనూ, ఐక్యత, అస్తిత్వంతో కలయిక... కానీ సమస్తం ఒక సుదీర్ఘ అంతంలో సమైక్యమైపోతాయి. ఒకదానికొకటి కుదిరిపోతాయి. ఆ విధంగా సర్వం అస్తిత్వానికి సంబంధించిన ఒక దివ్య స్వభావంలో రూపాంతరీకరించబడుతుంది.

CWSA 23-24:587

ప్రకృతి చేసే విస్తృత యోగం

కాని ఈ సమస్త జీవితం ఈ కనిపించే ఆకారాల వెనుకకు చూచినట్లయితే ప్రకృతి చేసే విస్త ృత యోగం ఇది, ఆమె సచేతనంగా, ఉపచేతనంగా ఇంకాసిద్ధింపని శక్తి సామర్థ్యాలకు చెందిన ఎన్నిటికీ పెరుగుతూ పోయే

అభివ్యక్తీకరణలో తన పరిపూర్ణతను సిద్ధింప చేసుకోవడానికి, తన సహజసిద్ధమైన తన స్వీయ దివ్య యథార్థతతో తనను ఏకం చేసుకోవడానికి ప్రయత్నిస్తుంది.

CWSA 23-24:6

ఒక నూత్న ప్రయాస : అతి మానస రూపాంతరీకరణ

అధిగమనం, రూపాంతరీకరణలు రెండూ విభిన్న అంశాలు. ఈ సాధనలో రూపాంతరీకరణలోని మూడు రకాలు లేదా దశలపై దృష్టి కేంద్రీకరించ బడుతుంది. అంతరాత్మిక రూపాంతరీకరణ, ఆధ్యాత్మిక, అతి మానసిక రూపాంతరీకరణ, మొదటి రెండు విధానాలపై పూర్వపు యోగాలు వాటి వాటి పద్ధతిలో పని చేసినాయి. ఆఖరిది మాత్రం నూతన మహా ప్రయత్నం. ఆధ్యాత్మిక సిద్ధికై తగిన రూపాంతరీకరణం పూర్వపు రెండింటి ద్వారా సిద్ధిస్తుంది. కానీ నా దృష్టిలో మానవ జీవనం దివ్యీకరింపబడటం కోసం తగిన రూపాంతరీకరణ, అతి మానస పరివర్తన ద్వారా తప్ప సాధ్యపడదు.

CWSA 23-24:587

రూపాంతరీకరణ అంటే

రూపాంతరీకరణ అంటే ఉన్నత చేతన లేదా ప్రకృతిని ఈ మనస్సు, ప్రాణికం, శరీరంలోకి దింపుకు రావడం, నిమ్నమైన దానిని ఆక్రమించడం. ఒక నిజాత్మకు చెందిన ఉచ్ఛతర చేతన ఉంది. అది అధ్యాత్మికమైనది. అది పైన ఉంది. ఎప్పుడైతే మనిషి దానిలోకి, పైకి లేస్తాడో అప్పుడు అతడు అక్కడున్నంత వరకూ ముక్తుడై ఉంటాడు. మళ్ళీ క్రిందికి దిగితే మనస్సు, ప్రాణ శరీరాలను ఉపయోగించుకుంటాడు. ఒకవేళ అతడు జీవితంతో ఏదైనా సంబంధం కల్గిఉంటే అలా చేసి తీరాల్సి ఉంటుంది. అంటే క్రిందికి దిగి వచ్చి సామాన్య చేతనతో పనిచేయాలి లేదా ఆత్మస్థితిలోనే ఉండి మనస్సు, ప్రాణ, శరీరాలను ఉపయోగించుకోవాలి. అప్పుడే ఉపకరణాల్లోని అపూర్ణతల్ని ఎదుర్కోవాలి, సరిచేయాలి. అవి రూపాంతరీకరణ వల్ల మాత్రమే సరిచేయబడతాయి.

CWSA 30:423

మన యోగం రూపాంతరీకరణ యోగం

మన యోగం రూపాంతరీకరణ యోగం. కానీ ఆ రూపాంతరీకరణ మొత్తం చేతనకు చెందినది. ఆపాదమస్తకం మొత్తం స్వభావానికి చెందినది. లోపల దాగి ఉన్న భాగాలను మొదలు కొని స్పర్శనీయ బాహ్య కదలికల వరకూ పరివర్తన జరగాల్సిన ప్రక్రియ. ఇది ఒక నైతికమైన మార్పు లేదా ఒక మతపరమైన మార్పు కాదు, సాధుత్వాన్ని పొందడం లేదా సన్యాసి చేసుకొనే స్వయం నియంత్రణ కాదు. మనం చూచే శుద్ధీకరణ లేదా ప్రాణిక జీవన గతుల అణచివేత కాదు. మహిమను కల్గచేయడం లేదా ఒక బలవంతపు నియంత్రణ లేదా భౌతిక మనుగడను తిరస్కరించడం కాదు. మనం చూస్తున్నది అతి స్వల్పం మొదలు భారీస్థాయిలో మార్పు, నిమ్నం నుండీ ఉన్నతంలోకి, ఉపరితలం నుండీ ఒక నిగూఢ చేతనలోకి మార్పుచెందడం. నిజంగా ఒక భారీదైన, ఉన్నతమైన, లోతైన, సంపూర్ణమైన మార్పు. మొత్తం ఉనికి, దాని ద్రవ్యరాశిలో, పదార్థంలోను, ఒక తిరుగుబాటు, దాని ప్రతి వివరణలో ఇంకా సిద్ధించని, అనుభవంలోకి రాని, అస్థిత్వానికి చెందిన దివ్యతర స్వభావంలోకి మార్పుచెందడం. అంటే దీనర్థం లోపల దాగి అంతర్లీనంగా వున్న దానిని ముందుకు తేవడం, ప్రస్తుతం మనకు అత్యంత ఉన్నత చేతనాత్మకంగా ఉన్న దానిలోకి సచేతనంగా ఎదగడం. అధో చేతన, అధో భౌతికాల్లో ఒక ఉద్దీప్తి. ప్రస్తుతం మనస్సు ద్వారా నియంత్రితమయ్యే స్వభావం అంతరాత్మ ద్వారా నియంత్రితమయ్యే ఒక ప్రత్యామ్నాయాన్ని అది సూచిస్తుంది. బాహ్యం నుండి ఇప్పటికీ సగం మూసుకొని ఉన్న అంతర మనస్సులోకి ఈ స్వభావ సాధనా సంపత్తిని బదిలీ చేయడం, బాహ్య ప్రాణికం నుండీ అంతర ప్రాణికం లేదా ప్రాణికాత్మలోకి, బాహ్యం నుండీ ఒక ఆంతరిక సూక్ష్మాంశాల భౌతిక చేతనలోకి స్థానాంతరణ. ఈ బదిలీ ప్రక్రియతో అడ్డదిడ్డంగా, అచేతనంగా లేదా అర్థచేతన పూర్వక సంబంధంతో కాక తిన్ననైన, సచేతనమైన సంబంధంతో మనల్ని నడిపించే విశ్వశక్తులతో మేళవించడం. విశాల వైశ్విక చేతన కోసం ఈ సంకుచిత మిత వ్యక్తిని విడగొట్టడం, మానసిక స్వభావంలో నుండీ ఆధ్యాత్మిక స్వభావంలోకి ఆరోహణ, ఇప్పటి మనస్సులోని ఆత్మశక్తి లేదా అతి వ్యాప్త మనస్సు నుండీ అతిమానస శక్తిలోకి ఆరోహణ. ఆ అతిమానస శక్తితో ఈ మూర్తీభవించిన జీవునిలోకి అవరోహించడం.

ఇదంతా రూపాంతరీకరణ సంపూర్ణంగా ఎదగడానికి ముందే దానిని సాధించడమే కాదు దాని నిర్వహణ జరుపబడుతూ ఉండాలి.

CWSA 12:371

సత్యానికి సమగ్రమైన మార్గం

పూర్తి యథార్థతత్వాన్ని 'చింతన' చేయడం ద్వారా కాదు, చేతనలో మార్పు ద్వారా ఒక మనిషి అజ్ఞానంలో నుండీ జ్ఞానానికి ప్రయాణిస్తాడు. జ్ఞానం ద్వారా మనం తెలుసుకోవలసింది తెలుసుకొన్నదానిగా అవ్వడం. బాహ్యం నుండి సూటైన, సన్నిహితమైన ఆంతరిక చేతనలోకి వెళ్ళడం, అహంకార పరిమితులు నుండి శరీరం నుండి ఒక చేతనను విశాలపర్చుకోవడం, ఆ చేతనను ఒక ఆంతరిక సంకల్పం ద్వారా ఆకాంక్ష ద్వారా ఉన్నతీకరించి, మనస్సును అధిగమించి దివ్య ప్రకాశంలోకి పయనించి దానికి తెరుచుకోవడం, మనస్సును, ప్రాణికాన్ని, శరీరాన్ని రూపాంతరీకరించే ఫలితంతో ఆత్మ సమర్పణ, శరణాగతి ద్వారా అతి మానస దైవావతరణ జరిపించడం ఇదే సత్యానికి సంబంధించి సమగ్రమైన విధానం. దీనిని ఇక్కడ మనం సత్యంగాను, మన యోగానికి లక్ష్యంగాను పిలుస్తున్నాం.

నేను ముందే చెప్పాను కదా! అతిమానసం అనే భావన ప్రాచీన కాలం నుండీ ఉనికిలో ఉన్నది. భారతదేశంలోనూ ఇంకా ఇతర చోట్ల కూడా దాని స్థాయికి లేచి దానిని చేరుకునే ప్రయత్నం జరిగింది. కాని ఆ ప్రయత్నాన్ని జీవితం కోసం సమగ్రం చేసి, మొత్తం భౌతిక స్వభావంతో పాటు స్వభావాన్నంతా రూపాంతరీకరణ గావించేందుకు దానిని క్రిందకు దింపే పద్ధతి అక్కడ లోపించింది.

CWSA 28:355

రూపాంతరీకరణ నియమాలు

స్థిత ప్రజ్ఞుడిగా ఉండటం అంటే ఆత్మ సాక్షాత్కారంలోని ఆధ్యాత్మిక చేతనలో చింతనశీల మనస్సు సుస్థిరమైపోవడం, అది స్వభావంలోని ఇతర భాగాలను అవశ్యం రూపాంతరం చెందించదు. ఉచ్చతర చేతనకు చెందిన మహాశక్తిని, మహోజ్వల ప్రకాశాన్ని క్రిందకు అవతరింపజేయడం. అంతరాత్మ,

మనస్సు, ప్రాణికం, భౌతిక కేంద్రాలను తెరవడం, ఉచ్ఛతర చేతనకు, అంతరాత్మకు క్రియాకలాపాలకు స్వభావాన్ని సరళ పరచి పూర్తి సమ్మతితో తెరుచుకోవడం, ఆఖరికి అతిమానసానికి తెరుచుకోవడమే రూపాంతరీ కరణానికి ఉన్న నియమాలు.

CWSA 30:33

మూడు ఆవిష్కరణలు

వ్యక్తిలో దైవత్వాన్ని కనుగొనటం అతని ప్రప్రథమ ధ్యేయం కానీ ఈ విశ్వ ప్రణాళిక, రూపాలు కల్పించే బాహ్య తిరస్కృతి వెనుక కూడా సంపూర్ణమైన దివ్యత్వాన్ని కనుగొనటం, పరాత్పర శాశ్వతపు చైతన్యానికి చెందిన పరిపూర్ణమయిన ఆవిష్కరణ కూడా. ఎందుకంటే దాని అవరోహణతోనే ఈ విశ్వము, వ్యక్తి తమ మారువేషపు ముసుగులను ఛేదించుకొనే శక్తిని పొంది వ్యక్తీకరించే రూపంలోనూ ఆవిష్కరించే క్రమంలోనూ ఏదయితే ప్రస్తుతం వాటి నిగూఢమైన సారమై ఉందో ఆ దివ్యత్వాన్ని పొందగలవు.

CMSA 23: 24 : 170

ప్రగతి శీలమయిన ఆవిష్కరణ, చైతన్య వంతమయిన నూతన సృష్టి

సమగ్ర యోగంలో మన ఆధ్యాత్మిక స్థితి యొక్క ప్రగతి శీలమయిన ఆవిష్కరణ ఉంటుంది. ఈ ప్రగతి మన ప్రకృతి యొక్క ఒక చైతన్య వంతమయిన సరికొత్త నూతన సృష్టిచే అనుసరించబడుతుంది. త్రివిధమయిన రూపాంతరీకరణ దాని మార్గము, దాని సంపూర్ణ వైశిష్ట్య ప్రకటన.

మొదటి ఆవిష్కరణ అంతరాత్మ మారువేషపు ముసుగు లేదా మరుగుపరచే తెరను, ప్రతి బంధకమయిన మనోమయ, ప్రాణిక, శారీరక కుడ్యాన్ని తొలగించు కోవటం. చైత్యపురుష, మన ప్రకృతిలో ఉన్న దివ్యాంశ ఏదయితే దాని శాశ్వతత్వాన్ని, అమృతత్వాన్ని ఆపాదిస్తుందో, అది మన ఉపకరణాలను పాలించే అధికారిగా వాటిని చైతన్య వంతమయిన ఆధ్యాత్మిక ప్రతినిధులుగా మారుస్తుంది. అందువలన అవి అజ్ఞాన ప్రకృతికి చెందిన మారిపోయే సూత్రాలుగా ఉండవు.

CWSA12:369

మిగతా యోగాల ముఖ్యాంశాలు

ఆత్మ మరియు విశాత్మ సాక్షాత్కారము (విశ్వాత్మ సాక్షాత్కారం లేకుండా ఆత్మ సాక్షాత్కారం అసంపూర్ణం) అనేవి మన యోగంలో ప్రముఖమయిన అంశాలు. అవి మిగిలిన యోగాలలో చివరి గమ్యాలు. కానీ అవి మన యోగానికి ప్రారంభం. అంటే అక్కడ మన ప్రత్యేకమయిన సిద్ధి ప్రారంభమయ్యే స్థానము. బహుశా సిద్ధి ఒక తొలి స్పర్శగా మాత్రమే కలుగవచ్చు. తరచుగా అలానే వచ్చి తరువాత చైతన్యం దానిని సాధారణ స్థితిగా నిలుపుకొనే వరకూ పునరావృత్తమౌతూ ఉంటుంది.

CWSA 32: 334

మూడు సోపానాలు

ఆత్మ, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పొందటంలో ఆత్మ సాక్షాత్కారం యొక్క మూడు సోపానాలు ఉంటాయి. అవి ఏక కాలంలో ఒకే జ్ఞానానికున్న మూడు అంశాలు. మొదటిది అంతరాత్మను కనుగొనటం, బాహ్యమయిన ఆలోచనలు భావావేశాలు, కోరికలు కాక నిగూఢమయిన చైత్య పురుష మనలో దివ్యాంశ అయి వున్నది. అది ఎపుడయితే మన ప్రకృతిపై ఆధిపత్యం సాధిస్తుందో, ఎప్పుడైతే మనం చైతన్యవంత మయిన అంతరాత్మగా ఉంటామో, అపుడు మనసు, ప్రాణికము, శరీరాలు తన ఉపకరణాలుగా వాటి నిజస్థానాన్ని తీసు కుంటాయి. సత్యము, మంచి, మనుగడకు చెందిన నిజ ఆనందం, సౌందర్యం తెలిసి హృదయాన్ని, బుద్ధిని తన తేజోమయమైన సూత్రంతో, మన జీవితాన్ని, మనలను ఒక ఆధ్యాత్మిక పరిపూర్ణత వైపు నడిపించే ఒక నేత, అజ్ఞానపు అస్పష్ట కార్యం ముసుగులో మనకొక విచక్షణాయుతమైన సాక్షి, ఉద్దీపింప చేసే ఒక సజీవమైన వెలుగు, అపమార్గంలో వెళ్ళటాన్ని తిరస్కరించే సంకల్పం, మనసుకున్న సత్యాలను, దోషాలను వేరు చేసి, ఒక అసత్యమయిన పిలుపుకు, కోరికకు హృదయపు సన్నిహిత స్పందన ప్రకంపనలను, జీవనపు సత్యమైన దృఢ నిశ్చయాన్ని, ప్రాణిక వ్యామోహం నుండి అసంఖ్యాక మయిన కదలికలు, ప్రాణిక ప్రకృతిలోని అల్లకల్లోలమైన అసత్యాలు, తమో మయమైన కోరికల నుండి వేరు చేస్తుంది. ఆత్మ సాక్షాత్కారానికి చెందిన తొలి సోపానం, ఆత్మకు పట్టాభిషేకం. అహం స్థానే దివ్యమయిన చైత్య పురుషను ఉంచటం, తరువాతి

అడుగు మనలో జన్మరహితమయిన శాశ్వతాత్మ ఎరుకను పొందటం. ఏదయితే సకల భూతముల ఆత్మలో ఏకమై ఉంటుందో దానిని తెలుసుకోవటం. ఈ ఆత్మసిద్ధి మోక్షాన్నిచ్చి విశ్వజనీనం చేస్తుంది. మన కర్మ యింకా అజ్ఞానపు చేతనలో సాగుతున్నప్పటికీ, అది ఆపై బంధించటం గాని పెడత్రోవ పట్టించటం గానీ చేయదు. ఎందుకంటే మన అంతరాత్మ ఆత్మ జ్ఞానపు వెలుగులో ఆసీనమయి ఉంది. మూడవ సోపానం మన పరమోన్నత విశ్వాతీత ఆత్మ అయిన పరమాత్మను తెలుసుకోవటం. మన విశ్వజనీనతకు ఆధారమయిన విరాట్పురుషుడు : మనలోని దివ్యత్వం మనలో నిజంగా పరిణామం చెందే చైత్యపురుష - ఒక అంశం, ఒక విస్ఫులింగం, ఒక జ్యోతి ఏదయితే తాను దేని నుండి వెలిగించబడిందో ఆ శాశ్వత జ్వాలగా ఎదిగి, ఎల్లపుడూ సజీవంగా, ఆ శాశ్వత తేజస్సుకు సాక్షిగా మనలో తన వెలుగుకూ, శక్తికీ, ఆనంద సౌందర్యాలకూ ఒక చైతన్య వంతమయిన ఉపకరణంగా ఉంటుంది. దైవం మన ఉనికికీ చర్యలకు ప్రభువని తెలుసుకొని ఆయన శక్తికి, ఆ పరాశక్తికి వాహికలుగా మారటం నేర్చుకుందాం. ఆమె ఆజ్ఞలకు లేదా మనలో ఆమె తేజో శక్తిపాలనకు అనుగుణంగా నడుచుకుందాం.

CWSA 21-22- 653-654

విశ్వాతీత, విశ్వాత్మక, వైయక్తిక దైవం

భగవంతుని మూడు రూపాలు

1. విశ్వాత్మకమయిన రూపం : ఏదయితే అన్ని వస్తువులలో ప్రాణులలో, వాటి వెనుక ఉన్నదో, దేని నుండి, దేనిలో విశ్వమంతా ఆవిర్భవించిందో - ప్రస్తుతమది అజ్ఞానంలో ప్రతిష్ఠితమయి ఉన్నప్పటికీ

2. మనలోని ఆత్మ, ప్రభువు అతడే. ఆయనను మనం సేవించి మన కార్యాలన్నిటిలో ఆయన సంకల్పాన్ని వ్యక్తపరచి, అజ్ఞానం నుండి వెలుగులోకి ఎదగగలం.

3. దైవం విశ్వాతీత, పరాత్పర పురుషుడు, పరమాత్మ ఆనందమయుడు, తేజో స్వరూపుడు, దివ్య జ్ఞానము, శక్తి, ఆ సర్వోన్నత దివ్య జీవనంలోకి, వెలుగులోకి మనం ఎదిగి ఆ సత్యాన్ని మన జీవితంలోకి ఎరుకలోకి తీసుకురావాలి.

సాధారణ ప్రక్రియలో మనం అజ్ఞానంలో జీవించడం వలన దైవాన్ని తెలుసుకోలేము. సాధారణ ప్రకృతి శక్తులు అదైవికాలు. ఎందుకంటే అవి అహంకారము, కోరికలు, అచేతన అనే తెరను నేస్తాయి. దాని వలన దైవం మన నుండి మూసివేయబడతాడు. భగవంతుని తెలుసుకుని ఆయనలో చైతన్యవంతంగా జీవించగల, ఉన్నతము, గంభీరమైన చైతన్యస్థాయిని మనం చేరుకొని, నిమ్న ప్రకృతి శక్తుల నుండి తప్పించుకొని, దివ్యశక్తి పనితీరుకు మనం తెరుచుకున్నపుడు,మన చైతన్యం దివ్య ప్రకృతిగా రూపాంతరీకరణ చెందించబడుతుంది. దైవానికి చెందిన ఈ అవగాహన నుండి మనం ప్రారంభించినపుడు ఆ సత్య స్థితి కేవలం మన చైతన్యం వికసించి మార్పు చెందినపుడే సాధ్యం.

- శ్రీ అరవిందులు

శ్రీమాత అస్తిత్వపు మూడు విధానాలు

ఈ విశ్వాన్ని, మనలను, నిలబెట్టే చేతనాశక్తితో ఏకతను స్పృశించినపుడు శ్రీమాత అస్తిత్వపు మూడు విధానాలను తెలుసుకోగలము. విశ్వాతీతమైన సర్వోన్నత ఆద్యశక్తిగా ప్రపంచాల పైన నిలబడి ఈ సృష్టిని ఎప్పటికీ పరమాత్మ అవ్యక్త మార్మికతకు అనుబంధిస్తుంది. విశ్వగతంగా, వైశ్విక మహాశక్తిగా ఈ జీవులనంతా సృష్టిస్తూ, నిక్షిప్తం చేసుకుంటూ, వాటిలోకి ప్రవేశిస్తూ ఈ కోట్లాది విధానాలను, శక్తులను బలపరుస్తూ, నిర్వహిస్తూ వుంటుంది. వ్యక్తిగతంగా ఆమె అస్తిత్వానికి చెందిన ఈ రెండు విస్తార విధానాల శక్తిని ధరించి, వాటిని జీవింపజేస్తూ, మనకు దగ్గరచేస్తూ, మానవ వ్యక్తిత్వానికి, దివ్యప్రకృతికి మధ్యవర్తిత్వం చేస్తుంది.

CWSA 32:14

ఆధ్యాత్మిక అస్తిత్వపు క్రియాశీలకతలోని మూలకాలు

విశ్వాతిశయానికి, విశ్వగతానికి, వ్యక్తిగత దైవానికి మధ్యన భేదం నా ఆవిష్కరణ కాదు.... యోగసాధనలో సంభావ్యమయ్యే ఈ మూడు సాక్షాత్కారాలతో వ్యక్తి వ్యవహరించే విధానంలో ఒక గొప్ప శక్తికల భేదముంది. ఒకవేళ నేను దైవాన్ని నా వ్యక్తిగత ఆత్మగా కాకుండా దైవంగా సాక్షాత్కరింప జేసుకుంటే , అది ఇంకా నా మొత్తం వ్యక్తిగత అస్తిత్వంలో చలిస్తూవుంటే,

దానిని నేను ముసుగు నుండి బయటకు తీసుకురాగలిగితే, లేదా ఆ దేవత ప్రతిమను నా భాగాలలో నిర్మించుకుంటే అది సాక్షాత్కారమే అవుతుంది, కానీ పరిమితంగా వుంటుంది. అదే నేను విశ్వదేవతను సాక్షాత్కరించుకుని, అందులో నా మొత్తం వ్యక్తిగత ఆత్మను పోగొట్టుకుంటే అది ఎంతో విశాలమైన సాక్షాత్కారమే అవుతుంది కానీ నేను కేవలం విశ్వశక్తి వాహకం అవుతాను తప్ప అక్కడ దివ్యంగా వ్యక్తిగతమైన సిద్ధి వుండదు. ఒకవేళ నేను కేవలం విశ్వాతిశయ సాక్షాత్కారాన్ని మాత్రమే సాధిస్తే, నన్ను, ప్రపంచాన్ని రెండింటిని సర్వాతిశయ సమగ్రునిలో కోల్పోతాను. ఇంకోవైపు ఇవేవీ నా లక్ష్యం కాకపోతే, భగవంతుని సాక్షాత్కరించుకుని ఈ ప్రపంచంలో అభివ్యక్తం చేయడమే నా లక్ష్యమౌతుంది. ఇంకా అభివ్యక్తం కాని శక్తిని క్రిందకు తీసుకురావడమే నా ప్రయోజనమౌతుంది - అది అతిమనసు- ఈ మూడింటికి మధ్యన ఒక సామరస్యత విధాయకమవుతుంది. దానిని నేను క్రిందకు తీసుకురావాలి, కానీ ఎక్కడ నుండి క్రిందకు తేవాలి- అది ఇంతవరకు విశ్వనియమంలో అభివ్యక్తం కాలేదు- లేకపోతే నేను చేరవలసిన, సాక్షాత్కరించుకోవలసిన అనభివ్యక్త విశ్వాతిశయం నుండి కాకపోతే ? విశ్వనియమంలోకి దానిని తీసుకురావాలి అంటే నేను విశ్వదైవాన్ని సాక్షాత్కరించుకుని, విశ్వాత్మ గురించి, విశ్వశక్తుల గురించి చైతన్యవంతం కావాలి. కానీ దానిని నేను ఇక్కడ రూపొందించాలి,- లేకపోతే అది కేవలం ఒక ప్రభావంలా మిగిలిపోతుంది తప్ప భౌతికప్రపంచంలో స్థిరపరచిన అంశంగా వుండదు- ఇది వ్యక్తిలోని దైవం ద్వారా మాత్రమే జరుగగలదు.

ఇవి ఆధ్యాత్మిక అనుభవ క్రియాశీలతల్లోని మూలకాలు, ఒక దివ్యకార్యం నిర్వర్తించాలంటే వాటిని సమ్మతించ బద్ధుడను కావాలి.

అతిమానసయోగంలో మొదటి, చివరిదైన పదము సమర్పణే

అతిమానస యోగంలో మొదటి పదం సమర్పణ. దాని చివరిపదం కూడ సమర్పణే. దివ్యచైతన్యంలోకి ఉద్ధరించబడటం కోసం, పరిపూర్ణత కోసం, రూపాంతరీకరణ కోసం శాశ్వతదైవానికి తనను తాను అర్పించుకునే సంకల్పంతో ఇది మొదలవుతుంది. సంపూర్ణంగా ఇచ్చుకోవడంతో ఇది

శిఖరాగ్రానికి చేరుతుంది. ఇలా తననుతాను ఇచ్చుకోవడం పూర్తయిన తర్వాతే యోగాంతిమం, అతిమానస దైవంలోకి అంతఃశోషణ, అస్తిత్వ పరిపూర్ణత, స్వభావ రూపాంతరీకరణ సంభవిస్తుంది.

CWSA 12:367 - *శ్రీఅరవిందులు*

తిరిగి దాని మూలానికి దానిని అర్పించాలి

యోగంలో వ్యక్తి పురోగమించడానికి జీవితంలో కలిగివున్న, నిర్వర్తించిన సమస్తమూ భగవంతునికి అర్పించాలని చెప్పబడింది. స్పష్టంగా దీని అర్థం ఏమిటి ?

యోగమంటే భగవంతునితో సంయోగం, ఈ సంయోగం అర్పణ ద్వారా సఫలమవుతుంది - ఇది నిన్ను నీవు దైవానికి అర్పించుకోవడం మీద స్థాపితమవుతుంది. ప్రారంభంలో ఈ అర్పణను ఒక సాధారణ విధానంలో చేయడంతో ప్రారంభిస్తావు, అది ఎప్పటికీ అన్నట్లుగా ఇలా అంటావు, "నేను భగవంతుని సేవకుడను : నా జీవితం పూర్తిగా దైవానికే అర్పితమయ్యింది : నా సకల ప్రయత్నాలు దివ్యజీవనాన్ని సాక్షాత్కరింపజేసుకోవడానికే." కానీ అది మొదటి అడుగు మాత్రమే. ఎందుకంటే ఇది సరిపోదు. నువ్వు ప్రతిజ్ఞ తీసుకున్నపుడు, నీ మొత్తం జీవితం దైవానికి ఇవ్వాలని నిర్ణయించుకున్నపుడు, ప్రతి క్షణము దానిని గుర్తుంచుకుని నీ అస్తిత్వపు అన్ని వివరణలలో దానిని కొనసాగించవలసి వుంటుంది. ప్రతి దశలో నువ్వు దైవానికి చెందినవాడవని అనుభూతి చెందాలి. నువ్వు ఏదీ ఆలోచించినా, ఏది చేసినా ఎప్పటికీ నీద్వారా పనిచేస్తున్నది దివ్యచైతన్యమనే స్థిరమైన అనుభవం వుండాలి. నీ స్వంతమని చెప్పుకునేదేదీ నీకు వుండదు. ప్రతిదీ భగవంతుని నుండే వస్తున్నదని అనుభూతిచెందాలి, దానిని తిరిగి దైవానికే అర్పించుకోవాలి. ఇది నువ్వు వాస్తవం చేసుకున్నపుడు, సాధారణంగా నువ్వు శ్రద్ధ పెట్టని, లెక్కచేయని అతి చిన్న అంశం కూడ అల్పంగా, అప్రాముఖ్యంగా అనిపించడం ఆగిపోతుంది. పూర్తి అవగాహనతో అతీతంలో ఒక విస్తార దిఙ్మండలాన్ని ఆవిష్కరిస్తుంది.

CWM 3:23 - *శ్రీమాత*

Vol. 53, No. 3
March 2023


Date of Publication
1st March 2023

Registered: PY/41/2021-23

AKHILA - Akhila Bharata Patrika (Telugu)

Registered with the Registrar of Newspapers for India: No. 23593/72 (monthly)

Matter shall reveal the Spirit's face. — Sri Aurobindo



Owner: Sri Aurobindo Society
Printer: Swadhin Chatterjee for Sri Aurobindo Ashram press
Publisher: Pradeep Narang for Sri Aurobindo Society
Published from: Society House, 11 Saint Martin Street, Puducherry - 605001
Printed from: Sri Aurobindo Ashram Press,
No. 38, Goubert Avenue, Puducherry - 605 001, India
Editor: K. V. Rao

Single copy Rs. 30 **Annual Subscription Rs. 200 (in India)**

A Monthly Published by
SRI AUROBINDO SOCIETY-605001



అఖిల

అఖిల భారత పత్రిక

ఏప్రిల్ 2023

కవల అవతారాల లీల


విషయ సూచిక

సంపాదకీయం :

బాహ్య పృధ్వీరంగస్థలం నుంచి ఉపసంహరించకొనడంతో అవతారలీల ఆగిపోదు. విశేషించి అది మరింత గొప్పశక్తితో, గతిశక్తిని పొందుతుంది. పదార్థ ప్రపంచంలో ఒక ప్రత్యేక కార్యనిర్వహణ కవసరమైన భౌతిక దేహంలోనికి అవతారంగా దిగివచ్చి అభివ్యక్తమైన దివ్య చేతన, దివ్య క్రియాశక్తి, ఆ దేహం నుండి స్వేచ్ఛ పొంది మరింత శక్తివంతమైన రీతిలో పనిచేయ ప్రారంభిస్తుంది. అంతమాత్రమే గాదు దివ్యమానవీయంగా తయారైన భౌతిక మూర్తిత్వం భువికి, విశ్వాసంతో ఉన్ముఖమై, వారిమీదే దైవ కార్యం కోసం ఆధారపడిన వారికి సహాయం కొనసాగిస్తూనే ఉంటారు. దైవ ఆగమనానికి అదే కారణం. కొనసాగుతున్న శ్రీ అరవిందుల లీలను గురించి మదర్ మనకు తెలిపిన విషయాలకు ~~ఈ~~ సంచికనంకితం చేసాం.

అనువాదం : కె.వి. రావు





ఆయన లేకుండా నా ఉనికి లేదు

నేను లేకుండా ఆయన అభివ్యక్తం కారు

- శ్రీమాత

శ్రీ అరవిందుల నివాసం

ఉపసంహరణ నిర్ణయం

నేను ఒకసారి శ్రీ అరవిందులతో జరిపిన సంభాషణ, నాకు చాలా స్పష్టంగా, చాలా ఖచ్చితంగా గుర్తుంది (ఇప్పటికీ శ్రీ అరవిందుల గది మొత్తం నా కళ్ళ ముందు మెదులుతోంది) ఆ సంభాషణ ఏ సందర్భంలోనో తెలియదు... ముందు జరిగినది నేను మర్చిపోయాను, మీకు అర్థమైంది అనుకొంటున్నాను). శ్రీ అరవిందులు నాతో "మనం ఇద్దరం ఈ భూమిపై ఉండలేము, ఒకరు వెళ్ళాలి" అని చెప్పారు. అప్పుడు శ్రీ అరవిందుల తో నేను సిద్ధంగా ఉన్నాను, నేను వెళ్తాను" అని చెప్పాను. కానీ శ్రీ అరవిందులు "వద్దు మీరు వద్దు, మీ శరీరం నాకంటే మెరుగైనది, మీరు నా కంటే గొప్ప రూపాంతరీకరణను సాధించగలరు" అని చెప్పారు.

ఇక విచిత్రమేమిటంటే, అది శ్రీ అరవిందులు శారీరక కష్టాలన్నింటినీ ఎదుర్కొనడానికి ముందే జరిగింది.

కానీ నేను ఆ సంభాషణకి అంత ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వడం లేదు, శ్రీ అరవిందులకు ఆ విషయం ముందే తెలుసు, నాకు తెలియదు. శ్రీ అరవిందులు శరీరం వదిలి నపుడు మాత్రమే ఆ ప్రస్తావన అకస్మాత్తుగా తిరిగివచ్చింది. ఇది చాలావరకు ఒక ఊహాగానం లా ఉంది, ఆయన ఏది ఉటంకిస్తున్నారో అది నీకు అర్థం అయింది కదా! ఇది మేము అవతలి ఇంటి నుండి, ఈ ఇంటికి మారుతున్న సమయంలో (ఫిబ్రవరి 1927లో), ఇది ఒకరోజు, ఇక్కడే క్రింది అంతస్తులో జరిగింది. అది దుర్ఘటన, శ్రీ అరవిందుల కాలు విరగటానికి ముందు (24 నవంబర్ 1938లో) జరిగింది, ఏ సందర్భంలో అన్నది గుర్తు లేదు. అది అలా జరిగిపోయింది.

కానీ నాకు స్పష్టంగా, చాలా స్పష్టంగా గుర్తుంది, నేను ఇప్పటికీ ఆగది, గదిలోని ప్రతిదీ, శ్రీ అరవిందులు ఎలా ఉన్నారో, ఏ విధంగా చెప్పారో ఇప్పుడు నా కళ్ళ ముందర కదలాడుతుంది. "మేము ఇద్దరం భూమిపై ఉండలేము" అంతే.

శ్రీమాత : శిష్యునితో సంభాషణ జూలై 26,1969.

చైత్యపురుషతో బంధం

శ్రీ అరవిందులు దేహత్యాగం చేసినపుడు, అంతరాత్మతో సంబంధం తెంచుకోవాలని నాకు తెలుసు, లేకపోతే నేను కూడా శ్రీ అరవిందులతో వెళ్ళవలసి వచ్చేది; శ్రీ అరవిందులకు ఇచ్చిన మాట ప్రకారం, నేను ఇక్కడే ఉండి కార్యనిర్వహణ చేయవలసి ఉంది. నేను అక్షరాలా అంతరాత్మకి సంబంధించిన ద్వారం మూసి వేసాను. "ఈ క్షణానికి అంతరాత్మ ఉనికిలో లేదు." అది పది సంవత్సరాలపాటు అలాగే ఉండిపోయింది, పది సంవత్సరాల తర్వాత అది నెమ్మది, నెమ్మదిగా తెరుచుకోవడం ప్రారంభించింది. అది భయపెట్టింది. కానీ నేను సిద్ధంగా ఉన్నాను. అది మళ్ళీ తెరుచుకోవడం ప్రారంభించింది. ఆ అనుభవం నాకు కలిగినపుడు ఆశ్చర్యం వేసింది; అలా ఎందుకు జరిగింది. ఆ ఆజ్ఞను ఎందుకు పొందాను? దానిని ఎందుకు పాటించవలసి వచ్చింది. దివ్యప్రేమ శరీరంలో తాదాత్మ్యం చెందినపుడు (కొన్ని రోజుల క్రిందట) అది వదిలిపెట్టినపుడు, శరీర కణాలు అదే మాదిరి స్థితికి లోనయ్యే ఆజ్ఞను పొందాయి. అప్పుడే ఈ భౌతిక ప్రపంచం ఎందుకు మూసివేయబడిందో అర్థం చేసుకొన్నాను. ఇది దివ్యప్రేమకు సంబంధించిన అనుభవం లేకుండా ఉనికిలో ఉండటానికి అనుమతించబడటమే. సహజంగానే నేను, ఎందుకు నా అంతరాత్మను మూసి ఉంచానో అర్థం చేసుకొన్నాను. ఎందుకంటే ఇలా చేయడం నిజంగానే అసాధ్యం. శ్రీ అరవిందులు సన్నిధి లేకుండా నేను బాహ్యంగా కొనసాగలేను, కానీ జీవకణాలు దివ్యప్రేమ ఉనికి లేకుండా తమ జీవితాన్ని కొనసాగించాలని అర్థం చేసుకొన్నాయి, అది ప్రపంచం లో ఎలా జరిగింది; ఇది భౌతిక ప్రపంచం ఏర్పడటానికి దాని అభివృద్ధికి అవసరమైన స్వాభావిక స్థితి.

మనము బహుశా సమీపిస్తున్నాము, అంతరాత్మ మళ్ళీ తెరచుకోవడానికి అనుమతింపబడే సమయానికి సమీపిస్తున్నాము.

శ్రీమాత : శిష్యునితో సంభాషణ జూలై ***24,1966***

ప్రపంచం సిద్ధంగా లేదని మనం చెప్పవచ్చు, కానీ నీకు నిజం చెప్పాలంటే శ్రీ అరవిందుల చుట్టూ ఉన్న సమస్తం సిద్ధంగా లేదు, ఆయన దాన్ని చూసినపుడు, ఆయన అక్కడ లేకపోతే, అది చాలా వేగంగా జరుగుతుందని, శ్రీ అరవిందులు గమనించారు.

నాకు తెలియకుండా ఉండేందుకు, ఏదో అపస్మారక స్థితి, సాధారణ అనారోగ్యం ఉన్నట్లు శ్రీ అరవిందులు అన్నింటినీ భరించారు. తాము బయలుదేరాల్సిన క్షణంలో ఆయన వెళ్ళి పోయారు, కానీ.... శ్రీ అరవిందుల దేహత్యాగం తర్వాత, ఆయన వెళ్ళిపోయారని అసలు ఊహించ లేక పోయాను. అక్కడే నాముందే, అది చాలా దూరంగా అనిపించింది. ఆపై శ్రీ అరవిందులు తమ శరీరం నుండి బయటకు వచ్చి, నాలో ప్రవేశించినపుడు, నేను అంతా అర్థం చేసుకొన్నాను. అది చాలా అద్భుతంగా ఉంది.

ఇది పూర్తిగా మానవాతీతమైనది, అలాంటి పని చేయగల సామర్థ్యం ఏ మానవ మాత్రునికీ కూడా లేదు. శ్రీ అరవిందులకు తమ శరీరంపై సంపూర్ణమైన పట్టు ఉంది.

సూక్ష్మ శరీరంలో శ్రీ అరవిందుల నివాసం

మొదటి అతి మానస శరీరంతో మాత్రమే, తిరిగి వస్తానని శ్రీ అరవిందులు ఇప్పటికే చెప్పారు. మొదటి అతిమానస శరీరం శ్రీ అరవిందులది అని ఆయన ప్రకటించారు. అది ప్రస్తుతానికి కాదు, దానికి చాలా సమయం ఉంది. మనము వేచి ఉండవచ్చు. భూమి ఇంకా అతిమానస శరీరానికి సిద్ధంగా లేదు. ముందు ప్రపంచాన్ని సిద్ధం చేయాలి, దానికి చాలా సమయం పడుతుంది.

శ్రీ అరవిందులు దూరంగాపోయే వారందరిలోకి ప్రవేశించి, మళ్ళీ వారిని అవతరింప చేయడానికి, వారి పునర్జన్మను సిద్ధం చేస్తున్నారనేది నిజం.

అకస్మాత్తుగా శ్రీ అరవిందుల ఇంటిలో, సూక్ష్మ భౌతికంలో కనిపించిన రోజు, నాకు కలిగిన అనుభవం గురించి, నీకు చెప్పానా? సరే, నేను ఒక అడుగు వేసి భౌతిక ప్రపంచం కంటే, చాలా విస్పష్టమైన ప్రపంచంలోకి ప్రవేశించినట్లు అనిపించింది. చాలా సుస్పష్టం ఎందుకంటే విషయాలు ఎక్కువ సత్యాన్ని కలిగి ఉంటాయి. నేను అక్కడ శ్రీ అరవిందులతో చాలా ఎక్కువ కాలం గడిపాను. అది పూర్తయ్యాక, నేను ఇంకొక అడుగు వేసి ఇక్కడకు తిరిగి వచ్చాను. కొంచెం మూగపోయినట్లు అయ్యాను, నా మునుపటి స్థితికి రావడానికి నాకు కొంత సమయం పట్టింది. ఎందుకంటే ఈ ప్రపంచం నాకు అవాస్తవంగా అనిపించింది.

ఇది చాలా సాధారణంగా నీవు ఒక అడుగు వేసి వేరొక గదిలోకి ప్రవేశించడమే. నీవు నీ అంతరాత్మలో జీవిస్తున్నపుడు నిరంతరత ఉంటుంది. ఎందుకంటే అంతరాత్మ మొత్తం తన స్మృతిలో ఉంచుకొంటుంది; అంతరాత్మ అన్ని సంఘటనలను, బాహ్య సంఘటనలను, బాహ్య కదలికలను, అన్నిటినీ కలుపుకొనే ఉన్నది. కనుక ఇది నిరంతరాయమైన ఉద్యమం.

ఇక్కడ, అక్కడ, ఒక గది నుండి మరొక గదికి, ఒక ఇంటి నుండి వేరొక ఇంటికి, ఒక జీవితం నుండి ఇంకొక జీవితానికి... ఈ మానవులకు ఇది తెలియనిది.

*

15 ఆగష్టుకి కొద్దిగా ముందుగా దీనిని అంతటినీ నిదర్శనంగా చూపే విధంగా నాకొక ప్రత్యేకమైన అనుభవం కలిగింది. 'మొట్టమొదటి సారిగా అతిమానస ప్రకాశం నాలోని ఇతర సత్తాల లోనికి ప్రవేశించకుండా నా శరీరంలోకి తిన్నగా ప్రవేశించింది. అది నా పాదలద్వారా ప్రవేశించింది (ఒక ఎరుపు బంగారు వర్ణం కలిగినది అద్భుతమైనది, వెచ్చనైనది, తీవ్రమైనది అది), తరువాత అది పైపైకి ఎగపాకింది. అది అలా పైకి వెళ్తూ ఉండగా, జ్వరం కూడా పెరగనారంభించింది ఎందుకంటే శరీరం దాని తీవ్రతకు అలవాటు పడలేదు. అలా ఆ ప్రకాశం నా శిరస్సును సమీపించినప్పుడు, నేను పేలిపోతానేమో అనిపించింది అప్పుడు ఆ అనుభవం అంతటితో ముగిసిపోయేది. కాని ఆ ప్రశాంతతని నిశ్చలతని దిగివచ్చేలా చేయమని ఒక స్పష్టమైన సూచన వచ్చింది, ఈ శరీరచైతన్యాన్ని ఇంకా విశాలతరం చేయమని, అన్ని కణములలో ఆ అతిమానస కాంతిని నిలుపుకొనేలా చేయమని. ఆ ప్రకాశం పైకి ఎగబాకుతుండగా నేను విశాలమయ్యాను, అలా ఒక సువిశాల అచంచల శాంతిని నేను కిందకు తీసుకువచ్చాను. ఉన్నట్టుండి ఒక క్షణం స్పృహ తప్పింది.

నేను ఇంకొక లోకంలో ఉన్నట్టుగా కనుగొన్నాను, కానీ ఇక్కడకు దూరంగా పోలేదు (నేను పూర్తి సమాధి స్థితిలో అయితే లేను). ఆ లోకం ఈ భౌతికలోకం అంత వాస్తవికత కలిగి ఉంది. అక్కడ కూడా గదులు ఉన్నాయి శ్రీ అరవిందుల గది అందులో, ఆయన పడుకొనే మంచం - అక్కడ ఆయన నివసిస్తున్నారు, ఆయన ఎల్లప్పుడూ అక్కడే ఉన్నారు. అది ఆయన నిత్య నివాసం. నా గది

కూడా అక్కడ ఉంది, ఇక్కడ ఉన్నట్టుగానే అక్కడ కూడా పెద్ద అద్దం ఉంది, దువ్వెనలు ఇంకా అన్నీ రకాల ఇతర వస్తువులు, అక్కడ ఉన్న పదార్థం వస్తువులు ఈ భౌతిక పదార్ధం ఈ వస్తువులంత సాంద్రత కలిగి ఉంది. అదేకాక ఆ వస్తువులు స్వప్రకాశం కలిగి ఉన్నాయి. అది పారదర్శకత కాని, కాంతి ప్రసారానికి అవకాశం కలిగి ఉండడం కానీ, ప్రకాశం కలిగి ఉండటం కానీ కాదు, అది స్వప్రకాశం. అక్కడ ఉన్న విభిన్న వస్తువులు కానీ వాటి పదార్థం కానీ ఇక్కడ ఉండే వస్తువులలో ఉండే అపారదర్శకత అక్కడ లేదు, ఇక్కడ మనం చూస్తూ ఉన్నట్టుగా అక్కడి వస్తువులు గట్టిగా పాడిబారినట్లుగా లేవు.

శ్రీ అరవిందులు వారి గంభీరమైన అద్భుతమైన సౌందర్యం

శ్రీ అరవిందులు అక్కడ ఉన్నారు వారి అత్యద్భుతమైన సమున్నత సౌందర్యంతో. పూర్వం వలెనే ఆయన కేశములన్నీ సంపూర్ణంగా కలిగి ఉన్నారు. అదంతా వాస్తవంగా ఘనీభవించినట్లుగా ఉంది - ఆయనకు అక్కడ కూడా ఏదో ఆహారం ఇస్తున్నారు. నేను అక్కడ ఒక గంట పాటు ఉన్నాను - (నా గడియారాన్ని ఇది జరగడానికి ముందు ఆ తరవాత కూడా చూడడం జరిగింది). నేను శ్రీ అరవిందులతో సంభాషించాను, ఇంకా కొన్ని సాధించవలసిన వాటి విషయంలో కొన్ని ముఖ్యమైన ప్రశ్నలు ఆయనను అడగవలసినవి ఉన్నాయి. అయితే ఆయన ఏమి బదులివ్వలేదు. ఆయన మౌనంగా నేను చెప్పింది విన్నారు. అటు తరువాత నేను చెప్పినమాటలన్నీ అనవసరం అన్నట్లుగా చూశారు. ఇదేదీ అవసరం లేకుండానే ఆయన సర్వం అవగతం చేసుకున్నారు. ఒక సంజ్ఞ తో తన ముఖంలోని భావాలతో రెండు విధాలుగా వ్యక్తం చేశారు. నా మనసులో ఉన్న ఆలోచనలతో ఏ మాత్రము సంబంధం లేని, ముందుగా ఊహించని సంజ్ఞ అది, ఉదాహరణకు అద్దం వద్ద పెట్టి వున్న మూడు దువ్వెనలు తీసుకుని (నేను ఇక్కడ ఉపయోగిస్తున్నటు వంటి దువ్వెనలే, అయితే ఇంకొంచం పెద్దవి) తన తలపై ఉంచుకున్నారు. తన శిరసు మధ్యలో ఒక దువ్వెన ఉంచుకున్నారు, మిగిలిన రెండూ చెరోవైపున ఉంచుకున్నారు, ఆయన కేశములన్నీ ఆయన కణతల మధ్యలో ఉండే విధంగా. ఆయన కేశాలంకారణ చేసుకున్న విధంగా ఉందది, ఒక కిరీటం వలె. వెంటనే నాకు అర్ధమయ్యింది నేనేది ఆలోచించానో దానికి ఆయన

సమ్మతించి చేయడానికి అనుజ్ఞ ఇచ్చారు అని: చూడండి నేను మీరు అనుకున్న విధంగానే చేయడానికి నిశ్చయించుకున్నాను, దానికి అనుగుణంగానే ఇటువంటి కేశలంకరణ, ఇది నా సంకల్పం. ఏదైతేనేం నేను అక్కడ ఒక గంట పాటు ఉండడం జరిగింది.

సత్యలోకం

చూడు ఈ సత్య లోకం అనేది ఇప్పుడేదో శూన్యం నుండి సృష్టించాల్సింది ఏమి కాదు, అది ఎప్పుడో తయారుగా ఉంది, ఇప్పుడు మన లోకం ఎలా ఉందో అలాగే అది కూడా అక్కడ ఉంది. అందులో ఉండాల్సిన ప్రతిదీ ఉంది, అవును ప్రతిదీ ఉంది.

నేను ఆ స్థితిలో సంపూర్ణంగా రెండు రోజులపాటు ఉన్నాను, రెండు రోజుల పరిపూర్ణమైన ఆనందం. శ్రీ అరవిందులు ఆ రెండూ రోజులు పూర్తిగా నాతోనే ఉన్నారు, నేను నడిస్తే నాతో నడిచారు, కూర్చుంటే నా పక్కనే కూర్చున్నారు. 15 ఆగస్టు రోజున కూడా నిరంతరాయంగా ఇక్కడ దర్శనం ఇస్తూ ఉన్నారు, అయితే ఈ విషయం ఎరిగిన వారెవరు? ఒకరిద్దరు మాత్రమే కొంత అనుభూతి చెందగలిగారు, ఎవరైనా చూశారా అంటే? - ఎవరూ లేరు.

అప్పుడు నేను ఈ జనాన్ని శ్రీ అరవిందులకు చూపించాను, ఇక్కడ జరిగే కార్యమంతటిని కూడా చూపించి అడిగాను ఈ సత్యలోకం ఎప్పుడు ఈ అసత్యంతో నిండిన ఈ భువి పైన అవతరించబోతోంది అని. ఇంకా తయారు కాలేదు, ఇంకా తయారుకాలేదు అని మాత్రమే ఆయన సమాధానం ఇచ్చారు.

శ్రీ అరవిందులు నాకు రెండు రోజులు సంపూర్ణ దివ్యానందాన్ని ప్రసాదించారు. అలాగే రెండవ రోజు ముగిసేలోపు నేనక్కడ ఎక్కువ కాలం ఉండి పోలేను అనే విషయం అర్థం అయ్యింది, ఎందుకంటే ఇక్కడ జరగాల్సిన పని ముందుకు పోవడంలేదు. ఆ పని శరీరంలో చేయవలసి ఉంది. ఈ భౌతిక ప్రపంచం లోనే అది సాధించవలసి ఉంది, లేదంటే అది సంపూర్ణం కాదు. అలా నేను ఆ సత్యలోకం నుండి నన్ను నేను ఉపసంహరించుకొని

ఇక్కడ తిరిగి పనిచేయడం ప్రారంభించాను.

అయినప్పటికీ ఈ లోకం నుండి మరొక లోకం లోకి వెళ్ళడానికి, అలాగే ఆ లోకం వాస్తవ లోకంగా మారడానికి చాలా చిన్న అతి చిన్న ప్రయత్నం చాలు. ఒక చిన్న సంకల్పం తోనో లేదా లోపల భావవైఖరి తద్భిన్నంగా మార్చుకోవడం ద్వారానో అది చేయవచ్చు. ఎలా చెప్పాలి... అది మన సాధారణ చేతనకు అవగతమయ్యే విషయం కాదు. లోపల ఒక చిన్న మార్పు చాలు. గుణాత్మకమైన మార్పు

శ్రీమాత : శిష్యునితో సంభాషణ అక్టోబర్ 6, 1959

శ్రీ అరవిందుల సన్నిధి

సమాధి వద్ద శ్రీ అరవిందుల సన్నిధి

ఏదైనా విషయం నీకు ఆందోళన కలిగిస్తున్నా లేక నీవు ఇబ్బందిలో ఉన్నప్పుడు ఏమి చేయాలో నీకు తెలియనపుడు ప్రశాంతంగా లోనికి ప్రవేశించు. అంటే నీవు నీలోనికి ప్రవేశించి నీ అంతర వ్యక్తిని చైత్య పురుషని హృదయ పూర్వకంగా అర్థించు. నీకు సమాధానం లభిస్తుంది. స్పష్టంగా, ఖచ్చితంగా అలాగే చేయాలి. నీవు ఏమి చేయాలో అదే నీకు తెలియజేస్తుంది. నీకు మార్గదర్శనం చేస్తుంది.

చాలా ప్రభావవంతమైన మరొక మార్గం కూడా కలదు. నీవు కోరిన ప్రతిసారీ నీవు సఫలత పొందుతావు. నీవు ఇబ్బందిలో వున్న లేక నీకు సమాధానం కోరుకుంటే, అది ఏదైనా లేక నీవు ప్రశాంతంగా ఉండలేకపోతున్నా లేక ఏదైనా విషయం నిన్ను చికాకు పరుస్తున్నా లేక నీవు చేసిన ఏదైనా తప్పిదం వలన నీవు అసౌకర్యంగా ఉన్నట్లయితే.. ఉదాహరణకు నీకు కోపం వచ్చి, అసంతృప్తిగా ఉంటే, దానికి అంత ప్రాముఖ్యత లేకపోయినా, అది సామాన్యమైనదే అయినా, దానికి ఏ విలువ లేకపోయినా నీకు కారణాలు తెలియని విషయాలలో అది ఉండవలసిన విధంగా సరయిన రీతిలో లేకున్నా.. ఆ సమయంలో ఆ విధమైన సంతోషకరం కాని స్థితి నుండి బయట పడుటకు సమాధి వద్దకు నేరుగా వెళ్లు. సమాధి వద్ద నీ శిరస్సును వంచి నీవు

చెప్పుకోవలసినదంతా, ఎటువంటి సంకోచం, సంశయం లేకుండా నా వద్ద చెప్పే విధంగానే శ్రీ అరవిందులకు విన్నవించు. నీ ఇబ్బందులన్నీ ఒక్కసారిగా, నాతో మాట్లాడి క్షణంలోనే అదృశ్యమైనట్లు పూర్తిగా మాయమైనట్లు నీవు చాలాసార్లు చూశావు.

వాటిని నేను తరిమి వేయటం వలననే వాటి నుండి నీవు బయట పడినావు. నీవు ఈ ప్రతికూల లేదా హానికర శక్తుల నుండి బయటపడినావు. ఈ బరువును నీ నుండి తొలగించినందు వలననే నీవు తేలికగా మారి సంతోషాన్ని పొందావు. నీకు గుర్తుందా? అలా జరిగిందని నీవు చాలాసార్లు నాకు తెలిపావు కూడా.

అవును శ్రీమాతా, చాలాసార్లు.

అదేవిధంగా నీవు వారికి (శ్రీ అరవిందులు) తెలపాలి. ఈ విధంగా నీ శిరస్సును సమాధిపై (శ్రీమాత ఆమె శిరస్సు వంచారు) ఉంచాలి.వారి శాశ్వత సాన్నిధ్యం, సమాధి వద్ద నీ ఇబ్బందులను తొలగించమని ప్రార్థించు. లేదా నీవు ఒక ప్రార్థనను ఈ విధంగా చేయాలి. (శ్రీమాత చేతిని హృదయ ప్రాంతం నుండి పైకి కదిపారు) నిజాయితీతో, నీలో అది గాఢమైన ఏకాగ్రతను తీసుకు రావాలి. శ్రీ అరవిందులు నీవు చెప్పినది వింటారని, నీకు సమాధానమిస్తారని నేను ఖచ్చితంగా చెప్పగలను. ఎటువంటి సంశయం లేకుండా వారితో నీవు ఇపుడు సులభంగా సంభాషించ వచ్చు. వారితో సంభాషించి, సమాధానాలు పొందిన వారు చాలా మంది ఉన్నారు. మనకు వారు చాలా అందుబాటులో చాలా క్రియాశీలకంగా ఉన్నారు. ఈ మార్గంలో నీవు నిరీక్షించ వలసిన అవసరం లేదని నీవు అప్పుడు గమనిస్తావు. మొదట్లో నీవు నాకు తెలియజేయడం, అప్పుడు నేను ఒక అనుకూలమైన రోజు, నిర్దిష్టమైన సమయం ఎంపిక చేసి నీవు నాకు చెప్పాలనుకున్న దానిని వినడానికి, తరువాత నేను సమాధానం ఇవ్వడానికి సమయం ఉందా లేదా అనేది కూడా చూసుకుని సమాధానమిస్తాను. నీవు సమాధానం పొందడానికి ముందు ఈ పద్ధతి పాటించాల్సి ఉంది. ఇది చాలా సుదీర్ఘమైనది, చాలా సమయం కూడా పడుతుంది. వీటన్నింటికంటే నిరీక్షించుటకు ఓపికను నీవు కలిగి ఉండాలి. కానీ ఈ పద్ధతి చాలా సరళమైనది. మరింత ప్రత్యక్షంగా మరింత అందుబాటులో ఉంటుంది. ఏ సమయంలోనైనా నీవు అడుగవచ్చు. నీవు

సమాధానం పొందేందుకు సమాధి వద్దకు రా. సరిపోతుంది.

ఏదైనా సరిగా లేకపోయినా కారణం తెలుసుకోవాలని నీవు కోరుకుంటే లేదా బలహీనతను పోగొట్టుకోవాలని కోరుకున్న లేక బాధలు నయం కావాలని కోరుకున్నా లేక నీవు పరిశుద్ధం కావాలని కోరుకున్నా అలా పవిత్రీకరణ పొందే క్రమంలో ఇబ్బందులు తొలగించుకోవాలని కోరుకుంటున్నా... ఏ సమాధానికైనా సరే సమాధి వద్దకు వచ్చి శ్రీ అరవిందులను అర్థించు. నీకు సమాధానం లభిస్తుంది. వారి సమాధానమే కాదు వారి ఆశీస్సులు, కృప, శాంతి, ప్రకాశం కూడా లభిస్తాయి. సర్వశక్తివంతమైన వారి ప్రేమలో నీవు మునిగిపోతావు, స్వాధీనమైపోతావు, ఒకసారి నీవు వారికి అర్పించుకోగలిగితే అన్ని విపత్తుల నుండి నీవు సంరక్షించబడతావు. వారి ప్రభావం ఈ విధంగా ఉంటుంది. సరళత, నిజాయితీ, వినయం గలవారికి శ్రీ అరవిందులు ప్రకటితమవుతారు. వారు అక్కడ సంపూర్ణ చేతనలో ఉన్నారు. ప్రపంచంలోని కార్యకలాపాలన్నింటికీ మార్గనిర్దేశం చేస్తున్నారు.

*ది బ్లెస్సింగ్స్ ఆఫ్ ది గ్రేస్, పుట. **120-21***

శ్రీ అరవిందులు సమాధానమిస్తారు...

గతంలో వారు శరీరంతో ఉన్నప్పుడు మనుషులకు వారు చాలా దూరంగా, అందుబాటులో లేకుండా ఉంటారని, ఇక్కడి సాధకుల వ్యవహారాల గురించి పట్టించుకోరని ప్రజలు అనేవారు. అది అంత వాస్తవం కాదు. వాస్తవానికి వారు ప్రపంచ ఉద్ధరణ, అతి మానస ప్రపంచ ఆగమనానికి సంసిద్ధం చేయుట అనే వారి కార్యక్రమాన్ని కాకుండా గంటల కొద్దీ లేఖలకు సమాధానమిస్తూ రాత్రిళ్లు గడిపేవారు. వారి పురోగతిని అనుసరించుట, సాధకులకు సంబంధించిన విషయాలను పట్టించుకొనుటలో బాధలనుభవించారు. అయినప్పటికీ శ్రీ అరవిందులు, సాధకులు నేరుగా నాతో సంభాషించేందుకు, నా ఆశీస్సులు, సాధన కొరకు అంతరిక, అదేవిధంగా భౌతిక తలంలో ఆచరణాత్మకంగా నా సహాయం పొందేందుకు ఏర్పాట్లు చేశారు. సాధకులు నా ద్వారా అతిమానసం దిశగా ఉన్నత చేతన పొందేవారు లేదా ఏవైనా ఇబ్బందులుంటే వాటిని అధిగమనించేవారు. ఆ సమయంలో శ్రీ అరవిందులు మన కార్యక్రమం - అతి మానసం దిశగా అన్వేషణలో అవరోధంగా నిలిచిన, నిరోధిస్తున్న వాటిపై నియంత్రణ సాధించుటకు వాటిని జయించుటకు

మాత్రమే కాకుండా వాటిని లొంగదీసుకొనుట, అదేవిధంగా వివిధ ప్రపంచాలు, విభిన్న శక్తులు, అసంఖ్యాక చేతనా స్థితులపై ఆధిపత్యం సాధించుటలో నిమగ్నమై ఉండేవారు. ప్రాపంచిక వ్యవహారాలను పరిష్కరించుట, ఆశ్రమంలోని వ్యవస్థ, వ్యక్తుల పురోగతి, పూర్ణ యోగం వైపు గల ప్రయత్నాలను నాకు విడిచి పెట్టారు. ఆ సమయంలో ప్రజలతో లేదా వారి ఫిర్యాదులను ఆలకించుటకు వారికి ఏ మాత్రం సమయముండేది కాదు. కానీ ఇప్పుడు వారు విశ్వవ్యాప్తమై, విస్తృతం, విశాలమై, సన్నిహితమై మనకు దగ్గరైనారు. ప్రతి ఒక్కరికీ వారు అందుబాటులో ఉండేందుకు ఒక సామీప్య, ప్రత్యక్ష ప్రభావం ద్వారా ప్రతి ఒక్కరితో ఒక బంధం ఏర్పరచారు.

*ది బ్లెస్సింగ్ ఆఫ్ ది గ్రేస్ పుట **121-22***

సజీవమైన హామీ

ఇది బలీయమైనది. వారి ఉనికి స్పష్టమైన ప్రకంపనగా సమాధి చుట్టూ వ్యాపించి ఉంది. వారి ప్రభావం అంతరపురుష వద్దకు చొచ్చుకుపోయి, స్పృశించి, ఆధ్యాత్మిక జీవితానికి చేతనను మేల్కొల్పుతుంది. అజ్ఞేయవాదులు, విశ్వాసం లేనివారు, చెడు సంకల్పం ఉన్న వ్యక్తులు, సమాధిని దర్శించాలనే ఉత్సుకతతో వచ్చేవారు కూడా, అక్కడ ఆయన శాంతి, కరుణ నిరంతరం వర్షిస్తూ ఉండడం వల్ల ఒక రహస్య పరివర్తనా ప్రక్రియ ద్వారా ఆశ్చర్యపడి, అంతర్గత శాంతిని కనుగొంటారు. వ్యక్తులు వారి సమక్షానికి వెళ్ళినప్పుడు వ్యక్తులను శాంతి, కరుణల జల్లులో తడిపేస్తారు.అది వారి శక్తి, ఉనికికి సంబంధించి ఒక నమ్మశక్యం కాని అతిశయ కార్యాచరణ.

మన దివ్య సంభావ్యత, దివ్య ప్రకాశం, దివ్య శక్తితో ప్రసరించే దివ్యత్వ వాగ్దానానికి, భగవంతుని అభివ్యక్తి వైపు మన ప్రగతిశీల పయనానికి ఆయన సజీవ హామీ. అందుకే వాతావరణం అంతా దివ్య, ఉత్కృష్ట శాంతితో నిండి ఉంది, మీకు అర్థమైందా? ఆయన అక్కడ దివ్య శరీరంలో, దివ్యత్వం పొంది ఉన్నవారు. వారు సమస్త మానవజాతికి ప్రతినిధి. వారు తమ శరీరంలో చేసిన తపస్సు, సాధనల ద్వారా మహిమాన్విత శరీరాన్ని తయారు చేసుకున్నారు. ఆయన తమ శరీరంలో చేసిన యోగ ప్రయత్నం ద్వారా పొందిన

సాక్షాత్కారాలు, అనుభవాలు, ఆయన శరీరంలోనే పోగు చేయబడినవి. వీటి వల్లనే తమ శరీరం పరివర్తనా శక్తితో నిండిపోయింది. ఇది క్రియాశీలంగా పనిచేసే శక్తితో, వెలుగుతో నిండిపోయి, పొంగి పొరలుతూ ఉంటుంది. ఆయన సన్నిధి చుట్టు ప్రక్కల ఉన్న మొత్తం వాతావరణాన్ని కప్పి ఉంచుతుంది. ఇది అతిమానస శక్తి కావడం వలన నిలిచిపోయి ఉంటుంది, క్షీణించే గుణం ఉండదు. ఇది క్షీణించదు.

ప్రజలు సమాధి చుట్టు ప్రక్కల తిరిగినప్పుడు దీనిని వారికి తెలియకుండానే గ్రహిస్తారు. ఆయన ప్రేమలో వారు తడిసి ముద్దవుతారు. వారు సమాధి వద్దకు వెళ్ళినప్పుడు వారు ఎందుకు సమ్మోహితులు అవుతున్నారో కూడా గ్రహించలేరు, ఇది అద్భుతం. వారు సమాధిని తాకినప్పుడు అయోమయానికి గురవుతారు, ఎందుకంటే పని చేసే అతిమానస శక్తి వారిలోని మతపరమైన నమ్మిక బంధనాలను, భావాలను కూల్చివేస్తుంది. ఊర్ధ్వ ముఖంగా ఎగసిపడే భావోద్వేగాలను తునకలు చేసి, వారికి అర్థం కాని వాస్తవికతను వారి ముందు ఉంచుతుంది. వ్యక్తులు అక్కడ అభివ్యక్తమయ్యే సత్యానికి ఆశ్చర్యపోతారు. అతిమానస శక్తికి తెరచుకొని, దాని స్పర్శను పొందిన వారు వాతావరణంలో ఉన్న శాంతిని తమలో ఇముడ్చుకోవడానికి తిరిగి వచ్చి తమలో పూర్ణంగా నింపుకుంటారు. అది చాలా ఖచ్చితత్వాన్ని, సజీవత్వాన్ని కలిగి ఉంది, అది ఒక చైతన్యవంతమైన విశాలత్వాన్ని, ఆధిపత్యాన్ని కలిగి, మొత్తం వాతావరణంలో నిండి ఉంది. అస్థిరమైన వెలుగులు, రంగులు, అంతుచిక్కని ఆనందానికి సంబంధించిన అందం, స్వచ్ఛత, సారం, అంతుచిక్కని ఉనికి ఎలా ఈ వాతావరణంలో తేలి ఆడుతున్నాయో నేను చూస్తున్నాను. ఇది నిరాధారమై, భౌతికమైనప్పటికీ ప్రపంచానికి తెలియని మాధుర్యాన్ని తీసుకువెళ్లడం నేను చూస్తున్నాను. హృదయంలో భగవంతుని మీద ఏకాగ్రత దృష్టి కలిగి, భగవంతుని కోసం తపనబడే తత్వం ఉన్నవారు, సమాధి ముందు నిలబడి దేనిని కోరకుండా భగవంతుని అనుగ్రహాన్ని మాత్రమే కోరినట్లయితే, అట్లాంటి వారు ఈ భూమి, ఊర్ధ్వ లోకాలలో అనుభవించే దానికంటే చాలా మెరుగ్గా ఉండే ఉన్నత ప్రదేశానికి తీసుకువెళ్లబడతారని నాకు అనిపిస్తోంది.

*ది బ్లెస్సింగ్స్ ఆఫ్ ది గ్రేస్ పుట **124-45***

వారి గంభీరమైన సన్నిధి

వారి భక్తులు, ఆకాంక్షతో ఉన్నవారు- భక్తులు తమ చేతనను శ్రీ అరవిందులతో(వారి సన్నిధితో ఈ ప్రదేశాన్ని నింపిన వారు) ఏకం చేయాలనే నిజాయితీతో కూడిన ఆకాంక్ష ఉన్నవారు, శ్రీ అరవిందుల గంభీరమైన సన్నిధికి సంబంధించిన మహత్వమును నన్ను చూస్తున్నంత స్పష్టముగా చూడగలరు. శ్రీ అరవిందులతో మాట్లాడాలి అనుకునే వ్యక్తులు, శ్రీ అరవిందులు ఇచ్చే స్పష్టమైన సమాధానాన్ని కనుగొనగలరు. వారి సమస్త ప్రభావంతోను, సమస్త శక్తితోను వారు అక్కడ ఉండి, నూతన సృష్టి వైపుకు నడిపిస్తున్నారు. వారు తెర వెనుక నుంచి పట్టుదలతోనూ, నమ్మశక్యం కాని ఓర్పుతోను, నిర్ణయాత్మకతతోనూ నూతన సృష్టి వైపుకు మార్గదర్శకత్వం చేస్తున్నారు. సమయ అనుకూలతను బట్టి వారి చర్యా విధానంతో ఒకదాని తర్వాత ఒకటిగా విజయాలను సాధించుకుంటూ (ముందుగా మనుష్యజాతి చేతనను మార్చి, ఆ తర్వాత దానిని నలువైపులా విస్తరింప చేయడం) ముందుకు వెళుతున్నారు. ఈ ప్రతిఘటనలు, క్షణిక పతనాలు మానవజాతికి దాని ముందు ఉన్న అడ్డంకులను అధిగమించడానికి అవసరమని వారికి తెలుసు కాబట్టి, వారు దాని చర్యా విధానానికి, వైఖరికి వారి ప్రశాంత వెలుగులో ప్రపంచ ఉద్యమం ద్వారా మార్గదర్శకత్వం చేస్తున్నారు. అన్నిటికీ పైన, ఇది ఆధ్యాత్మికత మీద ఆధారపడింది కానీ అత్యుత్సాహ స్వభావం, యుద్ధం, కారణం లేని తగువులాటలతో కూడిన నకిలీ మత ఉద్యమాలు మీద కాదు. మీరు పర్యవసానాలను చూశారు కదా..... ఈ ప్రపంచం మనిషి చేస్తున్న క్రూరత్వాలుతో అలసిపోయింది, రక్తం ఏరులై పారింది, హింస శాసించింది, ఇంత భయంకరమైన విధ్వంసాలను మనం ఎప్పుడూ చూడలేదు. మనుష్యులు క్రూరమృగాలుగా మారారు, క్రూరమృగాల కంటే కూడా ఘోరంగా ఉన్నారు.

మనిషి తన చేతనను మార్చుకోవడానికి ప్రయత్నించనంత కాలం అది అధిగమించలేని ప్రతిష్టంభన మనిషి కానీ అసాధారణ నైపుణ్యాలు కలిగిన వ్యక్తులు కానీ, ఎవరూ ఏమీ చేయలేరు.

భగవంతునికి,ప్రతికూల శక్తుల మధ్య అగాధాన్ని పూడ్చనూ లేరు. అజ్ఞానమే మనిషిని ఈ స్థితికి తీసుకువచ్చింది.

కానీ చింతించవలసిన అవసరం లేదు. మనిషిని కొత్త ప్రపంచ సరిహద్దుల వైపుకు తీసుకురావడమనే పనిని నిర్వర్తించడానికి అధికారికంగా బాధ్యత తీసుకున్న వారు ఆ పని చేస్తారు. ఇబ్బందులను అడ్డంకులను ఆయన తక్షణమే ఆమోదించి మనుష్య జాతిని ప్రకాశవంతమైన భవిష్యత్తు వైపు నడిపిస్తారు. ఆయన మాత్రమే ఈ వ్యాధిని నయం చేయగలరు, ఎందుకంటే వారు మన ఉనికికి యజమాని. వారి మీద విశ్వాసం ఉంచు. అంతా సవ్యంగా జరుగుతుంది. శంకువలె వంకరులు తిరిగిన పరిణామంలో భౌగోళిక అస్తిత్వానికి సంబంధించిన కష్టసుఖాల్లో మనిషి చేరుకున్న అత్యల్ప స్థానం ఇదే కావచ్చు. కానీ త్వరలో, మనం వెలుగును చూస్తాము - ఆయన ఉనికికి సంబంధించిన ధృవీకరణ మాత్రమే భూమిపై దైవిక రాజ్యాన్ని క్రిందకు దించి స్థాపించగలదు.

శ్రీ అరవిందుల గొప్ప ఆకట్టుకునే శక్తి

కొంతకాలం క్రితం ఎం. సోదరి మరణించింది (మానసికంగా, ఆమె భయంకర స్థితిలో ఉంది- ఆమెకు విశ్వాసం లేదు). సరే, ఆ రోజు, ఆమె చనిపోతోందని తెలిసినప్పుడు, నేను స్నానాల గదిలో మేడమీద ఉండి, శ్రీ అరవిందులతో, మాట్లాడడం, వారితో ఒక విధమైన సంభాషణ చేయడం (ఇది చాలా తరచుగా జరుగుతుంది) గుర్తుకు వచ్చింది. వారిని అడిగాను, "అలాంటి వ్యక్తులు ఇక్కడ ఆశ్రమంలో చనిపోతే వారికి ఏమి జరుగుతుంది?" దానికి వారు,"చూడు," అని సమాధానం ఇచ్చారు. నేను ఆమె చనిపోవడం చూచాను.అప్పుడు ఆమె నుదుటిపై ఘనమైన బంగారు కాంతిని (అంత ప్రకాశవంతంగా లేదు కానీ, చాలా స్పష్టంగా ఉంది) నేను చూశాను. ఆమె మానసిక స్థితి ఏమైనప్పటికీ, దానితో ఎటువంటి పట్టింపు లేదు - ఏమీ ఆమెను తాకలేదు, ఆమె ప్రశాంతంగా, ప్రశాంతంగా బయలుదేరింది. ఇది దానికి సంకేతం. అప్పుడు శ్రీ అరవిందులు నాతో ఇలా అన్నారు, 'ఆశ్రమంలో నివసించిన వారందరికీ మరణించిన వారందరికీ, వారి అంతర్గత స్థితి ఏమైనప్పటికీ, స్వయంచాలకంగా అదే రక్షణ ఉంటుంది.'


నేను ఆశ్చర్యపోయానని చెప్పలేను, కానీ నేను శక్తి గొప్పతనాన్ని మెచ్చుకున్నాను. మనుషులు ఆశ్రమంలోనే ఉండి, ఆశ్రమంలోనే శరీర త్యాగం

చేశారన్న సాధారణ వాస్తవం ఆ మనుషుల పరివర్తనలో ఎక్కువగా తగినంత సహాయం చేయడానికి సరిపోతుంది.

కానీ అన్ని రకాల సందర్భాలు ఉన్నాయి. ఉదాహరణకు, ఎన్.డి. నే తీసుకోండి, తన జీవితమంతా శ్రీ అరవిందుల సేవ చేయాలనే ఆలోచనతో జీవించిన వ్యక్తి- అతను నా చిత్రపటాన్ని తన ఛాతీకి పట్టుకుని మరణించాడు. అతను ఒక పవిత్రమైన వ్యక్తి, ఉన్నత చేతన, విఫలమవ్వని అంకితభావం ఉన్న వ్యక్తి. అతనిలోని అన్ని భాగాలు చైత్య పురుషుని చుట్టూ చక్కగా అమర్చబడ్డాయి. అతను తన శరీరాన్ని విడిచిపెట్టబోతున్న రోజు చిన్న ఎం సమాధి పక్కన ధ్యానం చేస్తోంది, నేను "సేవ" అని పిలిచే ఆ పసుపు పువ్వులు ఒక కూర్పుగా ఏర్పడి ఒక పెద్ద గుత్తిగా రూపు దాల్చాయి. ఆ గుత్తి పైపైకి వెళ్తూ కనిపించింది. ఆమె దర్శించినదాని ప్రకారం ఈ పువ్వులు ఎన్.డి. చిత్రంతో సంబంధాన్ని కలిగి ఉన్నాయి. ఆమె త్వరగా వాళ్ల ఇంటికి పరిగెత్తేటప్పటికే, అతను చనిపోయాడు.

ఈ అనుభవం గురించి నాకు తరువాత తెలిసింది. అతను శరీర త్యాగం చేసినప్పుడు, అతనిలోని అన్ని భాగాలు ఒకటిగా చేరి ఐక్యతతో, పూర్తి సజాతీయతతో, గొప్ప ఆకాంక్షతో, చెదరకుండా, వైదొలగకుండా పైపైకి వెళ్లి నేరుగా శ్రీ అరవిందులచే ఉన్నత లోకాలుగా పిలువబడిన స్థానానికి వెళ్లడం నేను చూశాను. అక్కడ శ్రీ అరవిందులు తన అతిమానసిక చర్యతో భూమిపై అధ్యక్షత వహిస్తారు. అతను ఇక ఆ కాంతిలో కరిగిపోయాడు.

శ్రీమాత : శిష్యునితో సంభాషణ జూన్ ***24,1961***



శ్రీ అరవిందులు, మదర్

అర్ధనారీశ్వరులు - చీరలో శ్రీ అరవిందులు

వరుసగా కొన్ని రాత్రులు నేను శ్రీ అరవిందుల సన్నిధిలో ఉండటం జరిగింది. అది చాలా అద్భుతం. నీకు అర్థం అవుతుందా? నేనాయనను నిర్విరామంగా చూస్తున్నాను. సూక్ష్మ భౌతిక ప్రపంచం ఏదయితే ఆయన నివాస స్థలమో నేనక్కడికి వెళ్ళాను. ఆ కలయిక చాలా శాశ్వతమయినది (ఎలా అయినా ప్రతి రాత్రి నేను ఆ విధంగానే గడుపుతాను. ఆయన జరగవలసిన కార్యాన్ని, ప్రతి విషయాన్ని చూపిస్తారు) కానీ సావిత్రి అనువాదం తర్వాత ఆయన నవ్వుతూ నావైపు చూస్తూ అన్నారు. 'చివరికి మీకు అర్థం అయింది కదా?' అని (శ్రీమాత నవ్వారు) 'నాకు అర్థం కాలేదని కాదు. అలా ఉండకూడదని నా ఉద్దేశ్యం అన్నాను. ఇంకా విషయాలన్నీ ఆలానే ఉండటం నాకు నచ్చలేదు. కొన్ని యుగాలుగా ఈ విషయాలు మరొక విధంగా ఉండాలని నేను ఆశించాను. మొన్న రాత్రి ఆయన నా చీర ఒకటి కట్టుకున్నారు. ఆయన (నవ్వుతూ) నాతో అన్నారు. "ఏం కట్టుకోకూడదా. ఇది నాకు తగినట్లుగా ఉన్నట్లు మీకనిపించలేదా? నేను సమాధానమిచ్చాను. 'అది మీకు చాలా అందంగా అమరింది' అది ఒక జేగురు రంగు జార్జెట్ చీర. కంచు వర్ణపు మెరుపుతో పెద్ద బంగారు రంగు అంచుతో ఉంది. అది చాలా అందమైన

చీర (అది నా దగ్గర ఉండేది. నా చీరలలో ఒకటి) ఆయన దానిని కట్టుకున్నారు. అప్పుడు ఆయన తన తల దువ్వమని అడిగారు. ఆయన మెడ వెనుక భాగమూ, శిరోజాలు కూడా కాంతివంతంగా మారిపోయాయి. ఆయన కేశాలు ఎపుడూ పూర్తిగా తెల్లగా ఉండేవి కాదు. ఒక లాంటి లేత గోధుమ వర్ణపు కాంతితో దాదాపు బంగారు వర్ణంలో ఉండేవి. చాలా చక్కగా ఆ కాంతి అలానే ఉంది. ఇక్కడి మనుషుల కేశాలలా కాదు. ఆయన కేశాలు నా కేశాలలానే ఉన్నాయి. ఆయన తల దువ్వుతున్నపుడు కాంతి వంతమయిన ఆయన మెడ వెనుక భాగాన్ని, శిరోజాలను చూశాను. ఆయన కేశాలు ఎంతో ప్రకాశ వంతంగా ఉన్నాయి. ఆయన నాతో అన్నారు. "నేను చీర ఎందుకు కట్టుకోకూడదు? అని.

అది భూమ్యాకాశాల అంచున ఒక నూతన ద్వారాన్ని తెరిచింది. మీకు తెలుసా? మనం ఎప్పుడూ ఎంతగా తలుపులు బిగించుకొని ఉంటామో?

నిజమే యిది ఒక (దర్శనం లేదా ఊహ) చర్యగా రూపొందనీయబడలేదు. ఎందుకంటే మీరు అన్నిటినీ అంగీకరించటం, ప్రేమించడం, అన్నిటిలో ఔన్నత్యాన్ని దర్శించటం మొదలు పెడితే మార్పు అవసరమేమిటి?

ఈ ప్రపంచం మున్ముందుకి పురోగమించటానికి నాలో చాలా కాలంగా శక్తి అందుకే ఉన్నది ఉన్నట్లుగా న్యాయబద్ధమైన దానినంతటినీ ఖచ్చితంగా తిరస్కరించి మిమ్మల్ని జీవించే అంతర ఆనందపు స్పర్శలో ఉంచింది. ఆయన అన్నట్లుగా ఆయన సంతోషం అక్కడ ఉంది. అంతటా ఉంది. అందువలననే ఎవరూ ప్రపంచాన్ని వదిలివెళ్ళాలని అనుకోరు.

ఇంకా క్లుప్తంగా చెప్పాలంటే పై నుండి ఈ పరిస్థితిని నేను చూడగలుగుతున్నాను. సృష్టి సృజనాత్మక శక్తి కన్నా కొంచెం పైనుండి... ఆవలి వైపు నుండి.

ఈ రోజు శ్రీ అరవిందుల శతాబ్ది మొదటిరోజు. ఆయన తన శరీరాన్ని వదలి వేసినా మనతోనే సజీవంగా, చైతన్యవంతంగా ఉన్నారు.

శ్రీ అరవిందుల వారు భవితకు చెందినవారు. ఆయన భవిష్యత్తుకు రాయబారి. దివ్య సంకల్పం రచించిన వైభవోపేతమయిన భవితను వేగ వంతంగా సిద్ధింప జేసుకోవటానికి అనుసరించవలసిన మార్గాన్ని ఆయన యింకా మనకు చూపిస్తున్నారు.

మానవ ప్రగతికి దోహదం చేయాలని, భారత దేశపు జ్వాజ్వలమానమైన ఉన్నతిని కోరుకొనే వారందరూ, ఒక దివ్యదృష్టితో కూడిన ఆకాంక్షతో తేజోమయమైన కార్యానికై ఏకం కావాలి.

*శ్రీమాత : శిష్యునితో సంభాషణ ఫిబ్రవరి **15, 1963***

శ్రీ అరవిందులు - శాస్వత సారథి

శ్రీఅరవిందులూ, నేనూ ఒక సౌఖ్యవంతమయిన కారులో ఉన్నాం. అనంత మయిన శాంతి ఆనందాలలో విశ్రాంతి పొందుతూ ఉన్నాం. నిశ్చలంగా ఒకరి ప్రక్కన ఒకరు. ఆ కారును ఒక శాశ్వత సారధి నడుపుతున్నాడు. మీకు తెలుసా? అది ఒక పరమమైన ఆనందం, కారు బయట ఆకస్మాత్తుగా దారిపై (అది ఎలానో నాకు తెలియదు) రెండు పత్రాలు విసిరివేయబడ్డాయి. అందులో ఒక పత్రం - లేఖ (అది తపాలాలో వచ్చిన కవరు. కారు ఇంకా కదులుతూనే ఉంది. ఒక దివ్యమైన లాఘవంతో శ్రీ అరవిందులు కారులో నుండి రోడు పైకి దూకి, ఆ ఉత్తరాలను ఒడిసి పట్టుకున్నారు. నాలో నేను అనుకున్నాను. ఓ సంతోషం ముగిసి పోయింది (నవ్వుతూ)

మేము తిరిగి కార్యరంగంలోకి దూకాలి. నేను కూడా కారు దిగి పోయాను. (అది మాయమయిపోయింది) (శ్రీ అరవిందులు ఆ లేఖలను తీసుకున్నారు. (ఆక్షణంలో అవి ఏమిటో నాకు తెలుసు, కానీ అదంత ముఖ్యం కాదు. అపుడాయన నా చేయి పట్టుకొని (ఆయన కుడి చేతితోనే నా ఎడను చేతిని పట్టు కున్నారు, నేనాయనకు కుడిప్రక్కన ఉన్నాను) మేము ఆ బాటపై నడుస్తున్నాం. ఆ దారిలో వస్తున్నపుడు కొంత సమయం తర్వాత (చాలా విషయాలు, వివరాలున్నా అవి సాధారణ సంఘటనలే. అవి కేవలం అప్పటికే సమంజసం, అంత ముఖ్యమయినవేమీ కాదు) మేమా మార్గంలో వెళుతుండగా ఆయన అకస్మాతుగా నా వైపుకు వంగి నేను రాళ్ళపై నడుస్తున్నానని చూపించాడు. (రోడ్డు గులక రాళ్ళతో చేయబడినపుడు, నీరు పారడానికి వీలుగా వంపుగా కాలువ వేస్తారు కదా? ఆ వైపు కొంత మట్టి నీటితో కొట్టుకు పోవటం వలన రాళ్లు బయటకు వచ్చాయి) నేనా రాళ్ళపై నడుస్తున్నాను, కాదు, కాదు - శ్రీ అరవిందులే వాటిపై నడుస్తున్నారు. నాకు వాటిని చూపించారు. నేను ఆయన ఆ రాళ్ళపై నడవ కూడదని బాటకు మధ్యలో ఉండేటట్లు చూసి రాళ్లపై నేను నడుస్తున్నాను, ఆ తరువాత ఆయనవైపు

చూశాను. శ్రీ అరవిందుల శిరసును చూశాను. ఒక ఉన్నతము వైభవోపేత మయిన శిరసు, అది నిజంగా అతి మానస శిరసు, ఒక మహాద్భుతం! ఆయన శరీరమంతా, శరీరపు ప్రతి భాగం, ఎవరిలానో ఉన్నాయి, ఆయన ఎవరిలో ఆవిష్కృత మవుతున్నారో, ఒక ప్రత్యేక మయిన కార్యము లేదా కారణం కోసం, లేదా నాకు సంబంధించి ఒక ప్రత్యేకమయిన పనిలో నా విషయాని కొస్తే నేనొక వ్యక్తిని కాను, నేను కేవలం ఒక శక్తిని మాత్రమే. నాకొక శరీరం లేదనే విషయాన్ని నేను గుర్తించాను. ఆ కార్యంలో పాలు పంచుకుంటున్న వారినందరినీ నేను చూచాను, (వారి భౌతికమయిన రూపం కాదు. కానీ వారెవరో నాకు తెలుసు. ఒకరికి ~~ఈ ఈ~~ విషయాలు, ఇంకొకరికి ఆయా విషయాలు, ఆ అరచెయ్యి అది, ~~ఈ~~ చెయ్యి యిది. ఆ విధంగా నేను ఆయన పాదాలను చూసాను. అవి పాదరక్షలతో కూడిన నా పాదాలు!! ఎందుకంటే ఆయన బాట ప్రక్కన రాళ్ళపై నడవకూడదని నేనను కున్నాను. అందుకే ఆయన దానిని వదిలి వేసారు. అది చాలా అద్భుతంగా, అర్థవంతంగా ఉంది. నేను చూసాను. నాకు ఆ కార్యంలో ఒక వ్యక్తి స్థానం ఖచ్చితంగా తెలిసింది. ఆ కార్యంలో నాతో ఉన్న సంబంధం కూడా తెలిసింది. ఆయనకు నేను ఆలంబన. అంతా శ్రీ అరవిందుల మార్గదర్శకత్వంలో నిర్వహించబడుతుంది. అంతా చాలా వివరంగా....

ఒక అత్యంత అద్భుతమైన ఖచ్చితత్వంతో కూడిన అభివ్యక్తి, ఆయనకున్న బాధ్యత. మొదట నేను ఆయన పాదాలు అనే భావన (కానీ నా పాదాలలా పాదరక్షలతో కూడిన తెల్లని పాదాలు. ఎందుకంటే ఆయన అంచుపై నడవ కూడదని నేను అనుకొన్నాను. 'కఠినమైన రాళ్ళతో కూడిన బాటమీద... అందుకనే ఆయన వెళ్ళిపోయారు.

అది నాపై ఎంతో మరిచిపోలేని ముద్రను వేసింది. ఎందుకంటే శక్తికున్న లీలలను అది దర్శింపజేసింది. బాహ్యంగా మోసం చేసే రూపాల వెనుక నిజమేమిటో తెలియ చేసింది.

ఆయన శిరసు ఒక మహాద్భుతం.. అదే అన్నిటినీ అధిగమిస్తుంది. అదే అన్నిటికీ మార్గదర్శకంగా ఉండి నడిపిస్తుంది. అది ఆయన అతిమానస అవగాహన యొక్క మహాద్భుతం. అదే అన్నిటినీ నడిపిస్తుంది. అందులో అందరికీ ఎవరి స్థానం వారికుంది.

పని చేసే ప్రతివారి ఖచ్చితమయిన స్థానం, వారి సంబంధము నేను ఖచ్చితంగా తెలుసుకున్నాను. కానీ నేనది ఎవరికీ చెప్పకూడదు కానీ ఎపుడూ నీ కార్యం, నీ స్థానం గురించి చెప్పినది ఖచ్చితంగా నిజం. ఆ క్షణంలో నేనది చూసాను, ఖచ్చితంగా సత్యం. కొన్ని విషయాలు, కొందరి గురించిన దర్శనాలు, మరీ ఎక్కువ మంది గురించి కాదు. ఎవరికైతే కార్యంలో నాతో నిజమైన సంబంధం ఉందో వారితో చాలా విభిన్నమయిన సంబంధాలు, విభిన్నమైన స్థాయిలలో, విభిన్నమయిన కార్యక్రమాలకు, కానీ అవి అసంఖ్యాకం కాదు, కానీ అది చాలా సరిగ్గా ఉంటుంది.

ఆ ప్రపంచాలలో విషయాలు నిజమైనవే. సత్యమయినవే కానీ వాటి వాస్తవికత మానవులు గ్రహించగలిగే వాస్తవికత కాదు. అంతా ఒక బాహ్యరూపంగా అయిపోతుంది. తరచుగా ఒక అసత్యమయిన రూపం, ఏవిధంగా చూచినా దాని విభజనలో అసత్యం.

ఈ శరీరం ఎంత మేరకు కేవలం ఆనందాన్నే కాక ఆయన పాదాల వద్ద ఉండే పారవశ్య వైభవాన్ని పొందిందో నేను చెప్పలేను. నేనుచూసినప్పుడొక అద్భుతం. అదే సమయంలో ఒక అనుభూతి, ఆ కార్యానికి సంబంధాల స్పష్టమైన అవగాహన కలిగింది. ఒక భావనతో, అనుభూతితో, ఆ సంబంధం ఖచ్చితమయిన అవగాహన, ఆ వ్యక్తులతో నాకున్న అనుబంధంకున్న సరియైన అవగాహన, ఎంతో మందికాదు, కాని వారు నాకు తెలుసు.

శ్రీమాత : శిష్యునితో సంభాషణ మార్చి ***10, 1965***



శ్రీకృష్ణునితో, శ్రీ అరవిందునితో నడవడం

పూర్వం నేను, శ్రీ అరవిందులు ఒక గృహంలోనే ఉండేవారము. అది ఇప్పుడు 'డార్మిటరీ ఎనెక్స్ వసతి గృహం. దానికి పెద్ద వసారా ఉండేది. ఆ వసారాని నేను పైకి, క్రిందికి తిరుగుతూ ఉండేదానిని (శ్రీ అరవిందులు ఆ గదిలో పనిచేసుకుంటూ ఉండేవారు) నేను ఒంటరిగా నడవాలనుకునే దాన్ని. కానీ నేను ఎప్పుడూ ఒంటరిగా లేను. అక్కడ ఎప్పుడూ కృష్ణుడుండేవాడు. కృష్ణఅందరికీ తెలిసిన కృష్ణ పరమాత్మ. కానీ ఆయన పొడుగ్గా, ఎంతో అందంగా హాస్యాస్పదంగా ఉండే నీలిరంగులో కాక మీకు తెలుసా బూడిద రంగు నీలంలో ఉండేవాడు. ఎల్లప్పుడూ మేము పైకి, క్రిందికి కలసి నడిచేవాళ్ళం. మేము కలిసి నడుస్తాము. ఆయన కొంచెం వెనుక ఉండేవాడు. (సంజ్ఞలు వెనుక, మెడ, భుజాలకి ఎదురుగా నేను కొంచెం ముందుకి ఉన్నాను. నా తల ఆయన భుజం మీద ఉన్నట్లుగా అంత దగ్గరగా ఆయన నడిచేవాడు. నా తల ఆయన భుజాల మీద వాలినట్లు నాకు అనిపించలేదు. కానీ అది అట్లా ఉంది) మేము నడుస్తాము. మేము పరస్పరం సంభాషించుకుంటాము. నీకు తెలుసా అలా ప్రతిరోజు సంవత్సరం పాటు జరిగింది. ఆపై అది ముగిసింది. తరువాత అప్పుడప్పుడుగా నేను ఆయనని చూశాను. (మేము క్రొత్త ఇంటికి మారినప్పుడు కూడా ఆయనని చూశాను). ఎప్పుడన్నా రాత్రి సమయంలో నేను బాగా అలసిపోయి ఉంటే ఆయన వచ్చేవాడు. నేను ఆయన భుజం మీద నిదురించేదాన్ని. శ్రీ అరవిందులు ఈ విధంగా తమని తాము చూపించుకోవలసి వచ్చిందని నాకు బాగా తెలుసు. నేను ఇక్కడికి వచ్చాక (శ్రీమాత వసించే ప్రస్తుత గది) శ్రీ అరవిందులు వెళ్ళిపోయారు. నేను నా మంత్రాన్ని జపిస్తూ పైకి క్రిందికి నడవటం ప్రారంభించాను. శ్రీ అరవిందులు వచ్చారు. కృష్ణుడు ఏ ప్రదేశంలో కనిపించే వాడో ఖచ్చితంగా సరిగ్గా అక్కడికే వచ్చారు. (అదే సంజ్ఞలు, తన వెనకాల నేను నడుస్తాను. ఆయన అక్కడ ఉన్నారు. రోజు తర్వాత రోజు, ఆపై రోజు అలా మేము కలసి నడిచాము.

అది ఎంతో స్పష్టంగా, ఎంతో అద్భుతంగా మారుతోంది. నేను ఆలోచించడం మొదలుపెట్టాను. "ఈ మనుషులను, విషయాలను చూడటమెందుకు. ఎప్పటికీ నాకు ఇలానే ఉండాలని ఉంది" అంతే ఆయన

నా ఆలోచనను పసిగట్టారు. "నేను ఇకపై రాను" అని చెప్పారు. ఆయన రావడం ఆపేశారు. నేను 'చాలా బాగుంది' అన్నాను. ఆ పరమేశ్వరునికే నా మంత్ర జపం చేయడం ప్రారంభించాను. ఆయననే రప్పించడానికి, నాతో కలసి నడవడానికి నేనుచాలా అమితంగా ప్రయత్నించాను. కానీ ఆయన ఆయనగానే తప్ప వేరే రూపంలో కాదు. మరియు శక్తి, సన్నిధి ప్రతీదీ నేను అక్కడ ఉన్నది పరమాత్మను మరింత స్పష్టంగా అనుభూతి చెందుతాను. నా వెనకే అనభివ్యక్తంగా ఉన్నాడు. కొన్ని రోజులుగా ఒక విధమైన భావనతో ఉన్నాను. దేనికో నేను చాలా దగ్గరగా సన్నిహితంగా ఉన్నాను అనిపించింది. అది ఒక అరగంట పాటు ఒక సన్నిధి... ఒక ఖచ్చితమైన, స్పష్టమైన సన్నిధి. ఆయనే నాకు ఇలా చెప్పాడు. 'మొదట కృష్ణుడు, తరువాత శ్రీ అరవిందులు తరువాత నేను' ఇది మాత్రమే. (నవ్వుతూ) ఆ ప్రభావం అదేమాదిరిగా ఉండాలని ఆయన కోరుకోవట్లేదు.

"నేను ఇప్పుడు మనుషులతో విసిగిపోయాను"

శ్రీమాత : ఒక శిష్యునితో సంభాషణ, జూన్ 18,1965

నిన్న ఆకాశవాణి నుండి నాకు ఒక డైరెక్టర్ నుంచి లేఖ వచ్చింది. అందులో ఫిబ్రవరి 21న విశేషమైన ప్రసారం ఒకటి చేయకోరుతున్నామని చెప్పారు. చివరికి ఈ విషయం ఆయన నన్ను 'భారతదేశంలో నా జీవిత జ్ఞాపకాలు' గూర్చి ప్రసంగం చేయమని అడిగారు (శ్రీమాత నవ్వుతూ) అందువల్ల నేను నా సమాధానం సిద్ధం చేశాను.

'జ్ఞాపకాలు చాలా స్వల్పం. శ్రీ అరవిందులను కలవటానికి నేను భారతదేశం వచ్చాను. శ్రీ అరవిందులతో నివసించడానికి భారతదేశంలో ఉండిపోయాను. ఆయన కార్యాన్ని ఆయన శరీరం వదిలేయగానే అంటే ఈ భూమిపై దివ్యప్రేమ పాలనను వేగవంతం చేయడానికి మానవజాతిని జ్ఞానవంతం చేయడానికి, సత్యాన్ని సేవించడం ద్వారా కార్యం పూర్తిచేయడం కోసం ఇక్కడే ఉంటున్నాను' మొదట అది ఆంగ్లంలో వచ్చింది. తరువాత నేను ఫ్రెంచ్‌లో తర్జుమా చేశాను.

నిన్న సాయంత్రం ఆ పెద్దమనిషి రాసిన లేఖని పవిత్ర చదివి వినిపించాడు. అతను చదువుతున్న సమయంలో శ్రీ అరవిందులు వచ్చి నవ్వటం మొదలు పెట్టారు. ఆ వ్యక్తి నా జ్ఞాపకాల గురించి అడిగినప్పుడు ఆయన నవ్వారు.

తక్షణమే నాకు తక్షణమే సమాధానం వచ్చింది. అది అలా చాలా తేలిగ్గా వచ్చింది. అక్కడ చెప్పడానికి పెద్దగా ఏమీ లేదు. కానీ ఆ మనుషులకు అర్ధం కాలేదు. నాతో శ్రీ అరవిందులు చెప్పారు. వారు దానిని తెల్సుకునే గొప్ప సమయం ఇది. ఇక ఐదు నిమిషాల్లో అయిపోయింది.

శ్రీమాత : శిష్యునితో సంభాషణ జనవరి 27,1967

నోబెల్ బహుమతి

(కొంత కాలం తరువాత శ్రీమాత ఎస్ అనే వ్యక్తికి టేబుల్ మీద పెట్టుకునే ఒక పాత డెస్క్ క్యాలండర్ ఇచ్చారు. దాంట్లో జూలై 24-25 1959వ సంవత్సరం నాటి అనుభవాన్ని శ్రీ అరవిందులు సూక్ష్మ భౌతికంలో మొదటి సమావేశం - నమోదు చేశారు. ఆమె వ్రాసిన మరొక కాగితంతో పాటు... ఆయన ఏదయితే ఆవిష్కరించారో దానిని నేను సాక్షాత్కరించుకుంటున్నాను అని వ్రాశారు. నేను కేవలం ఒక ప్రచారకురాలిని. ఆయన పని కొనసాగింపుదారును మాత్రమే (ఆ తారీఖులు 1951 నాటివి) అని శ్రీమాత వివరిస్తారు.

నోబెల్ శాంతి బహుమతికి నన్ను ప్రకటిద్దామని కొంతమంది వ్యక్తులు కోరుకున్నారు. ఆ ప్రకటన కోసం నా వాఙ్మూలాన్ని అడిగారు. దానికి ఇవన్నీ చేసినవి నేను కాదు. అదంతా శ్రీ అరవిందులే అని చెప్పాలనుకున్నా. అదే రాశాను.


నోబుల్ బహుమతి శ్రీ అరవిందులకి ఇవ్వాలని వారు కాంక్షించారు. కానీ ఆ నిర్ణయం చేయడానికి ఒక సంవత్సరం ముందరే ఆయన శరీరాన్ని విడిచిపెట్టారు. వాళ్ళు ఆ బహుమతి చనిపోయిన వారికి ఇవ్వనందున ఆ పని జరగలేదు. అప్పుడు వారు నాకు అది బదిలీ చేయాలనుకున్నారు. నేను ఈ సూచన రాసి పంపాను. ఎందుకంటే నాకు పేరు, కీర్తి అనేవి అప్రధాన విషయాలు. ఈ విషయంలో కూడా అంతే. ఇప్పుడు మొత్తం వ్యవహారం అంతా మరచిపోయి, అది కాలగర్భంలోకి వెళ్ళిపోయిందని నేను నమ్ముతున్నాను.

శ్రీమాత : శిష్యునితో సంభాషణ మే 13,1962

ఆగష్టు 15,1965 దర్శనం

శ్రీ అరవిందులు 15వ తేదీన బాల్కనీలో ఉన్నారు. ఆయన అక్కడికి వచ్చారు. నాతోపాటు బాల్కనీకివచ్చారు. నేను ఎవ్వరికి ఏ విషయము చెప్పలేదు. అసలు చెప్పలేదు. అక్కడ ఒక చిన్న అమ్మాయి ఉంది. ఆ అమ్మాయికి ఇప్పుడు సుమారు 15 సంవత్సరాలు ఉంటాయి. ఆ అమ్మాయిని చాలా చెడ్డ విద్యార్థినిగా, కుదురులేనిదిగా, ఉన్మాదిగా పరిగణించారు. (ఆమెను పంపించి వేయాలని కూడా మాట్లాడుకున్నారు) కానీ నేను ఒక రోజు ఆ అమ్మాయిని తన జన్మదినం నాడు రమ్మని చెప్పాను. నాకు, నేను ఆమెనుచాలా చక్కని అమ్మాయిగా కనిపెట్టాను. రెండు మూడు రోజుల క్రితం ఆ అమ్మాయి ఉత్తరం రాసింది. దర్శన దినం 15వ తారీఖున నాకు కుడి ప్రక్క శ్రీ అరవిందులను చూసిందట. అమ్మాయి అడిగింది (నవ్వుతోంది) "ఇది నిజమేనా?" ఇది నన్ను చాలా బాగా అలరించింది. నాలో నేను అనుకున్నాను "ఇక్కడ వున్న విద్యార్థుల మీద ఇక్కడి వారికి నైతిక తీర్పులు చాలా ఎక్కువే ఉన్నాయి. అది ఇలా ఉంది. కానీ ఈ రోజుల్లో పిల్లలను నేను చూడట్లేదు. పూర్వం గ్రౌండ్‌లో ప్రతిరోజు వాళ్లను చూసేదాన్ని. లేదా ఎట్లాగో నెలకి ఒక్కసారైనా వాళ్లను చూసేదాన్ని. కానీ ఇప్పుడు ఇది వరకులా జరగడం లేదు. కొద్దిమందిని వాళ్ళ జన్మదినాలలోనే చూస్తున్నాను. కానీ ఇది ఎంతో ఆసక్తికరంగా ఉంది. కొంతమంది కూడా ఆయనని చూసి ఉండవచ్చు. కానీ నాకు చెప్పలేదు. ఆ అమ్మాయి నాకు రాసింది, బాగుంది. "శ్రీ అరవిందులు మీ ప్రక్కన నిలుచొని ఉండడం చూశాను. అదినిజమేనా?" అని.

శ్రీమాత : శిష్యునితో సంభాషణ ఆగష్టు 21,1965



శ్రీ అరవిందులు అన్నారు

శ్రీ అరవిందులు మాతో అన్నారు (ఆయనంతట ఆయనే చెప్పారు) మనసుపైన ఒక చేతన ఉన్నదని, అది మానసిక ప్రజ్ఞ కంటే వివేకవంతమైనది ఈ వస్తుజాలం లోలోతుల్లో మనిషి సంకల్పం కంటే కూడా ప్రబలమైన సంకల్పం ఉన్నదని మాకు కల్గిన అనుభవం ద్వారా మేం నమ్ముతున్నాం. ఈ చైతన్యం, ఈ సంకల్పమే మన జీవితాన్ని, మన కార్యాచరణను, మన క్రియాకలాపాలను సంభాళించి, వీక్షించాలన్నది మేం చేబూనే గొప్ప ప్రయత్నం. ఈ విధానంలోనే ఆశ్రమం సృష్టించబడింది. 1926 సం॥లో శ్రీ అరవిందులు సాధారణ వ్యవహారాల నుండి విరమించుకొని నాకు ఆశ్రమానికి సంబంధించిన సంపూర్ణ బాధ్యతను అప్పగించారు. (ఆ సమయంలో 2 భవనాలు బాడుక్కి తీసుకొని, దానిలో కొద్దిమంది సాధకులు ఉండేవారు) ఇక ఆ పై అంతా ఎదిగి ఒక అడవి విస్తరించినట్లు అభివృద్ధి చెందింది. ఇక్కడ సజీవ, క్రియాశీలకమైన ఆవశ్యకతతో సృష్టించ బడింది. ఇది ఒక సుస్థిరమైన అభివృద్ధి, అంతులేని ప్రగతిలోని రహస్యం. ప్రస్తుతం ఎదురయ్యే కష్టాలు ప్రధానంగా సాధకుల్లోని మానసిక వ్యతిరేకతల వల్ల కల్గుతున్నాయి. వాళ్ళు సాధనకు చెందిన వేగిరమైన అంగవేతను అనుసరించలేకున్నారు. మానసిక పద్ధతుల ఆక్రమణకు లొంగిపోవడంతో అవి ప్రారంభ కార్యాన్ని చెడగొట్టినవి. చేతనలో శుద్ధి చేతన వికాసమే దాని చికిత్స.

*శ్రీమాత : శిష్యునితో సంభాషణ మార్చి **11,1964***



అంతుచిక్కని ఆ చిరునవ్వు...

అతిమనస్సు నా శరీర కణాలలోకి ప్రవేశించడం అదే మొదటిసారి, అది మెదడు వరకు వ్యాపించింది. కాబట్టి మెదడు ఏదో సన్నిధిని కనుగొంది (నవ్వుతూ) ఆ స్వీకరించేది మునుపెన్నడు లేనంతగా చాలా శక్తివంతమయింది. వెర్రితనం కొద్ది అది ఆందోళన చెందింది. నా విషయానికొస్తే (పైన లేదా అంతకు మించి సంజ్ఞ), నేను అన్నింటినీ చూశాను, మెదడు ఆందోళన చెందుతున్నట్లు నేను చూశాను, కాబట్టి నేను అది ఎంత అవివేకమో దానికి చెప్పడానికి ప్రయత్నించాను, దానిని అలాగే నిశ్చలంగా ఉంచాను. అది అలాగే ఉండిపోయింది, కానీ మీకు తెలుసా, అది నిజంగా అక్కడ పేలబోతున్నట్లుగా ఉంది. కాబట్టి నేను " సరే, శ్రీ అరవిందులని దర్శిద్దాం, ఏమి చేయాలో అడుగుదాం" అన్నాను. అంతే వెంటనే అంతా ప్రశాంతంగా మారిపోయింది. నేను శ్రీ అరవిందుల ఇంట్లో సూక్ష్మ భౌతిక రూపంలో మేల్కొన్నాను భౌతికమైన అనుభూతి, ప్రతిదీ చాలా సుస్పష్టమైనది. నేను వచ్చాను, లేదా నాకంటే నా శరీర చేతన వచ్చింది అనాలి. అక్కడ ఏమి జరిగిందో శ్రీ అరవిందులకు వివరించడం అది ప్రారంభించింది. చాలా ఉత్సాహకరంగా మాట్లాడుతుంది.. ఇంకా మాట్లాడుతుంది. అందుకు వారి ప్రతిస్పందన ఒక విధమైన అంతుచిక్కని చిరునవ్వు, ఆపై ఇక ఏమీలేదు. చాలా సాధారణంగా చూశారు.

అంతుచిక్కని చిరునవ్వు - ఒక్క పదం కూడా కాదు. ఉత్సాహమంతా చచ్చిపోయింది. అది శాశ్వతం నుండీ తప్పుకొంది. ఉత్సాహం చచ్చిపోయింది. అప్పుడు శ్రీ అరవిందుల భోజన సమయం (ఆశ్రమ వ్యక్తులు అక్కడ తింటారు - మరొక పద్ధతిలో). ఆయనకి ఇబ్బంది కలగకూడదని పక్క గదిలోకి వెళ్లాను. కాసేపటి తర్వాత లోపలికి వచ్చి ఆయన నా ముందు నిలబడ్డారు. (నేను - నా భౌతిక దేహం, అంటే నా భౌతిక చేతన - ప్రశాంతంగా ఉండటానికి సమయం పట్టింది). నేను మోకరిల్లి వారి చేతిని తీసుకున్నాను (ఒకరకంగా భౌతికమైనదానికంటే చాలా స్పష్టమైన అనుభూతి, నా చిన్నారి!) నేను వారి చేతిని ముద్దాడాను. దానికి వారు ఇలా అన్నారు, "ఓహ్, మంచిది" (శ్రీమాత నవ్వుతూ)

నేను అన్ని వివరాలను దాటవేస్తున్నాను (ఇది చాలా పెద్ద విషయం, దాదాపు ఒక గంట పాటు), కానీ అకస్మాత్తుగా వారు నన్ను ఒంటరిగా వదిలి గది నుండి బయటకు వెళ్ళారు (వారు నాకు చెప్పాలనుకున్నది సంజ్ఞతో వ్యక్తపరిచిన తర్వాత, అది అర్థమైంది) ఆపై మాత్రమే ఒక అడుగు వేయాలని అనిపించింది (గుమ్మం దాటిన సంజ్ఞ), తిరిగి నేను మళ్ళీ నా మంచం మీద పడుకొని ఉండటం గమనించాను. ఆ క్షణంలో నాకు నేను చెప్పుకున్నాను, "నిజమే! మనము అన్ని రకాల సంక్లిష్టమైన పనులు చేస్తుంటాము, ఇది చాలా సులభమైనది: నీవు అలా వెళ్ళాలి అనుకొంటే (అదే సంజ్ఞ) నీవు అక్కడకి చేరుకోగలవు అలాగే నీవు ఇలా వెళ్ళాలి అనుకొంటే (వ్యతిరేక దిశలో అదే సంజ్ఞ)ఇక్కడకు తిరిగి రాగలవు."

శ్రీమాత : శిష్యునితో సంభాషణ అక్టోబరు 12, 1962

సువర్ణ ప్రశాంతత....

సాయంత్రం (బాల్కనీ దగ్గర) ఒక జన సమూహం ఉంది, (మేము చూసిన జన సమూహాలలో ఇదే చాలా పెద్దది అని నేను అనుకుంటున్నాను, అది ఆ వీధులను నింపేసింది. కనుచూపు మేరలో వీధులన్నీ జనంతో నిండిపోయాయి, నేను బయటకు వచ్చాను. నేను బయటకు వచ్చినప్పుడు, జనం నుండి ఒక విధమైన...

ప్రపంచ స్థితికి, ముఖ్యంగా దేశానికి వ్యతిరేకంగా ఒక నిరసన మధ్య ఏదో, ఒక విన్నపం, ప్రార్థన, అలలుగా పైకి లేచింది.... నేను దానిని చూచాను (ఇది ప్రత్యేకంగా పట్టుబట్టినట్టుంది), అప్పుడు నాకు నేనే ఇలా చెప్పుకున్నాను. "ఈ రోజు నా రోజు కాదు, శ్రీ అరవిందుల రోజు," నేను ఇలా చేసాను (ఉపసంహరణ సంజ్ఞ) శ్రీ అరవిందులను ముందు ఉంచాను. ఆ తరువాత, వారు ఎదురుగా వచ్చి, తమకు తాముగా ముందుకు వచ్చి, చాలా సాధారణంగా అన్నారు, "ఆయన ఏమి చేస్తున్నారో ఆ పరమాత్మకు బాగా తెలుసు" (శ్రీమాత నవ్వుతూ) నేను వెంటనే చిరునవ్వు నవ్వడం మొదలుపెట్టాను (నేను నవ్వలేదు, కానీ చిరునవ్వు మొదలయింది), ఉదయమప్పటి ప్రశాంతత, మళ్ళీ అదే ప్రశాంతత వచ్చింది.

అంతే.

ఆయన ఏమి చేస్తున్నాడో అన్నది ఆ పరమాత్మకు బాగా తెలుసు... ఆయనలోని అత్యంత పరిపూర్ణమైన హాస్య ధోరణితో. వెంటనే అంతా శాంతించడం జరిగింది.

శ్రీమాత : శిష్యునితో సంభాషణ ఆగస్టు 16, 1967

దేహంలో జరిగే కార్యము

దేహంలో జరిగే కార్యము ఒక త్వర పెట్టే అంగతో కొనసాగుతుంది. అయితే ఇది అంత సులభమైనది కాదు. కానీ చాలా స్పష్టంగా, నిర్దిష్టంగా ఉంటుంది. శ్రీ అరవిందుల సమక్షంలో ఒక రాత్రి మొత్తం గడిపినపుడు వారు దేహంలో జరుగబోయే దానిని నాకు వివరంగా విశదీకరించారని మీకు చెప్పాను.

ఇది చాలా కష్టమైనది.

ప్రస్తుతం సహజమని కనుక్కొనే స్థితిని, మనిషి ఎక్కువగా పరిపూర్ణ దుర్బలతకి చెందిన ఒక స్థితిగా భావిస్తాడు. అందువలన తాను ఆధారపడిన ప్రతీదీ ఇప్పుడు ఏమీ కాదని భావించడం జరుగుతుంది.కనుక ఇది కష్టం.

విషయాలు చాలా ఆసక్తికరం. ఫలానా విషయాలు ప్రమాదకరమని మనం ఎప్పుడూ అనుకుంటాం. (ఫలానా అస్వస్థత, ఉదారహరణకు కొన్ని ప్రత్యేక జాడ్యాలు) వేరేవి అప్రాముఖ్యమైనవి. అప్పుడు అది శుద్ధంగా ఒక అనివార్య స్థితిలో చూపబడుతుంది. దీని మీద అస్సలు ఆధారపడదు. (విశదంగా చెప్పాలంటే) ఏది నిర్ణయించబడింది. సర్వోన్నత ప్రభువు ఏది నిర్ణయించాడు అన్నదాని మీద సర్వమూ సంపూర్ణంగా ఆధారపడి ఉంటుంది. ఇది అత్యంత స్వల్పమైన దానితో ఒక పూర్తి అప్రయోజకర సమస్య తీవ్ర అసాధ్యమైనదిగా పరిగణించబడినది. గతిస్తున్నప్పుడు దేహపు పనితీరును ఆయన ఆపివేయవచ్చును. ఇది సాధనలో చూపబడింది. అక్కడ కష్టమైన క్షణాలు ఉంటాయి. ఎందుకంటే మానసిక ఆరోపణలు, మానసిక నిర్మాణాలు దేహానికి చాలా సహాయం చేస్తాయి. ప్రస్తుతం అదేది ఉండదు. ఆ సౌకర్యం ఎప్పటికీ ఉండదు. ఉదాహరణకు నీకు ఒక మానసిక విశ్వాసం ఉందనుకో. విశ్వాసమని

పిలువబడే అదినీకు చాలా సహాయం చేస్తుంది. అది నిన్ను అన్ని కష్టాల్లోకి చొచ్చుకుపోకుండా నిలబెడుతుంది. కానీ ఇది (మానసిక విశ్వాసం) అక్కడ అస్సలు ఉండదు. అక్కడ చైతన్యం మాత్రమే ఉంటుంది. (నవ్వుతూ) చైతన్యంలో ఆరాటం ఉండదు. చైతన్యం అసందర్భ ప్రేలాపన చేయదు. అది నీకు కథలు చెప్పదు.నీకు సహాయం చేయవలసిన సమయంలో మాత్రమే మాట్లాడుతుంది. అది ఇలా ఉంటుంది. (ఒక నిశ్చల ఉనికి సంజ్ఞతో) తన సమగ్ర సరళత, నిజాయితీలలో ఉంటుంది. కనుక నువ్వు యుక్తంగా చూస్తావు. నీకు అంతా బాగా తెలుసు. కానీ దేహం బాగా చూస్తుంది. దాని సంవేదనలను స్పష్టంగా చూస్తుంది. మొత్తం ఎలా తయారవుతుందంటే అవి నిజంగా సత్యానికి సంబంధించనవి అన్నట్లుగా, కానీ (నవ్వుతూ) అది దానికి అంతగా సహాయం చేయదు. కొన్ని సమయాల్లో అది నిజంగా సౌకర్యంలో అస్వస్థతను అనుభూతిస్తుంది.

అది తన స్వంత మానసిక అస్వస్థత గురించి చైతన్యమయ్యింది. దాని మొదటి ప్రభావము గురించి చెప్పాలంటే ఇది నిస్సహాయం. దీని స్థానంలో ఏదో జరగడానికి ఇది కరిగిపోవాలి. అప్పుడు ఎప్పటికీ అక్కడ దీని వంక చూస్తూ ఉండే ఒక దరహాసం ఉంటుంది. అది అసందర్భ ప్రేలాపన చేయదు....

కనుక అది స్థిరంగా ఉండడానికి ప్రయత్నిస్తుంది. అది మానసిక అస్వస్థత స్థితిని దాటిపోవడం చూస్తావు. అప్పుడు నువ్వు ఇలా అంటావు "ఇవన్నీ ఎందుకు ఇలా ఉన్నాయి?" చైతన్యం స్పష్టంగా చూస్తుంది. అవన్నీ ఎందుకు ఇలా ఉన్నాయో బాగా చూస్తుంది. కానీ విషయాలు చాలా విశాలంగా, సాధారణంగా ఉంటాయి. ఎప్పటికీ అదే విశ్వజనీన స్థితిలో ఉండడం భౌతిక చైతన్యానికి కష్టం.

శ్రీమాత : శిష్యునితో సంభాషణ ఫిబ్రవరి 27,1970

శ్రీవారి సన్నిధి విశ్వవ్యాప్తం

శ్రీ అరవిందులు తమదేహాన్ని విడిచిపెట్టినపుడు, మనల్ని విడిచి పెట్టనని చెప్పారు. యథార్థానికి ఈ ఇరవై ఒక్క సంవత్సరాల నుండి, వారి ప్రభావానికి ఉన్మీలనమైన వారికి, ప్రభావాన్ని స్వీకరించగలవారికి మార్గనిర్దేశం చేస్తూ, సహాయంచేస్తూ వారెల్లప్పుడూ మనతోనే ఉంటూ వచ్చారు. వారి యీ శత సంవత్సరంలో, వారి సహాయం యింకా దృఢంగా ఉంది. మరింతగా ఉన్మీలనం గావడం యెలాగో, దానివల్ల లాభ పడడం యెలాగో తెలుసుకోవడం మనం చేయాలి. యోధోచితమైన అంతరాత్మ గలవారిదే భవిష్యత్తు. మన విశ్వాసం మరింత బలవత్తరమూ, మరింత చిత్తశుద్ధి కలదైతే, స్వీకరించిన సహాయం మరింత శక్తివంతమూ, మరింత ప్రభావవంతమూ అవుతుంది.

శ్రీమాత : శిష్యునితో సంభాషణ జనవరి2, 1972

కొంత కాలం క్రితం, రాత్రి పూట వారికిలా చెప్పినట్లు జ్ఞాపకం. దాదాపు ప్రతి రాత్రీ నేను వారిని చూస్తాను. కాని కొద్ది రోజులుగా వారిని చూడలేదు. రాత్రిపూట చూచాను... వారెప్పుడూ యిక్కడే ఉంటున్నారు (తమచుట్టూ తమను కప్పి వున్నట్లు మదర్ సంజ్ఞ చేశారు) కాని రాత్రిపూట ఆ సూక్ష్మభౌతిక లోకంలో, వారిని ఎదుటివ్యక్తిగా నేను వారితో సమావేశమవుతున్నట్లు చూచాను) వారితో "కొద్ది రోజులుగా నేను మిమ్మల్ని చూడలేదు" అని యధాలాపంగా అనేశాను. చాలా గంభీరంగా తయారై పూర్తి వ్యంగ్యధోరణితో "ఈరోజుల్లో నేను చాలా తీరిక లేకుండా ఉంటున్నాను" అన్నారు. (నవ్వుతూ) శ్రీ అరవిందుల జీవితం మీద ఒక సినిమా తీస్తున్నారని మరుసటి రోజున తెలిసింది (శ్రీఅరవిందుల 'రాజకీయ జీవితం మీద, బెంగాల్‌లో సినిమా తీస్తున్నారు) వాళ్లకు మంచి సూచనలు పంపిస్తూ ఉండవచ్చని అనుకొన్నాను. ముక్కుసూటిగా, తీవ్ర స్వరంతో 'వహ్ నేను చాలా హడావిడిగా ఉన్నాను" అని చెప్పడం చోద్యంగా లేదూ!

శ్రీమాత : శిష్యునితో సంభాషణ జనవరి 25,1967

ఒక భయంకర కార్యం

అతిమానస క్రియా శక్తిచేత తమ దేహాన్ని రూపాంతరీకరించుకొనడంలో శ్రీ అరవిందులెంత వరకు విజయం సాధించారు అని తరచుగా నన్నడుతున్నారు.

అవును మదర్, దాన్ని గురించి తెలుసుకోవాలని ఆతురతగా ఉన్నాం. నిజంగా మాకు తెలియదు. నీ బుల్లి మనసుతో యెలా తెలుసుకోగలవు? ఏదైనా కొంత అనుభవానికొస్తే తప్ప, యెవరూ అదేమిటో అర్థం చేసుకోలేరు. కాని ఒక విషయం చెప్తా. తమ దేహంలో చెప్పుకోదగినంతగా అతిమానస క్రియాశక్తిని కూడబెట్టుకున్నారు. అదెంత భయంకర కార్యమో.... వారు తమ దేహాన్ని విడిచినప్పుడు వారి దేహం దాదాపు అయిదు రోజులు ప్రకాశమయంగా లేదూ, ఆ విషయం నీకు గుర్తింది కదూ! తమ అతి మానస క్రియాశక్తినంతా నాలోనికి గ్రుమ్మరించినప్పటికీ పరిపూర్ణ ప్రకాశమయమై వుంది. వారు దేహాన్ని విడువక ముందు ప్రతిదీ, సమస్తం నాకిచ్చివేశారు. కాని వారి దేహం ఇంకా అతిమానస వైభవాన్ని ప్రసరింపజేసింది. ఆ క్షణంలో, చివరి కొద్ది నిముషాలలోనే వారి పడక దగ్గర నిలబడి ఉన్నానని నీకు తెలుసు గదా. అతిమానస వెలుగు నాలో అక్షరాలా, భౌతిక ద్రవ్యంలాగా ప్రవేశించడాన్ని చూడగలిగాను. ఒక విధమైన ఒరిపిడితో అది నాలో ప్రవేశించడాన్ని చూడగలిగాను. ఇలా (సంజ్ఞ) రోమకూపాల ద్వారా యెంతో సుస్పష్టంగా ప్రవేశించింది. వారు సాధించిన కార్యాన్ని గురించి యేమాత్రం, కనీసంగానైనా ఆతురత లేకుండా వుంటే దైవ కృప యందు యెలా విశ్వాసం పొందవచ్చునో నేనుమొట్టమొదటి సారి అదే చూడడం. తనలో వారు కూడబెట్టిన చేతన. అదొక మహాద్భుత విషయం. అది వైవిధ్యభరితమైన తెలియని సాక్షాత్కారాలతో వారు చేరుకొన్న స్థాయి అత్యంత అసాధారణమైనది. వారు దేహాన్ని విడిచివేసినట్లయితే సూక్ష్మ భౌతికంలో మరింత ప్రభావవంతంగా పనిచేయడానికి వీలుగా అతిమానస లోక అవతరణ కార్యాన్ని త్వరితం చేయాలి అనే ఒకే ఒక నిర్ణయం వారు తీసుకొన్నారు. ఆ వెంటనే,వారు తమ దేహాన్ని వెనుక విడిచివేసి, యింకా నిరోధిస్తున్న సూక్ష్మంలో యీ పరగణాను జయించ తమను తాము ముందుకురికించారు. జీవితం అవాస్తవం అని గ్రహించినందు వల్ల గాను, వారు దేహాన్ని విడిచింది. పర్యవసనాలెన్ని ఉన్నప్పటికీ ఈ రూపాంతరీకరణ కార్యం జరగడం అనే విజయాన్ని సాధించడానికి, భువిపైకి పరమసత్యాన్ని తీసుకు రావడానికి క్షేత్రాన్ని సంసిద్ధం చేయడానికి తాను స్వతంత్రునిగా అవ్వాలనే వారి విశ్వాసం మీద వారికి గల నమ్మకం వారు దేహాన్ని విడిచేటట్లు చేసింది. ఊర్ధ్వం నుండి ఒక వాక్కు, ఒక శాసనంలా వచ్చింది. అంతే నిర్ణయం జరిగిపోయింది. ఇంతకు

ముందెన్నడూ జరుగనంత మహోన్నత బలిదానం యిది. కాదు వారు మాత్రమే చేయగలిగిన, ఆయన యందు మాత్రమే మనగలిగే విధంగా తనను తాను సంపూర్ణంగా నిర్మూలించుకోవడం, పరమోత్కృష్ట ప్రహర్షంలోని తనను తాను పూర్తిగా పరిత్యజించుకోవడం అది.

భయంకరం, యెంత శక్తి, ఎటువంటి చేతన, యెటువంటి జ్ఞానం, ఎటువంటి కారుణ్యం, యెటువంటి కాంతి ఆయనలో ఉన్నది....

వారు నన్నిలా ఆజ్ఞాపించారు "భువిపై నా రూపాంతరీకరణ కార్యాన్ని నీవు నిర్వహిస్తావు... నా సహాయం ఉంటుంది" (మదర్ ఆంగ్లంలో మాట్లాడారు). అందుచేత నేను అస్సలు ఆలోచన చేయను. నేను దేనికీ ఆకారమవ్వను. కాని నమ్మకంతో ఈ కార్యంలోనికి నన్ను నేను దించుకొన్నాను. ఎంతో శ్రమతో వారీ కార్యాన్ని స్వీకరించారు. నన్ను చేయమని యిప్పుడు ఆజ్ఞాపించారు. అది పూర్తయ్యే దాకా కొనసాగించమన్నారు. నేను ప్రశ్నించను. వారు కోరినది జరిగి తీరాలి. వారు లేకుండా నేనేం చేయలేను.

నా కృషిని బలోపేతం చేయడానికి, నన్ను ముందుకు నెట్టడానికి, నాకు మార్గం చూపడానికి, నేను సంశయానికి లోనవ్వడం యెప్పుడైనా జరిగితే, నాకు వివేకం కలిగించడానికి ప్రతి అడుగునా ఆ పని జరిగే వరకూ నేను కొనసాగించడానికి వారు నా ప్రక్కనే ఉంటున్నారు. మేమిద్దరం కలిసి యెంత భయంకర కార్యాన్ని నిర్వహించాలి!

మానసికంగా గ్రహించినదంతా, వాగ్దానం చేసినదంతా యిప్పుడు వాస్తవం అవుతోంది.

దేహ రూపాంతరీకరణం యిక నెంతమాత్రం ఒక నిరర్ధక ఎండమావి కాదు. అదొక వాస్తవికత, వ్రేళ్ళూనిన ఒక ప్రక్రియ, ఒక ప్రకాశమయ భవిష్యత్తు వైపు స్థిరంగా కదులుతూ అభివృద్ధి చెందుతోంది. నూతన వెలుగుకు దేహం అద్భుతంగా బదులు పలకడం జరుగుతోంది. ఒక దివ్య నమ్మకంతో దేహం తనంతతానుగా అధికాధికంగా వేధిస్తోంది. అది యేం సాధిస్తుందనే దాని గురించి నేనసలే అనుమానించను. దానికి యేదీ అసాధ్యం కాదన్పిస్తోంది. అపరిమితమైన శక్తి, ఊర్ధ్వాలచే దాని సామర్థ్యం బ్రహ్మాండంగా అధికమైంది. దేహం విశాలమౌతోంది. విశ్వమంత విశాలమౌతోంది. జీవకణాల ఒక విధమైన రూపాంతరీకరణ దేహంలో అది వరకే జరిగింది. శాశ్వత సౌందర్యం కల

శాశ్వత రూపం అని ఊహించుకునే దానిని అది బహిర్గతం చేయగలదు. మనిషి యెప్పటికైనా ఊహించగలిగిన దానంతటి కంటె అది వేయిరెట్లు సుందరం అనేది స్పష్టం. దానికి వయస్సనేది ఉండదు. కాలంచే లేక దాని పర్యవసానాలచే యెన్నటికీ కరిగించబడదు. నేనొక పసిబిడ్డలా అయినాను కాని యెంతో అద్భుతంగా ఉన్నాను.

దేహం ప్రకాశవంతం, పారదర్శకం, నమ్యం, మెత్తనైనది, దాని అవసరాన్ని బట్టియే రూపాన్నైనా తీసుకోగలదు. దాని చేతన లక్షణం సైతం, దానికి గతమంటూ లేనంతగా పరివర్తన చెందింది. అంతేగాక మాటలలో వ్యక్తపరచలేని అనేక ఇతర విషయాలున్నాయి. ఓహ్ అదెంత అద్భుతం! అది అసాధారణం! నమ్మలేం!

కానీ... ఏ ఒక్కరూ అర్థం చేసుకోలేరు లేదా నమ్మలేరు లేదా నాలో యేం జరుగుతున్నదో దానిలో వందోవంతు కూడా వంట బట్టించుకోలేరు. సమస్త గ్రహింపును అతిశయించిపోతుంది. (సమాధి)

ది బ్లెస్సింగ్స్ ఆఫ్ ది గ్రేస్ పుట ***141-42***

ప్రతిదాన్నీ నాకొదిలెయ్యి

ప్రతి విషయాన్నీ నాకొదిలేసి నిన్ను నీవు ప్రవాహంలో కొట్టుకొని పోనివ్వు. నీకు మార్గదర్శనం లభిస్తుంది. అతి మానసపు రూపాంతరీకరణ చర్య వల్ల దేహ రూపాంతరీకరణ సాధించడం కోసం, కాలక్రమేణా పృథ్వి రూపాంతరీకరణ కార్యం నెరవేర్చడం కోసం నేను ఇచ్చట భువిమీదకు దిగివచ్చాననేది స్పష్టం. మానవ జాతిలో ఈ అతిమానస ద్రవ్య ఒక బీజాన్ని నాటగలిగితే అది భువిపై దాని కొనసాగింపును ఖాయం చేస్తుంది. నేను తీసుకొచ్చే దానిలో అతిసూక్ష్మ భాగంలో వెయ్యోవంతు మాత్రమే అయినప్పటికీ, ఈ ఉద్యమాన్ని శాశ్వతం చేయడానికది సరిపోతుంది.

లేని యెడల, భువి, మనుషులు సంసిద్ధంగా లేరని, ఒక మహనీయ ప్రకాశం, ఒక మహనీయ జ్ఞానం, ఒక మహనీయ ఆనందం అవతరించడాన్ని అంగీకరించి స్వీకరించదగినట్లుగా లేరని, శాశ్వతునికై, సృష్టి పరమ సత్యానికై తమను తాము ఉన్మీలనం చేసుకొన సిద్ధంగా లేరని చెప్పవలసి ఉంటుంది. ఇక చాలు! ఇంతకు మించి నేను మాట్లాడకూడదు. నేను మాట్లాడవలసిన

దాని కంటే బయటపెట్టవలసిన దానికంటె చాలా యెక్కువ మాట్లాడాను, బయట పెట్టాను. త్వరపడండి. చాలా ఆలస్యమైంది. తిరిగి కలుసుకునే దాకా శెలవు.

*ది సుప్రీమ్ **40-1***

శ్రీ అరవిందులు సర్వాన్నీ యేర్పాటు చేశారు

నా పని తేలికవ్వడానికి శ్రీ అరవిందులు అంతా ఏర్పాటు చేశారు. ఈ మహానిశ్చేతన పరగణాను తెరవడానికి తాళం చెవి శ్రీ అరవిందుల దగ్గర వుంది. వారు తలుపు తెరవడానికి తాళం చెవి త్రిప్పి నా దారిని ప్రకాశవంతం చేస్తారు. ఈ జడ, అస్పష్ట పదార్ధ దేహంలోనికి దివ్య క్రియాశక్తిని, దివ్య ప్రకాశాన్ని, దైవ ఆనందాన్ని చొప్పించడం కోసంచాలా సౌమ్యంగా నేను ప్రవేశిస్తాను. రూపాంతరీకరించు వెలుగుతో స్పృశించబడినపుడు, ఈ పదార్ధంగా తయారైన అణువులు ఒక నూతన దివ్య చేతనకు మేలుకొంటాయి. ఈ విధంగా కార్యం కొనసాగుతుంది, విస్తరిస్తుంది, లేక హెచ్చుతుంది. అర్ధమైందా? పదార్ధ అంతరాత్మ సకల మానవజాతి ఆకాంక్ష శ్రీఅరవిందులు. పదార్ధంలోని దివ్య వెలుగు, లేక పదార్ధంలో అవతరించిన ఆధ్యాత్మ ఆతడు. ఈ పదార్ధంలో, ఒక దేహంలో, ఈ నిశ్చేతన, అజ్ఞానాల భారాన్ని తన మీద వేసుకొని, దివ్య జీవనానికి వాటిని మేలుకొలుప పరాత్పరుని నుండి తనను తాను వేరుచేసుకొని శ్రీ అరవిందులు మునక వేశారు.

దీనికోసం వారు పరాత్పరుని, దైవ కృపను, తమ కార్యంలో సహాయం చేయమని క్రిందికి, భువిపైకి దిగిరమ్మని ఆవాహన చేశారు. అందుచేతే వారి పిలుపు విని పదార్ధంలోనికి ఒక భౌతిక దేహంలో బాధావ్యధ మృత్యువుల యీ లోకంలోనికి నేను వచ్చాను. మా యిరువురి ఐక్యతలో, దివ్య జీవనమనే యీ మహిమను క్రమంగా యీ ప్రపంచం సాక్షియై దర్శిస్తుంది. అది వారి కారణంచేతనే నేను దిగివచ్చా. క్రింది నుండి పదార్ధపు యీ తీవ్ర ఆకాంక్షను వారిపైకి పంపినందువల్ల దిగి రావడం ద్వారా దైవకృప బదులు పలికింది. భువికి యెటువంటి శుభ ఘడియ యిది! సకల విశ్వం ఒక మహోత్సాహంలో తన అస్తిత్వ గమ్యం వైపు వికసించడమనే బ్రహ్మాండమైన పురోగతికిదొక

సరైన తరుణం. అది ఉపయోగించుకొనడానికి వీలుగా దానికందుబాటులో వున్న మన సహాయంతో కొనసాగించాలనే సంకల్పంతో దీన్ని సాకారం జేసుకొనడానికి అసాధ్యమనేదేముంటుంది! ఇదే ఆ క్షణం.

మన నుండి వెలువడే ప్రతి కంపనం, మన నుండి ప్రసారమయ్యే ప్రతి కిరణం, నిశ్చేతన అస్తిత్వం వైపు దారిని ప్రకాశమయం చేస్తుంది. శ్రీ అరవిందుల వల్ల మాత్రమే, యీ పనిని నేను సాధించగలను. కార్యంలో అధిక భాగం వారే చేస్తారు. వారు నన్ను ఆహ్వానించారు. ద్వారాలు తెరిచారు. యీ నిశ్చేతన లోతులలోనికి నేను ప్రవేశించి నిశ్చేతన నిద్రాణ స్థితిలో అణువులను ప్రకాశింప జేయడానికి దీపం వెలిగిస్తాను. వాటిని మేలు కొలపడానికి కొంచెం ఒత్తిడి కలిగిస్తాను. అది మరింతగా ఆకాంక్షించడానికి ఈ దైవ ప్రేమను అందిస్తాను. ఈ విధంగా నేను ప్రతి అణువును ఉత్తేజితం చేస్తాను.

అక్కడ మనం మన పాదాలను మోపి, మన అడుగుజాడలను విడిచి వచ్చాం. ఆ అణువులు తిరిగి వెలుగును ప్రసరింపజేసి, వాటికి సమీపంలో వున్న వాటిని ప్రభావితం చేస్తాయి. ఈ రీతి ఉత్పరిణామ కార్యం నిరాఘాటంగా కొనసాగుతుంది.

ది సుప్రీమ్ 52-53

పరమేశ్వరుడు ఆతని శక్తి

ఆంతర అస్తిత్వపు ఆ అపరిమేయ గుహలో, ఆంతరిక ఆధారం కోసం మునకవేయాలి. సమస్త ముద్రలను వెనుకనే విడచివేసి, యింకా యింకా దిగి దిగి పోవాలి. అధికాధికంగా స్తరం తరువాత స్తరంలోనికి చేతన తరువాత చేతనలోనికి దిగిపోయి, పరమ పవిత్ర దివ్యశాంతిని కనుగొనడానికి అసలు లోతులలోనికి ప్రవేశించాలి. అస్తిత్వపు ఈ అపరిమేయ ప్రశాంతతలో, బాహ్యా రణగొణ ధ్వనికి చాలా దూరంగా, బాధా వ్యథలకు చాలా దూరంగా, ఆలోచనలకు, ఊహలకు చాలా దూరంగా, ఇంద్రియ చలన తరంగాల నుండి చాలా చాలా దూరానికి, చాలా జాగ్రత్తగా, యెచట అహం ఉండదో, అచట దైవ సన్నిధిని అనుభూతి చెంద దిగాలి. ఇంకా వెళ్ళవలసిన తావు వున్నది. ఆవిష్కరించుకోవలసిందింకా వుంది. ప్రతి దానిని సాధించే సర్వశక్తివంతమైన, దివ్యశక్తి యెచట ప్రకంపిస్తుంటుందో దానివైపు చేతనను ద్రిప్ప పోవలసి

ఉంది. ఎచట, సమస్తానికీ మూలంలో వున్న సంతస తరంగాలు, కంపనం, ఈవిధంగా సమంగా (సంజ్ఞ) ఒక పరిపూర్ణ సమచిత్తత దప్ప చర్య అంటూ, భావముద్ర అంటూ అహం అంటూ, ప్రత్యగాత్మ అంటూ లేని యింకా లోతులోనికి వెళ్ళాలి. ఈ పరిపూర్ణ మార్పెన్నడూ ఉండని, శాంతిని అనుభూతి చెంది, యేకంగావడానికి, కేంద్రీయ అస్తిత్వంలో చేతన యెడల తాదాత్మ్య స్థితిలో ఉంటుందో ఆ పవిత్ర సుఖ స్థితిలోనికి ప్రవేశించాలి. అదిగో అచట ఇకనేమాత్రం ద్వంద్వ స్థితి ఉండదు. బాహ్య దృష్టి యిక నెంతమాత్రం వుండదు. యేమీ అసలుండనే ఉండదు. మనలో ఆవాసముంటున్న అమృత జ్వాల, అంతర్యామి దైవం, అనుపమానం, యేకైకం. అంతరాత్మ విస్ఫులింగంతో ఒకటై ఉండిపోవడం.

ఈ పవిత్రీకరించు జ్వాలలో ఇంకా లోతులో దిగువన శ్రీ అరవిందులు మార్పులేని బ్రహ్మానందమైన, సర్వశక్తివంతమైన, దివ్య అజేయుడైన, మన అస్తిత్వ పరాత్పర ప్రభువు, సృష్టిలో అభివ్యక్త సర్వవ్యాపి ప్రభావాలు చూపించడంలో సర్వశక్తివంతుడు, అభివ్యక్తమైన సర్వోన్నత దివ్యశక్తి సర్వజ్ఞత, దివ్య గమ్యం, దివ్య గురువు, దివ్య ప్రియుడు - పురుషోత్తముడు కూడా అయిన శ్రీ అరవిందులు ఆవాసమున్నారు.

యధార్థంగా వారిని పిలిచినపుడు అచటి నుండి (మదర్ తన హృదయాన్ని సూచిస్తారు) శ్రీ అరవిందులు బదులు పలుకుతారు. వారి దివ్యమానసంతో, వారి చేతనతో అది కంపిస్తుంటుంది. అచట శ్రీ అరవిందుల నామం ప్రతిధ్వనిస్తూ ఉంటుంది. అచట వారి ముద్ర వుంది గదా (సంజ్ఞ)

ఆ అసలైన లోతులలో, నివసిస్తున్నది వారే. సమస్త సృష్టి ఆయనచే జీవిస్తోంది.

అది వారిచే ప్రకంపిస్తోంది. సకల విశ్వం వారిచే ప్రకంపిస్తోంది. ప్రతిదానియందూ వారే ఉన్నారు. ప్రతిదీ వారి దివ్యసన్నిధిచే స్పందిస్తోంది, చలిస్తోంది.

వారి నామ ఆనందం, సమస్తంలోనికీ చొచ్చుకుపోయి, పరిశుద్ధం చేస్తోంది. శాశ్వతమూ, సత్యమూ అయిన పరమానందంలో, ప్రతిచోటా మారు మ్రోగుతోంది, ప్రతిధ్వనిస్తోంది. వారి నామంతో సృష్టి ఒక అర్థాన్ని సంతరించుకోంటోంది.

ఈ సకల విశ్వంలోని ప్రతిదానిలో దాగివున్న అంతర్యామి దైవాన్ని పునరావిష్కరించు కొనడానికి... వారిని కనుగొనడం ఒక ఆట. వారిని అనుభూతి చెందడమంటే పరిపూర్ణ పరిశుద్ధత, అమృత పరమశాంతిని అనుభూతి చెందడమే. వారిని పిలువడమంటే అనంతపు ద్వారాలను తెరవడమే. శ్రీ అరవిందుల నామం వెనుక గల శక్తి యిది (సమాధి)....

అనవరత కృతజ్ఞతాచర్యలో ఆత్మార్పణకు సంబంధించిన అద్భుత స్పృహతో మన అస్తిత్వంలో ఒక సర్వోత్కృష్ట సంతసం నిండి ఉండడం మన అస్తిత్వపు పరమేశ్వరునకు, ఒక శాంతియుత ఆరాధనా భావంలో మనల్ని మనం అర్పించుకోవడం అనేది కృతజ్ఞతకు అర్థం.

శాశ్వత, జ్వాలలో ఒక దివ్య సన్నిధిగా నేనున్నాను. కర్మను జరిగించే, ఆరంభించే దివ్యశక్తిని, సమస్తాన్నీ మధురం చేసేదీ, శాంతియుతం చేసే వరకు శాంతిని, పొంగిపొరలి, ఉన్నతీకరించే సంతసాన్ని, పరిశుద్ధం చేసే వెలుగును, అనుమతినిచ్చే దివ్య కంపనాన్ని పెంచి పోషించే ఒక రూపంగా శ్రీ అరవిందులున్నారు. నేను, ఒక మార్గదర్శకురాలిగా వున్నాను. వాస్తవానికి రెండైనది ఒకే వ్యక్తిత్వం. ఒకరు దివ్యసాక్షి, యింకొకరు మహాశక్తి.

వాస్తవానికి శ్రీ అరవిందులు నేను ఒకే ఒక్క వస్తువు, ఒకే ఒక వ్యక్తిత్వం. అలా శ్రీ అరవిందులను, నన్ను గుర్తించిన వారికి సమస్త అవరోధాలు, సమస్త ఇబ్బందులు, సమస్త ఉచ్చులు, పరమసత్యం వైపు సాగే నడకలో అడ్డంకులని చెప్పుకునేవన్నీ తుడిచి పెట్టుకుపోతాయి. శాశ్వతంగా యీ జీవితంలోనూ మరణించిన తర్వాతా, రాబోయే జన్మలలో కూడా అనంత కాలం దాకా తొలగించి వేయబడతాయి.

అవును అతనికి పరమేశ్వరుడు సర్వశక్తివంతుడు. 'మా శ్రీ అరబిందో మా శ్రీ అరబిందో' అని మాత్రం మననం చెయ్యి. (సమాధి) ఇది చాలు (సమాధి)

దిసుప్రీమ్ 63-64

Vol. 53, No. 4
April 2023


Date of Publication
1st April 2023

Registered: PY/41/2021-23

AKHILA - Akhila Bharata Patrika (Telugu)

Registered with the Registrar of Newspapers for India: No. 23593/72 (monthly)

Matter shall reveal the Spirit's face. — Sri Aurobindo



Flower on the Cover:
Avatar (Pink Lotus)
Avatar-the Supreme Manifested in a Body upon Earth
The pink lotus is the flower of Sri Aurobindo.

Aditi (White Lotus)
Aditi-the Divine Consciousness
Pure, immaculate, gloriously powerful.
(Spiritual significance and explanation of the flower given by the Mother)
Botanical name: Nelumbo nucifera

Owner: Sri Aurobindo Society
Printer: Swadhin Chatterjee for Sri Aurobindo Ashram press
Publisher: Pradeep Narang for Sri Aurobindo Society
Published from: Society House, 11 Saint Martin Street, Puducherry - 605001
Printed from: Sri Aurobindo Ashram Press,
No. 38, Goubert Avenue, Puducherry - 605 001, India
Editor: K. V. Rao


Single copy Rs. 30 **Annual Subscription Rs. 200 (in India)**

A Monthly Published by

SRI AUROBINDO SOCIETY-605001

The chief purpose
of the "avatar" is to give
to man a concrete proof that
the Divine can manifest upon earth.

CWM 15: 18 The Mother



At the Lotus feet of the Divine Mother

Sri Aurobindo Society
Eluru Centre
11-37, Gnan Deep
K.S.Rao Garden, Eluru
Andhra Pradesh 534003

అఖిల

అఖిల భారత పత్రిక

మే 2023



సమర్పణ


విషయ సూచిక



సంపాదకీయం :

పూర్ణయోగంలో అవసరమైన, పురుష ప్రయత్నం, ఆకాంక్ష, తిరస్కృతి, సమర్పణకు సంబంధించిన త్రివిధ పరిశ్రమ. ఈ యోగపు ప్రధాన ఆధారాలలో ఒకటి సమర్పణ. అయినప్పటికీ ప్రచారంలో వున్న భావాలకు విరుద్ధంగా సమర్పణకే కృషి చేయవలసి వుంటుంది. ఒకసారి సమర్పణ పరిపూర్ణం అయితే, క్రమంగా కృషి అవసరం తగ్గిపోతుంది. దివ్య జననికి సమర్పణ గావాలనే దృఢ సంకల్పం లేకపోతే ఈ యోగం అసాధ్యం అని స్పష్టంగా ప్రకటించబడిన పూర్ణ యోగ సాధన ప్రధాన అంశానికి ఈ సంచిక అంకిత చేయబడింది.

అనువాదం : కె.వి. రావు

పూర్వ జన్మ సంబంధాలు

ఏ పూర్వ పుణ్యం వల్ల ఇచ్చటి దైవపాదాల చెంతకు మేము చేరుకోవడమనే అరుదైన దైవానుగ్రహం మాకు ప్రాప్తించిందీ?

మీ అంతరాత్మ ఆక్రందన మిమ్మల్ని ఇచ్చటకు తీసుకు వచ్చింది. అదీగాక గత జన్మలలో మదర్‌తోనూ, నాతోనూ మీకు గల సంబంధం, మాపై గల ఆకాంక్ష మిమ్మల్ని ఇచటికి తీసుకువచ్చింది.

సమర్పణ అంటే?

యోగం రెండు మార్గాలు

యోగాభ్యాసానికి రెండు మార్గాలున్నాయి, ఒకటి తపస్సు, మరొకటి సమర్పణ. తపస్సు మార్గం శ్రమతో కూడుకొన్నది. ఇక్కడ పూర్తిగా నీవు నీమీద ఆధారపడాల్సి వుంటుంది, నీ బలం మీద ఆధారపడి ముందుకు సాగవలసి వుంటుంది. నీవెంతగా నీశక్తినుపయోగిస్తావో దానిని బట్టి నీవు అధిరోహించి సాధిస్తావు. అందులో పతనమయ్యే ప్రమాదం యెప్పుడూ వుంటుంది. ఒకసారి గనుక పతనమవ్వడం జరిగితే అగాధంలో పడి పోయి ముక్కలైపోతావు, బాగు పడడం కష్టమే. సమర్పణ అనబడే మరోమార్గం సురక్షితమైనది, విఫలం కానిది. ఏదేమైనప్పటికీ ఇదిగో యిక్కడ పాశ్చాత్యులకు యిబ్బంది కలుగుతుంది. వాళ్ళ వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించే సమస్తాన్నీ దరిచేరనివ్వవద్దనే, భయాన్ని వాళ్ళకు బోధించారు. వ్యక్తిత్వభావనను వాళ్ళకు తల్లిపాలతో రంగరించి పోసారు. సమర్పణ అంటే దాన్నంతా వదులుకోవడం అని వాళ్ళ భావం. వేరుమాటలలో, నీవు మార్జాల కిశోర మార్గాన్నిగాని, మర్కట కిశోరమార్గాన్ని గాని, రామకృష్ణ చెప్పినట్లు అనుసరించవచ్చు. ఎచటి కన్నా తీసుకుపోవాలనుకొన్నపుడు కోతిపిల్ల తల్లిని గట్టిగా పట్టుకొని తీరాలి లేకపోతే, పట్టు సడలితే అది క్రింద పడిపోతుంది. కానీ పిల్లిపిల్ల తల్లిని పట్టుకోదు. తల్లే పిల్లను పట్టుకొంటుంది, పిల్లి పిల్ల భయపడాల్సిన పనిలేదు, దానిపై బాధ్యత కూడా లేదు. అది చేయవలసిందల్లా తనతల్లి తనను పట్టుకోనివ్వడమే, మ్యావ్, మ్యావ్ అనడమే.

ఈ మార్గాన్ని పూర్తిగా, చిత్తశుద్ధితో స్వీకరిస్తే, ప్రమాదంగాని, తీవ్రమైన యిబ్బందిగానీ ఇకనెంత మాత్రం వుండదు. సమస్య చిత్తశుద్ధితో వుండడంలోనే వుంది. నీకు చిత్తశుద్ధి లేకపోతే యోగాన్ని మొదలు పెట్టకు, మానవ వ్యవహారాల్లో తలమునకలై వుంటే, మోసానికి గురయ్యే ప్రమాదముంది. కాని దైవంతో వ్యవహరిస్తూ వుంటే ఎక్కడా మోసానికి గురికావు. నీవు నిష్కపటివై అంతః సత్త్వం దాకా ఉన్మీలనమై వుంటే, దైవాన్ని నిజం చేసుకోవడం, ఆయనను సంపాదించుకోవడం, దైవంతో నడుపబడడం అనేదే నీ ఏకైక గమ్యం అయితే, మార్గం మీద సురక్షితంగా పోగలవు.

CWM 3: 4,5

దైవానికి నిన్ను నీవు పూర్తిగా యిచ్చివేసుకో

నిన్నునీవు దైవానికి పూర్తిగా యిచ్చి వేసుకొన్నట్లయితే, అపుడు యోగాన్ని కొనసాగించేది దైవమే గాని నీవికనెంత మాత్రం కాదు. అందుచేత ఇది పెద్దగా కష్టమైనది అవ్వదు. తపస్సు చేస్తే అప్పుడు యోగం ఆచరించేది స్వయంగా నువ్వే, మొత్తం బాధ్యతంతా నీదే - అదిగో ప్రమాదం వుండేది అక్కడ. చాలా స్వేచ్ఛా భావంకల కొంతమంది వున్నారు, వాళ్ళు అందులో ఉండే ప్రమాదాలతో సహా మొత్తం బాధ్యతను తమమీద వేసుకోనేందుకిష్టపడతారు. బహుశా వాళ్ళు పెద్దగా తొందర పడట్లేదేమో, అనేక జన్మలవసరమైనా వాళ్ళకిదేం పట్టదనుకొంటాను. కాని మరికొంతమంది వున్నారు, త్వరగా గమ్యాన్ని తప్పకుండా చేరాలనుకొనేవాళ్ళున్నారు. వీళ్ళు మొత్తం బాధ్యతను దైవం మీద పెడ్తారు.

CWM 4 : 72

దైవానికి మన జీవితాన్నప్పగించాలని తీసుకొనే నిర్ణయం.

దైవానికి నీ జీవితాన్నప్పగించాలని తీసుకొనే నిర్ణయమే సమర్పణ. ~~ఈ~~నిర్ణయం తీసుకొనక పోతే ఏదీ సాధ్యంకాదు. నీవు సమర్పణగాకపోతే, యోగం అన్న ప్రశ్నేలేదు. ఆ నిర్ణయం తరువాతే తక్కినదంతా సహజంగా లభిస్తుంది, ఎందుకంటే మొత్తం ప్రక్రియ అంతా సమర్పణతో మొదలౌతుంది. జ్ఞానం ద్వారాగాని, భక్తి ద్వారా గాని సమర్పణ గావచ్చు. దైవం ఒక్కటే సత్యం అనే బలమైన అంతఃస్ఫురణ వుండవుచ్చు. దైవం వినా నేనేంచేయలేననే ఒక ప్రకాశమయ నమ్మకం నీకుండవచ్చు. సుఖంగా ఉండాలంటే ఇదొక్కటే మార్గమని ఒక ప్రయత్న సంవేదన ఎట్టి మినహాయింపు లేకుండా దైవానికే చెందాలనే ఒక బలమైన అంతరాత్మిక కోరిక నీకుండవచ్చు. "నేను నాకు చెందను" అని చెప్పుకొని నీ అస్తిత్వపు బాధ్యతను పరమ సత్యానికప్పగించు. ఆ తరువాత ఆత్మార్పణ 'మంచి, చెడు, చీకటి, వెలుగు అయిన అనేక లక్షణాలున్న ఒక జీవిని నేను. ఉన్న వానిని ఉన్నట్లుగా నన్ను నేను నీకు అర్పించుకుంటున్నాను. నా సమస్త ఉచ్చ, నీచాలతో సహా నన్ను పరస్పరం సంఘర్షించుకొనే ప్రేరణలు, ధోరణులతో సహా నన్ను స్వీకరించి, నాతో నీకేది యిష్టమో అది చెయ్యి." నీ ఆత్మార్పణ జరుగుతున్నపుడు, మొదట నీలో యేది - అది నీ కేంద్రీయ అంతరాత్మిక సంకల్పం - నిర్ణయం

తీసుకొందో దాని చుట్టూ నీ అస్తిత్వాన్ని ఏకం చేయ మొదలుపెట్టు. నీ స్వభావపు జగడమాడే అంశాలన్నింటినీ సమరసం గావించాలి. ఒకదాని తరువాత మరొకటిగా వాటిని తీసుకొని కేంద్రీయ పురుషునితో ఏకం చేయాలి. ఒక అప్రయత్న చలనంతో నిన్ను నీవు దైవానికర్పించుకోవచ్చు కాని యీ యేకీకరణ లేకుండా ప్రభావవంతంగా నిన్ను నీవర్పించుకోవడం సాధ్యం కాదు. ఎంత ఎక్కువగా నీవు యేకీకృతం కాగలిగితే అంత అధికంగా ఆత్మార్పణ వాస్తవమౌతుంది. ఒకసారి ఆత్మార్పణ సంపూర్ణమైతే, ఆత్మ నివేదన దాన్ననుసరిస్తుంది. సాక్షాత్కార ప్రక్రియ మొత్తానికది శిఖరం. వర్గీకరణలో అది చివరి మెట్టు, దాని తరువాత యిబ్బంది కెంతమాత్రం ఉండదు. అంతా సవ్యంగా సాగిపోతుంది. ఒకేసారి సమగ్రంగా ఆత్మ నివేదన అయిపోయిన వాడివిగా నిన్ను నీవు భావించకూడదనే విషయాన్ని మరచిపోకు. ఏదో ఒక రకమైన బలమైన చలనం ఒకరోజు రెండు రోజులలో నీలో కదలాడినట్లున్నప్పుడు అటువంటి భ్రాంతికి నీవు తరచుగా లోనవ్వడం జరుగుతుంది. అలా జరిగింది గనుక తక్కినదంతా దానంతటదే అనుసరిస్తుందని ఆశించే పరిస్థితికది దారి తీయవచ్చు. వాస్తవానికి నీవు యేకాస్త అయినా ఆత్మ తృప్తికి లోనైతే, నీ పురోగమనాన్ని నీవే మందగింపజేసిన వాడివి అవుతావు. ఎందుకనంటే దాదాపు విభిన్నమూర్తిత్వాలని చెప్పదగ్గ, ఒకదానితో మరొకటి పోరుసలిపే అసంఖ్యాక వైఖరులతో నీ అస్తిత్వం నిండిపోయి వుంది. వాటిలో ఒకటి తనను తాను దైవానికర్పించుకొంటే, ఇతరమైనవి పైకి లేచి తాము సమ్మతించమని తిరస్కరిస్తాయి. "మమ్మల్ని మేము అర్పించుకోవడం లేదు" అని అరుస్తాయి. తమ స్వేచ్ఛకు, తమ స్వీయభావ ప్రకటనకు గగ్గోలు పెడ్తాయి. అపుడు నీవు వాటిని ప్రశాంతపరచి సత్యమేదో వాటికి చూపించు. సహనంతో నీ సమస్త అస్తిత్వం చుట్టూ తిరిగి, ప్రతి మూల మూలను శోధించి, పైకి లేచి రావడానికి తగిన మనస్తత్వ సంబంధ సమయం కోసం వేచి వున్న అరాచక అంశాలను అన్నింటినీ యెదుర్కొంటూ సత్యాన్ని వాటికి చూపించాలి. నీ మానసిక, ప్రాణిక, భౌతిక ప్రకృతినంతా పూర్తిగా శోధించి, తనను దైవానికర్పించుకొనేటట్లు ప్రతి దానినీ ఒప్పించి, ఒక పరిపూర్ణమైన ఏకీకృతమైన నివేదనను సాధించినపుడు మాత్రమే, నీ యిబ్బందులకు ముగింపు పలికినట్లవుతుంది. అప్పుడు నిజంగా రూపాంతరీకరణం వైపుకొక వైభవోపేతమైన నడక అవుతుంది. ఎందుకనంటే

అప్పుడు నీవిక ఎంతమాత్రం అంధకారం నుండి జ్ఞానానికి గాక జ్ఞానం నుండి జ్ఞానానికి, వెలుగు నుండి వెలుగులోనికి సుఖం నుండి సుఖంలోనికి పయనిస్తావు. సంపూర్ణ నివేదన, నిస్సందేహంగా తేలికైన విషయంగాదు. అంతా నీ అంతట నీవే నీ స్వయంకృషితో నీవే సాధించుకోవాలంటే అది ఇంత అని చెప్పలేనంత సుదీర్ఘకాలం పడుతుంది. దివ్య కృప నీకు లభిస్తే, అదలా ఉండదు. అప్పుడప్పుడు ఇందులోనో, అందులోనో దైవం నెట్టడం అంటూ ఉంటే, దానితో పోలిస్తే పని తేలిక అవుతుంది. ఎంత కాలం పడ్తుందనేది వ్యక్తి మీద ఆధారపడి ఉంటుందనేది నిజమే. నీవు గనుక దృఢంగా తీర్మానించుకొంటే అది చాలా తక్కువ సమయం తీసుకొంటుంది. అవసరమైనది తీర్మానం - తీర్మానం ప్రధాన కీలకం

CWM 3:126-27

సమర్పణ, నివేదన

నివేదనలో సమర్పణ ఇమిడి లేదా?

ఏ మాత్రం లేదు. సమర్పణా భావం యేమాత్రం లేకుండానే, ఇవ్వడంలోని సంతోషం కోసం ఇవ్వవచ్చు. ఉత్సాహం ఉరకలేస్తున్నప్పుడు నీకున్న యెంతో యెంతో ఉన్నతమైన దానిని దర్శించినపుడు పరమోత్సాహ స్థితిలో నిన్ను నీవిచ్చివేసుకుంటావు. పరమేచ్ఛకు ప్రతిక్షణం సమర్పణమౌతూ ఉండడమనే విషయంలో ప్రతి నిమిషం సమర్పణ అవసరమున్నపుడు అది చాలా కష్టం. 'నివేదన' అంటే అర్థం సమస్త చలనాలను సమగ్రంగా నివేదించడం అయితే అది సమర్పణకు సమమైనదౌతుంది. అవశ్యం అది అందులో యిమిడి ఉండకపోవచ్చు. ఉత్సాహంలో ఉన్నప్పుడు చేసినదెంత మాత్రం కానపుడు, సవివరంగా దాన్ని నిజం చేసుకోవలసిన మరేదో అవుతుంది. భావావేశంలో అమితోత్సాహంతో జరిపే ఏ చలనమైనా, సాపేక్షంగా తేలిక, అది నీలో వున్న చలన తీవ్రత మీద ఆధారపడి ఉంటుంది. వ్యక్తి జీవిత ప్రతి నిమిషంలో తన ఆకాంక్షను సవివరంగా నిజం చేసుకోవడం అనే విషయంలో అమితోత్సాహం కొంచెం వెనుకంజ వేసినపుడు యిబ్బంది అనిపిస్తుంది.

CWM 4:134

సమర్పణ, త్యాగం

మన యోగంలో బలివ్వడం అనేదానికి స్థానం లేదు. కాని ఆ మాటకు నీవిచ్చే అర్థం మీద ఆధారపడి ఉంటుంది. దాని విశుద్ధ అర్థంలో ఒక పవిత్ర

నివేదన, దైవానికి చేసే పవిత్ర కార్యం అనేది ఉంది. కాని దానికిప్పుడున్న అర్థంలో విధ్వంసం కోసం చేసేదేదో అది అవుతుంది. ఒక నిషిద్ధ వాతావరణం దానితో ఉంది. ఈ విధమైన బలిదానం, సాఫల్యతను తెలియజేయడం, అదొక నష్టం కలిగిందేది, ఆత్మాహుతి. నీ శక్యతలను నీవు త్యజిస్తున్నావు లేక బలిచేస్తున్నావు. అత్యంత భౌతిక సంబంధమైన వాటి నుండి అత్యున్నత ఆధ్యాత్మిక సీమ వరకు గల, నీ వ్యక్తిత్వ సాక్షాత్కార సంభావ్యతలను నీవు బలిచేస్తున్నావు. బలి నీ అస్తిత్వాన్ని క్షీణింపజేస్తుంది. భౌతికంగా నీ జీవితాన్ని, నీ దేహాన్ని త్యజిస్తే, పదార్థ భూమికపై నీ సంభావ్యతలన్నింటినీ నీవు కోల్పోయినట్లన్న మాట.

అదేవిధంగా నీ జీవితాన్ని నైతికంగా త్యజించవచ్చు. నీ ఆంతరిక మనుగడకు సంబంధించిన ఔన్నత్యాన్ని స్వేచ్ఛగా నెరవేర్చిన దాన్ని వదిలివేసినట్లవుతుంది. ఆత్మ హననమనే ఈ భావంలో ఒక విధమైన ఒత్తిడి, ఒక నిర్బంధం విధించుకొన్న ఆత్మ తిరస్కృతి అనే అర్థం వుంది ఎల్లప్పుడూ అంతరాత్మకు సంబంధించిన ప్రగాఢమైన, విశాలమైన, ప్రేరణ రహిత సాఫల్యతలకు అవకాశమివ్వని ఆదర్శం యిది. సమర్పణ అంటే మన అర్థం యిది కాదు, అప్రయత్నంగా జరిగే ఆత్మార్పణ. దైవానికి, ఒక భాగమైన మహనీయ చేతనకు నీవు సమర్పితం గావడం అనేది మన అర్థం. సమర్పణ క్షీణింపజేయదు, వృద్ధి చేస్తుంది. అది నీ మూర్తిత్వాన్ని కుదించ లేక బలహీనపర్చదు లేక ధ్వంసం చేయదు. అది అతిశయింపజేస్తుంది. బలోపేతం చేస్తుంది. సమర్పణ అంటే అర్పించుకోవడంలో వున్న సమస్త ఆనందంతో సంపూర్ణంగా సమర్పించుకోవడం. అందులో త్యాగం అనే భావం ఉండదు. త్యాగం చేస్తున్నాననే స్పృహ యే కొంచెం వున్నా, అదింకెంతమాత్రం సమర్పణ అవ్వదు. ఎందుకనంటే నీవేదో కొంత నీ కోసం అట్టేపెట్టుకొన్నట్లన్న మాట. లేదా బాధతో, బలవంతంగా, అయిష్టంతో, ఇవ్వడంలో ఆనందించ కుండా, బహుశా యిస్తున్నాననే అనుభూతి కూడా లేకుండా యిస్తున్నావన్న మాట. నీవేదైనా నీ అస్తిత్వంపై ఒత్తిడి కలిగిస్తూ చేస్తున్నప్పుడు నీవు దాన్ని అపసవ్య పద్ధతిలో చేస్తున్నావనేది కాదనలేని విషయం. యథార్థమైన సమర్పణ నిన్ను విశాలం చేస్తుంది. అది నీ సామర్థ్యాన్ని పెంచుతుంది. నీ అంతట నీవు పొందలేని, లక్షణపరమైన, రాశిపరంగా ఒక గొప్ప స్థితి నీకు లభింపజేస్తుంది.

లక్షణానికి, రాశికి సంబంధించిన ఈ నూతన గొప్పస్థితి, అదివరకు నీవు పొందిన దానికంటే కూడా భిన్నమైనది. సమర్పణ కాకపోయినట్లయితే ప్రవేశించలేని, మరో లోకంలోనికి, విస్తృతిలోనికి నీవు ప్రవేశిస్తావు. ఒక బొట్టు నీరు సముద్రంలో పడినట్లుగా ఉంటుంది. అక్కడ అది తన ప్రత్యేక వ్యక్తిత్వాన్ని నిలుపుకొన్నట్లయితే అదొక నీటిబొట్టులాగానే ఉండి పోతుంది గాని అంతకన్న అధికంగా అవ్వలేదు. అది సమర్పణ కాలేదు కనుక దాని చుట్టూ వున్న అపరిమేయతతో అదినొక్కి వేయబడుతుంది. కాని సమర్పణగావడం ద్వారా అది సముద్రంతో యేకమై మొత్తం సముద్రానికి సంబంధించిన వైశాల్యత, శక్తిలో పాలు పంచుకొంటుఉంది.

CWM 3:114-115

సమర్పణ, మానవ మూర్తిత్వం

సమర్పణ గురించి చాలా అపప్రథలున్నాయి. చాలామంది సమర్పణ అంటే తమ వ్యక్తిత్వాన్ని కోల్పోవడంగా అనుకుంటారు. కాని అది చాలాపెద్ద తప్పు. ఎందుకనంటే వ్యక్తి దైవ చేతనకు సంబంధించిన ఒక పార్శ్వాన్ని మాత్రమే అభివ్యక్తం చేయడానికి ఉద్దేశించబడ్డాడు. దాని సహజ స్వభావ ప్రకటన అతని వ్యక్తిత్వాన్ని తయారు చేస్తుంది. దైవం యెడల సరైన వైఖరినవలంభించడం ద్వారా ఈ వ్యక్తిత్వాన్ని క్షీణింపజేసి, చిందరవందర చేసే నిమ్నస్వభావపు ప్రభావాలన్నింటి నుండి పరిశుద్ధం చేస్తుంది. ఆ వ్యక్తిత్వం మరింత బలమైన వ్యక్తిత్వంగా, తను తానుగా, మరింత సంపూర్ణంగా అవుతుంది. వ్యక్తిత్వపు సత్యం, శక్తి మరింత దేదీప్యమాన ప్రత్యేకతతో బహిర్గమౌతుంది. సమస్త అస్పష్టత, అజ్ఞానంతో, నిమ్నస్వభావపు సమస్త మాలిన్యం, మిశ్రమంతో కలిసినప్పటి కంటే దాని శీలం మరింత కొట్టొచ్చినట్లు తయారవ్వడం జరుగుతుంది. అది ఉన్నతమౌతుంది, తేజోవంతమౌతుంది, దాని సామర్థ్యం ఇనుమడిస్తుంది, సంభావ్యతలు అత్యధికంగా వాస్తవమౌతాయి. ఈ మహోన్నతి కలిగించే మార్పు జరగాలంటే యథార్థమైన స్వభావాన్ని చెల్లాచెదురు చేసే పరిమితీకరించి మసక బార్చే, యథార్థమైన వ్యక్తిత్వానికి బంధాలు వేసే హైన్యపరచే, వికృత పరచే దాన్నంతా విసర్జించేయాలి. సాధారణ మనిషి అతని అంధ, కుంటి నడకగల సాధారణ జీవితానికి సంబంధించిన అజ్ఞానమయ నిమ్న కదలికలకు సంబంధించిన దాన్నంతా అతను తన నుండి

దూరంగా వదిలివేయాలి. అన్నిటికంటే ముందు అతడు తన కోరికలను విడిచివేయాలి. ఎందుకనంటే కోరిక అనేది నిమ్న స్వభావపు అత్యంత మసకబార్చే, అత్యంత మసకబారిన చలనం. కోరిక అనేది బలహీనత అజ్ఞానాల చలనాలు, అవి నీ బలహీనతలకు, నీ అజ్ఞానానికి నిన్ను గొలుసులతో బంధిస్తాయి.

CWM 3:116-17

అత్యంత ప్రధానమైన సమర్పణ

అత్యంత ప్రధానమైన సమర్పణ నీ శరీరాన్ని నీ జీవన విధానాన్ని పరివర్తన చెందేందుకు వీలుగా సమర్పించడం. నీ స్వభావాన్నే సమర్పించకపోతే, ఈ స్వభావం యెన్నటికీ మార్పు చెందదు. ఇదిగో ఇదే చాలా ప్రధానం. నీకు అర్థం చేసుకొనే పద్ధతులు కొన్ని ఉన్నాయి. ప్రతి చర్య జరిపే పద్ధతులు కొన్ని ఉన్నాయి. అనుభూతి చెందే పద్ధతులు కొన్ని ఉన్నాయి. దాదాపు పురోగతి చెంటే పద్ధతులు కొన్ని ఉన్నాయి. అన్నింటినీ మించి జీవితం వంక చూసే ఒక ప్రత్యేక పద్ధతి, దాని నుండి ఆశించే సంఘటనలు కొన్ని ఉన్నాయి. సరే మంచిది ఇదిగో దీనిని నువ్వు సమర్పించి తీరాలి. అంటే నిజంగా నీవు దైవీ ప్రకాశాన్ని స్వీకరించి, నిన్ను నువ్వు రూపాంతరం చెందించుకోవాలనుకొంటే, నీ అస్తిత్వపు జీవన విధానాన్ని మొత్తం నీవు నివేదన చేయవలసి ఉంది. నీవెలా ఉండి తీరవలసి వుందో చూచి ఈ చలనాలన్నింటినీ మరింతగా యథార్థమైన చలనాలుగా స్వీయ సత్యానికి తగినట్లుగా పరివర్తన చెందేందుకు పనిచేసేవిధంగా నీ అస్తిత్వాన్ని ఉన్మీలనం చేసి, వీలైనంతగా గ్రహించ గలదానిగా చేసేందుకు సమర్పించడం. తాను చేసేదాన్ని సమర్పించడం కంటే ఇది అనంత ప్రధాన విషయం. అతడేం చేస్తున్నాడు అనేది కాదు (అతడు చేసేదేమిటి అనేది ప్రధాన విషయమనేది స్పష్టమే) అత్యంత ప్రధాన విషయం, కాని అతడేమిటి అనేది అత్యంత ప్రధాన విషయం. చేసే పనేదైనా కానీ, దాన్నెలా చేస్తున్నావనేది గాక, దానిని యే చేతనా స్థితిలో చేస్తున్నావనేది ప్రధానం. నీవు పని చేయవచ్చు, స్వలాభం అనే భావన లేకుండా అనాసక్తితో పనిచేయవచ్చు, పని చేయడంలోని ఆనందం కోసం పనిచేయవచ్చు, కానీ అదే సమయంలో ఈ పనిని వదిలివేయడానికి కూడా, పనిని మార్చడానికి, లేక పనిచేసే పద్ధతిని మార్చడానికి గాని సంసిద్ధంగా ఉండాలి. నీవు పనిచేసే

పద్ధతికే అంటిపెట్టుకొని ఉంటే నీ సమర్పణ సంపూర్ణం అవ్వదు. చేయవలసింది యిది, ఈ విధంగానే దీనిని చేయాలి. అందుచేత చేస్తున్నావు, నీ అంతరంగంలో చాలా స్పష్టంగా, మరింతగా అధికమైన బలమైన రీతిలో సంవేదిస్తున్నావు గనుక సమస్తమూ చేస్తున్నావని గ్రహించే చోటికి తప్పక చేరుకోవాలి. ఏదైనా అలవాటుగా గాని, రాగంతో గాని, లేక యిష్టంతో గాని, ఏ విధమైన ఊహతో గాని చేయవలసి ఉన్న ఉత్తమ కార్యం అది అనే భావనపై యిష్టంతో అది చేయకూడదు. అలా కానట్లయితే నీ సమర్పణ సమాప్తం అవ్వదు. నీవు దేనికైనా అంటిపెట్టుకొని ఉన్నంతకాలం 'ఇది మారవచ్చు, అది మారవచ్చు, కాని అది మారదు' అని దేనిని గురించైనా చెప్తున్నంత కాలం అది మారదు (అది మారడానికి తిరస్కరిస్తున్నదని కాదు, కాని నీవు దానిని మార్చాలని అనుకోకపోవడం) నీ సమర్పణ సంపూర్ణం అవ్వదు.

నీ చర్యలో, నీవు చేసే కర్మలో 'దానిని చేయమని చెప్పారు గనుక నేను చేస్తున్నాను' అని యేమాత్రం సంవేదన వున్నా, అది తప్పక చేయవలసి ఉన్నదని, దానిని చేయడాన్ని ప్రేమిస్తున్నావు అని గనుక చేయకపోతే, నీ అస్తిత్వం మొత్తం అందుకు కట్టుపడిలేదని వేరే చెప్పనవసరం లేదు. దాన్నలా చేయమని నాకు చెప్పారు గనుక చేస్తున్నాను అని యేదైనా వెనక్కు లాగినా, వెనుకగా నిలబడినా, విడిపోయి వున్నా, నీకు సమర్పణకు మధ్య ఒక గొప్ప అఖాతం ఉన్నది అని అర్థం.

సంపూర్ణ ఆంతరిక స్థితిని అంటిపెట్టుకోవడాన్ని కోరుతున్నావు. ఆ కోరిక నాకుంది అని సంవేదించడం అనేది యథార్థ సమర్పణ. దానిని తప్ప మరేం చేయలేను, చేయడానికి వచ్చిన దానిని దప్ప మరేం చేయలేను, నీకివ్వని దానిని నీవు చేయలేవు. కాని మరో క్షణంలో పని మారవచ్చు. అది మరొకటి అనేది నిర్ణయించబడినపుడు ఏ క్షణంలోనైనా అది మరొకటి గావచ్చు. అదిగో అక్కడ నమ్యత రంగ ప్రవేశం చేస్తుంది. అదెంతో భేదం కలిగిస్తుంది. పనిచేసేవాళ్లకు 'పని చెయ్యి, అది నువ్వు సమర్పణ అయ్యే మార్గం' అని చెప్తారు. కాని అదొక ఆరంభం. ఈ మార్గంలో పురోగమనాత్మకంగా ఉండాలి. అది ప్రారంభం మాత్రమే, అర్థమైందా.

CWM 4: 372-73

సమర్పణ, కృషి

సమర్పణ : వ్యక్తి గత సంకల్పం

అర్పణ కావించుకున్నపుడు మీరు ప్రయత్నాన్ని మానివెయ్యాలి అని అంటే దాని అర్థం మీరు సంకల్పిక చర్యలన్నిటినీ విడిచివెయ్యాలని కాదు, అందుకు విరుద్ధంగా మీరా సిద్ధిని భగవత్సంకల్పానికి మీ సంకల్పాన్ని జోడించటం ద్వారా త్వరితం చేసుకోవచ్చు అది కూడా మరొక రూపంలో సమర్పణే అవుతుంది.

మీ నుండి అవసరమయినది అడ్డగించే, ఉదాసీనమయిన సమర్పణకాదు. మీ సంకల్పాన్ని దైవ సంకల్పం అధీనంలో ఉంచాలి.

*

మీకొక సంకల్పం ఉంటుంది. కానీ మీరు దానిని నివేదింవచ్చు. రాత్రి సమయాలలో ఎరుక కలిగి ఉండటమనే ఉదాహరణని తీసుకోండి. మీరొక ఉదాసీన, నివేదనా వైఖరిని కలిగి ఉంటే 'దైవం సంకల్పించినప్పుడు నేను ఎరుకను పొందుతాను' అంటారు. అలా కాకుండా మీ సంకల్పాన్ని భగవంతునికి అర్పించినపుడు, మీరు సంకల్పించటం ప్రారంభిస్తారు "నేను రాత్రి సమయాల ఎరుకను పొందుతాను' అంటారు. అది జరిగి తీరాలనే సంకల్పాన్ని కలిగి ఉంటారు. మీరు సోమరిలా కూర్చుని నిరీక్షించరు. 'నేను నా సంకల్పాన్ని భగవంతుడికి యిస్తున్నాను. నేను రాత్రి సమయాల ఎరుక పొందాలని తీవ్రంగా కోరుకుంటున్నాను. నాకా జ్ఞానం లేదు. దైవ సంకల్పం దానిని నా కోసం సాధించనీ' అనే వైఖరిని తీసుకున్నపుడు సమర్పణ సంభవిస్తుంది. మీ సంకల్పం నిలకడగా కొనసాగాలి. ఒక చర్యను ఎంపిక చేసుకున్నట్లుగానో లేదా ఒక వస్తువు కోసం పట్టు పట్టినట్లు కాక మీరు సాధించాలను కొనే గమ్యంపై కేంద్రీకరించబడిన ఒక గాఢమైన ఆకాంక్షలా ఉండాలి. ఇది తొలిమెట్టు. మీరు అప్రమత్తంగా ఉంటే, మీ ధ్యాస జాగృతమై ఉంటే మీరు ఖచ్చితంగా ఏదో ఒక స్ఫూర్తి రూపంలో మీరేమి చెయ్యాలి? ఆపై చెయ్యవలసినదేమిటి? అనేది అందుకుంటారు. మీరు గుర్తుంచుకోవలసినదేమిటంటే సమర్పణ అంటే మీ చర్యల ఫలితం ఏమయినప్పటికీ అంగీకరించగలిగాలి. ఫలితం మీరు ఊహించిన దానికన్నా

ఎంతో భిన్నంగా ఉన్నప్పటికీ కూడా మరోవైపు మీ సమర్పణ ఉదాసీనమయినదయినట్లయితే, మీరేమీ చేయరు, ఏమీ ప్రయత్నించలేరు. మీరు నిద్రకుపక్రమించి ఏదైనా అద్భుతం జరుగుతుందని ఎదురు చూస్తుంటారు.

CWM 3:18-19

సమర్పణ మరియు వ్యక్తిగత ప్రయత్నం

మీరెపుడూ ప్రయత్నం చేయవచ్చు కానీ మీ ప్రయత్నానికి ఫలితాలివ్వడమా లేదా అనేది దైవ నిర్ణయం. అపుడు మీ వ్యక్తిగతమైన శక్తి తిరిగి పోతుంది. ఒక వేళ ఫలితం వస్తే అది దివ్యశక్తి చేత సాధించబడినదే గాని మీ స్వశక్తి చేత కాదు. మీరు ప్రశ్నించవచ్చు. దైవాన్ని వీటికై కోరుకోవటం సమంజసమేనా? అని. ఒక శారీరకమయిన లోపాన్ని సరిచేయమని దైవం వైపు తిరగటం ఒక నైతికమైన లోపాన్ని తొలగించమని ప్రార్థించడం కన్నా హానికరం కాదు. కానీ మీరేమి కోరుకున్నా, మీ ప్రయత్నమేదయినా, మీరు అత్యుత్తమమైన కృషి చేస్తున్నప్పటికీ, జ్ఞానాన్ని ఉపయోగిస్తున్నా, శక్తిని వినియోగిస్తున్నా. చివరికి ఫలితం దివ్య కృపపై ఆధారపడి ఉంటుంది. ఒక సారి యోగం లోనికి దిగిన తర్వాత మీరు చేసేదంతటినీ సమర్పణా భావంతో చేయాలి. మీ వైఖరి ~~ఈ~~ విధంగా ఉండాలి. నేను ఆకాంక్షిస్తున్నాను, నా అపరిపూర్ణతలను సరిదిద్దుకోవటానికి ప్రయత్నిస్తున్నాను. నాకు చేతనైనంత ఉత్సాహంగా చేస్తాను, కానీ ఫలితం కోసం నన్ను పూర్తిగా భగవంతుడి చేతిలో ఉంచుతాను.

CWM 3:97 — *శ్రీమాత*

సమర్పణ ఒక్క రోజులో జరిగిపోదు

సాధన తొలిభాగంలో తొలి భాగం అంటే నా ఉద్దేశంలో చిన్న భాగమని కాదు. ప్రయత్నం తప్పని సరి కూడా. కానీ సమర్పణ అనేది ఒక్కరోజులో జరిగిపోయేది కాదు. మనసుకు కొన్ని అభిప్రాయాలుంటాయి. వాటికది అంటిపెట్టుకొని ఉంటుంది. మానవ ప్రాణిక చేతన నివేదనను ప్రతిఘటిస్తుంది. తొలిదశలో సమర్పణ అనేది కోరికలతో కూడిన అనుమానపూరితమైన ఆత్మార్పణ, భౌతిక చేతన ఒక శిలవంటిది. అది సమర్పణ అని పిలిచేది

జడత్వాన్ని మించినదీ కాదు. కానీ ప్రారంభంలో అంతరాత్మ ఎక్కువ తెరమరుగున ఉంటుంది. అంతరాత్మ మేల్కొన్నపుడు అకస్మాత్తుగా పూర్వ వ్యక్తి నిజమైన సమర్పణను తీసుకురాగలుగుతుంది. ఎందుకంటే మిగిలిన వాటి యిబ్బందులు వేగంగా చక్కదిద్దబడి అంతరించిపోతాయి. కానీ అంత వరకూ ప్రయత్నం తప్పని సరి. లేదా దివ్యశక్తి వ్యక్తిలోకి పైనుండి వెల్లువలా దిగివచ్చి సాధనను చేతిలోకి తీసుకొని మరింతగా పని చేసి వ్యక్తిగత ప్రయత్నానికి మరింత తక్కువ అవకాశాన్ని వదులుతుంది. కానీ అప్పుడు కూడా, ప్రయత్నం కాకపోయినా మనసు, సంకల్పం, ప్రాణం, శరీరం దివ్యశక్తిచే పూర్తిగా స్వాధీనం చేసుకోబడేంత వరకూ ఆకాంక్ష జాగరూకత అవసరం. 'శ్రీమాత' అనే పుస్తకంలో ఒక అధ్యాయంలో ~~ఈ~~ విషయాన్ని ప్రస్తావించానని అనుకుంటున్నాను.

మరొక వైపు కొంత మంది సంపూర్ణ సమర్పణకై ఒక స్వచ్ఛమైన క్రియాశీలమైన సంకల్పాన్ని కలిగి ఉంటారు. వారు అంతరాత్మ చేతనలో లేదా ఉద్దీపింపబడిన మనో సంకల్పంతో ఒకసారి నివేదనను సాధన సూత్రంగా అంగీకరించి, దాని గురించి ఏమాత్రం అర్థరహితంగా భాదించకుండా వ్యక్తిలోని యితర భాగాలు కూడా తన మార్గాన్ని అనుసరించాలని ఒత్తిడి చేస్తుంది. ఇక్కడ ప్రయత్నం యింకా ఉంటుంది. కానీ చాలా సంసిద్ధంగా, అనాయాసంగా, ఉన్నత శక్తి ఉనికిని తన వెనుక కలిగి ఉండి, సాధకునికి తాను ప్రయత్నం చేస్తున్నాననే భావనను కలిగించదు. ఇందుకు విరుద్ధంగా మానసిక లేదా ప్రాణిక చేతన తన స్వీయ సంకల్పాన్ని నిలిపి ఉంచుకోవాలంటే మీ స్వతంత్రమయిన కదలికలను కోల్పోవటానికి నిరసన, ముందున్న ఉపకరణానికి వెనుక లేదా పైన ఉన్న కుడ్యం ఛేదింపబడేవరకు పోరాటం ప్రయత్నం అవసరమవుతాయి. మార్పు లేకుండా అందరికీ ఒకే న్యాయాన్ని ఆపాదించటం సాధ్యం కాదు. మానవ ప్రకృతిలో విభిన్నతలు ఒకే సూటి అయిన న్యాయం క్రింద ఉంచటానికి అలవిగానంతగా చాలా విస్తృతమై ఉంటాయి.

CWSA 29:82-84

సమర్పణ : తపస్సు

'సమర్పణమయే విధానమే ఒక తపస్సు వంటిది.' అది మాత్రమేకాక నిజానికి ఒక ద్వంద్వ విధానమయిన తపస్సు ప్రవృద్ధమయ్యే సమర్పణం. ఆ నివేదన చాలా చక్కగా ప్రారంభమయినప్పటికీ కూడా చాలా కాలం వరకు కొనసాగుతాయి. కానీ ఒకానొక సమయం వస్తుంది. ఎప్పుడయితే వ్యక్తి దైవ సాన్నిధ్యాన్ని, శక్తినీ నిరంతరం అనుభూతి చెంది ఆ శక్తి అన్నిటినీ చేస్తుందని తెలుసుకొంటాడో, దాని వలన చాలా అధ్వాన్నమయిన యిబ్బందులు కూడా ఏ మాత్రం అలజడిని కలిగించవు. వ్యక్తిగతమయిన యత్నం ఆపై అవసరం ఉండదు. మరి సాధ్యం కూడా కాదు. భగవంతుని హస్తాలలోకి ప్రకృతి పూర్తిగా సమర్పించబడినదనటానికి అదే నిదర్శనం. కొంతమంది అనుభవం పొందక ముందే విశ్వాసంతో ఈ స్థితిని పొందుతారు. భక్తి, విశ్వాసాలు దృఢంగా ఉన్నంత వరకూ ఆ అనుభవం వారిని తీసుకువెడుతుంది. కానీ అందరూ ప్రారంభం నుండి ఈ స్థితిని పొందలేరు. కొందరికది ప్రమాదకరం కావచ్చు. ఎందుకంటే వారు దైవమని భావించి తమను తాము దుష్ట శక్తుల చేతిలో పడవేసుకుంటారు. చాలామందికి తపస్సు నుండి సమర్పణలోకి ఎదగవలసిన అవసరం ఉంటుంది.

CWSA 29:82

స్తబ్దతకది నెపం కాదు

నమ్మకము, దైవంపై ఆధారపడటము సమర్పణ. ఆత్మ నివేదన అనేవి అవసరము, తప్పని సరి. కానీ దైవంపై ఆధారపడటం అనేది సోమరితనానికి, బలహీనతకి, నిమ్న ప్రకృతి స్పందనలకు లొంగిపోవటానికి సాకు కాకూడదు. అది అలసిపోని ఆకాంక్షతో, దివ్య సత్య మార్గంలో నిలిచేదానంతటినీ పట్టు విడువకుండా తిరస్కరించాలి. దైవానికి సమర్పణ కావడమనేది వ్యక్తి స్వీయకామనలకు, నిమ్నమైన పనులకు, అహానికి లొంగిపోవటానికొక అవకాశం. ఒక ముసుగు, లేదా దైవం యొక్క మాయా రూపం ధరించే అజ్ఞానం, అంధకార శక్తులకు లోబడి పోవటానికి ఒక నెపం కాకూడదు.

CWSA 29:87

సమర్పణ ప్రక్రియ

నిజమైన సమర్పణ కష్టమైన అంశం

ఉదాహరణకు నీ జీవితాన్ని దైవానికి అర్పించుకోవాలని నువ్వు నిర్ణయించుకున్నావు. కానీ హఠాత్తుగా కొంత అనాహ్లాదమైనది, అనూహ్యమైనది నీకు జరిగింది, అప్పుడు ప్రతిస్పందించడం, నిరసించడమే నీ మొదటి ప్రతిక్రియ. అయినా కూడ నీవర్పించుకొని ఇలా అంటావు" నా జీవితం దైవానికి చెందినది," అప్పుడు హఠాత్తుగా అత్యంత చెడు సంఘటన జరిగింది (అలా జరుగుతుంది) అప్పుడు నీలో వున్నది, దానిని కోరుకోనిది కొంత ప్రతిచర్య జరుపుతుంది. కానీ ఇక్కడ నిజంగా నువ్వు నీ సమర్పణను తార్కికం చేయాలంటే ఈ అనాహ్లాద సంఘటనను ముందుకు తెచ్చి దానిని భగవంతునికి అర్పణ చేస్తూ పూర్తి నిజాయితీతో ఇలా అంటావు "నీ సంకల్పమే జరగాలి. ఆ విధంగా నువ్వు నిర్ణయించి వుంటే, అది అలాగే జరుగుతుంది." ఇది ఒక ఇచ్ఛాపూర్వకంగా అయత్నపూర్వకంగా పరస్పరం అంటిపెట్టుకొనేదిగా వుండాలి, కనుక ఇది చాలా కష్టం.

అత్యంత చిన్న విషయంలో కూడ నువ్వు ఊహించినది, పనిచేసినది కాకుండా దాని బదులు ఒక వ్యతిరేక ప్రతిచర్య వచ్చినపుడు యథేచ్ఛగా, అనివార్యంగా "లేదు, అది కాదు" అని ఆక్షేపిస్తావు - ఒకవేళ నువ్వు పూర్తి సమర్పణ చేసినట్లైతే అది అలా వుండదు : మిగిలిన విషయాల్లోలాగే దీనిలో అదే శాంతి,నిశ్శబ్దం, నిశ్చలతతో వుంటావు. ఒకవేళ ఇది ఒక నిర్దిష్ట విధానంలో జరిగివుంటే బాగుండునేమో అన్న భావము నీకు వుండవచ్చు, కాని అది భిన్నంగా జరిగినా ఇది కూడ యుక్తమైనదేనని కనుగొంటావు. ఉదాహరణకు ఒకానొక పని చేయడానికి దాని వల్ల ఏదో జరుగుతుందని నువ్వు ఎంతో కష్టపడి వుండవచ్చు, చాలా సమయాన్ని, నీ శక్తిని, నీ సంకల్పాన్ని, నీ స్వంతం కొరకు కాకుండా దానికొరకు, దైవకార్యం కొరకు వినియోగిస్తే (అది సమర్పణ). ఈ కష్టమంతా పడినతర్వాత, ఈ మొత్తం కార్యం చేశాక, అన్ని ప్రయత్నాలు చేశాక, అదంతా ఇంకొకదారి పడితే అది విజయవంతం కాదు.

నువ్వు నిజంగా సమర్పించుకున్నట్లైతే ఇలా అంటావు, "ఇది మంచిదే, ఇదంతా మంచిదే, ఇదంతా సరైనది. నేను చేయగలిగినంతా చేశాను, ఎంత

బాగా చేయగలనో అంతగా చేశాను, ఇప్పుడు ఇది నా నిర్ణయం కాదు, ఇది భగవంతుని నిర్ణయం, ఆయన ఏది నిర్ణయిస్తే దానిని పూర్తిగా అంగీకరిస్తాను." ఇంకోవైపు నీలో ఈ గాఢమైన తక్షణ సమర్పణ లేకపోతే, నీకు నువ్వు ఇలా చెప్పుకుంటావు" ఇది ఎలా జరిగింది? ఒక స్వార్థప్రయోజనం కోసం కాకుండా దైవకార్యం చేయడానికి నేను ఇంత కష్టపడ్డాను, ఫలితం ఇలా వుంది, ఇది విజయవంతం కాలేదు" వందలో తొంభైతొమ్మిది సార్లు ఇలా వుంటుంది. నిజమైన సమర్పణ చాలా కష్టమైనది.

CWM 5:53

మూడు దశలు

వాస్తవానికి ఒక ప్రత్యేక వ్యక్తిత్వాన్ని సృష్టించుకోవడం మొదటి విజయం. తర్వాత ఈ వ్యక్తిత్వాన్ని దైవానికి ఇచ్చుకోవడం రెండవ విజయం. దైవం నీ వ్యక్తిత్వాన్ని దివ్య అస్తిత్వంలోకి మార్చడం మూడవ విజయం.

ఇక్కడ మూడు దశలు వున్నాయి. మొదటిది ప్రత్యేక వ్యక్తి కావడం, రెండవది వ్యక్తిత్వాన్ని సమర్పించుకోవడం, అలా వ్యక్తి పూర్తిగా దైవానికి సమర్పించుకుని ఆయనతో ఏకతను పొందుతాడు. మూడవది ఆ వ్యక్తిని దైవం పూర్తిగా తన స్వాధీనంలోకి తీసుకుని తన స్వీయ ప్రతిబింబంలోని ఒక అస్తిత్వంగా మారుస్తాడు, అంటే అతను కూడ దివ్యం అవుతాడు.

సాధారణంగా అన్ని యోగాలు రెండవదశలో ఆగిపోతాయి. సాధకుడు తన వ్యక్తిత్వాన్ని సమర్పించుకోవడంలో విజయవంతమయ్యి, తానంటు లేకుండా తననుతాను దైవానికి ఇచ్చుకుని, ఆయనతో ఏకతను పొందినపుడు తన కార్యం ముగిసినట్లుగా, అంతా సఫలమైనట్లుగా పరిగణిస్తాడు.

కానీ మనం ఇక్కడ ప్రారంభమవుతాం, ఇలా అంటాం, "కాదు, ఇది కేవలం ఒక ప్రారంభం మాత్రమే. మన వ్యక్తిత్వంలో ప్రవేశించి దానిని ఒక దివ్యప్రపంచంలో పనిచేసే ఒక దివ్య వ్యక్తిత్వంగా చేయటానికిగాను ఏకమయ్యే ఈ దైవం మాకు కావాలి" ఇదే మనం పిలుచుకునే రూపాంతరీకరణ. కానీ ఇంకొకటి తప్పనిసరిగా కొనసాగాలి, అలా కొనసాగకపోతే మూడవది చేయలేం. సాధకుడు మొదటి దశ నుండి మూడవదశకు వెళ్ళలేడు. రెండవదాని గుండా కొనసాగవలసిందే.

CWM 7:402-03

మానసిక భావనల సమర్పణ

ఈ విషయంలో మీరు ఇలా అన్నారు. 'నువ్వు దైవం వద్దకు వచ్చినపుడు, నీ సమస్త మానసిక భావనలను వదిలిపెట్టాలి; కానీ అది చేయడానికి బదులు నీ భావనలను దైవం మీద వేసి నిన్ను సమ్మతించమని ఆయన్ను కోరుతావు."

అవును, అందరూ అలాగే అలా చేస్తారు. ఒకవేళ నీవు అర్థం చేసుకున్నట్లుగా దైవం లేకపోతే అది దైవం కాదు. నీవు కోరినది ఆయన నెరవేర్చకపోయినా, నీవు అనుకున్న విధంగా ఆయన పని చేయకపోయినా, నీవు ఆపాదించిన విశేషగుణం లేకపోయినా అది దైవం కాదు; "సరిగ్గా నేను కోరుకున్న విధంగా చేస్తేనే నిన్ను దైవంగా గుర్తిస్తాను!" సహజంగా మనుష్యులు దానిని ఒప్పుకోవడానికి తగినంత నిజాయితీతో వుండరు, కానీ అదంతే. దానికి మిల్లియన్ల ఉదాహరణలు ఇవ్వగలను-వందలు కాదు మిల్లియన్లు. అచేతనంగా ఇది చేయకుండా వుండేవారు మీలో ఒక్కరు కూడా వుండరు. ఇది ఒక నియమం; ఒకరు ఇలా అంటారు; "అవును, నేను సమర్పించుకోవడానికి, ఆయన సంకల్పం నెరవేర్చడానికి, ఆయన ఉనికిని, చర్యను అంగీకరించడానికి సిద్ధంగా వున్నాను, కానీ ఒక షరతుతో- ఇది ఇలా వుండాలి, లేదా అలా వుండాలి, ఆయన ఇలా ఆలోచిస్తాడు, ఇలా అనుకుంటాడు, ఇలా పనిచేస్తాడు.."

CWM 5:158 - శ్రీమాత

ప్రాణిక సమర్పణ

ప్రతిక్రియను గురించిన నీ వివరణ వలన అక్కడ ప్రాణిక కోరిక వుందని చెప్పాను. స్వచ్ఛమైన అంతరాత్మలో, ఆధ్యాత్మిక స్వీయ-సమర్పణలో ఇటువంటి ప్రతిక్రియలు, నిరాశ లేదా విచారములుండవు. "దైవాన్ని అన్వేషిస్తూ నేను ఏమి పొందాను?" అనటం వుండదు. నువ్వు ఇక్కడ వివరించినట్లుగా కోపము, తిరుగుబాటు, అభిమానము, దూరం వెళ్ళాలనే కోరిక ఇవేవీ వుండవు. ఒక సమగ్రవిశ్వాసము, అన్ని స్థితులలో దైవానికి అంటుకునివుండే స్థిరమైన పట్టుదల వుంటాయి. మీకు ఇది వుండాలనే నేను కోరుకున్నాను; వ్యక్తి సమస్యల నుండి, ప్రతిస్పందనల నుండి స్వేచ్ఛగా వుంటూ, స్థిరంగా పురోగమిస్తున్నాడనడానికి ఇది ఒకటే ఆధారం.

*

వ్యక్తి తన మానసిక, ప్రాణిక సంకల్పాన్ని దైవంపై విధించకుండా, దైవ సంకల్పాన్ని అందుకుని, దానినే అనుసరిస్తూ వుండటం సాధన నిజమైన దృక్పథం. “ఇది నా హక్కు, కోరిక, అవసరం, కాంక్షితం, నేనెందుకు పొందలేకున్నాను?,” అనకుండా తననుతాను ఇచ్చుకోవడం, సమర్పించుకోవడం, దైవం ఏది ఇస్తే దానిని సంతోషంగా అందుకోవడం, దుఃఖించకుండా, ఎదురు తిరుగకుండా వుండటం యుక్తమైనది.

చాలామంది సాధకులకు ఒకే రకమైన ఆలోచనలు వస్తాయి (ప్రతికూలత, కృతజ్ఞత లేకపోవడం సంబంధించి)- లేదా ఏదో ఒకసారి అయినా అనిపిస్తుంది. వారు దైవాన్ని కోరని, లేదా దైవాన్ని దివ్య ప్రయోజనం కొరకు కాకుండా తమ స్వంత ప్రయోజనం కొరకు కోరుకునే ప్రాణిక అహంతో వస్తారు. దీనిని మార్చడానికి ఒత్తిడి చేస్తే, లేక దాని కోరికలు తృప్తిచెందకపోతే అది కోపం తెచ్చుకుంటుంది- ఈ విషయాలన్నింటికీ మూలం అదే. అందువల్లనే ఈ యోగంలో సమర్పణను నొక్కి చెబుతాం- ఎందుకంటే కేవలం (ప్రత్యేకంగా ప్రాణిక అహం) సమర్పణ చేత మాత్రమే అవి మాయమవుతాయి- వేరే ఏ ఇతర కారణం కొరకు కాకుండా , తన స్వంత విధానంలో లేక స్వంత షరతులతో కాకుండా దివ్య విధానంలో దైవం కొరకు దైవాన్ని సమ్మతించడం.

CWSA 29:75 - *శ్రీఅరవిందులు*

సమర్పణ, అంతరాత్మ

చైత్యపురుషకు సమర్పించుకోవడం కాకుండా దైవానికి సమర్పించు కోవడం కోరదగినది. వ్యక్తి దైవాన్ని విశ్వాసం గుండా చేరవచ్చు : సమగ్రమైన అనుభవం సాధన ఫలితంగా లభిస్తుంది. చైతన్యాన్ని దాని కోసం సిద్ధం చేయడానికి ఏమీ చేయకుండా ఒక ప్రత్యక్ష అనుభవాన్ని ఎవరూ కోరలేరు. వ్యక్తి పిలుపును అనుభూతి చెందితే దానిని అనుసరిస్తాడు- అక్కడ పిలుపు లేకపోతే అప్పుడు దైవాన్ని అన్వేషించే అవసరం అక్కడ ఉండదు. ప్రారంభానికి విశ్వాసం సరిపోతుంది- వ్యక్తి అన్వేషించడానికి ముందే మొదట అర్థం చేసుకుని, తర్వాత సాక్షాత్కరించుకోవాలన్నది ఒక మానసిక తప్పిదం, ఒకవేళ అది నిజమైతే సాధన మొత్తం అసంభవమే అవుతుంది- సాధనకు ఫలితంగా సాక్షాత్కారం వస్తుంది కానీ, దానికి పీఠికగా కాదు.

*

ఈ మొత్తం క్లిష్టత అవసరం లేదు. అంతరాత్మ ప్రకటితమైతే, అది నిన్ను తనకు సమర్పించుకోమని అడుగదు, శ్రీమాతకు సమర్పించుకో మంటుంది.

CWSA 29:77-78 — *- శ్రీఅరవిందులు*

దైవంతో బేరసారాలు

నేను ఇంతకుముందే ఎక్కడో శరణాగతి గురించి త్యాగం గురించి చెప్పినట్టుగా, ఎవరైనా ఇంకా అలా చేసినందుకు ఏ కొంచమైనా చింతిస్తూ ఉన్నట్లయితే వారు ఆధ్యాత్మిక చైతన్యస్థితిలో లేనట్లే. ఇక మీదట తమ కోరికలు తీర్చుకోలేమనే బాధ ఉన్నట్లయితే, దాని అర్థం వారి కోరికలు వారు ఆకాంక్షించే విషయంకంటే ఎక్కువ కాకపోయినా సమానమైన ప్రాముఖ్యత కలిగి ఉన్నట్లే కదా! మీరు అనవచ్చు "కోరికల పట్ల నేను ఎరుకతో ఉన్నాను, నేను దైవాన్ని పొందడం కోసం నా కోరికలు త్యజించి నట్లైతే, ఆయన నాకు దక్కుతాడు అన్న నమ్మకం ఏమిటి? అందువల్లనే నేను దీనిని త్యాగం అని పిలుస్తున్నాను". కానీ నేను దానిని ఒక బేరం అని పిలుస్తాను , దైవంతో నీవు బేరమాడుతున్నావు.దైవంతో నీవు ఏమంటావంటే "మనం ఇచ్చి పుచ్చుకుందాం, నేను నా కోరికలు తీర్చుకోవడం వలన కలిగే సంతోషాన్ని నీకు ఇచ్చేస్తాను, నీవు దానికి బదులుగా నాలో నీ అనుభూతి వలన కలిగే ఆనందాన్ని ఇవ్వాలి, అలా కాకపోతే అది న్యాయం అనిపించుకోదు" అని - ఇది సమర్పణ కాదు, ఇది బేరమాడటం.

ఇది ఎన్ని సార్లు విన్నానో లెక్కలేదు

"నేను ఎన్నో త్యాగాలు చేశాను, ఎంతో సాధన చేశాను, ఎంతో ఇబ్బందులు ఎదుర్కొన్నాను, కానీ ఇప్పుడు చూడు నా దగ్గర ఏమీలేదు" అని అటువంటి వారికి నేనిచ్చే సమాధానం ఒక్కటే, "అందులో ఆశ్చర్యం ఏముంది!" అని.

CWM 5:349-50 — *- శ్రీమాత*

శరణాగతికి నిజమైన ప్రతిబంధకం

స్వీయ శరణాగతికి నిజమైన ప్రతిబంధకం, అది విశ్వాత్మకో లేక విశ్వాతీతమైన దానికోకావచ్చు, ఒక వ్యక్తి తన పరిమితులను తాను ప్రేమించడమే. అది సహజమైన ప్రేమే, ఎందుకంటే వ్యక్తి ఏర్పడినప్పుడే పరిమితులపైన ఏకాగ్రతచెందే తత్వం ఉన్నది. అలా లేకపోతే గనక, తాను వేరుగా ఉన్నాను అన్న భావన కలగదు-అంతా కలగాపులగం అవుతుంది, సాధారణంగా ఇది మానసిక, ప్రాణిక కదలికలలో జరగుతూ ఉంటుంది. ఒక వ్యక్తి తాను వేరు అనే భావనను నిలిపిఉంచేది అతని శరీరమే, ఎందుకంటే అది అంత కలగలిసిపోయేది కాదు. ఒకసారి ఈ వేర్పాటు భావన ఏర్పడినాక, అది ఎక్కడ కోల్పోవలసి వస్తుందో అన్న భయం ఏర్పడుతుంది. అది ఆరోగ్యకరమైనదే అయినప్పటికీ దైవానికి సంబంధించినంతవరకు అది ఉండరాదు. ఎందుకంటే, దైవంలో నీ వ్యక్తి భావన కోల్పోవడం జరగదు కేవలం నీలో ఉన్న అహంకారం వదిలిపెట్టి నిజమైన వ్యక్తిగా మారతావు. అది ఒక దివ్య వ్యక్తిత్వం, భౌతిక చేతనవలె తాత్కాలికం కానిది. మనం భౌతిక చేతననే మన అస్తిత్వంగా భావిస్తూ ఉంటాం. ఒక్క దివ్యస్పర్శతోనే నీకు అర్థమైపోతుంది అందులో ఏది కోల్పోవడం అనేది లేదు అని. దానికి విరుద్ధంగా, నీవు ఒక శాశ్వత వ్యక్తిత్వం పొందుతావు, అది శరీరం కొన్ని వందలమార్లు మరణించినాసరే జీవించే ఉంటుంది, ప్రాణిక-మానసిక చేతనలో వచ్చే పరిణామంలో వచ్చే ఆటుపోట్లను అది తట్టుకొని ఉండగలదు. ఇటువంటి రూపాంతరీకరణ కలిగించే దివ్యస్పర్శ లేనట్లైతే, ఇంకా ఎప్పటికీ భయంలోనే బ్రతకాలి. ఆ దివ్యస్పర్శ తో నీవు నీ వ్యక్తిత్వాన్ని కోల్పోకుండా నీ భౌతికసత్తానికూడా నీకు అనుగుణంగా మార్చుకోగలిగే స్థితిలో ఉంటావు.

CWM 3: 168-69

శరీర శరణాగతి

ఒక వేళ నీ శరీరం లో ఏదైనా ఒక చోట నెప్పి అనిపించినపుడు, నీవు కుంచించుకుపోవడం లేదా ఆ నెప్పిని నిరాకరించడం అనేది సహజంగా కలిగే ప్రతిస్పందన - అయితే అది ఇంకా ఆ నెప్పిని ఎక్కువ చేస్తుంది, కాబట్టి అది అధమమైనది. కాబట్టి మొట్టమొదటగా మన శరీరానికి నిశ్చలంగా ఉండడం నేర్పాలి, ఎటువంటి ప్రతిక్రియ లేకుండా ఉండటం, అంతకు మించి

కుంచించుకు పోవడం కానీ, నెప్పిని ఏమాత్రం కూడా నిరాకరించడం కానీ - సంపూర్ణ నిశ్చలత్వం - ఇదే దేహం స్థితప్రజ్ఞత. సంపూర్ణ నిశ్చలత తరువాత వచ్చేది ఆంతరికమైన ఆకాంక్ష, శరణాగతి, అంతటినీ పరమాత్ముని ఇచ్ఛగా తలచి స్వచ్ఛందమైన సంపూర్ణమైన అంగీకారంతో ఉండడం. అయితే ఆ దైవేచ్ఛ అనేది విషయాలను ఎలా తీసుకుపోవాలని అనుకుంటుంది ఇటు వైపుకా అటు వైపుకా, కొన్ని అంశాలను విచ్ఛిన్నం చేయడం మరికొన్నిటిని..? అందులో మళ్ళీ అనంతమైన అనేక అంశాలు ఉన్నాయి, అంటే రెండు ఎత్తుల మధ్యలోనుండి ఒక మార్గం ఉంటుంది (నేను కణంలోని సాక్షాత్కారాల గురించి మాట్లాడుతున్నానని మరిచి పోవద్దు). దాని అర్థం ఏమిటంటే ఒక విధమైన ఆంతరిక నిశ్చలత మనకు ఉండాలి, ఒక అంతర్గత కదలికలో ఒక ప్రశాంతతత, అలాగే జీవితంలో కూడా. ఒక కదలిక నుండి ఇంకొక ఉన్నతమైన కదలికలోకి మారాలంటే మధ్యలో కిందకు వచ్చి మళ్ళీ పైకి వెళ్లాల్సి ఉంటుంది - అది మార్పు అంటే. అప్పుడు నీవు తినే దెబ్బ ఎటువంటిదంటే నిన్ను కిందకు తోసి మళ్ళీ పైకి లేపుతుంది లేదా కిందకుతోసి నీ పాత పద్ధతుల్ని వదిలించుకోమంటుంది - ఇది కణాలలో ఉన్నస్థితిని తొలగించి కొత్త స్థితిలోకి మార్చవలిసి వచ్చినప్పుడు జరిగే ప్రక్రియ. మరికొన్ని కదలికలు ఉన్నత స్థితికి ఎగసి ఉన్నత సమన్వయం నిర్మాణం కలిగి ఉంటాయి. ఇది రెండో విషయం. అటుపై మనం వేచిచూడాల్సి ఉంటుంది, ఇది ఇలా జరగాలి అని ముందుగా అనుకోకుండా. అన్నిటికంటే పైన ఒక ఇచ్ఛ - హాయిగా ఉండాలనే ఇచ్ఛ, ప్రశాంతంగా ఉండాలి అనే ఇచ్ఛ అలాంటిదంతా - సంపూర్ణంగా ఆగిపోవాలి, అదృశ్యం కావాలి. ఏ ప్రతిక్రియ అనేది లేకుండా ఉండాలి (అరచేతులు తెరచి ఉంచి ఒక నిశ్చల సమర్పణ ని సూచించే ఒక సంజ్ఞ చేశారు). ఎపుడైతే మనం అలా ఉండగలుగుతామో (అంటే కణాలు), కొంత సమయం తరువాత ఈ కదలికలు ఎటువంటి తరగతికి చెందినవి అనే విషయం అర్థం అవుతుంది, అప్పుడు అది తొలగింపవలసినదా లేదా దాని స్థానంలో ఇంకొకటి రావాలా లేదా ఉన్నది రూపాంతరం చెందాలా అనేది మనకు ముందే తెలియదు.

CWM 11: 13-14

సంపూర్ణ శరణాగతికి చెందిన చిహ్నాలు

మధుర మాతా! ఒక సాధకుడు శరణాగతి చెందడానికి నిర్ణయించుకుంటే అతని జీవితం లో దాని ప్రభావం ఉంది అని గుర్తించడానికి ఏదైనా సూచనలు కనిపిస్తుంటాయా?

శ్రీ అరవిందుల జవాబు : ఆ గుర్తు ఏంటంటే అతనిలో సంపూర్ణ విధేయత ఉంటుంది, అందులో ఏ ప్రశ్న కానీ, ఎదురు తిరగడం కానీ, ఇది కావాలని పట్టుపట్టడం కానీ, షరతులు కానీ లేకుండా అన్నీ దివ్య ప్రభావాలకు సమాధానమిస్తూ అలాగే దైవం వద్ద నుండి రాని ప్రభావాలను నిరాకరించడం. ఇది కాదా నిజమైన శరణాగతి అంటే?

నువ్వు ఏమంటున్నావో నాకు అర్థం కాలేదు, అతను తన శరణాగతి సంపూర్ణమైనది అని తెలియడానికి ఏదైనా గుర్తు ఉందేమో అడుగుతున్నాడు. ఇక్కడ శరణాగతి అనేది సక్రియమా లేక నిష్క్రియమా అనేది ప్రశ్న కాదు. అతను ఏమంటున్నాడు అంటే శరణాగతి చెందాలన్న సంకల్పం కొన్ని ఫలితాలు ఇస్తోంది అని. ప్రధమ ఫలితం ప్రశ్నించకుండా విధేయత కలిగి ఉండటం, రెండవది దివ్యప్రభావానికి తప్ప మరి ఇంకా ఏ ఇతర ప్రభావాలనైనా నిరాకరించడం. ఇవే గొప్ప ఫలితాలు. ఇవి ఎప్పుడైతే నీవు పొందావో, అప్పటికే నీవు యోగంలో చాలా ముందుకు వెళ్ళి ఉన్నావు అని అర్థం.

CWM 6:129

నిజమే, ~~ఈ~~ ఉన్నత ప్రాణికం అనేది సమర్పణ చేయడం అంత కష్టమేమీ కాదు. ఎందుకంటే అది మనసు ప్రభావానికి లోనై ఉంటుంది, అప్పుడప్పుడు అది చైత్య పురుషుని ప్రభావంలో కూడా ఉంటుంది, అందుచేత అది సులభంగా అర్థం చేసుకుంటుంది. దానిని మార్చుకోవడం చాలా సులభం, కోరికల ఉద్వేగాలతో నిండిన నిమ్న ప్రాణికంతో పోలిస్తే. అతను అంటున్న దానికి అర్థం ఏమిటి అంటే నిమ్నప్రాణికం సమర్పణ చేయగలదు, విధేయంగా ఉండడానికి అంగీకరించగలదు, అడిగినది చేయడానికి సిద్ధంగా ఉండగలదు కానీ అది ఎప్పుడు అసంతృప్తి గానే ఉంటుంది. అది ఎప్పుడు సంతోషంగా ఉండలేదు. కొన్ని సార్లు అది బాధకు లోనవుతుంది. తనలోని తిరగబడే తత్వానికి విధేయమైతే అది కలిసి పనిచేయలేదు. ప్రాణికం ఆనందంతోను

నిజమైన ప్రేమతోనూ కలిసి పనిచేయక పోతే, ఇంకేమీ జరగదు. పరివర్తన సాధ్యం కాదు.

CWM :6:204

తామసిక శరణాగతి

"తామసిక శరణాగతి అనేది అందుకు సంబంధించిన షరతులకు అంగీకరించదు - అంటే అది షరతులు అంగీకరించనప్పుడు అది శరణాగతి అనిపించుకోదు - అంతే కదా ?

ఖచ్చితంగా అంతే, ఇంకా చాలామంది తాము శరణాగతి చెందామని అనుకుంటూ ఇలా చెప్పడం జరుగుతుంది "నేనేది చేయడం లేదు, నేను నన్ను దైవానికి సమర్పించుకున్నాను, కాబట్టి దైవం నాకు అన్నీ చేయాలి" దీనిని వాళ్ళు శరణాగతి అనుకుంటున్నారు, నిజం చెప్పాలంటే అది వారి బద్ధకానికి, తమోగుణానికి సంబంధించినది, వారు ఏ ప్రయత్నమూ చేయాలి అనుకోరు, అంతేకాకుండా దైవమే అన్నీ తమ కోసం చేయాలి అనుకుంటారు, ఎందుకంటే అది వారికి సౌకర్యంగా ఉంటుంది.

CWM 6:221

సంపూర్ణ శరణాగతి అనే స్థితి

నిజానికి, ఎవరైనా సంపూర్ణ శరణాగతి అనే స్థితిలో ఉండి సర్వం సమర్పించుకుంటే, అనుగ్రహానికి కృపకు తనను తాను సమర్పించుకుంటే అలాగే ఆ కృప తనను ఏమిచేసినా సరే దానికి సిద్ధపడి ఉంటే, అది చాలా మంచి విషయం. కానీ అటు తరువాత ఆ కృప ఏమిచేసినా సరే ప్రశ్నించ కూడదు. అప్పుడు ఇలా అనకూడదు " ఇలా జరుగుతుంది అని ఆశించి ఇలా చేశాను అని", ఎందుకంటే ఒక వేళ ఏదైనా నిజంగా ఆశించిఉంటే దానిని గురించి స్పష్టంగా, నిజాయితీగా చెప్పుకోవాలి. అటుపైన అది అనుగ్రహం మీద ఆధారపడి ఉంటుంది. అది నెరవేర్చాలా వద్దా అనేది ఏదైనా సరే తమకు కావాల్సిన విషయం లో స్పష్టత ఉండాలి. అందులో ఎటువంటి హాని లేదు.

తాము ఆశించింది దొరకనప్పుడు తిరుగుబాటు ధోరణి వస్తుంది, అది మంచిది కాదు. అది సహజంగానే మంచిది కాదు. ఇలాంటి సందర్భంలో

మన కోరిక లేక ఆకాంక్ష అంతా గొప్పది కాదు అని అర్థం చేసుకోవాలి లేదు మనకు ఖచ్చితంగా మంచిదికానీ విషయం ఏదో అడిగిఉంటామని అర్థం చేసుకోవాలి. ఆటువంటి సమయంలో విజ్ఞతతో "నీ సంకల్పానుసారమే జరుగుగాక"అని అనుకోవాలి. ఆంతరికమైన అవగాహనతో కూడిన ఆంతరికమైన ఆకాంక్ష ఉన్నంత వరకు దానిని స్పష్టంగా చెప్పడంలో ఆడగడంలో ఎటువంటి హాని లేదు. అది చాలా సహజమైన కదలిక. ఉదాహరణకు, ఒక మూర్ఖత్వంలో ఉంటూ ఉన్నప్పుడు లేదా ఏదో ఒక పొరపాటు చేసినప్పుడు, అటుపైన అటువంటి పని ఎప్పుడు చేయకూడదని భావించినప్పుడు అలా కోరుకోవడంలో తప్పు లేదు. నిజానికి ఒక నిజమైన ఆంతరిక నిజాయితీ తో అడిగినప్పుడు, అటువంటి కోరిక నెరవేరేలా అనుగ్రహించబడుతుంది.

దైవం నిన్ను అలా అడిగినందుకు నిన్ను వ్యతిరేకిస్తున్నాడు అనుకోరాదు. ఆయనకి ఇలాంటివి చేయాలన్న ఆసక్తి లేదు. ఆయన నీకు ఏది మంచిదో నీకంటే బాగా తెలిసినవాడు. అయినప్పటికీ మరీ అత్యవసరం అయితేనే గాని నీ కోరికను కాదనడు. అలాంటి సందర్భంలో తప్ప మిగిలిన సమయంలో ఆయన నీవడిగింది ఇవ్వడానికి ఎప్పుడు సంసిద్ధంగానే ఉన్నాడు.

CWM 8: 254-55

నేను ఏకాగ్రత వహించలేనపుడు లేక ధ్యానించలేనపుడు మదర్ ఒడిలో శాశ్వతంగా తలదాచుకొంటున్నాను, ఆమె పంపినపుడే బయటకు వెళ్తున్నాను.

ఇది సాధ్యమైన అత్యుత్తమ యేకాగ్రత.

- శ్రీ అరవిందులు

CWM 32:147

బాధ్యత శరణాగతి

నిజంగా చెప్పాలంటే, సమస్యలను పరిష్కరించే, మార్గదర్శనం చేసే సూత్ర ఆధారాలు లేని, తాళం చెవి అంటూ లేని ఒక ఉనికికి బాధ్యత వహించడం కంటే దయనీయమైన పరిస్థితి మరొకటి లేదు. జంతువు ఎటువంటి సమస్యలను సృష్టించుకోదు, అది సహజంగా జీవిస్తుంది. దాని ప్రవృత్తి దానిని నడిపిస్తుంది. అది ఒక సహజమైన జ్ఞానంతో దానికంటే ఉన్నతమైన సామూహిక చేతనపై ఆధారపడుతుంది, కానీ అది సహజం, అయత్న సిద్ధంగా ఉంటుంది, దానికోసం ఏదో సంకల్పించి ప్రయత్నం చేయాల్సిన అవసరం లేదు, ఇది చాలా సహజమైనది, దాని జీవితానికి అది బాధ్యత వహించదు కాబట్టి, అది చింతించదు. మనిషితోనే తనపై తాను ఆధారపడాలనే భావం పుడుతుంది, అతనికి అవసరమైన జ్ఞానం లేనందున ఈ నిరంతర హింస ఉంటుంది. తాను అప్పగించుకోగలిగే తన చేతన కంటే ఉన్నతమైన చేతనకు పూర్తిగా లొంగిపోవడంతో మాత్రమే ఈ హింస అంతం అవుతుంది. అతని చింతలను ఆ చేతనకు అప్పగించి, అతని జీవితానికి మార్గనిర్దేశం చేయడం మాని ప్రతిదీ నిర్వహించడంతో పాటు తన చింతలను, తన జీవితాన్ని నడిపే జాగ్రత్తలను దానికే వదిలివేయాలి.

అవసరమైన జ్ఞానం లేనప్పుడు సమస్య ఎలా పరిష్కరించబడుతుంది? దురదృష్టవశాత్తు మనిషి తన జీవితంలోని అన్ని సమస్యలను పరిష్కరించుకోగలడని నమ్ముతాడు. నిజంగా దానికి అవసరమైన జ్ఞానం అతనిలో లేదు. అదే అతని కష్టాలన్నిటికీ మూలం - నిత్యంపుట్టే ప్రశ్న "నేనేం చేయాలి?.." దీని తర్వాత మరొకటి మరింత తీవ్రమైనది, "ఏమి జరగబోతున్నది?" అదే సమయంలో, సరైన సమాధానం ఇవ్వలేని అసమర్థత. అందుకే ఆధ్యాత్మిక యోగ సాంప్రదాయాలు, బాధ్యతలను అన్నింటిని సమర్పిస్తూ సర్వోన్నత నియమంపై ఆధారపడటం అనే ఆవశ్యకతతో ప్రారంభమవుతాయి. లేకపోతే శాంతి అసాధ్యం.

CWM 9:304-05 — శ్రీ మాత

అంతర్గత శరణాగతి

నీ సమర్పణ బట్టి నీ సాధనపై ఒక చిన్న ఆశ ఉంటుందని సూచించడం నా ఉద్దేశ్యం కాదు. నేనెప్పుడూ ఖచ్చితంగా దీనికి విరుద్ధంగా చెబుతుంటాను,

నీ ఆత్మ నిజంగా దైవాన్ని కోరుకుంటుంది కాబట్టి, అతనిని చేరుకుంటావు. నీకు నీవు లేకుండా పోతే తప్ప - అందుకే ఈ నిరుత్సాహానికి, అది కలిగించే బాధల గురించి నేను తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాను. ఎందుకంటే అవి నిన్ను ఆ దిశగా నడిపించడానికి ప్రయత్నిస్తాయి - తద్వారా నీవు నిరాశ చెందవచ్చు లేదా భవిష్యత్తుకి వాయిదా వేయవచ్చు.

దైవాన్ని కోరుకున్న వారిని గురించి : యోగం గురించి నీ పూర్వ ఆలోచన గురించి నీవు చేసిన ప్రకటనకు సమాధానంగా నేను అది వ్రాసాను. భగవంతుడు స్వయంగా హృదయాన్ని శుద్ధి చేసి, సాధనకు సిద్ధం చేస్తాడు, అవసరమైన అనుభవాలు కలిగేలా చేస్తాడు. భగవంతునిపై విశ్వాసం, శరణాగతి అనే సంకల్పం ఉంటే అది ఆ విధంగా జరుగుతుందని నేను చెప్పాలను కున్నాను. అలా ఆ పద్ధతిలో ఎవరికి వారు తమ స్వంత ప్రయత్నాలను మాత్రమే విశ్వసించకుండా తమని తాము ఆ పరమాత్మునికి సమర్పించు కోవాలి. ఇది ఒక వ్యక్తి ఉంచిన భరోసాను, విశ్వాసాన్ని, ఒక ప్రగతిశీల స్వీయ-సమర్పణను సూచిస్తుంది. నిజానికి నేనే అనుసరించిన సాధన పద్ధతి ఇది. నేను ఊహించిన విధంగా ఇది యోగం లోని ప్రధాన భాగం. రామకృష్ణులు తమను పిల్లిపిల్ల రీతిలో భావించుకొన్నట్లు నేను అనుకుంటాను. అయితే అందరూ ఒకేసారి దీనిని పాటించలేరు, వారు దీనిని అలవర్చుకోవడానికి సమయం పడుతుంది. మనస్సు, ప్రాణికం నిశ్శబ్దంగా ఉన్నప్పుడు అది వృద్ధి చెందుతుంది.

శరణాగతి అంటే నా ఉద్దేశ్యం ఏమిటంటే ఈ ప్రాణిక, మనస్సుల అంతర్గత శరణాగతి. బాహ్యాంతర శరణాగతి కూడా ఉంది, సాధన ఉద్దేశ్యానికి విరుద్ధంగా వున్నవన్నీ వదులుకోవాలి, సమర్పణ, దైవిక ఉద్దేశ్యానికి మార్గదర్శకత్వానికి విధేయత. ప్రత్యక్షంగా, లేదా తాను ఆ స్థాయికి చేరుకొని ఉంటే లేదా అంతరాత్మ గురువు మార్గదర్శకత్వం ద్వారా, సమర్పణ ప్రాయోపవేశానికి శరణాగతితో ఎటువంటి సంబంధం లేదని నేను చెప్పగలను. ఇది తపస్సులానే కఠినంగా ఉంటుంది. నా అభిప్రాయం ప్రకారం చాలా మితిమీరిన వర్గానికి చెందినది, చాలా ప్రమాదకరమైనది. కానీ నేను నా లేఖలో మాట్లాడుతున్నది అంతర్గత శరణాగతి.

ఈ అంతర్గత శరణాగతికి ప్రధాన మూలం దైవంపై పూర్తి నమ్మకం, విశ్వాసం. ఒక వ్యక్తి ఈ వైఖరిని అవలంభిస్తాడు. "నాకు దైవం కావాలి మరేమీ వద్దు" . దాన్ని వదులుకోవాలని ఎందుకు అనుకొంటున్నావో నాకు తెలియదు - ఆ వైఖరే లేకపోతే, యోగమే లేదు.

"నా ఆత్మ దానిని కోరుకుంటుంది కాబట్టి నేను నన్ను పూర్తిగా అతనికి సమర్పించాలనుకుంటున్నాను, అలా కాకపోవచ్చు కానీ నేను అతనిని కలుసుకుని అతనిని సాక్షాత్కారింపజేసుకోవాలి. నన్ను అతని వద్దకు తీసుకు రావడానికి అతని కార్యం నాలో జరగాలి తప్ప ఆ దైవాన్ని నేను ఇంకేమీ అడగను. అతని చర్య రహస్యమయినా బహిరంగమైనా, దాగివున్నా లేదా అభివ్యక్తమయినా. నేను నా స్వంత సమయం, మార్గం గురించి పట్టుబట్టను. అతని సమయం, అతని మార్గంలో ప్రతిదీ చేయనివ్వండి, నేను అతనిని నమ్ముతాను, అతని ఇష్టాన్ని అంగీకరిస్తాను, అతని ప్రకాశం, సన్నిధి, ఆనందాలను స్థిరంగా కోరుకుంటాను. అన్ని కష్టాలను, ఆటంకాలను ఎదుర్కొంటూ అతనిపై ఆధారపడాలి తప్ప లక్ష్యాన్ని వదులుకోకూడదు. నా మనస్సు నిశ్శబ్దంగా ఉండి, అతని వైపు మరలి అతని ప్రకాశాన్ని ప్రసరింపచేయగలగాలి. నా ప్రాణికం నిశ్శబ్దంగా ఉండి, అతని వైపు మరలి అతని ప్రశాంతత ఆనందాన్ని నాపై కురిపించాలి. అన్నీ అతని కోసం, నేను అతని కోసం. ఏది జరిగినా, నేను ఈ ఆకాంక్షను స్వీయ సమర్పణను కొనసాగిస్తాను, అది నెరవేరుతుందనే నమ్మకంతో కొనసాగుతాను. ప్రతి ఒక్కరూ ఆ దృక్పథంతో ఎదగాలి; ఎందుకంటే, ఖచ్చితంగా, అది ఒక్కసారిగా పరిపూర్ణంగా చేయబడదు; మానసిక, ప్రాణిక కదలికలు అంతటా తలెత్తుతాయి. కానీ ఒక వ్యక్తి ఈ సంకల్పం కలిగి ఉంటే, అది వ్యక్తిలో ఇంకా పెరుగుతుంది. మిగిలినది దానినది అభివ్యక్తీకరించుకొనే మార్గదర్శనం పట్ల మనం చూపే విధేయత ద్వారా పెరుగుతుంది. మానసిక చర్యలు జోక్యం చేసుకోవడానికి అనుమతించకూడదు.

ఇదొక్కటే మార్గమని, లేకపోతే సాధన కుదరదని చెప్పడం నా ఉద్దేశం కాదు. దైవాన్ని చేరుకోవడానికి ఇంకా చాలా మార్గాలున్నాయి. కానీ నాకు తెలిసిన ఈ పద్ధతి ద్వారానే స్వభావం సన్నద్ధమయ్యి ముందు దైవంచేత

సాధన చేపట్టబడటమన్నది ఒకే వివేకవంతమైన వాస్తవం. ఇతర పద్ధతులలో దైవకార్యాచరణ, సహాయం ఎప్పటికప్పుడు అనుభవంలోకి వస్తాయి. కానీ అన్నీ సిద్ధమయ్యే వరకు అది చాలావరకు తెర వెనుకనే ఉంటుంది. కొన్ని సాధనలలో దైవ కార్యం గుర్తించబడదు, అంతా తపస్సు ద్వారానే జరగాలి. చాలా వరకు రెండింటి కలయిక ఉంది, తపస్సు చివరకు ప్రత్యక్ష సమయాన్ని, జోక్యాన్ని ఆహ్వానిస్తుంది. దైవ భావన, దివ్యానుభవం, యోగల కోసం చేసేదంతా ఇలా సమస్తం మన శరణాగతి మీద ఆధారపడి ఉంటుంది.


కానీ ఏ మార్గాన్ని అనుసరించినా, చేయవలసినది ఒక్కటే, విశ్వాస పాత్రంగా ఉండి చివరి వరకు వెళ్లడం. నీవు చాలా తరచుగా ఆ నిర్ణయం తీసుకుంటావు. నీవు తీసుకున్న నిర్ణయంపైనే నిలిచిఉండి నీ అంతరాత్మలో ఆకాంక్షను ప్రాణికహోరు గాలి ఆర్పకుండా చూచుకోవాలి.

CWSA 29:69-70

సంపూర్ణ శరణాగతి

అంత తక్కువ సమయంలో సంపూర్ణ శరణాగతి సాధ్యం కాదు. సంపూర్ణ శరణాగతి అంటే వ్యక్తి ప్రతి భాగంలో అహంకారపు ముడిని కత్తిరించి, ఆ భాగానికి స్వేచ్ఛనిచ్చి సంపూర్ణంగా దైవానికి సమర్పించడం. మనస్సు, ప్రాణికం, భౌతిక చేతన (ప్రతి భాగం లోని అన్ని కదలికలు) ఒకదాని తర్వాత ఒకటి విడివిడిగా, వాటి స్వంత మార్గాన్ని విడిచిపెట్టి దైవ మార్గాన్ని అంగీకరించడానికి సిద్ధపడాలి. కానీ ప్రతి ఒక్కరు మొదటి నుండి చేయగల్గేది ప్రధాన సంకల్పంగా స్వీయ-అర్పణను పాటించడం. దాన్ని అమలు చేయగలగడం కోసం, ప్రతి దశలో, స్వీయ-సమర్పణ సంపూర్ణం చేయడానికి అంది వచ్చే ప్రతి సందర్భాన్ని సద్వినియోగం చేసుకోవడం. ఒక దిశలో శరణాగతి తక్కిన వాటిని సరళంగాను, మరింత అనివార్యమైనవిగాను చేస్తుంది; దానికది ఇతర చిక్కుముడుల్ని కత్తిరించడమో లేదా వదులు చేయడమో చేయదు, ముఖ్యంగా ప్రస్తుత వ్యక్తిత్వంతో బాగా సంబంధం పెట్టుకొన్నవి. అది బాగా ఇష్టపడిన రూపాలు తరచుగా పెద్ద ఇబ్బందులను కల్గించవచ్చు. కేంద్రియ సంకల్పం స్థిరమైన తరువాత కూడా వ్యావహారిక ప్రప్రథమ ఆమోదముద్ర పడిన తరువాత సైతం జరగవచ్చు.

CWSA 29:72-73 — *-శ్రీ అరవిందులు*



నీ ఆకాంక్ష, భక్తి, శరణాగతుల తోడ్పాటుతో శ్రీమాత
శక్తి పనిచేయడం ద్వారా సమస్తం జరగాలి.

- *శ్రీఅరవిందులు*

మదర్‌కు సమర్పణ

యథార్థ వైఖరి

తన కోరికలకు ఆమె ప్రతిస్పందనను, ఆమె తనకేమిచ్చితీరాలో దానిని అంచనా వేసే దురవగాహనతో ప్రాణికం దివ్యమాత దరిచేరాలని భౌతిక మనస్సు, ప్రాణికాలు అనుకొన్నంత కాలం, సందేహాలు, కలతలు, గందరగోళాలు ఎప్పుడూ ఉంటూనే ఉంటాయి. తన ఆలోచనలు లేదా ప్రాణిక సంకల్పాలకై దైవాన్ని బలవంత పెట్టడం కాదు, దైవ సంకల్పాన్ని స్వీకరించడం, దానిని అనుసరించడం, సాధనలో నిజమైన వైఖరి. "ఇది నా హక్కు, నా ఇచ్ఛ, నా అవసరం, నేను దానిని ఎందుకు పొందలేను?" అని అనకుండా తనను తాను దైవానికి సమర్పించు కొని, దైవం ఇచ్చిన దానిని సంతోషంగా స్వీకరించడం, అంతేకానీ, దుఃఖించడం, తిరుగుబాటు చేయడం సరైన మార్గం కాదు. మనం ఏదైతే దైవం నుండి పొందు తామో, అదే మనకు సరైనది

CSWA 32: 46

గీత శరణాగతి

గీత పూర్తిగా ఈశ్వర తత్వంపై ఆధారపడిన వేదాంత సాంప్రదాయాన్ని అనుసరిస్తుంది. అది దివ్యమాత గురించి చాలా తక్కువగా ప్రస్తావిస్తుంది. దాని లక్ష్యం ప్రపంచ ప్రకృతి నుండి వెనుకకు మళ్ళి, దానిని దాటి పరాత్పర సాక్షాత్కారాన్ని పొందడం. తాంత్రిక సాంప్రదాయం శక్తి లేదా ఈశ్వరి తత్త్వంపై ఆధారపడి ఉంటుంది. అది సమస్తాన్ని దివ్యమాతపై ఆధారపడేలా చేస్తుంది. ఎందుకంటే దాని లక్ష్యం ప్రపంచ స్వభావాన్ని స్వాధీనం చేసుకొని దానిపై ఆధిపత్యం పొంది, దాని ద్వారా పరాత్పర సాక్షాత్కారాన్ని పొందడం, కానీ ఈ యోగం రెండు పార్శ్వాలను నొక్కి చెపుతోంది. దివ్యమాతకు శరణాగతి అవడం చాలా అవసరం, శరణాగతి లేకుండా యోగ లక్ష్యం నెరవేరదు.

పురుషోత్తముని విషయానికొస్తే, దివ్యమాత సర్వోన్నతమైన దివ్య చైతన్యం, పైన ఉన్న ప్రపంచాలకు మహాశక్తి, ఆద్యశక్తి. దివ్యమాత తనలో పరమాత్మను మోస్తూ ఉంటుంది. క్షర, అక్షర పార్శ్వాలుగా, లోకాలలో దైవాన్ని వ్యక్తపరుస్తుంది. అక్షర విషయానికొస్తే, దివ్యమాత తనలో నిశ్చల పురుషుడిని నిలుపుకొని, ఆది పరాశక్తిగా ఆయనలో తనకు తానుగా నిశ్చలంగా ఉంటుంది. క్షరంకి

సంబంధించి దివ్యమాత సృష్టికి వెనుక ఆధారభూతంగా ఉంటుంది. సచలంగా అన్ని జీవులు, శక్తులను అభివ్యక్త పరిచే విశ్వశక్తిగా ఉంటుంది.

CWSA 32:56

అవైయక్తికం దివ్యమాత

నీవు ఒక లేఖలో ఇలా వ్రాసావు "ఏ పద్ధతిలోనైనా శరణాగతి చెందడం మంచిది, అవైయక్తికానికి శరణాగతి చెందడం సరిపోదు. ఎందుకంటే శరణాగతి ఫలితంగా బాహ్యవ్యక్తిలో రూపాంతరం చెందకుండా, అతడు అంతర్గత అనుభవానికి పరిమితం కావచ్చు, అది నాకర్థం కాలేదు.

ఇంత సరళమైన, సుపరిచితమైన వాంగ్మూలాన్ని అర్థం చేసుకోలేక పోవడం చాలా ఆశ్చర్యంగా ఉంది, ఎందుకంటే ఈ యోగానికి అసలు కారణం ఏమంటే, అవైయక్తికాన్ని అనుసరించడం అనేది, అంతర్గత అనుభవాన్ని లేదా ముక్తిని మాత్రమే ఇస్తుంది. సమగ్రమైన దైవ క్రియా కలాపం లేకుండా స్వభావంలో పూర్తి మార్పు ఉండదు. అవైయక్తికత ద్వారా లభించే సాక్షాత్కారం మాత్రమే సరిపోతే, నేను కానీ, శ్రీమాత కానీ ఇక్కడ ఉండవసరం లేదు.

CWSA 32:87

సాధన ప్రధాన ఆలంబన

ఆకాంక్ష, తిరస్కరణ, శ్రీమాతను స్మరించడం, శ్రీమాత చైతన్యంలో ఐక్యం అవడం సాధనకు ప్రధాన ఆలంబన, అనేది పూర్తిగా నిజం. తన స్వంత మార్గాల ద్వారా తనకు తానుగా అతిమానసాన్ని సాధించాలను కోవడం మూర్ఖత్వం అనేది కూడా నిజం. నేను మొదటి నుండి చెప్తున్నాను, ఇటీవల దానిని మరింత ఎక్కువగా నొక్కి చెప్పాను. భగవంతునితో ఐక్యత అనేది ముఖ్య లక్ష్యం, మిగిలినవన్నీ దానికి అనుబంధమైనవి, దాని పర్యవసానంగా వచ్చేవే అనేది నిజం. ఎటువంటి స్వీయ అభివృద్ధి, అనుభవాలులాంటి వాటిని వారి స్వార్థం కోసం లేదా అహం కోసం కోరక పోవడం సాధకుని ఉపయుక్త వైఖరి. సాధకుడు అహంభావిగా, స్వలాభాపేక్ష కలిగి ఉండి, స్పష్టమైన అవగాహన లేని వాడైతే, ధ్యానం, దర్శనం, యోగం ద్వారా లభించేవన్నీ కూడా దుర్వినియోగం అవుతాయి. కానీ ధ్యానం, దర్శనం మొదలైన వాటి వలన ఉపయోగం లేదని, సాధనలో వాటిని తొలగించాలని దీని అర్థంకాదు.

ఒకసారి మీరు శ్రీమాతను స్మరించిన తర్వాత, మీరు చేసే ప్రతీదీ దైవం నుండి వస్తుంది కనుక మీరు ఏమి చేసినా పర్వాలేదు, అనే సిద్ధాంతం చాలా ప్రమాదకరమైనది. ప్రకృతి నుండి బయటకు వెళ్ళవలసిన అనేక విషయాల తిరస్కరణకు బదులుగా అనుమతి ఇవ్వడం ద్వారా ఇది ముగిసిపోతుంది.

స్వేచ్ఛగా బాహ్య జీవితాన్ని గడిపే విషయానికొస్తే అది ప్రతిదశలో ప్రతి ఒక్కరికీ మంచిదని చెప్పలేము. పరిమితులు లేని స్వేచ్ఛాయుతమైన బాహ్య సామాజిక జీవితం వలన నష్టం ఏమంటే, వ్యక్తి పూర్తిగా బాహ్యంగా మారతాడు, అన్ని రకాల ప్రాణిక ఆదాన, ప్రదానాలకి గురవుతాడు, అది దైవం వైపు అతని అంతర్గత ఎదుగుదలకు, సంపూర్ణ సమర్పణకు ఆటంకం అవుతుంది. పూర్తిగా అంతరంగంలోకి ఉపసంహరించుకోవడం వలన కల్గే నష్టం ఆ వ్యక్తి ఏక పక్షి అయ్యి తనలోనే తాను బంధించుకొని, భూమితో ఉండే ఒక పటిష్టమైన సంబంధం కోల్పోతాడు. ఫలితంగా అది ఆత్మవంచన, రుగ్మతల్లో పడవేస్తుంది. మధ్యేమార్గంగా అంతర్గతంగా జీవిస్తూ బయటి విషయాలను పూర్తిగా వదిలివేయకుండా, అటువంటి వాటిని నూతన చైతన్యంతో చూడటం ఓ క్రొత్త దృక్పథంతో, అంతర చైతన్యంతో పనిచేయడం అనేది సరైన మార్గం. అయితే ఈ చైతన్యం మారే దశలో బాగంగా, బయటి విషయాలను (పరిచయాలను) రద్దు చేయకుండా, కొన్ని దశల్లో వాటిని తగ్గించుకోవాల్సిన అవసరం ఉంది. ఈ విషయంలో ఎటువంటి ఖచ్చితమైన నియమం విధించబడదు.

CWSA 32:138

ప్రయత్నం కావాలి

సాధకుడి నుండి ఆకాంక్ష నిరాకరణ, శరణాగతితో కూడిన ప్రయత్నాన్ని నికచ్చిగా కోరడం జరుగుతుంది. ఈ మూడు నెరవేర్చుతుంటే శ్రీమాత అనుగ్రహంతో, ఆమె శక్తి నీలో పని చేయడంతో తక్కినదంతా దానంతటదే వచ్చేస్తుంది. ఈ మూడింటిలో ప్రధానమైనది శరణాగతి. ఆ శరణాగతికి చెంది మొదటి ఆవశ్యక రూపం నమ్మకం, కష్టకాలంలో దృఢవిశ్వాసం, ఓర్పులన్నవి ఉన్నాయి. ఆకాంక్ష ఒక్కటి ఉంటే భరోసా, విశ్వాసాలు రెండూ ఉండి తీరుతాయని నియమేమిలేదు. దానికి భిన్నంగా స్వాభావిక జడత్వంచేత కలిగే ఒత్తిడి వలన ఆకాంక్ష అనేది ఉండకపోవచ్చు కానీ, విశ్వాసం, భరోసా,

సహనాలు ఉండవచ్చు. సాధకుని ఆకాంక్ష స్తబ్దంగా ఉన్నప్పుడు భరోసా, సహనాలు విఫలమైతే అతడు తన స్వంత ప్రయత్నాన్ని నమ్ముకొంటున్నాడని అర్థం. "అయ్యో!" నా ఆకాంక్ష విఫలమైంది, అంటే ఇక నాకంటూ ఆశ లేదు, నా ఆకాంక్ష విఫమైతే శ్రీమాత ఏం చేయగలదు? ఈ విధంగా అన్న మాట. దీనికి భిన్నంగా సాధకుడు "పర్వాలేదు, నా ఆకాంక్ష మళ్ళీ పుష్టిస్తుంది" అని భావించడం మొదలు పెట్టాలి. ఈలోపల శ్రీమాత నాతోనే ఉన్నదని, ఆమెను భావన చేయకపోయినా; అంధకారమయమయిన గడ్డుకాలం నుండైనా నన్ను ఉద్ధరించగలదని నాకు తెలుసు" అని భావించాలి. అలాంటి సంపూర్ణమైన, సరైన ధోరణిని కల్గిఉండాలి, అలాంటి ధోరణిలో ఉన్న వారికి కుంగుబాటు ఏమీ చేయలేదు. ఒకవేళ అది తటస్థించినా తికమకపడి అక్కడ నుండి వెళ్ళిపోతుంది. అది తామసిక శరణాగతి కాదు. తామసిక శరణాగతితో ఉన్న మనిషి ఏమంటాడంటే "నేనేమీ చెయ్యను బాబూ! మదరే అంతా చేసిపెడుతుంది, ఈ ఆకాంక్ష, నిరాకరణ, శరణాగతులు కూడా అవసరం లేదు, సర్వం ఆమెను నాలో చెయ్యనియ్యండి." ఈ రెండు ధోరణులకీ ఎంతో వ్యత్యాసం ఉంది. దీనిలో ఒకటి అస్సలేమి పనిచేయకుండా ముడుచుపోయే మనిషి ధోరణి. ఇక రెండవది తన శక్తివంచన లేకుండా ఉత్తమంగా పనిచేసే ధోరణి. కాని అతడు కొంతకాలం పాటు నిష్క్రియుడై తనను తాను తగ్గించి వేసుకున్నా, ఎదుట పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నా, సదా తన పూర్తి విశ్వాసాన్ని అన్నింటికంటే మించి శ్రీమాత శక్తి, సన్నిధియందు నిల్పుతాడు. ఆ దృఢనమ్మకంతోనే వ్యతిరేకశక్తిని తికమక పెట్టి సాధన కార్యాన్ని పునరుద్ధరించుకుంటాడు.

CWSA 32:140

ప్రగతి శీలమైన శరణాగతి

నీ శరణాగతిని నిరోధించి శ్రీమాతకు తెరుచుకొని ఉండటంలో ఆధ్యాత్మిక సార్థకత ఏమీలేదు. ఈ యోగాన్ని అభ్యసించే వారి నుండి ఆత్మసమర్పణ లేదా శరణాగతిని నికచ్చిగా కోరడముంటుంది. ఎందుకంటే వ్యక్తిలో అలాంటి ప్రగతిశీలమైన శరణాగతి భావన లేకపోతే లక్ష్యానికి చేరువ కావడం అది ఎక్కడైనా సరే పూర్తిగా అసాధ్యమే అవుతుంది. శ్రీమాతకు ఉన్మీలనంకావట (తెరుచుకోవడం) మంటే ఆమెశక్తి నీలో పనిచేయడానికి ఆవాహనం చేయడం, నీవు గనుక దానికి శరణాగతుడవు కాకపోతే అది

అసలేమాత్రం నీలోకి వచ్చి పని చేయడానికి అనుమతించదు లేదా నీవు కోరినంతమేరకే పనిచేస్తుంది. అంతే తప్ప దాని స్వంత పద్ధతిలో, దివ్యసత్యానికి చెందిన రీతిలో పనిచేయదు. ఈరకమైన సలహా సాధారణంగా ప్రాణికం లేదా మనస్సులోని ఒకనొక అహంకారికమైన మూలకం లేక ఒక వ్యతిరేకశక్తి ఇస్తుంది. అది అనుగ్రహాన్ని లేదా దివ్యశక్తిని, దానికనుగుణంగా, దాని స్వంత ఉద్దేశ్యానికి అనుగుణంగా ఉపయోగ పెట్టుకోవాలని చేస్తుంది. అంతేకాని దివ్య ఉద్దేశ్యానికి అనుగుణంగా జీవించేందుకు మాత్రం కాదు, దైవం నుండీ తాను పొందగల్గినంతా పొందాలని చూస్తుంది. కాని తనను తాను దైవానికి ఇచ్చుకోదు. దీనికి భిన్నంగా అంతరాత్మ నిజపురుష మాత్రం దైవం వైపుకు మళ్ళుతుంది. ఆవైపు సుముఖంగా ఉండటమేకాదు, దైవానికి శరణు గావడానికి, హర్షిస్తుంది. సంతోషపడుతుంది.

ఈ యోగంలో మనిషి ప్రతి మానసిక ఆదర్శపరమైన సంస్కృతిని దాటి వెళ్ళవలసి వస్తుంది. ఆలోచనలు, ఆదర్శాలన్నవి మనస్సుకు చెందినవి, అవి అర్థసత్యాలు మాత్రమే; మనస్సు కూడా ఒక ఆదర్శంతోనే సంతృప్తి పడి, దానిని ఆదర్శవంతం చేసుకొంటూ ఉంటుంది. దానికి మించి అక్కడేమి ఉండదు. ఇక ఆ జీవితం ఎలా ఉన్నదో అలాగే ఉండిపోతుంది. అది రూపాంతరం చెందదు లేదా మార్పు చెందినా అది చాలా స్వల్పం మాత్రమే. ఆధ్యాత్మిక సాధకుడు ఒక ఆదర్శవంతమైన వాడుగా ఉండటం కోసం ఆధ్యాత్మిక సిద్ధిని సాధించడంలో ప్రక్కకు మళ్ళడు; ఆదర్శవంతం అవ్వడం కాదు. దివ్య సత్యాన్ని సాక్షాత్కరింపజేసుకోవడమే ఎప్పటికీ అతడి ధ్యేయం, అది జీవితానికి ఆవలది కాని లేక జీవితంలోనే అయినా కానీ, తర్వాత వ్యవహారంలో మనస్సును, శరీరాన్ని రూపాంతరీకరించడం ఆవశ్యకం కాని అది శ్రీమాతకు, దివ్యశక్తి కార్యగతికి శరణాగతమవ్వ కుండా అది జరుగదు.

అవ్యక్త సత్యాన్ని అన్వేషించే మార్గం జీవితం నుండి విరమించుకొని వెళ్ళాలనుకొనే వారిది. సాధారణంగా వాళ్ళు శరణాగతి విధానంతోనో లేదా ఉన్నత శక్తికి వారిని వారు తెరుచుకోవడంతోనో కాక, వారి స్వప్రయత్నంతో, ప్రయత్నిస్తారు; అయితే అవ్యక్తంగా మార్గదర్శన సహాయాలు చేసే విధంగా ఉండదు. కాని సాధించబడాల్సింది ఉంటుంది. అది ప్రతి మనిషిని తన విధానంలో, తన స్వభావానికున్న సామర్థ్యంతో ప్రాప్తింపచేసుకోవడానికే వదిలి వేస్తుంది!

కాని మరో విధంగా శ్రీమాతకు శరణాగతుడై ఆమెకు ఉన్నీలనం కావడం ద్వారా ఆ అవ్యక్త సత్యాన్నే కాక ఇంకా దానికున్న ఇతర పార్శ్వాలను కూడా సిద్ధంప చేసుకోగల్గుతాడు సాధకుడు.

శరణాగతి ప్రగతి శీలంగా ఉండటమే ఆవశ్యకం. ఏ మనిషీ ఆరంభం నుండే సంపూర్ణ శరణాగతితో ఉండడు. కాబట్టి అతడు తనలోకి తాను చూచుకొంటే, ఆ భావమన్నదే లేదని కనుగొంటాడు, అది సహజం. శరణాగతి సూత్రం స్వీకరించబడి, అది ఒక దశ నుండీ ఇంకొక దశకు, ఒక క్షేత్ర పరిధి నుండి, ఇంకొకక్షేత్ర పరిధికి, స్వభావంలోని ఒకదాని తరువాత ఒకటిగా అన్ని భాగాల్లోకి అనువర్తింపబడదు అన్నదానికి కారణం లేదు.

CWSA 32:141

శరణాగతిని నిక్కమైనదిగా, సంపూర్ణమైనదిగా చెయ్యి

నీ సాధనలో నీవు ఎదగాలంటే నీవు మాట్లాడుతున్న నీ సమర్పణ, శరణాగతి నిజంగా యథార్థమైనదిగా, సంపూర్ణమైనదిగా ఉండాలి. నీ ఆధ్యాత్మిక ఆకాంక్షకు నీ ఇతర కోరికల్ని కలుపుతూ ఉన్నంతకాలం ఇది జరుగదు. నీ కుటుంబం, సంతానం లేదా ఇంకేదయినా, ఇంకెవరయినా వాటితో నీకున్న ప్రాణిక సంబంధాలను పెంచి, పోషించికొంటున్నంత కాలం అది జరుగదు. ఈ యోగాన్ని ఆచరించాలంటే నీవు ఒకే ఒక్క కోరిక, ఆకాంక్ష కల్గిఉండాలి. అది ఆధ్యాత్మిక సత్యాన్ని అందిపుచ్చుకోవడం, దానిని నీ ఆలోచనల్లో, భావాల్లో, చర్యల్లో, స్వభావంలో ప్రకటించడమే అవ్వాలి. నీవెవరితోనూ, ఎవరి బంధుత్వాలకోసం ఆరాట పడకూడదు. సాధకునికి ఇతరులతో అనుబంధాలన్నవి అతడెప్పుడు నిజమైన చేతనతో, ప్రకాశంతో జీవిస్తాడో అప్పుడే తన ఆంతర్యంలోనే సృష్టించబడతాయి. దివ్యకార్యం, దివ్య జీవనం నిమిత్తం అతి మానస సత్యానికి అనుగుణంగా దివ్యమాత సంకల్పం, శక్తి చేత అవి అతడిలో నిర్ణయించబడతాయి; అవి అతడి మానసిక, ప్రాణిక ఇచ్ఛకు అనుగుణంగా నిర్ణయించబడవు, నీవు గుర్తుంచుకోవలసిన విషయం ఇది.

నీ చైత్యపురుషకు తనను తామ శ్రీమాతకు ఇచ్చివేసుకొని, సత్యంలోనే జీవించగల్గే, ఎదగగల్గే సామర్థ్యం ఉంది; కాని నీలోని నిమ్న ప్రాణికం బంధాలతోనూ, సంస్కారాలతోనూ, వాంఛా సంబంధమైన అపవిత్ర పోకడతో

నిండి ఉంటుంది. నీ బాహ్య భౌతిక మనస్సు దాని అజ్ఞానపూరిత అలవాట్లను, తలంపుల్ని కదిలించి వేయలేనిదై ఉండి, సత్యానికి తాను ఇక తెరుచుకోదు. నీవు అభివృద్ధి చెందలేకపోతున్నావంటే దానికి కారణం అదే, ఎందుకంటే అలా ప్రగతి గతిలో పోనియ్యకుండా ఉంచే మూలకాన్ని, కదలికల్ని నీవు కొనసాగిస్తూనే ఉన్నావు. ఇక అవి వేరే వాటిని అనుమతించవు; ఎందుకంటే దివ్య జీవనంలో ఏది స్థాపించబడాలో దానికి అవి పూర్తిగా విరుద్ధమైనవి. శ్రీ మాత మాత్రమే వీటన్నింటి నుండీ నిన్ను స్వతంత్రుణ్ణి చేయగలదు. దానిని నీవు నిజంగా కోరుకొంటే నీ అంతరాత్మలోనే కాదు, నీ భౌతిక మనస్సు, నీ ప్రాణిక స్వభావమంతటిలోనూ ఉండాలి. దానికి గుర్తు ఏమిటంటే- నీ వ్యక్తిగత అభిప్రాయాలు, అనుబంధాలు లేదా కోరికల్ని అంటి పెట్టు కోవడం లేదా వాటిని గురించి ఒత్తిడి తేవడం ఇక చేయవు. నీవెక్కడున్నా అది ఎంతదూరమైనా శ్రీమాత నీతోనే ఉన్నట్లు, నీలో పని చేస్తున్నట్లు నీవు ఆమె శక్తికి, సన్నిధికి తెరుచుకొన్నట్లు అనుభూతి చెందుతావు. దానితో నీవు సంతుష్టుడవై నిశ్చలంగా, విశ్వాసయుక్తంగా, మరేమికోరకుండా శ్రీమాత సంకల్పానికై నిరీక్షిస్తూ ఉంటావు.

CWSA 32: 142

ఇదీ సమర్పణ

సమర్పణ అనేది లేకపోతే మొత్తం వ్యక్తి అస్తిత్వానికి రూపాంతరీకరణే లేదు.

*

ఎలాంటి పద్ధతిలోనైనా సమర్పణ మంచిది, అవైయక్తికం అన్నది ఇక్కడ చాలదు. ఎందుకంటే అవైయక్తికానికి శరణాగతి చెందడం చాలా పరిమిత ఫలితంతో బాహ్యస్వభావం రూపాంతరం చెందక ఆంతరిక అనుభవానికే పరిమితమౌతుంది.

ఒక వ్యక్తికంటే దైవం ద్వారానే సాధన చేయబడుతుంది అన్నది కూడా ఒక సత్యం. కాని అది అదిగా సిద్ధింపబడేవరకు చేతనను ప్రభావితం చేయదు. ఈ విషయంలో మనుషులు ఒకచోట నిలిచిపోతున్నారు అంటే ఈ భావనను ఒప్పుకొంటున్నారు కానీ దీనిని నిజీకరించుకోవడం లేదు. కాబట్టి వారి దగ్గర

తపోశక్తి లేదు, దైవానుగ్రహమూ లేదు. మరోవైపు దీనిని సిద్ధింపజేసుకొన్నవారు తమ తపస్సులోనూ, దానికి వెనుక దివ్యానుగ్రహం పనిచేయడం సంవేదిస్తారు.

*

నిజాయితీతో, పూర్తి ఆత్మసమర్పణతో శరణాగతుడవవ్వు. ఇక నీవు పూర్తి వేగంతో చాలా త్వరగా ముందుకు పోగలవు. కాని దీనిని లెక్కగట్టుకొంటూ, గుణించుకుంటూ చేయకు. అలా చేస్తే అది అన్నింటిని పాడుచేస్తుంది.

దైవానికి అనంత మాతృమూర్తికే ఆత్మ సమర్పణం కావాలి. అది ఎంత కష్టమైనా అదే మన ఏకమాత్ర ప్రభావోత్పాదక సాధనం, మనకు శరణ్యం. ఆమెకు ఆత్మ సమర్పణ అంటే దానర్థం మన స్వభావం ఆమె చేతుల్లో ఒక ఉపకరణంగా ఉండటం, ఈ అంతరాత్మ శ్రీమాత కరకమలాల్లో ఒక పసిపాప కావడం.

CWSA 12:171

ఎవరు ఏమీ దాచుకోకుండా, ఎలాంటి ఆలోచన, స్వచింతన లేకుండా వారి అన్ని అంశాలను సమర్పించి వేసుకొంటారో వారికి దైవం తనను ఇచ్చి వేసుకొంటుంది. వారికే నిశ్చలత, ప్రకాశం, శక్తి, ఆనందం, స్వేచ్ఛ, విశాలత, జ్ఞానోన్నతాలు, ఆనంద సాగరాలు.

శరణాగతి అంటే దైవానికి తనను ఇచ్చి వేసుకోవడం. తాను, తనకు కల్గి ఉన్నది. ప్రతీదీ దైవానికి సమర్పించడం, ఇక దేనిని తన స్వంతమైనదిగా భావించకపోవడం, ఇంకేతరుల ఇచ్ఛకూ కాక దైవేచ్ఛకే విధేయత చూపడం. అహం కొరకు కాక దైవం కొరకే జీవించడం.

*

శరణాగతి అంటే తనలోని ప్రతీదీ దైవానికి అర్పణ చేయడం, తాను, తాను కల్గి ఉన్నది. ఇక తన అలవాట్లు, కోరికలు, ఆలోచనలపైపట్టు పట్టకూడదు. కాని దివ్యసత్యం దాని జ్ఞానంతో, ఇచ్ఛతో కార్యాచరణతో ప్రతిదానిని భర్తీ చేయడానికి అనుమతించాలి.

శరణాగతి అంటే పూర్తిగా శ్రీమాత చేతుల్లోకి వెళ్ళిపోవడం. ఆమె ప్రకాశాన్ని, జ్ఞానాన్ని, సంకల్పాన్ని ఆమె పనిచేసే శక్తిని అహంకారంతోనూ లేదా ఏ విధంగానూ, ఏ మార్గంలోనూ ప్రతిఘటించకూడదు.

*

అహంకారాన్నీ అంటిపెట్టుకునే మూలకం

పోరాటం ఎంత కష్టమైనా, ఇప్పుడు,ఇక్కడ చివరి వరకు పోరాడటమే ఏకైక మార్గం. నీవు ఎప్పుడూ నిజమైన అడ్డంకిని ఎదుర్కొని, దానిని అధిగమించి ఉండలేవు. ఇదే అసలు సమస్య. నీ స్వభావంలో చాలా ప్రాథమిక అంశం అహంకారంతో కూడిన వ్యక్తిత్వంగా, అది నీలో బలమైన రూపాన్ని తీసుకొని అతుక్కుపోయే అహంకార మూలకంగా ఉంది .నీ ఆధ్యాత్మిక ఆకాంక్షతో కలసి ఆధ్యాత్మిక కాంక్షగా ఉంది. ఈ ఏర్పాటు విడిపోయి ఎన్నడూ సత్యమైన దైవికమైనదానికి చోటు ఇవ్వడానికి ఒప్పుకోలేదు. అందువలన, శ్రీమాత తన శక్తిని నీపై ఉంచినప్పుడు నీవే ఆ శక్తిని నీ వైపుకు లాక్కున్నప్పుడు, ఈ అహమే ఆ శక్తి స్వంత మార్గంలో పని చేయడానికి ఆటంకం కలిగించింది. ఈ అహమే మానసిక ఆలోచనల ద్వారా, దాని స్వంత శక్తి, స్వంత సాధన, స్వంత తపస్సు ద్వారా దాని ఆదేశానికి అనుగుణంగా "సొంత మార్గంలో" దాని స్వంత సృష్టిని చేయడానికి స్వీయ నిర్మాణం ప్రారంభించింది. నిజమైన శరణాగతి కానీ, నిన్ను నీవు స్వేచ్ఛగా దివ్యమాతకు ఇచ్చుకోవడం కానీ జరగలేదు. కానీ అతిమానస యోగంలో విజయం సాధించడానికి ఇదే ఏకైక మార్గం. యోగి, సన్యాసి లేదా తపస్వి కావడం ఇక్కడి లక్ష్యం కాదు, ఈ యోగ లక్ష్యం రూపాంతరం చెందడం, ఈ రూపాంతరీకరణ నీకంటే మిక్కిలి గొప్పదైన శక్తి ద్వారా మాత్రమే సాధించబడుతుంది; ఇది నిజంగా దివ్య మాత చేతిలో బిడ్డలా ఉండటం ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది.

CWSA 32:143

నీవు ఈ పరివర్తనను కోరుకుంటే

నీవు ఈ పరివర్తనను కోరుకుంటే, శ్రీ మాత చేతుల్లో, ఆమె శక్తులకు ఎటువంటి అవరోధం లేక ప్రతిఘటన లేకుండా నిన్ను నీవు సమర్పించుకో. నీలో ఆమె తన పనిని ఎటువంటి ఆటంకం లేకుండా చేయనివ్వు. నీకు తప్పనిసరిగా మూడు విషయాలు ఉండాలి, అవి చేతన, మృదుత్వం, నిబంధనలు లేని శరణాగతి. నీవు నీ మనసులో, ఆత్మలో, హృదయంలో, జీవితంలో, నీ శరీరంలోని ప్రతి కణంలో సచేతనంగా ఉండాలి. శ్రీమాత, ఆమె శక్తులు చేసే కార్యాన్ని గురించి తెలుసుకుని ఉండాలి; నీలో అచేతన స్థితి, అస్పష్టత ఉన్నప్పుడు కూడా శ్రీమాత ఆమె పని చేయగలిగినప్పటికీ,

అది నీవు సచేతనంగా, శ్రీ మాతతో కలిసి ఉన్న దానితో సమానం కాదు. నీ స్వభావమంతా శ్రీ మాత స్పర్శకు మృదువుగా, వొంగే గుణాన్ని కలిగి ఉండాలి. తన తెలివికి మాత్రమే పరిమితమై ఉన్న అజ్ఞానపు మానసిక సందేహాలు, వివాదాలు, ప్రశ్నలతో ప్రతిస్పందించే విధంగా ఉండకూడదు. అలా ఉండడం జ్ఞానోదయాన్ని, రూపాంతరీకరణను అడ్డగిస్తుంది. మనిషిలోని ప్రాణికంలాగా తనకు కావలసిన విషయాలకు పట్టు పట్టడం, చెడు సంకల్పాలను, వక్రమైన కోరికలను నిరంతరం దైవిక ప్రభావాన్ని వ్యతిరేకించడం చేయకూడదు. దాని అల్పత్వంలోని సుఖానికి అతుక్కొని, అంధకారంలో దానికున్న మత్తు, మాంద్యం, లేదా నిస్తేజంగా లేదా రసహీనంగా, క్రొత్తదనం లేకుండా, ఒకేలా పోయే వైఖరిని కదిలించే ప్రతిస్పర్శకి వ్యతిరేకంగా మనిషి భౌతిక చేతన అణచి గీపెట్టినట్లు నీ స్వభావం, తమస్సు, దౌర్బల్యంలో కూరుకుపోయి ప్రతిబంధకంగా మారకూడదు. నీ అంతర్గత, బాహ్యాలకు చెందిన సంపూర్ణ శరణాగతి ఈ మృదుత్వాన్ని, వొంగే గుణాన్ని నీ ప్రకృతిలోని అన్ని భాగాలలోకి తీసుకువస్తుంది; జ్ఞానం, ప్రకాశం, శక్తి, సామరస్యం, సౌందర్యాలకు నీవు నిరాటంకంగా తెరుచుకొని ఉండటం వల్ల చేతన మేల్కొని, పరిపూర్ణత పై నుంచి క్రిందికి ప్రవహిస్తుంది. చివరకు శరీరం కూడా మేల్కొని, దాని చేతనను ఏకం చేస్తుంది. ఇకపై అతిమానస చేతన శక్తికంటే కింద స్థాయిలో శారీరక చేతన ఉండదు. శ్రీమాత శక్తులన్నీ పై నుండి క్రింది నుండి, ఇంకా శరీరం చుట్టుప్రక్కల నుండీ వ్యాపిస్తున్నట్లు అనుభూతి పొందుతుంది. అత్యున్నత ప్రేమ, ఆనందానికి పులకరిస్తుంది.

CWSA 32:25

Vol. 53, No. 5
May 2023

Date of Publication
1st May 2023

Registered: PY/41/2021-23

AKHILA - Akhila Bharata Patrika (Telugu)

Registered with the Registrar of Newspapers for India: No. 23593/72 (monthly)


Matter shall reveal the Spirit's face. — Sri Aurobindo

Flower on the Cover:

Surrender

To will what the Divine wills is the supreme wisdom.

(Spiritual significance and exr ᐩion of the flower given by the Mother)



Botanical name: Rosa 'Edward'

Rose: *Medium-sized double highly fragrant pink flower. A large shrub.*

Owner: Sri Aurobindo Society
Printer: Swadhin Chatterjee for Sri Aurobindo Ashram press
Publisher: Pradeep Narang for Sri Aurobindo Society
Published from: Society House, 11 Saint Martin Street, Puducherry - 605001
Printed from: Sri Aurobindo Ashram Press,
No. 38, Goubert Avenue, Puducherry - 605 001, India
Editor: K. V. Rao

Single copy Rs. 30 **Annual Subscription Rs. 200 (in India)**


A Monthly Published by

SRI AUROBINDO SOCIETY-605001

అఖిల

అఖిల భారత పత్రిక

జూన్ 2023



మదర్‌తో సాన్నిహిత్యం

విషయ సూచిక

సంపాదకీయం :

పూర్ణయోగ ప్రధాన కీలకం మదర్‌కు ఉన్ముఖంగావడం. భువి ప్రకృతి అంతరాత్మతలను రూపాంతరం చెందించడమనే కార్యం ఆమెకే అప్పచెప్ప బడింది. ఆమె ప్రస్తుత దేహంలో, పరమశక్తిని లేక దివ్యజననిని గుర్తించడ మనేది, రూపాంతరీకరించు ప్రక్రియలోనికి నిజంగా ప్రవేశించడమౌతుంది. ఆమె పదార్థ దేహపు ఆధారం లేనపుడు మనం మదర్‌తో సంబంధం పెట్టుకొని ఆమె సాన్నిహిత్యంలోనికెదగడం ఎలా అనే ప్రశ్న మనిషి భౌతిక మనసులో తలెత్తవచ్చు. దివ్య జననితో సాన్నిహిత్యంలోనికెదగడమనే రహస్యాన్ని బహిర్గతం చేయడానికీ సంచిక ఉద్దేశించబడింది.

అనువాదం : కె.వి. రావు



తమ ఆంతర అస్తిత్వంలో ఆమెకు చేరువగా, అతిసన్నిహితంగా, ఆమె సంకల్పంతో ఒక్కటై ఆమెకు పూర్తిగా వికసనం చెందిన వారే శ్రీమాత బిడ్డలు - భౌతికంగా ఆమె దగ్గరకు వచ్చిన వారు కాదు.

CWSA 32:496 - *శ్రీ అరవిందులు*

మదర్‌తో సాన్నిహిత్యం

తల్లి బిడ్డ

శ్రీమాతతో మనకున్న యథార్థమైన సంబంధం ఏమిటి - తల్లి బిడ్డకు ఉండే సంబంధమా?

తల్లి బిడ్డకు ఉండే సంబంధం పూర్తిగా నిష్కపటమైనది, చాలా సరళ సాధారణమైన భరోసా, ఆమెపైనే పూర్తిగా ఆధారపడే ప్రేమ!

*

గురుశిష్య సాంప్రదాయ వాదంలో శిష్యుని సంబంధం ఎప్పుడూ గురువు మార్గదర్శనాన్ని ప్రశ్నించకుండా స్వీకరించడం, సంపూర్ణ, సంతోష పూర్వకమైన విశ్వాసం, గౌరవం, ఆరాధన భావంతో ఉంటుంది. ~~ఈ~~ ఆశ్రమంలో మాత్రమే ఇంకొక థీరీ కొన్ని కొన్ని సార్లు ముందంజ వేస్తుంది. ~~ఈ~~ ఆశ్రమంలో మాత్రమే మరో సిద్ధాంతాన్ని కొన్ని సమయాల్లో ముందుకు తీసుకొచ్చారు. భౌతిక దేహంలో ఉన్న శ్రీమాతతో సంబంధాన్ని, అపసవ్యంగా అన్వయించడం లేక తప్పుగా సాగదీయడం ఫలితంగా ఆ సిద్ధాంతం తారస్థాయికిచేరింది (స్వతహాగా అవేమిటో అర్థం చేసుకొన్నప్పుడు, ఒక దశగా, నిరుత్సాహపరచవలసినవి గాదు) దురభిమానం, మాత్రమే గాక ఆహంకారిక, అనాధ్యాత్మిక ఆపేక్ష గల అభ్యర్థన, విషపూరిత విమర్శ, తిరుగుబాటు, కోపం, ఇంకా ఇతర అవాంఛనీయ ప్రాణిక ప్రతిచర్యలు (మామూలుగా ఆధ్యాత్మిక చేతనకు అన్యదేశీయమైనవి అనుకొనబడే) కొన్ని ఇతర అపార్థాలను కొంతమంది ముందుకు తెచ్చారు. యోగ ఆచరణలో ఒకభాగంగా చాలామంది ఆమోదించారు కూడా. ఇలాంటి పద్ధతులు ఆధ్యాత్మిక జీవితంలో సత్ఫలితాలవైపు ఎలా నడిపిస్తాయో నాకైతే కన్పించడం లేదు.

*

ఒక నియమం

నీకు ఒక నియమం పెడుతున్నాను, "శ్రీమాత నుండీ దాచాలనుకున్నదేదీ నీవు చేయకు, దానిని గూర్చి ఆలోచించకు. దీనికి బదులుగా నీ ప్రాణికంలో నీ లోపలే అభ్యంతరాలు తలెత్తుతాయి. ~~ఈ~~అల్పమైన విషయాలను శ్రీమాత

దృష్టికి తేవడానికి బదులు, ఈ విషయాలు ఆమెను ఇబ్బంది పెడతాయని చాలా అల్పమైనవిగా కనబడతాయని ఎలా అనుకుంటున్నావు? జీవితమంతా యోగంగా ఉండాలంటే ఇక అల్పమైనది, అప్రధానమైనదంటూ ఏమున్నది? శ్రీమాత స్పందించకపోయినా, నీవు చేసే దానికి సంబంధించిన వ్యవహారాన్ని, స్వీయాభివృద్ధిని సరైన భావనతో ఆమె ముందుకు తెస్తున్నావంటే దానర్థం ఆ అంశాన్ని, ఆమె రక్షణలో, సత్య ప్రకాశంలో ఉంచడం, రూపాంతరీకరణానికి పనిచేస్తున్న శక్తి కిరణాల అధీనంలోకి తేవడం. జాగు లేకుండా ఆ కిరణాలు వాటి దృష్టికి వచ్చిన దానిపై పనిచేయడం, ప్రసరించడం మొదలు పెడతాయి. ఏదైనా నీలోని శక్తి ఫలానా పనిని చేయాలనుకొన్నా, చేయవద్దని సలహా ఇచ్చేది ఒకటి ఉండవచ్చు. అది శక్తి చేసే కార్యాన్ని, ప్రకాశానికి చెందిన కిరణాన్ని దారి తప్పించి వేసే ప్రాణిక ఉపకరణం కావచ్చు. ఇది కూడా గమనించాలి, ఆమె పరిశీలనలో నీలో ఏ భాగానికి చెందిన కదిలికలనైనా ఆమె ముందు ఉంచితే, నీవు ఆమెకు తెరుచుకొంటే, దానికదే మిగిలిన సాధకులలో నేరుగా క్రియాశీలం కాని నిశ్శబ్దమైన, సాధారణమైన కార్యంకంటే భిన్నమైన ఒక అనుబంధాన్ని, ఒక వ్యక్తిగతమైన సాన్నిహిత్యాన్ని సృష్టిస్తుంది.

దీనికంతటికి నీవు తయారైనట్లు భావిస్తే, నీలోని శక్తి నిన్ను కదిలిస్తే, నీలో ఏది ఉన్నా దాన్ని ఎలాంటి అరమరికలూ లేకుండా ఆమె ముందు ఉంచు. అప్పుడది ఫలవంతమౌతుంది. అది అంతరంగంలో నుండీ కనుక వస్తే అది అప్రయత్న సిద్ధమైనది, సహజమైనది, నిక్కమైనది.

ప్రేమ, విశ్వాసం, భరోసా, ఆత్మవిశ్వాసం, శరణాగతి:

నీవు చెబుతున్న అటువంటి సంవేదనలు ఎప్పుడూ నిరాకరించబడుతూనే ఉండాలి. వాటితో జరిగేదేమీ లేదు. భగవంతునితో బాంధవ్యం, శ్రీమాతతో అనుబంధం, ప్రేమ, విశ్వాసం, భరోసా, నిష్ఠ, శరణాగతి ఇవి మాత్రమే కావాలి. ఎలాంటి ప్రాణిక సాధారణ కోవకు చెందిన అనుబంధమైనా సాధనకు విరుద్ధమైన ప్రతిక్రియల్ని తెస్తుంది. కోరిక, అహంకారిక అభిమానం, హక్కుపరంగా అడగడం, ఎదురు తిరగడం మొదలైన అజ్ఞాన రాజసిక మానవ స్వభావానికి చెందిన అలజడుల నుండీ తప్పించుకోవడమే సాధన ఉద్దేశ్యమై ఉంది.

నిజమైన ఆధ్యాత్మిక అనుబంధం

ఆంతరికంగా జీవించడమన్నది, ఆధ్యాతిక జీవితానికి మొదటి సూత్రం. లోపలి నుండి భౌతిక ఉనికిని మళ్ళీ మలచి, దానిని రూపుదిద్దాలి. కానీ చాలామంది బాహ్యంగా బతకడానికే పట్టుబడతారు. శ్రీమాతతో వారి సంబంధం ఒక బాహ్య అనాధ్యాత్మిక స్వభావానికి చెందిన సాధారణ ప్రతిక్రియచే శాసించబడుతుంది.

మీరు కొంతమందికి శ్రీమాతతో "ఉండవల్సిన సన్నిహిత సంబంధం" అని వ్రాశారు. ఆమెతో ఉండాల్సిన ఆ నిజమైన, అత్యంత యథార్థమైన అనుబంధం ఏమిటి ? ఆత్మిక అనుబంధమే నిజమైన అనుబంధమా? అయితే ఆత్మిక అనుబంధమంటే ఏమిటి? నేనెలా దానిని గుర్తించగలను?

ఆంతరిక (అంతరాత్మ) అనుబంధం అంటే ఆ మనిషి శ్రీమాత సన్నిధిని సంవేదిస్తాడు. అన్నివేళలా ఆమెవైపుకు తిరిగి, ఆమె శక్తి అతడిని నడిపిస్తూ, దారిచూపుతూ, సహాయం చేస్తూందని ఎఱుకతో ఉంటాడు. అతడు ఆమె యెడల నిండు ప్రేమతో, సర్వకాలాల్లోనూ భౌతికంగా, ఆమెకు చేరువలో ఉన్నా లేకున్నా ఒక సామీప్యభావాన్ని అనుభవిస్తూ ఉంటాడు. అతని మనస్సు శ్రీమాత మానసానికి చాలా సన్నిహితమైనట్లు, అతని ప్రాణికం ఆమెలో సామరస్యాన్ని పొందినట్లు, అతని భౌతిక చేతన ఆమెతో నిండిపోయినట్లు అతడు అనుభూతి చెందేవరకూ ఈ అనుబంధం మనో, ప్రాణిక, అంతర భౌతికాలను చేబూనుతూనే ఉంటుంది.

అప్పుడు నేనేమి వ్రాశానో గుర్తులేదు కాని ఈ ఆంతర సన్నిహిత సంబంధం, బయట భౌతిక సంబంధానికి వ్యతిరేకంగా ఉన్నట్లుంటుంది. బాహ్య సంబంధం భౌతిక తలంలో ఎలా శ్రీమాతను దర్శించాలి అన్న దానికే పరిమితమై ఉంటుంది. అది ఎప్పుడైనా సాధ్యమే కదా! ప్రత్యేకంగా ప్రణామ సమయంలో, ధ్యాన సమయంలో, సంవత్సరానికి ఒకసారి జన్మదిన సందర్భంలో ఆమెను దర్శించినా కూడా ఈ ఆంతరిక సంబంధమే ఉండాలి.

CWSA32:448-54

అందరి విషయంలోనూ శ్రీమాత తీసుకొనే జాగ్రత్త

శ్రీమాత అందరిపట్ల అందరూ తన బిడ్డలుగా జాగ్రత్త వహిస్తున్నది, నీపట్ల జాగ్రత్త వహించదు అన్న నీ ఆలోచన నిరాధారమైనది. దానికి ఎలాంటి

పటిష్టమైన పునాదీ లేదు. ఆ పద్ధతిలోనే ఇతరులకు మల్లేనే నీపై..... మరింకా ఎక్కువ ప్రేమను, జాగ్రత్తను చూపుతుంది. ఇలా మనం చూచి భావించగల ఒక ప్రత్యేకమైన, గట్టి విషయమేమి ఇందులోలేదు. ఖచ్చితంగా శ్రీమాత భావాల్లో నిజంగా ఇది ఎలాంటి ప్రభావాన్ని చూపదు. కానీ నేను దీనిని దృష్టిలో ఉంచుకొన్నాను, ఈకోవకు చెందిన ఆలోచన ఎప్పుడూ సాధకులు, సాధకురాళ్ళు ఏదో నిరాశకు గురైనప్పుడు లేదా బయట వాళ్ళ నుండీ సలహాలను చెవిన వేసుకున్నప్పుడు, వాళ్ళ మనసుల్లో కల్గుతాయి.

నీవు అంటున్నట్లు వాళ్ళు ఇదే చెబుతూ ఉంటారు, మీరు అందరినీ ప్రేమిస్తారు, పూర్తి శ్రద్ధచూపుతారు, నా విషయంలో అలా చేయరు, దీనిని బట్టి యోగానికి నేను తగను, లేకపోతే అలా నన్ను దూరం పెట్టరు. నేను దీనిని సాధించలేకపోయి, మిమ్మల్ని ఇబ్బంది పెట్టడం తప్ప నేనిక్కడ ఉండి .... ఒరిగేదేముంది? ఇక నేను పాండిచ్చేరిలో ఉండి చేసేదేముంది? ఇలా... కాని లోపల చైత్యపురుషుడు సరిగ్గా జాగృతమైతే ఈ రకమైన ఆలోచనలు, ఈ నిర్వేదం, ఈ అపోహలన్నీ, బయటకు పోయి తీరవలసిందే. ఇప్పుడు నీవు ఆలోచించేది ఇదే... నిర్వేదాన్ని, ఇది తెచ్చి ఇచ్చే తప్పు సలహాలను, ఇది నీవైపుగా శ్రీమాత భావనల్లోనూ, ప్రవర్తనలోనూ ఎలాంటి వాస్తవికతను అందించలేదు. నీలోని అంతర పురుష, అంతరాత్మ ఎంత వేగంగా ముందుకొస్తుందో అంతగా మిగిలిన అంశాలతో కలసి వెళ్ళిపోతుంది. ఎందుకంటే నీలోని అంతరాత్మకు శ్రీమాతను తాను ప్రేమిస్తున్నానని, శ్రీమాత నీ పైన వాత్సల్యాన్ని చూపుతోందని తెలుసు. అదిమనస్సు, ప్రాణిక స్వభావాన్ని మోసపుచ్చే సలహాలతో గ్రుడ్డిదై ఏమారిపోదు. కాబట్టి నీవు ఈ ఆలోచనతో అట్లాగే ఉండిపోకు. వాటికి ఎట్లాంటి ఆధారం లేదు. అవి నిర్వేదంతో కూడిన మానసిక స్థితిలో మాత్రమే కల్గుతాయి, లేదా బయట నుండి వచ్చే సలహా వల్ల కల్గుతాయి. నీవు చైత్యపురుషుణ్ణి ఎదగనివ్వు, శ్రీమాత శక్తిని పని చేయనివ్వు. తల్లి బిడ్డ సంబంధం నీ అంతరాత్మలో నెలకొని ఉంది. సమస్త సాధన సుస్థిరము, సురక్షితము అది అవ్వగా, సమస్త చేతనకు అది పునాదిగా మారే వరకూ దానికదే నీ మనస్సు, ప్రాణిక, భౌతిక చేతనలో అనుభూతమౌతూ ఉంటుంది.

CWSA 32:455

మదర్‌తో అంతర సంపర్కం

నీలోనే నీవు శ్రీమాతతో ఉండు

నేను ఒంటరిగా నా గదిలో శ్రీమాత చైతన్య భావంలో చాలా సంతోషంగా ఉన్నాను. ఎప్పుడైతే ఎక్స్‌ని చూచేందుకు వెళ్ళానో, వెంటనే రుగ్మతకు గురయ్యాను. శ్రీమాతతో ఆంతరిక సంపర్కాన్ని పోగొట్టుకున్నాను. బయట మనుషులతో కలవడం ఆంతరిక భావాన్ని విచ్ఛిన్నం చేస్తుంది. కాని నేనెప్పుడూ ఒంటరిగా మరి ఏకాంతంలోనే ఉండలేను.

మంచిగా దీని కోసం నేనేమి చేయగలను?

నీవు నీ అంతరంగంలో శ్రీమాతతో కలసి జీవించడం నేర్చుకోవాలి. ఆమె చేతనతో సంపర్కాన్నీ కల్గి ఉండాలి, బయట ఎవరినన్నా కలిసినా అది పైపైనే... ఉపరితలంలోనే...

*

శాంతి ఆవశ్యకత

ఈ సాధనలో శాంతి నిశ్చలత ముఖ్యంగా ప్రాణికంలో ఉండడం చాలా అవసరం. కాని ఆ శాంతి బాహ్యపరిస్థితులు లేదా పరిసరాలపై ఆధారపడేది కాదు, శ్రీమాతకు, దైవానికి చెందిన ఉన్నత చేతనపై ఆధారపడి ఉంటుంది. ఆ శాంతితో లేనివారు, దానికై ఆకాంక్షించని వారు ఆశ్రమానికి వచ్చి పదేళ్ళు, ఇరవై యేళ్ళు ఇక్కడ ఉంటున్నా. ఎప్పుడూ అశాంతితో, సంఘర్షణలతో నిండి ఉంటారు. కానీ ఎవరైతే వారి మనోప్రాణికాలను శ్రీమాత శక్తికి, శాంతికి తెరచి పెడతారో, ఆ శాంతిని అతి దుర్భర పరిస్థితుల్లోనూ, అత్యంత అయిష్టమైన, కఠినమైన పనిలో కూడా పొందగల్గుతారు.

*

లోపలికి తిరగడం

ప్రతి ఒక్కరితో నాకున్న పరిచయాలను వదిలివేసి శ్రీమాతలోనే లయమవ్వడానికి నేను సిద్ధంగా ఉన్నాను. ఈ అడ్డంకులను దాటడానికి నేనెలాంటి నియమాలను అనుసరించాలి. నాకు శ్రీమాత ఈ విషయంలో

ఆంతరంగికంగా, బాహ్యంగా కూడా సహాయం చేస్తారు కదా!

అంతర్గతంగా శ్రీమాత వైపుకు తిరగడం అన్నది అతి ముఖ్యమైన అంశం. దీనికి సహకరించడం కోసమే ఎన్ని విధాల అనుబంధాలనైనా తప్పించి వేయడం చాలా అవసరం. కానీ మనుషులతో అన్ని రకాల సంబంధాలను తెంచి వేసుకోవలసిన అవసరం లేదు. అది అవాంఛనీయం కూడా. ఇక్కడ కావాల్సింది ఏమిటంటే ఈ మనుషులతో సంపర్క సంబంధాలు, సరియైన ఆంతరిక చేతనతో ఉండాలి. అంతే తప్ప నిన్ను నీవు బయటవైపుకు నెట్టివేసుకుంటూ కాదు. వారిని బయట ఉపరితలానికి చెందిన అంశాలుగా భావిస్తూ, వారితో బంధాలు వేసుకొంటూ లేదా వారితోనే మునిగితేలడం కాదు అది ఏ పద్ధతిలోనైనా...

*


కుంగుబాటు - ఊహాగానాలు

ఏ స్థాయిలోనైనా శ్రీమాతతో నీ సంబంధం ఎల్లవేళలా నిలవాలంటే మానసిక ఊహలు అవి తెచ్చే కుంగుబాటు నుండి విముక్తుడవు కావాలి. దాని నుండి అంతకు మించి ఏమీ రాదు. అది అలా ఉంటే బహుశ నీవు బయటవైపుగా జీవిస్తూ ఉండి ఉండవచ్చు. నిన్ను అలజడికి గురిచేసే బయట సంబంధాలను నీవు అనుమతిస్తూ ఉండవచ్చు. ఒక మనిషి అంతరంగంలో జీవిస్తే తప్ప తరగని సంతోషాన్ని కనుగొనలేడు. కార్యం, కార్యాచరణల్ని శ్రీమాతకు సమర్పించాలి. ఆమె నిమిత్తమే చేయాలి. నీ గురించి ఆలోచించడం, నీ స్వంత అభిప్రాయాలు, ప్రాధాన్యతలు, సంవేదనలు, ఇష్టాఇష్టాలు అన్నవి లేకుండా చేయాలి. ఈ చివరి విషయాలపై గనుక నీ దృష్టి నిలిచిందా ఇక ప్రతి అడుగులో ప్రాణికం లేదా మనస్సులో లేదా శరీరం, నరాల్లో ఒక ఒరిపిడిని, ఆందోళనను ఎదుర్కోవలసి ఉంటుంది. శాంతి, హర్షాలు తనలో తాను శ్రీమాతతో జీవిస్తూ ఉంటేనే నిలకడగా ఉంటాయి.

CWSA 32:457-60 — శ్రీ అరవిందులు

శ్రీమాత చేతనతో గల సంపర్కం అవసరమైన సాక్షాత్కారాలవైపుకు, అవి యథార్థ ఆకాంక్షల పరిపూర్తి వైపుకు నడుపుతుంది.

CWSA 32:457 — శ్రీ అరవిందులు



దరిచేరే సరియైన మార్గం

శ్రీమాత పట్ల నిజమైన ప్రేమ

తల్లీ బిడ్డల మధ్య బాంధవ్యం అంటే కేవలం తల్లి మాత్రమే బిడ్డను ప్రేమించటం కాదు. బిడ్డ కూడా తల్లిని ప్రేమించి ఆమెకు విధేయంగా ఉండాలి. నీవు శ్రీమాతకు నిజమైన బిడ్డగా ఉండదలచుకుంటే మొదటగా నిన్ను నీవు ఆమె హస్తాలలో ఉంచుకొని, ఆమెను నిన్ను నడిపించనిచ్చి, ఆమె సంకల్పాన్ని అనుసరించాలి. అంతే కానీ దానిని నిర్లక్ష్యం చేయడం కానీ, ఆమెకు ఎదురు తిరగటం కానీ చేయకూడదు ఇదంతా నీకు పరిపూర్ణంగా బాగానే తెలుసు, దానినెందుకు అలక్ష్యం చేస్తున్నావు?

బిడ్డ యొక్క ప్రాణిక చేతన దేనిని కోరితే అది చేయడం నిజమైన మాతృప్రేమలో భాగం కాదు. ఎందుకంటే అది అతనికి విపరీతంగా కీడును కలుగజేస్తుందని ఆమెకు తెలుసు. ప్రాణికం యొక్క ఉత్ప్రేరణలను అనుసరించ కూడదు, దాని బదులు నీ సత్యమైన అనుభూతిని అనుసరించి, శ్రీ మాత సంకల్పానికి నీవొక వాహికగా రూపొందు. ఎందుకంటే ఎల్లవేళలా ఆమె సంకల్పం నీవు నీ సత్యమైన రూపంలోకి ఎదగాలన్నదే.

శ్రీమాత పట్ల, ఇతరుల పట్ల ప్రేమ

నీవు శక్తివంతంగా అనుభూతి చెందే శ్రీమాత పట్ల ప్రేమ, యితరులెవరితో అయితే నీవు జీవిస్తావో, పనిచేస్తావో వారి పట్ల ఉండే ఆప్యాయత, సామరస్యత అనేది అంతరాత్మ నుండి కలుగుతాయి. అంతరాత్మ ప్రభావం తీవ్రతరమయినపుడు శ్రీమాత పట్ల కలిగే ఈ ప్రేమ కూడా తీవ్రతరమౌతుంది. మీ (ప్రకృతి) స్వభావాన్ని ముఖ్యంగా ముందుకు నడిపిస్తుంది. దానితో పాటు ఇతరుల పట్ల ఒక సద్భావన, సామరస్యత, కరుణ, ఆప్యాయత యొక్క అనుభూతి కూడా ఉంటుంది. ఏదైతే వ్యక్తిగతం కాక శ్రీమాత బిడ్డలయిన అన్ని ఆత్మలతో మీ ఆత్మ నుండి ఆంతరంగికమయిన అనుబంధం వలన వచ్చేది ఉంటుంది. ఈ అంతరాత్మ అనుభూతి వలన ఏవిధమైన అపకారం లేదు. ఇంకా విరుద్ధంగా అది ఆనందాన్ని, సామరస్యతని సృజిస్తుంది. వ్యక్తుల మధ్య ప్రాణికమయిన ప్రేమ మాత్రమే తిరస్కరించబడాలి. ఎందుకంటే అది దైవానికి పూర్తి నివేదన నుండి దూరం చేస్తుంది. కాని యిది శ్రీమాత చేతనలోకి ఆత్మ ఎదగడానికి సహకరిస్తుంది. కార్యసాధనలో, అంతర జీవనంలో కూడా ప్రగతి చేయడానికి ఉపకరిస్తుంది.

*

ఒక వ్యక్తి తనను శ్రీమాతకు సమర్పించుకోవటం

ప్రతి ఒక్కరికీ వారికేది అవసరమో దానిని శ్రీమాత యిస్తారు. ఒక వ్యక్తికి అవసరమయిన లేదా ఒక వ్యక్తి స్వీకరించ గలిగిన దేనినీ ఆమె ఆపరు. ఆమె యిచ్చే దానిని స్వీకరించటానికి మనమే సిద్ధంగా ఉండము.

అవును శ్రీమాత ఎప్పుడూ ఇవ్వటానికే ఇష్టపడతారు. ఆమె ఇచ్చే దానిని తన బిడ్డలు స్వీకరించడం చూడడం కన్నా మరేదీ ఆమెను అంతగా తృప్తి పరచలేదు. 'శ్రీమాతతో అంతరాత్మ అనుబంధం కోసం నా ప్రాణికం విలపించింది. శ్రీమాత తనపై సానుభూతి చూపలేదని భావించి, ఆమె వాత్సల్యాన్ని కోల్పోయినట్లుగా ఆక్రందించింది. ఆమె నిశ్శబ్దం వహించినపుడు తడబడుతుంది, నిర్లక్ష్యం చేసినపుడు ముడుచుకు పోతుంది.

అదంతా కూడా సంస్కరించబడని ప్రాణికం, పూర్తిగా అహం కోరిక, సాధింపులతో కూడి, అందువలన అసంతృప్తి, ఫిర్యాదులు, తప్పుడు

అభిప్రాయాలతో స్వయంగా సృజించుకున్న దుఃఖం.

కానీ నాలో మరొక చర్య ఉంటుంది. అటువంటి విచారాలు, సంతోషాలను వదిలివేసి కేవలం శ్రీమాతపై ఆధారపడటం అది

ఆమె నుండి ఏదీ కోరుకోదు. కానీ తనను తాను ఆమెకు నివేదించుకోవాలనుకుంటుంది, ఆమెను క్రిందికి దిగివచ్చి తనను ఉద్ధరించమని ప్రార్థిస్తుంది, ఈ కదలిక హృదయంలో కలుగుతుంది. దాని ప్రధానమైన గుణం సమర్పణ.

మీరిక్కడ వ్రాసినది చైత్య పురుషకు శ్రీమాతతో గల బంధానికి చెందిన ఖచ్చితమయిన వర్ణన. అది నిజమైన అనుబంధం. మీరు ఈ యోగంలో సఫలం కావాలంటే మీరీ చైత్య సత్తా అనుబంధంపై నిలబడాలి, అహంకార పూరితమయిన ప్రాణిక చలనాలను తిరస్కరించాలి. చైత్య పురుష ముందుకు వచ్చి అక్కడ నిలబడి ఉండటం యోగంలో నిర్ణయాత్మకమయిన కదలికే. నువ్వు చివరిసారి శ్రీమాతను చూచినపుడు జరిగినదదే. నీ చైత్య పురుష ముందుకు రావటం జరిగింది. దానిని అలానే మున్ముందునే నిలిపి ఉంచుకోవాలి. ప్రాణిక అహంకారాన్ని దాని అరుపులను విన్నట్లయితే ఆ విధంగా చేయలేవు. విశ్వాసము, సంయమనము, స్వచ్ఛమయిన ఆత్మ నివేదనలోని ఆనందము, ఈ అంతరాత్మ వైఖరితో వ్యక్తి సత్యంలోకెదిగి దైవంతో ఐక్యమవుతాడు.

ప్రేమ - నమ్మకము

ప్రేమ, నమ్మకాల అర్థం ఒకటేనా? శ్రీమాత పట్ల నమ్మకమున్నచోట ప్రేమ కూడా ఉంటుందని నేను భావిస్తాను. విశ్వాసం లేకుండా ప్రేమ ఉండదు. ప్రేమ లేకుండా విశ్వాసం ఉండదు.

నేనన్నది సరియైనదేనా?

అన్ని సందర్భాలలోనూ కాదు. చాలా మంది ఉంటారు. కొంచెం నమ్మకం, ఏమాత్రం ప్రేమ లేకుండా ఒక విధమయిన మానసికమయిన భక్తిని కలిగి ఉండవచ్చు. మరి చాలామందికి ఎంతోకొంత ప్రేమ ఉంటుంది, కానీ నమ్మకం ఉండదు. కానీ అది నిజమయిన చైత్య పురుష ప్రేమ అయినపుడు దానితో నమ్మకం కూడా ఉంటుంది. ఒక వేళ విశ్వాసం పరిపూర్ణమయితే చైత్య పురుష ప్రేమ అక్కడ వెంటనే మేల్కొంటుంది. నేను ఎక్స్‌తో

మాట్లాడినపుడు శ్రీమాతపై నమ్మకమున్నపుడు ప్రేమ కూడా ఉంటుందని చెప్పాను.

నీవు చెప్పినది సరి అయినదే. ఆత్మ యొక్క నమ్మకము, ఆత్మ యొక్క ప్రేమ అయినపుడు - కానీ కొందరిలో కేవలం ఒక ప్రాణికమయిన భావన మాత్రమే ఉంటుంది. అది నిరుత్సాహపడినప్పుడు తిరుగుబాటు, కోపాలను తీసుకొని వస్తుంది. అటువంటి వారు వెళ్ళిపోవడం జరుగుతుంది.

శ్రీమాత పట్ల అంతరాత్మ ప్రేమ

శ్రీమాతను చూడగానే తృప్తినీ, ఆనందాన్ని పొందితే అది ఎటువంటి భావన.

అంతరాత్మ భావన.

కేవలం శ్రీమాతను గుర్తుతెచ్చుకున్నంతనే తృప్తినీ, ఆనందాన్ని పొందటం ఎటువంటి భావన?

చైత్యపురుష.

శ్రీమాతకు వ్యతిరేకంగా ఏమయినా విన్నపుడు హృదయం బాధపడటం ఏవిధమైన భావన?

చైత్యపురుష.

ఆమె నుండి దూరంగా ఉన్నపుడు కూడా
హృదయంలో శ్రీమాత సమక్షాన్ని అనుభూతి చెందడం ఎటువంటి భావన?

అంతరాత్మ భావన.

నేను సంపూర్ణమయిన అంతరాత్మ ప్రేమలో ఉన్నానని ఎలా అంచనా వేసుకోగలను?

అహంకార రాహిత్యం చేత, స్వచ్ఛమయిన భక్తివలన, భగవంతునికి నివేదించుకొని సమర్పణ అయినప్పుడు.

*

అంతా నిశ్చలంగా, నిశ్శబ్దంగా ఉన్నపుడు నేను నా హృదయంలో ఒక గంభీరతను అనుభూతి చెందుతాను, ఒక మధురమైన భావన నిరంతరం అందరి పట్ల సమానంగా అక్కడ పెల్లుబుకుతుంది. అది ఎడతెగకుండా పైకి

శ్రీమాత వైపు వెళుతుంది. దైవంతో ఒక మధురమైన అనుబంధపు భావన కలుగుతుంది. అది వ్యక్తిని పూర్తిగా మృదువుగా చేస్తుంది. అది నిశ్చలమూ, అచంచలమూ, మధురమైన శాంతి, సంతృప్తితో నిండి ఉంటుంది.

అది అంతరాత్మ ప్రేమ.

*

ఉదయం నుండి శ్రీమాతకు చాలా సన్నిహితంగా ఉన్న భావన అది ఏ విధంగా అంటే మా యిరువురి మధ్య ఎటువంటి భేదం లేనట్టుగా. కానీ అదెలా సాధ్యం? మా యిద్దరి మధ్య ఒక అగాధమంత వ్యవధి ఉన్నపుడు? నేను మానసిక తలంలో ఉన్నాను, ఆమె ఉన్నతోన్నతమయిన అతి మానస తలంలో ఉన్నారు.

శ్రీమాత అతి మానస తలంలోనే కాక అన్ని తలాల్లో ఉన్నారు. ప్రత్యేకంగా ఆమె చైత్య పురుష భాగంలో (అంతరహృదయం) ఎప్పుడైతే అంతరాత్మ వికసిస్తుందో సహజంగానే సన్నిహిత భావన వస్తుంది.

నేను శ్రీమాతను చూసిన ప్రతిసారీ నాలో ప్రేమ, ఆనందం ఎందుకు కలగవు?

ప్రేమ, ఆనందం కలగడమనేది నీ అంతరాత్మ వికాసంపై ఆధారపడి ఉంటుంది.

*

ఒక రెండు రోజుల పాటు శ్రీమాత పట్ల, మీ పట్ల తీవ్రమయిన అనురాగం కలిగింది. వ్యక్తి పూర్తిగా ఆ ప్రేమతో ఆదేశించబడినట్లయ్యింది. తరువాత కేవలం కొంత పాక్షికమయిన ప్రభావమే ఉంది. గురుదేవుల పట్ల శ్రీమాత పట్ల గంభీరమయిన, ఉన్నతమయిన గౌరవము, ఏ ప్రాపంచికమయిన సౌఖ్యం ఇవ్వలేని ఆనందం కలిగింది.

అది ప్రస్ఫుటంగా చైత్య పురుషయే.

నేను తరచుగా గమనిస్తాను. దైవత్వం వైపు ఒక ఆంతరిక ప్రేమ ఉప్పొంగినపుడు అశ్రువులు వస్తాయి.

అవి అంతరాత్మకి చెందిన భక్తి అశ్రువులు.

*

ఈ రోజు సందర్శకురాలు ఆశ్రమాన్ని విడిచి వెళుతున్నారు. శ్రీమాత ప్రణామ ఉత్సవాన్ని ముగించి పైకి వెళుతుంటే ఈమె విలపించటం ప్రారంభించింది. ఆమె అంతరాత్మ కొంత సమయం పాటు ముందుకు రావటం యిందుకు కారణమా?

అది అంతరాత్మ ముందుకు రావటం వలన కాదు. ఆమెలోని చైత్యపురుష జాగృతమై చాలా కాలంగా శ్రీమాతతో అంతరంగంలో అనుబంధం కలిగి ఉంది.

*

దర్శన సమయంలో నావంతు వచ్చినపుడు నా చైతన్యం ఒక సమ్మోహన స్థితిలోఉత్తేజితమయింది. అది చాలా అద్భుతంగా ఉండి నా అంతరాత్మను ముందుకు తీసుకొని వచ్చింది. నా ఆధారాన్ని కొంత సమయం వరకూ నిశ్చలం చేసి శరీరమంతా వ్యాపించే ఈ జలదరింపు ఏమిటి?

అది పైనుండి వస్తున్న శ్రీమాత స్పర్శకు నీ అంతరాత్మ, ప్రాణికం అనుభూతి చెందే పులకరింపు.

*

చైత్య పురుష పూర్తిగా ముందుకురాక పూర్వమే హృదయంలోని అంతరాత్మ ద్వారా శ్రీమాతతో చైతన్యవంతమయిన సంస్పర్శ సాధ్యమేనా?

అవును - చైత్య పురుష ఎప్పుడూ ఉంటుంది.

*

నా చైతన్యమెపుడూ శ్రీమాత హృదయం పైననే కేంద్రీకరించబడి ఉంటుంది. అది అక్కడే ఆమెతో మమేకమై ఉన్నట్లుగా ఆమెతో ఏకం కావాలని భావిస్తుంది. 'నేను ఆమెలో ఉన్నాను. నేను ఆమెలోనే ఉండాలి. నాకు యింక మరేమీ అక్కర్లేదు. అది మాత్రం చాలు' అంటుంది. అది మరి ఏ ఇతర ఆలోచననూ రానివ్వదు. ఏ విధమైన ఉన్నతమయిన లేదా ఆధ్యాత్మికమయిన ఆలోచననూ రానివ్వదు.

ఈ వైఖరిని మీరేవిధంగా చూస్తారు?

ఈ వైఖరి చైత్య పురుష, అంతర చేతన జాగృతం కావటానికి సాధారణంగా మంచిదే, కానీ ఉన్నతమయిన అనుభవం కలిగినపుడు దానిని ఆపకూడదు.

ప్రేమకు సంబంధించి ప్రాణిక మూలకం

శ్రీమాతకు సంబంధించి నీవు ప్రాణికపరమైన కోరిక నుండి తప్పక విముక్తం కావాలి. ఎంతో గందరగోళానికి ఎన్నో సంఘర్షణలకి అదే కారణమయినది. అది వాటి వెనకాల ఉన్న అహం ప్రాబల్యం వల్ల జరిగింది. అంతరాత్మిక సంబంధం అనేది నిజమైన అనుబంధం. చైత్యపురుషుడు తనంతట తాను ఏమీ హక్కుగా అడగక ప్రేమ, శరణాగతి, దైవంతో ఐక్యత కోసం మాత్రమే అడుగుతాడు. అదికూడా ఆ అడగటం అనేది ఆకాంక్షయే కాని ప్రాణికమైన హక్కు కాదు.

ఇన్ని విషయాలు అక్కడ ఉండి చైత్యపురుషుడు పూర్తి కార్యాచరణతో ఉండాలని, అతడు పూర్తిగా తిరస్కరించడని ఎలా ఆశిస్తున్నావు. ప్రేమ పూర్తిగా ముందుకు వస్తే దాన్ని స్వార్థపూరితమైన ప్రాణికం చేజిక్కించుకొని శ్రీమాతని హక్కుగా ఇంకా ఇంకా కోరడం చేస్తుంది. ఆమె దాన్ని ఖచ్చితంగా సంతృప్తిపరచడాన్ని నిరాకరిస్తుంది. ఇది చాలామంది చేశారు, తరువాత తిరుగుబాటు చేశారు, ఎందుకంటే 'శ్రీమాత వారిని ప్రేమించదు' లేకుంటే వారికి ఏది కావాలంటే అది శ్రీమాత చేయరా?

శ్రీమాత ప్రేమ భౌతిక అభివ్యక్తీకరణగా లేనపుడు నేను కదిలిపోకుండా ఉండలేను. ప్రేమ భౌతిక వ్యక్తీకరణ కోసం హక్కుగా కోరడం అనేది పోవాలి. అది సాధనలో చాలా ప్రమాదకరమైన తొట్రుపాటుకు గురిచేసే అడ్డంకి. ఈ ఆపేక్షకు అంటిపెట్టుకోవడం ద్వారా సాధించిన పురోగతి సురక్షితమైనదికాదు. దానిని ఉత్పత్తి చేసిన అదే శక్తి చేత ఏక్షణంలోనైన క్రిందకి విసిరివేయబడుతుంది.

శ్రీమాత యెడల భక్తి

ఈ రోజు సాయంత్రం పైఅంతస్తు నుంచి శ్రీమాత నన్ను చూచినప్పుడు, నాకు ఒకలోతైన ఉప్పెనలాంటి భక్తి ఆమెపట్ల కలిగింది. దీనికోసమే నేను ఆతృతగా ఉన్నాను. ఈ భక్తిని అనుభూతి చెందిన కొద్దీ నాకు ఇంకా కోరాలనిపిస్తుంది. అహేతుక భక్తి నాకు కల్గాలి. భక్తిని కోరటం అనేది అసలు కోరికేకాదు అని శ్రీరామకృష్ణులు చెపుతుండేవారు. అందువలన నేను కోరటం వలన ఎటువంటి నేరం చేయట్లేదని గట్టిగా నమ్ముతున్నాను. దైవ సాధనే భక్తి కాబట్టి అది అడగడం న్యాయబద్ధమే అవుతుంది. కాదా?

దైవం కోసం కాంక్ష లేక దైవం కోసం భక్తి అనేకాంక్ష సమస్తం నుంచీ విముక్తం చేస్తుంది. ప్రధానంగా అది కోరిక కాదు, కానీ ఒక ఆకాంక్ష, ఆత్మ కున్న అవసరం, అంతర పురుషుని ఉనికికి శ్వాసలాంటిది. అది అన్ని కోరికల మధ్యపెట్టి లెక్కించేది కాదు.

శ్రద్ధ భక్తి

శ్రీమాత కొరకు స్వచ్ఛమైన భక్తిని నేను ఎలా పొందగలను?

స్వచ్ఛమైన ఆరాధన, ఎటువంటి వాంఛగాని లేక 'హక్కుగా అడగటంలాంటివి లేక దైవం కొరకు మాత్రమే ప్రేమ కల్గిఉండడం శ్రద్ధ భక్తి అని అంటారు.

ఏ భాగమునుండి ఇది అభివ్యక్తమవుతుంది?

అంతరాత్మనుంచి.

శ్రీమాతపట్ల చూపించే ఈ అంతరాత్మిక భక్తి, మానసికమైన భక్తి, ప్రాణిక భక్తి తీరుతెన్నులు ఏమిటి? వాటిని గుర్తించడమెలా?

హక్కుగా అడగటం అనేది లేకుండా, తనకు తాను సమర్పించుకొని ప్రేమతో నిండి ఉండేది అంతరాత్మిక భక్తి. శ్రీమాతతో ఉండాలనే సంకల్పం, ఆమెకు సేవచేయాలనే ఇచ్ఛ ప్రాణిక భక్తి. శ్రీమాత చెప్పేదానిమీద, చేసేదానిమీద విశ్వాసం కల్గి ఉంటూ దేనినీ ప్రశ్నించని అంగీకారమే మానసికమైన భక్తి. అయితే ఇవన్నీ బాహ్యమైన సందేశాలు - లోపల వ్యక్తిత్వంలో ఈ విషయాలని సంపూర్ణంగా గుర్తించవచ్చు, కానీ వాటిని మాటల్లోకి తెస్తే అవి వేరుగా ఉంటాయి.

ఈ యోగంలో మానసిక మరియు ప్రాణికమైన భక్తికి స్థానం లేదా?

లేదని ఎవరు చెప్పారు?

అది నిజమైన భక్తి అయినంతకాలం అన్నివిధాలైన భక్తికి స్థానం ఉంటుంది.

అద్భుతమైన పునాది

శ్రీమాతా! నాలో వెయ్యిన్ని మూడు అపరిపూర్ణతలు ఉన్నప్పటికీ, ఈ ఒక్క భావం నాలో అట్లాగే ఉంది : "నువ్వు నా తల్లివి, నేను నీ హృదయం నుండి పుట్టాను. ఈ ఆరేళ్ళలో నేను గ్రహించిన ఏకైక సత్యం" ఇది. కానీ

కనీసం ఇంత మాత్రం నేను అనుభూతి చెందటానికి నాకు వీలు కల్పించినందుకు చాలా ధన్యవాదాలు.

రాబోయే సత్యాలకు ఇది అద్భుతమైన పునాది. అవన్నీ దాని నుండి ఫలితాన్ని ఇస్తాయి.

శ్రీమాతకి అంకితం

ధ్యానంలో కూర్చున్నప్పుడు నేను అప్పుడప్పుడు మా-మా-మా అంటున్నాను. నా అంతరంగంలో, బాహ్యంలో గొప్పశాంతిని అనుభూతి చెందుతాను. అప్పుడు ప్రతీదీ చాలా ప్రశాంతంగా ఉంటుంది. నా చుట్టూ ఉన్న వాతావరణంలో కూడా నేను మా - మా - మా అని వింటూ ఉంటాను. ఇది నిజమా లేక కేవలం చుట్టూ వినిపించే ప్రతిధ్వనా అది?

నీ చుట్టూ ఉన్న వాతావరణం అనేది నీచైతన్యంలో భాగమే, నీవు నీ అంతరంగంలో ఎంత అనుభూతి చెందుతావో అదంతా నీ చుట్టూ ఉంటుంది. నీవు ఎప్పుడయితే శ్రీమాత నామాన్ని ఉచ్చరిస్తావో, నీ చైతన్యంలో అది ప్రతిధ్వనించటం మొదలవుతుంది. అది అంతరంగంలోనూ, బాహ్యంగా కూడా. అందువలన నీవు ఏదయితే అనుభూతి చెందుతున్నావో అది పూర్తిగా సత్యమే! అది ఒక మంచి అనుభూతి.

CWSA 460 - 479

ప్రేమ, ఆరాధన అనేది అంతరాత్మికంగా తెరుచుకోవడం మీద ఆధారపడి ఉంటుంది, దానికోసం కోరిక అనేది పోవాలి. అంతరాత్మిక ప్రేమ బదులు శ్రీమాత పట్ల చాలామంది సమర్పించే ప్రాణిక ప్రేమ అన్నిటికంటే ఎక్కువగా చాలా గందరగోళాన్ని తెచ్చిపెడుతుంది. ఎందుకంటే అది కోరికతో జతకడుతుంది కాబట్టి.

శరీర స్వచ్ఛత గురించి పట్టించుకోకు. శ్రీమాత ప్రేమహృదయాన్ని, శరీరాన్ని రెండింటినీ శుద్ధి చేస్తుంది - ఆత్మ ఆకాంక్ష ఉంటే, శరీరం కూడా స్వచ్ఛంగానే ఉంటుంది. గతంలో జరిగిన దాని గురించి కనీసం పట్టించుకోవాల్సిన అవసరం కూడా లేదు.

CWSA 32:482 — *- శ్రీ అరవిందులు*

మదర్ ప్రేమ

సరైన వైఖరి

శ్రీమాతను క్షమించమని అడగవలసిన అవసరం నీకు లేదు. ఎందుకంటే శ్రీమాతకు కొంచెం కూడా నీ మీద కోపం గాని, నీ విషయంలో అసంతృప్తి కానీ లేవు. ఆమె ప్రేమ నీ మీద ఎల్లప్పుడూ ఉంటుంది అనడంలో ఎటువంటి సందేహము లేదు.

ఇకపై నేను బాహ్య మార్గంలో శ్రీమాత ప్రేమ సంకేతాలను వెతకవద్దా? ఆమె నన్ను కొద్ది మాత్రం స్పర్శించినా లేదా నన్ను అస్సలు స్పర్శించకపోయినా తేడా ఏమిటి? ప్రేమను అంతర్గతంగా సరైన విధానంలో స్వీకరించడమే నిజమైన విషయం. ప్రేమను సరైన రీతిలో అందుకోనట్లయితే, అది అందిన తర్వాత చెల్లాచెదురైనా, విచ్ఛిన్నమైనా అది పంది ముందు ముత్యాలు విసిరినట్లే కదా!

అవును అది నిజం, ఈ వైఖరిని ప్రతి సాధకుడూ అలవరుచుకోవాలి.

*

మిశ్రమమైన ప్రేమ

మన అందరికీ శ్రీమాత ప్రేమ కావాలి, కానీ నేను నిజంగా ఆశ్చర్యపోతూ ఉంటాను, మనలో ఎంతమంది శ్రీ మాతని నిజంగా ప్రేమిస్తున్నారు? అని. నిజానికి మనం ఎక్కడ చూస్తాం ఎల్లప్పుడూ ఏకాగ్ర దృష్టితోను, త్యాగం చేసే గుణం తోను, ఉండే విఫలం కాని ప్రేమ? దైవం పట్ల మాత్రమే ప్రేమ ఉన్నవారు ఎవరున్నారు? పై దాని అర్థం వాస్తవానికి ప్రేమ లేదు అని కాదు, కానీ ఆ ప్రేమ అహంకారము, కోరికల తీర్చుకోజూచే మొండి వైఖరి, ప్రాణిక ప్రతిస్పందనలతో కలసిపోయి మిశ్రమ రూపంగా ఉంటుంది. ఇంచుమించు అందరూ కూడా ఈ కోవకు చెందిన వారే. కొందరిలో ప్రేమ అనేది ఉండదు, ఒకవేళ దానిని వారు ప్రేమ అన్న, కేవలం వారు పొందే దాని కొరకు మాత్రమే ఉంటుంది. ఒకరిద్దరిలో మాత్రమే నిజమైన ప్రేమ ఉంటుంది. కానీ చాలా మందిలో చైత్య పురుష వెలుగు పొగతో కప్పబడి ఉంటుంది. ఆ పొగను వదిలించుకోవాలి అప్పుడే ఆ వెలుగు పెద్ద జ్వాలగా మారే అవకాశం ఉంది.

ఇతరుల గురించి ఆలోచించే ఆలోచనల మూలంగాను, నీలోని దుర్గుణాలు కారణంగానూ నీవు శ్రీమాతకు దూరంగా ఉన్నావని భావించవచ్చు. నిజం ఏమిటంటే అన్ని సమయాల్లోనూ శ్రీమాత నీకు, నువ్వు ఆమెకు దగ్గరగా ఉన్నారు.

"శ్రీమాత నన్ను ప్రేమిస్తుంది నేను ఆమెకు చెందుతాను." అని నేను చెప్పిన స్థితిలోకి వచ్చి నీ జీవితానికి ఆలంబనగా చేసుకుంటే, తెర త్వరలోనే కనుమరుగవుతుంది. ఎందుకంటే అది ఈ ఆలోచనలతో రూపొందించ బడింది కనుక.

శ్రీమాత ప్రేమ ఎల్లప్పుడూ ఉంది

శ్రీమాత నీకు తన ప్రేమను అందించే నిమిత్తం నీవు మంచిగా మారాల్సిన అవసరం లేదు. ఆమె ప్రేమ ఎల్లప్పుడూ ఉంటుంది. మానవ స్వభావ అసంపూర్ణతలను ఆ ప్రేమ లెక్కించదు. చేయవలసిందల్లా ఈ విషయాన్ని ఎప్పుడూ గుర్తుంచుకోవడమే. అలా జరగాలి అంటే చైత్య పురుషుడు ముందుకు రావడం అవసరం. ఎందుకంటే చైత్య పురుషునికి మాత్రమే శ్రీమాత తెలుసు, మిగిలిన ప్రాణిక, మానసిక, భౌతిక తలాలు కేవలం పైపై కారణాలనే చూసి వ్యాఖ్యానిస్తాయి. చైత్య పురుషుడు ఉపరితలం మీదకు వచ్చినప్పుడల్లా నీవు ప్రేమ, సామీప్యతలను అనుభవంలోనికి తెచ్చుకుంటావు. కానీ ఇతర భాగాలను సిద్ధం చేయడానికి సమయం కావాలి, తద్వారా అవి కూడా తెలుసుకొని అనుభూతి చెందుతాయి. అందుచేత ఓపిక అవసరం. సాధనలో ఎదురయ్యే అన్ని ఆలస్యాలు, కష్టాల గుండా దాటిస్తూ శ్రీమాత నిన్ను నడిపిస్తుందని, ఖచ్చితంగా నిన్ను తన ఇంటికి తీసుకువెళుతుందన్న విశ్వాసం కూడా అవసరం. దాని కోసమే శక్తి పనిచేస్తోంది.

రెండు తప్పులు

ఎక్స్ బహుశా రెండు తప్పులు చేస్తున్నాడు. మొదటిది శ్రీమాత నుండి ప్రేమకు చెందిన బాహ్య వ్యక్తీకరణలను ఆశించడం, రెండవది, శ్రీమాతకు తెరుచుకోవడం, ప్రతిఫలాపేక్ష లేకుండా శ్రీమాతకు సమర్పించుకోవడం మీద దృష్టి పెట్టడానికి బదులుగా పురోగతి కోసం ప్రయత్నం చేయడం. సాధకులు నిరంతరం చేస్తున్న రెండు తప్పులు ఇవే. ఒక వ్యక్తి పూర్తిగా తెరచుకుని, తనను తాను శ్రీ మాతకు సమర్పించుకున్నప్పుడు, ప్రకృతి సిద్ధమైన వెంటనే,

పురోగతి దానంతటదే వస్తుంది కానీ పురోగతి కోసం వ్యక్తిగతంగా దృష్టి కేంద్రీకరిస్తే అది ఇబ్బందులను, ప్రతిఘటనను, నిరాశను తెస్తుంది. ఎందుకంటే మనస్సు విషయాలను సరైన కోణం నుండీ చూడదు. శ్రీమాతకు ఎక్స్ పట్ల ప్రత్యేక దయ ఉంది. ప్రతిరోజు ప్రణామ సమయంలో ఆమె అతనిపై ఆవశ్యకమైన శక్తిని ఉంచడానికి ప్రయత్నిస్తోంది. అతను మానసిక, ప్రాణిక తలాలలో చాలా నిశ్శబ్దంగా ఉండటం నేర్చుకోవాలి, తనను తాను పవిత్రం చేసుకోవాలి, తద్వారా అతను ఉన్నత చేతనా స్థితికి వెళ్ళగలడు, ఆశక్తిని అలాగే స్వీకరించగలడు.

దైవిక ప్రేమ, మానవుని ప్రేమ వలె కాదు. అది లోతైన, విశాలమైన, నిశ్శబ్దమైన స్వభావం కలిగినది. దాని గురించి తెలుసుకొని, ప్రతిస్పందించడానికి వ్యక్తి ప్రశాంతంగా, విస్తృతంగా మారడం అవసరం. వ్యక్తి పూర్తి సమర్పణ చేసుకున్నట్లయితే, ఒక పాత్రగా, సాధనంగా వ్యక్తి మారవచ్చు. అప్పుడు వ్యక్తి తనను ఏ విధంగా నింపాలి, దేనితో నింపాలి అనే దానిని భగవంతుని ప్రేమకి, జ్ఞానానికి వదిలివేయాలి. వ్యక్తి నిర్ణీత సమయంలో పురోగమించాలని, అభివృద్ధి చెందాలని, సాక్షాత్కారాలు, అనుభవాలను పొందాలని పట్టుబట్టకూడదని కూడా గుర్తుంచుకోవాలి - ఎంత సమయం పట్టినా వ్యక్తి పట్టుదలతో వేచి, శ్రమకోర్చి, తన పూర్తి జీవితాన్ని ఒకే ఒక విషయానికి, ఒక ఆకాంక్షగా ఒక ఉన్మీలనంగా చేసుకోవాలి. అదే దైవం.. ఒక వస్తువును గట్టిగా కోరడం కాదు, తనను తాను సమర్పించుకోవడమే సాధన రహస్యం. ఒక వ్యక్తి తనను తాను ఎంత ఎక్కువగా సమర్పిస్తే, స్వీకరించే శక్తి అంతగా పెరుగుతుంది. కానీ దాని కోసం అసహనం, తిరుగుబాటు పూర్తిగా పోవాలి. ఆస్వీకరణకు సంబంధించిన సలహాలు, సహాయం అందుకోకపోవడం, ప్రేమ పొందకపోవడం, దూరంగా పోవడం, జీవితాన్ని, ఆధ్యాత్మిక మహాయత్నాన్ని వదులుకోవడం లాంటి వాటిని తిరస్కరించాలి.

శ్రీమాత గురించిన భావనలు విషయానికొస్తే, ఆమె ప్రేమ కేవలం పని చేసే వారికి మాత్రమే, ఆ పనికి ప్రతిఫలంగా లభిస్తుంది లేదా సాధన బాగా చేసే వాళ్లకు లభిస్తుంది అని అనుకోవడం ఒక అర్థం పర్థం లేని ప్రాణిక, భౌతిక మనస్సు తలంపు. ఇక దానికి ఎలాంటి విలువ లేదు.

నిన్ను ఏడిపించేది శ్రీమాత కాదు. ప్రాణిక స్వభావంలోని శక్తులే నీకు దు:ఖాన్ని, చనిపోవాలనే ఆలోచనలను కలిగిస్తాయి, గతం గురించి

ఆలోచించేలా చేస్తాయి. శ్రీమాత నుంచి వచ్చేది ప్రేమ, ప్రకాశం, శాంతి, ఆనందం, ఆధ్యాత్మిక జీవన భవిష్యత్తు.

CWSA 32:479-82

మదర్‌తో అంతరిక ఏకత్వం (సంయోగం) - బాహ్య బాంధవ్యం

శ్రీమాత ఒక్కరే

శ్రీమాత ఒక్కరే అనేకరూపాలలో ఉన్నారు. అందువల్ల బాహ్య అంతరాల మధ్య ఉన్న భేదాన్ని అంత ఖచ్చితంగా పరిగణించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే శ్రీమాత కేవలం ఒక్కరు గానే కాదు, ఆమె భౌతికరూపంలోనే అన్ని అంశలూ ఉన్నారు. ఆమెలోనే బాహ్యాంతర సంబంధం నెలకొల్పబడుతుంది. మనకు బాహ్యంగా కనిపించే శ్రీమాతను నిజంగా అర్థం చేసుకోవాలంటే ఆమెను ముందు ఆంతరికంగా తెలుసుకోవాలి. కేవలం బాహ్యరూపాన్ని మాత్రమే చూసి ఏమీ అర్థం చేసుకోలేం. అది ఎప్పుడు సాధ్యం అంటే ముందు శ్రీమాతను అంతరవ్యక్తి ద్వారా కలవాలి. ఆమె దివ్యచేతనలోకి ఎదగాలి - ఎవరైతే కేవలం బాహ్యమైన సంబంధం మాత్రమే ఆశిస్తారో వారు ఇది చేయలేరు.

శ్రీమాతతో ఐక్యత లోపలి నుండే మొదలవ్వాలి

ఆధ్యాత్మిక ఐక్యత లోపలి నుండి మొదలై అక్కడి నుండి అంతటా వ్యాపించాలి. అది బాహ్యంగా ఉండే దేనిపైన కూడా ఆధారపడి ఉండలేదు, ఒకవేళ అలా జరిగితే అది ఆధ్యాత్మికమైనది లేదా వాస్తవమైనది కానేరదు. చాలా మంది ఇక్కడ అదే పెద్ద పొరపాటు చేస్తూ ఉన్నారు. ప్రాణికంలో లేదా భౌతికంలో జరిగే ఐక్యత లేక కలయిక మీదనే వారి దృష్టి మొత్తం కేంద్రీకరించారు. అంతేగాక ప్రాణికంలో లేక భౌతికంలో సంబంధం కలిగి ఉండాలని పట్టుపడుతూ ఉంటారు. ఒకవేళ వారు ఆశించినంత సంతృప్తి కలగని పక్షంలో వారిలోకి అనేకవిధాలుగా ఆందోళన, అనుమానం, తిరుగుబాటు, క్రుంగుబాటు ప్రవేశిస్తాయి. ఇది అసలు సరైన పద్ధతి కాదు.

అలా చేయడం వల్ల ఇంకా ఇబ్బందులు, అడ్డంకులు ఎదుర్కొంటారు. ఈ ఐక్యతలో మనస్సు, ప్రాణం, భౌతికం కూడా పాల్గొనడానికి ఇష్టపడతాయి. అందుకోసం అవి తమను తాము చైత్యపురుషునికి (అంతరాత్మకు) సమర్పణ గావించుకోవల్సి ఉంటుంది. అలాగే అవి కూడ రూపాంతరం చెందవలసి ఉంటుంది. ఐక్యత అనేది మొదట చైత్యపురుష ఇంకా ఆధ్యాత్మిక స్థాయిలో మొదలై, మానసిక, ప్రాణిక, భౌతిక స్థాయిలోకి వ్యాపిస్తుంది. భౌతికస్థాయిలో సైతం శ్రీమాత సామీప్యం సుస్పష్టమైన సాన్నిధ్యం అనుభవించగలిగే శక్తి కలిగి ఉండాలి. అప్పుడు మాత్రమే నిజమైన సంపూర్ణమైన ఐక్యత వచ్చింది అనుకోవాలి. అప్పుడు మాత్రమే భౌతికమైన సామీప్యం సాన్నిధ్యం దాని వాస్తవ విలువను, ఆధ్యాత్మిక లక్ష్యాన్ని సాధించిందని భావించాలి. అప్పటి వరకు ఎటువంటి భౌతికమైన సాన్నిధ్యం అయినా కూడా ఆంతరిక సాధనకు ఉపయోగపడేదిగా భావించాలి. ఎంత ఇవ్వాలి. ఎంత ఇస్తే ఉపయోగకారి లేక ఎంత ఇస్తే అవరోధం కాదు అనేది శ్రీమాత మాత్రమే నిర్ణయించగలరు గాని సాధకుడు కాదు. అలా చేస్తే సాధకులు, తమ కోరికలు, నిమ్న ప్రాణిక అహంకారం వలన తప్పుదారి పట్టే వారు ఎందరో. అలా శ్రీమాత సహాయాన్ని భౌతిక స్థాయిలో లభించిన సాధకులు ఎందరో వారి తప్పుడు వైఖరి వలన దాన్ని దుర్వినియోగం చేసుకొని పాడుచేసుకున్నారు. ఎప్పుడైతే ప్రాణికమైన ఆపేక్షలు, తిరుగుబాట్లు, కోరికలను సాధించుకోవడానికి శ్రీమాత బాహ్య సాన్నిధ్యం సామీప్యాలను ఉయోగించుకొంటారో, ఇక ఆంతరికమైన ఏకత్వానికి అది తీవ్రమైన ప్రతిబంధకంగా మారుతుంది. అది ఇంకా ఏ విధంగానూ సహాయపడదు. సాధకులు ఎప్పుడూ వారి అజ్ఞానంతో శ్రీమాత ఎవరితోనైనా ఇంకొకరికంటే ఎక్కువ సమయం పాటు మాట్లాడినప్పుడు, వారికేదో ప్రత్యేకమైన ప్రాధాన్యత ఇచ్చినట్లుగా భావిస్తారు. అలాగే వారికి ఎక్కువ ప్రేమను, సహాయాన్ని ఇచ్చినట్లుగా భావిస్తారు. ఇదంతా కూడా పెద్ద పొరపాటు. ఆ విధంగా భౌతికమైన సామీప్య సాన్నిధ్యం పెద్ద ప్రతిబంధకంగా మారిపోతుంది. వారిలో అటువంటి ప్రాణికమైన ఆపేక్షలు, కోరికలు, అసూయలు మొదలైనవి తారస్థాయికి చేరుకుంటాయి. ఇంకొకవైపు వారు అటువంటి భౌతిక సాన్నిధ్యం, సామీప్యంతో తృప్తి చెంది ఆంతరిక ఐక్యతను సాధించుకోవడానికి తీవ్రమైన ప్రయత్నం చేయకుండా ఉండిపోవచ్చు లేదా ఆ భౌతిక దర్శనం వారికి యాంత్రికంగా, సామాన్యంగా, తెలిసిన మనిషే

కదా అనిపించడం వలన, ఎటువంటి ఆంతరిక ప్రయోజనం ఇక ఉండదు. ఇటువంటివన్నీ కేవలం జరగడానికి అవకాశం ఉందనే కాదు చాలామంది విషయంలో ఇవి జరిగాయి.

ఇవన్నీ శ్రీమాతకు తెలిసిన విషయాలే గనుక, ఆమె ఏర్పాటు వేరే కారణాలతో కూడి ఉండి మనం ఆపాదించే కారణాల కన్నా భిన్నంగా ఉంటుంది.

ఒకే ఒక సురక్షితమైన పని ఏమిటంటే మొట్టమొదట సంపూర్ణంగా అంతరంగంలో ఐక్యతను సాధించడం, కేవలం అది ఒక్కటే సాధించవలసిన విషయంగా పెట్టుకుని మిగిలిన బాహ్యమైన విషయాల పట్ల ఆపేక్షలు, కోరికలు వదిలిపెట్టాలి. శ్రీమాత ప్రసాదించిన వాటితో తృప్తి చెందుతూ, శ్రీమాత విజ్ఞతపై ఆమె ఇచ్చే ప్రేమ సంరక్షణపై ఆధారపడి ఉండాలి. కోరికలు అనేవి తిరుగుబాటు, సంశయం, కృంగుబాటు, తీరని ప్రయాసలకు గురిచేసి మన ఆధ్యాత్మిక ప్రయాణంలో ఒక నిజమైన భాగం కాలేవు అనేది స్పష్టంగా తెలిసి ఉండాలి. నీ మనసు నీకు ఇది సరి అయినదే అని చెబుతూ ఉన్నట్లయితే దాని సలహాలను మనం నమ్మరాదు. అందువల్ల సంపూర్ణంగా ఒకదానిపైనే దృష్టి కేంద్రీకరించి, నిన్ను పక్కతోవ పట్టించేవి, ఏకాగ్రతకు భంగం కలిగించేవి అయిన మిగతా ఆలోచన ఒత్తిడులను పక్కన పెట్టాలి. ఇటువంటి విషయాలలో నీ ప్రాణికం వాటిని ఆమోదించడాన్ని అధిగమించాలి. ఇలా జరగాలంటే ముందు మనసులో వాటిని ఆమోదించకుండా చూసుకోవాలి లేదంటే వాటికి ఇంకొంత మద్దతు దొరికి మరింత బలం పుంజుకుంటాయి. అందువల్ల మనసులో అలాగే లోతైన ఉద్వేగపూరితమైన సత్తాలో సరైన వైఖరి కలిగి ఉండాలి. ఎటువంటి ఇబ్బందులు, విరుద్ధమైన శక్తులు ఎదురైనా సరే గట్టిగా నిలబడాలి. ఇలా దృఢ నిశ్చయంతో వాటిని నిరోధించాలి.

శ్రీమాతతో అంతరిక ఐక్యత (సంయోగం) సాధించడానికి మూడు ప్రాథమిక సూత్రాలు

1. ఎల్లప్పుడూ శ్రీమాత ప్రేమ సంరక్షణ పట్ల చెక్కుచెదరని విశ్వాసం కలిగి ఉండడం, దీనికి వ్యతిరేకమైన ఎటువంటి ఆకారాలను గాని, విజ్ఞాపనను గానీ విశ్వసించకుండా ఉండడం.

2. శ్రీమాత నుండి ఆమెతో గల వాస్తవ సంబంధం నుండి, ఆమెతో అంతరంగ సామీప్యత నుండి, ఆమె పట్ల సరళమైన, సూటి అయిన విశ్వాసం నుండి ప్రణామం విషయంలో కూడా దూరం చేసే ప్రతి ఆలోచన, భావనను తిరస్కరించడం.

3. బాహ్యమైన సూచనలు చిహ్నాలకు అంతగా ప్రాధాన్యత ఇవ్వకపోవడం - వాటిని ఎక్కువగా గమనించడం వలన సులభంగా తప్పుదోవ పట్టే అవకాశం ఉంది. శ్రీమాతకు నీ హృదయాన్ని తెరచి ఆమెను అనుభూతం చేసుకోవడం - ఆంతరిక హృదయం అంటే లోతైన ఉద్వేగంతో నిండిన హృదయంలో అనుభూతం చేసుకోవాలి. కోరికలతో కూడిన ఉపరితల ప్రాణిక హృదయం కాదు - అప్పుడు ఆమెను కనుగొనడానికి, ఆమెకు చేరువగా ఉండడానికి, ఆమె నిరంతరం నీ కోసం పనిచేసి నీకు ప్రసాదిస్తున్న వాటిని స్వీకరిస్తూ ఉండడానికి అవకాశం ఎక్కువగా ఉంటుంది.

మదర్ సామీప్యంలో ఉండుట, సాధనలో పురోగతి

త్వరగా లేదా ఆలస్యంగా అనేది మీరు అనుకునే సామీప్యానికి సంబంధం లేదు. కొంతమంది 'ముందుగా' వచ్చి ఉన్నవారు ఆమెకు 'దగ్గరగా' ఉన్నవారు కూడా శ్రీమాతను 'ప్రణామ' సమయంలోనే భౌతికంగా చూస్తారు. ఆలస్యంగా వచ్చినవారు కొంతమందికి వారు చేసే పనికారణంగా ప్రతిరోజు శ్రీమాతను చూసే అవకాశం ఉంటుంది. కానీ వారు ఆమెను పని ప్రాబల్యం వల్లనే చూస్తారు. వారు దగ్గరగా ఉండాలనే ఉద్దేశ్యంతో వారికి ఆ పని అప్పగించడం జరగలేదు. నీవు విషయాన్ని తప్పుగా అర్థం చేసుకున్నావు. ఇలా చేయడం మొదటిసారి మాత్రమే కాదు. అటువంటి మొండితనంతో నీవు మాత్రమే ఆ విధంగా అడిగినట్లు తలంచుతూ పొరబడుతున్నావు. ~~ఈ~~ విధంగా ఇతరులు కూడా ఉన్నారు. ప్రతి ఒక్కరూ దానిని అవసరమని పిలుస్తారు. కానీ వారి 'అవసరాన్ని' వారికి స్వేచ్ఛాయుతంగా తీర్చినపుడు, వారు దానికి విలువనివ్వడం మానేస్తారు. సూప్ మరియు ప్రణామ్ విషయంలో జరిగినట్లుగా. అది అవసరం కాదని, కోరిక మాత్రమే అని ~~ఈ~~ విషయం తెలియజేస్తోంది. మొత్తం సాధనా నియమం కోరికలపై కాకుండా సంకల్పం చేయడంపైనే

ఆధారపడి ఉంది. అవసరమని మనసుకు తెలియజేసినప్పటికీ అనుభవ జ్ఞానంపై మాత్రమే. మన లక్ష్యం అతిమానస సిద్ధియే. దానికోసం లేదా ఆ దిశగా ప్రతీదశలోని పరిస్థితులతో అవసరమైన దానిని మనం చేయాలి. ప్రస్తుతం భౌతిక చైతన్యాన్ని సిద్ధం చేయుట అవసరం. దాని కోసం పూర్తిగా సమానత్వం, శాంతి, వ్యక్తిగత అభీష్టం లేదా దిగువ ప్రాణిక భాగాల్లో ఒత్తిడి లేని పూర్తి నిబద్ధతను సుస్థాపితం చేయవలసి ఉంటుంది. ఇతరమైనవి వాటికి తగిన సమయంలో జరుగుతాయి.

ఇప్పుడు వాస్తవిక ఆవశ్యకత ఏమిటంటే శ్రీమాత ముందు భౌతిక సామీప్యతపై పట్టుబట్టరాదు. అది ఇతర అంశాలలో ఒకటి మాత్రమే. కానీ భౌతిక చైతన్యంలో చైత్యపురుషుడు ఉన్మీలనమవుట మరియు నిరంతర సమర్పణ, మార్గదర్శనం. అన్నీ వ్యవహారిక ఉద్దేశాల కొరకు నిన్ను ఉపయోగించుకోవాలనే మా అవసరం గురించి నీవు ఏమనుకుంటున్నావో మాకర్థం కాలేదు. మా కోసం నీవు ఏదైనా పనిచేయాలని మేము నిర్బంధిం చము. నీవే పనికోసం అడిగావు. నీకు తగిన దానిని మేము కల్పించాం. శ్రీమాతతో భౌతికంగా కలవడానికి ప్రత్యేకించి సందర్భాన్ని సృష్టిస్తూ మేము పనిని రూపొందించలేము. అలా ఎవరి కోసమూ చేయలేదు.

*

శ్రీమాత ఇంటర్వ్యూ కోసం అప్పుడప్పుడూ పిలిచే సాధకులు, ఎవరికైతే శ్రీమాత స్వయంగా వస్తువులను పంపిస్తారో ఆ సాధకులు ఆమెకు చాలా సన్నిహితమని, ప్రతీ మార్గంలోను వారు వేగంగా పురోగతి చెందుతారని ప్రజలు అనుకుంటారు. దీనిలో వాస్తవమేమిటి?

అదంతా వాస్తవం కాదు. ఉత్తమ సాధకులలో కొంతమందిని శ్రీమాత ఎప్పుడో గానీ లేదా అసలు పిలువరు, ఆమె వారికి ఏమీ పంపరు. అంతేకాదు, వారు కూడా ఏమీ ఆశించరు. శ్రీమాత వారితో ఎల్లప్పుడూ ఉన్నట్లు వారు భావిస్తారు. వారికి వారు సంతృప్తిగా ఉంటూ ఇతరమైన వాటి గురించి అడగరు.

శ్రీమాతకు భౌతికంగా దగ్గరగా ఉండడం వలన ఏదైనా ప్రత్యేకమైన ప్రభావముంటుందా?

భౌతిక తలంలో సాధన సంపూర్ణతకు అది అనివార్యం. భౌతిక, బాహ్య రూపాంతరీకరణ ఇతర విధంగా సాధ్యం కాదు.

శ్రీమాతకు బాహ్యంగా దగ్గరగా ఉంటూ, సన్నిహిత పరిచయం వలన ఆంతరిక చేతనావృద్ధి ఆకాంక్షలు బహుశా స్వల్పంగా ఉంటాయా?

అది ఆ వ్యక్తిపై ఆధారపడి ఉంటుంది. కొంతమంది లబ్ధిపొందుతారు. కొందరు పొందరు. సామాన్య వివరణ ఇవ్వలేము.

*

శ్రీమాత సహాయాన్ని బహు దూరంలో కూడా అంటే బొంబాయి లేదా కలకత్తాలో ఉండి కూడా ఇక్కడ ఆశ్రమంలో ఉన్న విధంగానే పొందుట సాధ్యమేనా?

ప్రతి ఒక్కరూ ప్రతిచోటా పొందగలరు. ఒక దృఢమైన ఆధ్యాత్మిక చేతన ఉన్నట్లయితే తీవ్రమైన పురోగతి సాధించవచ్చు. కానీ అనుభవమనేది ఒక్కటే దానిలో ఎటువంటి తేడా లేదు లేదా అదేవిధంగా ఉన్నది అనేటటువంటి ఆలోచనను రానీయదు.

*

నేను శ్రీమాతకు దగ్గరగా ఉండాలని కోరుకుంటున్నాను. నేను ఆమెకు దగ్గరయితే ప్రతికూల శక్తులు నాపై దాడి చేయవా?

నీవు కొంచెం పొరపాటుబడినావు. శ్రీమాతకు భౌతికంగా సమీపంగా ఉన్నవారిలో కొంతమందిపై నీకు ఎన్నడూ జరగని విధంగా వారిపై తీవ్రమైన దాడులు జరిగాయి. భౌతిక సామీప్యత కాకుండా ఆంతరిక సామీప్యతయే రక్షణనిస్తుంది.

ఆంతరిక సామీప్యత

ఆంతరిక సామీప్యత చాలా ప్రధానం. మానసిక ఆలోచన చాలా సహజమైనది, వాస్తవానికి బాహ్యంగా దగ్గరగా ఉండడం, సంబంధం కల్గి ఉన్నట్లు చిహ్నంగా లేదా ఒక ప్రత్యేక ఆనుకూల్యత లేదా త్వరిత అభివృద్ధికి సాధనంగా అనుభవమన్నది మోసుకెళ్ళదు. కొంతమంది శ్రీమాతను ప్రతిరోజూ చూస్తుంటారు. కొన్ని సంవత్సరాల క్రితం వారు ఉన్న దశ నుండి చాలాకొద్దిగానే పురోగతి చెందారు. కొంతమందిలో వారి ప్రాణిక అభ్యర్థనలు పెరగడం వలన అధ్వాన్నంగా ఉన్నారు. అలా గాకుండా శ్రీమాతకు కొంత సామీప్యంలో ఉంటూ చాలా తక్కువ సందర్భాలలో ఆమెకు సన్నిహితంగా వచ్చేవారు

ఆమె వల్లనే మార్గంలో ముందుకు పయనించి పురోగతి సాధించారు. నేను ఒక ఉదాహరణ కూడా ఇస్తాను. సంవత్సరంలో ఒకసారి మాత్రమే ఇంటర్వ్యూ లభించినప్పటికీ ఎవరూ సాధించని విధంగా, మరింత తీవ్రమైన పురోగతి లేదా ఎవరూ పొందని విధంగా ఉన్నతమైన, గాఢమైన, ప్రేమ బంధం, ఉత్సాహం కలిగిన వారు కూడా ఉన్నారు. వీటన్నింటిలో శ్రీమాత పట్ల ఆమెకు మార్గదర్శనం చేసే ప్రకాశం పట్ల సంపూర్ణ విశ్వాసం నిలుపుటయే ఉత్తమం.

మదర్ సమక్షంలో

శ్రీమాతను తరచుగా దర్శించుకునే వారు భాగ్యశీలురు. ఎందుకంటే ఆమెతో మాట్లాడటానికి ఆమె ఉనికిలో ఇంకా ఎక్కువ ప్రకాశాన్ని అందుకోవటానికి అవకాశం దొరుకుతుంది. అంతే కదా?

కాదు. అది పూర్తిగా మనిషి స్థితి మీద, అతని దృక్పథం మీద ఆధారపడి ఉంటుంది. విశేషంగా, ఆమెను దర్శించాలని వారు పట్టుబట్టినా, లేదా వారిని వెళ్ళమని ఆమె కోరినప్పటికీ అలాగే నిలిచి వున్నా, లేదా వారు చెడు భావములో ఉండి దానిని ఆమెపై వేసినా, ఆమెను దర్శించడం వారికి చాలా ప్రమాదకరం. ప్రతి ఒక్కరు శ్రీమాత తమకు ప్రసాదించిన దానితో సంతృప్తిగా ఉండాలి. ఎందుకంటే వారు దేనిని గ్రహించగలరు అన్నది ఆమె మాత్రమే తెలుసుకుంటారు. ఈ విధమైన మానసిక నిర్మాణాలు, ప్రాణసంబంధ అపేక్షలు ఎప్పటికీ అసత్యమైనవే.

*

ఎవరికైనా శ్రీమాతతో అతి సన్నిహిత ఆంతరిక అనుబంధం వుంటే, అతను శ్రీమాత తనకు దగ్గరగా, తనలోపల, తన చుట్టూ వున్నట్లుగా అనుభూతి చెందుతాడు, అప్పుడు దగ్గరగా వుండే భౌతిక అనుబంధం పై ఒత్తిడి వుండదు. ఇది లేనివారు దీనికొరకు ఆకాంక్షించాలి, ఇతరుల కారణంగా అత్యాశ పడకూడదు. ఒకవేళ వారు బాహ్య సన్నిహిత తత్వాన్ని పొందినా ఆంతరిక ఏకత లేనిదే దీనికి అర్థం లేదని తెలుసుకుంటారు. ఒక వ్యక్తి భౌతికంగా శ్రీమాతకు దగ్గరగా వున్నప్పటికీ ఆమెకు అతడు సహారా ఎడారంత దూరంగానూ వుండవచ్చు.

*

ఆంతరిక దృక్పథాన్ని నిలుపుకోవడము

సకల బాహ్య పరిస్థితుల నుండి విముక్తమై శ్రీమాతతో ఆంతరిక అనుబంధాన్ని స్థిరపరుచుకోవడం ముఖ్యం. ఇది మాత్రమే అవసరమైన సమస్తాన్ని తీసుకువస్తుంది. యోగంలో ప్రగాఢంగా వున్నవారంతా చాలామటుకు శ్రీమాతను భౌతికంగా దర్శించినవారు కాదు. ప్రణామము, సాయంత్ర ధ్యానములకు కాకుండా సంవత్సరంలో ఒక్కసారి ఆమె వద్దకు వచ్చేవారిలో ఆమెతో నిరంతర అనుబంధంతో వున్నవారు కొంతమంది వున్నారు.

*

మెట్ల దగ్గర శ్రీమాత గదులు చూడాలనే తీవ్ర కోరిక నాకు కలిగింది. ఎవరైనా కష్టంలో వున్నపుడు, "శ్రీమాత దగ్గరకు వెళ్ళాలని అడుగవచ్చును" అని ఎక్స్ అన్నాడు. కానీ శ్రీమాతకు దగ్గరగా రావటమన్నది ఆంతరిక గదులలో వుండాలి గానీ బాహ్యంలో కాదు. ఎందుకంటే ఆంతరిక గదులలో ఎప్పటికీ ప్రవేశముంటుంది, అక్కడే శాశ్వతంగా వుండే ఏర్పాటు చేసుకోవచ్చు.

*

భౌతిక దగ్గరితనం, కల్లోలము

నిజానికి ఎక్స్ లేదా ఇతర ఎవరి కష్టాలైనా వారు శ్రీమాత దగ్గరకు రావటం వల్ల లేదా రెండు, మూడు గంటలు ఆమె దగ్గర కూర్చోవడం వలన తొలగిపోవు. చాలామంది అలా వచ్చి చిన్నబుచ్చుకుని, నిరాశతో, తిరుగుబాటు ధోరణితో దూరమయ్యారు. శ్రీమాతను దర్శించిన వారిలో కొంతమంది తరచుగా నీవు ఉన్నంత చెడు సంక్షోభంలో వున్నవారు. శ్రీమాతతో ఎక్కువ మాట్లాడినవారు (ఇళ్ళు, మరమ్మత్తులు, పనివాళ్ళ గురించి) ఆమెను బాగా అర్థం చేసుకున్నారన్నది కూడ నిజం కాదు. తొలిరోజుల్లో కొంతమంది శ్రీమాతను ఇంకో రీతిలో చూచేవారు, అంటే అన్ని విధాలైన అంశాలను ఆమెతో మాట్లాడేవారు - కానీ వారు కూడ యథార్థంగా ఆమెను అర్థం చేసుకోలేదు. పదే పదే చెబుతున్నాను, ఇదంతా మానసిక నిర్మాణము, ఊహ కూర్పులు, ఇవి యథార్థాలకు సమంకావు. కేవలం అంతరంలో ఆమెకు తెరుచుకుని వుండటం వల్ల ఆమెతో వున్న అనుబంధ ప్రయోజనాన్ని పొందగల్గుతాము, భౌతికంగా కాదు, కేవలం ఆధ్యాత్మిక లేక ఆంతరిక అనుబంధం, అప్పుడు

ఆమె గురించిన ఒక ఆలోచన, లేదా ఆమె నుండి వచ్చిన ఒక ఆలోచన ఎటువంటి తప్పునైనా సరిచేయగలదు. అప్పుడు భౌతిక అనుబంధం కూడ పనిచేస్తుంది, కానీ అది అత్యావశ్యకమైనది కాదు. ఆమెను అర్థం చేసుకోవాలంటే కేవలం ఆధ్యాత్మిక చైతన్యంలోకి ప్రవేశించడం ద్వారా మాత్రమే అర్థం చేసుకోగలం, ఒకవేళ మనసులో అర్థం చేసుకోకపోయినా, వృద్ధిచెందే ఒక ఏకత ద్వారా ఆమె ఏమిటి అన్నది కనీసం అనుభూతి చెంది, ప్రతిస్పందిస్తాం.

*

ఒక ఆందోళనను విడిపించుకోవటానికి భౌతికంగా శ్రీమాత వద్దకు రావటం అనవసరం, నిష్ప్రయోజనం. నువ్వు ఈ సందర్భంలో చూసినట్లుగా ఆమెలో ఆశ్రయం తీసుకుని, తప్పుచలనాన్ని తోసివేయటం అంతరంలో జరగాలి. భౌతికంగా రావడమన్నది తప్పు చేసి ఆ తప్పును సరిదిద్దుకోవడానికి శ్రీమాత వద్దకు రావటమనే అలవాటును కల్పిస్తుంది, ఇది అంతరంలో త్యజించి, సమర్పించుకోవడానికి బదులు కష్టాన్ని ఆమె మీదకు తోసివేసే తప్పుడు చలనానికి కూడ దారితీస్తుంది. కానీ అవసరమైనది ఈ నిరర్థక విషయాలపై నిష్ప్రయోజనకర ఆందోళనలు, అహంకారాలు, తమ దృక్పథం గురించి వత్తిడిచేయడాలు, తమ పద్ధతి అనుసరించకపోతే, లేదా తన స్వతంత్రత, ప్రాముఖ్యతలకు తగిన గుర్తింపు లేకపోతే కోపము- వీటిని ఆపగల సాధారణ సమర్పణ అవసరాలు, తర్కాలు, కారణాలు, స్వీయ- సమర్థనల చేత విరూపమైన ఈ భావాలు క్రింద వుంటూ ఆశ్రమకార్యంలో సగం కన్నా ఎక్కువ కష్టాన్ని తెచ్చిపెడుతున్నాయి.

*

దివ్యప్రేమ విశ్వవ్యాప్తం

'దివ్యత్వానికి ఇష్టాఇష్టాలు ఉండవు' అనేది అందరూ అంగీకరించిన సత్యమే. ప్రత్యేక వ్యక్తిగత అనుబంధాలు ఉన్నప్పటికీ, అందరకూ అది సమానంగానే వర్తిస్తుంది. ఆత్మశుద్ధి ఉన్నవారు దివ్యాత్మకు ఎక్కువ సమీపంలో ఉంటారనేది యథార్థం. బాగా వికసించిన స్వభావం ఉంటే దివ్యపురుషుని చేరటానికి మార్గాలు అనేకం అందుబాటులో ఉంటాయి. అటువంటి తాదాత్మ్యత ఆధ్యాత్మిక ఏకత్వాన్ని కలిగిస్తుంది. వ్యక్తిగత సంబంధాలు అనేక

ఆగంతుకమైనవిగా భావించుకోవచ్చు. అది ఎలాంటి మూలకమయ్యుంటుంది అంటే అది దారిలో నిలిచిపోయినట్లుగా అనిపిస్తుంది. కానీ ఇప్పుడున్న బాహ్య రూపం, అది గతానికి చెందినది కాదు, ఇక భవిష్య పరిణామానికి చెందబోదు. అదిక అదృశ్యమన్నా అవ్వాలి లేక మారనన్నా మారాలి.

రూపుదాల్చటంలోని పరమార్థం

ఒక సందర్భంలో మీరిలా వ్రాశారు. 'శ్రీమాత సాన్నిధ్యాన్ని పొందిన వారంతా ఆమె బిడ్డలే. వారికి ఆమె హృదయంలో స్థానం ఉంటుంది. వారి మానసికం ఆమె ప్రభావం పొందటానికి సిద్ధంగా వికసించి ఉంటుంది. వారి ఇచ్ఛ శ్రీమాత ఇచ్ఛయే'. భౌతికంగా దగ్గరకి వచ్చిన వారు కాదు. నేను దీన్ని తిరస్కరించడం లేదు. కాని, శ్రీమాత కొందరు వ్యక్తులను మాత్రమే ఎందుకు ఎంపిక చేసుకుంటుంది అనేదే నా సందేహం. అదే సమయంలో మనం మాత్రం పుదుచ్చేరినే గమ్యంగా చేసుకుంటున్నాము.

ఆంతరంగిక సాన్నిహిత్యం ఎక్కడ ఉన్నా సాధించవచ్చు. దాని కోసం ప్రత్యేకంగా ఇక్కడకు రావలసిన అవసరమే లేదు. శ్రీమాత ఇక్కడి భౌతిక స్వభావానికి సంబంధించి శరీరం దాల్చారు. కాని కొందరు ఆమె కర్తవ్య నిర్వహణలో పాలుపంచుకోవాలని వారంతట వారే ఇక్కడకు వచ్చారు. మరికొందరిని ఆమెయే స్వయంగా పిలిపించుకున్నారు. ఇంకొందరు వెలుగును వెతుక్కుంటూ ఇక్కడకు వచ్చారు. అందరితో ఆమెకు వ్యక్తిగత బాంధవ్యం ఉన్నది. ఎవరి ప్రత్యేక స్థానం వారిదే. అందరినీ ఒకే గాటన కట్టాలనే ఆలోచన శ్రీమాతకు లేదు. అందరినీ ఆమె ఒకే విధంగా చూస్తుందని కూడా చెప్పలేము. వారు కూడా శ్రీమాత తమకే సన్నిహితంగా ఉండాలని కూడా భావించకూడదు. బాగా సన్నిహితంగా ఉన్నామనుకున్నామని అనుకునేవారిని కూడా ఆమె తరచుగా చూడలేరు. ఈ సంబంధం గణితానికి అందేది కాదు. శ్రీమాత చర్యలను భౌతిక మానసంతో అర్ధం చేసుకోలేము. భౌతిక మానసం యొక్క విలువలు, ఆలోచనలు ఆమెకు అవసరం లేదు. మన ప్రాణిక కోరికలూ, ఆమెకు చెందవు. నీ వ్యక్తిగత ప్రాణిక కోరికలు, అభీష్టాలతో ఆమె చేయాలనుకొనే దానిని కొలవడం దుర్భరం. ప్రతి విషయంలోనూ శ్రీమాత ఆయా పరిస్థితులకు తగినట్లు వ్యవహరిస్తుంది.

CWSA 32:483 — *శ్రీ అరవిందులు*

కారణాల వలన ఏర్పడే అవకాశం ఉంది. వాటన్నిటినీ ఒకే కారణంతో అర్థం చేసుకోవడం చాలా సంక్లిష్టం.

నిజమే! యోగుల్లోని అభివృద్ధి శ్రీమాత జోక్యంపై ఆధారపడి ఉండదు. ఆమెతో వ్యక్తిగత అనుబంధం ఉండాల్సిన అవసరం కూడా ఉండదు. దూరంగా వున్నా ఉండేది ఆధ్యాత్మిక అనుబంధమే. కొందరికి సాధనా కోణాల్లో శ్రీమాతతో ప్రత్యేక అనుబంధం ఉండవచ్చు. ఈ విషయంలో అనేక అవకాశాలు ఉంటాయి. సాధనలో వారికి పురోగతి లేక పోయినా సరే!!

కానీ, ఇక్కడకు వచ్చిన వారిలో ప్రతివారిలోనూ ఏదో రకమైన ఆంతరాత్మిక పరిణామం జరిగి ఉండటం కూడా అలాంటి అనుబంధానికి కారణం అవుతుంది. స్థూలంగా చెప్పాలంటే ప్రతి వ్యక్తిలోనూ మూడు విభాగాలు ప్రముఖంగా ద్యోతకం అవుతాయి.

1. చైత్య పురుష తన పరిణామంలో తన గత జన్మల అనుభవాలను, కొంత పూర్వ వ్యక్తిత్వాల సంస్కారాలను ప్రస్తుత జీవితంలో ఉపయోగార్థం తెచ్చుకొంటుంది.

2. ఈ పుట్టుక వలన చాలా సంక్లిష్ట కారణాలతో ప్రస్తుత రూపం రూపొందుతుంది. భవిష్య జీవి కోసం మన విషయంలో ప్రస్తుత అభివ్యక్తిని దాటి ఉన్నత చేతనా విధానాలు అనుసంధానింపబడటం ద్వారా రూపాంతరీకరణ సుసాధ్యమౌతుంది. చేపట్టిన కార్యం పూర్తవుతుంది.

3. చైత్య పురుష గత జన్మల లేదా వ్యక్తిత్వాల ద్వారా సంపర్కాన్ని కలగజేస్తుంది. అంటే తనలో దాచి ఉంచిన, ప్రస్తుతం సంభాళించవలసిన అత్యంత ముఖ్యమైన అంశాలు.

అదనంగా ఇక్కడకు దిగివచ్చే కొన్ని చైత్యపురుషలు అయితే ఊర్ధ్వ తలాలకు చెందిన జీవులకు ప్రాతినిధ్యం వహిస్తూ ఉన్నతంగా ఉన్న గొప్ప చేతనా విధానాలతో కలవడానికి సంసిద్ధంగా ఉంటాయి. అంచేత చాలా ప్రత్యేకంగా శ్రీమాతతో సమైక్యమయ్యి, చేయబడాల్సిన మహాకార్యానికి తగినట్లుగా ఉంటాయి. ఇవన్నీ శ్రీమాతతో గతజన్మకి సంబంధించి జతచేసే ప్రత్యేక సంబంధం కల్గి ఉంటాయి.

ఇప్పటి రూపానికి సంబంధించి, ఇది కొన్ని మూలకాలను సహజంగా కల్గి ఉండవచ్చు. అవి శ్రీమాతతో మేళవించకపోవచ్చు. వాటినవి

నేను నీతో ఉన్నాను

శ్రీమాత ప్రతి ఒక్కరికి అవసరమైన ప్రేమను ఎల్లప్పుడూ ఇస్తుంది.

*

నేను ఎల్లప్పుడూ నీ హృదయంలో ఉంటాను, చేతనతో నీలో నివసిస్తున్నాను.

*

నీ హృదయాన్ని తెరువు. నన్ను అక్కడ కనుగొంటావు.

*

అశాంతిగా ఉండకు, నిశ్శబ్దంగా ఏకాగ్రతతో ఉండు. నీ హృదయంలో నన్ను కనుగొంటావు.

*

దేవాలయం లోపలికి వెళ్ళు. అక్కడ నీవు నన్ను కనుగొంటావు.

*

ఆకాంక్షించే అన్ని ఆత్మలు ఎల్లప్పుడూ నా ప్రత్యక్ష సంరక్షణలో ఉంటాయి.

*

దివ్య జీవనంవైపుగా నిజాయితీ ఉన్న వారందరితో శ్రీమాత ఉంటుంది.

*

నేను ఎల్లప్పుడూ నీ దగ్గర, నీలో ఉంటాను. నా ఆశీస్సులు నీతో వస్తాయి.

*

మీ పనిలో, మీ సాధనలో, మీకు మార్గనిర్దేశం చేయడానికి, సహాయం చేయడానికి నేను ఎల్లప్పుడూ మీ మధ్య ఉంటానని నమ్మండి.

ప్రస్తుతానికి ముఖ్యమైన విషయం ఏమిటంటే, చేతన విస్తరణను, లోతును పెంపొందించుకోవడం. ఇది మీతో నా స్థిరమైన ఉనికిని అనుభూతి చెందడానికి మిమ్మల్ని అనుమతిస్తుంది. దానిని నిజమైన నిర్దిష్ట మార్గంలో అనుభూతి చెందడానికి ఇది మీకు నిశ్చల శాంతిని అందిస్తుంది.

*

నా స్థిరమైన ప్రేమ పూర్వక ఉనికిని గురించి అవగాహనను ఎల్లప్పుడూ కొనసాగించు. అంతా బాగా ఉంటుంది.

శ్రీ మాతారవిందుల ప్రేమ

మీరు ఎవరో ఏంటో మీ కంటే నాకుబాగా తెలుసు. మీరు మీ దిగువస్థాయి ప్రాణికం అని పిలిచే దాని వెనుక దాగివున్న సంపద నాకు తెలుసు. ప్రేమ నిస్వార్థమైనది, షరతులు లేనిది అని మీరు చెప్పేది ఒక్కటే నిజం. శ్రీ అరవిందులకు, నాకు మీ పట్ల ఉన్న ప్రేమ అలాంటిది.

అందుచేతనే మేము మీ అవాస్తవాలన్నింటినీ ఎప్పటికీ వినము, మిమ్మల్ని ఖచ్చితంగా ప్రేమిస్తాము.

భయపడకుండా నా దగ్గరకు రా నేను నిందించను, ఉరిమి చూడను.

శ్రీ అరవిందులు నీకు వ్రాసినది గుర్తుంచుకో. ఈ మానసిక స్థితులు వచ్చినప్పుడు శ్రీమాత నుండి ఎందుకు పారిపోతావు? దీనికి విరుద్ధంగా ఆమె వద్దకు రా. ఆమె సులభంగా నయం చేస్తుంది. ఇదీ ఆయన చెప్పిన సారాంశం.

*

నా బిడ్డలందరూ నాకు ఎప్పుడూ లేఖ వ్రాయకపోయినా నేను అందరినీ సమానంగా గుర్తుంచుకుంటాను, ప్రేమిస్తాను. అలాగే నేను స్వయంగా వ్రాయకపోయినా అన్ని హృదయపూర్వక ప్రార్థనలకు ఎల్లప్పుడూ సమాధానం లభిస్తుంది. కాబట్టి బాధపడకుండా ఉల్లాసంగా ఉండు.

*

ఎల్లప్పుడూ, ప్రతి క్షణం, ఎవరో ఒకరు పిలుస్తున్నారని దానికి మీరు సమాధానం ఇస్తున్నారని నేను అనుకుంటున్నాను. ఇది మీ నిద్రకు లేదా మీ విశ్రాంతికి భంగం కలిగించలేదా?

*

పగలు రాత్రి వందల కొద్దీ పిలుపులు వస్తున్నాయి. కానీ చేతన ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటుంది. సమాధానం ఇస్తుంది.

ఎవరైనా కేవలం పదార్థ పరంగా మాత్రమే కాలానికి, స్థలానికి పరిమితం చేయబడతారు.

*

నిజమైన వేర్పాటు లేదు

నేను నిన్ను చూసినా చూడకపోయినా సహాయానికి తేడా లేదు. అది ఎప్పుడూ ఉంటుంది.

*

నీవు నీ మనస్సు నుండి రెండు అసత్యాలను తొలగించాలి.

1. నీవు నా నుండి పొందే వాటికి ఇతరుల వద్దనున్న లేదా లేని వాటికి ఎటువంటి సంబంధం లేదు. నీతో నా సంబంధం నీ మీద మాత్రమే ఆధారపడి ఉంది. నీ నిజమైన అవసరం, సామర్థ్యం ప్రకారం నేను నీకు ఇస్తాను.

ఇక్కడ కూడా, ఇప్పటికే నీవు నాతో ఒంటరిగా ఉన్నావు. ఇక ఇతరులు లేకపోవడంతో అదనంగా ఏమీ తీసుకోలేవు.

2. పురోగతికి భౌతిక సామీప్యత అనివార్యమని భావించడం చాలా తప్పు. నీవు అంతర్గత సంపర్కాన్ని ఏర్పరచుకోకపోతే అది నీకు ఏమీ చేయదు. ఎందుకంటే అది లేకుండా నీవు ఉదయం నుండి రాత్రి వరకు నాతో ఉన్నా నీవు నన్ను నిజంగా కలవలేవు. నీవు నా ఉనికిని గ్రహించగలిగేది అంతర్గత ఉన్మీలనం, సంపర్కం ద్వారా మాత్రమే.

*

కొన్ని ఆలోచనలు, కొన్ని భావాలు, కొన్ని చర్యలు వ్యక్తులను నా నుండి దూరం చేస్తాయి లేదా శారీరక సామీప్యత ఉన్నప్పటికీ వారికి నాకు దూరం పెరుగుతుంది అని చెప్పడం మరింత నిజం.

*

మేము మీ సన్నిధి నుండి వేరు చేయబడినట్లు భావిస్తున్నాము; అయితే ఈ ఎడబాటు భ్రమ మాత్రమే కదా శ్రీమాతా?

నిజమైన వేర్పాటు లేదు, కానీ చేతన తప్పుడు వైఖరిని తీసుకుంటే, అది తనను తాను విభజన అనుభూతిని కలిగి ఉన్న స్థితిలో మిమ్మల్ని ఉంచుతుంది.

*

మీతో శారీరక సంబంధం అనివార్యమా?

లేదు, ఈ భౌతిక సంబంధం అనివార్యం కాదు. ఖచ్చితంగా నిజమైన దృక్పథం ఉన్న వారికి, శారీరక సాన్నిధ్యం, సంబంధం శరీరానికి రూపాంతీకరణ

గతిని అనుసరించడానికి సహాయపడుతుంది. కానీ శరీరం దాని ద్వారా లాభపడే స్థితిలో చాలా అరుదుగా ఉంటుంది. సాధారణంగా పుట్టినరోజులలో ఇది ఎక్కువగా స్వీకరించబడుతుంది.

నిజమైన సంబంధం

ఇంక నేను క్రియోన్ముఖమైన జీవితాన్ని గడపను; అని అనుకొని నీవు స్వీకరించడానికి సిద్ధంగా ఉంటే, సహాయం ఖచ్చితంగా వస్తుంది.

*

మీ అందరిలో ద్వారం తెరవడానికై నేనెంతో శ్రద్ధ వహిస్తున్నాను. కాబట్టి మీలో మీరు ఒక చిన్నపాటి శ్రద్ధాపూర్వక ప్రయత్నం చేసినట్లయితే, ఆ మూసుకొని వున్న తలుపుల దగ్గర కూర్చొని దాన్ని తెరిచే తాళంచెవి మీ వద్ద లేక, తెరవడం తెలియక కాలాల తరబడి పడిగాపులు కాయవలసిన పని లేదు.

తలుపు తెరిచి ఉంది. మీరు ఆ వైపు మాత్రమే చూడాలి. మీరు దాని నుండి వెనుదిరగకూడదు.

*

నేను ఎవరికీ గురువుగా ఉండాలని కోరుకోవడం లేదు. నేను అందరికీ తల్లిగా ప్రేమ, శక్తి ద్వారా వారిని నిశ్శబ్దంగా ముందుకు తీసుకువెళ్లడం నాకు చాలా సహజంగా అనిపిస్తుంది.

*

మీతో నా బంధాన్ని మీరు ఎలా ఊహించుకుంటారు?

*

నీవు విశ్వమాతకు బిడ్డవు కాదా?

నేను ఎవరినైనా అనుమతించాను అని చెప్పినప్పుడు ఆ వ్యక్తికి శబ్దాలతో పని లేకుండా నన్ను నేను ప్రకటించుకొంటాను. దాంతో అతను నేనేమిటో చూడగలడు, అనుభూతి చెందగలడు, తెలుసుకోగలడు.

నేనునీవే

నేను నీతోనే ఉన్నాను అన్ని స్థాయిలలోనూ, అన్నితలాలలోనూ పరమోత్తమ చైతన్యము నుండి నా సంపూర్ణ భౌతిక చేతన వరకు. ఇక్కడ పాండిచ్చేరిలో నా చైతన్యం లేకుండా నీవు శ్వాస తీసుకోలేవు (నా చైతన్యం నీ శ్వాసలో భాగమైపోయింది).

ఇక్కడ పదార్థంలో నా చైతన్యం సంపూర్ణంగా నిండి ఉంది, సూక్ష్మ భౌతికంలో కూడా అది నిండి ఉంది, ఇక్కడ నుండి సరస్సు వరకు అంటే ఇక్కడి నుండి పది కిలోమీటర్ల దూరం.

అంతేకాక నా చైతన్యం భౌతిక ప్రాణికంలో కూడా అనుభూతి చెందవచ్చు. అలాగే మానసికతలంలో అలాగే ఇతర ఉన్నత తలాలలోకూడా.

నేను ఇచ్చటకు మొట్టమొదటిసారి వచ్చినప్పుడు ఈ వాతావరణంలో శ్రీఅరవిందుల వారిని అనుభూతి చెందాను, భౌతికంగా పదిమైళ్ళదూరం వరకు, పదినాటికల్ మైళ్ళదూరం, కిలో మీటర్లు కాదు.

అది ఉన్నట్టుండి చాలా బలంగా స్వచ్ఛమైన, తేజోవంతమైన ప్రకాశం, ఆ ప్రకాశం నిన్ను ఉద్ధరిస్తుంది.

శ్రీ అరవిందులు చాలాకాలం క్రితమే ఈ సందేశం ఆశ్రమమంతటా ఏర్పాటు చేయడం జరిగింది. "ఎల్లప్పుడూ శ్రీమాత మిమ్మల్ని చూస్తూ ఉన్నారు అని గుర్తుంచుకుని ప్రవర్తించండి, ఎందుకంటే ఆమె నిజంగానే అన్ని వేళలా ఇక్కడ ఉన్నారు."

ఇది కేవలం ఒకచిన్న వాక్యమో లేక కొన్ని పదాలో కాదు ఇది వాస్తవం. నేను మీతో చాలా బలమైన ఉనికిగా ఉన్నాను, ఎవరికైతే సూక్ష్మదృష్టి ఉన్నదో వారు నన్ను చూడగలరు.

సాధారణంగా నా శక్తి నిరంతరాయంగా పనిచేస్తూనే ఉంది. మీలోని మానసిక అంశాలను మారుస్తూ వాటిని కొత్త సంబంధాలలో ఉంచుతూ మీ స్వభావంలో వివిధ పార్శ్వాలను మీకుతెలియచేస్తూ ఉన్నాను. అలా మీలో ఏది మార్పుచెందాలో, అభివృద్ధిచెందాలో, దేనిని తిరస్కరించాలో మీకుతెలుస్తుంది.

అదేకాకుండా మీకు నాకు ఒక ప్రత్యేకమయిన వ్యక్తిగత అనుబంధం కూడా ఉంది. ఇంకా శ్రీఅరవిందుల మరియు నా బోధనవైపుగా తిరిగిన వారందరికీ కూడా అలాగే బాగా అర్థంచేసుకోవాలసిన విషయం ఏమిటంటే

ఇక్కడ భౌతికదూరంతో సంబంధంలేకుండా, నువ్వెక్కడైన ఉండు ఫ్రాన్స్‌లో కాని, ఈ ప్రపంచానికి ఇంకొక మూలలో ఉన్నా సరే లేదా పాండిచ్చేరిలో ఉన్నా సరే, ఈ అనుబంధం ఎల్లప్పుడూ సజీవంగా వాస్తవంగా ఉంటుంది. ఇంకా ప్రతిసారి నాకు ఒక పిలుపువచ్చినప్పుడు, నాశక్తిని వారికి అందించ వలసిన అవసరంఉందేమో చూసి నాశక్తిని గాని, ప్రేరణకానీ, రక్షణకానీ.. ఇంకేదైనా కానీ వారినుండి వార్త వచ్చిన వెంటనే అందించడం జరుగుతుంది. ఇలాంటి సందేశాలు ఎటువంటి సమయంలో అయినా రావచ్చు. మీరు నన్ను పలుసార్లు ఏదైనా పనిచేసేటప్పుడో మాట్లాడేటప్పుడో మధ్యలో ఆగిపోవడం చూసే ఉంటారు. అది ఎందుకంటే ఏదో ఒక సందేశం వచ్చినపుడు నేను దానిపై నా దృష్టిని ఏకాగ్రం చేసి ఉంచడం వలన.

ఎవరినైతే నా శిష్యులుగా అంగీకరించానో, ఎవరికైతే నేను అంగీకారం తెలియయపరిచానో వారితో నాకు సాధారణమైన అనుబంధం కంటే అమితమైన, అంటే నా ప్రతిరూపం వారిలో ఉంటుంది. అది అవసరం అయినప్పుడు నన్ను హెచ్చరించి అక్కడ ఏం జరుగుతోందో నాకు తెలియ పరుస్తుంది. నిజానికి నాకు ఇటువంటి సందేశాలు నిరంతరం వస్తూనే ఉంటాయి, అయితే అవి నా స్మృతిలో అన్ని సార్లు నిలిచిపోకుండా అలావచ్చి వెళ్లిపోతూ ఉంటాయి. నాభౌతిక చేతన ఒక ఫిల్టర్‌గా నిలిచి అన్ని విషయాలు అందులోకి ప్రవేశించకుండా అడ్డుకుంటుంది. సూక్ష్మతలంలో అవి నిక్షిప్తం కాబడి అవసరం అయినప్పుడు నా భౌతిక చేతనలోకి అవి తిరిగి ప్రవేశించడం జరుగుతుంది. అప్పుడునేను ఆ వివరాలు గ్రహించి, అవి చివరికి ఎలా పరిణమించాయో, చివరికి ఏ ఫలితం కలిగిందో తెలుసుకొంటాను. ఇంకెప్పుడైనా ఏదోఒక కారణంచేత నాకు మీరు నా సహాయం కోరుతూ ఉత్తరం రాసినప్పుడు "నేను మీతో ఉన్నాను" అనేసమాధానం ఇస్తాను. అప్పుడు మీతో సమాచార సంబంధం సక్రియమౌతుంది. నీవు నా సక్రియ చేతనలోకి కొద్దికాలంపాటు, అవసరమైనంత కాలం వస్తావు, ఉంటావు.

అలా మీకు నాకు ఉన్న అనుబంధం ఎప్పటికీ తెగిపోకుండా ఉంటుంది. కొంతమంది ఎప్పుడో ఆశ్రమం విడిచి వెళ్ళిపోయి చాలాకాలం గడిచిపోయినా, ఒకనిరసనతో కూడిన మనసుతో వెళ్ళిపోయినాసరే, వాళ్ళ గురించి నాకు సమాచారం ఉంటుంది, వారికి నేను అందుబాటులో ఉంటాను. మిమ్మల్ని నేను ఎప్పుడు వదిలిపెట్టకుండా మీ వెంటనే ఉంటాను.

విశ్వాసానికున్న శక్తి

నిజానికి, ప్రతిఒక్కరి పట్ల నాకు బాధ్యత ఉంది అని నేను అనుకుంటాను. నాకు క్షణకాలం మాత్రమే తారసపడినా సరే. ఎప్పుడూ ఒక విషయం గుర్తుంచుకో. వారు వారి జీవితంలో శ్రీఅరవిందులు, నేను ఒక్కటే చైతన్యం, ఒక్కటే వ్యక్తికూడా. ఎప్పుడైతే రెండూ ఒకటేయైన ఈ శక్తికానీ ఈ ఉనికికానీ, నీవ్యక్తిగత చేతనలో ప్రవేశించినప్పుడు అది నీ అభిరుచికి, నీ ఆకాంక్షకు, నీఅవసరానికి, నీ స్వభావానికి అనుగుణంగా తన రూపం మార్చుకుంటుంది. నీవ్యక్తిగత చేతన ఒకఫిల్టర్ లేదా ఒక నిర్దిష్టమైన బిందువు అనుకుంటే అది అనంతమైన దివ్యవ్యక్తీకరణాలలో నుండి ఒక వ్యక్తీకరణను ఎంచుకుని పొందడం జరుగుతుంది.

నిజానికి దైవం ఒక్కొక్క వ్యక్తికి వారి ఆపేక్షకు అనుగుణంగా నిర్దిష్టంగా ఇవ్వడం జరుగుతుంది. నీవు గనక దైవాన్ని దూరమైనవానిగా క్రూరంగా ఊహించుకుంటే, దైవం అలాగే దూరంగా క్రూరంగా ఉంటాడు, ఎందుకంటే అలా ఉంటే ఆయన ఆగ్రహానికి గురికాగలుగుతావు. అదినీకు మంచిదికూడా. కాళీమాతను పూజించేవారికి ఆయనకాళీ. భక్తుడికి అది కృపారూపంలో ఉంటుంది. జిజ్ఞాసువులకు ఆయన సమస్త జ్ఞానం. ఈ లోకం భ్రమ అని తలిచేవారికి ఆయన అతీత నిర్గుణసత్తా. నాస్తికులకు నాస్తికుడు, ప్రేమికులకు ప్రేమ, సహోదరుడు మరియు దగ్గరివాడు, విశ్వాసపాత్రమైన స్నేహితుడు. తమ ఆంతరిక మార్గదర్శి అని భావించే వారికి ఆయన అన్ని వేళలా ప్రతిక్షణం స్వాంతన అందించేవాడు. అలాగే ఆయన అన్నీ లయం చేసే వానిగా తలిస్తే ఆయన నీలోని అవలక్షణాలను, పొరపాట్లను అలుపు లేకుండా తొలగిస్తూనే ఉంటాడు, నీవు అతని అనంతకృపను అనుభూతి చెందుతావు.

దైవం అంటే నిజానికి నీలోతైన ఆకాంక్షలో అతనిగురించిన ఆపేక్ష ఏదైతే ఉందో అదే. ఎక్కడైతే నీవు సమస్త విషయాలను ఒక్క చూపులో చూడగలవో, అటువంటి చేతనలో నీవు ప్రవేశించినపుడు అలాగే అనంతమైన, అనేకమైన దైవానికి మానవునికి మధ్య సంబంధాలు చూడగలవో అప్పుడు నీవు అదంతా ఎంత అద్భుతమైన విషయమో దాని ప్రతి అంశంలో అదెంత అద్భుతమో నీవు చూడగలవు. మానవ చరిత్రను నీవు చూసినట్లయితే ఎలా దైవం అనేది మానవుని అవగాహన, కోరికలు, ఆకాంక్షలు, స్వప్నాలకు అనుగుణంగా

పరిణామం చెందుతూ ఉంది అనేది నీకు తెలుస్తుంది. దైవం భౌతికవాదులతో భౌతికవాదిగా ఉంటూ, ఇంకా మానవ చైతన్యం విశాలమయ్యే కొద్దీ దినదినం ఎదుగుతూ దగ్గరవుతూ ప్రకాశమానమవుతూ ఉంటాడు. ప్రతిమనిషి తన ఇష్టానుసారంగా దైవాన్ని ఎంచుకోవచ్చు. మానవచరిత్రలోని దైవానికి మానవునికి మధ్య ఉండే అంతులేని సంబంధాలు వాటి పరిపూర్ణత నిజంగా గొప్ప వర్ణించలేని అద్భుతం, అయినా అదంతా కూడా దైవం యొక్క అభివ్యక్తితో ఒక క్షణంతో కూడా సమానం కాదు. కాబట్టి దైవం నీ ఆకాంక్షకు అనుగుణంగా నీతో ఉంటాడు. అలాగని నీ బాహ్యప్రకృతిలోని పోకడలకు ఆయన తలవంచవలసిన అవసరం లేదు. ఇక్కడ నీసత్తాలోని వాస్తవికత గురించి నేను మాట్లాడుతున్నాను. అయినా కొన్ని సార్లు నీ బాహ్య ఆకాంక్షలను అనుసరించి ఆయన తనని మార్చుకోగలడు. తన భక్తులకు వలెనే కొన్నిమార్లు వేరుగా ఒకటిగా, ఆనందం, నిరాశతో. భగవంతుడు కొన్ని సార్లు నీకు వేరుగా ఒకటిగా, నీవెలా నమ్మితే అలా. అందువల్ల నీ వైఖరి అనేది చాలా ముఖ్యమైన విషయం, బాహ్యమైన వైఖరి కూడా. నమ్మకం, విశ్వాసం అనేది ఎంత ప్రాముఖ్యత కలిగిన విషయమో సామాన్యజనులకు తెలియదు. విశ్వాసం అనేది ఒకఅద్భుతమైన విషయం. అది అనేక అద్భుతాలను సృష్టిస్తుందికూడా. నీవు గనక ప్రతి క్షణము ఎదగాలని అనుకుంటే, దైవానికి దగ్గర కాదలచుకొంటే ఆయన తప్పకుండా నిన్ను పైకెత్తి అక్కడ నీకు ఇంకా దగ్గరగా మరింత దగ్గరగా, ఎప్పటికీ దగ్గరగా ఉంటాడు.

CWM : 13 — శ్రీమాత

Vol. 53, No. 6
June 2023

Date of Publication
1st June 2023

Registered: PY/41/2021-23

AKHILA - Akhila Bharata Patrika (Telugu)

Registered with the Registrar of Newspapers for India: No. 23593/72 (monthly)

Matter shall reveal the Spirit's face. — Sri Aurobindo



Cover page painting by:
Priti Ghosh

Owner: Sri Aurobindo Society
Printer: Swadhin Chatterjee for Sri Aurobindo Ashram press
Publisher: Pradeep Narang for Sri Aurobindo Society
Published from: Society House, 11 Saint Martin Street, Puducherry - 605001
Printed from: Sri Aurobindo Ashram Press,
No. 38, Goubert Avenue, Puducherry - 605 001, India
Editor: K. V. Rao

Single copy Rs. 30 **Annual Subscription Rs. 200 (in India)**


A Monthly Published by

SRI AUROBINDO SOCIETY-605001

అఖిల

అఖిల భారత పత్రిక

జూలై 2023



నిరాశ చెందకెన్నడూ


విషయ సూచిక



సంపాదకీయం :

నిరాశలో నిండుగా మునిగిపోయినట్లు, వినాశనపుటంచుకు ఈడ్చుకు పోబడినట్లు, సమస్తాన్నీ కోల్పోయినట్లు అన్పించే క్షణాలు జీవితంలో సంప్రాప్తిస్తాయి. సర్వకాల సర్వావస్థలలోనూ మనకు ఆశ కల్పిస్తూండే, ధైర్యాన్ని పాదుకొల్పే, మార్గనిర్దేశం చేసే, దిశానిర్దేశం చేసే, మన స్వీయ అత్యున్నత సంభావ్యతను ఆవిష్కరించుకొనేందుకు సహాయం చేసే దివ్య వెలుగును మహాబలాన్నిచ్చే దీపాన్నెత్తి పట్టుకొని చూపిస్తున్నట్లుండే ప్రకాశమయ, స్ఫూర్తిదాయకమైన శ్రీ అరవిందుల, ది మదర్ పలుకుల నుండి ప్రోదిచేయగా తయారైనదీ సంచిక.

అనువాదం : కె.వి. రావు



నీవు ఒంటరివి కాదని ఎప్పుడూ మరచిపోవద్దు. దైవం నీకు సాయం చేస్తూ, నిన్నునడిపిస్తూ నీతోనే ఉంటాడు. ఆయన నిన్నెప్పుడూ వీడని నేస్తం. ఆయనప్రేమ నిన్ను సేదతీర్చి నీకు శక్తినిస్తుంది. నీవు ఎంతో ఒంటరిగా అనుభూతి చెందినపుడల్లా మరింతగా ఆయన తేజోమయ రూపాన్ని దర్శించటానికి సంసిద్ధమౌతావు. నమ్మకం కలిగి ఉండు. ఆయన నీ కోసం అన్నీచేసి పెడతాడు.

CWM 14:9

శ్రీమాత

శ్రీ అరవిందుల సుభాషితాలు

ఈ ఆలయంలోకి అందరూ ప్రవేశించవచ్చు

మన అందరిలో సమానంగా వున్న భగవంతుని ఉనికి వలన మరే ఇతర ప్రాథమిక నిబంధనలూ ఉండవు. ఒకసారి విశ్వాసము నిజాయితీలతో ప్రధానమయిన పరిపూర్ణతతో సమగ్రమయిన ఆత్మ నివేదన జరిగిన తరువాత మన అందరిలో సమానంగా వున్న భగవంతుని ఉనికి వలన మరే యితర ప్రాథమిక నిబంధనలూ ఉండవు. అందరికీ ఈ ద్వారం అందుబాటులో ఉంది. అందరూ ఈ ఆలయంలోకి ప్రవేశించవచ్చు. సర్వ ప్రేమికుని భవనంలో మన ప్రాపంచికమయిన వ్యత్యాసాలు అదృశ్యమయి పోతాయి. అక్కడ సద్గుణ సంపన్నులకేవిధమయిన ప్రాధాన్యత ఉండదు. అలానే పాపాత్ములు దైవసన్నిధి నుండి వేరుచేయబడరు. శాస్త్ర విధులతో పవిత్రంగా జీవించే బ్రాహ్మణుడు, కష్టంలో, శాపంలో జన్మించి జనులచే తిరస్కరించ బడిన ఛండాలుడయినా ఈ మార్గంలో ప్రయాణించి, పరమ మోక్షానికి, శాశ్వతుని సర్వోన్నత స్థాయిలో వసించడానికి సమానమయిన, తెరచి ఉన్న అవకాశాన్ని కలిగి ఉంటాడు. పురుషుడైనా, స్త్రీ అయినా భగవంతుని ముందు సమానమయిన హక్కును కలిగి ఉంటారు. ఎందుకంటే పరమాత్మ వ్యక్తులు, సాంఘికమయిన వ్యత్యాసాలు, కట్టుబాట్లను గౌరవించడు. అందరూ ఆయన వద్దకు ఏ మధ్యవర్తిత్వం లేదా బంధాలు లేకుండా వెళ్ళవచ్చు. "ఎంత దుర్మార్గుడయినా ఒక వ్యక్తి ఏకోన్ముఖమైన, పరిపూర్ణమయిన ప్రేమతో నావైపు తిరిగినట్లయితే అతనిని ఒక మహాత్మునిగా భావించాలి. ఎందుకంటే అతనిలో స్థిరపడిన ప్రయత్న సంకల్పం సరియైన, సంపూర్ణమయిన సంకల్పం చేత శీఘ్రంగా అతను ఋజువర్తనపు వ్యక్తిగా మారి శాశ్వతమయిన శాంతిని పొందుతాడు" అని ఆ దివ్యగురువు అంటాడు. వేరే మాటలలో చెప్పాలంటే సంపూర్ణ ఆత్మ నివేదనా సంకల్పం పరమాత్మకు అన్ని ద్వారాలను విశాలంగా తెరచి ప్రతిస్పందనను, సంపూర్ణమయిన అవతరణను, మానవునికి దైవ ఆత్మ నివేదననూ తీసుకు వస్తుంది. అది తక్షణమే మనలోని అన్నిటినీ సరిదిద్ది, దివ్యమైన ఉనికి ధర్మంలోకి జీర్ణించుకుని, నిమ్న ప్రకృతిని ఆధ్యాత్మిక ప్రకృతిగా వేగవంతంగా రూపాంతరీకరిస్తుంది. ఆత్మ నివేదనా సంకల్పం

తన శక్తితో భగవంతునికీ, మనిషికీ మధ్య వున్న తెరను తొలగిస్తుంది. అది అన్ని పొరపాట్లను, ప్రతిబంధనాలను తుడిచి వేస్తుంది.

CWSA 19:334-35

ఏ విధంగా ఎక్కడి నుండి వచ్చినప్పటికీ క్రుంగుబాటు కలిగినపుడు చేయవలసినదల్లా దానిని విసిరి వేయటమే.

CWSA 31:186 *శ్రీ అరవిందులు*

ప్రాణిక అసంతృప్తి

ఎందుకంటే ప్రాణికం ఎక్కువగా తన కోర్కెల గుప్పిట్లో చిక్కి ఉంటుంది. మనసు అదుపు లేకుండా, వేరుగా తన కార్యక్రమాలను కొనసాగిస్తున్నపుడు అది చిందులు వేసి కేకలు పెడుతుంది. మనో సంకల్పంతో అణచి దాని స్థానంలో ఉంచినపుడు అది మానవ ప్రాణికపు సాధారణమైన నడవడి.

ప్రతిఘటించే అంశంలో మార్పు కోసం పిలుపు పట్ల అసంతృప్తి వలన కలిగిన ఊగిసలాట. ఎప్పుడైతే ఏ ప్రాణిక అంశమయినా నిరుత్సాహము, అసంతృప్తికి లోనయినపుడు మార్పుకై పిలిచినా, ఒత్తిడి చేసినా ప్రాణికం అందుకు సుముఖంగా లేనపుడు స్పందించకపోవటం లేదా సహకరించక పోవటమనే ధోరణిని కలిగి ఉండి భౌతిక చేతనను స్తబ్దంగా లేదా ప్రాణిక స్ఫూర్తి లేకుండా చేస్తుంది. అంతరాత్మ ఒత్తిడితో ఈ ప్రతిబంధకం తొలగిపోతుంది.

*

రెండు పరిస్థితులలో ప్రాణికం ఆ విధంగా వ్యవహరిస్తుంది. (సహకరించ కుండా) **(1)** ఎప్పుడైతే తన సాధారణ (అహంకార పూరిత) చేతలు లేదా పనుల వెనుక ఉద్దేశ్యాలు అనుమతించబడనపుడు **(2)** లేదా ఒక వ్యక్తి బాగా భౌతిక చేతనలో క్రిందకు దిగినపుడు ప్రాణిక చేతన కొన్ని సార్లు లేదా కొంత సమయం వరకూ జడమై పోతుంది. పైనుండి శక్తి పని చేయనంత వరకూ లేదా పని చేయడం ప్రారంభించేంత వరకు.

*

తమస్సు లేదా జడత్వం వ్యవస్థపై వాలినట్లు ఉంటుంది. ప్రాణికం పరిస్థితులతో లేదా అంతవరకు సాధించిన దానితో అసంతృప్తి చెందినపుడొక

విధమైన సహాయ నిరాకరణ ధోరణిని కలిగి ఉంటుంది లేదా ఉదాసీనంగా ప్రతిఘటిస్తుంది. నేను తృప్తి చెందలేదు కనుక నేను ఎందులోనూ ఆసక్తి తీసుకోను లేదా మీకు ఏ విషయంలోనూ సాయం చెయ్యను అంటుంది.

*

ఈ ప్రాణిక అసంతృప్తికి ఒకటే వైద్యమేమిటంటే తిరస్కరించడం. ప్రాణికంతో ఏం కావటానికైనా నిరాకరించడం. జడత్వానికి మందు ఏమిటంటే, దాని గురించిన ఆలోచనలలో మీరు మునిగిపోకుండా ఊర్ధ్వముఖులై ప్రకాశ శక్తులను దానిలోకి ఆహ్వానించాలి.

CWSA 31:138-40

వెనుకకు తగ్గి నిలబడటం

బాధ, ఆరాటం, భయం అనే భావాల నుండి వెనుకకు తిరిగి, దానిని తిరస్కరించి, ప్రశాంతంగా దాని ప్రతిఘటనను ఆలోకించండి. ఎల్లప్పుడూ మార్పు చెందాలనే మీ సంకల్పాన్ని సమర్థించుకుంటూ, ఒత్తిడి చేస్తూ, దైవ సహాయం వలన యిప్పుడు లేదా తరువాత అయినా విఫలం కాకూడదని భావించండి. ఎందుకంటే భగవంతుని సాయం అక్కడ ఉంది. అప్పుడే కష్టాలను అధిగమించే శక్తి మీకు కలుగుతుంది.

*

అన్ని మానవ ప్రకృతులలోను అది ఒక గుణం. అశాంతి, కోరుకోవటం, ఆతురత, నిరాశ, చాంచల్యం నుండి వెనుకకు, నిలబడి మిమ్మల్ని అది పరిపాలించడానికి, నడిపించడానికి అనుమతించవద్దు. ప్రాణికంలో ఒక సరియైన అంశముంటుంది. దానిని ఉపయోగించాలి. అది తీవ్రము, ఉన్నతమయిన విషయాలకు స్పందించగలిగి, మహత్తరమైన భక్తి ప్రేమలకు, సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. దానిని బలపరచి అంతరాత్మలో పైనుండి దిగివచ్చే శాంతి, విశాలతల ఆధారం కల్పించాలి.

CWSA 31:141-143

ఉత్సాహము - ఆనందము

ఉత్సాహంగా ఉండటం సాధనకు లవణం లాంటిది. విచారంగా ఉండడం కన్నా అది వెయ్యిరెట్లు ఉత్తమం.

మరింత ఉత్సాహంగా, ఆత్మ విశ్వాసంతో ఉండు. లింగభేదం, అనుమానం మరియు మిగిలివన్నీ ఉన్నాయి. అనుమానం లేదు ఎందుకంటే అక్కడ భగవంతుడు కూడా నీలో ఉన్నాడు. కళ్ళు తెరచి చూడు. తెరలు తొలగిపోతాయి. ఆయనను లేదా ఆమెను చూడగలిగే వరకు చూడు.

*

ఆనందంగా ఉత్సాహంగా ఉండటమనేది ఆధ్యాత్మికంగా తప్పేమీ కాదు. అందుకు విరుద్ధంగా నిజానికి అలా ఉండటమే సరైన పద్ధతి. పోరాటాలు, ఆకాంక్షకు సంబంధించి, ప్రగతి చెందటానికి పోరాటమనేది నిజంగా తప్పని సరి కాదు. కొంతమంది ఈ పోరాటమనే వైఖరికి ఎంత అలవాటు పడిపోతారంటే, వాళ్లెప్పుడు మరి యితరమైనదేదీ లేకుండా పోరాడుతూనే ఉంటారు. అది కోరుకోదగినది కాదు. ఒక రవి తేజ ప్రకాశిత మార్గముంది. మరొకటి విచారణా భరిత మార్గమూ ఉంది. రెంటిలో ఎక్కడయినా వ్యక్తి శ్రీమాతపై సంపూర్ణమయిన నమ్మకంతో దేనికీ భయపడకుండా, దేనికీ దుఃఖించకుండా ముందుకు వెళతాడో అదే ఉత్తమమయినది. ఆకాంక్ష అవసరమే కానీ అది కూడా సూర్యునిచే వెలిగించబడిన ఆకాంక్ష. తేజస్సు, విశ్వాసం, భరోసా, ఆనందంతో నిండి ఉంటుంది. అప్పుడు కష్టం వచ్చినా దానిని కూడా చిరునవ్వుతో ఎదుర్కోవచ్చు.

*

ఎప్పుడూ మీలో ఆ ఉల్లాసం ఉండాలనే మేం కోరుకుంటాం. అది చైత్య పురుష ఆనందం. అది తన మార్గాన్ని తెరుచుకుని వస్తుంది. ఎన్ని కష్టాలు వచ్చినా తాను ముందుకు నడిపించబడుతుందనీ, గమ్యాన్ని చేరుకుంటుందనీ తనకు ఖచ్చితంగా తెలుసు. ఒకసాధకునికి నిరంతర మాస్థితి కలిగినపుడు అతను అధమమైన యిబ్బందులను దాటి భద్రమైన మార్గంలో నిలకడగా సాగిపోగలడు.

*

ఉత్సాహం (సరదాగా, ఉల్లాసంగా ఉండటం) చాలా ముఖ్యం. అది ఉండకూడదని నేననను. కానీ మరొక లోతైన ఉత్సాహం అంతరమైన సుఖ హాస్యం ఉన్నాయి. ఏవయితే ఉత్సాహానికి చెందిన ఆధ్యాత్మిక స్థితి అయి ఉన్నాయో అవి.

*

విచారం - బాధ

విచిత్రమయిన విషయమేమిటంటే నా యోగంలో విచారం, దుఃఖాలను పరిగణించక పోవటం లేదా ఒడిదుడుకులు, కష్టాలను గంభీరంగా తీసుకోవడం కానీ తాపసులు లేదా వైష్ణవుల విరహంలా లేదా మాయావాదుల వైరాగ్యంలా పాత అభిప్రాయాలు, శక్తులూ, సాధకుల మనసుల ద్వారా వచ్చి ఆశ్రమంలో చేరుతుంటాయి. సరే!

*

నీలో ఏదయితే బాధలను కోరుకుని వాటిని ఆస్వాదిస్తుందో అది మానవ ప్రాణికం. దీనినే మనం నిజాయితీ రాహిత్యమనీ, వక్రమార్గమనుసరించే ప్రాణిక మెలిక అని వర్ణిస్తాం. అది బాధలకు, కష్టాలకు వ్యతిరేకంగా ఏడుస్తుంది. భగవంతుడు, జీవితం, అందరూ తనని రాచి రంపాన పెడుతున్నారని దూషిస్తుంది. కానీ చాలాసార్లు దుఃఖం, కష్టం వచ్చి నిలిచిపోవటానికి కారణం ప్రాణికంలో వక్రీకరించినదేదో వాటిని కావాలని కోరుకోవటం. ప్రాణికంలోని ఆ అంశం పూర్తిగా తొలగించబడాలి.

*

ప్రాణిక చేతనకు చెందిన రాజసిక తామసికాహంకారం తిరుగుబాటును, క్రుంగుబాటును అనుమతించడానికి కారణమౌతుంది. ఆధిపత్యం వహించే రజస్సు వలన తిరుగుబాటు, తమస్సు ఆధిపత్యం వలన క్రుంగుబాటు కలుగుతుంది. అది ఆత్మ కాక ప్రాణికమో, దానిలో మరేదో అన్ని రకాల బాధలు, విచారాలతో మూల్గటమో, ఆక్రందించటమో చేస్తుంది.

CWSA 31:177-178

విషాదాన్ని ఎదుర్కోవడం

శక్తి, శాంతి అనేవి ఇంకా ఇంకా నీలో నెలకొనడానికి పనిచేస్తూ ఉన్నాయనేది సుస్పష్టం. ఇతర మనోభావలైన విచారంగా ఉండాలనుకోవడం, సంతోషంగా ఉండడానికి భయపడడం, తనను తక్కువగా అంచనా వేసుకోవడం లేక పనికిరాను అని అనుకోవడం ఇలాంటివన్నీ ప్రాణికానికి సంబంధించిన సామాన్యమైన కదలికలు, కానీ ఇవేవీ నీవు కాదు, అవి నీలో వచ్చే మార్పుని అడ్డుకోవడానికి, ఆపడానికి ప్రయత్నిస్తూ ఉంటాయి. నీవు చేయవలసిందల్లా

అది చేసే సూచనలను అంగీకరించకుండా ఉండటమే, ఎల్లప్పుడూ నీలోని సత్యం వైపు ఉండుటకు నిరంతరం ప్రయత్నించడమే నిన్ను సంతోషంగా స్వేచ్ఛగా ఉంచుతుంది, అప్పుడు అంతా సవ్యంగా ఉంటుంది.

నీవు రాసిన దాని బట్టి చూస్తే గతంలోని ప్రాణికపరమైన అశాంతి, విషాదంలో కూరుకుపోవడం అనేవి నిన్ను పట్టి పీడిస్తున్నాయి అనిపిస్తోంది. దానికేమి ప్రత్యేకమైన కారణం లేకపోవచ్చు. అయినాకూడా అది నిన్ను ఆవరించి నీ శక్తినంతా హరిస్తూ ఉంటుంది, అది కేవలం అలవాటుగా వచ్చే నరాల దుర్బలత అంతే. దాన్ని ఎక్కువగా పట్టించుకుంటే అది ఇంకా ఎక్కువైపోతుంది. దానిని మూడు విధాలుగా ఎదుర్కోవచ్చు. మొదటిది, మరేదైనా విషయంలో ఆసక్తి పెంచుకొని అందులో మునిగిపోవడం.. నీ మనోస్థితి గురించి వీలైనంతవరకు తక్కువగా ఆలోచించడం. రెండవ మార్గం ప్రాణిక పరమైన అశాంతినుండి విచారం నుండి వీలైనంతవరకు నిన్ను వేరుగా ఉంచుకోవడం, అలాగే ఎదుర్కోవడం, దృఢంగా శక్తిమంతంగా నిశ్చయాత్మకమైన బుద్ధితో దాన్ని తిరస్కరించడం, మూడవ మార్గం మదర్ ప్రసాదించే శాంతిని ఆకాంక్షిస్తూ నీ మనసును పైకి తిప్పుకోవడం అలవాటు చేసుకోవాలి. నీవు గనక దానికి తెరుచుకోవడానికి సిద్ధపడితే అది ఎల్లప్పుడూ కిందకు రావడం కోసం పైనుండి ఎదురుచూస్తూ ఉంది. అది గనక కిందకు వస్తే నీ బాధలు సమస్యలన్నీ శాశ్వతంగా తీసివేస్తుంది.

CWSA 31: 180-81

విచారం, కుంగుబాటు

సత్వరం ఎటువంటి ఫలితం కనిపించనప్పటికి నిరుత్సా పడకుండా ఉండటం చాలా ముఖ్యం అలా నిరుత్సాహపడితే. నీలోని శక్తి ఇంకిపోతుంది, అలా నీలో ఉన్న శక్తి క్షీణించిపోవడం అనేది తపోభంగంగా ప్రాచీన ఋషులచే తరచుగా చెప్పబడింది. అలా వారు తపోభంగమైన ప్రతిసారీ మళ్ళీ మొదటినుండి ప్రారంభించి దానిని పునర్నిర్మించుకోవలసి వచ్చేది.

నిరుత్సాహపడటం అనేది సాధకుడు ఎన్నడూ చెయ్యరాదని అతనికి గట్టిగా చెప్పండి - మెల్లగా ఒడిదుడుకులతో కూడినదైనా లేక సులభంగా త్వరితంగా సాగినా సాధన అలా ముందుకు వెళుతూనే ఉండాలి - అప్పుడేలక్ష్యాన్ని ఎల్లప్పుడూ సకాలంలో చేరుకోవచ్చు. కష్టాలు అంధకారంతో

కూడిన సమయాలు తప్పించుకోలేనివి - వాటిని ప్రశాంతంగా ధైర్యంగా సహించాలి.

విచారం విషాదం అనేవి ప్రతి ఒక్కరిలోనూ పనిచేస్తూ ఉంటాయి ఏదో ఒక సాకుతో అవి కొనసాగుతూ ఉంటాయి, నిజానికి అవి తమని తాము సంతృప్తి పరచుకోవడానికే పనిచేస్తాయి అంతే కానీ ఏదో ఒక కారణం ఉండి కాదు.

అన్ని రకాల విచారపూరితమైన కుంగుబాటు చెడ్డదే ఎందుకంటే అది నీ చైతన్య స్థాయిని తగ్గించివేస్తుంది, శక్తిని దుర్వినియోగం చేసి, ప్రతికూల శక్తులకు తలుపు తెరుస్తుంది.

CWSA 31: 182-183

కుంగుబాటు తరచూ వచ్చేది బాహ్యం నుండే

ప్రకృతి నుండే తరచూ విచారపుటలలు మనలను ముంచెత్తుతూ ఉంటాయి, అప్పుడు మనసు దానికి ఏదో ఒక అంతర్గత లేక బాహ్య కారణాలను వెతుక్కుంటూ ఉంటుంది, నిజానికి అటువంటి కారణాలేమీ లేనప్పటికీ, అలా సరైన కారణాలు తెలియకపోవడానికి కారణం అదే అనుకోవచ్చు. మరోవైపు మన అస్తిత్వంలోని కొంత భాగం నిరుత్సాహంతో నిండిపోవడం, నీరసించి పోవడం, పనిలోగాని సాధనకుగాని సహకరించక పోవడం జరుగుతుంది. అది గనక ప్రాణికంలో జరిగితే అది తనని తాను బయటపడనీయకుండా, తొలగింపబడకుండా దాగి ఉండేందుకు ప్రయత్నిస్తుంది, అది భౌతికంలో అయితే స్పష్టంగా కనిపించక, వ్యక్తపరచుకోలేక, ఉలుకుపలుకు లేకుండా ఉండిపోతుంది. చివరికి అది అధోచేతనలో నుండి పైకిరావచ్చు. అకారణంగా వచ్చే కుంగుబాటు, విచారాలకు ఉదాహరణలుగా వీటిని చెప్పుకోవచ్చు. ఎవరికివారు దీనిని గమనించి అది ఏరకమైనది అనేది తేల్చుకోవాల్సి ఉంటుంది.

ఇటువంటి విచారకరమైన ఆలోచనలను మనలో చోటుచేసుకొనే అవకాశం ఇవ్వకూడదు. అవి వచ్చినట్లయితే, వాటిని నీ ఆలోచనలుగా పరిగణించరాదు. అవి కేవలం బాహ్యంనుండి వచ్చే సూచనలుగా భావించాలి. వీలైనంత వరకు నిశ్చలంగా ఉండి మదర్ శక్తి నీలో పనిచేయనివ్వాలి.

CWSA 31:185-186

విచారం కలిగినప్పుడు ఎలా నడుచుకోవాలి

సహజంగా, ప్రాణికం నిశ్చలంగా ఉంటే గనుక మనసు విషయాలను సరైన రీతిలో అవగాహన చేసుకొనే అవకాశం ఉంటుంది, అప్పుడు విచారానికి ఆస్కారం ఉండదు.

చిన్న చిన్న కోరికలు, లోపాలను పెద్దవిచేసుకొని భూతద్దంలో చూడటం, వాటిని అనవసరమైన చింత లేక విచారానికి ఒక కారణంగా చేసుకోవడం చెయ్యరాదు. వాటిని కేవలం గుర్తించి ప్రశాంతంగా తొలగించుకోవాలి.

అలసిపోవడం అసంతృప్తిగా ఉండటం అనే కదలికలను ఎప్పుడు తిరస్కరించడంలో జాగ్రత్తగా ఉండకపోతే అవి గందరగోళాన్ని విచారాన్ని తిరిగి కలగచేస్తాయి. అవి వచ్చినప్పుడు వెంటనే మనం ఏమి చేయలేనప్పటికీ, అవి వచ్చాక వాటిని తిరస్కరించవచ్చు. మనం ఎంతగా వాటిని తిరస్కరిస్తే అంతగా అవి పునరావృతం కావడం తగ్గిపోతుంది. ఒకవేళ అలా మళ్ళీ వచ్చినాకూడా కొద్దిసేపు ఉండి తొలగిపోతాయి. వాటిని గనక ఉండనిస్తే అవి నీ నిజచేతనను మరుగుపరిచే అవకాశం వాటికి మళ్ళీ ఇచ్చినట్లు అవుతుంది.

విచారంలో కూరుకుపోరాదు, యోగం చేసే వారందరూ వారిలోని అహం వల్ల ఇబ్బందులు పడవలసిందే; కానీ ఉన్నత చేతన నిజమైన ఆకాంక్ష ఉన్నచోట పనిచేస్తూ ఉంటుంది.

ప్రాణికమైన విచారానికి సంబంధించిన కదలికలు వేటికీ చోటివ్వకూడదు, విచారగ్రస్త స్థితికి అసలు చోటు ఇవ్వరాదు. మన బాహ్య అస్తిత్వాన్ని సంభాళించడం అనేది ఎవరికైనా సరే ఎప్పుడూ కష్టమైన విషయమే. చాలా సహనంతో, ప్రశాంతతతో, ఉత్సాహంతో కూడిన నిరంతర యత్నంతో దానిని తొలగించుకోవాలి. అది ఎదురుతిరిగినా సరే నిరుత్సాహపడరాదు. ఎందుకంటే నిరుత్సాహపడితే పరిస్థితి ఇంకా సున్నితంగా కష్టతరంగా బాధాకరంగా ఇంకా నిరుత్సాహపూరితంగా తయారవుతుంది. అందుకు బదులుగా దానిలో ఉత్సాహం అనే సూర్యకాంతిని ప్రసరించనివ్వాలి. అలాగే ప్రశాంతమైన ఒత్తిడి తీసుకురావాలి, అప్పుడు అదంతా అనుగ్రహానికి సంపూర్ణంగా తెరుచుకోవడాన్ని నీవు చూడగలవు.

CWSA 31:186-87

ఇటువంటి నిరుత్సాహాన్ని (జీవితానికి అర్థం లేదని భావించడం) పక్కన పెట్టి ముందుకు పోవాలి. జీవితంలో విజయమైనా కష్టమైనా అది దైవం వైపు తిప్పినప్పుడు జీవితానికి అర్థం వస్తుంది. విచారాన్ని పక్కన పెట్టినప్పుడే రక్షణ లభిస్తుంది, అప్పుడు మాత్రమే నీవు దానిని గ్రహించి ఆ సహాయాన్ని శక్తిని వినియోగించుకోగలుగుతావు.

యోగంలో నియమం ఏమిటంటే విచారాన్ని నిన్ను కుంగదీయకుండా చూసుకోవడం. దాని నుండి దూరంగా వైదొలగి, దాని కారణాలను పరిశీలించి తొలగించుకోవడం. కారణం అనేది నీలోనే ఉంటుంది, ఎక్కడో ఒకచోట ప్రాణికమైన లోపాలు ఉంటాయి. ఏదో ఒక అపసవ్యమైన కదలిక లేక చిన్నపాటి కోరికను సంతృప్తి పరిచినప్పుడో లేక అసంతృప్తిగా వదిలినప్పుడో అది పరిస్థితిని మళ్ళీ మొదటికే తెస్తుంది. యోగంలో ఒక కోరికని సంతృప్తి పరచడం, ఒక అసత్యమైన కదలికకు తావివ్వడం తిరిగి పరిస్థితిని మళ్ళీ ఇంకా దిగజార్చి మొదటికి తీసుకొస్తుంది. దానికంటే దానిని సంతృప్తి పరచకుండా వదిలివేయడం మంచిది.

నీవు చేయవలసినది అంతరంగంలో లోతుగా జీవించడం, బాహ్యమైన స్పర్శకు లోనయ్యే ప్రాణికంలో గాని మనోతలంలో కానీ తక్కువగా జీవించడం. అంతరంగంలోని చైత్య పురుషుడు దీనికి లోను కాడు, దైవానికి సమీపంగా నిలచి అల్పమైన ఉపరితల కదలికలు తనకు సంబంధంలేని కదలికలనే గుర్తు ఎరిగి ఉంటాడు.

CWSA 31-188-89

జరిగేదంతా కూడా ఏదో విధంగా జరగవలసి ఉన్నదని, నీకు ఏది మంచిదో భగవంతుడికి తెలుసనే విశ్వాసాన్ని పెంపొందించుకుంటే అదే ఎంతో గొప్ప విషయం. దానికి నీవు లక్ష్యం చేరుకోవాలనే దృఢనిశ్చయాన్ని, ఆ దిశగా నీవు తీసుకుపోబడుతున్నావనే నమ్మకాన్ని జోడిస్తే, మధ్యలో కొన్ని కష్టాలు, పై పై నిరాకరణలు ఎదురైనా కూడా, సాధనలో ఇంతకంటే ఉత్తమమైన మానసికమైన పునాది ఉండదు. మనసే కాక ప్రాణికంలో, భౌతికంలో కూడా ఈ విశ్వాసం కనక నిండితే విచారం అనేది ఇక అసంభవం లేదా అది బాహ్యమైనదే, బాహ్యం నుండే వచ్చిందే కాని అది చేతనలో భాగం కాదనే స్పృహతో ఉంటే అది అక్కడ వేళ్ళూనుకొనే అవకాశం ఉండదు. అటువంటి విశ్వాసం మన

చేతనాస్థాయిని ఉన్నతంగా తిప్పడానికి అత్యధికంగా సహాయపడుతుంది, అలాగే విషయాలు పట్ల బాహ్యామైన రూపంకాక వాటి అంతర్గత సత్యాన్ని చూడగలిగే శక్తిని ఇస్తుంది.

CWSA 31.195

దుఃఖం ఆత్మను దైవాన్వేషణకు పురిగొలిపే విషయంలో తప్పనిసరి కాకున్నా అది సత్యం. తనలోనుండి వచ్చే పిలుపువల్లనే ఆత్మ దైవాన్వేషణ వైపుకు తిరుగుతుంది, అది ఏ పరిస్థితి లో అయినా జరిగే అవకాశం ఉంది - సంపూర్ణ ఐశ్వర్యం సుఖానుభవంలో, బాహ్యామైన విజయంలోని ఉన్నత శిఖరాలలో, ఎటువంటి దుఃఖం లేదా అసంతృప్తి లేని స్థితిలోకూడా ఆకస్మికంగా లేదా మెల్ల మెల్లగా వచ్చే జ్ఞానోదయం వలన ఇంద్రియ సుఖభోగాలలో మునిగితేలే బిల్వమంగళుడికి ఒక మెరుపువలే, ఈ అహంభావంతో నిండిన అంధకారబంధురమైన బాహ్యామైన జీవితంకంటే ఉన్నతమైనది సత్యమైనది ఏదో ఉన్నదని తెలియవస్తుంది. ఇందులో ఏ ఒక్క మలుపు లో కూడా దుఃఖం విచారం అనేవి లేకుండానే ఇది జరగవచ్చు. జీవితం అనేది చాలా బాగుంది, అది ఒక ఆసక్తికరమైన ఆట అయినప్పటికీ అది కేవలం ఒక ఆట మాత్రమే, ఆధ్యాత్మిక సత్యం మనసు ఇంద్రియాలకంటే ఉన్నతమైనది అని ఎవరో ఒకరు అంటుండడం వింటుంటాం. అది ఎలా వచ్చినా సరే అది దైవం నుండి వచ్చిన పిలుపు లేదా దైవం కోసం అంతరాత్మ పిలుపు అనేదే అక్కడ గమనించవలసిన అంశం. అటువంటి ఆకర్షణ ప్రకృతిలో ఉండే ఆకర్షణ కంటే కూడా చాలా గొప్పది.

CWSA 31: 202

నిరాశ

ఈ నిరాశా నిస్పృహలు, మితిమీరిన ఆత్మన్యూనతా భావం, నిస్సహాయతా భావాలు శత్రుశక్తికి సూచనలని, వాటిని ఎన్నటికీ అంగీకరించరాదన్నారు.

మీరు మాట్లాడే లోపాలు మానవ స్వభావానికి ఉమ్మడిగా ఉంటాయి. ప్రతి సాధకుని బాహ్య అస్తిత్వం వాటితో నిండి ఉంటుంది. పరివర్తనకు వాటిని గురించి తెలుసుకోవడం అవసరం. కానీ అది ప్రశాంతమైన మనస్సుతో, విశ్వాసంతో దైవానికి సమర్పణతో చైత్యపురుషకు తగిన ఉన్నత చైతన్యానికి

స్థిరమైన ఆకాంక్షతో చేయాలి. బాహ్య అస్తిత్వ పరివర్తన యోగంలోఅత్యంత క్లిష్టమైన భాగం. దీనికి విశ్వాసం, సహనం, నిశ్శబ్దం, దృఢమైన సంకల్పం అవసరం. ఆ స్ఫూర్తితోనే మీరు కుంగుబాట్లను పక్కన పెట్టి యోగాన్ని స్థిరంగా కొనసాగించాలి. మీ చైతన్యాన్ని మార్చటానికి నేను అన్నీ చేస్తాను. మిమ్మల్ని మీరు తెరవండి. నిశ్శబ్దంగా వీలైనంత వరకు మిమ్మల్ని మీరు తెరచి ఉంచుకోండి. నేను మిమ్మల్ని అడిగే ఒకే ఒక్క షరతు ఇది.

CWSA 31:207

భావావేశమైన స్వభావం

ఇది దుఃఖం లేదా ఆనందం లేదా మరే ఇతర భావోద్వేగాలను అనుభవించే ప్రశ్న కాదు. సాధారణ ప్రకృతిని జయించని ప్రతి ఒక్కరూ అదే చేస్తారు. అది రాగబంధపూరితమైన భావోద్వేగం కాదు, కేవలం భావావేశం. ఏ కారణమూ లేకుండా లేక తగినంత కారణం లేకుండా నీ సంవేదనలను సంతృప్తి పరచడంలో గాని, ప్రదర్శించడంలో గాని సంతోషం పొందినపుడు రాగబంధ భావోద్వేగం చోటు చేసుకొంటుంది.

మనుష్యులతో గొడవ పడడం వారితో మాట్లాడడానికి నిరాకరించడం అనే రాగబంధ పూరిత భావోద్వేగం ప్రాణిక స్వభావంలోని ఒక భావోద్వేగ భాగం. ఆ మానసిక స్థితికి వ్యతిరేకంగా ప్రతిస్పందనలో అదే భాగం మాటల ద్వారా ఏర్పడిన సంపర్కపు సంబంధపు ఆనందాన్ని పొందాలని కోరుకుంటుంది. ఈ రెండు ఉద్యమాలు ఉన్నంత కాలం మరొకటి కూడా సాధ్యమే. మీరు ఈ భావోద్వేగాలను వదిలించుకుని మీ స్వచ్ఛమైన భావాలన్నింటినీ దైవం వైపు మళ్ళించినపుడు మాత్రమే, ఈ హెచ్చు తగ్గులు మాయమై, అన్నింటిపట్ల ఒక ప్రశాంతమైన సద్భావన వాటి స్థానాన్ని ఆక్రమిస్తుంది.

CWSA 31:210

ఇంత బలమైన సమస్యకు ఇది చాలా చిన్న కారణం. కానీ వాస్తవానికి ఈ మూడే అసమంజసమైన సున్నితత్వపు మొత్తం కష్టం. ఈ చాలా చిన్న సాకుతో అది ఉద్భవించింది. సున్నితత్వం ఇక్కడ చాలామంది సాధకులకు నింతర అవరోధాలలో ఒకటి.

దానికి రెండు పరిష్కారాలు ఉన్నాయి. మదర్‌పై అంతరాత్మ విశ్వాసం, దానితో పాటు వచ్చే సమర్పణ అనగా 'ఆమె ఏది కోరుకుంటే అది నాకు ఉత్తమం' అన్న వైఖరి. ఇప్పుడు మీరు అనుభూతి చెందుతున్న వైశాల్యత, ఇది నిజమైన ఆత్మ విస్తృతి, మానసిక ప్రాణిక, భౌతిక అస్తిత్వాల విస్తృతి. దాని నుండి ధూళి రాలిపోయినట్లు రాలిపోతాయి. ఎందుకంటే అవి దానికి ఏ విధంగా చూచినా ప్రాముఖ్యత లేనివే.

వైశాల్యత, శాంతి, నిశ్శబ్దంలోకి శాశ్వతంగా ప్రవేశించడం, అందులో అహాన్ని కరిగిపోనివ్వడం అనేదొకటే చేయాలి. అప్పుడు అనుబంధాలు పతనమైపోతాయి.

CWSA 31:211

అహం, అహంకారం

అవును అది సరైనదే. నిరంతరం గుర్తుంచుకోండి, శాంతి, ప్రశాంతతలతో జీవించండి. తద్వారా దివ్యక్రియాశక్తి పనిచేస్తుంది. దివ్య వెలుగు వస్తుంది. దైనందిన జీవితంలో చిన్న చిన్న విషయాలు ఉపరితల చైతన్యంలో కొనసాగాలి. దివ్యక్రియా శక్తి, దివ్య వెలుగులు, దానిని స్వాధీనం చేసుకొని చిన్న విషయాలపై కూడా ప్రత్యక్షంగా పట్టు సాధించగలిగేంత వరకు ఉపరితల చైతన్యంలో చాలా విశాల స్థానాన్ని ఆక్రమించ కూడదు. అహంకారమే వాటికి చాలా విశాల స్థానాన్ని ఇస్తుంది. అహంకారాన్ని నిరుత్సాహ పరచాలి. "నాకోసం కాదు, దైవం కోసం" అనేది మొత్తం చైతన్యానికి, ఆలోచనకు, చర్యకు సూత్రంగా ఎదగాలి. ఇది ఒకేసారి పూర్తి చేయలేము. కానీ అది వీలైనంత త్వరగా మనస్సులో స్థిరమైన గమనికగా మారాలి.

CWSA 31:219

తన అజ్ఞానంతో కూడిన అహంకారం తన అజ్ఞానం యొక్క అహంకారం, మార్పు కోసం ఏ పిలుపునైనా వ్యతిరేకించే, ప్రతిఘటించే జడత్వంతో కూడిన భౌతిక చైతన్యం సమస్యను స్వీకరించడానికి ఇష్టపడని దాని అహంకారం ఎల్లప్పుడూ అదే పాత కదలికలను పునరావృతం చేస్తూ, తనదైన మార్గం మీద వెళ్ళడంలో మరింత సుఖాన్ని పొందుతుంది. ఏదో ఒక సమయంలో ఏదో ఒక విధంగా దానికోసం ప్రతీదీ చేసిపెట్టబడుతుందని, మహా అయితే ఆశిస్తుంటుంది. మొదటి విషయం ఏమిటంటే సరైన ఆంతరిక దృక్పథం

ఉండడం. మీకు అది ఉంది. మిగిలినది తనను తాను మార్చుకోవాలనే సంకల్పం. అహానికి సంబంధించిన వాటినన్నింటినీ గ్రహించగల, నిమ్న స్వభావ తామసిక మొండిపట్టును తిరస్కరించే జాగరూకత, అంతిమంగా పరివర్తన ప్రక్రియకు ఎటువంటి ఆటంకం కలుగకుండా ఉండటానికి, అస్తిత్వపు ప్రతిభాగంలో తనను తాను ఎల్లప్పుడు మదర్‌కు తెరచి ఉంచడం.

CWSA 31:222

నిరాశ చెందకెన్నడూ

ధైర్యాన్ని, బలహీనతను, జడతను, ఆత్మన్యూనతను, కర్మ చేయడం యెడల విముఖతను, తెలుసుకొనడానికి లేదా ఉన్ముఖం కావడానికి వైముఖ్యాన్ని, అలసత్వాన్ని, సోమరితనాన్ని, నిష్క్రియతను సమ్మతించి, బలపరచేది తామసిక అహం. రాజసిక అహానికి విరుద్ధంగా "నేను చాలా బలహీనుడిని, ఎంతో అజ్ఞానిని, నికృష్టుడిని, అణచివేతకు గురైనవాడిని, దురుపయోగిని, నిరాశోపహతుడిని, ఎక్కడా గెలుపులేని వాడిని, నాకేదీ దక్కదు, నాకే ఆధారమూ లేదు, నేనిదీ, అదీ యెలా చేయగలను, అందుకు నాకేశక్తులూ లేవు, సామర్థ్యం లేదు, నిస్సహాయుడిని, చావే శరణ్యం, కదలకుండా నన్ను ఏడుస్తూ పడి ఉండనివ్వండి" వగైరా వగైరా చెప్తుంది. అదంతా ఒకేసారిగా ప్రతివాని విషయంలో జరుగదనే మాట నిజమే. ఆ విషయానికి సంబంధించిన సాధారణ, సహజ గుణాన్ని గురించి చెప్తున్నాను.

(ఆత్మ న్యూనత, నైరాశ్యం) అంతా ప్రాణిక, అహాల మామూలు నటన. ఇతరులతో మాట్లాడకపోవడంలో గానీ, ఏకాంతంలో గానీ, సంతృప్తిని పొందలేనిది ప్రాణికం. మాట్లాడడంలో సంతృప్తినది పొందడం లేదు, కానీ పాత సంగత్యాన్ని వదలుకోవడంతో అది సమాధానపడలేక పోతోంది. ఇంకా పాత అలవాటుకే బద్ధమైవున్నానని అనుకొని, ఏకాంతతలోని ఆనందాన్ననుభవించ లేకపోతోంది.

తనకు తానే ముఖ్యమనుకొనేది తనను గొప్ప చేసుకొనేది అహం. కానీ నైరాశ్యం, ఆత్మన్యూనత, ఇతరులు తన సాన్నిహిత్యాన్ని ఇష్టపడడం లేదు లేక ప్రశంసించడం లేదు అని అనుకోవడం కూడా అహం చేసే పనే. మొదటిది రాజసిక అహం, రెండోది తామసిక అహం. తనకు సంబంధించిన విషయాల

గురించి తనమీద ఇతరుల చర్య గురించి ఎల్లప్పుడూ ఆలోచిస్తూ ఉండేది అహం. అహం నుండి స్వేచ్ఛ పొందిన వ్యక్తి వీటితో బాధించబడడు.

దైవాన్ని గురించి సాధనను గురించి ఆలోచిస్తూ ఉంటాడు. ఇతరుల విషయంలో వారి నుండి అతనేమీ కోరకుండా, లేక ఆశించకుండా ప్రశాంత శుభేచ్ఛ వైఖరితోఉంటాడు. ఇంకా యిక్కడికి చేరుకోలేకపోతే, అక్కడికి చేరుకోవడానికి ఎల్లప్పుడూ కృషి చేయాలి. ~~ఈ~~ యితర విషయాలను గురించి ఆలోచిస్తూ నిమ్న ప్రాణిక కదలికను పోషించకూడదు.

CWSA 31:226

(తాను గొప్ప, అసూయ, నన్నెవరూ ప్రేమించడం లేదు) అని అనుకోవడం అంతా ప్రేమ కాదు. తనను తాను ప్రేమించుకోవడం అవుతుంది. తనను తాను ప్రేమించుకోవడం అనేదాని వికృత రూపం అసూయ. జనం దాన్నలా అర్థం చేసుకోరు. పైగా కావాలని అనుకోవడం, అసూయ, దెబ్బతిన్న దర్పం అనే ప్రేమ చిహ్నాలని అనుకొంటారు. లేకపోతే ప్రేమను సహజంగా వెంటనంటి ఉండేవేనని అనుకొంటారు.

*

స్వాభిమానాన్ని ఎంత త్వరగా వదిలించుకొంటే అంతమంచిది. స్వాభిమానంతో వున్న వారెవరైనా సరే అపకార శక్తుల ప్రభావం క్రిందకు తనను తాను నెట్టుకొన్నట్లే. స్వాభిమానానికి యథార్థ ప్రేమకు సంబంధం లేదు. అసూయ లాగానే అది కూడా ప్రాణిక అహంకారపు అంశమే.

CWSA 31:245

విశ్వాసపు శక్తి

ఇంకా అభివ్యక్తం కాని, సాధించబడని, లేక వాస్తవీకరించబడని లేదా దానికి అంతరాత్మకు సంబంధించిన సాక్షి విశ్వాసం అయినా గాని మనలోని జ్ఞాత, సూచనలేమీ లేకపోయినా, అది నిజమని, లేక దానినే అనుసరించడం, లేదా సాధించడం అన్నిటింకంటే పరమోత్కృష్ట అర్హత కలిగినది. మనసులో ఒక సుస్థిరమైన నమ్మకం లేనపుడు గూడా, ప్రాణికం ఘర్షణ పడినా, ఎదురు తిరిగినా, తిరస్కరించినా మనలో యిది సదా నిలిచి ఉండగలదు. అప నమ్మకం, అంధకారం, నిరాశ, వైఫల్యతకు సంబంధించిన సుదీర్ఘ సమయాలు,

యోగ సాధన చేసే వారిలో, లేని వారెవరైనా ఉన్నారా? అతనిని కొనసాగ నిచ్చేదేదో అతనిలో వుంది. అతడు దానిని గురించి ఏమనుకొంటు న్నప్పటికీ, అది వుంటూనే ఉంటుంది. ఎందుకనంటే, తాను అనుసరించేది ఎప్పటికీ సత్యం అని అనుభూతి చెందుతుంది. అనుభూతి చెందడం కంటే దాని నెరిగి ఉంటుంది. దైవం వున్నాడు, మనం అనుసరించవలసిన ఏకైక విషయం దైవం దానితో పోల్చదగిన అర్హత కలిగినది జీవితంలో మరొకటేదీ లేదు అనేది అంతరాత్మలో సహజంగా అంతర్గతంగా వున్న, యోగంలోని ప్రాథమిక విశ్వాసం. నీలో వృద్ధి చెందుతున్న ఈ విశ్వాసమే యోగం కొరకు నిన్నిక్కడికి తీసుకొచ్చింది. ఈ విశ్వాసం చనిపోలేదు, లేక క్షీణించదు. నీవు వ్రాసిన లేఖలను బట్టి చూస్తే అది నిన్ను మరింతగా ఒత్తిడి చేస్తోంది. విడువకుండా అంటిపెట్టుకొని ఉంది. అది వున్నంతకాలం, ఒక మనిషిగా, అతడు ఆధ్యాత్మిక జీవితానికుద్దేశించబడిన వాడౌతాడు. అతని స్వభావం, అవరోధాలతోనూ, తిరస్కారాలూ, ఇబ్బందులతోనూ నిండి వున్నప్పటికీ, అనేక సంవత్సరాల పెనగులాట వున్నప్పటికీ, ఆధ్యాత్మిక జీవితంలో విజయం అతనిని వరిస్తుంది.

CWSA 29:93

ఇదిగో ఈ విశ్వాసాన్నే నీవు అభివృద్ధి చేసుకోవాలి. దైవం వున్నాడు, మార్గంలో ప్రవేశించమని ఆతడు పిలిచాడు. అది సుస్పష్టం అయినపుడు దాని వెనుక దైవ మార్గదర్శకత వుండి తీరుతుంది. యిబ్బందులెన్ని ఉన్నప్పటికీ వాటి ద్వారా నీవు చేరుకొంటావు అనేది హేతుబద్ధమైన, లౌకిక జ్ఞాన సమ్మతమైన విశ్వాసం. వైఫల్యాన్ని సూచించే అపకార శక్తుల స్వరాలను వినకపోవడం, లేక వాటిని ప్రతిధ్వనించే అసహనంతో కూడిన ప్రాణిక తొందరపాటు గొంతులను వినకపోవడం, గొప్ప కష్టాలున్నాయి, విజయం లభించదు అన్నందు వల్ల, లేక ఇంతవరకు దైవం తనను చూపించుకోలేదు గనుక ఇక ముందు కూడా ఎన్నడూ కన్పించదు అన్నందువల్ల గాకుండా ఒక గొప్ప, కష్టతరమైన గమ్యం మీద మనసును లగ్నం చేసినపుడు ప్రతి వ్యక్తి తీసుకొనే స్థానాన్ని తీసుకొని "నేను విజయం సాధించేంత వరకు సమస్త కష్టాలను, అవేవైనప్పటికీ, అధిగమించి విజయం సాధిస్తాను" అని చెప్పుకోవాలి.

"దైవం వున్నాడు, ఎదురుగా ఉన్నాడు, ఆతడున్నాడు గనుక, ఆతనిని నేను అనుసరించడం అనేది విఫలం కాదు. ఆయనను కనుగొనేంత వరకు

ప్రతి సంకటం నుండి నేను ముందుకు పోతూనే ఉంటాను" అని దైవం యందు నమ్మకమున్న వ్యక్తి జోడిస్తాడు.

CWSA 29:94

విశ్వాస నిష్ఠ

అంతరాత్మ వెలుగుకు, దైవ పిలుపుకు విశ్వసనీయంగా ఉండండి అని నేనెప్పుడు గతంలోని దేనిని గురించి మాట్లాడడం లేదు లేక నీ విషయంలో లోపం వున్నదని గాని చెప్పడం లేదు. ఏ విధమైన సూచనలను, ప్రేరేపణలను, ప్రలోభాలను తిరస్కరించమని, సత్యపు సమస్త పిలుపును దివ్య వెలుగుకు సంబంధించిన అనివార్య సంజ్ఞాజ్యోతిని వ్యతిరేకించే దానిని వ్యతిరేకించమని, సమస్త సందర్భాలలోనూ దాడులలో గొప్పగా అవసరమయ్యే దానిని గురించి మాత్రమే మాట్లాడాను. సమస్త సంశయం, కుంగుబాటు సందర్భాలలో "నేను దైవం మనిషిని, నేను ఓడిపోను" అని చెప్పుకోగలగాలి. సమస్త అపరిశుద్ధతకు, అనర్హతకు దైవం యెంచుకొనిన అమృత పుత్రుడను, నేను నాకు, ఆయనకు సత్యవంతుడినై ఉండాలి, తప్పదు - విజయం తథ్యం, నేను పడిపోయినా, తిరిగి తప్పకుండా లేస్తాను" అని సమాధానమివ్వాలి. వైదొలగాలి అనీ, అల్ప ఆదర్శాల వైపు దారి తీసే దానికి "ఇది మహా గొప్పది, నాలోని అంతరాత్మను సంతృప్తపరచగలిగే ఏకైక పరమసత్యం ఇది, దివ్య మహాయానంలో చిట్టచివరి వరకు సమస్త పరీక్షలకు అగ్నిపరీక్షలకు తట్టుకొని ముందుకు పోతాను" అని సమాధానం చెప్పుకోవాలి. దివ్య వెలుగు, దివ్య పిలుపుకు విశ్వాస నిష్ఠతో ఉండాలి అనినేనన్నదాని అర్థం యిది.

*

చంద్రునిలో ఒక ముక్కను తినడం అనే విషయాన్నిష్టపడేటట్లు జీవిత కణాల్ని చేయడానికి విశ్వాస పద్ధతిలో ఏదో నాకు కన్పించడం లేదు. ఎవరికీ చంద్రుని శకలం ఎన్నడూ దక్కలేదు. కానీ విశ్వాసంతో నయం చేయడమనేది ఒక అతి వాస్తవికం, అది ప్రకృతి ధర్మం, యోగాన్ని ప్రక్కనబెట్టినా చాలా తరుచుగా ప్రదర్శితమైంది. విశ్వాసం గాని తదితరమైన మరేదైనా గాని పొందడానికి మార్గం, వాటిని పొందాలని పట్టుబట్టడం, నిరుత్సాహపడకుండా, నిరాశ చెందకుండా ఉండి వాటిని పొందేంత వరకు వదలకుండా ఉండడం. ఈ కష్టభూయిష్ట ప్రపంచం, ఆలోచించే, ఆకాంక్షించే జీవులు దానిమీద

ఆరంభమైన నాటి నుండి ఆ మార్గాన్ననుసరించడం వల్లే సాధ్యమైంది. సదా, అనవరతం, దివ్య వెలుగుకు ఉన్ముఖంగావడం, అంధకారానికి వెన్నుచూపడం జరగాలి. "నీవల్ల గాదు, నీవు చేయగూడదు, నీవు అసమర్థుడివి, నీవొక స్వాప్నిక తోలుబొమ్మవి" అని నిరంతరం ఘోషించే గొంతులను తిరస్కరించాలి. ఎందుకనంటే ఇవి శత్రు గొంతుకలు. వాటి కఠోర వాదనలతో అతడు పొందబోయే ఫలితానికతనిని దూరం చేసి, ఆ తరువాత ఆ ఫలితం నిస్సారమైనదని దానిని తమ సిద్ధాంతానికి ఋజువుగా చూపిస్తారు. ఆ కృషిలో వున్న కష్టం, తెలిసిన విషయమే, కష్టం అంటే అసాధ్యం అని కాదు, నెరవేరినదెప్పుడూ కష్టసాధ్యమైనదే. కష్టం తరువాతే నెరవేరుతుంది. కష్టాలపై సాధించిన విజయం, పృథ్వి చరిత్రలో అత్యంత విలువైనదిగా అవుతుంది. ఆధ్యాత్మిక కృషి విషయంలో గూడ అది అంతే.

CWSA 29:99-110

దృఢ విశ్వాసాన్ని నిలిపి ఉంచుకో

ఎటువంటి నిరుత్సాహాన్ని దరిచేరనీయకు. దైవ కృపయందు అపనమ్మకాన్ని దరిచేయనీయకు. నీకు బయటి కష్టాలేవి వున్నా నీలోపల ఏ బలహీనతలున్నా నీ విశ్వాసం మీద ఆకాంక్ష మీద నీకు గట్టిపట్టు వుంటే రహస్య దివ్యశక్తి వాటిలో నుండి నిన్ను తీసుకుపోతుంది. నిన్ను మా దగ్గరికి చేరుస్తుంది. వ్యతిరేకతలోనూ, ఇబ్బందులతోనూ నీవు త్రొక్కిపెట్టబడినప్పటికీ, నీవు తడబడినా, నీకు దారి మూసుకుపోయినట్లు కన్పించినా, నీ ఆకాంక్షపై పట్టు వదలకు. కొంతకాలం పాటు విశ్వాసం మేఘావృతమైనప్పటికీ, సతతం నీ హృదయంలో, మనసులో మావైపు తిరిగి వుండు, అపుడది తొలగించబడుతుంది.

లేఖల రూపంలో అందించే బాహ్య సహాయం విషయంలో దానిని నీకందించడానికి పరిపూర్ణంగా సంసిద్ధులమై ఉన్నాం. కాని మార్గాన్ని విడువ కుండా అంటిపెట్టుకొని వుండు. చివరకు, అపుడు విషయాలు వాటంతటవే విదితమౌతాయి, ఆంతరిక ఆధ్యాత్మిక శక్తికి పరిస్థితులు తలవంచుతాయి.

*

ఏ విధమైన హానికర శక్తులెదురైనా, వాటిని ధైర్యంగా యెదుర్కో, అపుడవి అదృశ్యమౌతాయి, సహాయం అందుతుంది. జీవితంలో, కర్మలో, నిలబెట్టకో

వలసిన ఆధ్యాత్మిక అనుభవంలో సైతం నిజ వైఖరి, విశ్వాసంతో, ధైర్యంతో ఉండడం.

*

దివ్య వెలుగు గెలుపు యెడల దృఢ విశ్వాసం నిలబెట్టుకో. పదార్థమూ, మానవ మూర్తిత్వమూ తమ రూపాంతరీకరణ నిరోధాలను స్థిరమైన సమచిత్తంతో యెదుర్కోవాలి.

గాఢాంధకారమలముకొని ఈ ప్రపంచమూ, మనిషి భౌతిక స్వభావం కూడా దానితో నిండిపోయి ఉన్నాయి. అయినప్పటికీ పదింతల దురంహంకారానికి వ్యతిరేకంగా యధార్థ దివ్యవెలుగు ఒక కిరణమైనా కాలక్రమంలో ప్రసరించగలుగుతుంది.

CWSA 29:101-102

ధైర్యం అవసరం


జీవితాన్ని దాని కష్టాలను ఓర్పుతో స్థిరంగా ఎదుర్కో. ధైర్యం లేకపోతే, అంతకంటే సాధనకు సంబంధించిన ఆంతరిక కష్టాల్లో నుండి బయట పడలేడెన్నడూ. ఈ యోగంలో అన్నిటికంటే మొట్టమొదటి పాఠమేమిటంటే, జీవితాన్ని, అందులో యెదురయ్యే కష్టాలను, ఒక ప్రశాంత మనస్సుతో, ఒక మొక్కవోని ధైర్యంతో ఎదుర్కోవడం.

*

కష్టాలనెదుర్కోవాలి, యెంత అధికంగా ఉత్సాహోనందాలతో వాటిని ఎదుర్కొంటే అంత త్వరగా వాటిని అధిగమించవచ్చు. గెలుపు మంత్రాన్ని, విజయం సాధిస్తాననే దృఢ నిర్ణయాన్ని నేను దాన్ని తప్పక పొందాలి, నేను దాన్ని తప్పక పొందుతాను అని సుస్థిరంగా తీర్మానించుకొని దానినెల్లప్పుడూ చెదరకుండా నిలుపుకోవాలి. అసాధ్యం? అసాధ్యత అనేటటువంటిదేమీ లేదు. కష్టాలుంటాయి.

నిరంతరం సుదీర్ఘంగా శ్రమించవలసిన విషయాలుంటాయి, అసాధ్యాలు ఉండవు. చేయాలని సుస్థిరంగా నిర్ధారించుకొన్నది, ఇప్పుడు గాని, తరువాత గాని జరిగి తీరుతుంది. అది సాధ్యం అవుతుంది.

CWSA 29:116



"ఓ సర్వోత్కృష్టప్రభూ, ఏకైక అంతరంగికుడా, నీవే మూలం గనుక ముందే సకలమెరిగిన నీకు విన్నవించుకోగలము!

"ఓ సర్వోన్నతప్రభూ, ఏకైక సహచరుడా, మమ్మల్ని మమ్మల్ని వున్నది వున్నట్లుగా అంగీకరించేది నీవు, ప్రేమించేది నీవు, అర్థంచేసుకునేది నీవు, ఎందుకంటే మమ్మల్ని తయారు చేసింది నువ్వే!

ఓ సర్వోన్నత ప్రభూ ఏకైక మార్గదర్శకుడా, మా అత్యుత్తమ సంకల్పాన్ని నీకు వ్యక్తపరచడం వలన ఎప్పటికీ ప్రయోజనం లేదు, ఎందుకంటే అక్కడ సంకల్పించేది నీవే!

వినేవాడివి, అర్థం చేసుకునేవాడివి, ప్రేమించేవాడివి, మార్గదర్శకుడివి నీవే, ఎప్పటికీ మా పిలుపుకు సిద్ధంగా వుండేవాడివి, మమ్మల్ని విఫలం కానీయనివాడివి నీవే గనుక నీలో కాక వేరెక్కడైనా అన్వేషించడం అవివేకం!

"సర్వోన్నతుని, ఒక పరిపూర్ణ విశ్వాసానికి చెందిన విలక్షణ ఆనందాన్ని, ఒక సమగ్రమైన స్వచ్ఛతను, తనకు తాను చూచుకోని సంపూర్ణసమర్పణను, ప్రయాస, నిర్బంధాల నుండి స్వేచ్ఛను తెలుసుకునేట్లు చేశావు.

నీ ముందు ఒక పసిబిడ్డలా సంతోషపడ్డాను, నవ్వాను, ఏడ్చాను, ఓ నా ప్రియతముడా!

CWM 1:374-75

కష్టాలు, అలజడులు, శాంతి

సరైన ఆత్మశక్తితో ఆకాంక్షించు, ఏకాగ్రం చేయి, కష్టాలు ఏవైనా నీ ముందున్న లక్ష్యాన్ని నిశ్చయంగా సాధించగలవు.

నీ వెనుకనున్న శాంతిలో, నీలోని 'నిజతత్వంలో' జీవించడము, అదే నువ్వని అనుభూతించడము తప్పనిసరిగా నేర్చుకోవాలి. మిగిలినదానిని నీ నిజతత్వం కానిదిగా పరిగణించాలి, నీ నిజతత్వం దృగ్గోచరమయ్యేకొద్దీ ఉపరితలం మీద వున్న మార్పుచెందే, తిరిగి తిరిగి సంభవించే చలనాల మొత్తం నిశ్చయంగా దూరమౌతుంది.

నిజమైన పరిహారం శాంతి అస్తిత్వంలోని వివిధ భాగాల వాస్తవిక సమతుల్యతకు నిర్దిష్టమొత్తంలో పని అవసరమైనప్పటికీ పనిచేయడంతో పక్కకు మళ్ళడం అన్నది క్షణిక ఉపశమనం మాత్రమే. శాంతిని శిరసు పైన లేదా చుట్టూ అనుభూతి చెందడం మొదటి అడుగు; దానితో సుసంఘటితం కావాలి, అది నీలోకి దిగివచ్చి , నీ మనఃప్రాణదేహాలను నింపి, నిన్ను ఆవరించుకుంటే దానిలోనే జీవిస్తావు- ఎందుకంటే ~~ఈ~~ శాంతి నీలోని దివ్య ఉనికికి ఒక సంకేతం, ఒకసారి పొందితే మిగిలినదంతా నిన్ను చేరడం ప్రారంభమవుతుంది.

భాషణంలో, భావనలో సత్యం చాలా ముఖ్యం. అసత్యం నీలోని భాగం కాదని, బయటనుండీ నీపైన పడుతున్నదని నువ్వెంత ఎక్కువగా అనుభూతి చెందితే దానిని తిరస్కరించడం, నిరాకరించడం అంత సులభమవుతుంది.

తదేకదీక్షతో వుండు, నీలో ఇంకా వక్రంగా వున్నదంతా సరిగా అవుతుంది, దివ్య అస్తిత్వానికి చెందిన సత్యాన్ని యధార్థంగా తెలుసుకుంటావు, అనుభూతిచెందుతావు, నీ విశ్వాసం ప్రత్యక్ష అనుభవంతో నిరూపితమవుతుంది.

CWSA 29:125-26

మనసు అలజడిగా వున్నంతవరకు ఆంతర సత్యాన్ని, నిశ్శబ్దాన్ని, శాంతిని, నిశ్చలతను పొందడం సాధ్యం కాదు-అది ఆవశ్యకమైన మొదటి షరతు.

*

అంతరంలో నిశ్చలంగా వుండటం, ముందుకు సాగడానికి సంకల్పంలో స్థిరంగా వుండటం, కష్టాలు, సంశయాల చేత ఆందోళన లేక నిరుత్సాహం చెందడాన్ని నిరాకరించడం ఈ మార్గంలో నేర్చుకోవలసిన మొదటి అంశం.

CWSA 29:140

బలము, దివ్యకృప

బలము, దివ్యకృపల గురించి నేను చెబుతున్నదానిలో ఏదీ అవివేకమైనది కాదు. ఆధ్యాత్మిక సాక్షాత్కారంలో బలానికి ఒక విలువ వుంది,కాని అది వేరే ఏ ఇతర సాధనాలతో జరుగదు, కేవలం బలం చేతనే సంభవమన్నది ఒక ఉగ్రప్రకోపం. దివ్యకృప ఒక ఆవిష్కరణ కాదు, అది ఆధ్యాత్మిక అనుభవానికి చెందిన ఒక వాస్తవం. మేధావులు,బలవంతుల చేత ఎందుకూ పనికిరానివారుగా పరిగణింపబడే వారిలో చాలామంది దివ్యకృప చేత సాధించారు; నిరక్షరాస్యులు, మానసిక శక్తి, శిక్షణ లేని వారు, గుణము, సంకల్పాల బలం లేని వారు అయినప్పటికీ ఆకాంక్షించి, ఆధ్యాత్మిక సాక్షాత్కారానికి హఠాత్తుగా వేగంగా వృద్ధి చెందుతారు, ఎందుకంటే వారికి విశ్వాసముంది లేదా వారు నిజాయితీపరులు. ఆధ్యాత్మిక చరిత్రకు, సాధారణ ఆధ్యాత్మిక అనుభవానికి చెందిన వాస్తవాలైన ఈ యధార్థాలను కేవలం విచారణలే అన్నట్లుగా చర్చించడము, వాదించడము, ఖండించడము ఎందుకు జరుగుతున్నదో నాకు అర్థంకాదు. బలం ఆధ్యాత్మికమయినపుడు అది ఆధ్యాత్మిక సాక్షాత్కారం కోసం వున్న ఒక శక్తి నిజాయితి, ఒక గొప్పశక్తి, అన్నింటికన్నా అత్యంత గొప్ప శక్తి దైవానుగ్రహం. ఒక వ్యక్తి నిజాయితీపరుడైతే దీర్ఘ కాలయాపనము, ముంచెత్తే కష్టాలు వున్నప్పటికీ ముందుకు సాగుతాడు అని ఎన్నో సార్లు చెప్పాను. దైవానుగ్రహం గురించి పదేపదే మాట్లాడాను. భగవద్గీతలోని ఈ వాక్యాన్ని పలుమార్లు సూచించాను.

అహం త్వ సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః

"నేను నిన్ను సర్వ పాపము, చెడుల నుండి విముక్తుడిని చేస్తాను, శోకించకు."

*

ఏది ఉత్తమమో దైవానికి తెలుసు, ఆయన జ్ఞానంపై విశ్వాసముంచి, ఆయన సంకల్పంతో ఏకాత్మికం కావాలి. దీర్ఘకాలం పట్టడమన్నది చేరేందుకు

ఉత్తమ అసామర్థ్య రుజువు కాదు- అది కేవలం అధిగమించవలసిన అంశం కొంత వ్యక్తిలో వుందనడానికి ఒక సంకేతం, దైవాన్ని చేరాలని గట్టి సంకల్పము ఉంటే అది అధిగమించబడగలదు. ఆత్మహత్య దీనిని పరిష్కరించదు- అది దారుణ పరిస్థితులలో అదే కష్టాలను ఎదుర్కోవటాన్ని వెనక్కు తెస్తుంది. ఎవరైనా జీవితం నుండి మొత్తానికి తప్పించుకోవాలనుకుంటే అది కేవలం పూర్తిగా ఆంతరిక పరిత్యాగంతో, సమగ్ర మౌనంలో తనను తాను విలీనం చేసుకోవడంతో లేదా సమగ్రభక్తితో లేదా స్వీయసంకల్పాన్ని, కోరికలను దైవసంకల్పానికి ఇచ్చుకోవడమనే ఒక కర్మయోగంతో సంభవమవుతుంది.

దివ్యకృప ఏ క్షణంలోనైనా హఠాత్తుగా పనిచేస్తుందని కూడా చెప్పాను, కానీ మనిషికి దానిపైన నియంత్రణ వుండదు, ఎందుకంటే అది మనసు చూడలేని విషయాలను చూసే అపారమైన దివ్యసంకల్పం చేత ప్రాప్తిస్తుంది. స్పష్టంగా ఈ కారణం చేత ఎప్పటికీ నైరాశ్యం చెందకూడదు,- దైవం కొరకు చేసే నిజాయితీగల ఏ ఆకాంక్ష అయినా చివరకు విఫలం కాదు.

CWSA 29:172-174

దివ్యకృపపై విశ్వాసం

ఈ అన్ని విషయాలను నిశ్శబ్దంగా, స్థిరంగా, తదేకదీక్షతో శ్రమించే సాధనతో ఎదుర్కో. దివ్యకృపను గట్టిగా విశ్వసించు, ఆ దివ్యకృప నిన్ను విఫలం కానివ్వదు.

*

దివ్యకృపను నీలో పనిచేసేట్లు అనుమతించడం, దానిని ఎప్పటికీ వ్యతిరేకించకుండటం, కృతజ్ఞత లేకుండా వుండి దానికి విరుద్ధంగా మళ్లడం కాక, కాంతి, శాంతి, ఏకత, ఆనందాల గమ్యాన్ని అనుసరించడం శక్యమైన ఉత్తమమార్గం (ప్రతిఫలాన్ని దివ్యకృపకు బదులుగా ఇవ్వడం).

CWSA 29:174

ఎటువంటి పరిస్థితి లెదా సంఘటన భగ్నం చేయని నిరంతర విశ్వాసం వుండాలి. ఒకవేళ కష్టాలు తటస్థించినా, అవి మానసిక సందేహాలను లేదా ఒక జడ సమ్మతిని తలెత్తనీయవు, కానీ నిష్కళంక అర్పణతో దివ్యశక్తి కష్టాలను తొలగిస్తుందనే దృఢవిశ్వాసంతో వుంటే, ఆ విశ్వాసం ఆమెవైపు

మళ్ళీ, ఈ ప్రయోజనం కొరకు ఆమె మీద ఆధారపడటం జరుగుతుంది. పూర్తి విశ్వాసం, సమర్పణ వున్నపుడు దానితో పాటు యుక్తమైన దానిని చేయడానికి, యుక్తమైన మార్గాన్ని అనుసరించడానికి ఒక గ్రహణశీలత కూడ వస్తుంది, అప్పుడు పరిస్థితులు తమను తాము సమర్థం చేసుకుంటాయి, ఫలితం కనిపిస్తుంది.

ఈ స్థితిని చేరాలంటే ఒక నిరంతర ఆకాంక్ష, పిలుపు, స్వీయార్పణ, తనలోపల, తన చుట్టూ మార్గానికి అడ్డుగా నిలబడే సమస్తాన్ని నిరాకరించడం ముఖ్యం. పరివర్తన అవసరమైనంత వరకూ ప్రారంభంలో ఎప్పటికీ కష్టాలు వుంటాయి కానీ అవి ఒక స్థిరపడిన విశ్వాసాన్ని, సంకల్పాన్ని, సహనాన్ని ఎదుర్కొన్నపుడు అదృశ్యమయ్యి తీరుతాయి.

CWSA 29:234

దైవానుగ్రహం మార్గనిర్దేశన

నేను దైవానుగ్రహం గురించి కొంత చెప్పాలని అనుకుంటున్నాను. మీరందరూ భావించినట్టు దివ్యహేతువుతో పని చేసే ఈ ప్రక్రియ మానవ ప్రజ్ఞ కన్నా భిన్నమైనది, కానీ ఇక్కడ అది కాదు, విశ్వవ్యాప్త దివ్యానుగ్రహం కూడా కాదు, తన వద్దకు వచ్చి ప్రార్థించే వారిని అందరిని, సమ్మతించి, నిష్పాక్షికంగా అందరిమీదా పనిచేస్తుంది. దైవానుగ్రహం సదాచారులను ఆమోదించడం, దురాచారులను తిరస్కరించడం వంటివి కూడా చెయ్యదు. దివ్యానుగ్రహం దుర్మార్గులైన వారికి సహాయం అందిస్తుంది. దురాచారుడు అగస్టిన్, అపకీర్తి కలిగిన జాగాయ్ మరియు మథాయ్ బిళ్వ మంగళుడు ఇంకా ఎందరిలోనో వచ్చిన మార్పు మత ప్రక్షాళన క్రమంలో మానవుల నైతిక ప్రజ్ఞను అపఖ్యాతి పాలు చెయ్యవచ్చు, కానీ ధర్మబద్ధత కలవారి స్వయం ప్రక్షాళనకు వారిలో అన్నిటికీ అతీతమైన స్వచ్ఛ చైతన్యంలోనికి నడపడానికి తోడ్పడుతుంది. ఆ ఉత్కృష్ట శక్తి మిగిలిన అన్ని సూత్రాలకన్నా, విశ్వ శాసనం కన్నా ఉన్నత స్థాయిలో ఉంటుంది. ఆధ్యాత్మికతలో జ్ఞానులైన వారు శాసనాలకు అనుగ్రహానికి మధ్యగల వ్యత్యాసాన్ని గుర్తించారు. దైవానుగ్రహానికి ఉన్న వివేకం స్వయంగా సాధారణమైన బుద్ధి, మనసుకు మల్లే కాక ఈ వ్యక్తుల్ని, వస్తువుల్ని, సరియైన కాలాలను, ఋతువుల్ని తనదైన దృక్కోణంతో చూస్తుంది. వ్యక్తికి చెందిన మందమైన పరదాల వెనుక మనిషి అంచనాలకు

అతీతంగా, దివ్యానుగ్రహానికి అనువైన స్థితి ఏర్పడినప్పుడు దైవ కృప దానంతట అదే పని చెయ్యడం ప్రారంభిస్తుంది. అందులో మూడు శక్తులుంటాయి.

1. విశ్వనియమం, కర్మ సిద్ధాంతానికి సంబంధించినది.

2. దివ్య కారుణ్యం పనిచేస్తూ న్యాయపరిధిలో అందరికీ అవకాశం కల్పిస్తూ దైవానుగ్రహం అందరికీ చేరే అవకాశం కల్పించడం;

3. ఇతర శక్తులవలే కాకుండా దైవకృప ఆపలేనంతగా, అపారంగా పనిచేస్తుంది. కానీ ఒకే ఒక ప్రశ్న: జీవితంలోని కష్టాలకు హెచ్చుతగ్గులకు వెనుక ఒక విషయమంటూ ఉన్నదా. అతీత దివ్యశక్తి పిలిచినపుడు అప్పటిదాకా ఉన్న ఇబ్బందులను అధిగమించి, సమాధానం ఇవ్వడానికి దివ్య ప్రకాశాన్ని అందుకోవడానికి సంసిద్ధంగా ఉన్నట్లా? అది మానసికమో, ప్రాణికమో కాదు, అంతర్గతంగా ఉన్నది, అంతర్నేత్రంగా మాత్రమే చూడగలిగేది. అంతర్గత స్థితి సిద్ధమై, చురుగ్గా బయటకు రావడానికి సిద్ధపడినపుడు దివ్యకరుణ పనిచేయవచ్చు. సంపూర్ణ దైవకృప సరైన పరిష్కారాన్ని నిర్ణయించవచ్చు. మార్పుకోసం నిరీక్షించవచ్చు లేదా భవిష్యత్తులోకి వాయిదా వెయ్యవచ్చు. ఎందువలనంటే వ్యక్తిలో ఇంకా సిద్ధంగా లేని అంశం మధ్యలో చొరబడవచ్చు.

CWSA 29:167-69

దివ్య ప్రమేయం

దైవిక శక్తుల ప్రమేయం వస్తుజాలంలోని యధార్థ నియమంతో నిరంతరాయంగా ఉంటుంది. దైవకృప అపారమైనది, సాధారణంగా మానవ మేధ విధించే ఎటువంటి షరతులకు కట్టుబడేది, అంచనా వేయబడేది కాదు. అయినా ఒక పిలుపు, ఆకాంక్ష, మానసిక తీక్షణత, చైత్యపురుషను జాగృతం చెయ్యగలదు. కొన్నిసార్లు బాహ్యకారణాలు లేకుండా కూడా దైవానుగ్రహం పనిచేస్తుంది.

*

దైవానుగ్రహం లేకుండా ఏదీ సాధించలేరు. సంపూర్ణంగా దైవకృపను పొందాలంటే సాధకుడు తనను తాను సిద్ధం చేసుకోవాలి. అన్నిటికి దైవప్రమేయం మీదనే ఆధారపడితే మనిషి ఒక తోలుబొమ్మ మాదిరిగా అవుతాడు, అప్పుడు సాధన కూడా ఉపయోగపడదు (ప్రయోజనం కలగదు). దానికి ఏ విధమైన నియమాలు, సూత్రాలు ఉండవు. అందువల్ల ఇక విశ్వం

ఉండదు. ఒక్క దైవం మాత్రమే ఈ విషయాలను తనకు నచ్చినట్లుగా తిప్పుతూ ఉంటుంది. నిస్సందేహంగా ఆఖరి గమ్యంగా విశ్వవ్యాప్త దైవ శక్తి మాత్రమే పనిచేస్తుంది. అదికూడా మానవులు, కొన్ని శక్తుల మాధ్యమంగా మాత్రమే ప్రకృతిలోని నిబంధనలకు అనుగుణంగా విశేష ప్రమేయం ఉండి ఉండవచ్చు కానీ అన్నీ ప్రత్యేక ప్రమేయాలు కావు.

*

సాధకుని సంపూర్ణ సమ్మతితో దైవకృప ఏదయినా చెయ్యగలదు. సంపూర్ణ సమ్మతిని ఎలా తెలియచెయ్యాలో తెలుసుకునే ప్రక్రియే సాధన అంతరార్థం. మెదడులోని ఆలోచనలు, ప్రాణికంలోని కోరికలు, భౌతికచైతన్యంలోని జడత్వం కారణంగా ఈప్రక్రియ జరగడానికి సమయం పట్టవచ్చు. తాను పనిచేయడానికి దివ్యశక్తికి పిలుపునివ్వడం ద్వారా లేదా దివ్య సహాయంతో ఈ అంశాలను తొలగించివేయవచ్చు, తొలగించి వేయాలి కూడా.

*

సాధకునికి వున్న మూడు అవకాశాలు

1. అనుగ్రహం కోసం వేచి ఉండడం, దైవం మీద ఆధారపడడం
2. పూర్తిగా అద్వైతునిలాగా, బుద్ధునిలాగా ప్రతీదీ తనంతట తనే చేసుకోవడం
3. మధ్యేమార్గంగా శక్తి సహాయంతో ఆకాంక్ష, తిరస్కరణలతో ముందుకు వెళ్ళడం.

CWSA 29:170-71

దైవానుగ్రహ ఉపసంహరణ, ఇది రెండు విధాలుగా జరుగుతుంది. కొంతమంది నుండి దైవకృప తానే తొలగిపోతుంది. మరికొంత మంది తమంత తామే దైవకృప నుండి దూరంగా వెళ్లిపోతారు.

CWSA 29:174

సమస్యలు ఎదురైనపుడు విచారించడం అన్నది మనస్సుకు సాధారణ లక్షణం. నీవు సమస్యలు వచ్చినా సమస్యలు ఎదుర్కొనప్పుడు నిశ్చలంగా సమబుద్ధితో ఉంటడానికి నీ మనసుకి నీవు శిక్షణ ఇవ్వాలి. చెయ్యవలసిన పనులు చేస్తూ దైవశక్తిని నమ్ముకోవాలి.

- శ్రీ అరవిందులు

ది మదర్ సుభాషితాలు

బాధను ఏ విధంగా అనుభవించాలో తెలుసుకోవాలి

ఏ సమయంలోనైనా లోతయిన దుఃఖం కానీ, తీవ్రమైన సంశయం కానీ, లేకపోతే భరించలేని బాధ కానీ నిన్ను పూర్తిగా నిరాశపరచినట్లయితే అక్కడే నీవు ప్రశాంతంగా ఉండటానికి, విఫలం కాని మార్గం ఎప్పుడూ ఒకటి ఉంటుంది.

మనిషి లోతుల్లో జ్యోతి ప్రకాశిస్తూ ఉంటుంది. ఆ గొప్ప ప్రకాశం దాని పవిత్రతకు ప్రతిరూపంగా ఉంటుంది. పదార్థానికి సైతం రూపాన్ని ఇచ్చి, పోషించి, ప్రకాశింపజేసే విశ్వ అధిదేవతలో ఆ ప్రకాశం సజీవ, సచేతనమైన భాగం. ఆ పరమాత్మ శాసనం శిరసావహించే వారికి ఆయన శక్తివంతమైన, విఫలం కాని మార్గదర్శకుడు. భగవంతుని శరణువేడి, విధేయత చూపే ప్రతి ఒక్కరి పట్ల ఆయన ఓదార్పు, ప్రేమ కలిగి సహనంతో సహాయం చేస్తాడు. ఆయన పట్ల నిజాయితీ, నిరంతర ఆకాంక్ష లేకపోతే అంతా వ్యర్థం. ఆయన మీద గట్టి నమ్మకం ఉన్నవారు ఎప్పటికీ నిరాశ చెందరు. ఏ ఆశాపూరిత నిరీక్షణ మోసపోదు.

ఒకానొక సమయంలో నేను చాలా దుఃఖాన్ని అనుభవిస్తూ విలపించాను. చాలా తీవ్ర బాధల లోతుల్లోకి కూరుకుపోయాను అని చెప్పొచ్చు. నేను నిన్ను స్మరించాను. ఓదార్పును ఇచ్చు ఓ దివ్య ప్రభూ! ప్రగాఢంగా నిన్ను ప్రార్థించాను. ఆ క్షణంలో మిరుమిట్లు గొలిపే శోభతో ఉన్న నీ తేజస్సు నా ముందు ప్రత్యక్షమయ్యింది. నన్ను పునర్జీవింపజేసింది.

నీ మహిమాన్విత కిరణ పుంజాలు నా శరీరంలో వున్న అన్ని భాగాల్లోకి చొచ్చుకొనిపోయి, ప్రకాశింపజేయగా, నేను అనుసరించాల్సిన మార్గాన్ని, ఈ బాధల వల్ల కలిగే ప్రయోజనాన్ని స్పష్టంగా గ్రహించాను; నన్ను దాని చేతి పట్టులో ఉంచిన బాధ ఏమిటో నేను అర్థం చేసుకున్నాను. అది ఈ దుఃఖపూరిత భూమి పడే బాధ, వేదనల అగాధానికి చెందిన ఒక పాలిపోయిన ప్రతిబింబం మాత్రమేనని నేను గ్రహించగలిగాను.

బాధలు అనుభవించిన వారు మాత్రమే ఇతరుల బాధలను అర్థం చేసుకోగలరు; దానిని అర్థం చేసుకుని, దానితో సాంగత్యం ఏర్పరచుకొని,

దాని నుండి విడుదల చేయగలరు. ఓ దివ్య స్వాంతనకు స్థానమైన ప్రభూ! నీవు చేసే ఉత్కృష్టమైన హోమాన్ని నేను అర్థం చేసుకున్నాను. మిమ్మల్ని అన్ని కష్టాలలో నిలబెట్టడానికి, మా బాధలన్నింటినీ శాంతపరచడానికి, ఈ భూమి, మనిషి అనుభవించే బాధలను ఎట్లాంటి మినహాయింపు లేకుండా నీవూ అనుభవించావు అని నేను అర్థం చేసుకున్నాను.

నీ ఆరాధకులమని చెప్పుకునే వారిలో, కొందరు నిన్ను క్రూరమైన హింసకునిగా, నీవు స్వంత ఇష్టానుసారం సృష్టించిన హింసలను (నీవే వాటిని భరిస్తావు కదా!) చూసే ఒక నిర్లక్ష్యపు న్యాయమూర్తిగా పరిగణించేవారికి ఎలా ఉంటుంది?

ఆ... కాదు కాదు. నాకు ఇప్పుడు అర్థం అవుతోంది. ఈ బాధలు పదార్థ అపరిపూర్ణత వలన వస్తున్నాయని, దాని క్రమరాహిత్యం, అశుద్ధత కారణంగా పదార్థం నిన్ను వ్యక్తపరచలేకపోతోందని నేను తెలుసుకున్నాను. ఇంకా పదార్థ అపరిపక్వత వల్ల మొట్టమొదట బాధ పడిందీ, నిరాశను అనుభవించిందీ నువ్వేనని, ఆ పదార్ధ అపరిపక్వతను క్రమరాహిత్యాన్ని క్రమబద్ధతగా, బాధలను, దుఃఖాన్ని ఆనందంగా, అసమ్మతి (సామరస్య ధోరణి లేని దానిని) సామరస్యంగా మార్చాలని తీవ్రమైన కోరికతో మొదట కష్టపడింది కూడా నీవేనని నేను తెలుసుకున్నాను.

బాధ అనివార్యమైనది కాదు, కోరదగినది కాదు, కానీ మన విషయానికి వస్తే అది ఎంత సహాయకారిగా ఉంటుంది!

మన హృదయం బద్ధలవుతున్నట్లు మనకు అనిపించిన ప్రతిసారీ, మన లోతుల్లో ఒక తలుపు తెరుచుకుంటుంది, అప్పటి వరకు దాగి వున్న నిధులలో గొప్పదైనది వెలికి వచ్చి కొత్త లక్ష్యాలను, వాటిని చేరుకునే దారులను మన ముందు ఉంచుతుంది. దాని బంగారు ప్రవాహం విధ్వంసం అంచున ఉన్న జీవి యంత్రాంగానికి మరోసారి చాలా విశేషమైన క్రొత్త జీవితాన్ని అందిస్తుంది. ఇలా వరుసగా వచ్చే నీ ప్రకాశమయ అవరోహణల ద్వారా, మేము ఒక తెరతీసినట్లు బాహిర తెరను చేరుకొన్నాము. ఓ ప్రభూ అప్పుడు శరీరంలోకి చొచ్చుకొచ్చే ప్రాణశక్తి తీవ్రతని, మొత్తం ఉనికిలోకి ప్రవహించే తేజస్సుతో ముంచెత్తే ప్రకాశాన్ని, ఉనికిని శాశ్వతంగా మార్చే ప్రేమ గొప్పతనాన్ని ఎవరు మాత్రం వర్ణించగలరు!

CWM 2:20-21

విషమ పరీక్ష అయినా, దోషమైనా మిమ్మల్ని నిరుత్సాహపరచినట్లయితే....

జీవిత పరీక్షను ఎదర్కొనే సమయంలో నీవు తప్పు చేసినా, ఓడిపోయినా, లేకపోతే బాధల లోతుల్లో దిగిపోయినా, దుఃఖించకు. ఎందుకంటే వాస్తవానికి దివ్యప్రేమ, అత్యున్నత ఆశీర్వాదం నిన్ను చేరుకోగలదు. నీ దుఃఖాలను శుద్ధి చేసి విపత్కర పరిస్థితుల గుండా వెళ్ళినందున, అద్భుతమైన ఆరోహణలు నీ సొంతం అవుతాయి.

నీవు నిర్జన ప్రదేశంలో ఉన్నప్పుడు

నీ లోపల ఉండే నిశ్శబ్దాన్ని విను. పొగిడే పదాలు, బయటి చప్పట్లు మీ చెవులను ఆనంద పరుస్తాయి. కానీ నిశ్శబ్ద స్వరాలు నీ ఆత్మను సంతోష పరుస్తాయి. నీలో, అగాధ లోతుల్లోని ప్రతిధ్వనిని, దివ్య మంత్రోచ్చారణను మేల్కొల్పుతాయి.

*

నీవు అంధకారపు లోతుల్లో పనిచేస్తున్నప్పుడు అమూల్యమైన సంపదను సేకరించు. ప్రకాశవంతమైన సూర్యరశ్మిలో, మేధస్సుకు సంబంధించిన మార్గాలు తెరుచుకుంటాయి. కానీ అంధకారంలోని తెల్లటి ప్రకాశంలో రహస్యంగా వున్న పరిపూర్ణతకు సంబంధించిన భాగాలు, రహస్యమయిన ఆధ్యాత్మిక సంపదగా ఉంటాయి. నీ నుండి అన్నీ తీసివేయబడ్డప్పుడు (అలా తీసివేయడం సంపూర్ణత్వానికి మార్గం) నీ దగ్గర ఏమీ మిగలనప్పుడు ప్రతీదీ నీకు ఇవ్వబడుతుంది. ఎందుకంటే నిష్కపటతను, సత్యాన్ని తమ లోపల ధరించిన వారి నుండి, ఎప్పటికీ అసలు పనికిరాని దాని నుండి కూడా ఉత్తమమైనది వెలికి వస్తుంది.

భూమిలో నాటిన ప్రతి గింజ వెయ్యి గింజలను ఉత్పత్తి చేస్తుంది. మనిషి అనుభవించే దుఃఖానుభవం ఎప్పుడూ కీర్తివైపుకు తీసుకువెళ్తుంది. మనిషిని ప్రతికూల శక్తులు కనికరం లేకుండా వెంబడించినప్పుడు, అతనిని నాశనం చేయడానికి ఆ శక్తులు చేసే ప్రతి పనీ అతనిలోని గొప్పతనాన్ని వెలికి తీసుకొస్తుంది.

ప్రపంచాల కథను విను, చూడు; ఈ ప్రపంచానికి ఉన్న గొప్ప శత్రువు విజయం సాధించినట్లు తెలుస్తోంది. అతను ప్రకాశంలో ఉన్న జీవులను నక్షత్రాలతో నిండిన రాత్రిలోకి పడత్రోశాడు. అతను విశ్వ కార్యానికి

వ్యతిరేకంగా, కోపంతో ఉన్నాడు. అతను ప్రపంచ సామ్రాజ్య సమగ్రతను దెబ్బతీశాడు, దాని సామరస్యాన్ని విచ్ఛిన్నం చేశాడు. ఇంకా ఇంకా విభజించాడు. ఉపవిభజనలు చేశాడు. చివరగా మిగిలిన ధూళిని అనంతంలోని నాలుగు వైపులకు విసిరివేశాడు. ఇదిగో! ఆ దుమ్ము బంగారు విత్తనంగా మారి ఈ అనంతాన్ని ఫలదీకరణం చేసింది. దాని ఫలితంగా ఈ అంతరిక్షపు పెద్ద కక్ష్యలో ఒక శాశ్వతమైన కేంద్రం చుట్టూ ఆకర్షించే ప్రపంచాలు, వాటిలో ప్రజల సృష్టి జరిగింది. అతను దేన్ని అయితే నాశనం చేయాలి అనుకున్నాడో, ఆ సామ్రాజ్యం ఒకటికి పదింతలుగా విస్తరించింది. తద్వారా విభజన కూడా గొప్ప, లోతైన ఐక్యతను సృష్టించింది చూడు.

సృష్టి ప్రారంభ దశలో అనంతం ఒడిలో వున్న ఆదికాలపు గోళానికి సంబంధించిన గీతం నిజంగా మధురంగా ఉంది. కానీ విజయాన్ని పొందిన నక్షత్రమండలాల శబ్దాల రంగుల సమన్వయం, అంతరిక్షంలోని గోళాల సంగీతం, శాశ్వతమైన విజయగీతంతో స్వర్గాన్ని నింపే అపారమైన గాయక బృందం ఎంత అందంగా ఉంది!

CWM 2:40-46

ప్రశాంతంగా ఉండటానికి ఉత్తమ సాధనం

మీరు, మీతోపాటు, మీ లోపల, మీ చుట్టూ, మీ చర్యల ద్వారా సృష్టించబడిన వాతావరణాన్ని తీసుకువెళతారు. మీరు చేసే పనులు అందంగా, మంచిగా ఉంటే, మీ వాతావరణం మంచిగా, సామరస్యంగా ఉటుంది. మీరు నీచమైన స్వార్థం, క్రూరమైన చెడు సంకల్పంతో జీవిస్తే మీ జీవితంలో దానినే ప్రతిక్షణం అనుభవిస్తారు. ఇక దుఃఖం, నిరంతర అశాంతి. వికృతం దాని స్వంత వికృతినే నిరాశ పరుస్తుందని దీని అర్థం.

శరీరాన్ని విడిచిపెట్టడం ద్వారా మీరు ఈ సంస్కారాల (కర్మల) నుండి విముక్తులౌతారని నమ్మరాదు. దీనికి విరుద్ధంగా, శరీరం చైతన్యానికి వేసిన ముసుగులాంటిది, ఇది బాధల తీవ్రతను తగ్గిస్తుంది. మీరు భౌతిక, ప్రాణిక జీవితంలోనే శరీర రక్షణ లేకుండా ఉంటే, బాధ మరింత తీవ్రమౌతుంది. మార్చవలసిన వాటిని మార్చడానికి, సరిదిద్దాల్సిన వాటిని సరిదిద్దడానికి ఆనందమైన, ప్రకాశవంతమైన జీవితాన్ని, చైతన్యాన్ని మీలోకి ఆహ్వానించడానికి ఇక అవకాశం ఉండదు.

మీరు ఇక్కడ మీ పనిని చేయడానికి త్వరపడాలి. ఎందుకంటే మీరు దీన్ని నిజంగా చేయగలరు.

మరణం నుండి ఏమీ ఆశించవద్దు, జీవితమే మీ పరమావధి. జీవితంలో మిమ్మల్ని మీరు రూపాంతరీకరించుకోవాలి, మీరు అభివృద్ధి చెందడం, భూమిపైనే సిద్ధింప జేసుకొంటారు. భూమిపైనే ఈ శరీరంలో ఉండే మీరు విజయాన్ని పొందుతారు.

CWM 3:197-98

చైతన్యంలో ఉన్నతంగా ఎదగడం

ఈ బాహ్య విషయాలు ఆసక్తిని రేకెత్తించేలా ఏమీ లేవు. అవినాకు సబ్బుబుడగల్లా కనిపిస్తాయి, ముఖ్యంగా ఫిబ్రవరి 3వ తేదీ నుండి.

నిరాశ, కన్నీళ్ళతో తీవ్రమైన మానసిక వ్యథలతో నా దగ్గరకు వచ్చే వ్యక్తులు ఉన్నారు, వారిని అలా చూసినపుడు, వారందరికీ కలిగిన నా చైతన్యంలోని సూచికను కొద్దిగా మారుస్తాను, తద్వారా వారు వెళ్ళేటప్పుడు పూర్తి సంతోషంగా వెళతారు. ఇది దిక్సూచి సూచిక లాంటిది. చైతన్యంలోని సూచికను కొద్దిగా మార్చితే చాలు. అంతా అయిపోతుంది. సహజంగానే ఇది అలవాటు వల్ల తర్వాత తిరిగి వస్తుంది, అవి సబ్బు బుడగలు తప్ప మరేమీ కాదు. నాకు బాధలు తెలుసు, నాలో ఒక భాగానికి తెలుసు, ఒక విడిభాగంగా బాధకు వెనుక ఎలా నిలబడాలో తెలుసు.

ప్రపంచంలో ఇప్పుడు నాకు అసహనంగా అనిపించేది, శారీరక క్షీణత, శారీరక బాధలు, వికారాలు, ప్రతి వ్యక్తిలో వున్న సౌందర్యాన్ని వ్యక్తపరచలేని అసమర్థత, అయితే అది కూడా ఏదో ఒక రోజు సమర్థవంతమౌతుంది.

CWM 9:282-23

శక్తులు, రూపాలను అంగీకరించడం, తిరస్కరించడం

మనం ఎల్లప్పుడూ బింబాలను సృష్టిస్తాము, రూపాలను సృష్టిస్తాము. మనం అలా చేస్తున్నామని కూడా తెలియకుండానే వాటిని వాతావరణం (సృష్టి)లోకి పంపిస్తాము. అలా అవి తిరుగుతాయి, ఒకరి నుండి మరొకరిని కలుస్తాయి, సహచరులను కలుస్తాయి, సంతోషంగా ఉంటాయి, కొన్నిసార్లు విభేదాలు సృష్టిస్తాయి, ఇక్కడ యుద్ధాలు కూడా ఉంటాయి. చాలా తరచుగా ఈ మానసిక ఊహలలో సంకల్పపు చిన్న మూలకం ఉంటుంది, అది తనను తాను తెలుసుకోవడానికి ప్రయత్నిస్తుంది. తద్వారా అది పనిచేయగలదు.

ఇది సాధారణ గందరగోళాన్ని సృష్టిస్తుంది. వాతావరణంలోని ఈ రూపాలు అన్నింటినీ మన కళ్ళతో చూడగల్గితే చాలా అద్భుతమైన విషయాలు కనిపిస్తాయి. యుద్ధభూమి, అలలు, ఆగమనాలు, సూక్ష్మ మానసిక అస్థిత్వాల సమూహ తిరోగమనాలు, నిరంతరం గాలిలోకి విసిరివేయబడతాయి. ఎల్లప్పుడూ తమను తాము తెలుసుకోవడానికి ప్రయత్నిస్తాయి. ఈ రూపాలన్నీ భౌతికంగా తమను తాము తెలుసుకోవాలనే సాధారణ ధోరణి కలిగి ఉంటాయి. అలాంటివి లెక్కలేనన్ని ఉన్నాయి. వ్యక్తీకరించుకోవడానికి భూమిపై తగినంత స్థలం లేనందున అవి ఒకదానికొకటి కిక్కిరిసి ఉంటాయి. మంచి క్రమంలో కవాతు చేస్తున్న సైన్యాన్ని ఏర్పరచుకుని వాటితో ఏకీభవించని వాటిని వెనక్కు పంపడానికి ప్రయత్నిస్తాయి. ఎల్లప్పుడూ అందుబాటులో ఉన్న కాల స్థానాలను తీసుకుంటాయి. ఇది లెక్కలేనన్ని సృజనలతో పోలిస్తే చాలా చిన్న స్థానం మాత్రమే.

కాబట్టి వ్యక్తిగతంగా ఇది జరుగుతుంది. కొందరు వ్యక్తులు, బహుశా అందరూ, తమకు తెలియకుండానే నిరంతరం ఒకస్థితి నుండి వేరొకస్థితికి విసిరివేయబడతారు, ఆశ, నిరాశ, కోరిక, కొన్నిసార్లు సంతోషంగా, కొన్నిసార్లు నిరాశకు గురి అవుతారు. ఎందుకంటే వారికి ఈ విషయాలపై నియంత్రణ లేదా నైపుణ్యం లేదు. ఈ దృగ్విషయాన్ని చూచి వీటిపై ఆలోచించగల్గే ప్రజ్ఞ మనలో ప్రారంభమైనపుడు, వెలికి రావడానికి ప్రయత్నించే అల్పజీవుల వాతావరణాల పట్ల సచేతనులం కాగలం. ఇవన్నీ మనలో ఉన్న మానసిక వాతావరణం నుండి బయటకు వెలువడుతాయి. ఒకసారి మనం చూసి, గమనించిన తర్వాత వాటిని క్రమబద్ధీకరించడం ప్రారంభించవచ్చు. మన అత్యున్నత సంకల్పం లేదా ఆకాంక్షకు అనుగుణంగా లేని వాటిని వెనక్కు నెట్టి, సాధారణంగా అభివృద్ధి చెందడానికి మనకు సహాయపడే రూపాలను మాత్రమే అభివ్యక్తికి అనుమతించవచ్చు.

CWM 9:386-87

ఊహను నియంత్రించడం

నేను, వారి స్వభావంలో వ్యతిరేక భావాలు కలిగిన వ్యక్తులను తెలుసుకున్నాను. ఒకరోజు వారు సాక్షాత్కారం కోసం, అద్భుతమైన, ప్రకాశవంతమైన, శక్తివంతమైన రూపాన్ని తయారు చేయగలరు. తదుపరి రోజు నిస్తేజమైన, చీకటి నలుపు రూపాలు ఏర్పరుచుకొంటారు, నిరాశ పూరిత రూపం. ఇలా

రెండూ బయటకు పోతాయి. ఈ పరిస్థితుల ప్రభావంలో నేను అందమైన దానిని (నిజమైన దానిని) తెలుసుకోగలిగాను, దాన్ని తెలుసుకుంటున్నపుడు మొదట ఏర్పడిన చీకటి తొలగిపోయింది. ఆ విధంగా దానిలో వున్న సూక్ష్మ వివరాలతో అది జీవితపు పెద్ద శ్రేణిలో ఉంటుంది. ఇదంతా ఎందుకంటే మనిషి ఆలోచిస్తున్నదాన్ని తనకు తానుగా గుర్తించలేడు. ఈ విరుద్ధ కదలికలకు తాను బానిస అని తాను నమ్ముతాడు. అతడు అనుకొంటాడు. "ఈ రోజు నా ఆరోగ్యం బాగోలేదు, ఈ రోజు అన్నీ నాకు విచారంగా అనిపిస్తున్నాయి. ఇది ఎవరూ ఏమీ చేయలేని విధి" అని అంటాడు. కానీ ఎవరైనా ఒక అడుగు వెనక్కు నిలబడి, లేదా ఆంతర్యంలో ఒక మెట్టు ఎక్కి వీటన్నింటినీ చూసి వాటి స్థానంలో ఉంచవచ్చు. తనకు ఇష్టంలేని వాటిని నాశనం చేయవచ్చు, లేదా వదిలించుకోవచ్చు ఒకరి ఊహాశక్తి మొత్తం వినియోగించవచ్చు. ఏది ఊహగా పిలవబడుతుందో, దానిని ఎవరు కోరుకుంటున్నారో వారి ఉన్నత ఆకాంక్షను బట్టి రూఢి పర్చవచ్చు. దీనినే నేను ఊహలను నియంత్రించడం అంటాను.

CWM 9:388

అన్నింటి వెనుక ఉన్నది

ఈ బాహ్య పదార్థ చేతన, ఈ ఉపరితల పదార్థ పరమైన మనస్సు కొరడా దెబ్బలతో ముందుకు సాగడానికి, కృషిచేయడానికి, పని చేయడానికే అలవాటు పడింది. ఇది తమస్సు, అప్పుడిక అది ఊహించుకొంటున్న కొద్దీ ఇంకా కష్టాలను, అడ్డంకులను, వైరుధ్యాలను తలపోసుకుంటూ వాటినే అదేపనిగా ఊహించుకుంటూ ఉంటుంది. దానివల్ల చాలా భయానకంగా దాని నడక కుంటు పడుతుంది. కష్టాలన్నింటి వెనుక, ఒకానొక అనుగ్రహం ఉన్నదని, మనకు ఎదురయ్యే అన్ని ఓటముల వెనుక ఒక విజయం ఉన్నదని, వేదనలన్నింటి వెనుక, దుఃఖాల వెనుక, వైషమ్యాల వెనుక ఒక ప్రమోదం ఉన్నదని నమ్మి ఒప్పుకొనే దృఢమైన, స్పర్శవేద్యమైన అనుభవాలు పునరావృతం కావడం అవసరం. దానికి సంబంధించిన ప్రయత్నాలన్నింటిలో ఒక్కటి మాత్రం మళ్ళీ మళ్ళీ జరగాలి, అన్ని సందర్భాల్లో వీగిపోవాల్సిన సంశయం, కలహాలు, నిరాశ వాదాన్ని ఆపుచేయడానికి లేదా నిర్మూలించడానికి లేదా మార్పుచేయడానికి బద్ధుడివి కావాలి.

CWM 11:2

ఇక్కడున్న మొత్తం దైవాన్ని కోరుకోదు, అది ఈ రకమైన వాతావరణాన్ని ఉద్దేశ్యపూర్వకంగా సృష్టించి, దైవాన్ని కోరుకొనే వారిని నిరుత్సాహపరుస్తుంది. దాన్ని నీవు పట్టించుకోవల్సిన అవసరం లేదు. అదే ఒక దయ్యం పని చేసే ధోరణి, నిరాశ వాదం అన్నది రాక్షసుని చేతిలో ఆయుధం. అతడు పరిస్థితిని పసికడతాడు. (ఊపేస్తున్న సంజ్ఞ చేస్తున్నారు మదర్) మంచిది, నేను దర్శించేది నిజమైతే అది వ్యతిరేక శక్తులపై నిశ్చయమైన విజయం అవుతుంది నిజంగా - సహజంగానే అతడు తనను తాను బాగా సమర్థించుకోవాలనే చూస్తాడు. అయినా అది ఎప్పటికీ దయ్యమే! నిరాశావాదానికి సంబంధించి తోకను చూసినా అది దయ్యమే, అది అతడి చేతిలో ఉన్న గొప్ప ఆయుధం.

CWM 11:256-57

ఒక అడుగు వెనుకకు వెయ్యండి

మీలో చాలామంది మీ అస్తిత్వానికి పైభాగంలోనే జీవిస్తారు. బయట ప్రపంచానికి పూర్తిగా ప్రభావితమయ్యేంతగా బయటకు ఉంటారు. ఏదో స్వంత శరీరానికి వెలుపల ఉన్నట్లుగా చాలా బహిర్గతంగా ఉంటారు. మీకెప్పుడైనా, మీలాంటి ఒక శోకాకులమైన వ్యక్తి మీకు తారసపడితే కలత చెందుతారు. ఈ ఉన్న సమస్యంతా ఒక అడుగు వెనుకకు వేసి ఆలోచించడానికి అలవాటు పడకపోవడం వల్ల తలెత్తుతుంది. మీరెప్పుడూ ఒక్కక్షణం ఆగి, ఒక అడుగు వెనుకకు వేసి మీలోకి మీరు చూచుకోవాలి. మీ అంతరంగంలోకి లోతుగా వెళ్ళడం నేర్చుకోవాలి. అలా మీలోకి అడుగువేస్తే మీరింక పదిలంగా ఉంటారు. బయట లోకంలో చెక్కర్లు కొట్టే పైపై శక్తులకు మిమ్మల్ని అప్పగించుకోకండి. మీరేదయినా పని తొందరలో ఉన్నప్పుడు కొన్ని క్షణాలు ఆగి మీలోపలికి చూచుకోండి. మీరెంత ఆశ్చర్యానికి లోనౌతారంటే ఎంత శీఘ్రంగానో మీరు చేయబోయే కార్యంలో విజయం సాధిస్తారు. ఎవరైనా మీతో కోపంగా ఉంటే అతడి కోప ప్రకంపనలను ఆకర్షించకండి. వెనుకకు తగ్గండి. అంటే ఇక అతడి కోపానికి మద్దతు దొరకక ఎటువంటి ప్రతిస్పందనా లేక అంతటితో అది సమసిపోతుంది. చెదరగొట్టి మిమ్మల్ని మీరు కోల్పోయేలా చేసే ప్రలోభాలను నిరోధించండి.

ఎల్లవేళలా ప్రశాంతతను మీలో నిలుపుకోండి, వెనుకకు తగ్గి ఆలోచించకుండా దేనిని నిర్ణయించకండి. మాట్లాడే ముందు ఒక్క క్షణం

ఆలోచించకుండా ఒక్క మాట కూడా పలకకండి. ఒక్కమారు వెనుకకు తగ్గి ఆలోచించకుండా మీకు మీరు పనిలోకి దూక కండి. ఈ సామాన్యలోకానికి సంబంధించిందంతా అనిత్యమైనది, అస్థిరమైనది. కాబట్టి కలత చెంది, నిరాశ చెందదగినదేదీ ఇక్కడ లేదు. ఏదైతే నిరంతరం ఉన్నదో, శాశ్వతంగా, అమృతంగా అనంతంగా ఉన్నదో అదే మనం నిజంగా పొందదగింది. మనం గెలుచుకోదగింది, మనం సమర్పించుకోదగింది. అదే దివ్య ప్రకాశం, దివ్యప్రేమ, దివ్య జీవనం- ఈ భూమిపై సంపూర్ణ అభివ్యక్తిగా అభిషిక్తమయ్యే పరమశాంతి, పూర్ణ ప్రమోదం, సకల ఈశత్వం అదే. విషయాల పరస్పర సంబంధాన్ని గ్రహించినప్పుడు, అప్పుడేమి ఏం జరిగినా వెనుకకు తగ్గి మీ లోపలికి అడుగు వేసి అక్కడ చూడండి. అక్కడే అలాగే నిశ్చలంగా ఉండే దివ్యశక్తిని ఆవాహనం చెయ్యండి. జవాబు కోసం వేచి ఉండండి. అప్పుడు మీకే తెలుస్తుంది. నిజంగా మీరేమి చేయాలో గుర్తుపెట్టుకోండి, మీరెంతో ప్రశాంత చిత్తులైన తరువాతనే జవాబును అందుకొన గలరు. ఈ ఆంతరిక శాంతిని అభ్యసించడం, కనీసం చిన్న చిన్నగా ప్రారంభించండి. అది మీలో అలవాటుగా మారే పర్యంతం సాధన చేస్తూనే ఉండండి.

CWM 3:160

నీలోకి చూచుకో

బయట బయటగా చూడకు. నీ అంతరంగంలోకి నీవు చూచుకో నీలోపలే ప్రేమను, శాంతిని, ప్రకాశాన్ని, బలాన్ని కనుగొంటావు. ఆఖరికి సత్యం కూడా ప్రేమ లేకుండా ప్రకటితం కాదు. కేవలం ప్రేమ ద్వారానే సత్యం అభివ్యక్తమౌతుంది. హృదయలోతుల్లో ప్రజ్వరిల్లే అగ్ని ప్రేమ. ప్రేమ మాత్రమే నిన్ను కాపాడుతుంది. ఈ ప్రపంచం ప్రేమకు మాత్రమే తెరుచుకొంటుంది. నేనెప్పుడూ "ఓ పరమేశ్వరా! నీ ప్రేమను ఆవిర్భవింపచేయి!" అని భగవంతుణ్ణి ప్రార్థిస్తాను. నీ అంతరంగంలోకి వెళితే, ప్రేమను కనుగొంటావు. ఇక అక్కడ 'నేను' లేను, 'నీవు' లేవు, 'ప్రభువు' లేడు ఇంకెవరూ లేరు. ప్రేమ మాత్రమే అలరారుతుంది. అదే పుష్టిని, ఓర్పునీ కల్గిస్తుంది. ప్రేమ చిరంతనం, అది నిన్ను విఫలం చేయదు. బాహ్యప్రపంచం తికమక గందరగోళంతో నిండి ఉంటుంది. లోపల జీవిస్తూపో, అక్కడ ప్రేమ వసిస్తుంది.

మదర్ యూ సెడ్ సో ***29:4:64***

విశ్వాసానికున్న శక్తి

వాస్తవానికి, దైవం ప్రతి ఒక్క వ్యక్తికి ఖచ్చితంగా తాను ఎంత ఆశిస్తాడో అంత ఇచ్చి వేస్తాడు. నీకు దైవం చాలా దూరంలో ఉన్నాడు, క్రూరుడు అని నీవు నమ్మితే అతడు కూడా దూరంగానే ఉంటాడు, క్రూరుడుగానే ఉంటాడు. ఎందుకంటే చివరికి నీ మంచికోసం దేవుని ఆగ్రహాన్ని ఎదుర్కోవడం అవసరమై ఉంది. కాళికను ఉపాసించే వారికి అతడు కాళిక. భక్తునికి అతడు సౌందర్యమయం. జ్ఞాన సాధన చేసే సాధకునికి సమస్త జ్ఞానం అవుతాడు. మిథ్యావాదికి అతడు అవ్యక్తం. నాస్తికునికి అతడు ఉనికి లేనివాడు.. ప్రేమకునికి ప్రేమ స్వరూపం. అతడు సోదర భావంతో మెలిగే సన్నిహితుడు. రక్షించడానికి సదా సిద్ధంగా ఉండే విశ్వాసపాత్రుడైన మిత్రుడు. ఎవరైతే అతడిని ప్రతికదలికలో అంతరిక మార్గదర్శిగా భావిస్తారో, వారికి ప్రతిక్షణం దారిచూపే దిక్సూచి అవుతాడు. అతడు నీ దోషాలనన్నింటినీ రూపు మాపుతాడు అని భావిస్తే అలాగే అన్నీ లోపాలను, తప్పిదాలను అవిశ్రాంతంగా తుడిచి పెట్టేస్తాడు. ప్రతిక్షణం నీవు అతడి అక్షయ అనుగ్రహాన్ని అనుభూతి చెందగలవు. నీ లోతుల్లో నీ ఆకాంక్షతో అతడిని ఆశించినంతగా అతడు నిజంగా ఉంటాడు.

నీ ఆకాంక్షకు తగినట్లుగానే దైవం నీతో పాటు ఉంటాడు. అయితే దీని అర్థం నీ బాహ్య స్వభావపు చాపల్యాలకు లొంగి ఉంటాడని కాదు. నీ అస్తిత్వానికి చెందిన సత్యాన్ని గూర్చి ఇక్కడ చెబుతున్నాను. అయినా కొన్ని సార్లు తనకు తానుగా నీ బాహ్య అభీష్టాలకు తగినట్లుగా మెలుగుతాడు. భక్తుల్లాగా, కాసేపు కలిసి ఉంటూ, కాసేపు వేరుగా, ఆనందంలో కాసేపు, నిరాశలో కాసేపు ఉంటూ ఉంటే, దైవం కూడా నీనుండీ కాసేపు వేరుగా, మళ్ళీ ఒకటిగా, నీవు నమ్ముతున్న రీతిలో ఉంటాడు. నీ ధోరణి ఇక్కడ ముఖ్యం, నీ బయటి ప్రవర్తన కూడా. ఈ మనుషులకి అస్సలు తెలియదు విశ్వాసమన్నది ఎంత ముఖ్యమో, అది ఎంతటి చమత్కారమో. లీలల్ని చేసే లీలామయి. దైవం నిన్ను ప్రతిక్షణం పైకి లేవనెత్తాలని తనవైపు లాక్కోవాలని నీవు అభిలషిస్తే నిన్ను ఉద్ధరించడానికి వస్తాడు, నీకు అతి చేరువులో అత్యంత సన్నిహితునిగా ఎప్పటికీ నీతో ఉంటాడు.

CWM 13:76

సరైన ప్రవర్తనకున్న శక్తి

నిజంగా ఎప్పుడూ అత్యుత్తమమైనదే జరుగుతుందా? ఏది జరగాలో అది జరుగుతుంది అన్నది సుస్పష్టం. ఇక మరోలా కాదు. విశ్వజనీనమైన నిర్ణయంతో అది జరిగితీరవలసిందే. కానీ మనం అది జరిగిపోయిన తరువాతనే జరిగింది అనగలం. ముందయితే కాదు. ఎందుకంటే అత్యుత్తమమైనది జరగడమనే జటిల సమస్య ఒక వ్యక్తి సమస్య, అది ఒక ప్రత్యేక వ్యక్తి కావచ్చు, ఒక దేశం కావచ్చు. అంతా వ్యక్తి ప్రవర్తన మీదనే ఆధారపడి ఉంది. పరిస్థితుల సమక్షంలో అవి చోటు చేసుకొనేటప్పుడు నీవు గనుక అత్యుత్తమ స్థాయీ ప్రవర్తనను కనబరచాలి- అది, నీ చేతన సాధ్యమైనంతగా సర్వోన్నత చేతనతో సంపర్కం పెట్టుకొంటే ఖచ్చితంగా నీకు ఆ వ్యవహారంలో శ్రేష్ఠమైనదే జరుగుతుంది. కానీ ఆ చేతనలో నుండీ దిగువస్థాయికి పడిపోతున్నకొద్దీ, దానికి ఫలితంగా అత్యుత్తమమైనది ఏదీ జరుగదు. దీనికి కారణం నీవు ఉండాల్సిన శ్రేష్ఠమైన చేతనలో నీవు లేవు. ప్రతి ఒక్కరి సత్వర ప్రభావంలో సరియైన ప్రవర్తన, ప్రతి పరిస్థితిని సానుకూలంగా మరల్చుకొనే శక్తితో ఉండటమే కాదు, ఆ పరిస్థితిని కూడా మార్చివేయగలదని రూఢి పర్చడానికి నేనెంత వరకైనా వెళ్ళగలను. ఉదాహరణకి ఎవరో నిన్ను చంపడానికి వస్తాడు నీవు గనుక మామూలు చేతనతో ఉండి, సమయస్ఫూర్తిని కోల్పోయే భయంతో వణికిపోతుంటే అతడికి తను వచ్చిన పని పూర్తి చేసుకొని విజయోత్సాహంతో వెళ్ళిపోతాడు. నీవు కొంచెం ఉన్నతస్థాయికి లేచి భయంగా ఉన్నప్పటికి దేవుని సహాయం కోసం పిలువ్. నీపై ఆ వచ్చినవాడి గురి తప్పుతుంది. కొద్దిపాటి గాయాలతో బయటపడతావు. ఏది ఏమైనా నీవు సరైన ధోరణితో ఉండి పూర్తి దివ్య సన్నిధికి చెందిన చేతన నీ చుట్టూ ఉంటే, నీ మీదకు అతడు వేలు కూడా ఎత్తలేడు. ఈ యథార్థమే రూపాంతరీకరణ సమస్యకంతటికీ కీలకమైనది. సర్వవేళలా దివ్యసన్నిధి సంపర్కంలో ఉండు. దానిని అవతరింపజేయడానికి ప్రయత్నించు. అప్పుడు శ్రేష్ఠమైన సంకల్పం చోటు చేసుకొంటుంది. ప్రపంచం ఒక్క ఉదుటున మారలేకపోవచ్చుగానీ, సాధ్యమైనంత మేరకు చాలా వేగంగా ముందడుగు వేస్తుంది. ఇది మాత్రం మరువకు నీవు ఈ సూటి యోగ మార్గాన్ని అనుసరించాలి, అలాకాకుంటే దారి మళ్ళి, పోవాల్సిన త్రోవను కోల్పోయి, నిస్సహాయంగా, చపలంగా ఒక కీకారణ్యంలో తిరుగుతావు.


CWM 3:154-55

ఏ క్షణాన పరిస్థితి చెడు నుండి అతిచెడ్డగా మారుతుందో, అప్పుడు మనం అక్కడ సర్వోత్కృష్ట విశ్వాసాన్ని పాదుకొల్పాలి. మనం తెలుసుకోవలసిన ఇంకొక విషయం దైవానుగ్రహం మనల్ని ఎప్పటికీ ఓడిపోనివ్వదు అని.

సూర్యోదయానికి ముందు ఉండే కాలం ఎప్పుడూ చీకటిగానే ఉంటుంది. స్వాతంత్ర్యం రావడానికి ముందు బానిసత్వం అన్నిటికన్నా బాధాకరం.

కానీ హృదయాన్ని విశ్వాసంతో సుసంపన్నం చేసినపుడు అది ఆద్యంత రహితమైన ఆశాజ్యోతిని ప్రజ్వలింపజేస్తుంది. అప్పుడు అది నిరాశ, అధైర్యం లాంటి వాటికి స్థానము ఇవ్వదు.

CWSA 15:177



Vol. 53, No. 7 Date of Publication Registered: PY/41/2021-23
July 2023 1st July 2023

AKHILA - Akhila Bharata Patrika (Telugu)

Registered with the Registrar of Newspapers for India: No. 23593/72 (monthly)

Matter shall reveal the Spirit's face. — Sri Aurobindo



Flower on the Cover:

Cheerfulness

(A joyful smile of nature.)

(Spiritual significance and explanation of the flower given by the Mother)

Botanical name: Gaillardia pulchella 'Picta (Sweet)'

Owner: Sri Aurobindo Society
Printer: Swadhin Chatterjee for Sri Aurobindo Ashram press
Publisher: Pradeep Narang for Sri Aurobindo Society
Published from: Society House, 11 Saint Martin Street, Puducherry - 605001
Printed from: Sri Aurobindo Ashram Press,
No. 38, Goubert Avenue, Puducherry - 605 001, India
Editor: K. V. Rao

Single copy Rs. 30 **Annual Subscription Rs. 200 (in India)**

A Monthly Published by

SRI AUROBINDO SOCIETY-605001



అఖిల

అఖిల భారత పత్రిక

ఆగష్టు 2023

అవతారం

విషయ సూచిక

సంపాదకీయం :

భారతీయ ఆధ్యాత్మిక చింతనకు సంబంధించిన భావనలో అవతార సిద్ధాంతం ప్రముఖమైనది. స్వయంగా శ్రీ అరవిందుల యోగంలో చాలా ప్రధాన విషయం అది. అయినప్పటికీ దానిని గురించిన చర్చ జరిగింది చాలా తక్కువే. దాని ప్రధాన పార్శ్వాలలో దైవం మానవుడుగావడం అనే ఆసక్తికరమైన, ఆసక్తి రేకెత్తించే సంవిధానం గురించి ఈ సంచిక స్పృశిస్తుంది.

అనువాదం : కె.వి. రావు

సంచిక అనువాదకులు



స్వర్గములనిచటకు దెచ్చువారు
స్వయముగా పంకమందు దిగవలె
భువి స్వభావ భారమును మోయవలె
బాధాపథమ్మున నడిచి తీరవలె
ఇచటి మలిన భువిపైకి
నా దైవత్వమును బాధించుచు దిగి వచ్చితిని
చావు పుట్టుకల రెండు ద్వారముల మధ్య
అజ్ఞానినై శ్రమించుచు మానవునిగా నెదిగితి
భయానక హైన్యత, పంకిలముల మధ్య
బంగరు నదీ నాదానికొక ఆధారమునకై
ఆరని అగ్నికొక ఆవాసమునకై
లోతుగా, దీర్ఘముగ శోధించుచుంటి

CWSA 2:534

అవతార సిద్ధాంతం

మానవీయతలో దైవత్వ అభివ్యక్తి

భారతదేశానికి ప్రాచీన కాలం నుండి, అవతార వాస్తవికతలో, రూపంలో భగవదవతరణలో, మానవునిలో దివ్యత్వ అభివ్యక్తిని గురించి ఒక బలమైన నమ్మకం ఉంది. ఈ నమ్మకం పశ్చిమ దేశాల మనస్సుపై ఏనాడూ ముద్రితం కాలేదు. ఎందుచేతనంటే సహేతుకతలోనూ, సామాన్య చేతనలోనూ జీవితం యెడల దృక్పథంలోనూ ఏ విధమైన మూలాలు లేకుండానే, అందరికీ అందుబాటులో వుండే క్రైస్తవం ద్వారా, అదొక భగద్విషయక మౌఢ్యంగా చిత్రించబడింది. కాని భారతదేశంలో జీవితం యెడల వేదాంత దృష్టికి సంబంధించిన తార్కిక పర్యవసానంగా అది యెదిగింది, కొనసాగింది, జాతి చేతనలో దృఢంగా వ్రేళ్ళూనుకొన్నది. సమస్త సృష్టి భగవదభివ్యక్తి. ఎందుకనంటే ఆతడొక్కడే సృష్టి, ఆ ఒక్క సత్యతకు సంబంధించిన నిజమైన రూపంగా లేక ఒక కల్పనగా తప్ప మరేదీ లేదు. అందుచేత ప్రతి సచేతన జీవీ అంశపరంగా లేక ఏదోవిధంగా పైకి కన్పించే నామ రూప సాంతత్వంలోనికి, దిగివచ్చిన అనంతతయే. కాని అదొక ఆచ్ఛాదిత అభివ్యక్తియే. సాంతతలోని ఆత్మ అజ్ఞానం చేత, పాక్షికంగా గాని లేక మొత్తంగా గాని మూసివేయబడిన చేతనకు, దైవ పరమోన్నత అస్తిత్వానికి మధ్య ఒక అంతస్తుల శ్రేణి ఉంది. దేహం ధరించిన సచేతన అంతరాత్మ దివ్యాగ్ని విస్ఫులింగం ఆ అంతరాత్మ మనిషిలో స్వీయ అజ్ఞానం నుండి ఆత్మవంతమయ్యేటట్లు అభివృద్ధి చెందుతూ ఆత్మ-జ్ఞానంలోనికి వికసిస్తుంది. జగత్తు సృష్టి రూపాలలోకి సాంతతను తాను గ్రుమ్మరించుకొంటూ, దైవం కూడా సాధారణంగా తన శక్తుల వికసనంలో తన జ్ఞాన ఊర్జంలో, విస్తారతలో ప్రేమ, సంతోషం, అస్తిత్వపు అభివృద్ధి చెందిన క్రియాశక్తిలో క్రమస్థాయిలో, తన దివ్యత్వపు పార్శ్వాలలో బహిరంగపరచుకొంటాడు.

తాను తనపైకి మానవ రూపాన్ని, మానవ కర్మాచరణ పద్ధతిని స్వీకరించేటపుడు, దైవచేతన శక్తి, దానిని శక్తులతోనూ, పరిమాణాలతోనూ మాత్రమే, అంచెలంచెలుగా తన బాహ్య పార్శ్వాలచే మాత్రమే గాక, తన శాశ్వత ఆత్మజ్ఞానం నుండి స్వాధీనం చేసుకుంటాడు. అజం (ఎప్పుడూ

జన్మించనిది అను) తనను తానెరిగి, మానవ అస్తిత్వ చట్రంలో కర్మ చేయడం, జన్మించానని తెలుసుకోవడం, షరతులకు లోబడిన అభివ్యక్తికి సంబంధించిన పతాకస్థాయి అవుతుంది. అది దైవత్వపు పూర్ణ సచేతన అవతరణ అవుతుంది. అదే అవతారం.

CWSA 19:13-14 — *శ్రీ అరవిందులు*

అవతారాలన్నింటి మూలం

అవతారం గురించి మాట్లాడమని ఈ రోజు నన్నడిగారు. మొదటగా నేను చెప్పదలచుకొన్న ఈ విషయం మీద శ్రీ అరవిందులు అదివరకే వ్రాసారు. నన్ను ప్రశ్న అడిగిన వ్యక్తి శ్రీ అరవిందులేం వ్రాసారో దానిని చదవడంతో మొదలు పెడ్తే మంచిది.

దానిని గురించి నేను మాట్లాడను, నీ అంతట నీవు దానిని గురించి చదివితేనే మంచిది. ఆధ్యాత్మిక, గుహ్యజ్ఞాన సంప్రదాయానికి సంబంధించిన, తెలిసిన రెండు విధాలైన అత్యంత పురాతన మార్గాల కన్నా చాలా పాత సంప్రదాయాన్ని గురించి మాట్లాడతాను. ఆ రెండు మార్గాలు, ఒకటి వైదిక, రెండు చాల్డియన్. అది మనకు తెలిసిన ఈ రెండు సంప్రదాయాలకు మూలంలో ఉన్నట్లు కన్పిస్తున్నది. అందులో ఈ విధంగా చెప్పారు. శత్రుశక్తుల హిందూ సంప్రదాయంలో అసురులు అనేబడే శక్తుల చర్య ఫలితంగా, దివ్య వెలుగు, అంతర్నిహిత చేతనల ధర్మం ప్రకారంగా అభివృద్ధి చెందడానికి బదులుగా, ప్రపంచం, మనకు తెలిసిన అంధకారం, నిశ్చేతన, అజ్ఞానాల్లో మునిగిపోయింది. ఈ భ్రష్టమైన విశ్వాన్ని రక్షించగల ఒక ప్రత్యేక జోక్యత కోసం పరమోన్నత మూలాన్ని వేడుకొంటూ దివ్య సృజనాత్మక శక్తి అర్థించింది. ఈ ప్రార్థనకు సమాధానంగా పరమోన్నత మూలం నుండి దివ్యప్రేమ, దివ్య చేతనల ఒక ప్రత్యేక రూపం వెలువడింది. అది ఆది దివ్యచేతన, దివ్య ప్రేమలకు మేలుకొలిపే కార్యం ప్రారంభించడానికి అత్యంత నిశ్చేతనా పదార్థంలోనికి సరాసరి తనను తాను దింపివేసుకొంది.

చాలా అంధకార గుహ అట్టడుగున గాఢ నిద్రలో, విశాలంగా పరుచుకొని ఈ పురుష వున్నట్లు పాత కథలలో వర్ణించబడింది. ఆతని నిద్రలో, ఆతని నుండి స్ఫటిక సదృశ వెలుగు కిరణాలు వెలువడ్డాయి. అవి క్రమంగా

నిశ్చేతనలో విస్తరించి, అచట దివ్యమైన మేలుకొలుపు కార్యాన్ని ఆరంభించ డానికి నిశ్చేతనకు సంబంధించిన సమస్త మూలకాలలో తమను తాము జొనుముకున్నాయి.

సచేతనంగా, ఈ నిశ్చేతనలోనికి ప్రవేశిస్తే, ఇప్పటికీ ఇంకా గాఢ నిద్రలోనే తన నుండి ప్రతిరూపాన్ని విడుదల చేసే కార్యాన్ని కొనసాగిస్తున్న తన దివ్య వెలుగును విస్తరింపజేస్తున్న ఈ అద్భుతమైన అదే పురుషను చూడగలరు. నిశ్చేతన ఇకనెంత మాత్రం నిశ్చేతన గానంత వరకు, ప్రపంచం నుండి అంధకారం అదృశ్యమయ్యేంత వరకు, సకల సృష్టి అతి మానస చేతనకు మేలుకొనేంత వరకు ఆ పని చేస్తూనే ఉంటాడు.

చెప్పుకోదగ్గ విషయమేమిటంటే ఈ అద్భుతమైన పురుష మరో చివర ఉన్న పురుషను పోలి ఉండడం విచిత్రం. ఆ మరో చివర ఉన్న పురుషను నేను ఒక రోజున నా అంతర్ దృష్టిలో దర్శించాను. ఆ పురుష, రూప, రూప రహిత పరిధులకావల ఉన్నట్లు దర్శించాను. కాని ఆ పురుష బంగరు, ముదురు ఎరుపురంగు వైభవంలో ఉన్నాడు. అదే సమయంలో నిద్రలో వున్న యితర పురుష, అనేక రంగుల కిరణాలను ప్రసరింపజేస్తూ వున్న మెరిసే వజ్రశ్వేత వర్ణంతో ఉన్నాడు.

వాస్తవానికి సకల అవతారాలకు ఇది మూలం. చెప్పాలంటే అతడు విశ్వ జనీన అవతారం. ఆతడు అధికాధికంగా సచేతన దేహాలను ధరించాడు. చివరకు ఒక విధంగా గుర్తింపు పొందిన పురుష పరంపరగా, విశ్వాన్ని, ఒక నిరంతర పురోగమనం ద్వారా, అతిమానస దివ్య వెలుగును సంపూర్ణంగా స్వీకరించి, అభివ్యక్తి చేయడానికి సంసిద్ధమయ్యేటట్లు సన్నద్ధం చేసే కార్యాన్ని పరిపూర్ణం చేయడానికి పరాత్పరుని నుండి సరాసరి దిగివచ్చాడు.

ప్రతి దేశంలోనూ, ప్రతి సంప్రదాయంలోనూ, విభిన్న పరిమితులలో, విభిన్న వివరాలతో, ప్రత్యేక రూపాలతో, ఈ సంఘటన ఒకప్రత్యేకరీతిని చెప్పారు. కాని నిజం చెప్పాలంటే ఈ కథలన్నింటి మూలం ఒక్కటే. మధ్యంతర దశలన్నింటి ద్వారా సాగకుండా దైవ క్రియాశక్తులను స్వీకరించగలిగేటట్లు ఈ విశ్వ పదార్థాన్ని మేలుకొలుపుటకు వీలుగా అత్యంత అంధకార పదార్థంలో సరాసరిగా జరిగిన పరాత్పరుని సచేతన జోక్యంగా మనం చెప్పుకుంటున్నాం. విశ్వ పదార్థం అధికాధికంగా సిద్ధమైనంత మేర,

ఆ కార్యం అధికాధికమౌతూ, తన గమనంలో మరింతకింత వేగవంతమౌతూ, మరింతకింతగా సచేతనమౌతూ కూడా, మరింతకింతగా ప్రభావవంతమూ, నిశ్చాయకత గలదిగా అవుతూ ఉన్నట్లు ఈ వివిధ అవతారాల మధ్య ఉండే విరామ కాలాలు, తగ్గుతూ, తగ్గుతూ వస్తాయి.

సమస్త విశ్వం పరాత్పరుని సంపూర్ణ అవతారంగా తయారయ్యేంత వరకు ఆ పని హెచ్చుతూ, తీవ్రతరమౌతు ఉంటుంది.

CWSA 9:332-34 — ది మదర్

అవతార జీవన బాహ్య పార్శ్వాలు

ఆ విధంగా అవతార భావనను మనం అర్థం చేసుకొన్నప్పుడు తన ప్రస్తుత విషయమైన గీతకు సంబంధించిన ప్రాథమిక బోధనకు గాని లేక ఆధ్యాత్మిక జీవితానికి గాని, సామాన్యంగా బాహ్య పార్శ్వానికి గాని, ద్వితీయ ప్రాధాన్యత మాత్రమే ఉంటుంది. క్రీస్తుకు సంబంధించిన చారిత్రకతపై యూరపులో చెలరేగిన విరుద్ధ వాదనలు లాంటివి ఒక ఆధ్యాత్మిక మనస్కుడైన భారతీయునికి, ఎక్కువ కాలాన్ని వ్యర్థం చేయడంగా అన్పిస్తుంది. దానికతను కొంత చారిత్రాత్మకత ఉన్నదని ఒప్పుకొన్నా మతపరమైన ప్రాముఖ్యతున్నదని అంగీకరించడు. సిలువ సంకేతంగా గల భగవంతునితో మనిషి పాప పరిహారం ద్వారా సహజ ధర్మమైన భారం నుండి తప్పించుకొని, ఆతని బోధన వెలుగులోని ఉద్ధరితమై జీవిస్తాడని, మనం ఆధ్యాత్మిక అనుభవం ద్వారా, ఆంతరిక క్రీస్తును తెలుసుకోగలిగినంత కాలం, చివరకు వండ్రంగి జోసెఫ్ కొడుకైన జీసస్ కచ్చితంగా నాజరెత్ లేక బెత్లెహాంలో నివసించి, బోధించి, ఒక నిజమైన లేక కట్టుకథయైన రాజద్రోహ నేరం మీద చంపివేయబడ్డాడనే దానికేమి విలువ ఉంటుంది? భగవంతునిగా తయారైన మనిషి క్రీస్తు గనుక మన ఆధ్యాత్మి అస్తిత్వంలో నివసిస్తే, మేరీ పుత్రుడు భౌతికంగా నివసించాడా, జూడియాలో బాధపడి మరణించాడా అనేది, మనకు చాలా చిన్న విషయంగా కన్పిస్తుంది. అలాగే మనం ప్రధానంగా చెప్పుకుంటున్న కృష్ణుడు, దైవం శాశ్వత అవతారం. అంతేగాని చారిత్రక బోధకుడు,మానవ నాయకుడు గాదు.

CWSA 19:15

అవతారం - చారిత్రకత, సంకేతాలు


ఇప్పుడు అవతారం, సంకేతాలను చూద్దాం. అవతారానికి సంబంధించిన బాహ్య వాస్తవికతపై, ఆతని బాహ్య జీవన సంఘటనపై జీవిత చారిత్రక విషయాలపై ఆధునిక చరిత్రలో చాలా పెద్ద మౌలికమైన తప్పిదం కనిపిస్తుంది. ఆతనితో పాటు వచ్చిన లేక తన చర్యవల్ల ఉనికి వల్ల క్రిందికి తెచ్చిన ఆధ్యాత్మిక సత్యత, మహాశక్తి దివ్య ప్రభావం మనకు ముఖ్యం. అన్నింటికంటె ముందు, ఒక ఆధ్యాత్మిక మనిషి జీవితంలో ప్రధాన విషయమేమిటంటే, అతడేం చేశాడు? లేదా ఆతని కాలం నాటి మనషుల దృష్టికి బాహ్యంగా ఆతడేమిటి (అదే కదా చారిత్రకత లేక జీవిత చరిత్ర అంటే. కాదా?) అనేదిగాను, ఆతడేమిటి? అంతరంగికంగా అతడేం చేశాడు ముఖ్యం. అదే, అది మాత్రమే ఆతని బాహ్య జీవితానికసలు విలువనిచ్చేది. బాహ్య జీవితానికేదైనా విలువ ఉన్నదంటే అది ఆంతరిక జీవితాన్నిబట్టి వుంటుంది. ఆధ్యాత్మిక మనిషి ఆంతరిక జీవితం కనీసం కొంతమంది గొప్పవారిలో చాలా విశాలమైనది నిండైనది. ఏ జీవిత చరిత్ర వ్రాసే వ్యక్తైనా, లేక చరిత్ర కారుడైనా, దాన్నంతా ఒడిసిపట్టగలిగి లేక చెప్పగలడని ఆశించలేకున్నప్పటికీ బాహ్య జీవితంలో విశిష్టతను సంతరించుకొన్నదేదైనా, అదలా యెందుకైందంటే తనలో అదివరకే సాక్షాత్కరింపజేసుకొనబడిన దాని సంకేతం అది గనుక. ఇంకా ముందుకలా చెప్పుకొంటూ పోయి, ఆంతరిక జీవితం కూడా వెనుక గల దైవత్వపు ఒక ప్రకటనగా, దైవత్వపు ప్రపంచాన్ని ప్రకటించే ఒకసజీవ సంకేతం మాత్రమే అని కూడా చెప్పవచ్చు. కనుక కృష్ణుని గురించి కథలు, అవి యెంత ఆషామాషీగా చెప్పబడినవైనా, భువిపై ఆయన చర్యలు కళ్ళులేక, మనుషులకు కృష్ణుడు ఏమై ఉండి వున్నాడో, ఏమై యిప్పుడున్నాడో, అవి కృష్ణుని ఆకారంలో తనను తాను వ్యక్తపరచుకొన్న దైవత్వపు సంకేతాత్మిక అనురూపాలు. బుద్ధుని వైరాగ్యము, మారుడు అతనిని ప్రలోభ పెట్టడం, బోధి వృక్షం క్రింద ఆయన వివేకోదయం లాంటివి సంకేతాలే. అలాగే కన్యకు జన్మించడం, ఎడారిలో ప్రలోభం, క్రీస్తు శిలువ వేయబడడం, కచ్చితత్వంతో నమోదు చేయబడిన చారిత్రక సంఘటనలు కానప్పటికీ అవి దేనిని సంకేతాల రూపంలో తెలియజేశాయో అది సత్యం. క్రీస్తు బుద్ధుని గురించిన బాహ్య వాస్తవాలు, ఇతరులు అనేక మంది జీవితాలలో సంభవించిన దానికంటే

అధికమైనవేం కాదు. ఆధ్యాత్మిక ప్రపంచంలో బుద్ధునికి లేక కృష్ణునికి అంత అపరిమిత స్థానాన్నేది కట్టబెట్టింది? ఏ బాహ్య సంఘటన లేక, ఏ బోధన కంటె ఎంతో అధికంగా వారి ద్వారా ఏదో అభివ్యక్తమైంది. దాని గురించి మనకు ఋజువు పరచుకోగలిగిన చారిత్రకత చాలా తక్కువే లభిస్తుంది. అయినప్పటికీ అదే మనం ముఖ్యంగా తీసుకోవలసింది. కనుక, సంకేతాలను గురించి కృష్ణ ప్రేమ్ చెప్పినది ప్రాథమికంగా సరైనవేగా కన్పిస్తున్నది. భౌతిక మనస్సునకు మాత్రమే ఒక మనిషి, ఘటనలు, చర్యలు ముఖ్యం. క్రీస్తు, బుద్ధ బోధనలు సైతం కేవలం మానసిక బోధనలుగా గాక ఆధ్యాత్మికంగా వారిలోని ఆధ్యాత్మిక స్థితుల లేక ఆంతరికంగా సంభవించిన వాటి ప్రకటనగా సత్యం. భువిపై వారి జన్మద్వారా, (ఏ విధంగా చూచినా అంతర్నిహితంగా అత్యంత క్రియాశీలంగా) వారు, ఇతరులలో సాధ్యమయ్యేటట్లు చేశారు. శాఖాపరమైన గోడలు ఒక తప్పిదం. వివిధ వాదనల కలయిక, ఆధ్యాత్మిక కార్యాన్ని నెరవేర్చడానికే గాక మానసిక కార్యాన్ని నెరవేర్చేందుకు పరమసత్యాన్ని పరిమితం చేయడం. శాశ్వతునికై నిలబడలేనప్పుడు అవతారానికి గాని, గురువుకు గాని అర్థం లేదు. ఆరాధకునికి, లేక శిష్యునికి వారిని అవతారంగా, గురువుగా చేసేది అదే.

CWSA 28:478-80

ఒక అవతారం ఏతెంచినప్పుడు ఆయన కేవలం ధార్మిక మార్గదర్శి గా మాత్రమే కాక ఒక రాజకీయనాయకునిగా, ఒక విద్యావేత్తగా, సమాజాన్ని సముద్ధరించే వాడిగా, సంఘటిత పరిశ్రమకు ఆద్యుడిగా, ఒక కవి, ఒక కళాకారుడు, ఒక ఉన్నత విద్యార్థికి ఉండే ఆత్మను కలిగిఉండేవాడిగా, అంటే సంక్షిప్తంగా మన భవిష్య భారతావని యొక్క వైభవోపేత రూపమై ప్రపంచాన్ని రూపాంతరీకరించి మార్గదర్శనం చేసేవిధంగా ఉండాలి.

CWSA 8:249 — *శ్రీ అరవిందులు*



నిరపేక్షుడు, పరిపూర్ణుడు, సర్వాంతర్యామి,
మనలో నెలకొని వున్న మన రహస్య ఆత్మ,
మన అస్తవ్యస్త అసంపూర్ణమైన ముసుగును తాను తగిలించుకొనెను
ఈ రక్తమాంసపు అద్దింటినే తన స్వంత ఇల్లుగా చేసుకొనెను,
తన చిత్తరువును మానవ పరిమాణంలో యిమిడ్చెను
తన పరిమాణానికి తగినట్లుగా మనమెదగాలని;
అప్పుడిక అది దివ్యత్వపు చిత్రమౌను.
ఆ రూపకర్త మనను మరల బలంగా పోతపోసి
ఈ మృత ప్రాయపు మూసపైన దివ్యత్వపు ఒక ప్రణాళికను విధించు
మన చిన్ని మనస్సులను తన అనంత మనస్సులోనికి లేవనెత్తును,
చిరంతనంతో క్షణాన్ని తాకుచు.
ఈ పరివర్తన భూమి స్వర్గానికి మిగులు అప్పు :
ఒక పారస్పరిక ఋణానుబంధం మనిషిని పరాత్పరమునకు కట్టి వేయును;
తాను మన ప్రకృతిని వహించునట్లు మనమంతా తన ప్రకృతిని ధరించాలి;
మనం పరాత్పరుని పుత్రులం, ఆయనలా ఉండాలి.
అతడి మానుష అంశలైన మనం దైవంగా ఎదగాలి.
దైవంలో మన జీవితమొక సంక్లిష్టత ఆయన వద్దే ఉన్నది దానిని సరిచేసే కీలకం.

సావిత్రి : 67 — *శ్రీ అరవిందులు*

అవతార కార్యం

తదుపరి పరిణామ దశకు జతపరచడం

చేతన ఒక నిచ్చెన లాంటిది. ప్రతి మహాయుగంలో ఒక మహాపురుషుడు ఈ నిచ్చెనకు ఇంకొక మెట్టును జోడించగల్గి, అసలిక సాధారణ చేతనకు తావు లేని స్థానానికి చేరుకొని ఉన్నాడు. ఒక స్థాయికి చేరుకొని పూర్తిగా పదార్థ చేతనలో నుండీ బయట పడడం మనిషికి సాధ్యమే, కానీ ఆ మనిషి నిచ్చెననింకా నిలిపి ఉంచడు. అదే సమయంలో విశ్వంలో గొప్పగొప్ప యుగాలకు చెందిన మహత్కార్యం ఈ భౌతిక పదార్థంలో గల సంబంధాన్ని నష్టపోకుండా చేతన నిచ్చెనకు మరో మెట్టును జోడించ గల్గే సామర్థ్యంతో జరిగింది. అలాగే విభిన్న తలాలకు మధ్య ఉన్న సంబంధాన్ని త్రెంచి వేసే శూన్యానికి బదులుగా ఉన్నత శిఖరం నుండీ అడుగు భాగం వరకూ సంబంధాన్ని నిలుపుకొంటూ ఉన్నతానికి ఎదిగిన సామర్థ్యం ఉండి ఉన్నది. పైకి ఆరోహించి మళ్ళీ కిందికి దిగివచ్చి శిఖరాన్ని, పాతాళాన్ని అనుసంధానించ డమే మొత్తం సిద్ధిలోని రహస్యం. అదే అవతారం చేసే కార్యం. ప్రతి పర్యాయం అతడు నిచ్చెనకు మరొక మెట్టును జోడిస్తాడు. అప్పుడు భూమి ఒక క్రొత్త సృజనతో పరిఢవిల్లుతుంది. ఇప్పుడు జోడించబడుతున్న మెట్టును లేదా దశను శ్రీ అరవిందులు అతిమానసంగా పిలిచారు. దానికి ఫలితంగా చేతన అతిమానస లోకంలోకి ప్రవేశించగల్గి, తన వైయక్తిక రూపాన్ని, వైయక్తీకరణ స్థితిని నిలుపుకుంటూనే ఒక కొత్త సృష్టి స్థాపన చేయడానికి క్రిందికి దిగివస్తుంది. ఖచ్చితంగా ఇది కడపటి దశ మాత్రం కాదు, అస్తిత్వానికి ఇంకా చైతన్య శ్రేణులు ఉన్నాయి. కాని ఇప్పుడు మనం అతిమానసాన్ని దింపడం కోసం, ఈ ప్రపంచ పునర్వ్యవస్థీకరణను ప్రభావితం చేయడం కోసం, ప్రపంచాన్ని వెనుకకు త్రిప్పి అసలు దివ్య క్రమంలోకి మళ్ళించడానికి పనిచేస్తున్నాం. ఇది ప్రధానంగా క్రమత్వానికి చెందిన సృష్టి. ఇక్కడ ప్రతి దానినీ దానిదైన అసలు స్థానంలో పునఃస్థాపించడం జరుగుతుంది. ప్రస్తుతం పనిచేసే శక్తి లేదా ఊర్జం మహా సరస్వతి, పరిపూర్ణ కార్యనిర్వాహక అధి దేవత.

నిరంతరతను సాధించే కార్యం వ్యక్తిని శిఖరాన్ని చేరడానికి, దిగిరావడానికి, పైన ఉన్న దానిని ఈ పదార్థంలోనికి తేవడానికి అనుమతిస్తుంది. ఇది చేతన

లోపలివైపు జరుగుతుంది. దీనిని చేయడానికి నియమితుడైన అవతార పురుషుడు ఒక బందీ గృహంలో మూయబడి ఉన్నా తాను ఎవరినీ చూడకున్నా, బయటకు రాకున్నా తన పని తాను కొనసాగించగలడు. ఎందుకంటే ఈ కార్యం చేతనలో జరుగుతుంది. ఇది అతిమనస్సుకు పదార్థ జగత్తుకు మధ్య జరిగే అనుసంధాన కార్యం. తాను గుర్తించబడాల్సిన పనిలేదు. ఈ సచేతనమైన సంబంధాన్ని ప్రతిస్థాపించే నిమిత్తం ఎలాంటి బాహ్య శక్తి తనకు అవసరం లేదు. ఏది ఏమైనా ఒక్కసారి కనుక ఈ సంబంధం కుదురుకొంటే నూతన సృష్టి రూపంలో ఈ బాహ్య ప్రపంచంలో అది తన ప్రభావాన్ని చూపుతుంది. అది ఒక నమూనా నగరంగా మొదలయ్యి, ఒక పరిపూర్ణ లోకంగా ముగుస్తుంది.

CWM 3:178-79 శ్రీమాత

దివ్యత్వంలోకి మనిషి ఉద్గమించడం

దివ్యత్వంలోకి ఈ మనిషి ఉద్గమించి, మానవజాతిలోకి దేవుడు దిగిరావడానికి సహాయపడకపోయిన పక్షంలో, అవతార తత్వం కేవలం ధర్మం కోసం అయ్యుంటే, అదిపనికిరాని విషయమే అవుతుంది. మామూలుగా అధికారం, న్యాయం లేదా సద్వర్తనకు సంబంధించిన ప్రమాణాలు, దివ్య సర్వ సంపన్న శక్తి ద్వారా, దాని సామాన్య సాధనాసంపత్తి ద్వారా, గొప్ప వ్యక్తుల ద్వారా లేదా ఉద్యమాలు, సాధు సత్పురుషులు, రాజుల జీవిత కార్యాల ద్వారా, ధార్మిక ప్రబోధాల ద్వారా జరిగే వాటికి ఎట్లాంటి వాస్తవ అవతారం దిగి రావాల్సిన అవసరం లేదు. అవతారమన్నది మానవ స్వభావంలో దివ్య ప్రకృతి అభివ్యక్తీరణగా వస్తుంది. క్రీస్తుతత్వం, కృష్ణ తత్వం, బుద్ధుని తత్వ అవతరణ ప్రకారంగా మానవ స్వభావం దాని నియమ సూత్రం, భావన, చింతన, ఉనికి క్రీస్తుతత్వం, కృష్ణ తత్వ విధానాల్లో మలచబడి, దానికదే దైవంలో పరివర్తనం చెందడం అన్నమాట. అవతారం ప్రతిష్టించే ధర్మం, నీతి సూత్రం ఈ ఉద్దేశ్యాన్ని ప్రధానంగా పూర్తి చేసేందుకే. కృష్ణుడు, బుద్ధుడు, క్రీస్తు ఈ ఉద్దేశానికి కేంద్రస్థానంలో నిలిచి, ఒక ప్రవేశ ద్వారంగా ఉండి, తన గుండానే ఈ అవతార పురుషుడు జనులు అనుసరించే మార్గాన్ని ఆవిష్కరిస్తాడు. అందుచేతనే ప్రతి అవతారం స్వయంగా తాను దానికి ఉదాహరణగా మానవుల ముందు నిలిచి, తానే మార్గాన్ని ద్వారం కూడా తానే అని ప్రకటిస్తాడు; దైవంతో తన మానవత్వానికి గల ఏకత్వాన్ని కూడా ప్రకటిస్తాడు. మానవ పుత్రుడు తాను ఎవరి నుండీ క్రిందిదిగి వచ్చాడో ఆ

పరమపిత ఒక్కటే, మానవ శరీరాన్ని ఆశ్రయించి ఉన్న 'కృష్ణుడు మానుషీమ్ తనుమాశ్రితం', పరమ ప్రభువు, సర్వజీవులకు స్నేహితుడు తన స్వకీయ అస్తిత్వంలో అక్కడ, మానవ నమూనాలో ఇక్కడ వ్యక్తమైన రెండు వ్యక్తీకరణలు ఒకే దివ్య పురుషోత్తమునివి.

CWSA 19:168-69

ధర్మ పునరుద్ధరణ

అప్పుడు మనం గీతలో అవతారం కార్యం గురించి ఇచ్చిన వివరణను అర్థం చేసుకోవాలంటే ధర్మం యొక్క భావాన్ని దాని సంపూర్ణ, గాఢ, విస్తార భావనలో అర్థంచేసుకోవాలి, ఎందుకంటే ఆంతరిక, బాహ్య ధర్మం చేతనే దివ్యసంకల్పము, దివ్యజ్ఞానములు మానవజాతి ఆధ్యాత్మికపరిణామం పైన, దాని పరిస్థితులపైన, జాతిజీవితంలో దాని ఫలితాల పైన పనిచేస్తాయి. భారతీయ భావన అయిన ధర్మం కేవలం మంచి, న్యాయం, సత్యం, నైతికత మాత్రమే కాదు. మానవునికి ఇతర జీవులతో, ప్రకృతితో, భగవంతునితో వున్న సమస్త అనుబంధాల మొత్తం పాలనావ్యవస్థ, ఇది చర్యలు, రూపాలు, ధర్మాల్లో, ఆంతరికబాహ్యజీవిత రూపాల్లో, ప్రపంచంలోని అన్ని రకాల అనుబంధాల క్రమాల్లో పనిచేసే ఒక దివ్యసిద్ధాంత దృక్పథం నుండి యోచించబడింది. ధర్మమంటే మనకాధారంగా దేనిని పట్టుకొంటామో, మన ఆంతరిక బాహ్య కార్యకలాపాల మధ్య భేదం లేకుండా ఏది ఒకటిగా పట్టి ఉంచుతుందో ఆ రెండూ కూడా. తన ప్రాథమిక అర్థంలో ఇది మన సకల కార్యకలాపాలను రహస్యంగా నియమించే మన స్వభావంలోని ఒక సారభూత ధర్మం, ఈ అర్థంలో ప్రతి జీవి, రకం, జాతి, వ్యక్తిగతం, సమూహం -తమ స్వంత ధర్మాన్ని కల్గివుంటాయి. తర్వాత మనలో దివ్యస్వభావం వృద్ధిచెంది, ప్రకటితం కావాలి, ఈ జ్ఞానంలో ధర్మమంటే మన అస్తిత్వంలో వృద్ధి చెందే ఆంతరిక పనివిధానాల నియమం. మూడవది మననుంచి వెళ్ళే ఆలోచనను, చర్యను, ఒకరితో ఒకరికున్న పరస్పర సంబంధాలను పాలించే నియమం అక్కడ వుంది, ఈ రీతిగా ఇది మన స్వీయవృద్ధికి, దివ్య ఆదర్శం వైపుగా మానవజాతికి ఉత్తమంగా సహాయపడుతుంది.

సాధారణంగా ధర్మమన్నది ఏదో శాశ్వతమైనదిగా, మార్పులేనిదిగా చెప్పబడింది, అందువలన ఇది మూలాధారక సిద్ధాంతంలో, ఆదర్శంలో అది

అలానే వుంది, కానీ తన రూపాలలో ఎడతెగకుండా మారుతూ, పరిణమిస్తూ వుంటుంది. ఎందుకంటే మనిషి అప్పటికే ఆ ఆదర్శాన్ని కలిగి వుండడు, లేదా అందులో జీవించివుండడు కానీ ఎక్కువతక్కువగా పరిపూర్ణంగా దానివైపు ఆకాంక్షిస్తూవున్నాడు, దాని జ్ఞానం వైపు, సాధన వైపు వృద్ధి చెందుతూవుంటాడు. ఈ అభివృద్ధిలో దివ్య స్వచ్ఛతలోకి, విస్తారతలోకి, కాంతిలోకి, స్వేచ్ఛ, శక్తి, బలము, సంతోషము, ప్రేమ, మంచి, ఏకత, సౌందర్యములలోకి వృద్ధిచెందడానికి ధర్మమే సహాయం చేస్తుంది. అలాగే దాని పెంపుదలను ప్రతిఘటించే మొత్తానికి, దీని నియమానికి లోనవని దానికి విరుద్ధంగా తన ఛాయను, నిరాకరణను నిలబెడుతుంది, అలాగే తన దివ్యవిలువల రహస్యాన్ని వెల్లడిచేయని దానికి, వెల్లడి చేయడానికి ఇష్టపడకుండా, విపరీతత్వము, అసంగత్వము, కల్మషము, సంకుచితము, బంధనము,అంధకారము, బలహీనత,అల్పత్వము, వైషమ్యము, బాధ, విభజన,వికారము, అసభ్యము, తన పురోగమనంలో మనిషి వదిలివేయవలసిన సమస్తములను నిరాకరిస్తుంది. ఇదంతా సంఘర్షిస్తూ ధర్మాన్ని అతిక్రమించడాన్ని అన్వేషించే అధర్మము, ధర్మముకానిది, ధర్మాన్ని వెనక్కు, క్రిందకు లాగేది, చెడు, అజ్ఞానము, అంధకారాల కొరకు తయారయిన ప్రతిఘాతుక శక్తి. ఈ రెండింటి (ధర్మాధర్మాల) మధ్యన నిరంతర యుద్ధం, సంఘర్షణ వుంటుంది, జయాపజయాల డోలాయమానంలో కొన్నిసార్లు ఊర్ధ్వశక్తులు, నిమ్నశక్తులు దానిని ప్రభావితం చేస్తాయి. ఇది మానవ జీవితం, మానవ అంతరాత్మల స్వాధీనత కొరకు దైవశక్తులకు, ఆసురికశక్తులకు మధ్యనజరిగే ఘర్షణగా, కాంతికి అవిభాజ్య అనంతునికి జన్మించిన కుమారులకు, అంధకారానికి, విభజనకు జన్మించిన కుమారులకు మధ్యన జరిగే ఘర్షణగా, వేదరూపకంలో వివరించబడింది, అహురామజ్ద, అహరిమన్ ల జొరాస్థ్రనిజమ్ లో, ఆ తర్వాతి మతాలలో భగవంతుడు, దేవదూతలకు సైతాను లేదా ఇబ్లిస్ అతని పిశాచాలకు మధ్యన జరిగే వివాదంగా వివరించబడింది.

అవతారం నిర్వర్తించే కార్యాన్ని నియమించేది, నిర్ణయించేది ఈ అంశాలే. బౌద్ధ సిద్ధాంతంలోని ధర్మం, సంఘం, బుద్ధం అన్న ఈ మూడు శక్తులలో శిష్యుడు తన స్వేచ్ఛను వ్యతిరేకించే సమస్తం నుండి ఆశ్రయం తీసుకుంటాడు. క్రైస్తవంలో క్రైస్తవ జీవనవిధానం చర్చ్, క్రీస్తుల ధర్మం వుంది. ఈ మూడు మూలకాలు ఎప్పటికీ అవతారకార్యానికి అవసరమైనవి. అతను ఒక ధర్మాన్ని,

స్వీయక్రమశిక్షణను ఇస్తాడు, దీనితో నిమ్న జీవితం నుండి ఉన్నత జీవితానికి వృద్ధి చెందడం జరుగుతుంది, ఇందులో కర్మసూత్రం, మన సంబంధీకులతో, ఇతరజీవులతో వున్న అనుబంధాలు, అష్టాంగమార్గం లేదా విశ్వాసము, ప్రేమ, స్వచ్ఛత, లేదా అటువంటి దివ్యజీవన స్వభావ ప్రకటన ఏదైనా- ధర్మం కొరకు చేసే గట్టిప్రయత్నం ఆవశ్యకంగా చేర్చబడ్డాయి. అప్పుడు మనిషిలోని ప్రతి ఉన్ముఖతకు దాని సామూహిక, వ్యక్తిగత దృక్పధాలు వున్నాయి, ఎవరైతే ఒక విధానాన్ని అనుసరిస్తారో వారు సహజంగానే ఆధ్యాత్మిక సహచరత్వానికి, ఏకతలోకి సహితంగా లాగబడతారు, అతను తన వ్యక్తిత్వము, అతని బోధన ఏకమయ్యే సంఘము, సాంగత్యము, సంయోగాలను స్థాపించుకుంటాడు. వైష్ణవంలో వైష్ణవుల ధర్మమైన భక్తి, ప్రేమల విధివిధానం, ధర్మం ప్రకటితమయ్యే వ్యక్తిగా భక్తుడు, అస్తిత్వంలో, స్వభావంలో ప్రేమ యొక్క దివ్యధర్మము స్థాపితమయ్యి, సఫలమైన దివ్యప్రేమికుడు, ప్రియుడు- భాగవత, భక్త, భగవంత అనే త్రయం వున్నది. అవతారము ఈ మూడవ మూలకమైన దివ్యవ్యక్తిత్వాన్ని, ధర్మానికి, సంఘానికి అంతరాత్మ అయిన స్వభావ, అస్తిత్వాలను సూచిస్తాడు, వీటిని తనతో పాటు తెలియజేస్తూ, వాటిని జీవింపజేస్తూ, మనుష్యులను ఆనందము, స్వేచ్ఛల వైపుగా ఆకర్షిస్తాడు.

CWSA 19:171-73

విశ్వభారాన్ని మోయడం

ఒకవేళ అవన్నీ (అవతారం పడే కష్టాలు, పోరాటాలు) మాయలే అనుకుంటే వారికి అవి ఎటువంటి విలువను ఇవ్వవు, లేదా ఎటువంటి నిజమైన ప్రభావాన్ని చూపవు, అవి పూర్తిగా అవివేకంగా, అవాస్తవంగా, అర్థంలేనివిగా వుంటాయి. భగవంతుడు తనకోసం బాధపడవలసిన లేదా కష్టపడవలసిన అవసరం లేదు, ఒకవేళ వీటిని ఆయన విశ్వభారాన్ని మోయడం కోసం, ప్రపంచానికి, మానవులకు సహాయం చేయడానికి తీసుకుంటే తప్ప, ఒకవేళ ఈ బాధలు, కష్టాలు ఏ విధంగానైనా సహాయం చేశాయి అంటే అవి వాస్తవమయివుండాలి. ఒక కపటం లేదా అసత్యం సహాయం చేయలేవు. మానవుల కష్టాలు, బాధలు ఎంత వాస్తవమో అవి అంతే వాస్తవం- దైవం వాటిని మోస్తాడు, అదే సమయంలో వాటి నుండి బయటపడే మార్గాన్ని చూపిస్తాడు. అలాకాకపోతే మానవస్వభావాన్ని ఆయన ధరించడంలో అర్థం లేదు, ప్రయోజనం లేదు,

విలువ లేదు. ఇంత సరళము,కీలకము అయిన ఒక అంశాన్ని నువ్వు అర్థంచేసుకోలేకపోవడం, ఒప్పుకోవడానికి నిరాకరించడం వింతగా వుంది. అవతారం పూర్తి అర్థాన్ని దాని నుండి తీసివేసినపుడు అవతారత్వమును అంగీకరించడంలో ప్రయోజనమేముంది?

అవతారత్వ దృగ్విషయానికి రెండు పార్శ్వములున్నాయి, వెనుక వుండే దివ్యచైతన్యము, సాధక వ్యక్తిత్వము. దివ్యచైతన్యము సర్వశక్తిమంతమైనది కానీ అది ప్రకృతి స్థితుల క్రింద సాధక వ్యక్తిత్వాన్ని ప్రకృతిలో ప్రతిపాదిస్తుంది, కొన్నిసార్లు ఆటలో నియమాలను మార్చవలసి వచ్చినప్పటికీ ఆటలోని నియమాలకు అనుగుణంగా ఉపయోగించుకుంటుంది. ఒకవేళ అవతారత్వము కేవలం ఒక మెరిసే అద్భుతమైతే, అప్పుడు దానితో నాకు ప్రయోజనం లేదు. ఒకవేళ అది ప్రకృతిలో సర్వవ్యాపక పరమాత్మ యొక్క పొందికైన ఒక భాగపు ఏర్పాటు అయితే అప్పుడు నేను అర్థం చేసుకుంటాను, అంగీకరిస్తాను.

మానవజాతి కొరకు దివ్య ఉదాహరణ

దైవము-మానవుడు అన్నది కూడ మనసు తయారు చేసిన కష్టమే. మనిషిలో దైవమున్నాడు, తన అత్యున్నత ఆకాంక్షలను, ఉన్ముఖతలను సఫలం చేసుకుని, అధిగమిస్తూ మనిషి దైవమవుతాడు. అదే మూర్ఖత ఎక్స్ అర్థం చేసుకోలేనిది- దైవం క్రిందకు దిగి వచ్చినపుడు మానవజాతి భారాన్ని అధిగమించడానికి ఆ భారాన్ని తన పైన వేసుకుంటాడు- మనిషి ఎలా దైవం కాగలడో మానవజాతికి చూపడానికి తాను మానవుడవుతాడు. కానీ అది అంతరంలో ఎటువంటి దివ్య ఉనికి, వెనుక దివ్యశక్తి లేకుండా కేవలం ఒక దుర్బలుడైతే అలా కాలేరు- తన శక్తిని అందుకోగలిగిన వారందరిలోకి దానిని చేర్చడానికి అతను శక్తివంతంగా వుండాలి. అందువలన అతనిలో ద్విమూలకాలు వుంటాయి. పైకి కనిపించే మానవుడు, వెనుకనున్న దైవం- ఇది ఎక్స్ వివరించిన కొలవశక్యంగాని ముద్రను వేస్తుంది. నువ్వు కేవలం బాహ్యనేత్రంతో మానవుడుగా చూస్తే, వేరే దేన్ని చూడటానికి ఇష్టపడకపోతే అప్పుడు నువ్వు ఒక మానవుడిని మాత్రమే చూస్తావు-ఒకవేళ దైవం కొరకు చూశావంటే దైవాన్ని కనుగొంటావు.

*

అవతారము ఒక అమానవీయ విధానంలో చర్య జరుపాలని లేదు- అతడు వెనుక దైవంగా వుంటూ పైకి మానవచైతన్యంతో, మానవ పద్ధతులను ఉపయోగించుకుని మానవచర్యను నిర్వర్తిస్తాడు. అలా చేయకపోతే అతను మానవదేహాన్ని ధరించడంలో అర్థం లేదు, అది ఎవరికీ ఉపయోగం లేదు. ఊర్ధ్వంలో వుంటూ అక్కడి నుండే కార్యాలను నిర్వర్తించవచ్చును.

CWSA 28:472-73

అవతారము-విభూతి

పరిణామం క్లిష్టస్థితిలో వున్నపుడు, ఒక ప్రత్యేకకార్యం నిర్వర్తిచవలసి నపుడు అవతారము అవసరమవుతుంది. అవతారమన్నది ఒక ప్రత్యేక అభివ్యక్తి, మిగిలిన కాలంలో దైవం మానవపరిమితులలో విభూతిగా పనిచేస్తాడు.

*

అవతారం గురించి ఉజ్జాయింపుగా చెప్పాలంటే అతను తనలో ఉద్భవించిన లేదా తనలోకి దిగి వచ్చిన దివ్యశక్తి చైతన్యంతో వున్నవాడు, తన అంతరంలోని సంకల్పము, జీవితము, చర్యలతో నిర్వహించేవాడు లోలోపల దివ్యశక్తితో, ఉనికితో ఏకతను అనుభూతిచెందేవాడు. విభూతి కొంత దైవ శక్తిని ధరించి,ప్రపంచంలో గొప్పశక్తితో చర్య జరపడానికి అధికారాన్ని కలిగివుంటాడు, అతను విభూతి కావడానికి ఇది సరిపోతుంది. అతని శక్తి చాలా గొప్పది కావచ్చు కానీ చైతన్యం అంతర్గర్భితం కాదు, లోన నివసించే దివ్యత్వం కాదు.

CWSA 28:485 - *శ్రీఅరవిందులు*

ఆర్య పత్రిక ప్రారంభమైన వెంటనే కొంతమంది గ్రాడ్యుయేట్లు వారికి కావాలసింది "మనిషిని తయారు చేయడం' అని తెలియజేస్తూ వ్రాసిన లేఖ ఒకటి అందింది. మానవుని తయారు చేయడంలో నా వంతు చేయవలసింది చేశాను, ఇక ఇప్పుడు దీనిని ఎవరైనా చేయవచ్చు. ఇతర ప్రదేశాల్లో కన్నా భారతదేశంలోనే నిదానంగా వుంది గనుక ప్రకృతి దీని కోసమే ప్రపంచమంతా తిలకిస్తూవుంది. మానవుని తయారుచేయటం ప్రస్తుతం నా వ్యాపకం కాదు, కానీ దివ్యమానవుని తయారు చేయటం. ప్రపంచం ఒక నూతన పురోగతి, ఒక నూతన పరిణామం కొరకు సిద్ధమవుతున్నదన్నదే నా ప్రస్తుత బోధన. అది ఏ జాతి అయినా, ఏ దేశమయినా ఆ నూతన పరిణామక్రమాన్ని పట్టుకొని సఫలం చేస్తే అది మానవజాతి నాయకుడవుతుంది.

CWSA 36:225 *శ్రీఅరవిందులు*

విశిష్ట అవతారాలు, విభూతులు

దశావతారాల పరిణామాత్మ గాథ

అవతారతత్వానికి పరిణామక్రమంతో సంబంధంలేకపోతే దానికి చాలా తక్కువ ప్రాముఖ్యత ఉంటుంది. నిజానికి హిందూ మతానికి సంబంధించిన దశావతారాలకు, పరిణామ క్రమానికి చాలా దగ్గర పోలికే ఉంది. మొదటిది మత్స్యావతారం(నీటిలో మాత్రమే ఉండేది), రెండవది ఉభయ చరావతారం (నీటిలోనూ భూమ్మీద కూడా జీవించగలిగేది), అటు తర్వాత వచ్చినది పూర్తిగా భూమ్మీద జీవించే అవతారం (వరాహ అవతారం), తదనంతరం ఉన్న నరసింహావతారం (దీనిలో మృగలక్షణాల నుంచి మనుష్యత్వానికి పరిణామం చెందుతున్న జీవిని చూడవచ్చు), ఆ తర్వాత వచ్చే వామనావతారంలో పొట్టిగా అభివృద్ధి చెందని భౌతికంగా ఉన్నా, తనలో భగవంతుని సైతం నిలుపుకొని, ఈ ఉనికినే స్వాధీనం చేసుకోవడం మీరు చూడొచ్చు. అటు తర్వాత వచ్చే రాజసిక, సాత్విక, నిర్గుణ అవతారాలు మనుష్యత్వ అభివృద్ధిని సూచిస్తున్నాయి. ఆ అభివృద్ధి ప్రాణిక రాజసికత నుంచి సాత్విక మానసిక జీవి వరకు, అక్కడ నుండి అధిమానసిక అతి మానవుని వరకు కొనసాగుతుంది. కృష్ణ, బుద్ధ, కల్కి ఈ చివరి మూడు అవతారాలు ఆధ్యాత్మిక అభివృద్ధిలో చివరి మూడు దశలను సూచిస్తున్నాయి. కృష్ణావతారం అధిమానస ప్రగతికి తలుపులు తెరవగా, బుద్ధుడు పరమ మోక్షాన్ని లక్ష్యంగా చేసుకొని తన పయనాన్ని సాగించాడు, కానీ అది ప్రతికూలమైనదే అది భూమికి తిరిగి వచ్చి సానుకూలంగా పరిణామ క్రమాన్ని పూర్తి చేయలేదు. కాబట్టి అది కూడా ప్రతికూలతకే దారి తీసింది. కల్కి దానిని సరిచేసి భగవంతుని రాజ్యాన్ని ఈ భూమిపైనే స్థాపించడం ద్వారా అసుర శక్తులను దునుమాడగలడు. పురోగతి అద్భుతంగాను లోపరహితంగాను ఉంటుంది.

అవతారాల జన్మల మధ్యలో ఉన్న జన్మల విషయానికొస్తే, కృష్ణుడు తన గత జన్మలను గురించి మాట్లాడుతున్నప్పుడు, ఒక సందర్భంలో తనను తాను భగవంతుని ప్రతిరూపంగా, భగవత్ తత్వాన్ని పూర్ణతతో అభివ్యక్త పరిచిన వానిగా చెప్పుకున్నాడు. మరొక సందర్భంలో తనను తాను భగవంతుని

విభూతిగా (అంశావతారంగా - వృష్ణీనామ్, వాసుదేవ) చెప్పుకున్నాడు. అందువల్ల అనేక జన్మలలో కృష్ణుడు భగవత్ పూర్ణ చైతన్యాన్ని తెరచాటుగావించి తనను తాను విభూతిగా అభివ్యక్త పరచాడని మనం చాలా ఖచ్చితంగా భావించవచ్చు. అవతారత్వ లక్ష్యం పరిణామక్రమాన్ని ముందుకు నడిపించడమే అని మనం అంగీకరిస్తే, గొప్ప పరివర్తన దశలలో భగవంతుడు అవతారంగా వచ్చి పరివర్తనకు సహాయపడడం, తక్కువ పరివర్తనా దశలలో భగవంతుడు విభూతిగా వచ్చి సహాయపడడం అనే విషయాలు చాలా సహేతుకమైనవి.

CWA 28:487

రామావతారం

రాముని మూర్తిమత్వం పట్ల నీ అభిప్రాయాన్ని నేను సరైనదిగా భావించటం లేదు. వాల్మీకి ప్రకారంగా రాముని స్వభావాన్ని ఉన్నది ఉన్నట్లుగా పూర్తిగా నీవు చూడలేదు (వాల్మీకి రాముని పాత్రను ఒక ఆధునిక మనిషి కథలాగా చెప్పలేదు). ఆయన రాముని వీరత్వానికి, రాముడు చేసిన పనులకు ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చారు. రాముని పాత్రను దాని అమరిక నుండి తీసివేసి, మొత్తాన్ని భాగాలుగా విభజించే కత్తిలాంటి ఆధునిక నైతిక మనస్సుతో విశ్లేషించినట్లయితే దాని ప్రాముఖ్యత అంతా ఆ పాత్ర కోల్పోతుంది.

అవతారత్వ విషయానికి వస్తే, నేను రాముని అవతారాన్ని పరిణామ క్రమంలో ప్రథమావతారంగా తీసుకుంటాను. ఎందుకంటే రామావతారం దాని పాత్రను పరిణామ క్రమ పథకంలో చక్కగా పోషించింది అని నాకనిపిస్తోంది. నేను రామాయణాన్ని చదివినప్పుడు, ఒక సత్యాన్ని గుర్తించి దాని అనుభూతిని పొందాను, ఆ సత్యమే ఈ కథను రూపొందించింది. ఇది ఒక సాధారణ కథగా పైకి కనిపించినప్పటికీ భూగోళ పరిణామంలో జరిగిన ఒక గొప్ప క్లిష్టమైన పరివర్తన సంఘటనకు ఉపమానంగా నేను దానిని స్వీకరించాను. ఆ సత్యమే రామాయణంలోని ప్రధాన పాత్ర స్వభావానికి, చేసిన పనులకు విశ్వ నేపథ్య ప్రాముఖ్యతను ఇచ్చింది. అవే పనులు వేరొక వ్యక్తి వేరొక సంఘటన క్రమంలో చేసినట్లయితే వాటికి విశ్వ నేపథ్య ప్రాముఖ్యత ఉండేది కాదు. అవతార పురుషుడు అసాధారణ కార్యాలు చేయడానికి ఈ భూమ్మీదకి రాడు. అతడు చేసే పనులు, లేకపోతే అతడేమిటో

చెప్పడానికి లేదా ఆ రెండిటినీ చేయడానికి ఈ భూమ్మీదకి వస్తాడు. ఒక ప్రాముఖ్యత ఒక ప్రభావంతమైన శక్తితో ఈ భూతలంపై మానవజాతిలో చరిత్రలో ఆవశ్యకమైనది నిర్వహించడానికి వస్తాడు.

రాముని కర్తవ్యం

కాదు ముమ్మాటికీ కాదు- అవతారంగా వచ్చిన వాళ్ళు కచ్చితంగా ఆధ్యాత్మిక ప్రవక్త కానవసరం లేదు. అతడు నిజానికి కేవలం ప్రవక్త మాత్రమే కాదు, సత్యాన్ని సిద్ధింప చేసుకున్నవాడు, స్థాపకుడు. బాహ్యమైన విషయాలే కాదు, కానీ బాహ్యంగా ఉన్న దానిని కూడా సిద్ధింప చేసుకుంటాడు. నేను చెప్పినట్లుగా దైవం వైపుకు దశలవారీగా ముందుకు సాగే ఆత్మపరిణామం అంటే భూ పరిణామం కోసం అవసరమైన విప్లవాత్మకమైన దానిని కూడా సిద్ధింప చేసుకుంటాడు. పరిణామక్రమానికి ఆధ్యాత్మిక రంగాన్ని సిద్ధం చేయడం రాముని కర్తవ్యం ఏమాత్రం కాదు. అందుకని రాముడు దాని గురించి ఏనాడు ఆలోచించలేదు. ఆయన కర్తవ్యం రావణుని సంహరించి రామరాజ్యాన్ని స్థాపించడం. ఇంకో విధంగా చెప్పాలంటే సాత్విక నాగరిక మానవునికి సరైన క్రమానికి సంబంధించిన భవిష్యత్తు అవకాశాన్ని రూపొందించడానికి, అంటే రానున్న మానవుడు తన జీవితాన్ని చక్కటి భావోద్వేగాలు, హేతుకత, నైతికత లేదా కనీసం నైతిక ఆదర్శాలు, అంటే సత్యం, విధేయత, సహకారం, సామరస్యం, హాస్యం, దేశానికి, ప్రజలకు సంబంధించిన క్రమబద్ధీకరణ వంటి వాటి ద్వారా నియంత్రిస్తాడు. జంతు మానసికత, ప్రాణాధారమైన అహం దాని స్వంత సంతృప్తి పైనే నియమంగా ఇంకా ఉన్న ప్రపంచంలో, అంటే అరాచక (వానర, రాక్షస) శక్తులచే అప్పటికి ఆక్రమించబడిన ప్రపంచంలో సాత్విక నాగరిక మానవుని స్వభావాన్ని స్థాపించడమే రాముని కార్యం. రాముని జీవిత లక్ష్యం అతడు దానిని పూర్తిగా సంభాళించాడా అన్న దానిని ఆధారం చేసుకుని రాముడు అవతార మూర్తా కాదా? అని నిర్ణయించాలి, కానీ వాలి అనే క్రూరమైన జంతువుతో శౌర్యవంతమైన క్షత్రియుడు హాస్యమాడడం రాముని పని కాదు. వాలిని చంపి జంతు మానసికతను తన ఆధీనంలోకి తెచ్చుకోవడం రాముని పని. రాముడు ఖచ్చితంగా పరిపూర్ణుడు కానవసరం లేదు, కానీ అతడు సాత్విక మానవుని స్వభావానికి ప్రతినిధి. అతడు నమ్మకమైన భర్త, ప్రేమికుడు, ప్రేమ విధేయత

కలగలసిన కుమారుడు, కోమలత్వం పరిపూర్ణత కలిగిన సోదరుడుగా, తండ్రిగా, స్నేహితునిగా తన పాత్రను చక్కగా పోషించాడు. అతడు అన్ని రకాల ప్రాణులకు స్నేహితుడిగా వ్యవహరించాడు, బహిష్కృత కులానికి చెందిన గుహకుని స్నేహితుడు, జంతు నాయకులైన సుగ్రీవుడు, హనుమంతులకు స్నేహితుడు, పక్షి జటాయువుకు స్నేహితుడు, ఆఖరుకు రాక్షసుడు అయిన విభీషణుడికి కూడా ఆయన స్నేహితుడు. మొత్తంగా చూస్తే అతడు వివేకవంతుడు, ఆకర్షణ గలవాడు. కానీ వీటన్నిటికంటే ముఖ్యమైనది ఏమిటంటే, రాముడు హరిశ్చంద్రునిలా, శిబి చక్రవర్తిలా (పరిస్థితుల బలవంతపు ఒత్తిళ్లకు లొంగి పనిచేయటం) కాకుండా ఒక ఖచ్చితమైన సామరస్య పూర్వక పూర్ణతను కలిగిన వాడు. సహజ సిద్ధమైన ప్రేమ ఆనందాలతో పని చేసిన వాడు. కానీ అన్నింటికంటే ముఖ్యంగా, సామాజిక ఆలోచన, దాని స్థిరత్వం, సత్యం, గౌరవం, ధర్మ భావం, ప్రజా స్ఫూర్తి, క్రమబద్ధీకరణ మీద ఆధారపడి ఉండే అంశాలకు ప్రాతినిధ్యం వహించి వాటిని స్థాపించడం రాముని కర్తవ్యం. మొదటిగా తన తండ్రి పట్ల తన పుత్ర ప్రేమ, విధేయత కంటే కూడా చాలా ఎక్కువగా సత్యం కోసం, గౌరవం కోసం పాటుపడ్డాడు, దానికంటే కూడా అతను రాజుగా, రాజ్య సభకు ఎన్నికైన వ్యక్తిగా తన వ్యక్తిగత హక్కులను త్యాగం చేసి, పద్నాలుగు సంవత్సరాలు వనవాసానికి వెళ్ళాడు. అతని ప్రజా స్ఫూర్తికి, క్రమబద్ధమైన సంఘ నిర్వహణ పట్ల అతని భావానికి (ప్రాచీన భారతీయులు, గ్రీకులు, రోమన్ల దృష్టిలో గొప్ప, అత్యున్నతమైన పౌర ధర్మం, ఆ సమయంలో క్రమబద్ధమైన సంఘ నిర్వహణ, అంటే వ్యక్తికి సంబంధించి ప్రత్యేక అభివృద్ధి, వ్యక్తిగత సంతృప్తి కాదు, సంఘ అభివృద్ధి, ఆ సమయంలో మానవ పరిణామ క్రమ ముఖ్య అవసరం). దానిని స్థాపించడానికి రాముడు తన స్వంత ఆనందాన్ని, తన కుటుంబ జీవితాన్ని, సీత సుఖ సంతోషాలను కూడా త్యాగం చేశాడు.

అతడు అన్ని పురాతన జాతుల నైతిక భావనతో సంబంధాన్ని కలిగి ఉన్నాడు, అయినప్పటికీ ఆధునిక మనిషికి సంబంధించిన వ్యక్తిగత రాగా శ్రితమైన భావనల నైతికతకు, రాముని స్వభావానికి ఎటువంటి సంబంధమూ లేదు. ఆధునిక మనిషి స్వల్పంగా కఠినమైన నైతికతతో మెలిగాడు, ఎందుకంటే

ప్రాచీనులు సామాజిక పరంపరా స్ఫూర్తి కోసం అప్పటి ప్రపంచం సురక్షితంగా ఉండటం కోసం వ్యక్తిని అతని సుఖాన్ని త్యాగం చేశారు. ఈ ప్రపంచానికే విపత్తు అయిన రాక్షసుడు, రావణుడి సార్వభౌమత్వాన్ని నాశనం చేయడం ద్వారా సాత్విక మానవుని ఆదర్శం స్థాపించి ఈ ప్రపంచాన్ని సురక్షితంగా మార్చడం రాముని కర్తవ్యం. రాముని వ్యక్తిత్వంలో, చర్యలో ఎంత దివ్య ప్రేరణ ఉంది అంటే, అతని రూపం భారతీయ సంస్కృతీ మానసం పై రెండు సహస్రాబ్దాలకు పైగా ముద్రించబడింది. అతడు దేనికోసం నిలబడి కృషి చేశాడో, అది అన్ని దేశాలలో మనిషి హేతు బుద్ధి తర్కం (తార్కిక శక్తి)పై, ఆదర్శవంతమైన మనసు పై ఆధిపత్యం చేసింది - రాముని నైతికతపై, స్వభావం పై మానవ ప్రాణికపు ఎడతెగని తిరుగుబాటు ఉన్నప్పటికీ అతని గొప్ప వ్యక్తిత్వం పరిణామ క్రమంలో ఒక గొప్ప ఆదర్శంగా ఉద్యమించే వరకు కొనసాగుతుంది.

రాముని వ్యక్తిత్వము ఎంత గొప్పదో ఎంత దివ్యత కలిగినదో తెలిసిన తర్వాత కూడా, నీవు రాముని అవతారం కాదు అంటున్నావా? ఏమైనప్పటికీ అతను గొప్ప విభూతులైన అతికొద్ది మందిలో మహా విభూతి గా నిలుస్తాడు. ఇప్పటి మానవుడు సాత్విక ఆదర్శంతో తృప్తి చెందక దానికన్నా ఉత్తమమైన దాన్ని వెతుకుతున్నాడు, కాబట్టి నీవు రాముని అవతారం కాదు అని చెప్పొచ్చు. ఎందుకంటే సాత్విక ఆదర్శంలో ఎంతో కాలం పాటు సంతృప్తి చెందడు. ఇంకా దేనికోసమో వెతుకుతూ ఉంటాడు. కానీ రాముని చర్యలు, అతని అవతార లక్ష్యము ఈ భూమి పై అభివృద్ధి చెందుతున్న జాతికి సంబంధించిన గతంపై ముద్రించబడి ఉన్నాయి.

CWSA 28:490-92

శ్రీకృష్ణుడు - ద్వాపరయుగ అవతారం

శ్రీకృష్ణుడు ఒక అవతారం. అతడు మానవ దేహాన్ని స్వీకరించి, మానవ శరీర ప్రకృతికి, మనసుకు, ఆత్మకు ఉన్న నియమాలను అనుసరించి అతను తన ఆట (లీల) ఆడాడు. ఒకవేళ మనం శ్రీకృష్ణ లీలకు సంబంధించి స్పష్టమైన, మార్మిక అర్థాన్ని, దాని వెనుక ఉన్న రహస్యాన్ని కనుక్కోగలిగితే, మనం ఈ ప్రపంచంలో ఆటకు సంబంధించిన లక్ష్యాన్ని, ఆట ఆడే పద్ధతిని గ్రహించగలుగుతాము. ఈ ఆట ప్రధాన లక్షణం పూర్ణ జ్ఞానం ద్వారా

ప్రేరేపించబడిన కర్మ. ఆ కర్మకు, ఆ ఆటకు (నాటకానికి) సంబంధించిన అంతర్లీనంగా ఉన్న జ్ఞానం ఏమిటి, దానికి సంబంధించిన విషయాలు గీతలో వెల్లడి చేయబడ్డాయి.

మహాభారతంలోని శ్రీ కృష్ణుడు ధీరోదాత్తుడు, గొప్ప యోగి, ప్రపంచంలోనే గొప్ప వ్యక్తి, సామ్రాజ్య స్థాపకుడు, రాజనీతజ్ఞుడు, యోధుడు, క్షత్రియ దేహంలో ఉండి పరబ్రహ్మాన్ని తెలుసుకున్నవాడు. మనం అతని జీవితంలో సాటిలేని అభివ్యక్తి, మహాశక్తి ఆడే మర్మమైన ఆటను చూడవచ్చు. ఆ మార్మికతకు వివరణను భగవద్గీతలో తెలుసుకోవచ్చు.

శ్రీ కృష్ణుడు లోకాలకు ప్రభువు, విశ్వవ్యాప్త వాసుదేవుడు ఇంకా, అతడు తన గొప్పతనాన్ని కప్పి ఉంచి మనుషులతో తండ్రి, కొడుకు, సోదరుడు, భర్త, సన్నిహిత సహచరుడు, స్నేహితుడు, శత్రువు వంటి సంబంధాలను ఏర్పరచుకోవడం ద్వారా జగన్నాటకంలోకి ప్రవేశించాడు. అతడి జీవితంలో ఆర్య జ్ఞాన అత్యున్నత రహస్యం, భక్తి మార్గ అత్యున్నత అర్థం సూచించబడ్డాయి. వాటి ముఖ్య సూత్రాలు కూడా గీతా బోధనలో భాగమే.

శ్రీ కృష్ణుని అవతారం ద్వాపర యుగం, కలి యుగం సంధిలో ఉద్భవించింది. ప్రతి పరిణామ చక్రాలలో, కల్పాలలో, అటువంటి సంధిలో భగవంతుడు తన పూర్ణత్వంతో అవతరిస్తాడు. నాలుగు యుగాలలో కలియుగం అధ్వాన్నమైనది, ఉత్తమమైనది కూడాను. యుగ లక్షణం పాపాన్ని ప్రేరేపించడం, ఇది మానవ పురోగతికి ప్రధాన శత్రువు అయిన కలికికి సంబంధించిన పాలనా కాలం. అందువలన కలి పాలనలో మనుషులు ఎక్కువగా క్షీణించడం, పతనం కావడం సంభవించాయి.

కలియుగం ఏ విధంగా ఉత్తమమైనదంటే అడ్డంకులకు వ్యతిరేకంగా పోరాడడం ద్వారా బలం పెరుగుతుంది, పాత సృష్టిని నాశనం చేయడం ద్వారా కొత్త సృష్టి వస్తుంది. ఈ ప్రక్రియ కలియుగంలో కూడా కనిపిస్తుంది. ప్రపంచ పరిణామ క్రమంలో నాశనం కాబోతున్న చెడు మూలకాలు ఖచ్చితంగా విపరీతమైన పెరుగుదల ద్వారా తొలగించబడతాయి మరోవైపు, కొత్త సృష్టికి సంబంధించిన విత్తనాలు నాటబడి, మొలకెత్తుతాయి, ఈ విత్తనాలు సత్య యుగంలో వృక్షాలుగా మారుతాయి.

బెంగాలీ రచనలు - ***94*** - ***95***

శ్రీకృష్ణుని చారిత్రక నేపథ్యం

శ్రీ కృష్ణుని చారిత్రక నేపథ్యం ఆధ్యాత్మికంగా చూస్తే అంత ప్రాముఖ్యత వహించదు, అంతా ఆవశ్యకం కూడా కాదు, అయినప్పటికీ దానికి తగినంత విలువ ఉంది. శ్రీకృష్ణుడు కేవలం ఒక పురాణ పురుషుడో లేక కావ్యకల్పనోకాక ఒక చారిత్రక పురుషుడు, ఈ భూమి పై ఒకానొకప్పుడు ఆయన ఉన్నాడు, భారత దేశపు గత చరిత్రలో ప్రముఖ పాత్ర పోషించాడు అనే విషయంలో నాకెలాంటి సందేహమూ లేదు. రెండు వాస్తవాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి, ఆయన ఒక ప్రముఖ ఆధ్యాత్మిక వ్యక్తి, ఆయన ఆధ్యాత్మిక జ్ఞానం ఒక ఉపనిషత్తులో చెప్పబడింది, సంప్రదాయంగా ఆయనని ఒక దైవీక వ్యక్తి గా, ఆయన మరణానంతరం ఆయనను ఒక దైవంగా భావిస్తున్నాం, ఇది మహాభారత కథలో పురాణాలలో చెప్పింది పక్కన పెట్టి చూసినా కూడా. భారతదేశ ఆధ్యాత్మిక, చరిత్రలో ఒక ప్రముఖ భాగమైన భాగవత మతం లో, దాని వ్యాప్తిలో ఆయనను దైవంగా భావించి ఆరాధించడం అనేది కేవలం ఒక పురాణమో లేక ఒక కావ్య కల్పనపైనో ఆధారపడింది అని భావించలేం. మహాభారతం ఒక కావ్యం చరిత్ర కాదు అయితే ఆ కావ్యం ఒక ఘనమైన చారిత్రక సత్యం పైన ఆధారపడినది, అలా మన సంప్రదాయంలో భాగమయ్యింది, ధృతరాష్ట్రుడు, పరీక్షిత్తు మొదలైనవారు నిజంగానే ఉన్నారు అలాగే శ్రీ కృష్ణుడు ఒక నాయకునిగా యోధునిగా రాజకీయవేత్తగా మనం అంగీకరించినట్లైతే అప్పుడు పురాణ సంప్రదాయాలలో ఉన్నదంతా ఒక చారిత్రక విలువను సంతరించుకొంటుంది, అది కేవలం కావ్యకల్పనగానో లేక ఒక పుక్కిటి పురాణంగానో ఉండిపోదు. మనం ఒక సిద్ధాంత పరమైన హేతుబద్ధ దృష్టితో చూసినప్పుడు శ్రీకృష్ణుడు ఒక చారిత్రక పురుషుడు అని నిస్సందేహంగా చెప్పవచ్చు. కానీ నా దృష్టిలో ఆయన ఇంతకు మించిన అవతారపురుషుడుగా భావిస్తాను, అది ఒక చారిత్రక వాస్తవం. ఎలాగైతే క్రీస్తును గురించిన చరిత్రను నేను అంగీకరిస్తున్నానో అట్లే ఇది కూడా.

బృందావనంలో జరిగిన కథ ఇంకొక విషయం. అది మహాభారత ముఖ్యకథలో భాగం కాదు. అది పురాణాలకు సంబంధించినది. అది కేవలం ఒక సంకేతాత్మక పాత్రగా మాత్రమే మలచబడినట్లుగా భావించవచ్చు. ఒకప్పుడు అటువంటి భావనను నేను అంగీకరించినప్పటికీ తరువాత దానిని పక్కన పెట్టడం జరిగింది. అలా పక్కన పెట్టవలసిన అవసరం పురాణ కథల



ఉద్దేశ్యమైతే కాదు. అది ఎక్కడో వాస్తవంగా జరిగిన లేక జరిగే అవకాశమున్న విషయంగా నాకు అనిపిస్తుంది. గోపికలు వాస్తవంగా ఉన్నారు కేవలం సంకేతాత్మకం కాదు. ఆది ఒక గుప్తజ్ఞానానికి చెందిన వాస్తవం. గుప్తజ్ఞానం, సంకేతార్ధం రెండూ ఒకటి కాదు. సంకేతార్ధం అనేది కేవలం మనోనిర్మితమైనది లేక ఊహాగానం అనుకోవచ్చు, కానీ గుప్తజ్ఞానం అనేది ఒక వాస్తవం అది ఎక్కడో ఒకచోట ఉండే ఉంటుంది, భౌతిక జగత్తువెనుక దాగిఉన్నప్పటికీ భూమిపై జీవితానికి అది వాస్తవమే, అది దీనిని ప్రభావితం చేయడమే కాక ఇక్కడ ఒక రూపం కూడా తీసుకుంటుంది. గోపికలకు సంబంధించిన లీల ఎలా కల్పించబడింది అంటే గోకులంలో అది ఎల్లప్పుడూ జరుగుతూనే ఉంది. అది భూమి మీదకూడా వ్యక్తం అయ్యింది బృందావనంలో. దానిని ఎప్పుడు ఎల్లప్పుడూ మనం సాక్షాత్కరించుకోవచ్చు, దాని అర్ధాన్ని ఆత్మలో అనుభూతం చేసుకోవచ్చు. పురాణాలు రచించిన వారు దానిని భూమిపైన అభివ్యక్తి చెందిన అవతారపురుషుడైన శ్రీకృష్ణుని లీలగా భావించారు, అల్లాగే భారతీయ ధార్మిక మనసు దానిని ఆ విధంగానే అంగీకరించింది.

CWSA 28: 482-84

కృష్ణ

ఈ భయంకరమైన మధురమైన విశ్వంలో
ఆత్మ జన్మించడంలోని అర్ధాన్ని చిట్టచివరకు కనుగొన్నాను
ఆకలిగొన్న పుడమి హృదయం స్వర్గాన్ని అతిక్రమించి
శ్రీ కృష్ణుని పాదాలకై ఆకాంక్షించడం నేను అనుభూతి చెందాను,
ఆ అమృతనయనాల సౌందర్యం నేను కాంచాను,
ఆర్తి నిండిన ప్రియుని వేణుగానాన్ని కూడా విన్నాను,
మరణంలేని పారవశ్యత కలిగించిన విస్మయాన్ని చవిచూచాను,
నా హృదయంలోని వేదన శాశ్వతంగా మూగబోయింది.
ఆ సంగీతం మరింతగా చేరువ అయ్యింది
ప్రాణం అపరిమిత ఆనంద పారవశ్యంతో వణికింది;
తన ప్రభువు స్పర్శను, కౌగిలిని, ఉనికిని ఆశిస్తూ
సర్వ ప్రకృతి విశాలమైన తన్మయంతో నిశ్చలమయింది
ఈ ఒక్క క్షణం కోసమే ఎన్నో యుగాలు జీవించాను;
చిట్టచివరకు జగతి పరిపూర్ణమై స్పందించింది నాలో.

CWSA 2:601

భవిష్యదవతారం

శ్రీ మాతా, కురుక్షేత్ర యుద్ధం జరిగి 5000 సంవత్సరములు గడిచినవని శ్రీ అరవిందులు చెప్పివున్నారు, అయితే శ్రీ కృష్ణుని యొక్క అసమాన ప్రజ్ఞ ప్రభావం ఈ కాలానికి చెందిన ఝాన్సీ లక్ష్మీబాయివంటివారిలో సైతం గమనించవచ్చు, అయితే భారత దేశాన్ని సంరక్షించుకోవాలన్నా ప్రపంచాన్ని సరికొత్తగా తీర్చిదిద్దాలన్నా ఒక పూర్ణ అవతారం రావలసి ఉంది. అటువంటి అవతారం నిద్రాణమై ఉన్న బ్రహ్మతేజాన్ని పునరుత్తేజం కావించుతుంది. కలియుగమందే పూర్తిస్థాయిలో దైవం యొక్క అవతరణ ఆవశ్యకత ఉంది అని శ్రీ అరవిందులు చెప్పి ఉన్నారు ఎందుకంటే కలియుగంలోనే మానవుడు అత్యంత ప్రమాదకరమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నాడు. అదిగో ఇప్పుడు ఆయన వచ్చి ఉన్నాడు. ఆయనే ఆ గొప్ప రహస్యాన్ని వెల్లడి చేయవలసి ఉన్నది. దైవం భారతదేశంలో సంపూర్ణంగా అభివ్యక్తి చెంది ఉన్నాడు. అయితే ఇది తన అభివ్యక్తి అని చెప్పుకోవడానికి ఆయన వినయం అడ్డువస్తోంది అనుకోవచ్చు!

ఎవరైతే కార్యతత్పరులుగా ఉంటారో వారికి తమను గురించి గొప్పలు చెప్పుకోవడం అలవాటు ఉండదు. వారు వారి కార్యాలకు సంబంధించిన శక్తిని మాత్రం తమతో ఉంచుకొని ఫలితాల గొప్పతనాన్ని శాశ్వతుడైన భగవంతుడికి అర్పించి ఉంటారు.

CWSA 16:270

సనాతన ధర్మ పునరుద్ధరణ

సాధారణంగా ఆగస్టు 15వ తేదీ నాకు చాలా ముఖ్యమైన రోజు. వ్యక్తిగతంగా సాధనలో, అలాగే పరోక్షంగా ఇతరుల జీవితాలలో కూడా అది ఒక మలుపు. ఈసారి ఇది నాకు చాలా ముఖ్యమైనది. నా ఆత్మాశ్రయ సాధన దాని తుది ముద్రను పొందిందని, సుదీర్ఘమైన సాక్షాత్కారం అనేక గంటలపాటు పరబ్రహ్మంలో నివసించడం ద్వారా దాని పరిపూర్ణత పొందిందని చెప్పవచ్చు. అప్పటి నుండి, అహంభావం నాలోని అన్నమయ- ఆత్మలో తప్ప మిగిలిన ప్రదేశాలలో పూర్తిగా చచ్చిపోయింది, - అన్నమయ-ఆత్మ అంటే అప్పుడప్పుడు వచ్చే సందర్శనల నుండి లేదా వేరు చేయబడిన పాత మనుగడకు చెందిన బాహ్య స్పర్శల నుండి పూర్తిగా విముక్తి పొందేలోపు ఒక సుదూర సాక్షాత్కారం కోసం ఎదురుచూస్తున్న భౌతిక ఆత్మ.

నా భవిష్యత్ సాధన జీవితం, ఆచరణ జ్ఞానం, శక్తి కోసం. నాకు ఇప్పటికే లభించిన ముఖ్యమైన జ్ఞానం, శక్తి కాదు - కానీ, అదే భౌతిక ఆత్మపరంగా జీవితంలో నా పనికి మళ్ళించబడ్డ జ్ఞానం, శక్తి కోసం . నాకు ఇప్పుడిపుడే ఆ పని గురించి స్పష్టమైన ఆలోచనను పొందుతున్నాను అలాగే మీకు ఆ ఆలోచనను అందించగలను. మీరు నన్ను కేంద్రంగా చూస్తున్నారు కాబట్టి, ఆ కేంద్రం నుండి ఏమి ప్రసరించబడుతుందో మీరు తెలుసుకోవాలి.

1. సనాతన ధర్మాన్ని మానవ మేధస్సుకు కొత్త కోణం నుండి తిరిగి వివరించాలంటే- ఈ పని ఇప్పటికే ప్రారంభమైంది, దాని మూడు భాగాలు స్పష్టంగా పని చేస్తున్నాయి. శ్రీ కృష్ణుడు నాకు వేదాలకు నిజమైన అర్థాన్ని చూపించాడు. అంతే కాకుండా, మానవ ప్రసంగ ప్రక్రియ, మూలాలను చూపించే కొత్త భాషాశాస్త్రాన్ని నాకు చూపించాడు, తద్వారా కొత్త నిరుక్తం ఏర్పడుతుంది, దాని ఆధారంగా వేదానికి కొత్త వివరణ వస్తుంది. భారతీయులకు గానీ, యూరోపియన్లకు గానీ అర్థం కాని ఉపనిషత్తులన్నింటికి అర్థాన్ని కూడా ఆయన నాకు బోధించాడు. అందువల్ల నేను మొత్తం వేదాంతాన్ని, వేదాన్ని తిరిగి వివరించాలి, దాని నుండి అన్ని మతాలు ఎలా ఉద్భవించాయో అవన్నీ ఒకటేనని తెలుస్తుంది. ఈ విధంగా సనాతన ధర్మం ద్వారా భారతదేశం ప్రపంచ మతపరమైన జీవితానికి కేంద్రంగా దాని గమ్యంగా, రక్షకురాలిగా నిరూపించబడుతుంది.

2. వేద జ్ఞానం ఆధారంగా ఆత్మను ముక్తం చేయడమే కాకుండా పరిపూర్ణ మానవత్వాన్ని సిద్ధం చేసి సత్యయుగ పునరుద్ధరణలో సహాయపడే యోగ సాధనను ప్రతిష్టించడం. ఆ కార్యం ఇప్పుడు ప్రారంభం కావాలి కానీ అది కలి యుగం ముగిసే వరకు పూర్తి కాదు.

3. భారతదేశం కేంద్ర బిందువుగా ఉన్నందున, ప్రపంచంలో తనను సరైన స్థానానికి తిరిగి నిలబెట్టడం కోసం కృషి చేయాలి. కానీ ఈ పునరుద్ధరణ పైన పేర్కొన్న పనిలో భాగంగా అమలు చేయబడాలి, యోగ మార్గం ద్వారా మానవ సాధనాలకు అది వర్తించాలి అంతే తప్ప మరోలా కాదు.

4. పరిపూర్ణ మానవత్వం ఉద్దేశించిన సమాజం ఆ పరిపూర్ణతను కలిగి ఉండటానికి సరిపోయేలా పునర్నిర్మించబడాలి.

CWSA 36: 177-178

ఎక్కడైనా మనుషులు తమ గురువును అవతారంగా నిరూపించడానికి అతనిలోని వివిధ గుణాలను కనుగొనడానికి ప్రయత్నిస్తారు, ఇక్కడ కొందరు నిరూపించే అవకాశాన్ని కూడా తిరస్కరించడానికి కారణాలను కనుగొనడానికి ప్రయత్నిస్తారు.

అందుకే, ఇది ఆధునిక ఆశ్రమం !

CWSA 35: 400

మానవజాతి భారాన్ని మోయడానికి..

ఈ మార్గం మీకు లేదా మీకు నచ్చిన వారికి చాలా కష్టం అని, ఇది కేవలం శ్రీమాత, నా వంటి "అవతారాలు" మాత్రమే చేయగలరు అని మీరు అంటున్నారు. ఇది ఒక విచిత్రమైన దురభిప్రాయం, ఎందుకంటే ఇది సులభమైన, సరళమైన, అత్యంత ప్రత్యక్ష మార్గం, పైగా ఎవరైనా దీన్ని చేయగలరు, మనస్సు - ప్రాణికాల్ని నిశ్శబ్దపరిస్తే, మీ సామర్థ్యంలో పదవ వంతు ఉన్నవారు కూడా చేయగలరు. ఇది ఉద్రిక్తత, ఒత్తిడి, కష్టతర ప్రయత్నాలకు విరుద్ధమైన మార్గం. వాటికి గొప్ప తపో శక్తి అవసరం. శ్రీమాత, నా విషయానికొస్తే, మేము అన్ని విధాలుగా ప్రయత్నించాం, అన్ని పద్ధతులను అనుసరించాం, కష్టాల పర్వతాలను అధిగమించి, మీకంటే, ఈ ఆశ్రమంలో లేదా బయట ఉన్న వారి కంటే చాలా ఎక్కువ భారం మోసి, చాలా క్లిష్ట పరిస్థితులు, పోరాడాల్సిన యుద్ధాలు, భరించాల్సిన గాయాలు, అభేద్యమైన

ఎడారి, అడవి, చిత్తడి నేలని చీల్చే మార్గాలు, జయించాల్సిన శత్రువులు, ఇలా మాకు పూర్వం మరెవరూ చేయలేదని నేను ఖచ్చితంగా అనుకుంటున్నాను, ఈ మార్గనిర్దేశం చేసే నాయకుని కార్యం దైవత్వాన్ని అవరోహణ చేసి, ప్రాతినిధ్యం వహించడం మాత్రమే కాదు, కానీ మానవత్వంలోని ఆరోహణ అంశానికి ప్రాతినిధ్యం వహించడం మానవత్వ భారాన్ని పూర్తిగా భరించడం, కేవలం ఆట లాగా లేదా లీలలా కాకుండా భయంకరమైన అన్ని అడ్డంకులను , కష్టాలను, వ్యతిరేకతను అనుభవిస్తూ, అడ్డుకుంటూ, ఈ మార్గంలో నెమ్మదిగా ఉండే విజయవంతమైన శ్రమ మాత్రమే ఇక్కడ సాధ్యపడుతుంది. కానీ ఇవన్నీ ఇతరుల అనుభవంలో పూర్తి స్థాయిలో పునరావృతం కావడం అవసరమని లేదా వీటిని సహించాలి అని కాదు. దానిని తీసుకోవడానికి అంగీకరిస్తే మాకు పూర్తి అనుభవం ఉన్నందున ఇతరులకు సరళమైన సులభమైన మార్గాన్ని చూపగలము. భారీ మూల్యంతో గెలుపొందిన మా అనుభవం కారణంగానే మేము మిమ్మల్ని, ఇతరులను కోరగలము. "అంతరాత్మిక వైఖరిని అలవర్చుకోండి, సూటిదైన సూర్య ప్రకాశ మార్గాన్ని అనుసరించండి, దైవం మిమ్మల్ని ప్రత్యక్షంగా లేదా రహస్యంగా ప్రోత్సహిస్తుంది, ఒకవేళ అది రహస్యంగా ఉంటే, మంచి సమయంలో మీ ముందుకు ఆవిర్భవిస్తుంది. కఠినమైన, అడ్డంకులు గల కష్టమైన ప్రయాణం కోసం పట్టుబట్టవద్దు.

CWSA 32: 94-95

దైవ త్యాగం

ఖచ్చితంగా మేము మొదటి నుంచీ అతిమనస్సులో భౌతికంగా జీవించి ఉంటే, ఎవరూ మమ్మల్ని చేరుకొని ఉండేవారు కారు, అసలు సాధన జరిగి ఉండేది కాదు. మాకు, భూమికి మనుష్యులకు మధ్య సంబంధం గురించి ఎటువంటి ఆశ ఉండేది కాదు. అది కూడా, శ్రీమాత తనలో ఎప్పుడూ ఉండకుండా సాధకుల నిమ్న చేతన వైపు దిగి రావాలి. లేకపోతే వారు ఇలా అనడం ప్రారంభిస్తారు; "ఎంత దూరంగా నాపట్ల ఎంత తీక్షణంగా ఉన్నారు, మీరు నన్ను ప్రేమించడం లేదు, మీ నుండి నాకు ఎలాంటి సహాయం లభించదు... మొదలైనవి" మానవుణ్ణి కలవడానికి దైవం ఒక ముసుగు వెనుక ఉండాలి.

CWSA 32: 93

స్వేచ్ఛకు తలుపులు తెరవడం

శ్రీ అరవిందుల రాజకీయ ఆలోచనలు, కార్యకలాపాలు మూడు వైపులా ఉండేవి. మొదటిది, ఆయన ప్రారంభించిన కార్యం, ఒక రహస్య విప్లవాత్మక ప్రచార సంస్థ, దాని ప్రధాన లక్ష్యం సాయుధ తిరుగుబాటును సిద్ధం చేయడం. రెండవది, మొత్తం దేశాన్ని స్వాతంత్ర్య ఆదర్శంగా మార్చడానికి ఉద్దేశించిన బహిరంగ ప్రచారం, ఆయన రాజకీయాల్లోకి ప్రవేశించినప్పుడు, చాలా మంది భారతీయులు ఇది ఏమాత్రం సాధ్యం కాదని పూర్తిగా అసంభవం అని అనుకున్నారు, దాదాపు దానిని ఒక భూతంగా భావించారు. బ్రిటిష్ సామ్రాజ్యం చాలా శక్తివంతమైనదని, భారతదేశం చాలా బలహీనమైనదని భావించారు. ప్రభావవంతమైన నిరాయుధులుగా అటువంటి విజయం కోసం చేసే ప్రయత్నం గురించి కలలు కనడానికి కూడా శక్తి హీనులుగా ఉండేవారు. మూడవది, పెరుగుతున్న సహాయ నిరాకరణ, ఎదురు తిరగని ప్రతిఘటన ద్వారా విదేశీ పాలనను అణగదొక్కడం కోసం ప్రజా ఐక్య ప్రతిపక్షాన్ని కొనసాగించడానికి ప్రజల సంస్థ ఉండేది.

CWSA 36: 47

స్వాతంత్ర్య శుభవార్త

తన విప్లవ కార్య పరిధిలో శ్రీ అరవిందులు ఒక తరహా క్రియా విధానాన్ని పొందుపరిచారు. అదే తదుపరి జాతీయ కార్యవర్గ ప్రజా కార్యక్రమాలలో ఒక ముఖ్యమైన అంశంగా మారింది. ఆయన కార్య కేంద్రాలలోని యువకులను స్వదేశీ భావనను ఏదైతే ఆ సమయంలో ఇంకా శైశవ దశలో ఉండి ఏదో కొంతమందికే భ్రాంతిగా ఉన్నదో దానిని ప్రచారం చేయమని ప్రోత్సహించారు.

శ్రీ అరవిందుల ప్రధాన ఆసక్తి భారత రాజకీయ కార్య ధ్యేయంగా సంపూర్ణమైన, పూర్తి స్వాతంత్రం కావాలని బాహాటంగా ప్రకటించడం, పట్టు విడవకుండా పత్రికలలో నొక్కి చెప్పడం, ఆయన బహిరంగంగా అలా చేసే ధైర్యం కలిగిన తొలి భారతీయ రాజకీయవేత్త. దానిలో వెంటనే సఫలీకృతం అయ్యారు కూడా. ఆ పార్టీ తన స్వాతంత్రమనే ఆదర్శాన్ని వ్యక్తీకరించడానికి 'స్వరాజ్' అనే పదాన్ని ఎంచుకున్నది. అది అనతి కాలంలోనే అన్ని వైపులా

వ్యాపించింది కానీ కాంగ్రెస్ పార్టీ దానిని తన ఆదర్శంగా స్వీకరించిన చాలాకాలానికి లాహోర్ సమావేశం తర్వాత, జాతీయవాద నేతృత్వం క్రింద తనను పునః నిర్మించుకొని నూతనీకరించుకున్న తర్వాతనే అంగీకరించింది. ఆ పత్రిక దేశం కొరకు ఒక కొత్త రాజకీయ ప్రణాళికను పెంపొందించి దానిని జాతీయ పార్టీ ప్రణాళికగా ప్రకటించింది. సహాయ నిరాకరణ స్తబ్ద ప్రతిఘటన, స్వదేశీ భావన, విదేశీ బహిష్కరణ, జాతీయ విద్య న్యాయ సంబంధిత వివాదాలను న్యాయస్థానం వెలుపల గల మధ్యవర్తిత్వంతో పరిష్కరించడం శ్రీ అరవిందుల ప్రణాళికలోని ముఖ్యాంశాలు. ఉదాసీన ప్రతిఘటనపై శ్రీ అరవిందులు పత్రికలలో కొన్ని వ్యాస పరంపరలను ముద్రించడం జరిగింది. మరొక విప్లవాత్మక రాజకీయ సిద్ధాంతాన్ని పెంపొందించి మితవాద పార్టీకి చెందిన ఎంతోమంది నాయకుల వారి అపార్థాలు, ఆంగ్లేయుల న్యాయం పై నమ్మకం భారతదేశంలో విదేశీ ప్రభుత్వం కలిగించిన లాభాలు, ఆంగ్లేయుల న్యాయస్థానాలపై విశ్వాసం, పాఠశాలలో విశ్వవిద్యాలయాలలో బోధన యొక్క సమర్థత వంటి మూఢనమ్మకాలను నశింప చేయడం, మరింత బలంగా, సుదీర్ఘంగా ఉంటున్న నిర్వీర్యత, స్తంభించిన లేదా నెమ్మదించిన ప్రగతి, దారిద్ర్యం, ఆర్థికంగా ఆధారపడడం, సౌభాగ్య దాయకమైన పారిశ్రామిక అభివృద్ధి లేకపోవడం, అలాగే విదేశీ ప్రభుత్వ ఇతర దుష్ఫలితాలను తూర్పారబెట్టింది. పరదేశీ పాలన మేలు చేసినా, లాభదాయకమైనప్పటికీ అది ఒక స్వతంత్రమైన, ఆరోగ్యవంతమైన దేశ జీవనానికి ప్రత్యామ్నాయం కాలేదు. ఈ ప్రచారం సహాయంతో జాతీయ వాదుల భావాలు అన్నిచోట్లా ముఖ్యంగా అంతకుముందు ఎక్కువ మితవాదులున్న పంజాబ్‌లో సుస్థిర స్థానాన్ని పొందింది. పాత్రికేయ చరిత్రలో వందేమాతరం ప్రజల మనసులను మార్చి, విప్లవానికి సిద్ధం చేయడంలో కలిగించిన ప్రభావం పూర్తిగా విశిష్టమైనది.

CWSA 32:51-56

మానవతా కదనానికి నాయకుడు

అప్పుడు ఆయనకు పాండిచ్చేరి వెళ్లమని సందేశం వచ్చింది ఉత్తర పారాకు చెందిన కొంతమంది యువ విప్లవకారులతో నడపబడిన ఒక నావ ఆయనను కలకత్తాకు తీసుకువెళ్లింది. అక్కడ ఆయన డూప్లెక్స్ ఎక్కి **1910** సంవత్సరం ఏప్రిల్ **4**వ తారీఖున పాండిచ్చేరి చేరుకున్నారు.

పాండిచ్చేరిలో, ఆ సమయం నుండి శ్రీ అరవిందులు యోగ సాధన మరింత అంతర్ముఖమైనది. ఆయన బహిరంగ రాజకీయ కార్యాలలో పాల్గొనడం పూర్తిగా నిలిపివేశారు. పునర్నిర్మితమైన భారత జాతీయ కాంగ్రెస్ సభలకు అధ్యక్షత వహించమని అభ్యర్థనలను అనేకసార్లు త్రోసిపుచ్చారు. తమ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సంబంధించని ఏ విధమైన బహిరంగ ఉపన్యాసాల నుండి అయినా దూరంగా ఉండే నియమాన్ని పాటించారు. తరువాత కాలంలో ఆర్యలో వ్రాసిన వ్యాసాలు తప్ప మరే ఇతర రచనలు లేదా వ్యాసాలను ఆయన బయటకు పంపలేదు. కొన్ని సంవత్సరాలపాటు విప్లవ శక్తులతో ఒకరిద్దరు వ్యక్తుల ద్వారా ఆయన వ్యక్తిగత సంబంధాన్ని కలిగి ఉండేవారు. కానీ కొంత సమయం తర్వాత ఆయన దీనిని విడిచిపెట్టారు. ఆపై ఏ విధమైన రాజకీయాలలోనూ పాలు పంచుకోకుండా పూర్తిగా విరమించుకున్నారు. భవిష్యత్తు యొక్క ఆయన దర్శనం మరింత స్పష్టమై భారత దేశపు అంతిమ స్వాతంత్ర్యం, ఆ వైపుగా శక్తులు కలవడం తరువాత కనుగొన్నారు. భారతీయుల ప్రతిఘటన, అంతర్జాతీయ ఘటనల ఒత్తిడి వలన బ్రిటన్ బలవంతంగా భారత స్వాతంత్ర్యాన్ని అంగీకరించడానికి అర్థిక వ్యతిరేకత అయిష్టతలతో 'కదలడం' ప్రారంభించింది. జాతీయవాద భావనను గాయపరచకుండా ఆయుధ పోరాటం అవసరం లేదని అందుకు రహస్యంగా సన్నద్ధమవడాన్ని విడిచి పెట్టాలని భావించారు. కానీ విప్లవాత్మక ఉద్యమ స్ఫూర్తిని నిలిపి ఉంచుకోవాలని తప్పనిసరిగా నిలుపుకోవాలని భావించారు. ఆ కారణంగా రాజకీయాల్లో ఆయన వ్యక్తిగతంగా కల్పించుకోవడం ఇకపై తప్పనిసరి కాదు. వీటన్నిటికీ భిన్నంగా ఆయన ముందున్న ఆధ్యాత్మిక కార్యము ఆధిక్యత ఆయనకు మరింతగా, స్పష్టం కాసాగింది. శక్తులన్నిటిని ఏకాగ్రం చేయవలసిన అవసరాన్ని ఆయన వీక్షించారు.

కానీ దీని అర్థం చాలామందికి అనుకున్నట్లుగా ఆయన ఏదో ఉన్నతమైన ఆధ్యాత్మిక అనుబంధంలోనికి విరమించుకొని ఆపై భారత దేశ, ప్రపంచ భవితపై ఆసక్తి లేకుండా ఉన్నారని కాదు. దాని అర్థం అది కాదు. ఎందుకంటే ఆయన యోగ సిద్ధాంతం కేవలం భగవంతుని తెలుసుకొని సంపూర్ణమైన ఆధ్యాత్మిక చైతన్యాన్ని పొందడమే గాక పూర్తి జీవితాన్ని, ప్రపంచ కార్య కలాపాలను పూర్తిగా ఈ ఆధ్యాత్మిక చేతన పరిధిలోకి, కార్యంలోకి తీసుకుని వచ్చి, జీవితాన్ని ఆత్మలో నిలబెట్టి దానికి ఒక ఆధ్యాత్మిక అర్థాన్నివ్వడం.

విరమణలో కూడా శ్రీ అరవిందులు ప్రపంచంలో, భారత దేశంలో జరుగుతున్న విషయాలపై సునిశిత దృష్టి నిలిపి అవసరమైనప్పుడు చురుకుగా కల్పించుకునే వారు. కానీ కేవలం ఆధ్యాత్మిక శక్తితో నిశ్శబ్ద ఆధ్యాత్మిక ప్రక్రియతో మాత్రమే. యోగంలో బాగా పురోగతి చెందిన వారి అనుభవ సారాంశం ఏమిటంటే పదార్థంపై మనసు, ప్రాణ, శరీరాల సాధారణ శక్తులే కాకుండా పై నుండి వెనుక నుండి పనిచేసే ఇతర శక్తులు కూడా ఉంటాయి. ఆధ్యాత్మిక చేతనలో పురోగతి చెందిన వారు ఆధ్యాత్మిక చైతన్య శక్తిని స్వంతం చేసుకుంటారు. అందరూ స్వంతం చేసుకోవాలనుకోవచ్చు లేదా వారివద్ద ఉన్న దానిని ఉపయోగించుకోవాలను కోకపోవచ్చు, ఈ శక్తి అన్నిటికన్నా మహత్తరమైనది, ప్రతిభావంతమైనది.

ఈ శక్తిని ఆయన పొందిన వెంటనే వ్యక్తిగత కార్యానికి చాలా పరిమిత పరిధిలో వాడారు. కానీ తరువాత ప్రపంచ శక్తులతో నిరంతరం పనిచేశారు. ఆయనకు ఫలితాలతో అసంతృప్తి చెందడానికి కారణమేమీ లేదు, లేదా మరొక విధమైన కార్యఅవసరాన్ని ఆయన అనుభూతి చెందలేదు. రెండు సందర్భాల్లో మాత్రం ఆయనకు జన సామాన్య తరహాకార్యాన్ని తీసుకోవడంలో సమంజసమనిపించింది. మొదటిది రెండవ ప్రపంచ యుద్ధానికి సంబంధించినది ప్రారంభంలో ఆయన దానిని అంతగా పట్టించుకోలేదు. కానీ ఎప్పుడైతే హిట్లరు తనను ఎదిరించే శక్తులన్నిటినీ కాలరాయగలడనీ, నాజీమతం ప్రపంచంపై ఆధిపత్యం వహిస్తుంది అని అనిపించిందో, ఆపై ఆయన కల్పించుకోవడం ప్రారంభించారు. బహిరంగంగా ఆలీస్ పక్షం వహిస్తున్నట్లు ప్రకటించి వారు నిధులకై అర్థించినపుడు వారికి కొంత ఆర్థిక సహాయాన్ని అందించి సైన్యంలో చేరటానికి తమ సలహా కోరేవారిని లేదా యుద్ధ ప్రయత్నంలో పాలు పంచుకోవవాలనుకొనే వారిని ప్రోత్సహించారు. ఆంతరంగికంగా డన్‌కిర్క్ ఘటన తర్వాత ఆయన తమ ఆధ్యాత్మిక శక్తిని ఆరీస్ వెనుక ఉంచి, అందరూ ఇంగ్లాండు యొక్క తక్షణ పతనాన్ని హిట్లర్ తప్పని సరి విజయాన్ని ఊహిస్తున్న సమయంలో ఆయనకు జర్మనీ విజయం వెంటనే నిలిచిపోవటం తృప్తిని కలిగించింది. యుద్ధ తరంగం వ్యతిరేక దిశకు తిరగటం ప్రారంభించింది. ఆయన అలా చేయటానికి కారణం హిట్లర్ నాజీయిజం వెనుక నల్లని అసుర శక్తులను చూడడం, వాటి విజయం వలన మానవాళి దుష్టశక్తుల అహంకారానికి బానిసగా మారి పరిణామం ముఖ్యంగా,

ఆధ్యాత్మిక పరిణామం వెనుకబడిపోతుంది. అది కేవలం యూరప్ మాత్రమే కాక పూర్తి ఆసియా ఖండపు బానిసత్వానికి దారి తీస్తుంది. అందులో భారతదేశం మిగిలిన దేశాల కన్నా మరింత భయంకరమైన బానిసత్వాన్ని సహించవలసి వస్తుంది. తన విమోచనం కోసం చేసిన ప్రయత్నమంతా వ్యర్ధమవుతుంది. ఈ కారణమే ఆయనను బహిరంగంగా క్రిప్స్ ప్రతిపాదనకు మద్దతు పలికి కాంగ్రెస్ నాయకులను అందుకు అంగీకరించమని ఒత్తిడి చేసేటట్లు చేసింది. చాలా కారణాల వలన మొదట ఆయన తమ ఆధ్యాత్మిక శక్తితో జపనీయులు ఉగ్రత్వాన్ని ఎదుర్కోలేదు. జపాను భారతదేశంపై దాడిచేసి ఆక్రమించి జయించాలనుకునే అంత వరకు కల్పించుకోలేదు. హిట్లరిజమ్ అసుర ప్రకృతి దాన్ని తప్పించలేని పరిణామాలపై తమ అభిప్రాయాలను నొక్కి చెబుతూ,ఆయన యుద్ధానికి మద్దతునిస్తూ వ్రాసిన కొన్ని లేఖలను బహిరంగంగా వెల్లడించడానికి అనుమతించారు. క్రిప్స్ ప్రతిపాదనను ఆయన బలపరుస్తూ భారత్ మరియు బ్రిటన్ ఐకమత్యంగా అసుర శక్తులకు వ్యతిరేకంగా నిలబడగలిగితే క్రిప్స్ పరిష్కారం స్వాతంత్ర్యం వైపు ఒక అడుగు వేయడానికి ఉపయోగపడుతుందని ఆయన భావించారు. ఎప్పుడైతే సంప్రదింపులు నిష్ఫలమయ్యాయో శ్రీ అరవిందులు తమ ఆధ్యాత్మిక శక్తిపై మాత్రమే ఆధారపడి, ఉగ్రవాదులపై దానిని ఉపయోగించి, జపనీయులు విజయవంతంగా అంతవరకూ తమ ముందున్న దానినంతటినీ తుడిచిపెట్టి జపాన్ వారి విజయం వెనువెంటనే వేగంగా నేలకొరిగి, తీవ్రంగా ఎదుర్కోలేని ఓటమిని పొందడం చూసి సంతష్టులయ్యారు. కొంతకాలం తర్వాత భారతదేశపు భవిష్యత్తు గురించి తన దర్శనాలు ఋజువు కావటం, ఎన్ని ఆంతరంగిక ఇబ్బందులున్నప్పటికీ స్వతంత్రంగా నిలబడడం ఆయనకు సంతృప్తినిచ్చింది.

CWSA 36:64-66

భవిష్య పవిత్ర గ్రంథాలు

'ఆర్య'లో మత తత్వ శాస్త్రం ఏమీలేదని నొక్కి వక్కాణించగలను. ఏ మతపరమైన విశ్వాసాన్ని లేదా సిద్ధాంతాన్ని సమర్థించడం, అభివృద్ధి చేయడం లేదా ఏదైనా పాత లేక కొత్త మత విశ్వాసాన్ని ధృవీకరించడం గూర్చి ఆర్యలో ఏదీ వ్రాయబడలేదు. విషయంలోని సారాన్ని పాండిత్య పరంగా

వివరించినప్పుడు ఆయన దాని స్థాయిని కోల్పోనివ్వలేదు. ఈ ప్రబోధం ఏ పుస్తకాల నుండీ తీసుకొన్నది గాదు, తాత్విక భాషలో వ్రాసినప్పటికీ కాల్పానిక చింతనతో లేదా రివాజు ప్రకారం చేసే తర్కంపై ఆధారపడి లేదు. ఇది ఒక ప్రాథమిక ఆధ్యాత్మిక అనుభవాన్ని వ్యక్తపరుస్తుంది. వ్యక్తి అభివృద్ధిలో క్రియాశీలకంగాను, దాదాపు ముప్ఫైయేళ్ల నిరంతర సాధనతో విస్తృతంగా, రూఢి పర్చబడి, మొత్తం సమాచారంతో సంపూర్తిగా ఉంది. అదే విధంగా ఒక గొప్ప విశాల ఆధ్యాత్మిక అనుభవంతోనే ఈ ప్రబోధం ఉన్నది తప్ప ఏదోసాధారణ బౌద్ధిక తర్కానికి, సవాలుకు నిలువలేనిది లేదా చెల్లుబడి కానిదిగా కాదు.


CWSA 35:88



మనిషికోసం, భూమి కోసం కొత్త యోగం

నా యోగం ఇతర లోకాలకు సంబంధించి, సర్వోన్నత ఆత్మ తలానికి వాటి మధ్య వున్న ఇతర తలాలు, మన జీవితంపైన ఈ పదార్థ ప్రపంచంపైనా వాటి సాధ్యాసాధ్య ప్రభావాలకు సంబంధించి నిజంగా ఒక సంపూర్ణ అనుభవాన్ని నింపుకొనే ఉంటుంది. ఈ యోగంలో పరమాత్మ సాక్షాత్కారం లేదా ఈశ్వరునిలోని ఒక పార్శ్వమైన శివుడు, కృష్ణుణ్ణి లోకాల ప్రభువుగా, మనకూ, మన కార్యాలకు అధిపతిగా లేదా విశ్వాత్మక సచ్చిదానందంగా సాక్షాత్కరించుకొనేందుకు ఒత్తిడి చేయడముంటుంది.

ఈ యోగంలోని ప్రధాన ఫలితాలను పొంది, తదుపరి వాటి ద్వారా ఈ ప్రపంచం ఆత్మ చేత జయించబడుతుందని, భువిపై దివ్య జీవనం అనే ఆదర్శాన్ని స్వీకరించినట్లయితే ఇక సమగ్ర ఫలితాల వైపు ముందుకు సాగడముంటుంది. ఈ అంశాలకు సంబంధించిన ఈ దృష్టి, ఈ అనుభవం, ఈ ఉనికిలోని సత్యం నన్ను 'లైఫ్ డివైన్', 'సావిత్రి'లను రచించడానికి పురికొల్పాయి. పరమాత్మకు సంబంధించిన ఈశ్వరునికి సంబంధించిన, సాక్షాత్కారం ఖచ్చితంగా ప్రధానమైన అంశమే. ఆయనను ప్రేమతో, భక్తితో తన కర్మలు చేయడం ద్వారా తెల్సుకొంటూ, బౌద్ధికంగా తెలుసుకోవడం అంత అవసరం కాకపోయినా, ఆధ్యాత్మిక అనుభవంతో ఆయనను చేరడం, పూర్ణయోగం మార్గంలో ప్రధానం.

CWSA 35:234-35

మీరు పరమాత్మ అవతారమని నేను గట్టిగా విశ్వసిస్తున్నాను. నా నమ్మకం సరైనదే కదా?

నీ నమ్మకాన్ని అనుసరించు. అది నిన్నుతప్పుదోవ పట్టించదు.

CWSA 35:433 శ్రీ అరవిందులు

శాశ్వతత్త్వంలో ప్రతి అవతారం కూడా మరింత పరిపూర్ణమైన సాక్షాత్కారానికి ఆద్యుడు, ప్రకటన కర్త మాత్రమే.

మానవులు ఎల్లప్పుడు భవిష్యత్ అవతారానికి వ్యతిరేకంగా, గతంలోని అవతారాన్ని దేవుణ్ణి చేసే ధోరణి కలిగి ఉంటారు.

ఇప్పుడు మళ్ళీ శ్రీ అరవిందులు రేపటి సాక్షాత్కారాన్ని ప్రపంచానికి ప్రకటిస్తూ వచ్చారు. ఆయన సందేశం ఆయనకు పూర్వం వున్న వారందరి మాదిరిగానే వ్యతిరేకతను ఎదుర్కొంటుంది. కానీ రేపు అనేది శ్రీ అరవిందుల ఆవిష్కరణలో నిజాన్ని ఋజువు చేస్తుంది. ఆయన తలపెట్టిన కార్యం జరుగుతుంది.

CWM 13:22 శ్రీమాత

రక్షకుడు

వివిధ ప్రశ్నలకు సమాధానాలు అనేవి ప్రస్తుత మానవ నాగరికత గురించిన ప్రశ్నకు భిన్నమైనవి. ఆ నాగరికతను రక్షించడం కన్నా ప్రపంచాన్ని రక్షించడం ముఖ్యం. అది అంత సులభంగా గాని, వెంటనే గాని జరగకపోవచ్చును గాని తప్పక జరుగుతుంది. ప్రస్తుత నాగరికత తప్పక మారాలి. అది వున్న నాగరికతను ధ్వంసం చేయడం ద్వారానా లేక సత్యం ఆధారంగా నిర్మాణ మయ్యే నూతన నాగరికతను ప్రవేశపెట్టడం ద్వారానా అనేది విషయం. శ్రీమాత ఆ ప్రశ్నను అలాగే వదిలేశారు గనుక నేను కూడా దానిని అలాగే ఉంచుతాను.

ఇది మీకూ, ప్రతి ఒక్కరికి ఇబ్బందికరమైన సమయమని నాకు తెలుసు. ఇది ప్రపంచంలో ప్రతిచోట గందరగోళం, ఇబ్బంది, అశాంతి, కలతలు కలిగించే సాధారణ పరిస్థితి. రాబోయే మంచి విషయాలు ముసుగు వెనుక సిద్ధం చేయబడుతూ లేదా ఎదుగుతూ ఉంటాయి. ప్రతి చోటా అధ్వాన్నమైనది వాసికెక్కుతుంది. మరొక విషయం ఏమిటంటే వెలుగు ఘడియ వచ్చేవరకూ పట్టి ఉంచడం, విడిచిపెట్టడం ఒక అంశం.

CWSA 35:221-22

పరిణామాన్ని కొనసాగించడం

మీరూ, మదర్ ఈ సృష్టి ప్రారంభం నుంచి ఈ భూమిమీద ఉన్నారని అంటారు. కాని ఇన్ని మిలియన్ల సంవత్సరాల నుండి మీరు ఉండి ఏం చేశారు? మీరు మారు వేషాలలో ఉన్నారు. ఇప్పుడు మాత్రమే మీరు మీ నిజ స్వరూపాలను ప్రపంచానికి చూపిస్తున్నారు.

పరిణామాన్ని ముందుకు నడపడం

పరిణామాన్ని ముందుకు తీసుకుపోతున్నాం. పరిణామాన్ని ముందుకు నడపడం అంటే ఏమిటో అర్థం చేసుకోవడంలో నేను విఫలమయ్యాను. దీనిని మీరు మరింత వివరంగా వివరించగలరా?

అంటే మానవ చరిత్ర మొత్తాన్ని తిరిగి రాయడమే. తదుపరి దశ వరకు పరిణామాన్ని కొనసాగించడానికి ప్రత్యేక అవతారాలు దిగి వస్తున్నాయి కాబట్టి, దైవానుగ్రహం ప్రతి దశలోనూ దిశా నిర్దేశం చేస్తున్నది కాబట్టి అది మరో దశకు చేరుతుంది.

మీరూ, మదర్ మొదటి నుంచీ నిరంతరం ఈ భూమి మీద ఉంటున్నారు గనుక అవతారాలు ఒక్కొక్కటిగా ఇక్కడకు రావలసిన అవసరమేముంది?

మేము అవతారాలుగా భూమి మీద లేము

అయినా పరిణామాన్ని ముందుకు తీసుకువెళుతున్నామని చెబుతున్నారు గదా మరి అలాంటప్పుడు దైవం భూమిమీద ఉన్నప్పుడు మరి దైవంలో భాగమైన అవతారాలు దిగిరావలసిన అవసరమేమున్నది?

పరిణామ క్రమంలో ఏదైనా ఇబ్బందికర పరిస్థితి ఉత్పన్నమైనపుడు ఆ పరిస్థితిని ప్రత్యేకంగా చక్కదిద్దవలసి వచ్చినపుడు అవతారాలు దిగిరావడం తప్పని సరి అవుతుంది. అవతారమనేది దైవం యొక్క ప్రత్యేకమైన అభివ్యక్తీకరణ. మిగతా సమయాలలో దైవం సాధారణ మానవ పరిధిలో విభూతిగా పనిచేస్తూ ఉంటుంది.

CWSA 32:88-91

ఆఖరి అవతారం

కల్కి గురించిన వివరాలకు అంతగా ప్రాముఖ్యతను జత చేయవలసిన అవసరం లేదు. అవి భవిష్యత్తు చరిత్ర వివరాలను ప్రవచించే ప్రయత్నం కంటే ప్రతీకాత్మకమైనవి అంతే. అందువల్ల పురాణాలలో యుగాల గురించి సరైన అంకెలకు అంత ప్రాముఖ్యత ఇవ్వవలసిన అవసరం లేదు. పరిణామ కాల చక్రంలో యుగాలు వరుస క్రమంలో సూచించబడతాయి. మానవత్వం యొక్క పరిపూర్ణత విచ్ఛిన్నం, తిరోగమనాలననుసరించి నూతన జన్మ ఆవిర్భవిస్తుంది. ఇక్కడ లెక్కలు, గుణాంకాలు అంత ముఖ్యమైనవి కాదు. కలియుగాంతం ఇప్పటికే వచ్చిందా లేక రాబోతుందా అనే తర్కం మరియు నూతన సత్య యుగం ప్రారంభం కాబోతుందనే వాదనను చాలామంది సమర్థించారు.

CWSA 28:489 *శ్రీ అరవిందులు*

శ్రీ అరవిందుల అవతారం చివరి అవతారమని నేనెప్పుడూ వింటూనే ఉన్నాను. బహుశ అది ఆయన మానవ శరీరంతో అవతరించడం ఆఖరిసారి కావచ్చు. తరువాత, మనకు తెలియదు.

CWM 10:253

రెండు సమాంతర సత్యాలు

శాశ్వతమైన, పరాత్పర దృక్కోణం నుండి సాక్షాత్కారం పొందడానికి ఒకేవిధమైన ప్రాముఖ్యత కలిగిన రెండు విషయాలు సమాంతరంగా ఉన్నవి. కాని నిజమైన సాక్షాత్కారం పొందడానికి రెండూ కూడా సమానంగా అవసరం.

ఒకవైపు అవతారమూర్తిగా భూమిపై వున్న మహోన్నత చైతన్యానికి సంకల్పానికి ప్రతీకగా నిలిచిన శ్రీ అరవిందులు నన్ను సర్వోన్నత విశ్వమాతగా ప్రకటించడం ఒకవైపు. నా శరీరంతో సమగ్ర సాధన ద్వారా నేను గ్రహించినది మరోవైపు.

సర్వోన్నత విశ్వమాతగా ఉండి ఏ సాధనా చేయగూడదు. నిజానికి శ్రీ అరవిందులు తన శరీరంలో ఉన్నంత కాలం సాధన చేసింది ఆయనే. అయినప్పటికీ ఆ సాధన యొక్క ప్రభావాలకు నేను లోనయ్యాను. ఆ ప్రభావాలు వాటంతటవే బాహ్య అస్తిత్వంలో నెలకొన్నాయి. చేసేదంతా శ్రీ అరవిందులే. నేను కాదు. నేను ఆయన సాధనకు ప్రపంచానికి మధ్య వారధిని మాత్రమే. ఆయన తమ దేహాన్ని వదిలినప్పటి నుండీ మాత్రమే ఆ సాధన నేను చేపట్టేందుకు ఒత్తిడి చేయబడ్డాను. ఆయన సాధనకు, ప్రపంచానికి మధ్య వారధిగా నేను చేయవల్సి ఉన్నదే కాదు, అంతకు ముందు నుండీ నేను కొనసాగిస్తున్నది కూడా చేయాలి. ఇప్పుడు దీనినంతటినీ ముందుకు తీసుకు వెళ్ళాలి. ఆయన ఎప్పుడైతే దేహత్యాగం చేశారో ఆయన శరీరంలో ఉండగా ఏమి చేస్తున్నారో దాని బాధ్యతంతా నావైపుకు మరల్చబడింది. అది నేను నెరవేర్చి తీరాలి. కొన్నిసార్లు ఒకటి ముందుకొస్తుంది. మరోసారి మరొకటి. అవి రెండూ సంపూర్ణ సత్య సాక్షాత్కారంలో మేళవించుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. పరమాత్మ కార్యాచరణకు చెందిన శాశ్వత అనిర్వచనీయ, నిర్వికార చేతనను అంతకంతకూ పురోగమనం వైపు ఆరోహణ ప్రయత్నం చేసే పూర్ణ యోగ సాధకుని చేతనను జోడించడం.

శ్రీమాత; శిష్యునితో సంభాషణ, అక్టోబర్ 10-1958

శాశ్వత జన్మ

శ్రీ అరవిందుల జన్మ విషయం గూర్చి నేను ఉపయోగించిన పదబంధం 'శాశ్వత జన్మ' అన్నదానిపై 'శాశ్వతం' అని అంటే ఏమిటి అని నన్ను అడిగారు.


సరే భాషా పరంగా పదం, దాని అర్థం, శాశ్వత జన్మ వంటి వాటికి అంత ప్రాధాన్యత లేదు. కాని ఇక్కడ అసలు విషయాన్ని నేను మీకు వివరించబోతున్నాను. నిజానికి శాబ్దికమైన వివరణ, దాని అర్థం అలాగే మానసిక అవగాహన, అంతరాత్మిక అవగాహన, ఆధ్యాత్మిక అవగాహన అనే వివిధ స్థాయిలుంటాయి.

భౌతికంగా అంటే ఈ జన్మ యొక్క పర్యవసానాలు భూమి ఉన్నంత కాలం ఉంటాయి. శ్రీ అరవిందుల వారి జనన పర్యవసానాలు భూమి ఉన్నంత వరకు అనుభూతిలోకి వస్తూ ఉంటాయి. అందువల్ల ఆ విషయాన్ని కొంచెం కవితాత్మకంగా శాశ్వతం అన్నాను.

మానసికంగా ఆయన జననం యొక్క పర్యవసానాలు, జ్ఞాపకాలు కూడా శాశ్వతమైనవే అయినప్పటికి భౌతికంగా అది విశ్వచరిత్రలో శాశ్వతంగా పునరావృతమయ్యే జన్మ. ఆ జన్మ విశ్వ చరిత్రలో కాలానుగుణంగా జరిగే ఒక వ్యక్తీకరణ. ఈ పుట్టుక కూడా ఈ చరిత్రలో పునరావృతమవుతూ ఉంటుంది. ప్రతిసారి క్రితం జన్మకన్నా మరింత పరిపూర్ణమైనదిగా ఉంటుంది. అయినప్పటికి కిందకు దిగిరావడమనేది, మానవ శరీరంతో జన్మ తీసుకోవడ మనేది మాత్రం మామూలే.

చివరకు పూర్తిగా ఆధ్యాత్మిక దృష్టితో చూస్తే ఇది భూమి మీద శాశ్వతుని జన్మ అని చెప్పవచ్చు. భౌతిక శరీరం తీసుకుని జన్మించే ప్రతిసారి శాశ్వతుడు స్వయంగా తనకు తానుగా జన్మ తీసుకుంటున్నాడు అని చెప్పవచ్చు.

CWM 9:178-79 — *శ్రీమాత*



అఖిల

అఖిల భారత పత్రిక

సెప్టెంబర్ 2023

మన నిజాత్మ సంసిద్ధి

విషయ సూచిక


భాగం - 1 (శ్రీ అరవిందుల రచనల నుండి)

భాగం - 2 (మదర్ రచనల నుండి)

అత్యావశ్యకమైనది, దైవ సాక్షాత్కారం, తక్కినదంతా అందుకు సహాయపడినంత వరకు కోరదగినది, లేక సిద్ధి పొందినపుడు విస్తరించి అభివ్యక్తమౌతుంది. తొట్టతొలి అవసరం, సిద్ధి, దాని చుట్టూనే తక్కినదంతా జరుగుతుంటుంది. ఎందుకనంటే అది లేకుండా తక్కిన దానకంతటికీ యేమీ అర్థమే ఉండదు.

CWSA 35:784 — *- శ్రీ అరవిందులు*

అనువాదం : కె.వి. రావు



మా - శ్రీ అరొబిందో

అంతర్యామి

మన పురుష ప్రయత్నపు తీవ్రాకాంక్షచే, తనలో తాను మునిగిపోయి ఉండే అహం చేత, దాని లక్ష్యాల చేత అంతర్యామి మొదట్లో తరచుగా తెరమరుగై ఉంటాడు. మనం స్పష్టతను సంపాదించుకొన్న కొద్దీ, అహంకారిక స్వప్రయత్నపు సంక్షోభం, ఒక ప్రశాంత ఆత్మ - జ్ఞానానికి తావిచ్చినపుడు, మనలో పెరుగుతున్న వెలుగు మూలాన్ని మనం గుర్తిస్తాం.

ఇప్పుడు మాత్రమే మనం గ్రహించనారంభిస్తున్న మన సమస్త అస్పష్ట, పరస్పరం సంఘర్షించుకొనే కదలికలన్నీ ఎలా ఒక ముగింపు వైపునకు నిర్దేశించబడినాయో, యోగ మార్గంలోనికి మనం ప్రవేశించక ముందు సైతం, మన జీవన పరిణామం, పథకం ప్రకారం దాని ఈ మలుపువైపు ఎలా నడిపిందో తెలుసుకొన్నప్పుడు, గతావలోకనం ద్వారా మనలో పెరుగుతున్న ఆ వెలుగు మూలాన్ని గ్రహిస్తాం. ఎందుకనంటే మన పెనుగులాటలు, ప్రయత్నాలు, జయాపజయాల అర్థాన్ని గ్రహించ ఆరంభిస్తాం. చివరకు మన వ్యధలు, బాధల అర్థాన్ని ఆకళింపు చేసుకోగలుగుతాం. మనలని గాయపరిచినది, మనలని నిరోధించినది అంతా మనకు అందించిన సహాయాన్ని మెచ్చుకోగలుగు తాం. మన అసలు పతనాలు, తడబాట్ల ప్రయోజనాన్ని ప్రశంసించగలుగుతాం.

ఒక విశ్వాతీత ద్రష్టచే మన ఆలోచనలు, ఒక సర్వాలింగక. దివ్యశక్తిచే మన సంకల్పం, కర్మలు, ఒక సర్వాకర్షక, సర్వాన్ని జీర్ణించుకోగల, మహదానందం, దివ్య ప్రేమలచే మన భావావేశ జీవనం రూపొందడంలో ఈ దివ్య నాయకత్వాన్ని, తరువాత, గతావలోకనం ద్వారా గాక, అప్పటి కప్పుడు, వెంటనే గుర్తిస్తాం. ప్రథమంలో మనల్ని స్పృశించినట్లుగా లేక చివరకు మనల్ని ఆవహించి వేసినట్లుగా గాక మరింత అధికంగా వ్యక్తిగత సంబంధం కలదానిగా గుర్తిస్తాం. ఒక పరమోత్కృష్ట గురువు, దివ్య సఖుడు, దివ్య ప్రియుడు, ఆచార్యుని శాశ్వత సన్నిధిని సంవేదిస్తాం.

ఒక విశ్వాతీత ద్రష్ట మన ఆలోచనలు, ఒక సర్వాలింగక దివ్యశక్తి మన సంకల్పం, కర్మలు, ఒక సర్వాకర్షక, సర్వాన్ని జీర్ణించుకోగల, మహదానందం, దివ్య ప్రేమలచే మన భావావేశ జీవనం రూపొందడంలో, ఈ దివ్య

నాయకత్వాన్ని, తరువాత, గతావలోకనం ద్వారా గాక తత్క్షణమే గుర్తిస్తాం. ఒక మహనీయ, విశాల అస్తిత్వంలా, దానితో ఒకటిగా కన్పించే ఏకత్వంలోనికి అభివృద్ధి చెందేదానిలా, మన అస్తిత్వ సారంలో దానిని గుర్తిస్తాం. ఎందుకనంటే ఈ మహిమోపేతమైన అభివృద్ధి మన స్వప్రయత్నాల ఫలితం కాదని మనం గ్రహిస్తాం. ఒక శాశ్వత పరిపూర్ణత లేక సిద్ధి, తన ప్రతిబింబంలా మనలను రూపొందిస్తున్నది. యౌగికతత్త్వ శాస్త్రాల ప్రభువు లేక ఈశ్వరుడు, సచేతన అస్తిత్వంలో దివ్య మార్గదర్శకుడు (అంతర్యామి), చింతనుడి నిరపేక్షం, అజ్ఞేయవాది అజ్ఞేయం, పదార్థవాది విశ్వ మహాక్రియా శక్తి, మతాలచే భిన్నంగా పిలువబడే, ఊహించబడే ఏకైకుడు మన యోగ గురువు.

ఈ యేకైకుని మన ఆంతరిక ఆత్మలో మన సమస్త బాహ్య ప్రకృతిలో దర్శించుట, తెలుసుకొనుట, ఆతనిలా అగుట, ఆతనిని సఫలం చేయుట, అనేవి ఎల్లప్పుడూ రహస్య గమ్యం, దేహం ధరించిన మన అస్తిత్వపు, సచేతన కార్యంగా అదిపుడు అవుతుంది. మన అస్తిత్వపు సమస్త భాగాలలోనూ ఆయన యెరుకను పొందడం, మన అస్తిత్వానికి బాహ్యమైన వాటిగా, విభజించు మన మనస్సు చూసే వాటన్నిటిలో అంతే సమానంగా యెరుక పొందడం అనేది వ్యష్టిచేతన పతాక స్థాయి. ఆయనచే పొదవుకొనబడడం, ఆయనను మనలో సర్వంలో పొదవుకొనడం అనేవి, సర్వం సహా సామ్రాజ్యాధిపత్యం, సర్వం సహా అధికారం హస్తగతం చేసుకోవడం అవుతుంది. నిష్క్రియ, సక్రియతలకు సంబంధించిన, శాంతి శక్తులకు, ఏకత్వం భిన్నత్వాలను సంభోగించడం అనేది ప్రపంచంలో అభివ్యక్తమైన వ్యష్టాత్మ జీవి, అస్పష్టతతో అన్వేషిస్తున్న సుఖం.

ఈ సమగ్ర సాఫల్యత వైపుకు భద్రమైన దారి, మనలో ఆవాసముంటున్న అతి రహస్యపు పరమ గురువును కనుగొనడం, దివ్యజ్ఞానమూ, దివ్య ప్రేమ కూడా అయిన దివ్యశక్తికి మనం నిరంతరం ఉన్మీలనమై ఉంటూ పరివర్తన జరిగేటట్లు దానిని నమ్ముకొని ఉండడం చెయ్యాలి. కాని మొదట్లో దీనినే మాత్రమైనా చేయడమనేది ఆహంకారిక చేతనకు కష్టం. ఒకవేళ చేయడ మంటూ జరిగినా, పరిపూర్ణంగా మన స్వభావపు నరనరాన చేయడమనేది ఇంకా కష్టం. అవసరమైన అవగాహనకు ఏ దారుల ద్వారా చేరుకొంటామో వాటిని మన ఆలోచన, ఇంద్రియ సంవేదన, అనుభూతికి సంబంధించిన

అహంకారిక అలవాట్లు మూసివేస్తాయి. తరువాత అదెందుకు కష్టమౌతుందంటే, ఈ దారిలో అవసరమైన సమర్పణ, ధైర్యం అనేవి ఆహమాచ్ఛాదిత అంతరాత్మకు, తేలికగా దక్కవు. అహంకారిక మనస్సు కోరే, లేక సమ్మతించే కార్యవిధానం కాదు, దైవకార్య విధానం. ఎందుకనంటే అది సత్యాన్ని చేరడానికి, తప్పిదాన్ని, ఆనందాన్ని చేరడానికి, బాధపడడాన్ని, పరిపూర్ణతను చేరడానికి అసంపూర్ణతను ఉపయోగిస్తుంది. తానెక్కడికి నడుపబడుతున్నదో, దానిని అహం తెలుసుకోలేదు. తనను నడిపే దానికది యెదురు తిరుగుతుంది, నమ్మకం కోల్పోతుంది, ధైర్యం కోల్పోతుంది. ఈ ఓటములను పట్టించుకొనపనిలేదు. ఎందుకనంటే మన లోపల ఉన్న దివ్య మార్గదర్శకుడు మన తిరుగుబాటుకు కోపం తెచ్చుకోడు, మన విశ్వాసలేమికి నిరుత్సాహ పడడు లేదా మన బలహీనతలకు వికర్షితుడు గాడు. తల్లికుండే సంపూర్ణప్రేమ, గురువుకుండే సంపూర్ణ సహనం ఆతనికున్నాయి.

CWSA 23:62-64 - *శ్రీ అరవిందులు*

ఆతడెవరో గ్రహించండి

సూర్యుని వైపు చూడు. ప్రాణం, వెలుగు, వైభవాల అద్భుత కేంద్రంలో ఆయనున్నాడు. శూన్యం కానటు వంటి ఒక ఏకైక ప్రశాంత, అద్భుత అస్తిత్వ సాన్నిధ్య స్పందనలున్న అపరిమిత నిశ్చల నీరవతలో శాశ్వతుని అనేక పవిత్ర నెగళ్ళుగా మెరిసిపోతున్న అసంఖ్యాక తారాగణాలను రాత్రివేళ గమనించవోయి, పదివేల సంవత్సరాల పూర్వం ఆర్యశకారంభం ఆర్య పితరులకు ప్రకాశించినట్లు, తన ఖడ్గము పటకాతో ప్రకాశిస్తున్న ఓంయోన్ (మృగశిరా నక్షత్ర రాశిపుంజం)ను చూడు. తన వైభవంలో ఉన్న సిరియస్ (అగ్ని నక్షత్రం)ను ఆకాశ సంద్రంలో కోట్లాది మైళ్ళు తేలియాడుతూ పోతుండే లైరా (ఉత్తర దిక్కులోని నక్షత్రరాశి)లను గమనించవోయి, గుర్తుంచుకో. ఈ అసంఖ్యాక ప్రపంచాలు, వాటిలో అధికభాగం మన స్వీయ ప్రపంచం కంటే మహా బలవత్తరమైనవి, నిర్వచింపనలవి గాని వేగంతో పురాణ పురుషుని కనుసైగచే పరిభ్రమిస్తూ ఎచటికి పోతున్నాయో, ఆయనకు తప్ప మరెవరికీ తెలియదు. అయినప్పటికీ అవి హిమాలయాలకన్న లక్షల వత్సరాల కంటే పురాతనమైనవి. నీ పర్వతాల మూలాలకన్న ఎంతో దృఢమైన మూలాలు కలవి. శాశ్వత విశ్వ వృక్షాన్ని కుదుపగా రాలిపోవు ఆకుల వలె, వాటిని ఆతడు తన ఇచ్ఛమేర

కదలించి వేసేంత వరకు అవి అలాగే ఉంటాయి. కాల అనంతతను ఊహించుకో, ఆకాశపు హద్దులు లేనితనాన్ని గ్రహించుకో, ఈ ప్రపంచాలు లేనపుడు, యిప్పటిలాగానే అప్పుడు కూడా ఆయనున్నాడు, ఇవి లేనపుడు కూడా ఆతడుండి తీరుతాడు, ఎప్పటిలాగానే అని గుర్తుంచుకో. లైరాకావల, ఆకాశంలో సదరన్ క్రాస్ (ఒక నక్షత్రరాశి) నక్షత్రాలు కూడా కనుపించనంత దూరాన వున్న ఆయనను గ్రహించు, ఇంకా ఆయనక్కడున్నాడు.

తరువాత భువికి తిరిగిరా, ఆతడెవరో నిజం చేసుకో. ఆతడు నీకు చాలా దగ్గరగా ఉన్నాడు. తన కర్రను పోటు పెట్టుకుంటూ వంగి నీ ప్రక్కగా నడుస్తూపోతున్న ఆ వృద్ధుడిని చూడు. ఆ నడుస్తూ పోతున్నది భగవంతుడనే నిజం గ్రహించాలి. అక్కడో బిడ్డ, ఎండలో నవ్వుతూ పరుగుతీస్తున్న బిడ్డ ఉన్నాడు. ఆ నవ్వులో ఆయనను (భగవంతుని) వినగలవా? కాదు, ఆతడింకా యింతకంటె నీకు దగ్గరగా ఉన్నాడు. ఆయన నీలో ఉన్నాడు. ఆయనే నీవు. ఎంతో ఆవలగా వున్న లక్షలమైళ్ల దూరాన, ఆకాశపు అనంత తీరాలలో జీవిస్తున్నది నీవే. శూన్యాకాశ ఆ సంద్రపు తడబడుతున్న కెరటాలపై దృఢ నమ్మకంతో అడుగులు వేస్తూ నడిచిపోతున్నది స్వయంగా నీవే. చేతులతో గాక ఆ యోగం వల్ల, నాలో నీకు నీవు ఈ రోజు వింటున్నట్లు చేయగలిగిన ఆ నిశ్చల నీరవ క్రియా రహిత నిర్వ్యక్తిక పరమేచ్ఛ వల్ల నక్షత్రాలను వాటి వాటి స్థానాల్లో అమర్చినది, సూర్యుల కంఠహారముగ అల్లినది, నీవే. పురాతన యోగ పుత్రా పైకి చూడు, నీవికెంత మాత్రం భయస్థుడవు గాదు, అనుమనించువాడవు కాదు. భయపడకు, శంకించకు, దుఃఖించకు. ఎందుకనంటే ఒక్క శ్వాసతో, లోకాల సృజించు, ధ్వంసం చేయు యేకైకుడు, పైకి కన్పించే ఈ నీ దేహంలో ఉన్నాడు.

ఆధ్యాత్మిక క్రియాశక్తికి సంబంధించిన ఒక పరిమితి లేని సాగరం వలె ఈ సమస్తమందు ఆయన ఉన్నాడు, నిజం. ఎందుకనంటే ఆయనే కనుక లేకపోయినట్లయితే, బయటకు కన్పించే నీవు గానీ, బయటకు కన్పించే నేను గాని, ఈ సూర్యుడు గానీ, లేక యీ సమస్త లోకాలు గానీ, కనురెప్ప క్రిందకి వాలేందుకు పట్టే సమయంలో కనీసం లక్షోవంతు పాటు గూడ మనలేవు. కానీ ఆయన దానికి బయట గూడ ఉన్నాడు.

ఆతని అభివ్యక్తి యందు సైతం ఆతడున్నాడు. ఆతని అనభివ్యక్తి స్థితి యందు గూడా, ఆతడు పూర్తిగా దానికి వేరుగా ఉన్నాడు. మరోదానికంటే,

ఈ సత్యాన్నవగాహన చేసుకోవడం మరింత కష్టం, కాని దానిని గ్రహించడం అవసరం. జగత్తు భగవంతునిగా దర్శించే, కాని భగవంతుడిని జగత్తుగా దర్శించని ఒక బహు దేవతా వాదం ఉన్నది. కాని జగత్తు భగవంతుడైతే, అపుడు భగవంతుడుగా, పదార్థం, విభాజ్యం, మార్పు చెందేది, కేవలం వస్తువుల నిరంతరాయంగా ముందు వెనుకలకు సాగే చలనాలు అవుతాడు. కాని ఇవన్నీ స్వయంగా భగవంతుడు గాదు, కానీ తన నీడలలో, ఆకారాలలోని భగవంతుడు. మనం ఇచ్చిన రూపాన్ని తిరిగి చెప్పాలంటే మనస్సు నీడలు, కల్పనలు, షేక్స్పియర్, తన నాటక ప్రపంచాన్నంతా ఒక్కటిగా చేసినా దానంతటి కంటె అతడు అధిక విశాలుడు, ఆతడు దానిలోనూ, దాని బయటా కూడా ఉన్నాడు. అంతేగాక దానికి యెడంగా, అది కాకుండా మరోగా కూడా ఉన్నాడు.

CWSA 17:130-32 - *శ్రీ అరవిందులు*

సిద్ధంపజేసుకొనినది అత్యంత వాస్తవమూ, క్రియాశీలమూ, ఏ భౌతిక వస్తువుకన్ననూ, చేతనకు అత్యంత సాన్నిహిత్యం కలదిగా చేసేదే ఒక ఘనిష్ఠ సిద్ధి అని ఒక లోతైన, ఆధ్యాత్మిక అర్థంలో చెప్పవచ్చు.

CWSA 29:112

మనలో బుద్ధుడు, క్రీస్తు లేక కృష్ణుడు, విదితమై రూపొందకపోయినట్లయితే, కృష్ణుని, క్రీస్తును లేక బుద్ధుని బాహ్యంలో పూజించినా చాలదు. అంతే సమానంగా తక్కిన సహాయ కాలకు మరో పనంటేమీ ఉండదు. ప్రతిదీ, మార్పుచెందని మనిషి స్థితికి, ఆతనిలో దైవ సాక్షాత్కారానికి మధ్య ఒక వారధి.

CWSA 23:66 - *శ్రీ అరవిందులు*

"సిద్ధి" అర్థం


(సిద్ధి) అనగా కేవలం ఒక మేధోపరమైన అవగాహన కాదు, లేక సత్యాన్ని స్పష్టంగా వివేచించే మాట కాదు, లేక మన అస్తిత్వరీతులకు సంబంధించిన, ఒక వివేకవంతమైన మనో వైజ్ఞానిక అనుభవం కాదు. అది, ఆ మాటకున్న పూర్తి అర్థంలో 'సిద్ధి'. విశ్వాతీత అయిన, విశ్వజనీన దైవమూ, పరమాత్మను మనకు, మనలో నిజం చేయడం. ఆ పరమాత్మ వెలుగులో దప్ప, వాటి యధార్థ రూపంలో, మన ప్రాపంచిక మనుగడకు సంబంధించిన అంతరాత్మిక, భౌతిక పరిస్థితులలో దాని సంభూతి ద్రవ్య ప్రవాహంలా తప్ప అస్తిత్వ రీతులను చూడడం అటు పిమ్మట సాధ్యం కానటువంటి స్థితి. ఈ సిద్ధి యందు ఒక దాని తర్వాత మరొకటిగా జరిగే మూడు చలన దశలున్నాయి, అవి ఆంతరిక దృష్టి, సంపూర్ణ ఆంతరిక అనుభవం, తాదాత్మ్యత.

CWSA 29:304

దైవ ప్రాథమిక సత్యాలు, ఉన్నతతర లేక దైవ ప్రకృతి ప్రాథమిక సత్యాలు, ప్రపంచ చేతన దాని క్రియా శక్తుల క్రీడల ప్రాథమిక సత్యాలు, తన స్వకీయ ఆత్మ నిజ స్వభావం, వస్తువుల ఆంతరిక స్వభావ ప్రాథమిక సత్యాలు, వ్యక్తి ఆంతరిక జీవితం, అస్తిత్వాల ఒక భాగం అయ్యేంత వరకు, వీటి శక్తులు, వ్యక్తిలో పెరగడానికి చేతనలోనికి స్వీకరించడం, సిద్ధులు అంటే ఉదా: దైవ సాన్నిధ్య సిద్ధి చేతనలో ఉన్నతతర శాంతి, దివ్య వెలుగు, దివ్య క్రియాశక్తి, మహదానందం దిగివచ్చి, అచట స్థిరపడి పనిచేయడం, దైవ లేక ఆధ్యాత్మిక ప్రేమను నిజం చేసుకోవడం, మన స్వకీయ చైత్య పురుషుని దర్శించడం, స్వకీయ మనోమయ పురుషుని, యధార్థ ప్రాణమయ పురుషుని, అన్నమయ పురుషుని ఆవిష్కరించుకొనడం, అధి మనస్సు లేక అతిమానస చేతనను సిద్ధింపజేసుకొనడం, మన ప్రస్తుత అధమ స్థాయికి చెందిన స్వభావానికీ, వీటన్నిటికీ గల బాంధవ్యాన్ని స్పష్టంగా తెలుసుకోవడం, ఆ నిమ్న స్వభావాన్ని మార్చడానికి దానిపై అవి జరిపే చర్యను తెలుసుకోవడం. ఈ సంఘటనల జాబితా, అనంతంగా దీర్ఘమైనది కావచ్చు. మెరుపులుగా, ముక్కలుగా, లేక అరుదైన దర్శన పర్యటనలుగా మాత్రమే వచ్చినపుడు తరచుగా వాటిని అనుభవాలు అని కూడా అంటారు. అవి చాలా సానుకూలమైనవి లేక చాలా తరుచుగా లేక నిరంతరంగా జరిగేవిగా లేక, మామూలువిగా అయిపోయి నప్పుడు మాత్రమే సంపూర్ణ సిద్ధులు అని చెప్తాం.

CWSA 30:38

- శ్రీ అరవిందులు



ముగింపా?

చ్యుతమందు అచ్యుతుడాతని పేరు
తారకలు దేని కోసమై నిర్మితమైనవో
అదంతయు పూర్తియగుదనుక
భగవంతుడిని హృదయమావిష్కరించుకొనుదనుక
అంతరాత్మ తనను దానెరుంగుదనుక
ఒక కళాకారుడైన భగవంతుడిచట
పని ముగించ నిచ్చించక దివ్యతర ఆకృతులలో
తనను తాను సదా పునః రూపించుకొనుచుండు
అప్పటికీ ముగింపు ఉండదు.

CwSA 2 : 644 - శ్రీ అరవిందులు

దైవానికి చెందిన మూడు సమస్థితులు

(సావిత్రి నుండి సంగ్రహ భాగం)

(పరబ్రహ్మానికి చెందిన మూడు సమ స్థితుల వివరణ మొదటిది విశ్వాతీతం, రెండు వైశ్వికం, మూడు వైయక్తికం)

ఆతని ఏకాంతపు అనిర్వచనీయ మహనీయ శక్తి
తన అచల సుషుప్తిచే కాలం నుండి రక్షించుచున్న
నిర్గుణ నిరాకార నిశ్శబ్దంలో ఆమె పరున్న
నిశ్చల నీరవత నుండి తన యోగ శక్తిని పిలిచె

నిరపేక్షుడు పరిపూర్ణుడు ఒంటరి
తన నిశ్శబ్దంతో స్థలంలోకి ప్రవేశించె
ఒకే ఆత్మలోని ఈ అగణిత వ్యక్తులనురూపించె
తన శక్తిలో నుండి వేలాది రూపాలను నిర్మించె
తన బృహత్తులో ఒంటరిగ నివసించువాడు సమస్తమందు వసించు
స్థలం తానే, కాలమూ తాను మాత్రమే.

నిరపేక్షుడు, పరిపూర్ణుడు, సర్వాంతర్యామి,
మనలో నెలకొని వున్న మన రహస్య ఆత్మ,
మన అస్తవ్యస్త అసంపూర్ణమైన ముసుగును తాను తగిలించుకొనెను
ఈ రక్తమాంసపు అద్దింటినే తన స్వంత ఇల్లుగా చేసుకొనెను,
తన చిత్తరువును మానవ పరిమాణంలో యిమిడ్చెను
తన పరిమాణానికి తగినట్లుగా మనమెదగాలని;
అప్పుడిక అది దివ్యత్వపు చిత్రమౌను.
ఆ రూపకర్త మనను మరల బలంగా పోతపోసి
ఈ మృత ప్రాయపు మూసపైన దివ్యత్వపు ఒక ప్రణాళికను విధించు
మన చిన్ని మనస్సులను తన అనంత మనస్సులోనికి లేవనెత్తును,
చిరంతనంతో క్షణాన్ని తాకుచు.

సావిత్రి పుట 67 — *- శ్రీ అరవిందులు*

వ్యక్తిలోని జీవాత్మ సాక్షాత్కారం

కేంద్రీయ అస్తిత్వమైనది (జీవాత్మ) పుట్టదు, పరిణామం చెందదు, కాని వ్యక్తిగత అభివ్యక్తీకరణ మొత్తం మీద అధ్యక్షత వహిస్తుంది. జీవాత్మకు బహిర్ముఖ ప్రసరణ అంతరాత్మ. ఎందుకంటే చైత్యపురుష పరిణామంలో పాల్గొని లోపలి నుండి మన సర్వ పరిణామానికి మద్దతునిస్తుంది; అన్ని అనుభవాల సారాన్ని తాను గ్రహించి, దాని ద్వారా దైవోన్ముఖంగా మూర్తిమత్వాన్ని అభివృద్ధి పరుస్తుంది.

CWSA 28 : 60

మొదట అంతరాత్మను కనుగొనాలి, కామనకు, ఆలోచనకు, ఆ వేగానికి సంబంధించిన బాహ్య ఆత్మను గాక, మనలోపల వున్న దివ్య మూలకం అయిన రహస్య చైత్య పురుషను కనుగొనాలి.... ఇది అహం స్థానంలో దివ్య అంతరాత్మిక వ్యష్టిని నెలకొల్పడం, అంతరాత్మకు పట్టం కట్టడం ఆత్మ సాక్షాత్కారంలో మొదటి మెట్టు.

CWSA 21 : 653-54

చైత్యపురుష సాక్షాత్కారం, దానిని జాగృతం చేయడం, ముందుకు తీసుకురావడం అనేది దైవంతో వ్యక్తిగత అనుబంధాన్ని ఎంతవరకు పెంచుకోగలడో దాని మీద ప్రధానంగా ఆధారపడి ఉంటుంది. అంటే వేరుపర్చే స్వార్థ ప్రేరిత మానసిక, ప్రాణిక, భౌతిక అహం ఒత్తిడులను నిరాకరించే దృఢ నమ్మకం, ఆత్మ సమర్పణ, భక్తి ప్రేమలతో కూడుకొన్న అనుబంధం.

CWSA 30: 360

ఆంతరిక ఏకాగ్రతకు సంబంధించిన సాధనాంశాలు

1. చేతనను హృదయ స్థానంలో నిలపడం, అక్కడే ఒక భావనపై, బింబంపై లేదా దివ్యమాత నామంపై వీటిలో నీకు ఏది సులభంగా అనిపిస్తుందో దానిపై ఏకాగ్రత నుంచాలి.

2. హృదయంలో ఈ ఏకాగ్రతను నిలపడం ద్వారా క్రమేణా ప్రగతిశీలంగా మనస్సును నిశ్చలం చేయడం.

3. హృదయంలో మదర్ సాన్నిధ్యం కోసం ఆమెచే మనస్సు, జీవితం, కర్మలను నియంత్రించుకోవాలనే ఒక ఆకాంక్ష ఉండాలి.

CWSA 29:225 — *- శ్రీ అరవిందులు*

జగదాత్మ సాక్షాత్కారం

మనం ఏ ఆత్మలో నిమ్న సృష్టిలో తాదాత్మ్యం చెందుతామో పైకి కన్పించే మన అస్తిత్వం నశించిపోయేదనీ లేక నశించిపోయే ప్రపంచంలోని మార్పు చెందే జీవుల ప్రపంచమనీ, మనం మనః ప్రాణ దేహాల నుండి, మన శాశ్వత అస్తిత్వం కాని తక్కిన దానినంతటి నుండి వెనుకకు ఉపసంహరించు కొన్నప్పుడు కలిగే అసత్య భావనను వదిలించుకోవడం మన ప్రధమ అనివార్య లక్ష్యం. మనం ఖచ్చితంగా మనల్ని ఆత్మగా, ఆధ్యాత్మగా, చిరంతనమైన వారంగా గుర్తెరగాలి. మన నిజ అస్తిత్వంలో సచేతనంగా జీవించాలి. జ్ఞాన మార్గంలో మన ప్రధమ, సమస్తాన్ని జీర్ణించుకొనే భావన, కృషి గాకపోయినా, ఇది మన ప్రాథమిక భావన అయ్యి తీరాలి. కాని మనకెప్పుడైతే మనం మన శాశ్వత ఆత్మ స్వరూపంగా సాక్షాత్కారమౌతుందో, మనం దాని నుండి విడదీయలేని వారంగా అవుతామో అప్పుడు కూడా మనకు ద్వితీయశ్రేణికి చెందిన లక్ష్యం ఒకటుంటుంది. ఇప్పటి వరకూ, మన నిజ అస్తిత్వంగా, మనకు సాధ్యమైన మన ఏకైక స్థితిగా తప్పుగా దేనిని భావించామో ఆ మార్పు చెందే సృష్టి, మార్పు చెందే ప్రపంచానికీ మధ్య ఒక యథార్థమైన బాంధవ్యాన్ని ప్రతిష్ఠించడం ఆ లక్ష్యం.

ఈ క్రమంలో ఒక నిజమైన అనుబంధం ఉండాల్సి ఉంటే అది రెండు వాస్తవికతల మధ్య ఉండి తీరాలి. ఇంతకు మునుపు శాశ్వత ఆత్మను మన ప్రాపంచిక సృష్టి నుండీ అది ఒక భ్రాంతిలా లేదా అవాస్తవికతలా కాకపోయినా, మనకు అందనంత అజ్ఞాతమైన భావనగా ఆలోచించాం. ఎందుకంటే ఈ వస్తు జాలానికున్న స్వభావాన్ని బట్టి ఈ మనస్సు, ప్రాణం, శరీరంగా మారుతూ కాలక్రమంలో ముందుకు సాగడమే తప్ప మనల్ని మనం వేరేగా ఆలోచించలేక పోయాం. ఈ నిమ్న స్థితికున్న పరిమితి నుండీ మనం విముక్తులమైతే మరోవైపుగా వున్న ఆత్మకు ప్రపంచానికీ మధ్య సంబంధం పట్ల ఇదే తప్పు అభిప్రాయానికి వశమౌతాం. అదే శాశ్వతత్వంలోకి పురోగమిస్తూ దానిలోనే వసిస్తూ అదే వాస్తవంగా అనుభూతి చెంది ఆ స్థాయిలో నుండే ఈ మానవుణ్ణి, లోకాన్ని దిగువనే ఎక్కడో సుదూరపు విషయంగా లేదా భ్రాంతిగా లేదా మిథ్యగా చూచే ధోరణికి మొగ్గుతాం. ఎందుకంటే ఆ స్థితి మన కొత్త పునాదికి పూర్తిగా విరుద్ధమైనది, ఆ పునాదిలో చేతనకు సంబంధించిన మన మూలాలను

చొనుపలేదు. దేనినుండైతే పైకి లేవనెత్తబడి, పరివర్తన చెందామో ఇక దానితో ఎలాంటి జతకట్టి ఉండే బంధమేలేనట్లుగా మనకు అనిపిస్తుంది. ముఖ్యంగా ఇది శాశ్వత ఆత్మకు ప్రాథమిక అంశంగానే కాక, ఈ నిమ్న త్రివిధ అస్తిత్వం నుండీ విరమించుకోవడమే మన ఏకైక, విలీన లక్ష్యంగా అవ్వవచ్చు. అప్పుడిక ఒక్కసారిగా విశుద్ధ మనసులో ఈ దిగువ నుండి ఆ శిఖరస్థాయి వరకు ఉన్న నడుమ అంతస్తులతో పని పెట్టుకోకుండా ఆ విశుద్ధ ఆధ్యాత్మ చేతనలోకి దూసుకెళతాం. ఒక భారీ అగాధమైన గంభీరమైన భావనను మన చేతనపై స్థిరపర్చడానికే మొగ్గు చూపుతాం. ఆ అగాధాన్ని మనం దాటలేం, ఒక బాధాకరమైన పతనంతో తప్ప మళ్ళీ దాటి రాలేం.

కానీ ఆత్మ, ప్రపంచం, ఈ రెండింటి మధ్య ఒక శాశ్వత అన్యోన్య సంబంధం, అవినాభావ సంబంధం ఉన్నది. దాటిపోవడానికి అలవిగాని అగాధమేదీ వాటి మధ్య లేదు. ఆధ్మాత్మ, పదార్థమయ అస్తిత్వం రెండూ పురోగమన క్రమంలో ఉన్న నిచ్చెనకి ఎంతో పైనున్న మెట్టు, క్రింద ఉన్న మెట్టు మాత్రమే. కాబట్టి ఈ రెండింటి మధ్య నిజమైన బంధం, సూత్రబద్ధమైన మౌలిక సంబంధం ఉండి తీరాలి. తద్వారా ఒక్కసారిగా చిరంతన పరబ్రహ్మ విశుద్ధ ఆధ్యాత్మగా, జీవాత్మగా ఉండగల్గి తనలో తానే అయిన విశ్వాన్నే చేపడతాడు. ప్రస్తుతమున్న ప్రపంచ అజ్ఞాన స్థితిలో నిమగ్నమయ్యి వున్న ఈ అంతరాత్మ, ఆ స్థితి స్థానంలో ఒకే విధమైన సమానతను అన్వయింప చేసుకోవడానికి శాశ్వతంతో మేళవించడం లేదా ఒక్కటిగా మారడమన్నది సాధ్యమవ్వాలి. ఈ మౌలిక సూత్రబద్ధమైన సంబంధమే శాశ్వత ఐక్యతగా ఆత్మ పురుషునికి, సమస్త అస్తిత్వాలకు మధ్య నెలకొని ఉన్నది, ఆ శాశ్వత ఐక్యతకు సంబంధించి సర్వదా సర్వస్వతంత్ర, బంధరహిత దైవం సమర్థత కల్గిఉన్నట్లే, విముక్తమైన ఆత్మ దానిని నిలుపుకోగల సమర్థతను కల్గి ఉండాలి. ఆ విధంగా విశుద్ధ స్వీయ అస్తిత్వాన్ని సమతూకంలో సిద్ధింపజేసుకోవడంలో దృష్టి పెట్టాలి. సమగ్ర ఆత్మప్రాప్తి కోసం, ఆత్మతో, దైవంతో మమేకమవ్వడమే కాదు, సకల అస్తిత్వాలతో ఏకమవ్వాలి. వెనుకకు మళ్లి తోటి మనుషులతో ఈ ప్రకటిత ప్రపంచానికి శాశ్వత సత్యానికి మధ్య సారూప్యతను తెచ్చుకోగల సరైన అనుబంధంలోకి మనం వచ్చేసేయాలి. ఎందుకంటే దీనికున్న ద్వంద్వాలు, అసమానతలు, వైరుధ్యాలతో విభాజితమైన చేతనా సూత్రం ద్వారా కాలపరిమితిలో అసత్యం సృష్టించిన సారూప్యతలో పొరబాటు

సంబంధంతో కట్టివేయబడి ఉన్నాం. సమస్త వస్తుజాలాన్ని, సకల జీవుల్ని, ఉనికిని మన నూతన చేతనలోకి మళ్ళించాలి. కాని అది ఒక అహంకారికమైన వేరు వ్యక్తిత్వంగా వేరుచేయడం కాదు, అంతా కలిసి ఒక్కటిగా.

మరో విధంగా చెప్పాలంటే స్వయంస్థిత, దేశ, కాల రహిత సర్వాతీత పరమాత్మ చేతనను అంగీకరిస్తూ విశ్వచేతనగా అవ్వాలి, తనకు తానే ఆధారంగా, లోకాల సమూహ ఖండంగా సమస్త అస్తిత్వాల్లోనూ వసిస్తున్న అనంతునితో మనం తాదాత్మ్యం కావాలి. ఈ సాక్షాత్కారాన్నే మన ప్రాచీన వేదాంతులు ఆత్మను సమస్త జీవుల్లో దర్శించడం, ఆత్మలో సమస్త జీవులను దర్శించడంగా చెప్పారు. దీనికింకా అదనంగా మనిషి సర్వోన్నతి సిద్ధిని గూర్చి, అతడిలో అసలు అస్తిత్వ లీల పునరావృతమైందని, ఆత్మ సత్తకు రూపొందుతున్న ఈ ప్రపంచ అస్తిత్వాలుగా అయ్యిందని చెప్పారు. మూడు విధానాల్లో వ్యక్తయినది, ప్రాథమికంగా ఈ పరిమిత అహంకారం కల్పించిన తప్పు సంబంధానికి ప్రత్యామ్నాయంగా ఆత్మ సత్తకు, ప్రపంచానికి మధ్య ఉన్న నిజ సంబంధాన్ని సిద్ధింప చేసుకోవాలి. ఇది నూతన దృష్టి, అనంత పురుషునికి సంబంధించిన భావనా స్ఫూర్తి, దీనిని మనం సముపార్జించాలి. సమస్తంతో వున్న ఐక్యత పునాదిగా దీనిని మనం నెలకొల్పాలి.

CWSA 23 : 368-70 - *శ్రీఅరవిందులు*

విశ్వాతీతాత్మ సిద్ధి

మనం పరమాత్మను లేదా పరబ్రహ్మాన్ని తనదైన మౌలిక విధానంలో, ప్రాథమికంగా త్రివిధ సత్యతగా అంటే సచ్చిదానందంగా సాక్షాత్కరింప జేసుకోవాలి. విశుద్ధ అస్తిత్వం 'సత్' మాత్రమే కాదు, ఆ అస్తిత్వానికి చెందిన విశుద్ధ చైతన్యంగా, విశుద్ధ ఆనందంగా సాక్షాత్కరింపజేసుకోవాలి. ఇవన్నీ పరమాత్మ నిజతత్వం, పరబ్రహ్మ మూలసారం.

ఇంకా పరమాత్మ లేదా సచ్చిదానందానికి చెందిన సాక్షాత్కారంలో రెండు రకాలున్నాయి. దానిలో ఒకటి నిశ్చల, నిష్క్రియ, స్వయం నిమగ్న, కేవల సచ్చిదానందంగా, ఏకైకిగా, అవైయక్తిక గుణ కేళీరహితంగా విశ్వ దృగ్గోచర అనంతత్వం నుండీ దూరంగా మరలి లేదా అనాసక్తంగా దానిలో తన ప్రత్యక్ష పాత్ర లేకుండా చూస్తూ ఉంటాడు. రెండవది అదే అస్తిత్వం, చైతన్యం, సర్వసత్తాక ఆనందానికి చెంది ఉండి స్వేచ్ఛగా, ఈ వస్తుజాలానికి అధిపతిగా,

స్వీయ నీరవతతో, అనంత కార్యగతిలో తనను గ్రుమ్మరించుకొంటూ, సంఘటిత చిరంతన స్వీయ తత్వంతో గుణాలను బయల్పరుచుతూ, ఏకైక పరమపురుషునిగా తనలో వైయక్తిక సమస్త కేళీ విస్తృత రూపంలో సరిసమాన విశ్వ అనంత యథార్థతను స్వాధీనంలో ఉంచుకొని ఎటువంటి ప్రమేయం లేకుండా మళ్ళీ ఎటువంటి వేరు ప్రత్యేక ప్రవృత్తి లేకుండా ఒక దివ్య ఆధిపత్యంతో, తన స్వయం ప్రకాశ చిదానంద, నిత్య అసంఖ్య కిరణ ప్రసారంలో ఉంటాడు. ఆయన చేబూనిన అభివ్యక్త సృజనగా, దానిచేత పట్టుపడక దానినే ఏలుతూ ఉంటాడు. ఇది మత సంబంధమైన వ్యక్తిగత దేవుడు లేదా తత్వవేత్తలు ప్రామాణికం చేసిన బ్రహ్మం కాదు, అతడిలో వైయక్తికం, అవైయక్తికం, గుణ నిర్గుణాలు రాజీకుదుర్చుకొంటాయి. విశ్వాతీతుడు వాటిని తన అస్తిత్వంలో ధరించి తన అభివ్యక్తీకరణ వైఖరులుగా నియమిస్తాడు. అప్పుడది పూర్ణయోగ సాధకునికి సాక్షాత్కార లక్ష్యంగా అవుతుంది.

CWSA 23 : 391 -శ్రీ అరవిందులు

తాదాత్మ్యతలో పరాకాష్ఠ

ఈ సమస్త జ్ఞానం, అనుభవాలన్నవి తాదాత్మ్యస్థితికి రావడానికి, దానిని పొందడానికి ప్రాథమిక సాధనాలు. మన ఆత్మను చూస్తాం, అనుభవంలోకి తెచ్చుకొంటాం కానీ అతడే నేను అయి ఉన్నాను అని పలికే పరమోన్నత వేదాంత జ్ఞానంలో మన అస్తిత్వం మొత్తం జీవించలేకపోతే, ఆ తాదాత్మ్య స్థితిలో పరాకాష్ఠకు చేరుకోకపోతే మన ఆత్మ దర్శనం, ఆత్మానుభవం అసంపూర్ణమే అవుతుంది. భగవంతుణ్ణి దర్శించగల్గడం, అతడిని ఆలింగనం చేసుకోవడమే కాదు, ఆ భగవన్మయ వాస్తవంగా అయిపోవాలి. సంకల్పంతో, ఉద్ధరణతో అహంకారం దానికి సంబంధించిన వాటి నుండీ తప్పించుకొని, అన్నింటికీ మూలమైన, ప్రకటిత సృష్టి స్వరూపానాకి పైన ఉన్న ఆ విశ్వాతీత ఆత్మతో ఏకం కావాలి. అదే విధంగా ఈ అభివ్యక్త అస్తిత్వాలు, సంభావ్యతల్లోకి ఆత్మ సత్తతో ఏకం కావాలి. అనంత అస్తిత్వం, చేతన, శాంతి ఆనందాలుగా తనకు తానే మనలో అభివ్యక్తం చేసుకొంటున్న దానితో తాదాత్మ్యం కావాలి. కార్యం రూపకల్పన, అంతర్భావన క్రీడగా తనకు తానుగా ప్రపంచంలో వేషంలో దాగుతున్న దానితో ఏకమై ఉండాలి.

CWSA 23 : 306. - శ్రీ అరవిందులు

ఇది నీ కార్యం నీ అస్తిత్వ లక్ష్యం

ఇది నీ కార్యం అలాగే నీ అస్తిత్వ లక్ష్యం, దీని కొరకే నీవు ఇచ్చట ఉన్నావు, నీవు ఒక దివ్య మానవునిగా, దైవానికి ఒక పరిపూర్ణమైన పాత్రగా తయారవుతున్నావు. నీవు చేసే ఇతరమైనవన్నీ కూడా నిన్ను నువ్వు సిద్ధపరచుకోవడమో లేక ఒక ఆనందాన్ని అనుభవించడమో లేక నీ లక్ష్యం నుండి కిందికి పడిపోవడమో అంతే. కానీ మన లక్ష్యం ఇది మన ధ్యేయం ఇది, అది దారిలో లభించే ఆనందంతో గాని శక్తితో గాని ముడిపడిలేదు, అది మన లక్ష్యం సాధించడంలోని ఆనందంలో నీ అస్తిత్వం యొక్క గొప్ప దనం, సంబరం ఉంది. మార్గంలోని ఆనందం అంతా నిన్ను ఏదైతే లక్ష్యం వైపు లాగుతోందో అదే నీతో నీ ప్రయాణంలో తోడుగా ఉంది, అది నీకు నీ ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి కావలసిన శక్తిని సమకూరుస్తోంది.

నీకేదైన కర్తవ్యం ఉన్నది అంటే అది ఇదే, నీకు ఏదైనా లక్ష్యం ఉన్నదా అని నీవడిగితే అది ఇదే, ఒక వేళ నీవు ఆనందాన్ని కోరుకుంటే సుఖాన్ని కోరితే ఇంతకంటే గొప్పదైన సుఖం లేదు, ఆనందం లేదు, తక్కిన ఆనందాలన్నీ పరిమితమైనవి, ముక్కలుగా ఉండేవి. అవి స్వప్నం, సుషుప్తి లేక నిన్ను నీవు కాసేపు మరిచి పోవడం వంటివి. కానీ మనం మాట్లాడే ఆనందం నీ సంపూర్ణ అస్తిత్వానికి సంబంధించినది. కానీ నా అస్తిత్వం ఏమిటి అని నీవడిగితే, దైవమే నీ అస్తిత్వం, మిగిలినదంతా దైవం యొక్క పాక్షికమైన లేక విక్షేపమైన రూపమే. నీవుగనక సత్యాన్ని కోరుకుంటే, ఇదే ఆ సత్యం. అది నీవు నీ ముందు ఉంచుకొని ఎన్ని వచ్చినా సరే సత్యం పట్ల విధేయత కలిగి ఉండు.

ఎవరో ఇలా చక్కగా అన్నారు, ఒక తెరలో నుండి చూచి ముఖంగా పొరపాటుగా భావించాడు. నీ తెరనే లక్ష్యం నీవు నిజంగా ఏమిటో అది కావడమే. అలాగే నీ స్వభావం నిన్ను నీవు దాటి పోవడమే అని చాలా బాగా చెప్పారు వారు. అదే అతని నిజమైన స్వభావం, అదే దివ్య లక్ష్యం అది నిన్ను నువ్వు దాటి అతీతంగా పోవడం.

అప్పుడు నువ్వు దాటి పోవాలనుకునే నీ స్వాత్మ ఏమిటి? నీవు అవ్వాలనుకునే స్వాత్మ ఏమిటి? ఇక్కడే నీవు ఎటువంటి పొరపాటు

చెయ్యరాదు. నిన్ను నువ్వు తెలుసుకోకపోవడం అనే పొరపాటు నీ దుఃఖం అంతటికి మూలకారణం, నీవు మరలా మరలా కింద పడిపోతూఉండడానికి కూడా అదే కారణం.

నీవు అధిగమించి పోవలసింది నీవు అని నీవనుకుంటున్న నిన్నే, అలానే నీవు నిన్నుగా భావిస్తూ ఉన్నటువంటి కనిపించే మనిషిని. మరి వాడెవడు? ప్రాణానికి పదార్ధానికి బానిసగా మారిన మనోమయ పురుషుడు, ఎక్కడైతే అలా ప్రాణికానికి పదార్ధానికి బానిసగా మారలేదో అతను తన మనసుకు బానిస అయ్యాడు. కానీ ఇది చాలా భారమైన అతి పెద్దదైన బానిసత్వం, ఎందుకంటే అలా మనసుకు బానిస కావడం అంటే అసత్యానికి, పరిమితత్వానికి ఇంకా కనిపించేదానికి బానిసగా మారడం.

నీవు ఏ స్వాత్మగా అవ్వాలనుకుంటున్నావో, నీ మనసు, ప్రాణం, భౌతికం అనే తెర వెనుక నీవెప్పుడూ అదే స్వాత్మగా ఉన్నావు. అది ఆధ్యాత్మిక, దివ్య, మానవాతీతమైన నిజ పురుష. ఎందుకంటే నీ మానసిక సత్తాకు పైన ఉన్నది, అతిమానవుడు. నీ మనసుకు, ప్రాణికానికి, దేహానికి యజమానిగా ఉండాలి. అది ఏప్రకృతికి ఉపకరణంగా ఉన్నదో అదే ప్రకృతిపై ఆధిపత్యం కలిగిన రాజై ఉండాలి. తన పాదాల కింద నిన్ను తొక్కి పట్టి ఉంచిన ప్రకృతిని దాటి పైకి వెళ్ళాలి. అది స్వేచ్ఛగా ఉండాలి బానిసగా కాదు. అది ఒకటిగా ఉండాలి విభాగించబడి కాదు. మరణంలేనిదై ఉండాలి, మృత్యువుతో మసక బారి కాదు, ప్రకాశంతో నిండి ఉండాలి, అంధకారంతో కాదు, ఆనందంతో నిండి ఉండాలి. బాధావ్యధల ఆట వస్తువుగా కాదు, శక్తిచే పైకి లేపబడాలి గాని బలహీనతతో కింద పడి కాదు. ఆనంతంలో జీవిస్తూ సాంతాన్ని స్వాధీనం చేసుకొని ఉండాలి. అది దైవంలో జీవించడం, ఆయన సత్తాలో ఒకటిగా ఉండడం. నీవుగా అవ్వడం అంటే ~~ఈ~~ విధంగా ఉండడం, అప్పుడు అదంతా నీలోకి ప్రవహిస్తుంది.

నీలో నీవు స్వేచ్ఛగా ఉండు, అలాగే నీ మనసులో, ప్రాణంలో అలాగే దేహంలో కూడా, ఎందుకంటే అధ్యాత్మయే స్వేచ్ఛ.

దైవంతో ఇతర జీవులతో ఒకటై ఉండు, నీలో నీవు జీవించు అంతేగానీ నీ చిన్ని అహంకారంలో కాదు. ఏకత్వమే ఆధ్యాత్మ.

నీవు ఎప్పుడు మరణం లేని వాడిగా ఉండు, మరణంలో నీ విశ్వాసం ఉంచకు, మరణం నీకు సంబంధించినది కాదు, అది శరీరానికి సంబంధించినది, మరణం లేనిది ఆధ్యాత్మ.

మరణం లేని వాడిగా ఉండడం అంటే సత్‌లోనూ చిత్‌లోనూ ఆనందం లోనూ అనంతంగా ఉండడం. అధ్యాత్మ అనంతం, సొంతంగా అయినది కూడా ఆ అనంతం వల్లనే జీవిస్తూ ఉంటుంది.

ఇవన్నీ నీవు అయిఉన్నావు అందువల్ల నీవు ఇప్పుడు అవి కాగలవు. ఒక వేళ నీవు ఇవి కాకుండా ఉన్నట్టయితే అప్పుడు అవిగా నీవు ఎప్పుడూ కాలేవు. నీలో ఏదైతే ఉందో, అదే నీ సత్తాలో వ్యక్తం అవుతుంది. నిజానికి నీవు ఇదిగా గాకుండా మరోలా ఉన్నట్లు కనిపిస్తున్నావు. కాని ఎందుకోసం నిన్ను నీవు కన్పించే ఆకారాలకు బానిసను చేసుకొన్నావు?

కావున ఇప్పుడు పైకి లేచి, నిన్ను నువ్వు అధిగమించి, అసలైన నీవుగా మారు. నీవు మానవుడివి, తనను అధిగమించి పోవడం అనేది మానవుడి స్వభావంలోనే ఉంది. ఒకప్పుడు మానవుడు మనిషి-పశువుల కలయిక, కానీ ఇప్పుడు ఆ పశుత్వాన్ని అధిగమించాడు. ఆలోచించే శక్తి కలవాడు , ఒక నైపుణ్యం కలవాడు, సౌందర్య పిపాస కలిగిన వాడు మానవుడు.

ఇప్పుడు అతను చింతనుడిని అధిగమించాలి, జ్ఞాన ద్రష్ట అవ్వాలి. ఒక నైపుణ్యం కలవాడిగా కంటే పై స్థాయి లో ఉండాలి, ఒక సృష్టికర్త అయి తన సృష్టి పై అధిపతిగా ఉండాలి. సౌందర్యాన్ని అన్వేషించే వాడిగా కంటే పైకి పోయి సమస్త సౌందర్యాన్ని సమస్త ఆనందాన్ని అనుభవించాలి. భౌతికం అయివుండీ నాశనం లేని పదార్థం, ప్రాణికం అయి ఉండీ, అమృతత్వాన్ని తన సత్తా లోని అనంత శక్తిని, మనసు అయివుండి పరిమిత జ్ఞానంనుండి సమస్తకాంతిని సంపూర్ణ దృష్టిని అన్వేషించాలి.

ఇవన్నీ పొందడం అంటే ఒక మహా అతిమానవుడిగా అవ్వడం, మనసు నుండి అతిమనసులోకి ప్రవేశించడం. దానిని దివ్యమానసం అనో, దివ్య జ్ఞానం అనో, అతిమనస్సు అనో పిలుచుకోవచ్చు. అది భగవంతుడి ఇచ్ఛ చైతన్యం నుండి వచ్చిన దివ్య ప్రకాశం, దివ్య శక్తి. అతిమనసుచే అధ్యాత్మ ఈ లోకాలను దర్శించి తనను తాను ఆ లోకాల్లో సృష్టించుకొని, దానితో వాటిలో జీవిస్తూ పరిపాలిస్తూ ఉంది. అలా మానవుడు స్వరాట్‌గా సామ్రాట్‌గా తననూ, సమస్తాన్నీ పాలిస్తాడు.

ఆ దివ్యమనస్సు దివ్యమానవుడే, కనుక మనసును అధిగమించడం అనేది ముఖ్యమైన విషయం.

దివ్యమానవుడిగా ఉండడం అంటే దివ్య జీవనం సాగిస్తూ, ఒక దేవతగా ఉండడం, దేవతలంటే దైవం యొక్క శక్తులే. ఒక దివ్యశక్తిగా మానవజాతిలో విరాజిల్లు.

దివ్య సత్తాలో నివసిస్తూ ఆ పరమాత్మ యొక్క, చైతన్యం, ఆనందం, ఇచ్ఛ, జ్ఞానం నీలో కలిగి, వాటిని నీతో నీలో క్రీడించనీ. అదే దీని అంతరార్థం.

మహోన్నతంగా నీవు రూపాంతరం చెందడం అంటే ఇదే. నీలో దైవాన్ని కనుగొనడం, అలాగే అన్నింటిలో దైవవ్యక్తీకరణను దర్శించడం. ఆయన సత్తాలో జీవించి, ఆయన కాంతితో ప్రకాశించి, ఆయన శక్తితో పనిచేస్తూ, ఆయన ఆనందంలో సంతోషంగా ఉండడం. ఆ అగ్ని, ఆ సూర్యుడు ఆ మహాసముద్రం నీవే అయి ఉండు. ఆ పరమానందం, ఆ ఘనత, ఆ సౌందర్యం నీవే అయి ఉండు.

ఎప్పుడైతే దీనిని నీవు కొంతైనా చేస్తావో, ఆ దివ్య మానవుడిగా తయారుకావడంలో మొదటి అడుగులు నీవు వేసినట్టే.

CWSA 12:150-152 - *శ్రీ అరవిందులు*

అజ్ఞానం నుండి బయటపడేందుకు సోపానాలు

ప్రకృతి అహంకారాన్ని సృష్టించడానికి కారణం మానవుడు సమిష్టి అచేతన నుండి, అధోచేతన నుండి విడివడి ఒక స్వతంత్ర సజీవ మనసుగా, ప్రాణశక్తిగా, జీవాత్మగా, జీవ చైతన్యంగా తనను తాను తన చుట్టూ ఉన్న ప్రపంచంతో సమన్వయ పరచుకొంటూ, జీవించడానికే గాని దానిలో పడి మునిగిపోయి కనపడకుండా పోయి, పనికిరాకుండా పోవడానికి కాదు, మానవుడు విశ్వసత్తాలో భాగమే, అంతకంటే ఎక్కువే కూడా. అతీతం నుండి కిందికి వచ్చిన అంతరాత్మగా మానవుడిని మనం చూడాలి. ఒక్కసారిగా అతని నిజస్థితి వ్యక్తం కాదు, ఎందుకంటే విశ్వ అచేతనకు అతను అతి దగ్గరగా ఉన్నాడు, అనాది అయిన దివ్యచేతనకు అవసరమైనంత దగ్గరగా లేడు. తనను తాను ఆత్మగా లేక అధ్యాత్మగా కనుగొనే ముందు తనను తాను ఒక మనో ప్రాణిక అహంగా తెలుసుకోవాలసి ఉంటుంది.

తన అహంకారపూరితమైన వ్యక్తిత్వాన్ని తెలుసుకోవడం తనను తెలుసుకోవడం కాదు. నిజమైన ఆధ్యాత్మిక వ్యక్తి మానసిక అహం కాదు, ప్రాణిక అహం కాదు అలాగే దేహగత అహం కాదు: మొదటి కదలిక సంకల్పానికి సంబంధించినది, శక్తికి సంబంధించినది, అలాగే అది స్వయంకృతమయినది ఆ తరువాతే అది జ్ఞానానికి సంబంధించినది. అందుచేత ఒక సమయం రావాలి, అప్పుడు మానవుడు తన అహంకారపు అస్పష్ట ఉపరితలం దాటి కిందికి చూసి తనను తాను తెలుసుకోవడానికి, తనలోని నిజమైన మనిషిని కనుగొనాలి. అలా చేయనట్లైతే ప్రకృతి మనకి నేర్పే విద్యలో ప్రాథమిక స్థాయిలోనే ఆగిపోయి ఇంకా లోతైన పెద్ద విషయాలు విస్మరించినట్టు అవుతుంది. అతని జ్ఞానము నైపుణ్యం ఎంత గొప్పగా ఉన్నా సరే, జంతువులకంటే కొద్దిగా పై స్థాయిలో ఉన్నాడంతే. మొదట తన స్వీయ మనస్తత్వం పైన దృష్టి సారించాలి, దాని సహజమైన అంశాలైనటువంటి - అహంకారం, మనసు, మనసు ఉపకరణాలు అయిన ప్రాణం, దేహం - ఇలా సహజమైన అంశాలు కాక, దాని లక్ష్యమైన తనను తాను బలపరుచుకోవడం సంతృప్తి పరచుకోవడంకాక కారణభూతమైన అంశంకోసం అంతకుమించిన వివరణ దొరికే వరకు వెతకాలి. ప్రకృతిలో కానీ మానవజాతిలో కానీ దానికోసం చూసినప్పుడు వాటితో తనకున్న ఏకత్వం అర్థమవుతుంది, అలాగే దానికోసం పరాప్రకృతి లేదా దైవంలో వెతికినప్పుడు దైవంతో ఏకత్వం కనుగొంటాడు. ఈ రెండు మార్గాలు ప్రయత్నించినప్పుడు ఈ రెండు మార్గాలగుండా వెతికి కనుగొన్న ఏదో కొన్ని పాక్షిక మైన విషయాలను ఆధారం చేసుకుని ఒక పరిష్కారాన్ని పొంది స్థిరనిర్ణయానికి రావడానికి నిరంతర ప్రయత్నం చేస్తాడు, ఆ ప్రయత్నంలో కొంత అటుఇటు అవడం కూడా ఉంటుంది.

అంతటిలో తానున్న స్థితి నుండి తనగూర్చి ఇంకా తెలుసుకోవాలని, కనుగొనాలని, సంతృప్తి చెందాలని ఈ ప్రయత్నం. ప్రకృతికి చెందిన జ్ఞానాన్ని, దైవానికి సంబంధించిన జ్ఞానాన్ని కూడా స్వీయజ్ఞానానికి, పరిపూర్ణతకు, తన జీవన అస్తిత్వ పరమ లక్ష్యాన్ని సాధించుటకు సహాయకారిగా భావించాలి.

వ్యక్తి అనేవాడు "తత్"యే. అందువల్ల తనను తాను తెలుసుకోవడం చాలా అవసరం. పరమాత్మకు తన సంపూర్ణ శరణాగతి లో ఆత్మార్పణలో, తనను సంపూర్ణంగా అర్పించుకోవడంలో తన సంపూర్ణత్వాన్ని తెలుసు కొంటాడు. తన మానసిక, ప్రాణిక, భౌతిక అహాన్ని నిషేధించి, తన ఆధ్యాత్మిక

అహాన్ని కూడా వదిలిపెట్టి రూపరహిత, అపరిమిత వ్యక్తిగా శాంతిని ఆనందాన్ని అనంతంలోకి నిష్క్రమించి పొందాలి. తాను ఏది కాదు ఎవరూ కాదు అనే అనుభవంలో లేదా ప్రతిదీ తానే ప్రతిఒక్కరూ తానే లేదా అన్నిటికీ అతీతంగా ఉండే ఏకత్వం నిరపేక్షంగా ఉండటం. వ్యక్తిలోని బ్రహ్మమే ఇటువంటి మహోన్నతమైన అద్భుతమైన కలయిక తీసుకురాగలదు, అదే యోగం, అందులో బాహ్యమైన జీవుడు శాశ్వతమైన, సర్వజ్ఞత కలిగిన, సర్వాతీతుడైన, సత్తాలో కలగలిసి పోతాడు. అహాన్ని దాటిపోవడం అనేది తప్పనిసరి, దానిని సర్వోన్నతంగా, సార్వత్రికంగా కనుగొంటే తప్ప తన ఆత్మను దాటి వెళ్లలేడు. ఆత్మ అనేది అహం కాదు, అది సర్వంతోనూ, ఏకైకం కలిసి ఉన్నది, అలా దాన్ని సర్వంలో ఏకంలో తెలుసుకోవడమే నిన్ను నువ్వు తెలుసుకోవడం. వైరుధ్యం, వేరుగా ఉండడం అంతరించిపోతుంది, ఆత్మ లేదా ఆధ్యాత్మిక వాస్తవికత మాత్రమే మిగిలి ఉంటుంది, అలా విముక్తి చెందించే అంతర్ధానం వలన అది ఏకంతో సర్వంతో ఏకమవడం జరుగుతుంది.

తన రూపంతో తాదాత్మ్యత వలన ప్రకృతితో దైవంతో తన ఉపరితల వ్యక్తిత్వానికి గల అనుబంధం నుండి బయట పడినప్పుడే ఉన్నతమైన స్వీయజ్ఞానం మొదలవుతుంది. ఇందులో ఒక మెట్టు, జీవితమే సర్వం కాదు అని తెలుసుకోవడం, తన అస్తిత్వ శాశ్వతత్వాన్ని అర్థం చేసుకోవడం, అంతరాత్మ అమృతత్వాన్ని గట్టిగా ఎరుక పరచుకోవడం, సాక్షాత్కరించుకోవడం. ఎప్పుడైతే తన భౌతికస్థితి కంటే భిన్నమైన అస్తిత్వ స్థితులు ఉన్నాయన్న విషయం తెలిసి, ఇప్పుడున్న స్థితికి ముందుగా లేక వెనుకగా జీవిస్తూ, అంటే ముందున్న ఆస్తిత్వంలో లేక రాబోయే అస్తిత్వంలోని తన భౌతిక కాలపరిమితిని దాటి తన చైతన్యాన్ని విశాలం చేసుకుంటూ భౌతిక అజ్ఞానం నుండి బయటపడే మార్గాన్ని కనుగొన్నట్లే. అలాగే ఇంకొక మెట్టు ఏమిటంటే, తన జాగ్రత అవస్థలో కనిపించే ఉపరితల సత్తా తన ఉనికిలో చిన్న భాగం మాత్రమేనని తెలుసుకోవడం, అచేతనం లోతుల్ని, అధోచేతన అట్టడుగు భాగాలను అలాగే ఉన్నత చేతన ఎత్తులను అధిరోహించడం ద్వారా తన స్వీయ అజ్ఞానాన్ని పోగొట్టుకోవడం. మూడవ మెట్టు ఏమిటంటే తనలో తన ఉపకరణాలైన మనసు, ప్రాణం, దేహం కంటే విభిన్నంగా ఇంకేదో ఉన్నదనే భావన, కేవలం తనలోని ప్రకృతికి ఆధారంగా ఉన్న నిరంతరం అభివృద్ధి చెందుతున్న మరణంలేని అంతరాత్మ మాత్రమే కాక శాశ్వతమైన

మార్పులేని ఒక ఆత్మ లేదా అధ్యాత్మ, ఇంకా తన ఆధ్యాత్మిక సత్తాలోని ఇతర విషయాలు ఏమిటనేది తెలుసుకోవడం తద్వారా తనలోని ప్రతిదీ ఆ అద్వితీయ చైతన్యం నుండి వచ్చిందే అనే విషయం కనుగొనే వరకు, అలాగే నిమ్న ఉన్నత చైతన్య స్థాయిల మధ్య ఉండే సంబంధాన్ని అర్థం చేసుకోవడం, అలా తనలో ఉండిపోయిన స్వీయ అజ్ఞానాన్ని తొలగించుకోవడం. అలా ఆత్మను అధ్యాత్మను తెలుసుకోవడం ద్వారా దైవాన్ని తెలుసుకోవడం, అలా ఈ అనిత్య భౌతిక ప్రకృతికి భిన్నంగా ఒక పరమాత్మ ఉన్నదని తెలుసుకోవడం, అలా ఆ పరమాత్మను విశ్వ చైతన్యంలోనూ, ప్రకృతిలోనూ, జీవులలోనూ దాగున్న దైవంగా దర్శించడం. అతని మనసు నిరపేక్షానికి చెందిని భావనను గాని ఆలోచనను కానీ అందుకోవడం, జీవుడు, విశ్వం, వ్యక్తి అనే అనేక అంశాలను అందులో భాగాలుగా గుర్తించడం, విశ్వవ్యాప్తమైన, వ్యక్తిగతమైన అహంకారయుతమైన, అనాది అయిన అజ్ఞానం మనిషిపైన తన కఠినమైన పట్టుని మెల్లగా సడలిస్తుంది. అలా తన విస్తృతమౌతున్న స్వీయజ్ఞానం అనే మూసలో ఇమడడం కోసం మనిషి చేసే ప్రయత్నంలో జీవితం, ఆలోచన, కర్మ పట్ల తనకున్న అభిప్రాయాలు, ఉద్దేశాలు క్రమంగా మారిపోతూ పరివర్తన చెందుతూ ఉంటాయి. తనపట్ల, తన స్వభావం పట్ల, తన ఉనికి ప్రయోజనం పట్ల తనకున్న అజ్ఞానం క్రమంగా తగ్గిపోతుంది. పరిమితత్వంలోని అసత్యం నుండి దుఃఖం నుండి వాస్తవమైన సంపూర్ణమైన ఉనికి యొక్క ఉత్కృష్ట అనుభవంలోకి వెళ్ళే మార్గంలోకి అతను అడుగు పెడ్తాడు.

CWSA 21: 722-25 — *- శ్రీ అరవిందులు*

ప్రాథమిక సాక్షాత్కారం

ఈ విశ్వానికి సంబంధించి సురక్షితమైన, పునాదిగా ఉన్న సత్యం ఒకటుంది. సృష్టించబడని ఆత్మ, ఆధ్యాత్మికతల ఒక ప్రకటీకరణయే జీవితం. ఆత్మకు తాను సృష్టించిన అస్తిత్వాలతో ఉన్న నిజమైన సంబంధమే ఈ జీవితంలో దాగి ఉన్న రహస్యానికి కీలకం. అనేక రూపాలతో భిన్నత్వాన్ని కలిగి ఉన్న ఈ ప్రపంచం వెనకాల ఏకైక శాశ్వతుని ప్రేమ ఆనందాలతో కూడిన చూపు ఉంది. అది ప్రతిదానిలోనూ ప్రతి చోట ఉంది. ఈ ప్రపంచాన్ని ఆవరించి, దానిలోకి చొచ్చుకుపోయిన అవ్యక్త, కాలాతీత శాశ్వతుని (భగవంతుని) కాల పరిధిలోని అభివ్యక్తే ఈ ప్రపంచం.

కేవలం మేధావితనంతో ఎప్పుడూ హేతువును శోధించే మనస్సో, జీవితానికి సంబంధించిన ఆదిభౌతికమైన భావనయో లేదా సాధకుని మానసికపరమైన సాక్షాత్కారమో సరిపోదు. ఈ యోగ సాధనలో పైన చెప్పిన వాటికి సంబంధించిన జ్ఞానం విలువ లేనిది, అది నిష్ఫల పర్యవసానాన్ని ఇస్తుంది. ఈ యోగం శోధించేది కేవలం ఆలోచనకు సంబంధించిన సత్యాన్నో, లేకపోతే మనసుకు సంబంధించిన సత్యాన్నో కాదు, ఈ జీవనంలో క్రియాశీలంగా, శక్తిభరితంగా బహిర్గతమవుతూ ఉన్న ఆధ్యాత్మిక అనుభవానికి చెందిన సత్యాన్ని మాత్రమే.


మనలో ఉన్న భగవంతునితో స్థిరమైన సామీప్యత, దానిని లోపల సుభద్రంగా ఉంచే గుణము, ప్రతి చోట, ప్రతి విషయంలోనూ ఉన్నది ఉన్నట్లుగా స్పష్టంగా చూసే గుణం, ఆయనతో మమేకం కావడం, ఆ అనంత సాన్నిధ్యం సదా సర్వత్రా మనలో మేలుకోవాలి.

ఆ సన్నిధి మనలో సజీవంగా వాస్తవికతగా వ్యాపించి ఉండాలి. దానిలో మనతోపాటు మిగిలినవన్నీ కూడా ఉన్నాయి, చరిస్తున్నాయి, పని చేస్తున్నాయని తెలుసుకోగలగాలి. ఆ సన్నిధిలో మనం ఎల్లప్పుడూ, ప్రతిచోటా, స్పష్టమైన, ప్రత్యక్ష అనుభవాన్ని కలిగి ఉండాలి. అలాగే ఆ సన్నిధి అన్నిటిలోనూ ఉన్నది అని అనుభూతి చెందాలి. ఇది మనకు సాధికారికంగా వాటిని నిజమైన ఆత్మ, వాటిలో స్పర్శవేద్యమైన నశ్వరమవ్వని సారంగా, మనం అందుకోగల అంతరాత్మగా అనుభవంలోకి రావాలి.

ఈ పరమాత్మను, ఆధ్యాత్మను ఇక్కడ అన్ని అస్తిత్వాలలో చూడటం, పరమాత్మలోనూ, ఆధ్యాత్మలోనూ, అన్ని అస్తిత్వాలను ఒకే తేజస్సుగా అనుభూతి చెందడమే కాకుండా, ఆ ఉనికిని చూడడం, గ్రహించడం, అనుభూతి చెందడం ఆ ఉనికితో సంబంధం పెట్టుకోవడం కూడా ఇతర జ్ఞానాలతో జతపరచవలసిన ప్రాథమిక అనుభవం.

CWSA 23:115 — *- శ్రీ అరవిందులు*





realisation

సిద్ధి

తాదాత్మ్యత

(మదర్ ప్రార్థనలు ధ్యానాలు, నవంబర్ 19, 1912)

నేను నిన్ను ఖచ్చితంగా కనుగొన్నానని, మన సంబంధం స్థిరంగాఉందని, నిన్ను చాలా హృదయపూర్వక అభిలాషతో వెతుకుతున్న ఆంగ్ల యువకుడికి నేను నిన్న చెప్పాను. నిజానికి అప్పటి నా చేతనాస్థితి అట్లాంటిదే. నా ఆలోచనలన్నీ నీ వైపుకు వెళ్ళాయి, నా చర్యలన్నీ నీకు అంకితం చేయబడ్డాయి. నీ ఉనికి నాకు సంపూర్ణమైన, మార్పులేని, మార్చ వీలులేని వాస్తవం. నీ శాంతి నా హృదయంలో నిరంతరం నివసిస్తుంది. అయినప్పటికీ, ఈ మన సంబంధ స్థితి, నేను రేపు అవగాహన చేసుకుని, తెలుసుకునే దానితో పోల్చి చూస్తే పేలవంగా, అనిశ్చితంగా ఉందని నాకు తెలుసు. అయినా నాలో "నేను" అనే అంశం, పూర్తిగా నీలో కలిసి తనను తాను కోల్పోయే స్థితికి నేను చాలా చాలా దూరంగా ఉన్నాను అని నాకు స్పష్టంగా తెలుసు. ఆ "నేను" ను నేను ఇప్పటికీ నన్ను వ్యక్తీకరించడానికి ఉపయోగిస్తాను, కానీ ప్రతిసారీ ఇది ఒక ప్రతిబంధకం. ఈ "నేను" అనే పదం, నా లోపల తనను తాను అభివ్యక్త పరచాలని కాంక్షిస్తున్న అంశానికి, ఆ అంశం అభివ్యక్తికి అనర్హం.

మనుష్య లోకంలో భావ ప్రకటనకు "నేను" మనుషులకు అవసరం అని నాకు అనిపిస్తోంది. కానీ ఈ "నేను" దేనిని అభివ్యక్తీకరిస్తోంది, అనే దాని మీద అంతా ఆధారపడి ఉంది. ఇప్పటికి ఎన్నోసార్లు నేను దానిని ఉపయోగించి నప్పుడు, నాలో ఉండి మాట్లాడేది నువ్వే, ఎందుకంటే నేను నీలో పూర్తిగా కలిసిపోయి, నీ నుండి వేరుగా ఉన్నాను అనే భావనను కోల్పోయాను.

కానీ ఇప్పటికీ ఇదంతా పిండ దశలోనే ఉంది, పరిపూర్ణత వైపు తన ప్రయాణాన్ని సాగిస్తూ ఉంది. నాకు నీ సర్వశక్తిపై ఉన్న నిర్మలమైన విశ్వాసంలో ఎంతటి సంతృప్తికరమైన హామీ ఉంది!

అన్నీ నువ్వే, ప్రతిచోటా, అన్నింటిలో ఉన్నది నీవే. అలాగే కనిపించే ఈ విశ్వమంతా నీవే. ఈ పని చేస్తున్న శరీరం కూడా నాది కాదు, నీ స్వంత శరీరం. ఈ శరీరంలో ఉండి శ్వాసక్రియను జరిపేది, ఈ శరీరం ద్వారా ఆలోచించేది, ప్రేమించేది కూడా నీవే. కాబట్టి ఇది నీ ఇష్ట పూర్వకంగా నీ సేవకురాలిగా ఉండాలని కోరుకుంటుంది.

CWM - 1:4 — ది మదర్

మదర్ రచనలలోని రత్నాలు

మనుషులు నేను అని పిలుచుకునేది అహాన్ని మాత్రమే - కానీ మన నిజమైన "ఆత్మ" భగవంతుడు.

23-3-1958 ***వైట్ రోజెస్, పుట 198***

తన గురించి తాను తెలుసుకోవటానికి, తనలోని పరమ సత్యంతో చేతనాపూర్వక సంబంధాన్ని కలిగి ఉండడానికి, ఏ రూపంలోనైనా, ఏ దారిలోనైనా సాధన చేయవచ్చు. ఎలా చేస్తున్నావు అన్న దాంతో సంబంధం లేదు. తనను తాను తెలుసుకోవటమే ఏకైక మార్గం. ప్రతి మనిషి తనలో దివ్య సత్యాన్ని కలిగి ఉంటాడు, ఆ దివ్యసత్యంతోనే అతడు మమేకం కావాలి, అది అతను జీవించవలసిన సత్యం. ఆ సత్యాన్ని చేరుకోవడానికి, తెలుసుకోవడానికి అతను అనుసరించాల్సిన మార్గం అతనిని జ్ఞానానికి వీలైనంత దగ్గరగా నడిపించే మార్గం. చెప్పాలంటే, వ్యక్తిగత సాక్షాత్కారం, జ్ఞానం రెండు పూర్తిగా ఒక్కటే.

CWM 10:138

పరమాత్మను సాక్షాత్కరింపచేసుకోవడం సాధ్యం కాని వారు ఎవరూ లేరు. కొందరికి అది సాధించడానికి చాలా జన్మలు అవసరం, మరికొందరు ఈ జీవితకాలంలోనే సాధిస్తారు. ఇది సంకల్పానికి సంబంధించిన విషయం. దానిని నీవే ఎంచుకోవాలి.

కానీ ప్రస్తుత తరుణంలో పరిస్థితులు ప్రత్యేకంగా అనుకూలంగా ఉన్నాయనే చెప్పాలి.

CWM 16:409

మధుమయి మాతా, నిజంగా "దైవాన్ని నిజం చేసుకోవడం" అంటే ఏమిటి?

తనలో లేక ఆధ్యాత్మిక శిఖరాలపై ఉన్న దైవసాన్నిధ్య యెఱుకను పొందడం, ఒకసారి భగవంతుని ఉనికిని తనలో తెలుసుకున్నాడు అంటే, ఆ వ్యక్తి భగవంతునికి తనను తాను పూర్తిగా అర్పించుకోవడం, భగవంతుని అనుజ్ఞనే పాటించడం, ఆ వ్యక్తికి స్వంత కోరిక అంటూ ఏదీ ఉండకపోవడం, చివరకు తన చేతనను భగవంతుని చేతనతో కలపడం. "ఇదీ భగవంతుని తెలుసుకోవడం అంటే".

CWM 16:407-08 *ది మదర్*

దైవంలో లీనం కావటానికి తొలి మెట్టు

వ్యక్తి అహాన్ని దైవంలో లీనం చెయ్యటం : ముందుగా స్వీయ వ్యక్తిత్వం పూర్తిగా ఏర్పడనంత వరకూ ఒక వ్యక్తి తన ఆహాన్ని భగవంతునిలో లీనం చేయలేడు. పూర్తిగా స్వీయ వ్యక్తిత్వం కలిగి ఉండటమంటే ఏమిటో మీకు తెలుసా? బాహ్యమైన ప్రభావాలన్నిటినీ ప్రతిఘటించగలగటమా?

కొన్ని రోజుల క్రితం నాకు ఎవరి వద్ద నుండో ఒక ఉత్తరం వచ్చింది. అతను తాను సాధారణ సాహిత్య సంబంధమయిన ఏ పుస్తకం చదవాలన్నా చాలా సంశయిస్తున్నానని వ్రాసాడు. ఉదాహరణకి నవలలూ, నాటకాల వంటివి. ఎందుకంటే అతని స్వభావంపై ఆ పుస్తకాలలోని పాత్రలు అధిగమించలేనటువంటి ముద్రను వేస్తున్నాయి. అతను ఆ పాత్రల భావాలను, ఆలోచనలను, స్వభావాన్ని జీవించటం మొదలు పెడుతున్నాడు. ఒకరు కాదు చాలా మంది యిలా భావించేవారు ఉన్నారు. వారొక పుస్తకాన్ని చదువుతారు. అలా చదివేటపుడు తమలో అన్ని రకాల భావావేశాలు, ఆలోచనలు, కోరికలు, సంకల్పాలు, ప్రణాళికలు, ఆదర్శాలను సైతం అనుభూతి చెందుతారు. వాళ్ళు కేవలం ఆ పుస్తకం చదవటంలో పూర్తిగా నిమగ్నమయి పోతారు. వారికి ఆ విషయం తెలియదు. ఎందుకంటే ఒక మనిషి వ్యక్తిత్వం 99 శాతం మెత్తని వెన్నతో తయారయి ఉంటుంది-తినదగినది కాదనుకోండి . కానీ దానిపై బొటనవేలు నుంచినట్లయితే ఒక ముద్ర పడుతుంది.

ఇపుడిక ప్రతిదీ ఒక బొటనవేలు : వ్యక్తీకరించబడిన ఒక ఆలోచన, చదవబడిన ఒక వాక్యం, చూడబడిన ఒక వస్తువు, వేరే ఎవరో చేసిన ఒక పరిశీలన, తన పొరుగువారి సంకల్పం. మీకు తెలుసు, ఈ సంకల్పాలన్నీ, ఒకరు చూసినపుడు అవన్నీ అక్కడ ఉంటాయి, ఈ విధంగా కలగాపులగంగా కలిసిపోయి (శ్రీమాత తన చేత వేళ్ళను ఒక దానిలోకి మరొకటి పోనిస్తారు) ప్రతిదీ పైన ఉండాలని ప్రయత్నిస్తూ నిరంతరమైన విభేదాలను బయటా, లోపల సృష్టిస్తూ ఉంటాయి. అవి మనుషుల లోపలికి, బయటకూ ఆవిధంగా విద్యుత్తరంగాలులా వెళుతూ, వస్తూ ఉంటాయి. వ్యక్తి వీటన్నిటి ఎరుకను కలిగి ఉండడు. యివి తమను వ్యక్తీకరించుకోవాలను కొనే సంకల్పాల నిత్యం కొనసాగే పోరాటం, అందులో అత్యంత బలమైనది సఫలం అవుతుంది.

కానీ యిలాంటివి అత్యధిక సంఖ్యలో ఉండి వ్యక్తి వాటికి వ్యతిరేకంగా పోరాడవలసి వస్తుంది కనుక అది అంత సులభం కాదు.

అందువలన వ్యక్తి సముద్రపు అలలపై బెండులా అటూ యిటూ ఊగిసలాడ వలసి వస్తుంది. ఒక రోజు ఒకటి, రెండవ రోజు మరొకటి కావాలనిపిస్తుంది. ఒక సారి యిటు నుండి, మరొక సారి అటు నుండి తోయబడతాడు, తల ఎత్తి ఆకాశంవైపు చూస్తాడు. (శ్రీమాత తల పైకి ఎత్తి చూస్తారు), యిప్పుడొక బిలంలో లోతుగా మునిగి పోయి ఉంటాడు. వ్యక్తి జీవితం యిలానే ఉంటుంది. ముందుగా వ్యక్తి చైతన్యవంతమయిన, చక్కగా దిద్దబడిన, స్వతంత్ర్యమైన ఉనికిగా ఉండాలి, ఎవరైతే తనలో తాను, తనకుగా తాను మనగలిగి, తన పరిసరాలనుండి స్వతంత్రంగా, అన్నిటినీ వినగలిగి, చదవగలిగి, దేనికైనా మార్పు లేకుండా చూడగలిగి ఉండాలి. తాను బయట నుండి దేనిని స్వీకరించదలచుకుంటే దానినే స్వీకరించాలి, తన ప్రణాళికకు అనుగుణ్యం కాని దేనినయినా అతను అప్రయత్నంగా నిరాకరిస్తాడు, అతను ఆ ముద్రను స్వీకరించటానికి అంగీకరిస్తే తప్ప. ఏదీ కూడా అతనిపై ఒక ముద్రను విడిచిపెట్టదు, అప్పుడు వ్యక్తి ఒక స్వతంత్ర వ్యక్తిత్వాన్ని పొందుతాడు. అలా ప్రత్యేక అస్తిత్వాన్ని పొందినపుడు వ్యక్తి దానిని నివేదన చేయవచ్చు.

ఎందుకంటే వ్యక్తికి ఏదైనా వున్నపుడే, దానిని యివ్వగలడు. మొదట ఒకడుగా ఉండాలి, ఆ తరువాత ఆ ఒకటైన తనను యిచ్చుకోగలడు. ఆ ఒకటిగా తాను లేనంత వరకూ, వ్యక్తి ఏమీ యివ్వలేడు. నేను వేరు అనే అహంకార భావన అంతరించే వరకూ, ఏ విధమయిన దాపరికాలు లేకుండా వ్యక్తి పూర్తిగా, సంపూర్ణంగా తనను తాను నివేదించుకోలేడు. తనను తాను సమర్పించుకోవాలంటే ముందుగా తానొక ప్రత్యేక అస్తిత్వాన్ని కలిగి ఉండాలి. ఇలా ఉండాలంటే అతడొక వ్యక్తిత్వంగా అవ్వాలి.

మీ శరీరం ఈ విధంగా బిగువుగా చేయబడినట్లయితే - ఎందుకంటే యిది చాలా స్థిరంగా ఉంది కదా? అన్నీ యిలా స్థిరంగా లేనట్లయితే, చర్మం యిలా లేకపోతే, స్థూలంగా, బాహ్యంగా మీరు కేవలం మీ ప్రాణిక, మానసిక క్షేత్రాల ప్రతిబింబమే అయి ఉంటే అది జెల్లీఫిష్‌లా ఉండటం కన్నా అధ్వాన్నంగా ఉండేది! (ప్రతీదీ మరొక దానితో కలిసి పోయి ఉండేది... అంతా అయోమయంగా ఉండేది. అందువలననే మొదట ఒక స్థిరమైన రూపాన్నివ్వటం

అవసరమయింది, తర్వాత మనం దానిని గురించి ఫిర్యాదులు చేస్తున్నాం. 'శరీరం స్థూలంగా ఉంది. ఇదొక ప్రతిబంధకం, దీనికి నమనీయత లేదు, దీనికి మృదుత్వం లేదు, మనం భగవంతునితో మమేకం కావటానికి కావలసిన ద్రవస్థితి దీనికి లేదు' అని అనుకుంటూ ఉంటాం. కానీ యిది అత్యంత ఆవశ్యకం, ఎందుకంటే మీరొక సారి శరీరం నుండి బయటకు వెళ్ళినట్లయితే, (మీలో చాలా మంది అలా చేయలేరు మీ ప్రాణికం, భౌతిక చేతన కన్నా స్వతంత్రం కాలేదు) మీరు శరీరం నుండి బయటకు వచ్చి ప్రాణమయ లోకానికి వెళ్ళినట్లయితే, మీరక్కడ అన్నీ కలగాపులగమై ఉండటం చూస్తారు, మిశ్రమంగాను, విభజించబడి, అన్ని రకాల ప్రకంపనలూ, శక్తి తరంగాలూ వస్తూ, పోతూ, పోరాడుతూ, ఒక దానినొకటి ధ్వంసం చేస్తూ, ఒక దానినొకటి కబళిస్తూ, పరస్పరం శోషింపచేసుకుంటూ, పరస్పరం బయటకు విసిరి వేసుకుంటూ.... ఈ విధంగా నడుస్తూ ఉంటుంది. కానీ యిందులో ఒక నిజమైన వ్యక్తిత్వాన్ని చూడటం చాలా కష్టం. ఇవి శక్తులు, కదలికలు, కోరికలు, ప్రకంపనలు. అక్కడ ప్రత్యేక అస్తిత్వాలుంటాయి, వ్యక్తిత్వాలుంటాయి! కానీ అవన్నీ శక్తులే. ఈ ప్రపంచంలో ప్రత్యేక అస్తిత్వమున్న వారంతా వీరులు లేదా రాక్షసులు!

ఇప్పుడు మనసులో (నిశ్శబ్దం) మీరు మీ భౌతిక మనస్సు యొక్క ఎరుకను కలిగినట్లయితే, కొంత మంది దానిని 'బహిరంగ విపణి' అని పిలుస్తారు, ఎందుకంటే అన్నీ అక్కడికి వస్తాయి, దానిగుండా ప్రయాణిస్తాయి, వెళ్ళిపోతాయి. మళ్ళీ తిరిగి వస్తాయి. ఆలోచనలన్నీ అక్కడకు వెళతాయి, ఒక చోట చేరుతాయి, ఒక వైపు నుండి ప్రవేశించి మరొక వైపునుండి నిష్క్రమిస్తాయి, కొన్ని యిక్కడ, కొన్ని అక్కడ, అది బహిరంగ విపణి కావటం చేత చక్కగా వ్యవస్థీకరించబడలేదు, అందువలన, ఆలోచనలు కలసి, ఒక దాని నొకటి గుద్దుకుంటూ ఉంటాయి. అన్ని రకాల ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి. అపుడు తెలుస్తుంది.

నా మనసును ఏమనవచ్చు? లేదా నా మనసేమిటి అనేది. ఒక వ్యక్తికి ఎన్నో సంవత్సరాల తదేకమయిన దీక్ష, చాలా జాగరూకమయిన, హేతుబద్ధమయిన, సందర్భోచితమైన కార్యము, నిర్వహణ, ఎంపిక, నిర్మాణము కేవలం దీనిని నిర్మించుకోవటంలో సఫలం కావటానికి, కేవలం ఈ చిన్న విషయమయిన "ఒక వ్యక్తి తనదైన ఆలోచనా విధానాన్ని"!

నిర్మించుకోవటానికి అవసరమౌతుంది. తనకొక స్వంత ఆలోచనా విధానముందని వ్యక్తి విశ్వసిస్తాడు. అది వాస్తవం కాదు. అది పూర్తిగా అతను మాట్లాడే వ్యక్తులపై, చదివే పుస్తకాలపై, అతని, మనఃస్థితపై ఆధారపడి ఉంటుంది. అది మీ జీర్ణవ్యవస్థ బాగోగులపై, మీరొక గదిలో సరైన గాలీ వెలుతురు లేకుండా బంధించబడి ఉన్నారా? లేక బయలు ప్రదేశంలో ఉన్నారా? మీముందొక రమణీయమైన ప్రకృతి దృశ్యం ఉందా? సూర్యరశ్మి ఉందా లేక వర్షం పడుతుందా? మొదలైన అనేక విషయాలపై ఆధారపడి ఉంటుంది. మీరు స్పృహ కలిగి ఉండనప్పటికీ, మీరు అన్ని రకాలయిన ఆలోచనలు చేస్తారు, మీకేమాత్రం సంబంధం లేని, వివిధ రకాలయిన విషయ రాశుల గురించి!

ఇది ఒక సమరసమయిన, సందర్భోచితమయిన, హేతుబద్ధమయిన, ఆలోచనగా కావాలంటే దీర్ఘమయిన, కూలంకషమైన ప్రయత్నం అవసరం. మీరు చక్కని, బాగా నిర్మించబడిన, చాలా దృఢమైన, చాలా శక్తివంతమయిన మానసిక నిర్మాణం చేయటంలో సఫలీకృతమయినప్పుడు దాని ఉత్తమ అంశమేమిటంటే, మీకు చెప్పే మొదటి విషయం ' దీనిని ఛేదించినపుడు మీరు భగవంతునితో ఐక్యమవుతారని'. కానీ మీరది సాధించనంత వరకు మీరు దైవంతో ఏకంకాలేరు. ఎందుకంటే మీరు భగవంతునికి నివేదించుకో వటానికి మీరు కానటువంటి విషయరాశులు తప్ప మరేమీ ఉండదు. మొదట ఒక వ్యక్తి తానొక వ్యక్తిగా కాగలిగినపుడే తనను తాను సమర్పించుకోగలడు. నేను ముందు చెప్పిన దానినే తిరిగి చెప్తున్నాను.

నిజానికి ప్రపంచపు ప్రస్తుత పరిస్థితులలో ఒక వ్యక్తి భగవంతునికి నివేదించగలిగినది తన శరీరం మాత్రమే. కానీ దానిని మనిషి దైవానికి అర్పించడు. వ్యక్తి తన కర్మను సమర్పించటానికి ప్రయత్నించవచ్చు! కానీ యిక్కడ కూడా చాలా అంశాలు వాస్తవం కానివి ఉంటాయి! మీ శరీరాన్ని భగవంతునిలో లీనం చెయ్యాలనుకుంటున్నారా? ప్రయత్నించండి! దీనిని ఎలా చేస్తారు? మీ మనస్సును లీనం చెయ్యవచ్చు, మీ ప్రాణిక చేతనను లీనం చేయవచ్చు, మీ భావావేశాలు, మీ ఆకాంక్షలన్నిటిని కలిపివేయవచ్చు. కానీ మీ శరీరం - దానిని ఎలా లీనం చేయగలరు? దానినొక మరిగే నీటికుండలో కరిగించలేరు కదా! (నవ్వు) అయినప్పటికి మీరు రూఢిగా చెప్పగలిగిన ఒకే ఒక విషయం అదే. 'అది ఉన్నది.' దానికొక పేరు పెడ్తావు.

మీరు పెట్టే పేరు కూడా ఒక సంప్రదాయమే. కానీ మిమ్మల్ని మీరు ఏదో ఒక పేరుతో పిలుచుకోవటానికి అలవాటు పడి ఉన్నారు. 'ఇది ఇదీ నేను' అని మిమ్మల్ని మీరు అద్దంలో చూసుకున్నపుడు, మీరు ఇరవై సంవత్సరాల క్రితం మీరిపుడున్న దానికి ఎంతో భిన్నంగా ఉన్నా, గుర్తుపట్టలేనంతగా ఉన్నా అప్పటికీ మీరు అదే! అవును ఇదినేనే అని ఏదో మిమల్ని అలా చెప్పేటట్లు చేస్తుంది. అవును నేను ఫలానా - పీటరు, లూయిస్, జాక్‌ఆంద్రి అదెవరయినప్పటికీ.

(కొంత నిశ్శబ్దం తర్వాత) ఒక వ్యక్తి తన వైపు తాను చూసుకోవలసి వస్తే, ప్రతి ఏడు సంవత్సరాలకి శరీరకణాలన్నీ మారిపోతాయి, కేవలం ఒక అలవాటుగా మాత్రమే రూపం నిలిచి ఉంటుంది. అది ఒకే విధంగా ఉంటుందా. మీ బాగా చిన్నతనంలోని ఛాయాచిత్రాలున్నాయా? మీరు పది, యిరవై, ముప్ఫై సంవత్సరాల వయసప్పటి ఛాయాచిత్రాలు - మీరు గుర్తుపట్టాలని అనుకుంటారు కాబట్టి మిమ్మల్ని గుర్తుపడతారు. లేకపోతే నిజానికి వ్యక్తులు ఒకేలా ఉండరు. మీరు అంత పొడవుగా వున్నప్పటికీ ఇప్పుడు ఇంత పొడవయినప్పటికీ, గణనీయమైన భేదం ఉంటుంది. అదీ విషయం.

ఇదంతా మిమ్మల్ని నిరుత్సాహపరచటానికి చెప్పటం లేదు. మీ అహాన్ని దైవంలో లీనం చెయ్యటం గురించి మాట్లాడే ముందు ఒకవ్యక్తి ముందుగా తానేమిటో కొంత తెలుసుకోవాలి. అహం అనేది ఉంటుంది.. దాని అవసరమేమిటంటే మీరు చైతన్యవంతమయిన స్వతంత్రమయిన వ్యక్తులు, ప్రత్యేకమయిన - అంటే నా దృష్టిలో స్వతంత్రులు కావటం, అందువలన మీరు బహిరంగ విపణిలా, ఎక్కడయితే అన్ని ఒకదానికొకటి అడ్డుతగులుతూ ఉంటాయో అలా ఉండరు. మీరు మీలోనే ఉంటారు. అందువలననే అహం అనేది ఉంది. ఆ విధంగానే, చర్మం అనేది కూడా ఉంది, ఆ విధంగా, నిజంగానే దానిగుండా భౌతికమయిన శక్తులు ప్రసరిస్తున్నప్పటికీ చర్మం ఉంటుంది.

ఒక ప్రకంపన కొంతదూరం వెళుతుంది. అయినప్పటికీ ~~ఈ~~ చర్మం మనం ఒకరితో ఒకరు కలసిపోకుండా నివారిస్తుంది. కానీ మిగిలినవన్నీ కూడా అలానే ఉండాలి.

(కొంత నిశ్శబ్దం తర్వాత) అపుడు తర్వాత వ్యక్తి దీనినంతటినీ భగవంతుడికి నివేదిస్తాడు. కొన్ని సంవత్సరాల ప్రయత్నం అవసరమవుతుంది మీరు కేవలం మీ (నిశ్శబ్దం) గురించి మీరు ఎరుకను పొందటమే కాక, అన్ని

వివరాల ఎరుకను కలిగి, మీరు 'నేను' అని అనుకొనేదానికి అంతరాత్మను కేంద్రంగా చేసుకొని, ఏదయితే మీ దివ్య కేంద్రమై ఉన్నదో, అందువలన అది ఏకైక అర్థవంతమయిన, చైతన్య వంతమయిన ఉనికిగా ఉంటుంది. ఈ దివ్యకేంద్రం పూర్తిగా భగవంతుడికి సమర్పణ చేయబడి ఉండటం వలన (శ్రీమాత చేతితో నివేదనను చూపిస్తారు) అంతా కూడా సామరస్యంగా దాని చుట్టూ వ్యవస్థీకరించబడినపుడు, అంతా భగవంతునికి సమర్పించ బడినట్లే. దైవం సరియైన సమయం వచ్చిందని భావించినపుడు, ఎపుడైతే వ్యష్టీకరణ కార్యం పూర్తి అవుతుందో అపుడు దైవం మీ అహాన్ని తనలో లీనం చేసుకోవటానికి, అప్పటి నుండి తన కొరకే జీవించటానికి అనుమతినిస్తాడు.

కానీ ఈ నిర్ణయాన్ని భగవంతుడు తీసుకుంటాడు. ముందుగా మీరీ కృషి అంతా చేయవలసి ఉంటుంది - చైతన్యవంతమయిన వ్యక్తి కావటం, కేవలం, ప్రత్యేకంగా భగవంతుణ్ణి మాత్రమే కేంద్రంగా చేసుకొని, దైవం చేతనే పాలించబడాలి. ఇంత జరిగాక కూడా యింకా అహం నిలిచే ఉంటుంది, ఎందుకంటే మిమ్మల్ని ఒక స్వతంత్రమయిన వ్యక్తిగా నిలిపి ఉంచేదదే. కానీ ఒక సారి ఈ కార్యం పరిపూర్ణంగా, పూర్తిగా నిర్వహించబడినపుడు మీరు దైవంతో అనవచ్చు 'నేనిక్కడ ఉన్నాను, నేను సిద్ధంగా ఉన్నాను, మీకు నేను కావాలా?' అని. దైవం అప్పుడు సాధారణంగా 'అవునని' అంటాడు. అన్నీ అయిపోయాయి, అంతా పరిసమాప్తమయి పోయింది. మీరు దైవకార్యానికి నిజమైన ఉపకరణమయి పోతారు. కానీ ముందుగా ఆ ఉపకరణం నిర్మించబడాలి.

CWM 6:256-61 - శ్రీమాత

> అవి ఎంత ఉన్నతమైనవైనా బాహ్య
> పరిస్థితులన్నింటి నుండి, సర్వ సాంగత్యాల నుండి,
> బౌద్ధిక అవగాహనలన్నింటి నుండి స్వేచ్ఛ పొందిన
> సిద్ధి మాత్రమే ఒక నిజమైన సిద్ధి.
>
> *- ది మదర్*

సకారాత్మక అతిశీఘ్ర మార్గం

(గౌతమ బుద్ధుని దమ్మపథం నుండి శ్రీ మాత ఒక అధ్యాయం చదువుతూ చివరిగా వచ్చిన క్రింది వాక్యాలు చదివిన తరువాత క్రింది విధంగా వ్యాఖ్యానించారు)

"నీతి నియమాల వంటివి పాటించడం వలన కానీ, విస్తృతమైన జ్ఞాన సముపార్జన వలన కానీ, ధ్యాన సాధన వలనకానీ, ఆలోచించడం (విచారణ) వలన కానీ, వాస్తవమైన ఆనందం ఒక మనిషికి దొరకదు, అది కేవలం కోరికలన్నింటిని నిర్మూలించడంవలననే సాధ్యం అవుతుంది."

కోరికలను నిర్మూలించడం అంత సులభమైన విషయం కాదు, కొన్నిసార్లు అది ఒక జీవితకాలం పాటు తీసుకోవచ్చు. నిజం చెప్పాలంటే ఇది చాలా నకారాత్మకమైన మార్గం, అయితే ఒక దశలో ఇది చాలా ఉపయుక్తమైన సాధనగా ఉంటుంది, మనల్ని మనం మోసం చేసుకోకూడదు అనుకొంటే ఇది తప్పనిసరిగా పాటించవలసిన సాధన. మొదటగా పెద్దవయిన కోరికలను తొలగించుకోవాలి, బాగా స్పష్టంగా కనిపించేవి చాలా ఎక్కువగా ఇబ్బంది పెట్టేవి, అవి ఎంత ఇబ్బంది పెడతాయి అంటే అందులో మనకి ఎలాంటి భ్రాంతులు ఉండవు. అటు తరవాత సూక్ష్మమైన కోరికలు వస్తాయి, అవి మనం చేయవలసిన పనుల రూపంలో ఉంటాయి, అవి అవసరమైనవిగా అనిపిస్తాయి. మనలోనుండి ఆదేశాలు వచ్చినప్పటికీ కూడా అవి తొలగించుకోవడానికి సమయం, అలాగే వాటిని కనుగొని అధిగమించడానికి చిత్తశుద్ధి కావాలి. చివరిగా ఈ బాధించే కోరికలన్నీ ఈ భౌతిక జగత్తులో, బాహ్యావిషయాలలో, భావనలలో, ఉద్వేగాలలో, సెంటిమెంట్లలో, ఆలోచనా జగత్తులోని అంశాలలో వీటిని తొలగించాక, తిరిగి ఆధ్యాత్మిక జగత్తులో వీటిని తిరిగి కనుగొంటావు, అక్కడ అవి మరింత ప్రమాదకరంగా, మరింత సూక్ష్మంగా, మరింత లోతుగా, ఇంకా మరింత అదృశ్యంగా ఉంటూ ఎంతో సాధుగుణంతో నిండి ఉంటాయి, వాటిని కోరికలుగా సంబోధించడానికి కూడా మనకు ధైర్యం చాలదు.

ఇదంతా విజయవంతంగా అధిగమించాక, కోరికలను కనుగొనడం, వాటిని తీసివేయడం, వదిలించుకోవడం ఇదంతా చేశాక కూడా అది ఒక నకారాత్మకమైన కార్యమే చేసినట్లు అవుతుంది.

బుద్ధుడు ఇలా చెప్పాడు లేదా ఇలా చెప్పేలా చేశారు, కోరికలన్నింటినుండి స్వేచ్ఛ పొందాక మాత్రమే అనంతమైన ఆనందం లోకి మనం ప్రవేశించగలం. అలాంటి ఆనందం అంత రసాత్మకంగా ఏమి ఉండదు, ఏదేమైనా ఇది అంతా త్వరితమైన మార్గమైతే కాదు అని నాకనిపిస్తోంది.

ఒకవేళ మనం ఈ సమస్యని దేహపరంగా ఎదుర్కోవలసి వస్తే ధైర్యంగా దృఢ సంకల్పంతో అందులోకి దూకడమే, దీర్ఘమైన, ప్రయాసతోకూడిన, బాధతో కూడుకున్న, నిరాశా పూరితమైన ఈ కోరికల వేట సాగించేకంటే, తనని తాను సరళంగా, సంపూర్ణంగా, బేషరతుగా ఆ పరమ సత్యానికి, ఆ పరమేచ్ఛకు, పరాత్పర అస్తిత్వానికి, తనని తాను సంపూర్ణంగా ఆయన చేతులలో ఉంచి, తన సర్వ అస్తిత్వంతో, తనలోని సర్వ అంశాలతో ఒక కెరటంలా పైకి ఎగసి, ఏమాత్రం లెక్కలు వేసుకోకుండా ఉన్నప్పుడు, అది అహంనుండి స్వేచ్ఛ ఉనికి పొందడానికి త్వరితమైన, విప్లవాత్మకమైన మార్గం అవుతుంది. ఇది కష్టమైన మార్గమని అందరూ అంటారు, అయినప్పటికీ ఇందులో కొంత ఆర్ద్రత ఉంది, శ్రద్ధ ఉంది, ఒక ఉత్సాహం, ఒక కాంతి, ఒక సౌందర్యం, ఒక సృజనాత్మకమైన, విధేయమైన జీవితం ఉంది.

కోరికలే లేనప్పుడు అహంకారాన్ని నిలిపి ఉంచడానికి ఇంకేమి లేనట్టే, అంటే చైతన్యం ఘనతరంగా మారి అహం పొడిపొడి అయిపోయి దుమ్ములో కలిసిపోతుంది, మనలో కొంత భాగం ఆ దుమ్ములో కలిసిపోతుంది అనుకుంటాం, అంతానశించి పోవడమే శుద్ధమైన సరళమైన నిర్వాణంలోకి ప్రవేశించడం అని మనం అనుకుంటాం. కానీ మన దృష్టిలో నిర్వాణమంటే అహంకారం పరమాత్మయొక్క వైభవోపేతమైన ప్రకాశంలో కలిసిపోవడమే. దీనినే నేను సకారాత్మక మార్గమని అంటున్నాను, అంటే తనను తాను పూర్తిగా సమర్పించుకోవడం, ఆ సమర్పణ సంపూర్ణమై, సమగ్రమైనదై ఎటువంటి బేరసారాలు, దాచి ఉంచుకోవడాలు లేనిదై ఉండాలి.

తనను గూర్చి ఆలోచించక, తన కోసం జీవించక, తనను గురించి తాను చెప్పుకొనక, ఏదైతే పరమ సౌందర్యమో, ప్రకాశమో, ఆనందమో, శక్తిమంతమో, కరుణాపూరితమో, ఆనంతమో దానినే చింతిస్తూ ఉండడం అనే ఒక్క పని చేయడం జరిగితే, అందులో ఎంతో లోతైన అనుపమానమైన ఆనందం దొరుకుతుంది.

ఇది మాత్రమే మనం తలపెట్టవలసిన అత్యంత విలువైన విషయం.. మిగతాదంతా కేవలం కాలయాపన.

ఈ రెండు మార్గాల మధ్య తేడా ఏమిటంటే ఒకటి శిఖరం చేరడానికి కొండ చుట్టూ ఎన్నో మార్లు నెమ్మది నెమ్మదిగా, ప్రయాస పడుతూ, ఎన్నో ఏళ్ల పాటు తిరుగుతూ ఉండడం లాంటిది అయితే ఇంకొకటి కనుపించని రెక్కలు చాచి తిన్నగా శిఖరం పైకి ఎగరడంవంటిది.

Cwm 3 : 267-269 - *శ్రీమాత*

ఉన్నది ఒకటే మార్గం

ఉన్నది ఒకటే మార్గం, అహం అంతరించాలి, అంతే. అదే దైవం. ఎప్పుడైతే "నేను"కి బదులుగా ఇంకేమీ లేదు అని తెలుసుకున్నప్పుడు; నీకు తెలుసా, ఇది పూర్తిగా ఇలా సమంగా ఉంది. (అపారమైన, మృదువైన, ముడతలు లేకుండా ఉంది, ఏదో సూచించే సంజ్ఞ) "ఒక రకమైన ... ఇది పదాల ద్వారా కూడా వ్యక్తీకరించబడలేని, కానీ చాలా స్థిరమైన అనుభూతిని నీచ్చించినదే, నీ విచ్చించినట్లే జరుగుతుంది" (వివరించడంలో పదాలు చాలా చిన్నవిగా అయిపోతాయి). నిజమే, ఇది (శరీరం), దీనికి ఉనికి లేదు, కేవలం ఉపయోగించబడుతుంది అనే స్పష్టమైన అనుభూతిని కలిగి ఉండాలి. ఉన్నది భగవంతుడు మాత్రమే. భగవంతుడు ఇలా చేస్తాడు (ఒత్తిడి చేసే సంజ్ఞ). తత్‌ను గురించిన ఈ అనుభూతి ఈ సచేతన బృహత్తు (శ్రీమాత చేతులు చాచి)... చివరికి మీరు దీనిని తప్పక చూస్తారు ("చూడటం", ఇది చిత్రాలతో కూడిన దర్శనం కాదు, ఇది ఒక అంతర్దర్శనం దేనితోనో నాకు తెలియదు! కానీ ఇది చాలా నిర్దిష్టమైనది, చిత్రాల కంటే చాలా నిర్దిష్టమైనది), ఈ విస్తారమైన శక్తి దృష్టి, ఈ విస్తారమైన కంపనం ప్రేరేపించి, ఒత్తిడి తెచ్చి, ఒత్తిడి తెచ్చి... ఆపై దాని కింద మెలికలు తిరుగుతున్న ప్రపంచం తెరుచుకుంటుంది, తెరచుకొన్నపుడు అది ప్రవేశించి ఇంకా వ్యాపిస్తుంది.

ఇది నిజంగా ఆసక్తికరమైనది.

ఇదొక్కటే పరిష్కారం. మరొకటి లేదు. మిగిలినవన్నీ, ఆకాంక్షలు, భావనలు, అంచనాలు. అది ఇప్పటికీ అతి మానవుడు మాత్రమే, అది అతిమానసం కాదు. అది ఒక ఉన్నతమైన మానవత్వం, అది మొత్తం

మానవాళిని పైకి తీసుకువెళ్ళడానికి ప్రయత్నిస్తుంది. కానీ... దాని వల్ల ఉపయోగం లేదు, ఉపయోగం లేదు.

పురోగతిని సాధించడానికే ఉన్న ఈ మొత్తం మానవాళికి సంబంధించిన చిత్రం చాలా స్పష్టంగా ఉంది, ఎగబ్రాకడానికి గట్టిగా అలా పట్టుకోవాలని కోరుకుంటుంది, కానీ తనకు తాను ఇచ్చివేసుకోవాలనుకోవడం లేదు. తీసుకోవాలనుకుంటుంది! కానీ అది అలా జరుగదు. తనతో తాను పని లేకుండా చేసుకోవాలి. అప్పుడు అనుకున్నది రాగలిగి దాని స్థానాన్ని అది పొందగలుగుతుంది.

మొత్తం రహస్యం అక్కడ ఉంది. ఉదాహరణకు, ఈ వైపు మానవజాతి బలవంతంగా అన్నింటిని తీసుకోవాలనుకుని వాటిని లాక్కోవాలనుకొంటుంది. (నుదురు సమాన ఎత్తులో సూచించే సంజ్ఞ)... ఇది ఎంతో ఆసక్తికరంగా ఉంది. ఎంతో, కానీ ఇది అది కాదు! అది కాదు. ఈ అవకాశాలన్నీ తరిగి పోవాలి తద్వారా మానవ జాతిలో ఉన్నదేదో కొంత అర్థం చేసుకోగలు గుతుంది.... (శ్రీమాత సంజ్ఞగా తన చేతులు తెరుస్తుంది) ఆపై తననుతాను అదృశ్యమయ్యే వరకు సర్వ సమర్పణ చేయాలి. నిజానికి, చాలా కష్టమైన విషయం: ఇలా అదృశ్యం అయ్యేలా చేసుకోవడాన్ని నేర్చుకోవడం.

CWM 11:215-16

ప్ర: శ్రీమాత, మేం ప్రయత్నం చేసినప్పుడు, మాలో ఏదో ఉంటుంది, అది చాలా ఆత్మ తృప్తిని, గర్వాన్ని అలాగే ఈ ప్రయత్నంతోనే సంతృప్తినిస్తుంది, కానీ అది ప్రతిదాన్ని పాడు చేస్తుంది. అలాంటప్పుడు మేం దీని నుండి ఎలా బయటపడగలం?

ఆహ్, అది ఏమి చేస్తుందో దానిని చూసేదేదో అది! తాను ఏదైనా చేస్తున్నప్పుడు చేసేదానిని గమనిస్తూనే ఒకడు ఉంటాడు. అది చూచి కొన్ని వేళల అతను గర్వపడతాడు. సహజంగానే, ఇది కృషి నుండి చాలా బలాన్ని తీసి వేస్తుంది. అలా బలాన్ని తీసివేసేది, పని చేసేటపుడు తనవంక తాను చూచుకోవడం, జీవించేటపుడు తనవంక తాను చూచుకోవడం అనే అలవాటు అని నేననుకొంటున్నాను. తనను తాను గమనించుకోవడం చాలా అవసరమే, కానీ చేసే పనిలో పూర్తిగా నిజాయితీతో అన్యప్రేరణ లేకుండా, చాలా సహజంగా ఉండటానికి ప్రయత్నించడం ఇంకా అవసరమని నేను

భావిస్తున్నాను: ఎప్పుడూ తనను తాను గమనిస్తూ, ఏమి చేస్తున్నాడో చూడటం, తనను తాను పరిశీలించుకోవడం అనేది చేయకూడదు - కొన్నిసార్లు తనను పరిశీలించుకోవడం కఠినంగా ఉంటుంది. అలాగే తనకు తాను సంతృప్తి పడి తనకు తాను భుజం తట్టుకోవడం అంతే తప్పు రెండు ఒకటే మాదిరి చెడ్డ పనులు. ఒక వ్యక్తి తన ఆకాంక్షలో చాలా నిజాయితీగా ఉండాలి, అతను ఆకాంక్షిస్తున్నాడని అతనికి కూడా తెలియకూడదు, ఆవిధంగా అతనే ఆకాంక్ష కాగలడు. ఇది నిజంగా గ్రహించగలిగినప్పుడు, ఒక వ్యక్తి నిజంగా అసాధారణమైన శక్తిని పొందుతాడు.

ఒక్క నిమిషం, దీనికి సంబంధించి ఒక నిమిషం, అలా చేయగలిగితే మీరు అనేక సంవత్సరాల సాక్షాత్కారాన్ని సిద్ధం చేయవచ్చు. ఒక వ్యక్తి ఇకపై స్వార్థ పూరితుడు కానప్పుడు, తనని తాను చూచుకునే అహంకారం లేనప్పుడు, తానే స్వయంగా చేసే పనిగా మారినప్పుడు, అన్నింటికంటే మించి ఆకాంక్షతో ఉంటే, ఇది నిజంగా చాలా మంచిది. ఆకాంక్షించే వ్యక్తి ఇక లేనప్పుడు, అది పూర్తిగా ఏకాగ్రతతో కూడిన ప్రేరణతో దూసుకుపోయే ఆకాంక్ష అయినప్పుడు, అది నిజంగా చాలా దూరం వెళుతుంది.. అది అలాంటిది కాకపోతే దానిలో ఎప్పుడూ కొంచెం దర్పం, కొంచెం ఆత్మసంతృప్తి, కొంచెం తన పై జాలి, రకరకాల చిన్నచిన్నవి వచ్చి అంతటిని పాడుచేస్తూ ఉంటాయి. కానీ అది కష్టం.

CWM 6:402

ప్ర: తాను లేనని, ఉన్నది పరమాత్మ మాత్రమే అని భావించడానికి ప్రయత్నిస్తే, అహం నుండి

బయటపడగలమా?

తాను లేకపోవడమా ? - దీనిలో మానసికంగా ప్రయత్నించి విజయం సాధించగలరో లేదో నాకు తెలియదు, ఎందుకంటే ఇది ఒక రకమైన మానసిక ప్రయత్నమే. కాబట్టి మానసిక ఊహా కట్టడాలు చేసుకున్నప్పటికి పెద్దగా ఏమీ సాధించలేరు, మనకు అవసరమైనది అన్య ప్రేరణ లేనటువంటిది సిద్ధమైనది, తీక్షణమైనది, వ్యక్తిలో మండుతున్నటువంటి అగ్ని, ఆకాంక్షాగ్ని, ఏదో... ఎలా చెప్పాలో నాకు తెలియదు. ఇదంతా బుర్రలో నడుస్తుంటే ఒరిగేదేమీ లేదు.

CMM 6: 138 - *ది మదర్*

అహం రహిత స్థితి

శ్రీమాత అతి ముఖ్యమైన కార్యాన్ని నిర్వర్తించవలసి వుంది, అందుకామెకు అతి తక్కువ సమయమే వుంది, కానీ మనుష్యులు అప్రయోజకప్రశ్నలతో తరచుగా ఆమె కాలాన్ని వృధాచెస్తున్నారు, అని ఒక శిష్యుడు ఆరోపించాడు, దానికి శ్రీమాత ఇలా అన్నారు.

అది ఆలాగే వుండాలి, అది అలా వుంది గనుక.

బహుశ ఇది ఒక పాఠం (ఇది ఒక సూచన), కానీ దీనికి ఒక ప్రయోజనమున్నది. అది నేను అర్థం చేసుకోవలసిన పాఠం, అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాను. సహనంగా వుండటం నేర్చుకుంటున్నాను, ఓహ్! అటువంటి ఒక సహనం..... అక్కడ ఎప్పటికీ తిరుగుబాటులు, అవమానాలు సమస్తం వుంటాయి. నాకు అది పూర్తిగా శూన్యాంకం, కొన్నిసార్లు అది వినోదం కూడ. నేను నా స్వీయస్థితిలో వున్నపుడు, నిజమైన కారుణ్యంతో వున్నపుడు అది దేనిని మార్చదు, అది ఉపరితలంలో కనీసం ఒక చిన్న తరంగాన్ని కూడ లేపదు, ఏదీ వుండదు.

నిన్నటి రోజున నన్ను ఈ ప్రశ్న అడిగారు. ఒకవేళ అవమానం, లేదా అవమానించబడిన భావన, దేనినైతే మనం 'ఆత్మగౌరవం' అంటామో (ఫ్రెంచ్ భాషలో అమోర్-ప్రోప్రె) దానికి సాధనలో ఎటువంటి స్థానమైనా వున్నదా.

దానికి స్థానం లేదు అన్నది బాగా అర్థంచేసుకోబడింది ! కానీ నేను ఒక చలనం చూశాను, అది స్పష్టంగా వుంది, దానిని నేను అహం లేకుండా చూశాను, అహం లేనపుడు అక్కడ అస్తిత్వంలో ఈ విధమైన కల్లోలం వుండదు. ఎందుకంటే నేను దానిని ఇంకా అనుభూతిచెందుతున్న ఎంతో దూరంలోని గతంలోకి (చాలా సంవత్సరాల క్రిందటి) వెళ్ళాను , అది ఇప్పుడు పరాయిదిగా, అసాధ్యంగా వుండటంలేదు. మొత్తం అస్తిత్వము, భౌతిక నిర్మాణము కూడ దాని అర్థం ఏమిటో అవగాహనచేసుకోలేదు. అక్కడ భౌతికంగా ఒక అఘాతం వున్నపుడు అది ఇలాగ వుంటుంది (మదర్ తన మోచెయ్యి మీద ఒక గాయం చూపారు), ఉదాహరణకు ఇలా దానిని ఎప్పటికీ ఒక దెబ్బలాగ అనుభూతి చెందుతారు. చాలామటుకు అక్కడ ఏదీ వుండదు, మొత్తానికి అది గమనింపు లేకుండానే వెళ్ళిపోతుంది. కానీ ఏదైనా అనుభూతి

వుంటే అది కేవలం చిహ్నం మాత్రమే- అది తనను అనుభూతి చెందింప జేయడాన్ని కోరుకునే ఒక సహాయానికి చెందిన ఒక సౌమ్యమైన, ఆంతరంగిక చిహ్నం, అది నేర్చుకోవలసిన ఒక పాఠం. అంతేతప్ప ఎప్పటికీ ఒక పెంకెతన మున్న మానసిక విధానంలో చేసేది కాదు. ఇది అది కాదు, ఇది అస్తిత్వంలో తక్షణమే జరిగే ఒక విధమైన అర్పణ, ఇది నేర్చుకోవడానికి తనను తాను ఇచ్చుకుంటుంది. నేను మాట్లాడుతున్నది కణాల గురించి. అది చాలా ఆసక్తికరమైనది. దీనిని స్పష్టంగా మానసిక భాషలో చెప్పాలంటే ఇది సకల వస్తువులలో వుండే దివ్య ఉనికికి చెందిన అనుభూతి లేదా చైతన్యం అని చెప్పాలి-స్పృశించే తీరు-నువ్వు ఏ స్థితిలో వున్నావో దాని నుండి ఉత్పన్నమైనది.

అవును, అది దేహం అనుభవం.

వ్యక్తులలో ఎటువంటి గాఢముద్ర లేదా అఘాతం వుంటే అది కేవలం అహానికి చెందిన ఒక స్పష్టమైన దృష్టిగా గ్రహించవచ్చు- అది తనను తాను అభివ్యక్తం చేసే అహం. " అది ఇంకొకటి" అని వారంటారు కానీ," అది కోపం" లేదా " ఇది......"- అని నేనను, కాదు అది అతని అహం, అహం కూడ కాదు: అది అహం సిద్ధాంతం- ఇంకా జోక్యం చేసుకునే అహం సిద్ధాంతం. నాకు అహం అన్నది ఒక విధమైన నిర్వ్యక్తిక ఉనికి గనుక అది చాలా ఆసక్తిగా వుంటుంది, ఇతరులకు ఇది అతని వ్యక్తిత్వపు నిశితజ్ఞానం! దానికి బదులు అది జీవనపు ఒక విధానం (ఐహికం లేదా మానవీయ అని చెప్పవచ్చు), ఇది వ్యక్తిత్వమనే భ్రమను కల్పిస్తూ, కొద్దో గొప్పో పరిమాణంలో ఇక్కడ లేదా అక్కడ వుంది. ఇది చాలా అసక్తికరమైనది.

- శ్రీమాత

ఒకవేళ దానిని నువ్వు పనిచేయనిస్తే, ప్రతిచోట ఒక దివ్యచైతన్యము, ఒక దివ్య అనుగ్రహము వున్నాయి, అవి ప్రతిదీ సజావుగా నడిచేట్లుగా చేస్తాయి, కేవలం ఈ దుర్బలత వల్లనే సమస్తము తప్పుగా సాగుతుంది- ఇది వింతైన విషయం ! అహం-కేంద్రంగా కల దౌర్బల్యం.

CWM 11:207

- శ్రీమాత

Vol. 53, No. 9
September 2023


Date of Publication
1st September 2023

Registered: PY/41/2021-23

AKHILA - Akhila Bharata Patrika (Telugu)

Registered with the Registrar of Newspapers for India: No. 23593/72 (monthly)

Matter shall reveal the Spirit's face. — Sri Aurobindo



Flower name:

Power of Aspiration

(Spiritual name of the Flower given by the Mother)

Owner: Sri Aurobindo Society
Printer: Swadhin Chatterjee for Sri Aurobindo Ashram press
Publisher: Pradeep Narang for Sri Aurobindo Society
Published from: Society House, 11 Saint Martin Street, Puducherry - 605001
Printed from: Sri Aurobindo Ashram Press,
No. 38, Goubert Avenue, Puducherry - 605 001, India
Editor: K. V. Rao

Single copy Rs. 30 **Annual Subscription Rs. 200 (in India)**

A Monthly Published by

SRI AUROBINDO SOCIETY-605001

అఖిల

అఖిల భారత పత్రిక


అక్టోబర్ 2023

India saw from the beginning, — and, even in her ages of reason....

If India is to survive, she must be made young again. Rushing and billowing streams of energy must be poured into her; her soul must become, as it was in the old times, like the surges, vast, puissant, calm or turbulent at will, an ocean of action or of force.

India of the ages is not dead nor has she spoken her last creative word; she lives and has still something to do for herself and the human peoples....

వందేమాతర



This is an hour in which, for India as for the world ...

Mother India is not a piece of earth; she is a Power, a Godhead...

So with India rests the future of the world.

విషయ సూచిక

సంపాదకీయం

ప్రపంచ దృష్టిలో ఒక నూతన భారతం పునరుజ్జీవమౌతోంది. భారత పునరుజ్జీవనం ఆమె కోసం మాత్రమే గాదు, అది భువి కోసం, మానవజాతి కోసం. ఇది సంభవించడానికి, తన కార్యాన్ని సఫలం చేయడానికి, తొట్టతొలుత ఆమె తనను తాను ఆవిష్కరించుకోవాలి. తన వివేకవంతమైన, మహాబలీయమైన అధ్యాత్మలోనికి లోతుగా మునక వేయాలి. మునక వేసి, తనను ప్రపంచాన్ని తిరిగి శక్తివంతం చేయడానికి తన అపార ఆధ్యాత్మిక శక్తి మూలాల నుండి బలాన్ని పొందాలి. భారతమాత అంతరాత్మకు ఈ సంచికనంకితం చేసాం.

అనువాదం : కె.వి. రావు



భారత దేశ ఆత్మ అభిన్నం, అవిభాజ్యం, ప్రపంచంలో తన కర్తవ్య కర్మకు భారతదేశం ఎరుక కలిగి ఉంది. అభివ్యక్తతకై ఆమె బాహ్య సాధనాల కోసం నిరీక్షిస్తున్నది.

CWM 13:351 — శ్రీమాత

భారతమాత

ప్రార్థన

15 ఆగష్టు 1947

ఓ, మా మాతా, ఓ భారతావని ఆత్మా, కుంగుబాటుతో కూడిన అత్యంత చీకటి రోజులలో కూడా, నీ వాక్కు నుంచి దూరంగా మరలిపోయి, ఇతర ప్రభువులను సేవిస్తూ, నిన్ను ఖండించినప్పటికీ కూడా, ఎన్నడూ నీ పిల్లలను విడిచిపెట్టని ఓ మాతా, ఇప్పుడు నీ విమోచన ఉషోదయం వెలుగు నీ ముఖం మీద కాంతులీనుతున్నది, ఇటువంటి మహత్తరమైన ఘడియలో మేము నీకు వందనం చేస్తున్నాము. మా ముందు వెల్లడవుతున్న స్వతంత్ర వినీలాకాశం భవిష్యత్తులో కూడా వినీలాకాశంగా, దేశాల సమాఖ్యలో నీ నిజజీవనంగా ఉండే విధంగా మాకు మార్గదర్శనం చేయి. మేము ఎల్లప్పుడూ మహత్వ పూర్ణమైన ఆదర్శాలవైపే ఉండి పోవాలని, మానవులకు నిజమైన నీ వైఖరినీ, ఆత్మశక్తినీ జీవన స్రవంతిలో ఒక నాయకత్వ పాత్రనూ, ప్రజలందరకూ ఒక స్నేహితుడినీ, ఒక సహాయకుడినీ చూపించేటట్లుగా మాకు మార్గదర్శనం చేయి.

CWM 13:352

భవానిగా మాత

అమ్మ భవాని ఎవరు? ఆమెకు మనం గుడి ఎందుకు కట్టాలి?

విశ్వం యొక్క అంతులేని కాల చక్రంలో, దాని గతులలో శాశ్వతుని చక్రం బ్రహ్మాండంగా తిరుగుతూ ఉండగా, అనంతశక్తి శాశ్వతుని నుంచి బయటకు వచ్చి, చక్రమును కార్యోన్ముఖం గావిస్తుంది, మనిషి దృష్టికి అనేక దృక్పథాలతో, అనంత రూపాలతో బహుదూరాన అస్పష్టంగా గోచరిస్తుంది. ప్రతి దృక్పథమూ సృష్టిని చేసి, ఒక యుగ చిహ్నామవుతుంది. ఒక్కొక్కప్పుడు ఆమె దివ్య ప్రేమ, ఒక్కొక్కప్పుడు ఆమె దివ్యజ్ఞానం, ఒక్కొక్కప్పుడు ఆమె దివ్య విరాగి, ఒక్కొక్కప్పుడు ఆమె దివ్య కృప. భవాని అనంత మహాశక్తి. ఆమె మహాదుర్గ, మహాకాళి, ప్రియతమ రాధ ఆమె, ఆమె మహాలక్ష్మి. ఆమె మన దివ్యజనని, మనందరి మహా సృష్టికారిణి.

ఈ యుగంలో దివ్యజనని దారుఢ్యమాతగా అభివ్యక్తమయింది. ఆమె పరిశుద్ధ మహాశక్తి.

అమ్మ మహాశక్తిగా

కాని భారత దేశంలో శ్వాస నెమ్మదిగా కదులుతుంది. దైవప్రేరణతో కలిగే ఉద్రేకం రావటానికి దీర్ఘకాలం పడుతుంది. ఈ భారతదేశం, (భారత)మాత, పురాతనం. వాస్తవంగా ఆమె తిరిగి ప్రభవించటానికి ప్రయాసపడుతున్నది. వేదనతో, కన్నీళ్ళతో ఆమె శ్రమిస్తున్నది, కాని ఆమె శ్రమ వ్యర్థం. అంత బ్రహ్మాండమైన, అంత శక్తిమంతమైన తల్లిని నొప్పించే దేమిటి? కచ్చితంగా మనలో ఏదో బ్రహ్మాండమైన లోపం ఉండి ఉంటుంది, ఏదో ప్రాణికశక్తి కొరత మనలో ఉండి ఉంటుంది లేదా మనలో ఏదో దానిమీద వేలుపెట్టలేనంత దుస్సాధ్యమైనదైనా అయ్యుండాలి. మిగిలినవన్నీ ఉన్నాయి మనకు, కాని శక్తిలో మనం నిర్వీర్యులం, సామర్థ్య శూన్యులం. మనం మహాశక్తిని వదిలేశాం, కాబట్టి మహా శక్తి మనలను త్యజించింది. దివ్యజనని మన హృదయాలలో, మన బుర్రలలో, మన బాహువులలో లేదు.

తిరిగి జన్మించాలనే అభీష్టం మనలో ఇను మిక్కిలిగా (సమృద్ధిగా) ఉంది, దానికిక్కడ లోటేమీ లేదు. మతంలోను, సమాజంలోను, రాజకీయంలోను, ఎన్ని ప్రయత్నాలు చేయబడ్డాయి, ఎన్ని ఉద్యమాలు మొదలు పెట్టబడ్డాయి? కానీ అదే విధి వాటిని పైగొన్నది లేదా పైగొనటానికి సంసిద్ధమవుతున్నది. వారు ఒక సమయం వరకు చురుకుగా ఉంటారు, తరువాత ప్రేరణ సన్నగిల్లుతుంది, అగ్ని చల్లబడి పోతుంది, ఒకవేళ వారు సహనంతో కొనసాగితే, అది కేవలం వట్టి ఆల్చిప్పలుగా మాత్రమే, రూపాలలోనుంచి బ్రహ్మదేవుడు తరలిపోయాడు లేక అవి తమస్సుతో అణగ దొక్కబడి, అచేతనా స్థితికి చేరుకున్నాయి. మన ప్రారంభాలు బ్రహ్మాండంగా ఉంటాయి, కాని వాటికి కొనసాగింపుకాని, ప్రయోజనంకాని ఉండదు.

మనం బాగా లోతుగా చూస్తే మనకి మరింతగా అర్థమయ్యే విషయం, ఒక లోపం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది, అన్నింటికంటే ముందుగా మనం శ్రమించవలసింది శక్తి కోసం, భౌతికశక్తి, మానసిక శక్తి, నైతిక శక్తి, కాని అన్నింటినీ మించి ఆధ్యాత్మికశక్తి, అది అన్నింటికంటే తరగని, నశించని మూలాధారం.

మనకు శక్తి గనుక ఉంటే, తక్కినవన్నీ దానికి తేలికగానే అప్రయత్నంగానే చేర్చబడతాయి. శక్తి శూన్యులమైతే మనం స్వప్నంలో వలె చేతులున్నా పట్టుకోలేం లేదా కొట్టలేం, కాళ్ళుండి పరిగెత్తలేం.

లక్షలాదుల మహాశక్తి

నిజానికి దేశం అంటే ఏమిటి? మన మాతృదేశం అంటే ఏమిటి? అది ఒక మట్టి ముద్ద మాత్రమే కాదు లేక అతిశయోక్తిగా చెప్పేదేమో కాదు లేక మనోకల్పన కాదు. ఏవిధంగా అయితే లక్షలాది దేవతా మహాశక్తులన్నీ ఒకే ఒక్క శక్తి సముదాయంగా తయారయినప్పుడు దాని నుండి భవాని మహిష - మర్దినిగా ఒక అస్తిత్వంగా ఆవిర్భవించి ఏకమొత్తంగా ఐక్యమైందో, అదేవిధంగా అది ఒక బ్రహ్మాండమైన మహాశక్తి, లక్షల మహాశక్తుల అంశలన్నింటితో దేశమైంది. ఆ మహాశక్తిని మనం భారత దేశం అంటాం, భవాని భారతి 30 కోట్ల జనుల మహాశక్తుల సజీవమైనటువంటి ఏకత్వం. కాని ఆమె స్తబ్దతతో క్రియారహితంగా ఉంది. తమస్సు యొక్క ఇంద్రజాల చక్రంలో, తనకు తాను జడత్వంలో కూరుకుపోయి తృప్తిపడటంలో, ఆమె పుత్రుల అజ్ఞానంలో బందీగా ఉంది. ఆ జడత్వాన్ని వదిలించుకోవటానికి మనలోనున్న బ్రహ్మను మేల్కొల్పటం తప్ప మరోమార్గం లేదు.

భారతదేశం నశించదు, మన జాతి నామరూపాలు లేకుండా పోదు, కారణం మానవజాతిలోని అన్ని విభాగాలల్లో భారతదేశానికి మాత్రమే ఉత్కృష్టమైన, అత్యంత వైభవోపేతమైన భవితవ్యం, మానవజాతికి అత్యంత ఆవశ్యకమైన భవిష్యత్తు నిర్దేశించబడింది. ప్రపంచం మొత్తానికి భవిష్య మతమును, అన్నిమతాలను, విజ్ఞాన శాస్త్రాన్ని, వేదాంతాలను సామరస్యపరచి, మానవ జాతినంతా ఒక ఆత్మగా చేసే శాశ్వత మతమును తన నుంచి తప్పక బయటకు పంపించవలసినది ఆమెయే. నైతిక పరిధిలోను, అటువంటివే అయిన వాటిలోను, మానవజాతినుంచి ఆటవికతను (మ్లేచ్ఛత్వాన్ని) లేకుండా చేసి, ప్రపంచమును ఆర్యీకరణం కావించటానికే విధి నిర్ణయించిన విధాయకమైన కర్మ ఆమెది. దీనిని చేయటానికి మొదట ఆమె తప్పక తనను తాను పునఃఆర్యీకరణం కావించుకోవాలి.

CWSA 6:79-84

నీవు అడిగావు కదా, భవాని మాత ఎవరని, ఆమె తనకుతానే సమాధానమిస్తున్నది. "నేను శాశ్వతం నుంచి ప్రపంచంలో (విశ్వంలో) ప్రవహిస్తూ, మీలో శాశ్వతంగా ఉన్న అనంత మహాశక్తిని, నేనే విశ్వానికి దివ్యమాతను, లోకాలకు దివ్యమాతను. మహా పవిత్రమైన భూమి ఆర్యభూమి బిడ్డలు మీరు. ఆమె మట్టి నుంచే తయారు చేయబడిన, ఆమె సూర్యుని చేత, గాలుల చేత పెంచి పోషించబడిన మీకు నేను భవాని భారతిని, భారతమాతను".

తరువాత నీవు మేము భవాని మాతకు గుడి ఎందుకు కట్టాలని అడిగేటట్లైతే, ఆ తల్లి సమాధానం,

"ఎందుకంటే నేను దానిని ఆజ్ఞాపించాను, ఎందుకంటే దానిని భవిష్య మతానికి కేంద్రంగా చేయడం ద్వారా మీరు శాశ్వతం యొక్క తక్షణ ఇచ్ఛను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళ్ళిన వారవుతారు, మీలో యోగ్యతను సమకూర్చుకున్న వారవుతారు. అది మిమ్ములను ఈ జీవితంలో శక్తిమంతులుగాను, మరు జన్మలో గొప్పవారి గాను చేస్తుంది. మీరు ఒక జాతిని సృష్టించడానికి, ఒక యుగాన్ని మదింపు చేయడానికి, ప్రపంచాన్ని ఆర్యీకరణం చేయడానికి సహాయపడిన వారవుతారు. ఆ జాతి మీ సొంతం, ఆ యుగం మీది, మీ సంతానముది, ఆ భూమి కేవలం సముద్రాలు, కొండలు హద్దులుగా గల ఒక భూఖండం మాత్రమే కాదు, ఆమె యొక్క లక్షల ప్రజానీకంతో నిండి పోయిన మొత్తం భూమి అది".

తెలిసింది కదా, ఇప్పుడు వచ్చి దివ్యమాత పిలుపును ఆలకించండి. అభివ్యక్తమవటానికి ఇప్పటికే ఆమె మన హృదయాలలో నిరీక్షిస్తున్నది, ఆరాధించ బడటానికి నిరీక్షిస్తున్నది.

మన నిష్క్రియతకు కారణం మనలోని పరమేశ్వరుడు తమస్సుచే కప్పబడి మరుగున ఉన్నాడు. ఆమె మందకొడితనంతో ఆయన ఇబ్బందికి లోనవుతున్నాడు, విషణ్ణుడై ఉన్నాడు. కారణం ఆమె సంతానం సహాయానికై ఆమెను ప్రార్థించడం లేదు. ఎవరైతే ఆమె ప్రేరేపణలతో ఆమె కదలికల అనుభూతిని మీలో పొందుతున్నారో, వారందరూ మీలోని ఆ అజ్ఞానపు ముసుగును విసరివేయుండి, సోమరితనమనే బందిఖానా గోడలను

పగులగొట్టండి, మీకు ప్రేరేపణ అనుభూతి కలిగితే, మీ శరీరాలలో లేదా మీమేధస్సుతో లేదా మీవాక్కుతో లేదా మీ సంపదతో లేదా మీ ప్రార్థనతో, ఆరాధనతో, ప్రతి మనిషి అతడికున్న సామర్థ్యాన్ని బట్టి ఆమెకు సహాయం చేయండి. వెనక్కి మరలిపోవద్దు. ఎవరైతే ఆమెచే పిలవబడి, ఆమె మాట పెడ చెవిన పెట్టారో వారికి వ్యతిరేకంగా ఆమె వచ్చేరోజు ఆమె అత్యంత ఆగ్రహంతో ఉంటుంది. కాని ఎవరైతే ఆమె ఆగమనానికి కొంచెమైనా సహాయం చేస్తే, అప్పుడు సౌందర్యంతో, కారుణ్యంతో వారి దివ్యమాత వదనం ఎంతగా తేజోమయంగా వెలుగు లీనుతుంటుందో కదా!

CWSA 6:89

*

భారత దేశ భవిష్యత్తు చాలా సుస్పష్టం, భారత దేశం ప్రపంచానికి గురువు, భవిష్య ప్రపంచ నిర్మాణం భారతదేశం మీద ఆధారపడి ఉంది. భారత దేశం సజీవమైన ఆత్మ, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని భారత దేశం ప్రపంచంలో అవతరింపజేస్తున్నది. భారత దేశ ప్రభుత్వం భారతదేశ ఈ ప్రాధాన్యతను తప్పక గుర్తించి, ఈ రంగంలో వారి కార్యప్రణాళికను దానికి అనుగుణంగా ఏర్పరచుకోవాలి.

CWM 13:353 శ్రీమాత


*

భారతదేశం ఆధునిక మానవజాతి అన్ని కష్టాలకు ప్రతీకాత్మక ప్రతినిధిగా మారింది.

భారతదేశం దాని పునరుత్థాన భూమి అవుతుంది. ఉన్నతమైన, నిజమైన జీవితానికి పునరుత్థానం.

CWM 13:368 శ్రీమాత

ఓ భారతమాత మేలుకో



ఇది ప్రపంచమంతటికి ఎలాగో భారతదేశానికి కూడా భవిష్య భవితవ్యం, ఒక శతాబ్దివైపుకు దాని అడుగులు మళ్ళించబడటానికి శక్తిమంతంగా నిశ్చయించబడిన సమయం. ఇదేమీ సాధారణమైన శతాబ్దికాదు. కాని అది దానికదే గొప్ప మలుపు, మానవ జాతి అంతరంగ బాహ్యాచరిత్రలో బ్రహ్మాండమైన క్రిందుమీదైన మలుపు. మనమిప్పుడు ఎంతగా కార్యోన్ముఖులమైతే, అంతగా మనం చేసే కర్మకు బహుమాన ప్రాప్తికై యోగ్యత నిర్ధారించబడుతుంది. ఇటువంటి తరుణంలో ఈ విధమైన ప్రతిఒక్క పిలుపు తక్షణమే మన ప్రజల సామర్థ్యానికి ఇవ్వజూపిన ఒక అవకాశము, ఒక ఎంపిక, ఒక పరీక్ష ఇప్పుడిక చెప్పగలిగినదేమంటే, అది ప్రతి ఒక్కరిలోను, వారి అస్తిత్వ సంపూర్ణ ఔన్నత్యంపైన అధిష్టించింది, దానికి అనుకూలంగా మహాభవితవ్య దివ్యప్రభువు యొక్క ప్రత్యక్ష జోక్యానికి పాత్రమయింది'

CWSA 1: 413

నిజమైన సమస్య

నిజమైన సమస్య మనలోనే ఉంది, మన చుట్టూ ఉన్న పరిసరాల్లోనూ పరిస్థితుల్లోనూ కాదు. మనుషులు అజేయంగా మారడానికి మూడు విషయాలు అవసరం. అవి సంకల్పం, పనిమీద దాని ఫలితం మీద నిరాసక్తత, విశ్వాసం. మనల్ని మనం విముక్తి చేసుకోవాలనే సంకల్పం మనకు ఉండవచ్చు, కానీ తగినంత విశ్వాసం లోపించవచ్చు. అత్యుత్తమ ముక్తిని చేరుకోగలమనే విశ్వాసం మనకు ఉండొచ్చు, కానీ దానికి అవసరమైన మార్గాలను ఉపయోగించాలనే సంకల్పం లోపించవచ్చు. సంకల్పమూ, విశ్వాసమూ ఉంటే మనం వాటిని మన పనికి సంబంధించిన ఫలంతో తీవ్రతర అనుబంధం, ద్వేషం, గుడ్డి ఉత్సాహం, తొందరపాటుగా పని చేయడంలో ఉపయోగిస్తాము. అప్పుడు అవి చెడు ప్రతిచర్యలకు దారితీయవచ్చు. ఈ కారణంగా, పని పరిమితులలో అపూర్వమైన అడ్డంకులను అధిగమించడానికి, మనసుకు శరీరానికి పైన ఉన్న ఉన్నత శక్తిని ఆశ్రయించడం అవసరం. ఇదే సాధన అవసరం.

సర్వశక్తిమంతుడు, సర్వవ్యాపి, సర్వజ్ఞుడైన భగవంతుడు మనలోనే ఉన్నాడు. మనం, ఆయన ఒకటే తత్వాన్ని కలిగి ఉన్నాము. మనం భగవంతునితో సన్నిహితంగా ఉండి, మనల్ని మనం ఆయన చేతుల్లోకి అప్పగిస్తే, ఆయన తన స్వంత శక్తిని మనలో కురిపిస్తాడు. అప్పుడు భగవంతుని సర్వశక్తతలో సర్వవ్యాపకతలో, సర్వజ్ఞతలో మనకు కూడా భాగం ఉందని గ్రహిస్తాము. దానికి మార్గం చాలా పొడవుగా ఉంది, కానీ స్వీయ- సమర్పణ దానిని తగ్గించేస్తుంది. ఆ మార్గం కష్టతరమే కానీ పరిపూర్ణ విశ్వాసం దానిని సులభతరం చేస్తుంది.

సంకల్పం సర్వశక్తిమంతమైనది, కానీ అది దైవ సంకల్పమై నిస్వార్థమై, కలవరం లేనిదిగా ఉండాలి. ఇంకా ఫలితాల గురించి ఏ విధమైన ఆలోచన లేకుండా ఉండాలి. "మీకు ఆవ గింజంత విశ్వాసం ఉంటే, మీరు ఈ పర్వతాన్ని రా అంటే అది మీ దగ్గరకు వస్తుంది" అని యేసు చెప్పాడు. నిజమైన సంకల్పం, పరిపూర్ణ శ్రద్ధల సమ్మేళనమే విశ్వాసం. శ్రద్ధ, కారణాన్ని వెతకదు, అది భగవంతుని సంకల్పాలను స్పష్టంగా చూడగలదు, తెలుసుకోగలదు. ఆ సంకల్పాలు ఖచ్చితంగా జరుగుతాయని దానికి తెలుసు. శ్రద్ధ, గుడ్డిది కాదు, ఆధ్యాత్మిక దృష్టిని ఉపయోగించడం వల్ల సర్వజ్ఞతను తెలుసుకోగలదు.

సంకల్పం కూడా సర్వవ్యాప్తమై ఉంటుంది. అది ఎవరితో సంబంధంలోకి వస్తుందో వారికి తన శక్తి, ఆలోచన, ఉత్సాహాలలో కొంత భాగాన్ని తాత్కాలికంగా కానీ శాశ్వతంగా కానీ అందించగలదు. ఒంటరి మనిషి నిస్వార్థమైన నిస్సందేహమైన సంకల్పాన్ని ఉపయోగించడం ద్వారా తన ఆలోచనను ఒక దేశ ఆలోచనగా మార్చగలడు. ఒక్క వీరుని సంకల్పం కోటి పిరికి హృదయాల్లో ధైర్యాన్ని నింపగలదు.

ఇది మనం సాధించవలసిన సాధన. ఇది మన విముక్తికి నిబంధన. మనం అసంపూర్ణ సంకల్పాన్ని అసంపూర్ణ విశ్వాసంతో, అసంపూర్ణ నిరాసక్తతతో కలిపి ఉపయోగిస్తున్నాము. అయినప్పటికీ, మన ముందు ఉన్న పని పర్వతాన్ని కదిలించడం కంటే తక్కువేమీ కాదు.

దీన్ని చేయగల శక్తి కూడా ఉంది. కానీ అది మనలోని ఒక రహస్య గదిలో దాగి ఉంది. ఆ గది తాళం చెవి భగవంతుడి వద్ద ఉంది. మనం ఆయనను కనుగొని దానిని చేజిక్కించుకుందాం.

CWSA 1:536-37

గతించిన ఉదయాలు, భవిష్యత్తు మధ్యాహ్నాలు:

ప్రాచీన ఋషులు ఆలోచనకు, నాగరికతకు ప్రేరేపిత సృష్టికర్తలని, అప్పటి వీరోచిత యుగం ఒక అద్భుతం అని, ఇప్పటి మన బాధాకర వర్తమానంలో దిగజారిన మనుషుల కాలంలో అది పునరావృతం కాదని, ఈ గొప్ప, ప్రాచీన దేశ గత వైభవాల గురించి విలపిస్తూ మాట్లాడేవారు చాలా మంది ఉన్నారు. ఇది ముమ్మాటికి అసత్యం. మనది శాశ్వతత్వాన్ని కలిగిన భూమి, మనం శాశ్వత తత్వాన్ని తెలుసుకున్న ప్రజలం, మనది శాశ్వతమైన మతం. భారతదేశ బలం, గొప్పతనం, పవిత్రత మేఘావృతమై ఉండవచ్చు కానీ ఎప్పుడూ, ఒక్క క్షణం కూడా పూర్తిగా సమసిపోదు. వీరుడు, ఋషి, సాధువు, మన భారత పుడమి సహజ ఫలాలు. వారు జన్మించని కాలం లేదు. ఇప్పటి కాలపు ఋషుల జాబితాలో, మనం నవ భారతాన్ని సృష్టించే పునరుజ్జీవ మంత్రాన్ని (వందేమాతరం), ఇచ్చిన వ్యక్తిని కూడా జత చేయవచ్చని చిట్టచివరకు గ్రహించాము.

ఋషి సాధువు కంటే భిన్నమైన వాడు. అతని జీవితం ఉన్నత పవిత్రతతో ఉంటుందని, అతని స్వభావం సౌందర్య భరితమై ఆదర్శవంతంగాఉంటుందని

అనుకుంటే పొరపాటే. అతనేమిటో అన్నదానితో అతనిలోని గొప్పతనం ఆధారపడి లేదు, అతను వ్యక్తీకరించిన దాని మీద అది ఆధారపడి ఉంది. ఒక దేశానికి కానీ మానవాళికి కానీ గొప్ప, సజీవ సందేశం ఇవ్వాలని భగవంతుడు అనుకున్నప్పుడు, ఆ సందేశానికి సంబంధించిన పదాలను రూపొందించడానికి భగవంతుడు అతని నోటిని ఎంచుకుంటాడు. ఒక ముఖ్య దర్శనాన్ని బహిర్గతం చేయవలసి వచ్చినప్పుడు భగవంతుడు మొదటిగా అతని కళ్ళకు తెరుస్తాడు. అతను అందుకున్న సందేశాన్ని, అతనికి ధృవీకరించబడిన దర్శనాన్ని, అతను తనలో ఉన్న సమస్త శక్తిని కూడగట్టుకుని ప్రపంచానికి తెలియజేస్తాడు. ప్రేరణతో ఉన్న ఒక అత్యున్నత క్షణంలో దానిని కేవలం పదాలలో వ్యక్తీకరిస్తాడు. అది మనుష్యులను కదిలించడానికి, వారి సందేహాలను తొలగించడానికి, వారి హృదయాలను స్వాధీనం చేసుకోవడానికి, మామూలు పరిస్థితులలో వారికి అసాధ్యమైన పనులను, వారు చేయడానికి వారిని పురికొల్పుతుంది. అతను వ్యక్తపరిచిన ఆ పదాలే మంత్రం, దానిని వెల్లడించడానికే అతను జన్మించాడు. ఆ మంత్రానికి అతను ద్రష్ట.

CWSA 1:637

త్యాగ ఆవశ్యకత

భారతదేశాన్ని జాతీయవాద విశ్వాసంతో నింపాలని కోరుకునే వారు ముందుగా త్యాగం చేయడం ఒక అత్యున్నత అవసరమని గుర్తించాలి. అతను ప్రబోధించే సత్యం ప్రపంచంలోని ప్రతి దేశంలోనూ దాని అమరవీరులున్నారని, భారతదేశం అందుకు మినహాయింపు కాదని తెలుసుకోవాలి. అతను దేశం నుండి అడిగే ప్రతిదానికీ త్యాగం అవసరం, మరియు శతాబ్దాలుగా లోబడి ఉన్న దేశం అతని ఆలోచనకు సంబంధించిన సత్యాన్ని, అతని విశ్వాసానికి సంబంధించిన గొప్పతనాన్ని మేల్కొల్పడానికి, అతను మొదట ఉదాహరణగా ఉండాలి.

జాతీయవాదం అనేది దేశంలో ఆ దైవిక ఐక్యత సాక్షాత్కారానికై సాగే ఉద్వేగభరితమైన ఆకాంక్ష, దీనిలో అన్ని భాగాల వ్యక్తులు, రాజకీయ, సామాజిక లేదా ఆర్థిక కారకాలుగా వారి వివిధరకాల విధులను నిర్వహించినప్పుడు స్పష్టంగా అసమానంగా ఉన్నప్పటికీ, వాస్తవికంగా, ఆమూలతః చూసినప్పుడు అందరూ ఒకటే, సమానమే. భారతదేశం ప్రపంచం ముందు ఉంచే

జాతీయవాద ఆదర్శంలో, మనిషికి మనిషికి మధ్య, కులాల మధ్య, శ్రేణుల మధ్య ఒక ముఖ్యమైన సమానత్వం ఉంటుంది. ఈ దేశం విరాట్ పురుషుని శరీరమైతే, దానిలో అన్ని అసమానత కలిగిన భాగాలు భిన్నమైనవే కానీ అన్ని సమానమై ఐక్యతను కలిగి ఉన్నాయని శ్రీ తిలక్ నొక్కి వక్కాణించారు. మన మతానికి సంబంధించి దృఢత్వంతో కూడిన బోధన, భారతీయ జాతీయవాది పని ఒక్కటే. అది వారి మతానికి, దేశానికి సంబంధించిన తాత్విక జ్ఞానాన్ని, దాని ఆదర్శాన్ని అతను ప్రతి ఒక్కరికి చేరవేయాలి. మేము నిరంకుశత్వాన్ని సహించము, ఎందుకంటే మౌలికమైన సమానత్వాన్ని ఇప్పటి రాజకీయం తిరస్కరిస్తుంది. అలాగే మేము కుల వ్యవస్థకు సంబంధించిన ఆధునిక వక్రీకరణను వ్యతిరేకిస్తున్నాము, ఎందుకంటే ఈ కుల వ్యవస్థ సమానత్వాన్ని సామాజికంగా తిరస్కరిస్తుంది. మేము రాజకీయంగా ప్రజాస్వామ్య ఐక్యతగా దేశాన్ని పునర్వ్యవస్థీకరించాలని గట్టిగా నొక్కి చెబుతున్నాము, అదే పునర్వ్యవస్థీకరణ సూత్రం సామాజికంగా కూడా అనివార్యం అని మేము గుర్తించాము. మన ప్రత్యర్థులు ఊహించినట్లుగా, దాని పనిని రాజకీయాలకు పరిమితం చేయాలని మేము కోరుకున్నా, మన ప్రయత్నాలు ఫలించవు, ఎందుకంటే రాజకీయాల్లో ఒకసారి గ్రహించిన సూత్రం తప్పనిసరిగా సమాజంలో స్థిరపడాలి. ఏ గుత్తాధిపత్య జాతి ద్వారా కానీ వంశపారంపర్యంగా కానీ ఒక వ్యక్తి జాతీయవాదిగా మారి జాతీయ వాద భవిష్యత్ పథకంలో భాగం కాలేడు, అతను దాని ఆగమనం కోసం కష్టపడి పోరాడుతున్నప్పటికీ అది సాధ్యం కాదు.

CWSA 6-7: 677-80

హిందూమతం, మానవ నాగరికత

హిందూమత పరిపూర్ణత మానవ నాగరికతకు సంబంధించిన అత్యున్నత ధోరణుల పరిపూర్ణత. ఇది ఆధునిక జీవితంలోని అత్యంత ముఖ్యమైన ప్రేరణలను దానిలోకి ఇముడ్చుకోవాలి. ఇందులో ప్రజాస్వామ్యం, సామ్యవాదం కూడా ఉన్నాయి, వాటిని శుద్ధి చేయడం, అంటే ఆర్థిక సర్దుబాట్లపై అధిక ఒత్తిడి ఉన్న స్థితి నుండి, ప్రజాస్వామ్యాన్ని, సామ్యవాదాన్ని ఉన్నత స్థితికి తీసుకు వెళ్లడం. మానవజాతికి నిరంతరం నైతికత, మేధోపరమైన, ఆధ్యాత్మిక పరిపూర్ణతలపై మరింత స్పష్టంగా దృష్టి పెట్టడం నేర్పడమే దీనికి ముగింపు.

CWSA 6-7:685

భయపడవద్దు

దేశ ఆత్మ గౌరవం మన మతం, స్వార్థత్యాగం మన కర్తవ్యం. మనలోని దైవిక గుణాలు, వెలుగులోకి రావడానికి సరైన అవకాశం మనం ఇవ్వాలి. అల్పమైన భావోద్వేగాలను వదులుకోవాలి. చనిపోవాల్సిన అవసరం వచ్చినా భయపడవద్దు, వెనుకడుగు వేయవద్దు. దేశ హితం కోసం బాధను భరించండి. భగవంతుడే మీ ఆధారం. మీరు ఇలా చేస్తే భారతదేశం తన పూర్వవైభవాన్ని తక్షణం తిరిగిపొందుతుంది. ప్రపంచం లోని స్వతంత్ర్య దేశాల సరసన తన స్థానాన్ని పొందుంతుంది, ఇతర దేశాలను విజ్ఞానవంతం చేస్తుంది. ఇది నిజమైన జ్ఞానాన్ని అందిస్తుంది, వేదాంత సూత్రాలను పాదుకొల్పుతుంది. మానవజాతికి, యావత్ ప్రపంచానికి మేలు చేయడానికి మన దేశం ముందుకు వస్తుంది. దాని ముందు ప్రపంచం మొత్తం వణికిపోతుంది, కానీ ఎప్పుడు? మనందరం దేశంకోసం మన రుణం తీర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నప్పుడే.

CWSA:6:7:860

విప్లవాలు

విప్లవాలు వాటి గమనంలో అంచనాకు అందనివి మరియు పూర్తిగా నియంత్రించలేనివి. సముద్రం ఎలా ప్రవహించాలో దానికి ఎవరు చెప్తారు? గాలివీస్తుంది, ఏ మానవ ప్రజ్ఞ దాని కదిలికలను నియంత్రించగలదు? దైవిక ప్రజ్ఞ సంకల్పం అనేది విప్లవాల ఏకైక శాసనం, మనం దైవిక ప్రజ్ఞ ద్వారా ఎన్నుకోబడిన ప్రతినిధులం మాత్రమే, మరి ఏ ఇతర హక్కు మనకు లేదు. మన పని పూర్తి అయినపుడు, మనం దానిని గ్రహించి, ఆపని చేయడానికి మనకు అనుమతి లభించినందుకు సంతోషించాలి. మనం చేయగల్గే గొప్ప సేవలకు ఈ బహుమానం చాలదా? వారి వారి కార్యాల ద్వారా, ప్రసంగాల ద్వారా లేదా ఉత్తమంగా స్వతంత్రమవ్వబోయే గొప్ప భారత్‌ని సమాయత్తం చేయడానికి బాధలతో కూడిన వారి గుప్తసేవ ద్వారా చరిత్రలో నిలిచిపోయే వారి సరసన మన పేర్లు నమోదు కాబడుతూ ఉంటే అది చాలదా? ఇంతేకాక ఏ పేరూ రాకపోయినా, ఏమీ నమోదు కాకపోయినా దేవుని ఖాతాలో తప్ప ఈ ఉద్యమ శకటాన్ని ముందుకు తోయడంలో అది ఎంత గుర్తించబడనిదైనా మన వేలు దానిపై పడిన స్పృహతో మనం కనుమూసినా చాలదా? సేవల గురించిన ఈ చర్చ చాలా చిన్న విషయం. మనం ప్రతిఫలం కోసం మాతకు

సేవ చేస్తున్నామా? లేక దేవుని పనిని కూలికి చేస్తామా? దేశభక్తుడు తన దేశం కోసం జీవిస్తాడు. ఎందుకంటే అతను తప్పక దేశం కోసమే చనిపోతాడు, ఎందుకంటే దేశమాత దానిని కోరుకొంటుంది.

CWSA: 6-7:869-70

సంజీవని మంత్రం

ఒక గొప్ప ప్రజ ధూళి నుండి పైకి లేచినప్పుడు వారికి ఏ మంత్రం సంజీవని లేదా ఏ శక్తి దాని పునర్జీవనానికి, పునరుజ్జీవింపజేసే క్రియాశక్తి? భారత దేశంలో రెండు గొప్ప మంత్రాలు ఉన్నాయి, మాతృభూమిపై మేల్కొన్న ప్రేమ యొక్క సార్వజనీన, సార్వత్రిక నినాదం "వందేమాతరం" మంత్రం. ఇంకా బహిర్గతం చేయని మరో నిగూఢమైన రహస్యం ఉంది. "వందేమాతరం" మంత్రం వింధ్య పర్వతాల్లో వసించే సన్యాసులు ప్రపంచానికి పూర్వం ఒకప్పుడు అందించిన మంత్రం. దీనిని ఇది మన స్వంత దేశపు ప్రజల ద్రోహం వల్ల కోల్పోయాం. ఎందుకనంటే, జాతి పునరుత్థానం కోసం (పరిపక్వం) చెందలేదు. అకాల మేల్కొలుపులు వేగవంతమైన పతనానికి దారి తీశాయి. కానీ 1897లో సంభవించిన మహా భూకంపంతో సన్యాసులు ఒక స్వరం వినిపించారు. భారతదేశం మళ్ళీ జాగృతమవ్వాలనే, దేవుని శాసనం గురించి వారు తత్పరులై ఉన్నారు. ప్రపంచానికి ఈమంత్రం మరలా వెల్లడైంది. ఇది ప్రజల హృదయాలలో ప్రతిధ్వనించింది. కొన్ని గొప్ప హృదయాలలో నిశ్శబ్దంగా పరిపక్వతలో నినాదం వినిపించినపుడు, మొత్తం దేశం విప్లవం గురించి స్పృహలోకి వచ్చింది.

CWSA 6-7:877

భారతదేశపు కర్తవ్యం

ప్రపంచ భవిష్యత్తు భారతదేశంతోనే ముడిపడి ఉంది. ఆమె (భారత దేశం) నిద్ర నుండి లేచినపుడల్లా, ప్రపంచానికి అద్భుతమైన, మెరుస్తున్న కాంతి కిరణాన్ని అందిస్తుంది. అది జాతులను ప్రకాశవంతం చేస్తుంది. మరికొందరు శతాబ్దాల తరబడి, ఆమెకు ఏది క్షణికభావమో దానిపై జీవిస్తారు. దేవుడు ఆమెకు సనాతన జ్ఞాన పుస్తకాన్ని ఇచ్చాడు, దానిని తెరిచే సమయం వచ్చేవరకు దానిని ఆమె హృదయంలో ఉంచమని ఆదేశించాడు. కొన్నిసార్లు ఒక పుట లేదా అధ్యాయం బహిర్గతమవుతుంది. కొన్నిసార్లు ఒకే ఒక వాక్యం

మాత్రమే. ఇటువంటి వాక్యాలు అనేక వందల సంవత్సరాలుగా యుగయుగాల ప్రేరణ స్రోతస్సులుగా మానవాళిని పరిపోషించాయి. అలాగే భారతదేశం నిద్రిస్తున్నపుడు భౌతికవాదం వేగంగా పెరిగి ముందుకుపోతుంది, కాంతి చీకటితో కప్పబడి ఉంటుంది. భౌతికవాదం తాను విజయం సాధిస్తున్నానని భావించినపుడు, ఇదిగో తూర్పు నుండి ఒక తేజస్సు వేగంగా దూసుకొస్తుంది. భౌతికవాదం ఎక్కడ ఉంది? తన స్వసంస్థానానికి రాత్రిలోకి తిరిగిపోతుంది.

CSA 6-7 : 890

సత్యం ఒక పునాది

ఈ విషయంలో, మనం నిస్సంకోచంగా మాట్లాడవలసి ఉంటుంది. సత్యం అనేది ఒక పునాది రాయి, దాని మీదనే ఈ ప్రపంచం నిర్మించబడింది. సత్యేన తిష్టతే జగత్. అసత్యం అనేది ఎప్పటికీ బలానికి, శక్తికి నిజమైన మూలం కాలేదు. ఒకవేళ అసత్యం గనక ఒక ఉద్యమం మూలంలో ఉన్నట్లయితే, అటువంటి ఉద్యమం అపజయం పొందవలసిందే. ఉద్యమం సత్యంనుండి మొదలైనప్పుడే దౌత్యం సహాయకారిగా ఉంటుంది. దౌత్యాన్నే గనక మూల తత్వం అనుకుంటే సృష్టి ధర్మాన్ని అతిక్రమించినట్టే.

CWSA 6-7: 882

మానవునిలో ఉన్న దేవుని వైభవం

ఎప్పుడు జనం హేతువును ఒక గొప్ప మార్గదర్శిగా ఎంచక చులకన చేసినపుడు మేధో గర్వం చేత ఇంకా ప్రభావితులై ఉండేవారినది ఆశ్చర్యానికి గురి చేస్తుంది. ఇంతగా ఎదిగిన మానవుడు దైవం అని మనుషులు పిలిచే ఒక అతీత శక్తిని నమ్ముకుని హేతుబుద్ధిని తక్కువగా చూడడం ఏమిటి? ఇలాంటి అనుమాన పక్షులు ఐరోపా భౌతికవాదం చేత ప్రభావితులై మానవుణ్ణి కేవలం ఒక భౌతిక స్థాయికి మాత్రమే పరిమితం చేసి, అతను ఒక దివ్యస్రోతస్సు నుండి ఉద్భవించి ఒక దివ్యమైన భవిష్యత్తు కలిగిఉన్నాడనే సంభావ్యతను నిరాకరిస్తున్నాడు. ఎప్పుడు ఐరోపా క్రైస్తవాన్ని సన్యాసులకు వదిలి, గలీలియన్ కాలంలోని బోధలను విస్మరించిందో, ఒక భయంకరమైన భవిష్యత్తు వారిని కమ్మివేసింది. మానవునిలో దైవం అనేది సమస్త జ్ఞానోదయం మొత్తం మత సారాంశం. క్రైస్తవం ఏదో మసకగా బోధించిన విషయాన్నే,

హిందూ మతం వేదాంతం ద్వారా మన బుద్ధికి తేట తెల్లం చేసింది. ఎప్పుడు మన భారతదేశం ఆది శంకరులు, రామానుజులు, ఇంకా మధ్వాచార్యుల నుండి పొందినది గుర్తుచేసుకుంటుందో, శ్రీ రామకృష్ణులు వ్యక్తం చేసిన దానిలోని సత్యాన్ని గ్రహిస్తుందో, అప్పుడు భారతదేశం తిరిగి ఉన్నతస్థితికి లేస్తుంది. భారతదేశం జీవన సర్వస్వం వేదాంతమే.

హిందువు అంటే ఎవరు?

ఎవరైనా మానవులను కేవలం బుద్ధి కుశలత కలిగిన మనోగత జీవులుగా మాత్రమే పరిగణిస్తూ ఉంటే వారు హిందువు కాదు. ఎవరైతే దైవాన్ని దర్శించలేదో వారికి బుద్ధిని పాండిత్యాన్ని పెంచుకునే అవకాశాన్ని వదిలేసింది హిందూ మతం. భగవంతుని గొప్పతనాన్ని వైభవాన్నిమాత్రమే కీర్తించే బాధ్యత హిందూమతానికి ఇవ్వబడింది, వేల సంవత్సరాలుగా హిందూ మతం అదే బోధిస్తూ వస్తోంది. ఎప్పుడు మనం పాశ్చాత్య విద్యని మొదట గైకొన్నామో, మనం విజ్ఞాన శాస్త్ర వెలుగును అనుసరించి మనంతట మనం తప్పుదారి పట్టాము. విజ్ఞాన శాస్త్రం అనేది కేవలం ఒక చిన్న గదిలో వెలిగే కాంతి వంటిది ప్రపంచాన్ని ప్రకాశమయం చేసే సూర్యుడు కాదు. అది సూర్యునితో సరిపోలదు. అపరా విద్య అనేది విజ్ఞాన శాస్త్ర సర్వస్వమే కాని అంతకు మించిన ఘనమైన జ్ఞానం, ఉన్నతమైన విద్య ఉన్నది. మనం క్రింది స్థాయి జ్ఞానం చేత ప్రభావితులం అయినప్పుడు, మనం అంతా చేస్తున్నట్టుగా ఊహించుకుంటాం, మన బుద్ధి కుశలతే సర్వ సమర్ధమైనది, స్వతంత్రమైనది అయినట్టు మనం ఉన్న పరిస్థితిని గురించి ఒక హేతుబద్ధ నిర్ణయానికి రావడానికి ప్రయత్నిస్తాం. కానీ ఇది భ్రాంతి వలన, మాయవలన కలిగిన వైఖరి. ఎవరైనా ఒక్కసారి భగవంతుని వైభవాన్ని తమలో అనుభవించి ఉంటే అటువంటి వారు బుద్ధిని, మేధను సర్వోన్నతమైనదిగా భావించరు. ఇంకా ఉన్నతమైన వాణి ఉంది, ఇంకా తప్పు జరిగే అవకాశం లేని భవిష్యదర్శనం ఉంది. అది దైవం నివసిస్తున్న మన హృదయంలోనే ఉంది. ఆయనే మన మేధ ద్వారా పని చేస్తూ ఉన్నారు, అయినప్పటికీ మెదడు కేవలం ఆయనకున్న అనేక ఉపకరణాలలో ఒకటి మాత్రమే. మెదడు ఏది ప్రణాళికా బద్ధం చేయాలని అనుకుంటోందో అది హృదయానికి ముందే తెలుసును. ఇంకా ఎవరయితే మేధను దాటి హృదయం వరకు వెళ్లగలరో వారు ఆ శాశ్వతుని స్వరం వినగలరు.

CWSA 6-7:890-93

భారతదేశం జాతులన్నింటికి గురువు

మన దేశం ఎదుర్కొంటున్న గందరగోళ పరిస్థితులనే ఉవ్వెత్తున ఎగిసే కెరటాల తాకిడిలో పైకి తేలేలా మనం ధరించే ప్రాణాన్ని కాపాడే లైఫ్ బెల్ట్, మనం నిశ్చయంగా అర్థం చేసుకున్న ఏకైక విషయం ఒకటుంది. అది ఏమిటంటే భారత దేశాన్ని మృతులనుండి లేచేలా చేసే ఒక పరమోన్నతమైన ధ్యేయం పట్ల నీకున్న నిశ్చితమైన మార్చలేనంటువంటి విశ్వాసం ఒకటుంది. భారతదేశానికి చెందిన సనాతనమైన జీవన విధానాన్ని వైభవాన్ని పునర్నిర్మించే ఒక నిశ్చితమైన మార్చలేనటువంటి ఉద్దేశం ఒకటుంది. స్వరాజ్యం అనేది ప్రాణాలు కాపాడే లైఫ్ బెల్ట్, స్వరాజ్యమే పైలట్, స్వరాజ్యమే మార్గాన్నిచూపే తార. ఒక గొప్ప సామాజిక విప్లవం రావాలంటే, స్వరాజ్యమనే గొప్ప ఆదర్శాన్ని భారత దేశం యొక్క మార్పులేని సనాతనమైన ఆత్మను సంపూర్ణంగా వ్యక్తం చేయలేని విధానాలకు బందీయైన ఒక జాతితో సాధించలేం. భారత దేశం తన పాతబడి పోయిన చినిగిపోయిన వస్త్రాలను వదిలి కొత్త వస్త్రాలతో అలంకరించబడాలి. తన ఆత్మను వినూత్నంగా వ్యక్తం చేసుకోవడానికి తన భౌతిక రూపాన్ని కూడా మార్చుకోవాల్సి ఉంటుంది. భారత దేశం ఇంకొక ఐరోపాలా తయారవుతుందని మీరు భయపడవలసిన అవసరం లేదు. భారతదేశ వ్యక్తిత్వం ఎంత సమున్నతమైనదంటే, అంతగా దిగజారే అవకాశం లేనేలేనంత, దాని ఆత్మ ఎంత ప్రశాంతమైనది, స్వతంత్రమైనది అంటే అలా ఎవరికో పాదాక్రాంతమవ్వాల్సిన అవసరం లేనేలేనంత. ఒక ఆర్థిక విప్లవం రావడం తప్పని సరి అయితే, తన ఇరుకైన నిర్మాణం వంటి పాతదైన పారిశ్రామిక జీవనం ద్వారా వ్యాపారంలోకానీ పారిశ్రామికంగా కానీ స్వరాజ్యం సాధించలేం. ఒక స్వేచ్ఛ పొందిన, పరిపూర్ణమైన జాతీయ జీవనంలో పారిశ్రామిక శక్తులకు విశాలమైన మార్గాలను, ఘనమైన అవకాశాలను అందించవలసి ఉంటుంది. ఇటువంటి ఆర్థిక విప్లవం ఐరోపాలోని ప్రజానీకంలో ఉన్నత భావాలకు పట్టిన ఇప్పుడున్న అనారోగ్యకరమైన, అస్తవ్యస్తమైన పరిస్థితికి మనలను కూడా తీసుకు పోతుందని మనం భయపడవలసిన అవసరం లేదు. భారత దేశం తన జీవనంలో ఎప్పటినుండో కలగలిసి ఉన్న బోధను, తన అమృతత్వపు రహస్యాన్ని మరిచిపోదు. స్వార్థం, వ్యవస్థీకృతమైన క్రూరత్వం, దురాశవంటి వాటిని గౌరవ ప్రదంగా చూపించే

పాశ్చాత్య పారిశ్రామిక ప్రపంచానికి మన దేశం ఇంకొంక ప్రతిరూపంలా మారబోదు. తన పరిస్థితులను తానే నిర్మించుకుని, సోషలిజం కూడా కష్టపడినా పొందలేని ఒక రహస్యమైన పద్ధతిని కనుగొని ఈ ప్రపంచానికి భౌతికతను ఆధ్యాత్మికతను ఎలా సమన్వయం చేసుకోవాలో నేర్పుతుంది.

ఈ సత్యాన్ని గనక మనం ఆవిష్కృతం చేసుకోగలిగితే, జరుగుతున్న సంఘటనలలో మనకే కాక ప్రపంచానికి కూడా అవసరమయిన ఘనమైన త్వరితమైన పరివర్తనను మనం గమనించగలిగితే, భయం, అపనమ్మకాలు లేకుండా మనల్ని మనం రాబోయే కాలానికి తగ్గట్టుగా ఒక గొప్ప స్థితికి చేర్చుకుంటాం. భారతదేశం అన్ని జాతులకు గురువు, మానవుడి ఆత్మకు పట్టిన తీవ్ర అనారోగ్యాలకు చికిత్సను అందించగలిగే వైద్యుడు. ఈ ప్రపంచ జీవనాన్ని మళ్ళీ కొత్త మూసలో పోసి, మానవుని ఆత్మకు శాంతిని ప్రసాదించే భవిష్యత్తు కలిగినది భారతదేశం. తను చేయవలసిన పని చక్కగా జరగాలంటే ముందుగా స్వరాజ్యం రావాల్సిందే, అప్పుడే భారత దేశం తాను చేయవలసిన కార్యం చేయగలదు.

CWSA 6-7: 905-06

భారతదేశ కార్యం

మానవ స్వేచ్ఛ, మానవ సమానత్వం, మానవ సౌభ్రాతృత్వ నిజమైన మూలానికి మానవాళిని తిరిగి చేర్చడమే ఆమె లక్ష్యం. మనిషి ఆత్మలో స్వేచ్ఛగా ఉన్నప్పుడు, ఇతర స్వేచ్ఛ అంతా అతని ఆజ్ఞపై ఉంటుంది. ఎందుకంటే స్వేచ్ఛే ప్రభువు, అది బంధితం కాదు. అతను మాయ నుండి విముక్తి పొందినప్పుడు, ప్రేమ - న్యాయం ద్వారా తనను తాను సఫలం చేసుకొనే ప్రపంచంలోని దైవిక సమానత్వాన్ని గ్రహిస్తాడు. ఈ గ్రహింపు దానంతట అదే ప్రభుత్వానికి, సమాజానికి సంబంధించిన చట్టంగా మారుతుంది. అతను ఈ దైవిక సమానత్వాన్ని గ్రహించినప్పుడు, అతను మొత్తం ప్రపంచానికి సోదరుడు అవుతాడు, అతను ఏ స్థానంలో ఉన్నప్పటికీ, తన ప్రేమ ద్వారా, న్యాయం ద్వారా అందరినీ సోదరులుగా భావించి సేవ చేస్తాడు. ఈ అవగాహన మతం, తత్వశాస్త్రం, సామాజిక కల్పన, రాజకీయ ఆకాంక్షలకు ఆధారం అయినప్పుడు, సమాజ నిర్మాణంలో స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వాటి స్థానాన్ని అవి పొందుతాయి. సత్యయుగం

తిరిగి వస్తుంది. ఇది ఆసియాకి సంబంధించిన ప్రజాస్వామ్యం, దీనిని భారతదేశం ప్రపంచానికి అందించడానికి ముందు తనను తాను తిరిగి కనుగొనాలి. బలవంతంగా కాకుండా ప్రేమతో సేవకు కట్టుబడి ఆత్మలో స్వేచ్ఛగా ఉండటమే ప్రతి మనిషి ధర్మం. సమాన భావనతో ఉండాలి. ఇతరుల ఆసక్తి పూర్వక స్వార్థం ద్వారా కాకుండా సమాజానికి సేవ చేయగల సామర్థ్యం ద్వారా సమాజంలో తన స్థానాన్ని నిలుపుకోవాలి. తన సోదరులతో సామరస్యపూర్వకమైన సంబంధాలను కలిగి ఉండటమన్నది, పరస్పర ప్రేమ, సేవ ద్వారా వారితోనే ముడిపడి ఉంటుంది, దాస్య సంకెళ్ళతో లేదా దోపిడీ చేసే - దోపిడీకి గురైన వారి సంబంధాలతో కాదు. ప్రజాస్వామ్యం మనిషి హక్కులపై ఆధారపడి ఉంటుందని చెప్పారు. మనిషి విధులపై తన వైఖరిని తీసుకోవాలని బదులివ్వడం జరిగింది. కానీ హక్కులు, విధులు రెండూ పాశ్చాత్యుల ఆలోచనలు.

కర్మమూలంగా స్వార్థాన్ని తయారుచేసే ప్రపంచ దృష్టిచే సృజించబడిన కృత్రిమ పరస్పర వ్యతిరేకతను హక్కులు, విధులు కోల్పోయేటట్లు చేసేది భారతీయ అవగాహనలో ధర్మం అంటే ఆ ధర్మంలో విధులు హక్కులు తమ లోతైన, శాశ్వత ఏకత్వాన్ని తిరిగి పొందగలవు. ప్రజాస్వామ్యానికి ధర్మం ప్రాతిపదిక, దీనిని ఆసియా గుర్తించాలి, ఎందుకంటే ఇందులో ఆసియా ఆత్మకు ఐరోపా ఆత్మకు మధ్య వ్యత్యాసం ఉంది. ధర్మం ద్వారా ఆసియా పరిణామం తనకు తానుగా నెరవేరుతుంది. ఇది ఆమె రహస్యం.

CWSA 6-7: 931-32

దైవమే నిజమైన ఆత్మ

ఎవరైతే దేవుణ్ణి విశ్వసిస్తారో, వారు వారి నిమ్న స్థాయి నుండి పైకి ఎదుగుతారు. ఎందుకంటే దైవమే విశ్వం. విశ్వంలోని ప్రతిదానికీ నిజమైన ఆత్మ దైవమే. మనము ఆత్మతః మన క్రింది స్థాయి పై ఆధారపడినప్పుడు, మనము ఆ క్రింది స్థాయి స్వభావానికి మాత్రమే కట్టుబడి ఉంటాము. మన గత జీవిత కర్మల సూత్రం ప్రకారం మన శరీర బలం లేదా తెలివికి అనుగుణంగా విజయం లేదా వైఫల్యం ఆధారపడి ఉంటుంది. క్రింది స్థాయిలో ఆత్మకు ఒక నియమం ఉన్నత స్థాయిలో ఆత్మకు మరొక నియమం ఉంటుంది. నిమ్న స్థాయి గతానికి చెందిన బానిసత్వంలో చిక్కుకొని

ఉంటుంది. ఉన్నతమైన ఆత్మ గతానికి, వర్తమానానికి అలాగే భవిష్యత్తుకు చెందిన అధిపతి. కాబట్టి అహంకారము నుండి నిమ్న ఆత్మ సంకల్పము పుడుతుంది, ఆ అహంకారానికే పరిమితమవుతుంది, కానీ ఉన్నత ఆత్మ సంకల్పం అహంకార పరిమితిని దాటి ఉంటుంది, ఉన్నత ఆత్మ పై అహంకార ప్రభావం ఏమాత్రం ఉండదు.ఇది సర్వశక్తిమంతమైనది. కానీ అది శరీరం ద్వారా పని చేస్తున్నంత కాలం, అది సమయం, విశ్వం, కార్యకారణ సంబంధమైన సూత్రాల పై ఆధార పడి పనిచేస్తుంది. ఆ సమయం సిద్ధమయ్యే వరకు, వాతావరణం సిద్ధమయ్యే వరకు దానికి సంబంధించిన తక్షణ కారణాలు తెలిసే వరకు మనం దాని నెరవేర్చవేచి ఉండాలి. ఒక్కసారి సంకల్పం దోషరహితంగా పని చేయడం మొదలుపెడితే తప్పనిసరిగా దానికి అవసరమైన పరిస్థితులను తెస్తుంది. మనం చేయాల్సిందల్లా అది పని చేయడానికి అనుమతించడమే.

CWSA 6-7: 93 7-3 8

భారతదేశ గతము - భవిష్యత్తు

పూర్వ యుగాలలో భారతదేశం ప్రపంచం నుండీ వేరుగా ఉంటూ చింతన, శాంతి వాతావరణంలో ఒక విధమైన సన్యాస దీక్షను పాటించేది. ఆమె విచిత్రమైన భౌగోళిక స్వరూపం దృష్ట్యా మిగిలిన మానవాళి నుండి వేరు చేయబడింది. తన సమస్యలను పరిష్కరించుకుంది. ప్రపంచానికి దూరంగా ఒక నిర్మలమైన ఆశ్రమంలో ఉన్నట్లుగా ఉంటూ ఉనికి రహస్యాలపై ఆలోచనలను కొనసాగించింది. ఆమె ఆలోచనలు ఆసియా ఖండం అంతటా నాగరికతలను సృష్టించాయి. ఆమె కుమారులు ప్రజలకు వెలుగును పంచేవారు. తత్వ శాస్త్రాలు ఆమె అనంతమైన జ్ఞానంపై ఆధారపడి ఉన్నాయి. ఆమె మేధస్సు ఉత్పత్తి అనవసరమైన వ్యర్థాల నుండి ఈ విజ్ఞాన శాస్త్రాలు ఉద్భవించాయి. అవరోధం బద్దలై, హిమాలయాల ద్వారా జాతులు భారతదేశానికి రావడం ప్రారంభించినప్పుడు, ఈ దేశ శాంతి అంతరించింది. ఆమె శతాబ్దాల పోరాటం, ఆమె యాదృచ్ఛిక ఆలోచనల నుండి పుట్టిన నాగరికతలు అభివృద్ధి చెంది పట్టుదలగా ఆమె వద్దకు తిరిగి వచ్చాయి, ఈ నాగరికతలన్నీ వాటినవి అమలుపర్చుకోవాలని సబల అయిన భారతమాతను ఒత్తిడి చేశాయి. ఆమెకు అవన్ని ఆమె పక్కన పెట్టిన, విస్మరించిన మేధోపరమైన ప్రయోగాల జ్ఞాపకాలు. ఆమె వాటిని తీసుకుని కొత్త కోణంలో

పునరాలోచించి మరోసారి వాటిని తనలో భాగంగా చేసుకుంది. కాబట్టి ఆమె గ్రీకుతో, సిథియన్, ఇస్లాంలతో వ్యవహరించింది. ఇప్పుడు ఆమె తిరిగి వచ్చే తన గొప్ప పుత్రులతో వ్యవహరిస్తుంది. అంతే కాకుండా క్రైస్తవ మతంతో, బౌద్ధమతంతో, యూరోపియన్ శాస్త్ర, భౌతికవాదంతో, ఈ వేదాంత, విజ్ఞాన, మత ప్రాచీన ఊయలలోని మూలచింతనలతో ప్రపంచ నవీకృత సంపర్కంలో నుండి పుట్టిన ఊహాకల్పనలతో వ్యవహరిస్తుంది. బృహత్ విశాల నూత్న విషయాన్ని ఆమెలో ఇముడ్చుకోవాలి. అది అంతకు ముందు ఆమె చరిత్రలో జరగనది. కానీ అది ఆమెకు చాలా సులువైన బాల్యక్రీడ. స్పృశించగల మేధ, చొచ్చుకుపోయే అంతర్ దృష్టి, అజేయమైన మౌలికతలన్నీ గొప్ప మహాకార్యాలకు సరితూగేవే! బయట ప్రపంచం నుండి ఆమె విన్న స్వరాల నిస్తేజ కాల ఖండం ముగిసింది.

CWSA 6-7: 1020-21

సజీవ స్వరాజ్యం

అలాంటప్పుడు మనం స్వరాజ్యంలో ఎలా జీవించగలం ? తనగురించిన ఆలోచనను విడిచిపెట్టి దాని స్థానంలో దేశం కోసం చేసే ఆలోచన ద్వారా అది జరుగుతుంది. చైతన్యుడు నిమాయ్ పండిట్‌గా మారడం మానేసి, కృష్ణుడిగా, రాధగా, బలరాముడిగా మారినట్లు, మనలో ప్రతి ఒక్కరూ ప్రత్యేక స్వార్థ జీవితాన్ని పక్కన పెట్టి, దేశం కోసం జీవించడం మొదలుపెట్టాలి. మోక్షంముముక్షువుల మనస్సులను గ్రహించినట్టు, జాతీయవాదపు ఆకాంక్షలను మన మనస్సులు గ్రహించగలగాలి. ఏ పేరూ, ఏ గుర్తింపు లేని తపస్వి త్యాగం లాగా మన త్యాగం కూడా సంపూర్ణంగా ఉండాలి. మన స్వేచ్ఛామయ, మహిమాన్వితమైన భారతమాత ముఖాన్ని చూడాలనే మన తీవ్రకాంక్ష, శ్రీకృష్ణుని ముఖాన్ని చూడాలని చైతన్యుడికి ఉన్న తీవ్రఇచ్ఛ వంటిది. గౌరాంగ సంకీర్తనను అనుసరించడానికి రాజ్యాన్ని విడిచిపెట్టిన జాగాయ్ మాధాయ్‌లాగా దేశం కోసం మన త్యాగం సంపూర్ణ ఉత్సాహంతో ఉండాలి. బలిపీఠం మీద మన అర్పణలు ఎంత ఉదారంగా ఉండాలంటే, మోలోచ్ తమ పిల్లలను అగ్ని గుండా పంపిన కార్తజీనియన్ తల్లిదండ్రుల లాగా పశ్చాత్తాపం లేకుండా సంపూర్ణంగా ఉండాలి. ఏదైనా మినహాయింపు స్వీయ పరిత్యాగానికి సంబంధించిన సంపూర్ణతను దెబ్బతీస్తే, ఏదైనా బేరసారాలు

మన త్యాగ సంపూర్ణతను తగ్గించినట్లయితే, ఏదైనా సందేహం, విశ్వాసం ఉత్సాహాన్ని దెబ్బతీస్తే, స్వీయ ఆలోచన మన ప్రేమ పవిత్రతను కలుషితం చేస్తే, అప్పుడు మాత సంతృప్తి చెందదు. ఆమె సన్నిధిని వెనుకనే నిలిపివేస్తుంది. మనము ఆమెను రమ్మని పిలుస్తున్నాము, కాని ఆ పిలుపు ఇంకా మన హృదయాల లోతుల్లో నుండి రాలేదు. తల్లి పాదాలు గుమ్మం దగ్గరఉన్నాయి, కానీ ఆమె మన నుండి నిజమైన పిలుపు వినడానికి వేచి ఉంది. అది గుండెల్లోంచి బయటకు వచ్చే పిలుపు. మనం ఇంకా మనకి - దేశానికి మధ్య తడబడుతూనే ఉన్నాం. మనము భారతమాత సేవకు ఒక అణా ఇస్తాము కానీ పదిహేను అణాలు మన కుటుంబాలు, మన పిల్లలు, మన ఆస్తి, మన కీర్తి ప్రతిష్ఠ, మన భద్రత, మన సౌలభ్యం కోసం ఉపయోగించుకుంటాము. మాత తనకు తాను ఇచ్చుకొనే ముందు అందరినీ అడుగుతుంది. సూరత్ రాజా తన నరనరాల్లోని రక్తాన్ని సమర్పించే వరకు మాత అతనికి కనిపించి తన వరాన్ని కోరుకోమని అడిగిందా? శివాజీ తన శిరస్సును అమ్మవారి పాదాల చెంత సమర్పించడానికి సిద్ధంగా ఉన్నంత వరకు, భవానీ తన చేతిని పట్టుకొని తన ప్రజలను విడిపించమని ఆజ్ఞ ఇవ్వలేదు. జాతులను విముక్తి చేసిన వారు, వారి ప్రయత్నాలు విజయవంతం కావడానికి ముందు పూర్తిగా త్యజించే వేదనను అనుభవించారు. అలాగే భారతదేశాన్ని విముక్తి చేయాలని కోరుకునే వారు ముందుగా మాత కోరిన మూల్యాన్ని చెల్లించవలసి ఉంటుంది. జాతిని సిద్ధం చేయడానికి మనం కోరుకునే పథకాలు, పారిశ్రామిక పునరుజ్జీవన పథకం, విద్యా పునరుజ్జీవన పథకం, స్వయం-సహాయం ద్వారా రాజకీయ పునరుజ్జీవన పథకం వంటివి దేశం స్వేచ్ఛగా ఉండడానికి ముందు ఉండాల్సిన లోతైన అధీన లక్షణాలు. మాత మనల్ని ఏ పథకాలు, ప్రణాళికలు, పద్ధతులూ అడగదు. ఆమె స్వయంగా మనం రూపొందించగలిగే పథకాలు, ప్రణాళికలు, పద్ధతులను సమకూర్చి పెడుతుంది. ఆమె మన హృదయాలను, మన జీవితాలను మాత్రమే అడుగుతుంది, అంతకుమించి కాదు. స్వదేశీ, జాతీయ విద్య, స్వరాజ్యాన్ని సంభాళించే ప్రయత్నం, ఆమెకు చేసుకొనే శరణాగతి కోసం చేసే అవకాశాలు మాత్రమే. స్వదేశీ భావన కోసం ఎంత ప్రయత్నించామో, స్వరాజ్యం కోసం ఎంత తెలివిగా పథకము చేసుకున్నామో, విద్యారంగాన్ని ఎంత విజయవంతంగా నిర్వహించామో కాదు, మనకు మనము ఎంత ఇచ్చుకున్నాం, మన సామర్థ్యం ఎంత, మన శ్రమ ఎంత, మన సౌలభ్యం

ఎంత, మన భద్రత ఎంత, మన జీవితాలు ఎంత అనే విషయాలను ఆమె చూడదు. పునరుజ్జీవనం అనేది అక్షరాలా పునర్జన్మ. పునర్జన్మ అనేది తెలివితో కాదు, పర్సు నిండుగా ఉండటం వల్ల కాదు, విధానం ద్వారా కాదు, యంత్రాల మార్పు ద్వారా కాదు, కానీ గతం రూపంతో మనం ఉన్నదంతా త్యాగ అగ్నిలో విసిరివేసి కొత్త హృదయాన్ని పొందడం. దేశమాతలో పునర్జన్మ పొందడం. స్వీయ పరిత్యాగం అనేది మన కోసం చేసిన ఇచ్ఛగా భావించాలి. ఆమె మన గురించి ఇలా అడుగుతుంది, "నా కోసం ఎంతమంది బతుకుతారు? నా కోసం ఎంతమంది చనిపోతారు?" మన సమాధానం కోసం వేచి చూస్తుంది.

CWSA 6-7: 1031-33

భారతదేశం భారతదేశంగానే ఉండాలి

భారత్ ఐరోపా అడుగుజాడల్లో నడిచి ఐరోపా దేశ రాజకీయ ఆదర్శాలను, సాంఘిక వ్యవస్థను, ఆర్థిక సూత్రాలను ఆమోదిస్తే, భారత్ కూడా యూరోప్‌లాగే అలాంటి అన్ని సమస్యలను తాను అధిగమిస్తుంది కానీ అటువంటి లక్ష్య ప్రాప్తి ఇటు భారత్‌కు గాని, అటు యూరోప్‌కి కానీ మంచిది కాదు. భారత్ తన సహజమైన ఘనతను సాధించలేదు. అదీకాక తనలో సంభావ్యతలను (తనకి సాధ్యమైన వాటిని) కూడా సాధించలేదు. పర ధర్మం భయావహం, ఇతరుల ధర్మాన్ని స్వీకరించడం ప్రమాదకరం; అది వ్యక్తుల యొక్క లేదా దేశం యొక్క జీవిత రహస్యాలను జీవశక్తిని ఆటంకపరచి స్వాభావికంగా, సహజంగా, విస్తృతంగా ఎదగ వలసిన ప్రకృతికి మారుగా అస్వాభావిక, గిడసబారిన ఎదుగుదలను కలిగిస్తుంది. ఏ దేశమైనా ఎప్పుడైనా తన లక్ష్యాన్ని, ఉనికిని వదులుకోవడం మూలంగా తన ఎదుగుదలను పణంగా పెట్టడమే అయ్యింది. భారత్ తన విధిని, లక్ష్యాన్ని అందుకోవాలంటే భారత్‌గానే మిగిలి ఉండాలి. అంతే కాకుండా యూరోప్ తన నాగరికతను భారతదేశానికి అంటగట్టడం వలన భారత్ ఏ విధమైన లాభాన్ని పొందలేదు. విలక్షణమైన సత్తాతో పనిచేసి యూరోప్ రుగ్మతలను రూపుమాప గలిగిన భారత్ తనే ఆ రుగ్మతల బారిన పడగలదు. అవి నయము చెయ్యలేనివి. నయము కాకుండా ఉంటే రుగ్మతలలో అప్పుడు పాశ్చాత్య నాగరికత హరించుకుపోతుంది. మొట్టమొదట తనలోని ఎండు తెగుళ్లని నిరాకరించినప్పటికి ఆ తరువాత తన బయట పేలుళ్లు సంభవించినపుడు అంతరించిన రోమ్ నాగరికత వలె

అవుతుంది. జాతీయ ఉద్యమ విజయం ఆధ్యాత్మికంగా, రాజకీయంగా భారత దేశానికి అత్యావశ్యకం, కానీ అంతకన్నా ఎక్కువ యూరోప్‌కు అవసరం అవుతుంది. యావత్ ప్రపంచం భారతదేశం స్వాతంత్ర్యం సాధించాలని ఉత్సుకతతో ఎదురు చూస్తోంది. తద్వారా ఆమె నిజ స్వరూపంగా రూపొందుతుంది.

CWSA 6-7:1041

మన ముందు ఉన్న కార్యము

ఇప్పుడు మన ముందు ఉన్న పని చాలా కఠినమైనది. ఆ కార్యాన్ని ముందుకు తీసుకు వెళ్లడానికి జంకని దృఢత్వం ఎంతో అవసరం. ఒక వీరుడు, వీర మరణం పొందినవాడు, ఉక్కులాంటి సంకల్పం హృదయం ఉన్నవాడు, ఒక కఠోర యోధుడు. అతని కఠినమైన నరాలు అలుపెరగకుండా, విశ్రాంతి లేకుండా పోరాడగలిగిన జన్మతః పోరాట వీరుడు. తన దేశం బానిసత్వంలో ఉన్నప్పుడు నిద్ర, విశ్రాంతి తీసుకోని కాళీమాత ఉపాసకుడు, తన గుండెను శరీరం నుండి వేరుచేసి మాత పూజా పీఠం వద్ద రక్త తర్పణంగా సమర్పణ చేయగలడు పూజారి. హృదయంలో అగ్ని, నాలుక మీద జ్వాలతో ఒక చిన్నమాటతోనే ఒక బలి దానానికి, కార్యానికి ప్రేరణ కలిగించు వాడు. ఇలాంటి వారికోసం సమయం ఆసన్నమవుతోంది. అతిత్వరలో పిలుపు రాబోతోంది. పిలుపు కోసం ఎదురు చూస్తూ వారందరూ ఇక్కడ నిశ్శబ్దంలో, చీకటిలో తమకు తాముగా పరిపక్వత చెందుతూ, సంకల్పంతో కూడిన కండరాలకు శిక్షణ ఇచ్చుకుంటూ, హృదయ తంతులను బిగించుకుంటూ పిలుపు వచ్చే సమయానికి తమని తాము సిద్ధపరచుకుంటున్నారు. తమలో సేవా భావం ఉందని భావించే వాళ్లు తమకు తాముగా సమయం ఉండగానే నిర్ధారణ చేసుకొనే సమయం, ప్రస్తుత కాలం అర్హతలను పరీక్షించుకొనే సమయం, ఓటమికి తేలికపాటి శిక్షలు పడే, తేలికపాటి పరీక్షల సమయం. వచ్చే అలాంటి రోజున ఓటమి చెందిన వారెవరైనా వారు బయటకు విసిరి వేయబడతారు కాని అది సంప్రదాయవాదులకు వలె చెత్త కుప్పలోకి కాదు, ఒక గొప్ప అగ్ని జ్వాలలోకి. ఇప్పుడు జాతీయ వాదులము అని బాహాటంగా చెప్పుకునే వారందరూ మునుపెన్నడూ చూడని చాలా కఠినమైన పరీక్షలు ఎదుర్కోవలసి వస్తుంది. ఒక హోదాని, ప్రదేశాన్ని వెదుక్కునే వారు, ప్రజాదరణ

కోసం పాకులాడేవారు, మిశ్రమ భావాలు, కుటిల ఉపాయాలు కల రాజకీయ నాయకులు, సమయోచితంగా, ఉభయ భ్రష్టత్వంతో సులభమైన భాషణలు చేసేవారు, తొందరగా నోరు పారేసుకునేవారు, ఇలాంటి స్వభావాలు కలిగిన పాత రాజకీయ నాయకులు చాలా త్వరగా, సులభంగా వెలవెలబోయి వెనక్కి తిరిగారు. జాతీయ వాదం అనే కార్యం తేలికపాటి వ్యవహారం కాదు, దానిని గూర్చిన పూర్తి అవగాహనతో అందులో ఏముందో క్షుణ్ణంగా తెలుసుకుని చేయవలసినది. ఆ విశేష అధికారాన్ని తేలికగా పొందగలమనే వాళ్ళు మాత్రం తీవ్రమైన బాధను, దండనను పొందవలసి ఉంటుంది. మనం కొద్దిపాటి మంది అయితే అది పెద్ద విషయం కాదు, కానీ అది సర్వ శ్రేష్టమైన ప్రాముఖ్యతను కలిగినది. అందువలననే మన నిర్మాణంలో వాడే పదార్థం పటిష్టమైనదిగా ఉండాలి. శ్రీమాతకు కావలసినది తన కత్తి తయారీకి స్వచ్ఛమైన ఇనుము, తన కోటకు దృఢమైన భారీ నల్లరాయి, తన విల్లుకి పిడి విరగకుండా ఉండేటటువంటి కలప, ఆమె రథానికి ఇరుసు కొరకు గట్టి పదార్థం. ఎందుకంటే యుద్ధం సమీపంలో ఉందని తెలపడానికి భేరి సిద్ధంగా ఉంది.

CWSA 6-7:1059-60 *శ్రీ అరవిందులు*

జాతి భావన

భారత జాతీయవాద ఆవిర్భావం

మన ఆత్మయే నిర్ణయిస్తుంది. మన చరిత్రను విధివ్రాతను మరియు పదార్థ స్వభావాన్ని నిర్దేశిస్తుంది. దేశకాల పరిమితులలో భౌతికమయిన సంఘటనలు తమంత తామే రూపుదిద్దుకొని అంతరాత్మ యొక్క నిర్ణయాలకు ఒక బాహ్యమయిన ఆకారాన్ని వాస్తవికతను యిస్తాయి. ఒక జాతి స్వాతంత్ర్య అంటే తన స్వాతంత్ర్యాన్ని పరిపూర్ణం చేసుకోవడానికి చేసే బాహ్య పాలనా నిర్వహణ దినం మార్పులు చేసే రోజు కాదు. ఎప్పుడైతే అంతరంగంలో తాను స్వతంత్రమని, ఎప్పటికీ స్వతంత్రంగా ఉంటానని గుర్తించటం. ఒక జాతి స్వయం ప్రతిపత్తితో కలిగిన వేర్పాటు, ఆ జాతి యొక్క స్వాతంత్ర్యత అవుతుంది. ఎప్పుడైతే ఆ వేర్పాటు మనలో గుర్తించబడి, ఒక నిర్ణయాత్మక విషయంగా ముద్రితమైనపుడు అది ఆ జాతి స్వాతంత్ర్యమౌతుంది. బాహ్యమైన గుర్తింపు కేవలం సమయంతో ముడిపడి ఉంటుంది. ఆగష్టు

7వ తారీఖు భారతీయ జాతీయతా వాదం యొక్క జన్మదినం. భారత జాతీయత అంటే అంతకు ముందు చెప్పినట్లుగా రెండు విషయాలు ఒకటి జాతీయ స్వేచ్ఛ మంత్రానికి ఆత్మ సమర్పణ మరియు స్వాతంత్ర్యాన్ని సాధన చేయడం. బహిష్కరణ కూడా అనేది స్వేచ్ఛను ఆచరణలో పెట్టడం. ఎప్పుడైతే ఆగష్టు 7వ తేదీన మనం బహిష్కరణను ప్రకటించామో అది కేవలం మనం వ్యవస్థీకరించిన ఆర్థికమయిన తిరుగుబాటు మాత్రమే కాదు. అది దేశ స్వాతంత్ర్యాన్ని సాధన చేయడం వేరుగా ఆర్థికంగా స్వయం సమృద్ధిని కలిగి ఉండాలనుకొనటం, తన జీవనపు ప్రతి వ్యవహారంలో స్వతంత్రంగా ఉండాలనే ప్రయత్నం ఎందుకంటే ఈ వ్యవహారాలన్ని కూడా ఒక దానిపై ఒకటి పరస్పరాధారితమైనవి. ఏ రోజైతే భారతదేశం తన ఆత్మలో స్వీయ స్వాతంత్ర్యాన్ని కనుగొన్నదో, ఎప్పుడైతే మనం ఐక్యత అనే ఒకే మార్గంలో, ఆత్మ జ్ఞానానికి ఏకైక పథంలో వెనుతిరగకుండా అడుగులు వేసామో అదే భారత జాతీయత జన్మించిన రోజు, అదే ఆగష్టు 7వ తారీకు. ఆ రోజే నవ్య భారత జాతీయతకు పునాది రాయి వేయబడింది.

CWSA 6-7:623

కులానికి ఆధారం, కులనాశం

సంఘంలో వివిధ కార్యాల విభజన కోసం ముందుగా యూరప్ దేశాలలో వర్గాలు ఏర్పడినట్లుగానే కుల వ్యవస్థ ఏర్పడింది. కానీ ఈ దేశంలో విభజన జరగటానికి ఆధారమయిన సూత్రాలు భారతదేశానికి మాత్రవే ప్రత్యేకమయినవి. యూరప్ దేశాల నాగరికత ప్రాథమికంగా భౌతికం. అందువలన వారి వర్గీకరణ సిద్ధాంతాలు కూడా వారి దృష్టిననుసరించి ఎప్పుడూ భౌతికంగానే ఉంటాయి. కానీ మన నాగరికత ఎల్లప్పుడూ ఆధ్యాత్మికమూ, నైతికము అందువలన కుల వర్గీకరణ ఒక ఆధ్యాత్మిక ధ్యేయాన్ని, మరియు ఆధ్యాత్మిక నైతిక ఆధారాలను కలిగి ఉంది. యూరపులో అది వర్గాల విభజన శక్తులు, హక్కుల వితరణలో తన మూలాలను కలిగి ఉంది. విభేదించుకునే అభిరుచులతో ఇంకా ఘర్షణ పడుతూ ముందుకు సాగుతుంది. తన ధ్యేయం సంఘాన్ని కేవలం తన కోసమే వ్యవస్థీకరించుకోవటం, ముఖ్యంగా తన ఆర్థిక సౌలభ్యం కోసం, కానీ భారతదేశంలో కుల విభజన సాంఘికమైన బాధ్యతలను నిర్దేశించటానికి ఉద్దేశించబడింది. ఒక వ్యక్తి కులం అతని ధర్మంపై అనగా

ఆధ్యాత్మికము, నైతికము మరియు ఆచరణాత్మక విధులపై ఆధారపడి ఉండేది. అతని ధర్మం అతని స్వభావంపైన అంటే అతని వ్యక్తిత్వం, జన్మతః సంక్రమించిన ప్రకృతిపై ఆధారపడి ఉంటుంది. కేవలం బ్రాహ్మణ కులంలో జన్మించటం వలన ఒక వ్యక్తి బ్రాహ్మణుడు కాలేడు. అతడు జాతిని ఆధ్యాత్మికంగా మరియు మేధోపరంగా ఉన్నత స్థితిలో నిలబెట్టగలిగినపుడే నిజమైన బ్రాహ్మణుడు కాగలడు. మరియు అతడు ఆధ్యాత్మిక స్వభావాన్ని పెంపొందించుకొని తనకు ఆ కార్యానికి అర్హత కలిగించే ఆధ్యాత్మిక శిక్షణను పొంది ఉండాలి. ఒక క్షత్రియుడు ఒక యోధునికి పుత్రుడిగా లేదా ఒక రాజకుమారునిగా జన్మిస్తే సరిపోదు. అతడు నిజమైన క్షత్రియుడు కావాలంటే దేశాన్ని రక్షించగలిగి ఉండాలి. ఉత్తమమైన ధైర్య సాహసాలను దేశం కొరకు నిలబెట్టగలిగి ఉండాలి. అతను రాచ స్వభావాన్ని, తన విధులకు తగిన దృఢమైన, ఉన్నతమైన యుద్ధ శిక్షణను పొంది ఉండాలి. జాతికోసం సంపదను ప్రోగుచేయడం వైశ్యుల విధి. నిరాడంబర సేవ చేయటం శూద్రుల విధి. వీరి ప్రమేయం లేకపోతే మిగిలిన కులాల వారు సార్వత్రిక మేలుకై తమవంతు బాధ్యతలను నిర్వర్తించలేరు. కులమనేది సాంఘిక పరమైన వ్యవస్థ అనటంలో మా ఉద్దేశ్యమిదే. ఇందువలన సంఘపరమైన గౌరవంలో వివిధ కులాలకు ఒక శ్రేణి ఏర్పడిందనటంలో అనుమానం లేదు. బ్రాహ్మణులు శిఖరాగ్రంలో, శూద్రులు అట్టడుగున ఉండడం జరిగింది. యిది కేవలం ప్రమాదవశాత్తు, బాహ్యంగా, వ్యావహారికంగా ఏర్పడినది మాత్రమే. నిజానికి ఏకమైన విరాట్పురుషునిలో ఒక భక్తి నిండిన బ్రాహ్మణునికి, భక్తి కలిగిన శూద్రునికి మధ్య అసమానత ఏమీ లేదు. యిద్దరూ ముఖ్యాంశాలే. చొక్కామేల అనే మరాఠీ అస్పృశ్యుడు తన బలమే స్వచ్ఛమైనది అని గర్వించే బ్రాహ్మణులకు గురువయ్యాడు. ఛండాలుడు శంకరాచార్యునికి కనువిప్పు కలిగించాడు. ఎందుకంటే అస్పృశ్యుడయిన చొక్కామేలకు దైవ దర్శనం కలిగింది. ఛండాలునిలో పరమాత్మ అయిన శివసాక్షాత్కారం కలిగింది. ఆధునిక శాస్త్ర జ్ఞానపు వెలుగులో కులవర్గీకరణలోకి వారసత్వం పొరపాటుగా ప్రవేశించిందని ఎవరంటారు? కానీ అది ఒక అప్రధానమైన విషయంలా ప్రవేశించింది. భారతీయ నాగరికత ఆధ్యాత్మికతపై ఆధారపడి ఉండడం వలన ఆధ్యాత్మికము, మరియు నైతికమయిన పునాదులపై తన వ్యవస్థను నిర్మించి, భౌతికమయిన విషయాలను, పదార్థానికి సంబంధించిన వ్యవహారాలను,

ప్రక్కన ఉంచుతుంది. అందువలన కులమనేది ఆ కాలపు అప్రమాణ విమర్శల నెదుర్కోవలసిన వ్యవస్థే కాకుండా అది ఒక మహోన్నతమయిన అవసరం కూడా. కుల వ్యవస్థ లేకుండా భారతీయ నాగరికత తన విశిష్ట వ్యక్తిత్వాన్ని లేదా ఏకైక ఆశయాన్ని సాధించగలిగి ఉండేది కాదు.

ఈ వ్యవస్థను గుర్తించటం అంటే, తరువాత అందులో వచ్చిన వక్రీకరణలను గమనించకపోవడం, దానిలో మార్పు కోరుకోకపోవటం అని కాదు. శిథిలం కావడం మానవ వ్యవస్థల నైజం. అవి తమ జీవశక్తిని కోల్పోయి, నశించిపోతాయి. శిథిలమయ్యాయనటానికి మొదటి సంకేతం అవి తన నమనీయతను, తాము దేని నుండి ఆవిర్భవించాయో ఆ అత్యవసరమయిన స్ఫూర్తిని కోల్పోవటం, ఆత్మశాశ్వతం, మార్పు చెందేది శరీరం. ఏ శరీరమయితే మార్పు చెందటానికి నిరాకరిస్తుందో అది మరణించవలసి ఉంటుంది. తాను స్వయంగా మార్పు చెందకుండానే అనేక మార్గాలలో వ్యక్తీకరించుకోగలదు. కానీ శరీరం జీవించాలని అభిలషిస్తే మారే పరిసరాలకు అనుగుణంగా మార్పు చెందవలసి ఉంటుంది. కుల వ్యవస్థ జీర్ణస్థితిని పొందినదనటంలో అనుమానం లేదు. కారణం ఒకప్పుడు ఆవశ్యకమయిన ఆధ్యాత్మిక అర్హతలపై నిర్ణయించబడకపోవటం, ఇప్పుడదే అప్రధానమూ, విలువ లేకుండా కేవలం జన్మతః వృత్తిపరంగా నిర్ణయించబడుతుంది. ఈ మార్పు వలన భారతీయత యొక్క మూల ఉద్దేశ్యానికి విరుద్ధంగా నిలవటం వలన దాని అర్థాన్ని కోల్పోయింది. ఏదయితే ఆధ్యాత్మికతను సమర్థించి భౌతికతను వెనుక ఉంచుతుందో విధి నిర్వహణ స్ఫూర్తికన్నా కులాహంకార భావన, విశిష్టత, ఆధిక్యత, అధికారం చెలాయించడం ప్రారంభించింది. ఈ మార్పు దేశాన్ని బలహీన పరిచింది. మనలను ప్రస్తుత స్థితికి తీసుకు వచ్చింది. ఈ విపరీతాలను సరిదిద్దాలని ప్రయత్నిస్తున్నాం. వ్యవస్థ పూర్తిగా రూపాంతరం చెంది, మార్పు చెందిన ఆధునిక కాలానికి అనువుగా ముఖ్యమూ, శాశ్వతమయిన తన ఉద్దేశ్యాన్ని పరిపూర్ణం చేసుకోవాలి. మార్పును నిరాకరిస్తే అది కేవలం ఒక సాంఘికమయిన ఉనికిగా మారి ముక్కలై కూలిపోతుంది. రూపాంతరం చెందినట్లయితే భారతీయ నాగరికతలో ఒక మహోన్నతమయిన పాత్రను పోషించగలుగుతుంది.

CWSA 6-7:682-84

భారతజాతి అంటే...

మన మూర్తిమత్వం, మన నిర్మాణ వ్యవస్థ మూడు అంగాలుగా తయారయ్యింది. మనకు మూడు విధాలైన స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలున్నాయి. మన తత్వశాస్త్రం ప్రకారం మన బాహ్య స్థూల శరీరమే మనల్ని పూర్తి మానవుడిగా నిలుపదు. మొత్తం మూడు శరీరాలనూ పరిగణనలోకి తీసుకోవాలి. అప్పుడే మనం మనిషికి సంబంధించి పూర్తిస్థాయి అవగాహనకు రాగలం. ఇక్కడ మనిషి ఎలానో జాతి కూడా అలానే. మనం మన జాతిని గురించి ఆలోచించినప్పుడు మొట్టమొదట మన భౌతిక నైసర్గిక మాతృభూమిని గురించి ఆలోచించాలి. ఉత్తరాన హిమాలయాల నుండి దక్షిణాన కన్యాకుమారి వరకు విస్తరించుకొని పశ్చిమ, తూర్పు సముద్రాలే హద్దులుగా రూపొందిన మాతృభూమి. గంగ, యమున, నర్మద, కృష్ణ, గోదావరి నదులు నిర్విరామంగా ప్రవహించుతున్నాయిక్కడ. ప్రాచీన నగరాలు, సమున్నత భవ్య ఆలయాలు, కళాత్మక రూపు తీర్చిన గగన చుంబిత హర్మ్యాలు ఉన్నాయిక్కడ. ఇదిగో ఇలా వీటన్నింటితో అలరారే భూమిని మనం 'భారత్'గా పిలుస్తాం. మన జాతి అని మాట్లాడుకొనేటప్పుడు ఈ చిత్రమే, ఈ ఆకారమే మన కట్టెదుట నిలుస్తుంది. ఇది మన దేశ స్థూల శరీరం. బంకించంద్రుని గీతమైన 'వందేమాతరం' ఈ పార్శ్వాన్నే ఎంతో అందంగా వర్ణించింది. 33 కోట్ల మంది ప్రజలు వారివారి హర్షవిషాదాలతో, వారి వారి శుభాశుభాకాంక్షలతో నివసిస్తూ ఉన్నారు. వీరంతా కలసి తన సూక్ష్మ శరీరంలో భాగం. అప్పుడు దేశానికి చెందిన పార్శ్వాలు నియమిత కాల వ్యవధిలో మార్పుల్ని చవిచూస్తాయి. అయినా ఎప్పటికీ శరీరంలోనే ఉంటాయి. బీజప్రాయంగా, అణువుకు మల్లే శాశ్వతంగా ఉండిపోతాయి. అక్కడే అవి మూలధాతువుగా, నిరంతరం ఉండి వాటినుండే భవిష్యత్తు రూపుదిద్దుకొంటుంది. అదే దేశానికి చెందిన కారణ శరీరం.

కాని ఇది సరిపోదు. మన శాస్త్రాల ప్రకారం మనం మనిషి గురించి ఆలోచించినప్పుడు అతడి ప్రస్తుత స్థితినే కాక, అతడి గతం, అతడి భవిష్యత్తును గూర్చి కూడా ఆలోచిస్తాం. అలాగే దేశం విషయంలో కూడా ఇదే నిజం. మన దేశంలోని పర్వతాలు, నదులు, నగరాల గురించి మాట్లాడినప్పుడు ఇప్పటి వర్తమాన రూపాన్నే మనసులో నిలుపుకోం. అలా

చేయం. మనం 5వేల సంవత్సరాల చరిత్ర గురించి మాట్లాడుకొంటున్నాం. మనం దిల్లీ, ఆగ్రా గురించి ముచ్చటించుకొనేటప్పుడు అక్బర్ చక్రవర్తి కాలం నాటి చిత్రమే మన కళ్ళముందు ఉంటుందా? అందుకే జాతి గురించి మాట్లాడేటప్పుడు మనం పూర్వీకులు సాధించిన మహాకార్యాలను జ్ఞప్తికి తెచ్చుకొంటాం. అప్పుడు శివాజీ, అశోకుడు, అక్బర్ ఒక్కసారిగా మన జాతీయతలో సమగ్రమైన అంతర్భాగంగా అయిపోతారు. మన పూర్వబుుషులు కూడా అంతే.

CWSA 6-7:812-13

జాతీయవాదమే మతం

మీరు జాతీయవాదమంటే ఏమిటో నిజంగా గ్రహించారా? మీరు అమితంగా ఆకర్షించి ఆలింగనం చేసుకొంటున్న ఈ మతాన్ని సాక్షాత్కరింపజేసుకొన్నారా? అలా చేసుకొంటేనే మిమ్మల్ని మీరు జాతీయవాదులుగా పిలుచుకోండి. మీరు జాతీయవాదులుగా భావించుకొంటున్నప్పుడు, మీలోని జాతీయతతో జీవించండి. మీలోని పరాక్రమాన్ని గుర్తెరిగే ప్రయత్నం చేయండి. దానిని ముందుకు తెచ్చే ప్రయత్నం చేయండి. తద్వారా మీరు చేసే ప్రతిదీ మీ కార్యం కాదు, మీలోని సత్యానికి చెందిన కార్యం అది. ఇలా ప్రయత్నిస్తే మీరు జీవిస్తున్న ప్రతి ఘడియ ఆ సన్నిధి చేత ఉద్దీపింపబడుతుంది. మీలోని ప్రతి తలంపూ ఆ మహా ప్రేరణలో నుండి ఉబికి వచ్చే స్రోతస్సు చేత సంప్రేరితమౌతుంది. తద్వారా మీలో ఉన్న కార్యయంత్రాంగం, గుణసంపద మీలోని అమృత శక్తి సేవకై సమర్పించబడుతుంది. మీలో చాలామంది నుండి నేను విన్నట్లు ఈ ఆలోచన స్వీకరించడంలో ఎంతో నిదానస్తులు వీళ్ళు. పని కూడా చాలా నిదానంగా చేస్తారు. ఉద్యమానికి సరైన నాయకులు లేరు. మీ ఎదుట వున్న గొప్ప మనుషులంతా ఒక భిన్నమైన విషయాన్ని చెబుతారు. ఏ మార్గమైతే సూచించబడుతుందో దానికి మార్గదర్శనం చేయడానికి ఎవరూ ముందుకు రారు. ఇతరులకు వ్యతిరేకంగా ఇక మీరు ఫిర్యాదులు చేయరు. ఎందుకంటే మీకు ఏ నాయకుని అవసరముండదు. ఆ నాయకుడు మీ అంతరంగంలోనే ఉన్నాడు. మీరు గనుక ఆయనను కనుగొనగల్గితే ఆయన స్వరాన్ని వినగల్గితే ఇక మీరు చెప్పేది ప్రజలు విననట్లుండదు. ఎందుకంటే ఆ స్వరం ఆ ప్రజల్లో

దానంతటా అదే వినబడుతుంది. ఆ దివ్య స్పర్శ, ఆ దివ్యబలం మీలోపలే ఉన్నది. దానిని మీలో మీరు అనుభూతి చెందితే దాని సన్నిధిని జీవిస్తుంటే, అదిగా మీరు అయిపోతే మీలోనుండి వచ్చిన ఒక మాట ఇతరులలో ప్రత్యుత్తర స్వరాన్ని మేల్కొల్పుతుంది. ఏ మతాన్నైతే మీరు బోధిస్తున్నారో అది వ్యాప్తి చెంది అందరికి చేరిపోతుంది. అది ఎంతో కాలం పట్టదు, బెంగాల్లోనూ ఎంతో సమయం పట్టలేదు. అర్ధ శతాబ్దమో, శతాబ్దమో పట్టలేదు మొత్తం దేశాన్ని మార్చడానికి. దానికి కొత్త శక్తిని, హృదయాన్ని అందించడానికి మూడే మూడేళ్లు పట్టింది. జాతీయవాద మతం బెంగాలు నుండే బయలుదేరింది. జాతీయవాదానికి ఒక తార్కాణం కూడా బెంగాలు నుండే లభించింది.

CWSA 6-7:830-31

జాతీయవాదమన్నది ఒక శక్తి దానిని దేవుడు సృష్టించాడు

జాతీయవాదమన్నది స్వయంగా వ్యక్తులు సృష్టించింది కాదు. ఇది వ్యక్తులను లక్ష్యంగా చేసుకోదు. ఇది దేవుడు సృష్టించిన ఒక శక్తి. ఆయన నుంచే స్వయంగా ఒకే ఒక ఆదేశాన్ని పొందింది. అది ముందుకు దూసుకుపోవడమే, దానిని ఆగమని ఆయన ఆదేశించే వరకు మున్ముందుకు సాగిపోతుంది. ఎందుకంటే దాని నియమిత కార్యం నెరవేర్చబడుతుంది. అది అనూహ్యంగా దేనిని లక్ష్య పెట్టక, ఎలా ముందుకు పోవాలో తెలియక పోయినా ఆ దైవశక్తికే విధేయంగా ఉండి, దానిని కాదనకుండా ముందుకు సాగుతుంది. దాని త్రోవలో అడ్డు తగిలేది అది ఏదైనా మనిషి గాని, ఒక సంస్థ గాని, దాని భారంతో పిండిపిండి చేస్తూ తుడిచిపెట్టేస్తూ ముందుకు పోతుంది. పూర్వ పవిత్రత, సర్వ సత్తాక ఆధిపత్యం, గడించిన ప్రజాదరణ ఇలా ఏవీ సాకుగా నిలువవు, పనిచేయవు. ఒక హిమ శిలాపాతం దాని అప్రతిహతమైన, అనూహ్యమైన హఠాత్ గమనంతో మానవ జీవితాన్ని తుడిచిపెట్టేసింది అంటే అది దాని దోషం కాదు. వెయ్యి సంవత్సరాలుగా వేళ్లూని వున్న ఒక ఓక్ వృక్షాన్ని తన మండే హస్తంతో బుగ్గి చేసిన పిడుగుది వక్రనీతిగా ఆరోపించడముండదు. పాత నాయకులనే కాదు కొత్తగా వచ్చిన వారిని కూడా ఆ కెరటం ఒక్క క్షణం పాటు దాని ఉత్తుంగ ప్రవాహంతో పైకి ఎగరవేసింది. సముద్రాన్ని తాను నియంత్రించగలనని, వ్యక్తిగత ఇష్టాయిష్టాన్ని,

కాంక్షని దానిపై విధించగలనని ఊహించుకొంటే దానికి ఖచ్చితంగా జరిమానా కట్టాల్సిందే. ఇవి విప్లవాలు సాగే కాలాలు, నేటి వైభవాన్ని ప్రజాదరణను, కీర్తిని రేపు అన్నది ప్రక్కన పెడుతుంది. పూలదండలు పడుతూ 'వందేమాతరం' అనే నినాదాల మధ్య వేలాదిమంది జన సందోహం వేసే కేకలతో ఇవ్వాళ ఏ నాయకుని రథమైతే నగరాల గుండా పూన్చబడుతుందో, ఆ వ్యక్తే కోపాగ్నికి గురికావచ్చు. అతడు నోరు మెదపడానికి కూడా నిషేధం పడవచ్చు. కాబట్టి ఇది ఎప్పుడూ జరుగుతుంది. దీనిని ఎవ్వరూ ఆపలేరు. ఒక బారిష్టర్, ఒక సంపాదకుడు, ఒక ఆచార్యుడు లోని వ్యక్తిగత ప్రతిభ అతడిని కొంత కాలం పాటు ముందుకు తెచ్చినప్పుడు 'నీవు నా సేవకు రావాలి' అని విప్లవాన్ని, 'నా అతిశయ ఆడంబరానికి కావలసిన సామాగ్రిగా నిన్ను ఉపయోగిస్తాను' అని ప్రళయాన్ని అతడు అనగలడా? ఉద్యమ పాదం వేగవంతమౌతున్న కొద్దీ వెనుకకు వదిలి వేయబడే వారి సంఖ్య పెరుగుతుంది. ఇప్పుడు అతివాదులుగా, అగ్రగామి ఉద్యమ నేతలుగా, జాతీయవాద ప్రబోధకులుగా, ప్రజాదరణ పూరిత భావనను మూర్తీభవించుకొన్న వారు కూడా రేపు అన్ననాడు ప్రక్కకు నెట్టబడతారు. వెనుకనే వదిలివేయబడతారు. ఒక వ్యక్తిగత కాంక్షాదర్పంతో సజీవ స్మారక మూర్తులుగా ఉంటారు. కొన్ని అనర్గళమైన ఉపన్యాసాలు లేదా లిఖిత పూర్వక విన్నపాలు చేయడం మొదలైన సేవలను అందించడం ద్వారా పాత నాయకులు శాశ్వత నేతాగిరినీ హక్కుగా కోరుకుంటారు. కానీ ముందు మనం చాలా పాతవారం. ప్రస్తుతం తమ వ్యక్తిగత వాదనలతో, స్వార్థ పరిత్యాగంతో దేశానికి సేవ చేస్తున్న వారు కూడా వాళ్ళ సేవలను గూర్చి అతిశయంగా భావించుకోకూడదని గుర్తిస్తారు. స్వార్థపరిత్యాగం మాత్రమే స్వార్థమనే ఆలోచనను మటుమాయం చేస్తుంది. దేవుడే నాయకుడని ఆయన చేసేదే సర్వశ్రేష్ఠమైనదని బాల సహజమైన విశ్వాసంతో విప్లవ గతిని ఎవరు అనుసరిస్తారో వారు దేశం కోసం తమ కార్యాన్ని కొనసాగించగల్గుతారు. అలాంటి మనుషులు తమ వ్యక్తిగత కాంక్షతో నడపబడరు. వ్యక్తిగతమైన ఎలాంటి నష్టం వల్ల భగవద్ సంకల్పాన్ని అనుసరించడంలో ఆగిపోరు.

CWSA 6-7:668-69

స్వేచ్ఛా విధానంగా స్వరాజ్

స్వరాజ్ ప్రజల్లో దైవం నుండీ నేరుగా జరిగిన వివేకోదయం. ఇది రాజకీయ స్వేచ్ఛకోసం మాత్రమే కాక విస్తృతంగా పూర్తి వ్యక్తిగతంగా, సామాజిక స్వేచ్ఛగా, జాతి స్వేచ్ఛగా ఏర్పడింది. ఆధ్యాత్మిక స్వేచ్ఛగా సనాతన ఋషులు దీనిని పూర్వమే మనకు ప్రవచించారు. సాంఘిక స్వేచ్ఛను గురించిన సందేశం బుద్ధుడు, చైతన్య మహా ప్రభువు, గురునానక్, కబీరుదాసు, మహారాష్ట్రలోని అవధూతల బోధలలో అంతర్భాగంగా ఉంది. రాజకీయ స్వేచ్ఛ అనేది వారి త్రివిధ బోధలలో చివరిది మాత్రమే. రాజకీయ స్వేచ్ఛ లేనప్పుడు మానవుని మనస్సు నలిగిపోతుంది. ఎవరో కొందరు శక్తివంతమైన ఆత్మ స్వరూపులు మాత్రమే ఈ విధమైన పరిస్థితులను దాటి ఎదగగలరు. మిగిలిన సామాన్యులు ఆయా పరిస్థితులకు బందీలై, అల్పులుగా, బానిసలుగా దిగజారిపోతారు. వ్యక్తే తనకు తానుగా న్యూనతకు గురౌతాడు. ఎక్కడ అల్పమైన లక్ష్యాలకు, ఆలోచనలకు దాసుడు కాకుండా మనిషి ఆత్మ ఉదారంగా, విశాలతలో ఉండడం జరుగుతుందో, అక్కడ సాంఘికంగా స్వేచ్ఛ ఉంటుంది. సాంఘిక స్వేచ్ఛ అనేది సమాజంలోని పాలనా యంత్రాంగం వలన వచ్చేది కాదు. అది మానవ మేధోపరమైన ప్రజ్ఞ ద్వారా మాత్రమే వస్తుంది. ఏ మనిషైతే అల్పమైన కోర్కెల వెంటబడతాడో, అతడు తోటివారితో సోదరభావం కల్గి ఉండలేడు. అంతేకాక వాటిని అధిగమించాలని అంటూనే ఆ అల్ప మూఢనమ్మకాల్లోనే స్థిరపడిపోతాడు. కులం, సంపద అతడిని అధికుడిని చేస్తే, అతడు కుల భేదాలను, సంపాదనా పరమైన తారతమ్యాలను అక్కున చేర్చుకొంటాడు. రాజకీయ స్వేచ్ఛ లేకుండా, వ్యక్తిగతంగా కేవలం కుల, ధన, లేక వర్గాధిపత్యంతో తాను అధికుడననే కాంక్షతో సంకుచిత వలయంలో పరిమితం అవుతుంటే అలాంటి సమాజానికి అనుసరించడానికి ఉన్నతాశయాలంటూ కూడా ఏమీ ఉండవు. రాజకీయ స్వేచ్ఛ అతనికి మానసిక క్షితిజాన్ని విస్తృతం చేస్తే, అతడు తన అల్పమైన కోర్కెలను విస్మరిస్తాడు. అన్నింటికీ మించి బానిసగా ఉన్న ఎలాంటివాడైన ఉన్నతమైన, విశాల దృక్పథం కలిగిన మనస్తత్వం కలిగి ఉండడు. తన వారి సేవకై తానొక బానిసను అని ఎన్నడూ మరిచిపోక, దిగజార్చుకొనే చిహ్నాన్ని ధరిస్తూ, స్వీయ అంకిత భావానికి ఏ మాత్రం అంగీకరించడు. మనిషి ఈ విధంగా అధోగతి పాలైనప్పుడు సమాజం, స్వేచ్ఛగా ఉంటుందని భావించడం వ్యర్థం.

బానిసల సమాజంలో చాలామందికి ఆధ్యాత్మిక స్వేచ్ఛ ఎప్పుడూ ఉండదు. కొంతమంది యోగ మార్గాన్ని అనుసరించి వారి పరిసరాలను, పరిస్థితులను అధిగమించవచ్చు. కాని సామాన్య మానవ సమూహం ఎప్పుడు ఆధ్యాత్మిక మోక్షానికి మొదటి అడుగు వేయలేదు. మోక్షమార్గం స్వార్థంలో ఉందని మేము నమ్మము. తన చుట్టూ ఉన్న మనుషులు దయనీయంగా, పతనమై అధోగతిలో ఉంటే భగవంతుని అనుసరించే వ్యక్తి తన తోటి సోదరుల స్థితిని ఎలా పట్టించుకోకుండా ఉంటాడు? అన్ని జీవుల పట్ల కరుణ అనేది సాధువు స్థితి మరియు అతడు సర్వభూత హితేరతః, అతని మనస్సు అన్ని జీవులకు మేలు చేయాలనే సంకల్పంతో నిండి ఉంటుంది. ఒక వ్యక్తి తన చుట్టూ వినవచ్చే బాధల ఆర్తనాదాలను వినకుండా హృదయాన్ని మూసుకొన్నప్పుడు, తన తోటి మనుషులు దుఃఖంతో, అణిచివేయబడాలని ఇతరుల దురాశకు బలి కావాలనే ధోరణితో సంతృప్తి చెందినప్పుడు తొట్రుపాటుతో అడ్డంకులు, కష్టాలతో మోక్షానికి తన స్వంత మార్గాన్ని వేసుకొంటూ పోతున్నట్లే. అతడు ఇక భగవంతుడు తనలోనే కాదు, కోట్లాదిమందిలో ఉన్నాడని మర్చిపోతాడు. అలా బలం లేని వారికి రాజకీయ దాస్యంలో, ఆధ్యాత్మిక స్వేచ్ఛ అనేది పూర్తిగా అసంభవం. భారతదేశం స్వేచ్ఛగా ఉన్నప్పుడు, వేలాదిమంది స్వర్గపు అంతస్తులో తమ పాదాలు మోపారు. కానీ రాత్రి ప్రగాఢమౌతూ స్వేచ్ఛ అనే సూర్యుడు తన కిరణాలను ఉపసంహరించుకొన్నప్పుడు, ప్రతి భారతీయ హృదయంలో జన్మతః ఉన్న ఆధ్యాత్మిక శక్తి బలహీనంగా, మరింత బలహీనంగా మారి మసకగా మినుకు మినుకు మంటుంది. దానివల్ల విదేశీయులు వారికి వారుగా ఆధ్యాత్మిక బోధకుల పాత్రను చేపట్టారు. భగవంతుడే ఎంచుకొన్న జనులు ఎవరి పూర్వపు వెలుగు మరుగున పడిందో, ఆ జనులు పరాయి బోధకుల పాదాల చెంత కూర్చోవలసి వచ్చింది. దేవుడు భారతదేశాన్ని పవిత్ర ఆధ్యాత్మికత యొక్క శాశ్వత మూలాధారంగా ప్రత్యేకించాడు, స్రోతస్సు ఎండిపోతుందని ఎన్నటికీ వెతచెందదు. కాబట్టి స్వరాజ్యం మనకు వెల్లడి చేయబడింది. మన రాజకీయ స్వేచ్ఛ ద్వారా మనం మరోసారి మన ఆధ్యాత్మిక స్వేచ్ఛను తిరిగి పొందుతాము. సాధుపుంగవులు, ఋషులు ఈ భూమిలో మరోసారి పురాతన యోగాగ్నిని ప్రజ్వరిల్ల జేస్తారు. ఆమె ప్రజల హృదయాలు శాశ్వతుని సామీప్యానికై ఉద్ధరింపబడతాయి.

CWSA 6-7:874-76

హిందువు మేధస్సు స్వచ్ఛమైన కార్యం కోసం కాదు, కాని ఆ కార్యంలోని ఆలోచనను, ఆకాంక్షను సిద్ధింపజేసుకోవడం కోసం. శరీరం తన లోపలి ఆజ్ఞను పాటించే ముందు ఆత్మ ముందస్తుగా ఆలోచిస్తుంది. ఒక హిందువు జీవితం అంతర్గతంగా ఉంటుంది. అతని బాహ్య జీవితం ఆత్మ కదలికలను పునరుత్పత్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. అతని చింతన మరియు చర్యల అన్యోన్య సంబంధం అతని శాశ్వత జీవిత శక్తి రహస్యం. అతని బాహ్య జీవితం, ఇతర జాతుల మాదిరిగానే, పెరుగుదల, క్షీణతకు, గొప్ప కాల ఖండాలకు, పతన కాల ఖండాలకు లక్ష్యంగా ఉంటుంది. కాని ఇతర జాతులకు పరిమితి, గడువు ఉన్నప్పటికీ అతనికి ఏమీ లేదు. ఎప్పుడైతే మరణం తన భాగాన్ని హక్కుగా తీసేసుకుంటుందో హిందూజాతి సమస్తం అమరత్వ మూలంలో ఆశ్రయం పొందుతుంది. ఆత్మ తనకు తాను స్రోతస్సులోకి లాక్కొంటుంది. కొత్త ఉనికి కోసం తనను తాను నవీకరించుకొంటుంది. జాతీయ జీవనామృతాన్ని భారతదేశమే కనుగొన్నది. ఈ అమరత్వం, ఈ జీవిత మహారహస్యం ప్రపంచం అందుకోగల అర్హత పొందే వరకు వేలాది సంవత్సరాలుగా ఆమె నిధిగా దానిని ఉంచింది. ఇప్పుడు పతనం, మరణాల అంచున వున్న ఇతర జాతులకు దానిలో భాగాన్ని అందించే సమయం ఆసన్నమైంది. ఐరోపాలోని ప్రజలు భౌతిక జీవితాన్ని కడపటి అభివ్యక్తీకరణకు చేర్చారు. శారీరక ఉనికికి సంబంధించిన విజ్ఞాన శాస్త్రం పరిపూర్ణం చేయబడింది. కాని వాళ్ళ విజ్ఞాన శాస్త్రం నయం చేయలేని వ్యాధులతో బాధపడుతున్నారు వాళ్ళు.

ప్రయోగాత్మక మేధాశక్తితో ఇంగ్లాండు, స్పష్టమైన తార్కిక మేధాశక్తితో ఫ్రాన్స్, తన శ్రద్ధాన్వితమైన ప్రతిభతో జర్మనీ, తన ఉద్వేగభరిత శక్తితో రష్యా, వాణిజ్యశక్తి యుక్తులతో అమెరికా, మానవాభివృద్ధికి చేయగల్గినదంతా చేశాయి. అయితే ప్రతిదేశం తన విలక్షణమైన సామర్థ్య పరిమితి వరకు చేరుకొన్నది. ఐరోపా సరఫరా చేయలేనిది ఏదో కొరత ఉంది. ఈ తరుణంలో ఆసియా మేల్కొన్నది, ఎందుకంటే ప్రపంచానికి ఆమె ఆవశ్యకత ఉంది. ఆసియా ప్రపంచ మనశ్శాంతిని కాపాడే సంరక్షకురాలు. ఐరోపా కలుగజేసే రోగాలకు వైద్యురాలు. యుగాలుగా ఆమె స్వీయ అన్యోన్యత, స్వయంసమృద్ధి,

ఆత్మ నిమగ్నత నుండీ ఎప్పటికప్పుడు లేచి ఒక నిర్దిష్ట సమయం పాటు ప్రపంచాన్ని శాసించేందుకు నియమించబడుతుంది. తద్వారా ఆమె మాత్రమే ప్రసాదించే రహస్యాలను ఆమె పాదాల చెంత కూర్చొని నేర్చుకొనేందుకు ప్రపంచమంతా ఆమె వద్దకు చేరగలదు.

CWSA 6-7: 1019-20

స్వరాజ్యానికి అత్యావశ్యక షరతు

స్వరాజ్యానికి అత్యావశ్యక మరో షరతేమిటంటే, జన బాహుళ్యపు రాజకీయ అవగాహనను పెంపొందించడం, కొన్ని వర్గాలు, పాలక వర్గాలు, మేధావి వర్గాలు, మహా అయితే వ్యాపార వాణిజ్య వర్గాలు మేలుకొంటే సరిపోయే సమయాలు చరిత్రలో వుండి వుండవచ్చు. కాని ఆధునిక జాతి వ్యవస్థీకరణ, జన బాహుళ్యంలో రాజకీయ అవగాహనను మేలుకొలుపడంపై ఆధారపడి ఉంటుంది. ఇది ప్రజాయుగం, లక్షలాది మంది యుగం, ప్రజాస్వామ్య యుగం. ఆధునిక సంఘర్షణలో ఏ జాతైనా బ్రతికి బట్టకట్టాలనుకొంటే, స్వరాజ్యాన్ని తిరిగి సంపాదించుకోవాలంటే లేక నిలుపుకోవాలంటే అది ప్రజలను మేలుకొలిపి, తాను జాతిలో జీవిస్తున్నానని, జాతి వికసనంతో పాటు తాను వికసిస్తానని, స్వేచ్ఛావంతమైన జాతిలోనే తాను స్వేచ్ఛగా మనగలనని ప్రతి మనిషి అనుభూతి చెందేవిధంగా, వారిని జాతికి సంబంధించిన చైతన్యవంతమైన జీవితంలోనికి తీసుకు రావాలి.

ఈ కార్యక్రమం తిరిగి గ్రామ సమితి మీద ఆధారపడి ఉంటుంది. గ్రామానికి సంబంధించిన ఒక సమైక్య జీవనాన్ని మనం వ్యవస్థీకరించలేకపోతే, విద్యావంతులకు, సామాన్య జన బాహుళ్యానికి మధ్య ఉండే అగాధాన్ని పూడ్చలేము. ఇదిగో ఇక్కడే వారి జీవితాలు కలుసుకుంటాయి. తామంతా ఒకటే అనే అనుభూతి కలుగుతుంది. గ్రామ సమితి కార్యం, గ్రామంలోని సామాన్య జనబాహుళ్యం స్వరాజ్యాన్ని అనుభూతి చెందేటట్లు. గ్రామ సముదాయంలో స్వరాజ్యాన్ని అనుభూతి చెందేటట్లు జిల్లాలో స్వరాజ్యం, మొత్తం జాతిలో స్వరాజ్యాన్ని అనుభూతి చెందేటట్లు చేయడం. జాతిలో స్వరాజ్య భావనకు వాళ్ళు వెంటనే ఉద్ధరించబడకపోవచ్చు. గ్రామంలో పరిఢవిల్లే, స్వరాజ్యాన్ని చూపించడం ద్వారా వారికి శిక్షణ యివ్వవచ్చు. గ్రామ

సమితిని తీర్చిదిద్దకపోతే సామాన్య జన బాహుళ్య రాజకీయవిద్య అసాధ్యమౌతుంది.

CWSA 6-7:1049

సమాఖ్య దృక్పధాలు

సమాఖ్య దృక్పధాలని పిలువబడే తనశాఖలన్నింటియందు, భారతదేశంలో జాతి-భావన తనంతగా వాస్తవ రూపం దాలుస్తుంది. వ్యవస్థపరంగానూ, ఆదర్శం పరంగానూ, ప్రతిదీ తన స్వంత ప్రత్యేక మూలాలను కాపాడుకొంటూ, ఆలోచన లేక సహజశీలం పరంగా యితర శాఖలలో లోపించిన దానిని ప్రతిదీ యిచ్చిపుచ్చుకొంటూ, పౌర సాంఘిక జీవితాల రెండింటిలో సమస్తమూ ఒకే సార్వజనీన ముగింపువైపు, ఆ ముగింపును పురోగమనాత్మకంగా తన స్వకీయ చారిత్రాత్మక, సాంప్రదాయిక విధానాలలో నిజం చేసుకుంటూ కదుల్తుంటాయి. పాతది లేక క్రొత్తదియైన, ఏ విధమైన ఒక ప్రత్యేక జీవన రూపంలో, ఇంత అని చెప్పలేని కాలావధిలో, తమను తాము ఖచ్చితంగా కోల్పోకుండా పరస్పరం అనంతంగా సన్నిహితమౌతూ కదుల్తుంటాయి. ఒక గొప్ప పటిష్ఠ భారత జాతిగా ఏకంగావడానికి, భారతదేశంలోని మహమ్మదీయులు, హిందువులు, బౌద్ధులు, క్రైస్తవులు, ఆ పదానికి సంబంధించిన ఏ అర్థంలోనైనా మహమ్మదీయులు, హిందువులు, బౌద్ధులు లేక క్రైస్తవులు గాకుండా పోనవసరం లేదు. సమాజపు యితర శాఖల సంస్థల ఆదర్శాల యెడల సహనం, గౌరవం చూపిస్తూ ఉమ్మడి పౌరజీవితం, సర్వుల ఆదర్శం యెడల తీవ్రమైన ప్రేమ, ఆదరణ చూపిస్తూ తమ స్వంత ఆదర్శాలు వ్యవస్థల పట్ల భక్తితో ఉండచ్చు. నిజమైన భారత జాతి నిర్మాణానికి మనం కృషి చేసి పండించుకొనవలసినది ఇప్పుడు వీటినే. బ్రాహ్మణ, క్రైస్తవ లేక ప్రచారం చేసే మహమ్మదీయుడి ఏ పద్ధతిలోనైనా దానిని నిర్మిద్దామనే ప్రయత్నం వల్ల అది సాధ్యం కాదు.

ఈ విధానాలలో దేనిద్వారానైనా, ఏ విధమైన ప్రయత్నమైనా, జాతీయయైక్యతను గాక దానికి వ్యతిరేకమైన పనిచేస్తుంది. జాతీయ విందుపీలునామా అని చెప్పబడే దానిని యేర్పాటు చేసిన బాధ్యతారాహిత్య మనుషులు, తమ తప్పుడు నిర్ణయానికే కట్టుబడి వుంటే, విభిన్న తెగలను, మతాలను ఒక చోటికి తీసుకురావడానికి బదులు, ప్రతిచోటా, ప్రాచీన

సంప్రదాయ వ్యతిరేకతను రెచ్చగొట్ట సహాయం చేసిన వారవుతారు పైగా గొప్ప జాతీయోద్యమానికి బహిరంగ శత్రుత్వ ధోరణికి ఎల్లప్పుడూ ప్రాచీన సంప్రదాయానికి సంబంధించిన గొప్ప శక్తులను పురిగొల్పి ఎదురు నిలుపుతాయి. అదేగాక, తమ తాత్త్విక, అశాస్త్రీయ అత్యుత్సాహంలో ఈ అప, అవాంఛనీయ పద్ధతుల ద్వారా తుడిచిపెట్టి వేయ శక్తిని కోల్పోయేటట్లు చేయ, ఈ విభేదాల్నే పటిష్ఠమైనవిగా చేయడానికి, కులం, ఆచారాలకు సంబంధించిన అసలు సంకెళ్ళను మరింత బిగించాలనుకొనే ప్రతిచర్యను అది తీసుకొస్తుంది. జాతీయ విందుపేరు క్రింద గత శుక్రవారం నాడు, జరిగిన దుష్కార్యపు తప్పిదాన్ని ఈ దృష్టితోనే మేం ఖండిస్తున్నాం.

CWSA 6-7:169

జాతి, దేశం

జాతి అంటే ఏమిటి? మనం పాశ్చాత్య పాఠశాలల్లో చదివాం. మన స్వంత లోతైన భావాలను, యథార్థతర సంభాషణ రీతిని మరచిపోతూ పాశ్చాత్య ఆలోచనను, భాషను అనుకరించడం నేర్చుకున్నాం. పాశ్చాత్యులకు జాతి అంటే దేశం. తాను ఎన్నుకొన్న ఏకైక పాలనా ప్రభుతకు విధేయమై ఉండి ఒకే భాష మాట్లాడే, ఒకే రాజకీయ జీవితాన్ని జీవించే అనేక లక్షలాది మంది కల, యింత విస్తీర్ణం గల యింత భూమే వారికి జాతి అంటే. తన దేశం కోసం ఒక సజీవ భావావేశాన్ని అనుభూతి చెందాలని ఐరోపియుడు అభిలషిస్తే, ఆతడు నివసిస్తున్న భూమికొక మూర్తిత్వాన్ని కల్పించి, జడ ప్రాయ భువిలో ఒక గుండె చప్పుడును అనుభూతి చెంద ప్రయత్నించి, తన స్వకీయ మేధస్సుకు సంబంధించిన ఒక అస్పష్ట రూపాన్ని ఆరాధిస్తాడు. జాతీయతకు సంబంధించి భారతీయ భావన మరింత యథార్థతరమూ, మరింత లోతైనదీ అయివుంది. మన పూర్వీకుల తాత్త్వికత వస్తువుల స్థూల దేహం ద్వారా చూచి, దానిలోపలే వున్న ఒక సూక్ష్మ శరీరాన్ని ఆవిష్కరించింది. శాశ్వతంగా స్థిర సింహాసనాసీనమైన, మార్పులేని, అవినాశియైన దానిని దాని ద్వారా చూచి మరొక, మరింత లోతులో దాగివున్న ప్రాణం, రూపం మహామూలాన్ని మూడవ దేహంలో కనుగొని ఆవిష్కరించారు. ఒక వ్యక్తిగత వస్తువులో ఏది యథార్థమౌతుంది. మనిషి విషయంలో ఏది యథార్థమో అది మొత్తం జాతి విషయంలో కూడ సత్యమే. దేశం, ప్రదేశం, కేవలం జాతికి సంబంధించిన

బాహ్య దేహం, అన్నమయ కోశం, లేక స్థూల భౌతిక దేహం. తమ సాన్నిధ్యంతో ఆ ప్రదేశాన్ని ఆక్రమించి జాతి దేహాన్ని ఉజ్జీవింపచేసే జన బాహుళ్యం, లక్షలాది మంది జీవితం జాతి ప్రాణమయ కోశం, జాతి ప్రాణ శరీరం. ఈ రెండూ మాతృమూర్తి స్థూల దేహం, భౌతిక అభివ్యక్తి. జాతి సూక్ష్మదేహంగా అయ్యే ఆలోచనలు, సాహిత్యం, తత్త్వ శాస్త్రం, మానసిక భావావేశ క్రియకలాపాలు, ఆశల మొత్తం, సుఖ సంతోషాలు, ఆకాంక్షలు, సాఫల్యతలు, నాగరికత, సంస్కృతి, అన్నీ కలిసిన ఒక సూక్ష్మ దేహం స్థూల దేహంలో ఉంది. చర్మ చక్షువులకు కన్పించే బాహ్య అస్తిత్వమైన మాతృమూర్తి జీవనపు భాగంగా ఒప్పుతుంది. ఇంకా చెప్పాలంటే జాతి ఈ సూక్ష్మ జీవితం, జాతి కారణ శరీరంలో వున్న ఒక లోతైన అస్తిత్వం నుండి పెల్లుబుకుతోంది. యుగాల అనుభవం నుండి అది అభివృద్ధి చేసుకొన్న ఈ ప్రత్యేక వైయక్తిక స్వభావం, దానిని ఇతరుల నుండి వేరుచేసి చూపుతున్నది. ఈ మూడు మాతృమూర్తి మూడు దేహాలు. కాని వాటన్నింటి యందు, అమృత, మార్పు చెందని, ఆమె జీవన మహామూలం వున్నది. ప్రతి జాతి కేవలం ఒక అభివ్యక్తి, వైశ్వనారాయణ, మనమందరం ఎవరి బిడ్డలమో, ఆ అనేకమందలి ఏకైకం.

ఒక జాతిని గురించి మనం మాట్లాడినపుడు, మన అర్థం, ఆ దేశాన్ని నింపివేసిన లక్షలాది ప్రజలు ప్రత్యేక జీవనం అని, అదీగాక ఒక ప్రత్యేక సంస్కృతి, నాగరికత, ఒక విలక్షణమనే జాతీయ వైయక్తిక స్వభావం, ఇది మార్పుకలవిగానంత దృఢంగా వ్రేళ్ళూనుకొన్న సజీవమైన, పవిత్రమైన, ఆరాధనీయమైన జాతీయత. జీవనంలో భగవంతుని ఒక అభివ్యక్తిని వీటన్నింటిలో మనం చూడగలం. ఇదిగో దీనినే మనం మాతృమూర్తి అంటున్నాం. లక్షలాది మంది పుడ్తూ ఉంటారు, మరణిస్తూ ఉంటారు. నేడిక్కడున్న మనం రేపిక్కడ ఉండం. కానీ మాతృమూర్తి వేలాది సంవత్సరాల నుండి నివసిస్తోంది. మనం వెళ్ళిపోయినా ఇంకా వేలాది సంవత్సరాలు నివసిస్తుంది.

CWSA 6-7:1115-16 - *శ్రీ అరవిందులు*

Vol. 53, No. 10
October 2023

Date of Publication
1st October 2023

Registered: PY/41/2021-23

AKHILA - Akhila Bharata Patrika (Telugu)

Registered with the Registrar of Newspapers for India: No. 23593/72 (monthly)

Matter shall reveal the Spirit's face. — Sri Aurobindo

Cover Page Picture:

(About "the Mother's map of India", which includes Pakistan, Nepal, Sikkim, Bhutan, Bangladesh, Burma and Sri Lanka. The "partition" mentioned in the first sentence below is that of Pakistan and India.)

The map was made after the partition.

It is the map of the true India in spite of all passing appearances, and it will always remain the map of the true India, whatever people may think about it.

CWM 13: 360 *The Mother*

Owner: Sri Aurobindo Society
Printer: Swadhin Chatterjee for Sri Aurobindo Ashram press
Publisher: Pradeep Narang for Sri Aurobindo Society
Published from: Society House, 11 Saint Martin Street, Puducherry - 605001
Printed from: Sri Aurobindo Ashram Press,
No. 38, Goubert Avenue, Puducherry - 605 001, India
Editor: K. V. Rao

Single copy Rs. 30 **Annual Subscription Rs. 200 (in India)**

A Monthly Published by

SRI AUROBINDO SOCIETY-605001

అఖిల

అఖిల భారత పత్రిక

నవంబర్ 2023



కృష్ణలీల




విషయ సూచిక

సంపాదకీయం :

భారతీయ మనసునాకట్టుకొని, దాని ఆలోచనా విధానాన్ని ఊహాశక్తిని, క్రియోన్ముఖం చేసిన రెండు పేర్లు రామ, కృష్ణ. రాముడు త్రేతాయుగ అవతారం, కృష్ణుడు ద్వాపర యుగ అవతారం. శ్రీఅరవిందుల, మదర్ దృక్పథం ద్వారా శ్రీకృష్ణ లీలను అర్ధం చేసుకోవడానికి ఈ సంచికలో ప్రత్యేకంగా ప్రయత్నిస్తున్నాం.

అనువాదం : కె.వి. రావు



కృష్ణార్జునులు దైవ, మానవ జంటగా, ధ్యానానికి ఆలవాలమైన శాంతిమయమైన ఆశ్రమంలో కాకుండా, ఘోషించే మైదానంలో, దెబ్బతీసే దాడుల మధ్యలో, యుద్ధ రథంలో పోరాట యోధునిగా ఒకరు, ఆ రథసారథిగా పగ్గాలు చేతపట్టి ఒకరు ఉన్నారు. గీతా బోధకుడు అంటే మనిషిలోని జ్ఞాన రూపంగా తనను తాను ఆవిష్కరించుకునే భగవంతుడు మాత్రమే కాదు, కానీ మన సమస్త కార్యకారణ ప్రపంచాన్ని ముందుకు నడిపించే, భగవంతుడు కూడా. మన మానవత్వం అతని నుంచి వచ్చి, అతని కోసం ఉండి, అతని కోసం పోరాడుతోంది, శ్రమిస్తోంది, ఆయనే భగవంతుడు. మానవ జీవితం మానవ పరిణామ క్రమం ఎవరి వైపు పురోగమిస్తూ పయనిస్తోందో అతడే భగవంతుడు. అతను మనం చేసే కర్మలకు, సమర్పణ తో కూడిన త్యాగానికి రహస్య యజమాని, మనందరికీ స్నేహితుడు.

CWSA 19:19 *శ్రీ అరవిందులు*

కృష్ణుని క్రీడ

శాశ్వత శిశువు; విశ్వవ్యాపక ప్రభువు:

శ్రీకృష్ణుడు విశ్వదేవతగాను, విశ్వాతీత దేవత గాను ప్రాతినిధ్యం వహిస్తాడు, మనిషి ఆయనను తనలో కనుగొనవచ్చు అలాగే, వ్యక్తీకరించబడిన ప్రపంచంలోనూ కనుగొనవచ్చు.

అతను ఎల్లప్పుడూ చిన్నపిల్లాడిగా ఎందుకు రూపకల్పన చేయబడ్డాడో తెలుసుకోవాలనుకుంటున్నారా?

ఎందుకంటే అతను నిరంతరం పురోగమనంలో ఉన్నాడు. ప్రపంచం పురోగమించి ముందుకు వెళుతున్న కొద్దీ, అతని ఆట కూడా పరిపూర్ణమౌతూ ఉంటుంది - నిన్నటి ఆటకు రేపు జరగబోయే ఆటకు సంబంధం ఉండదు. ప్రపంచంలో అతని ఆట పురోగమిస్తున్న కొద్దీ అది రమ్యంగా, మరింత సామరస్యపూర్వకంగా, సంతోషకరమైనదిగా మారుతుంది, దానికి తగ్గట్టు ప్రపంచం దానికి ప్రతిస్పందించి, దానిని దైవంతో పాటు ఆనందించగలదు.

CWM 15:14

వేణువుతో ఉన్న బాలుడు:

వేణువుతో ఉన్న బాలుడు శ్రీ కృష్ణుడు, భగవంతుడు దివ్య ఆనందం నుండి జగన్నాటకంలోకి దిగాడు. మనుష్యజీవిత దిగువ అజ్ఞానపూరిత నాటకాన్ని రూపాంతరీకరించడం ద్వారా, అతని దివ్య ఆనంద లీలని దానిలోకి తీసుకురావడానికి, దాని స్థానంలో అతని దివ్య ఆనంద లీలని స్థాపించడానికి ప్రయత్నిస్తున్న పిలుపుకు సంబంధించిన సంగీతమే అతని వేణువు. నీలోని చైత్య పురుషుడు ఆ పిలుపును విని దానిని అనుసరిస్తాడు.

*

దీనిని, దివ్య ప్రేమ, ఆనందాలకి ప్రభువుగా శ్రీ కృష్ణుని చిత్తరువుగా నేను భావిస్తాను- అతని వేణువు భౌతిక సత్త, భౌతిక ప్రపంచ బంధాల్లో నుండి మేల్కొలపడానికి, ఆ ప్రేమ, ఆనందాల వైపు మరల్చడానికి పిలుస్తుంది.

*

రాధతో ఉన్న కృష్ణుడు దివ్య ప్రేమకు చిహ్నం. వేణువు దివ్య ప్రేమకి సంబంధించిన పిలుపుకు, నెమలి విజయానికి చిహ్నాలు.

CWSA 30:156-57 శ్రీ అరవిందులు

కొంటె కృష్ణుడు

కొద్ది రోజుల క్రితం, **29**వ తేదీ ఉదయం, జీవితంలో మర్చిపోలేని అనుభవాలలో ఒకటి నాకు ఎదురైంది. ఇది మేడమీద నా గదిలో జరిగింది. నేను జపం చేస్తూ కళ్ళు విప్పార్చి చూస్తూ, పచారు చేస్తున్నాను. అకస్మాత్తుగా కృష్ణుడు వచ్చాడు - ఒక బంగారు కృష్ణుడు, మొత్తం బంగారు మయం, బంగారు కాంతిలో గది మొత్తం నిండిపోయింది. నేను నడుస్తున్నాను, కానీ నేను కిటికీల్ని లేదా పరదాను కూడా చూడలేకపోయాను. ఎందుకంటే ఈ బంగారు కాంతి ప్రతిచోటా వ్యాపించి ఉంది, ఆ కాంతి మధ్యలో కృష్ణుడు ఉన్నాడు. అది కనీసం పదిహేను నిమిషాల పాటు అల్లాగే ఉంది. సాధారణంగా అతడు నాట్యం చేస్తున్నట్లుగా ఉన్న చిత్రపటముల్లో ఉన్న రంగు దుస్తులనే ధరించాడు. అతను చాలా కాంతిమయంగా నాట్యం చేస్తూ ఉన్నాడు. “నువ్వు చూడు, ఈ సాయంత్రం దర్శన సమయంలో నేను అక్కడ ఉంటాను. హఠాత్తుగా, నేను దర్శనం ఇచ్చేటప్పుడు ఉపయోగించే కుర్చీ గదిలోకి వచ్చింది! కృష్ణుడు దానిపైకి ఎక్కాడు, అప్పుడు అతని కళ్ళు కొంటెగా మెరిశాయి, “నేను అక్కడ ఉంటాను, నీవు చూడు, నీకు కూర్చోవడానికి స్థలం ఉండదు” అన్నాడు.

ఆ సాయంత్రం వితరణ కోసం క్రిందకు దిగుతూనే మొదట్లో చిరాకు పడ్డాను. నేను హాలులో ఎవరినీ ఉండద్దు అని చెప్పాను, ఎందుకంటే నేను ఏకాగ్రతతో కూడిన వాతావరణాన్ని, ఆత్మకు సంబంధించిన నిశ్చలతను నెలకొల్పాలని కోరుకుంటున్నాను - కాని అక్కడ కనీసం ముప్పై మంది హాళ్లు అలంకరించేవారు ఉన్నారు.

ముప్పై మందిచిన్న చిన్న ప్రకంపనల ద్రవ్య రాశిగా అటు ఇటు కదులుతున్నారు. నేను దూరంగా వెళ్లండి అని చెప్పకముందే - నేను నా కుర్చీలో కూర్చున్నాను - ఎవరో పతకాల పళ్ళాన్ని నా ఒడిలో ఉంచారు. అది

గతాన్ని నా ముందుకు తీసుకు వచ్చింది. అయితే ఆశ్చర్యకర విషయం ఏమిటంటే, అక్కడ ఒక్కసారిగా ఎవరూ లేరు అన్న భావన కలిగింది. "నేను" అనే భావన పోయింది. బహుశా నేను ప్రతిచోటా ఉన్నాను (కానీ వాస్తవానికి నేను ఎల్లప్పుడూ ప్రతిచోటా ఉంటాను, నేను ఎల్లప్పుడూ ప్రతిచోటా ఒకే సమయంలో ఉంటాననే స్పృహతో ఉంటాను), అయితే సామాన్యంగా శరీరానికి సంబంధించిన భావం, భౌతిక కేంద్రం గా శరీరం ఉన్నప్పటికీ, ఆ సాయంత్రం అక్కడ శరీర స్పృహ లేదు. ఎవ్వరూ లేరు, ఎవ్వరూ లేరన్న భావనాత్మక ఆలోచన కూడా లేదు- ఏమీ లేదు. నేను అనే భావన పూర్తిగా పోయింది. నిజానికి ఏదో పతకాలను పంచి పెట్టడం జరిగింది. అది పతకాలను పంచి పెడుతున్నప్పుడు ఆనందం, వాటిని అందుకుంటున్నప్పుడు ఆనందం, ఒకరినొకరు చూచుకోవడంలో ఆనందం, ఆ ఆనందమే ప్రతి చోట ఉంది, మరి నేను? నేను అనేదే లేదు, ఎవరూ లేరు. వితరణ పూర్తయిన తర్వాత, ఏమి జరిగిందో నాకు అర్థమైంది, ఎందుకంటే ప్రతిదీ అదృశ్యమైంది, విషయాలను అర్థం చేసుకొని పనులను నిర్వహించే ఉన్నత మనసు (అర్థం చేసుకోవడం అంటే ఆ పనులతో, వస్తువులతో ఉండడం) కూడా లేదు. అది కూడా పోయింది. ఈ అనుభవం పంచిపెట్టే అంతవరకు కొనసాగింది. ఆ తరువాత అది (శరీరం) మేడమీద గదిలోకి వెళ్లినప్పుడు నేను అనే స్పృహ తిరిగి వచ్చింది. సావిత్రిలో శ్రీ అరవిందులు రాసిన ఒక పంక్తి దీనిని చాలా చక్కగా వ్యక్తీకరిస్తుంది: పరమేశ్వరుడు మాత్రమే ఉండేలా తనను తాను రద్దు చేసుకోవడం.

మదర్: శిష్యునితో సంభాషణ, మార్చి 3, 1960

కృష్ణుని కాంతులు

కాంతులు కొన్ని శక్తుల చర్యను సూచిస్తాయి, సాధారణంగా కాంతులు వాటి రంగు ద్వారా సూచించబడతాయి. తెల్లటి నీలం రంగును శ్రీ అరవిందుల కాంతి అని లేదా కొన్నిసార్లు శ్రీకృష్ణ కాంతి అని పిలుస్తారు.

తెల్లటి నీలం కృష్ణుని కాంతి లేదా నాది; ముదురు నీలాలు తరచుగా చేతనకు సంబంధించిన కాంతిని సూచిస్తాయి.

రెండు లేత నీలం రంగులు ఉన్నాయి, ఒకటి తెల్లటి నీలం, శ్రీ అరవిందుల కాంతి అని పిలుస్తారు, మరొకటి ముందుగా కొంచెం ముదురు నీలం, ఇది

మనస్సు పైన ఉన్న ఉన్నత చేతనను కలిగి ఉంటుంది.

నీలి కాంతి అర్థం, రంగు కు సంబంధించిన ఖచ్చితమైన స్వభావం (ఛాయ) మీద ఆధారపడి ఉంటుంది. చంద్రకాంతి వంటి తెల్లటి నీలి రంగును కృష్ణుని కాంతి లేదా శ్రీ అరవిందుల కాంతి అని పిలుస్తారు - లేత నీలం తరచుగా ప్రకాశిత మనస్సుకు చెందినది - ఉన్నత మనస్సుకు చెందిన మరొక ముదురు నీలం ఉంది, మరొకటి ఊదా రంగుకు దగ్గరగా ఉన్న మరొక రంగు ప్రాణికంలోని శక్తికి సంబంధించినది.

నీలంలో ఒకానొక ఛాయ ఉన్నత మనస్సును సూచిస్తుంది. ముదురు నీలం రంగు మనసుకు సంబంధించినది, అది మానసిక తలంలో శ్రీకృష్ణుని కాంతి.

వివిధ కృష్ణ కాంతులు ఉన్నాయి. తెల్లబారిన వజ్రం నీలం, లావెండరు నీలం, చిక్కని నీలం మొదలైనవి. వ్యక్తమయ్యే తలాలను బట్టి రంగుల ఛాయలు ఆధారపడి ఉంటాయి.

వజ్ర నీలం అధిమానస తలంలో కృష్ణుడి కాంతి - అంతఃస్ఫురణ మనస్సుకు లావెండరు నీలం సంకేతం.

కృష్ణుని కాంతి తెల్లటి చంద్ర నీల కాంతి - భక్తికి సంబంధించిన రంగు లావెండరు నీలం, భౌతిక మనస్సుకు సంబంధించినది ముదురు నీలం, నీలమణి కాంతి ఉన్నత మనసుకే కాక, ఇంకా చాలా వాటికి సంకేతంగా ఉంది.

నీలి కాంతులకు సంబంధించిన అన్ని ఛాయలు శ్రీకృష్ణునివి కావు.

నీలం రాధాదేవి రంగు కూడా.

వంగ పండు రంగు అనేది దివ్య అనుగ్రహం, కరుణల కాంతి.

ఊదా రంగు దయ, కరుణకు సంబంధించిన రంగు, కానీ దివ్య అనుగ్రహం మరింత స్పష్టంగా - భూమిపై ఆధ్యాత్మిక చేతన ఎత్తుల నుండి ప్రవహిస్తున్నట్లుగా దర్శనం లో ప్రాతినిధ్యం వహించింది. బంగారపు కప్పు అంటే నేను దానిని సత్య చేతన అని అనుకుంటాను.

వంగపండురంగు వాస్తవానికి దివ్య కరుణకు సంబంధించిన రంగు లేదా కాంతి, అలాగే కృష్ణుడి అనుగ్రహం.

CWSA 30 : 156-57 *శ్రీ అరవిందులు*

కృష్ణుడి నాటకం: బయటకు కనబడే నామరూపాలు, బాహ్య రూపాలకు వెనుక దాగి ఉన్న పురోగతికి సంబంధించిన శక్తి.

జడ ప్రకృతిలో కృష్ణుడి ఆట: సౌందర్యం, ప్రేమ, ఆనందం సహచరులు, ఆ ఆట నిన్ను విశాలతరం చేస్తుంది, అభివృద్ధి చేస్తుంది.

భౌతికంలో కృష్ణుడి ఆట: భూమిపై అవతార నియమం, అంటే కొత్త దివ్య ప్రపంచ సాక్షాత్కారం.

CWM 15: 14-15

రాధ

రాధ అసలు ఉందో లేదో చెప్పగలరా? ఆమె లేదని నిరూపించేందుకు ఎన్నో గ్రంథ సంపుటాలు ఉన్నాయి.

ఖచ్చితంగా ఆమె జీవించింది, ఇప్పటికీ జీవించి ఉంది.

రాధకి సంబంధించిన చేతన పరమాత్మతో సంపూర్ణ అనుబంధాన్ని సూచిస్తుంది.

*

నీల కృష్ణుడు:

మీరు వీనస్ చుట్టూ చూసిన ఆకుపచ్చ వృత్తాకారం నిజంగా ఆ రంగులో ఉండే వీనస్‌కి సంబంధించిన ప్రకాశం అయి ఉండాలి; కానీ ఇది ఒక ప్రారంభం మాత్రమే, అకస్మాత్తుగా అభివృద్ధి చెందిన దృష్టి శక్తి మొదటి ఆచరణాత్మక అనువర్తనం. ఆ తర్వాత వచ్చినవి, నీలిరంగు, ఊదా రంగులు మీ యోగానికి మరింత ముఖ్యమైనవిగా కనిపించాయి; రెండు రంగులు కృష్ణుడితో సన్నిహిత సంబంధం కలిగి ఉన్నాయి. నీలం అతని ప్రత్యేకమైన, ముఖ్యమైన రంగు, కృష్ణుడు తనను తాను వ్యక్తపరచుకొన్నపుడు అతని ప్రకాశానికి సంబంధించిన రంగు, - అందుకే అతన్ని నీల కృష్ణ అని పిలుస్తారు; "నీల కృష్ణ" లో విశేషణం అంటే బృందావనంలోనో, మధురలోనో, ద్వారకలోనో అతను తన భౌతిక శరీరంలో నీలం రంగులో ఉన్నాడని. నల్ల రంగులో ఉన్నాడని కాదు! ఊదా రంగు కృష్ణుని రక్షణ తత్వానికి సంబంధించిన ప్రకాశం, - అందుకే, చాలా సహజంగా, అది మీకు శాంతిని కలిగించింది. తాను కృష్ణుడితో సఖ్యతగా

ఉన్న సమయంలో ఎప్పుడూ చూశానని, ఇప్పుడు కూడా అది ఆశ్రమాన్ని చుట్టుముట్టడం నిరంతరం చూస్తూనే ఉన్నాను అని మదర్ చెప్పారు. ఇది దృష్టి శక్తి దాని నిష్క్రియ స్థితిని విచ్ఛిన్నం చేసినప్పుడు చూపిన మొదటి అంశం, ఇది చాలా ముఖ్యమైనది. ఇది నీవు కృష్ణునితో సంబంధాన్ని కలిగి ఉన్నావని రుజువు చేస్తుంది, నీ అంతర పురుషునిలో ఇప్పటికే దాని స్పర్శ ఉంది, నీ చుట్టూ ఆ శక్తికి సంబంధించిన ఉనికి, రక్షణ ఉన్నాయి.

CWSA 30:157

లీలామయునిగా కృష్ణుడు:

నీవు ఈ సమస్త ప్రపంచాన్ని అనంతుడైన భగవంతుని అభివ్యక్తీకరణగా, ఆయన ఆడే ఆటగా, లేదా ఆయన చేసే లీలగా, ఆ భగవంతుణ్ణి ఈ ప్రపంచంలోని ప్రతి దానిలోను చూడటమే ఈ యోగానికి అత్యున్నత సిద్ధి. అంతేగాని ఈ ప్రపంచ అభివ్యక్తీకరణకు ఆధారమైన నిరాకార పరమాత్మను మాత్రమే కాదు. నీవు నిరాకార పరబ్రహ్మ కు సంబంధించిన జ్ఞానాన్ని కోల్పోనవసరం లేదు. ఉదాహరణకు శ్రీకృష్ణుడు ఒకే సమయంలో ఈ ప్రపంచానికి ఆధారమై, ప్రపంచంలో ఉన్న వస్తువుల ద్వారా అభివ్యక్తం అవ్వడమే కాక, ప్రపంచాన్ని అధిగమించిన అవ్యక్త పరమాత్మగా కూడా ఉన్నాడు. అవ్యక్తో 'వ్యక్తాత్ పరః'. సదాత్మకు ఆవల అసత్తు నిశ్శబ్ద రూపంగా ఉంది, దీనినే బౌద్ధ శూన్యవాదులు శూన్యంగా వ్యవహరించారు. ఆ నిశ్శబ్దాన్ని దాటిన తర్వాత పరాత్పర పురుషుడు ఉంటాడు. ఈ జగత్తును తన నుండి తయారు చేసినవాడు, దానిలో అంతర్లీనంగా ఉన్నవాడు, పరిమితంగా, అపరిమితంగా ఉంటూ ప్రపంచానికి ఆధారమైన అనంతానంత ఈశ్వరుడు అతడే. ఆయనే అనంతునిగా శాంతిగా,శివునిగా, నారాయణునిగా ఉన్నాడు. ఆ భగవంతుడే శ్రీకృష్ణునిగా, లీలామయునిగా తన ప్రేమతో మనందరినీ తన వైపుకు ఆకర్షిస్తూ, తన కౌశల్యాల ద్వారా మనందరినీ ప్రేరేపిస్తూ, అనేకత్వాన్ని వ్యక్తపరిచే ఈ లోకంలో ఆనందం, పటుత్వం, సౌందర్యాల శాశ్వతమైన ఆటను ఆడుతున్నాడు.

ఈ ప్రపంచం అతనికి ఒక ఆట, సచ్చిదానందాల (సత్, చిత్, ఆనందం) ఆట. పదార్థం పదార్థం కాదని, ఏదో ఒక రోజు గ్రహిస్తావు. అది చేతన, గుణాలు కలగలసిన రూపం. ఆ రూప నాణ్యతను ఇంద్రియ జ్ఞానం ద్వారా

గ్రహించవచ్చు. గుణాల సంయోగమే ఘనత్వం (దృఢత్వం), సంహతి (సంయోగం), ధృతి (శాశ్వతత్వం), ఇది చేతనతో కూడిన స్థితి, మరేమీ కాదు. జడ ప్రకృతిలో, ప్రాణంలో, మనస్సులో ఉన్నది, మనస్సుకు అతీతంగా ఉన్నది అంతా. శ్రీకృష్ణుడే, అనంత గుణ పరబ్రహ్మగా, సచ్చిదానందుడిగా, ఈ ప్రపంచంలో ఆడుతున్నాడు. మనకు ఈ సత్యం ఎరుకలో ఉన్నప్పుడు, మనం దానిలో సురక్షితంగా, శాశ్వతంగా నివసించినప్పుడు, దుఃఖం, పాపం, భయం, మాయ, అంతర్గత కలహాలు, బాధ మన నుండి బల పూర్వకంగా బయటకి నెట్టివేయబడతాయి.

మనము ఉపనిషత్తుల సత్యాన్ని మన అనుభవంతో గ్రహించగలము.

"ఎవరు బ్రహ్మములో రమించే గుణాన్ని కలిగి ఉన్నారో, ఎవరు బ్రహ్మానందాన్ని అనుభవిస్తున్నారో, వారు ఈ ప్రపంచంలో దేనికీ భయపడరు", ఈశా ఉపనిషత్తులో ...

CWSA 13: 76-77 *శ్రీ అరవిందులు*

శ్రీ కృష్ణుడు, అవతరించిన భగవత్తత్వం

శ్రీకృష్ణుని చారిత్రక నేపథ్యం

శ్రీ కృష్ణుని చారిత్రక నేపథ్యం ఆధ్యాత్మికంగా చూస్తే అంత ప్రాముఖ్యత వహించదు, అంత ఆవశ్యకం కూడా కాదు, అయినప్పటికీ దానికి తగినంత విలువ ఉంది. శ్రీకృష్ణుడు కేవలం ఒక పురాణ పురుషుడో లేక కావ్యకల్పనో కాక ఒక చారిత్రక పురుషుడు, ఈ భూమిపై ఒకానొకప్పుడు ఆయన ఉన్నాడు, భారత దేశం గతచరిత్రలో ప్రముఖపాత్ర పోషించాడు అనే విషయంలో నాకెలాంటి సందేహము లేదు. రెండూ వాస్తవాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి, ఆయన ఒక ప్రముఖ ఆధ్యాత్మిక వ్యక్తి, ఆయన ఆధ్యాత్మిక జ్ఞానం ఒక ఉపనిషత్తులో చెప్పబడింది, సంప్రదాయంగా ఆయనని ఒక దైవీక వ్యక్తిగా, ఆయన మరణానంతరం ఆయనను ఒక దైవంగా భావిస్తున్నాం, ఇది మహాభారత కథ, పురాణాలలో చెప్పింది పక్కన పెట్టి చూసినా కూడా. భారతదేశ ఆధ్యాత్మిక చరిత్రలో ఒక ప్రముఖ భాగమైన భాగవత మతంలో, దాని వ్యాప్తిలో ఆయనను దైవంగా భావించి ఆరాధించడం అనేది కేవలం ఒక పురాణమని లేక ఒక కావ్య కల్పనపైనో ఆధారపడింది అని భావించలేం.

మహాభారతం ఒక కావ్యం, చరిత్ర కాదు అయితే ఆ కావ్యం ఒక ఘనమైన చారిత్రక సత్యంపైన ఆధారపడినది, అలా మన సంప్రదాయంలో భాగమయ్యింది, ధృతరాష్ట్రుడు, పరీక్షిత్తు మొదలైనవారు నిజంగానే ఉన్నారు అలాగే శ్రీ కృష్ణుని ఒక నాయకునిగా యోధునిగా రాజకీయవేత్తగా మనం అంగీకరించినట్లైతే అప్పుడు పురాణ సంప్రదాయాలలో ఉన్నదంతా ఒక చారిత్రక విలువను సంతరించుకుంటుంది, అది కేవలం కావ్యకల్పనగానో లేక ఒక పుక్కిటి పురాణంగానో ఉండిపోదు. మనం ఒక సిద్ధాంత పరమైన హేతుబద్ధ దృష్టితో చూసినప్పుడు శ్రీకృష్ణుడు ఒక చారిత్రక పురుషుడు అని నిస్సందేహంగా చెప్పవచ్చు; కానీ నా దృష్టిలో ఆయన ఇంతకు మించిన అవతారపురుషుడిగా భావిస్తాను, అది ఒక చారిత్రక వాస్తవం. ఎలాగైతే క్రీస్తును గురించిన చరిత్రను నేను అంగీకరిస్తున్నానో అట్లే ఇది కూడా.

బృందావన కథలు

బృందావనంలో జరిగిన కథ ఇంకొక విషయం. అది మహాభారత ముఖ్యకథలో భాగం కాదు. అది పురాణాలకు సంబంధించినది. అది కేవలం ఒక సంకేతాత్మక పాత్రగా మాత్రమే మలచబడినట్లుగా భావించవచ్చు. ఒకప్పుడు అటువంటి భావనను నేను అంగీకరించినప్పటికి తరువాత దానిని పక్కన పెట్టడం జరిగింది. అలా పక్కన పెట్టవలసిన అవసరం పురాణ కథల వుద్దేశ్యమైతే కాదు. అది ఎక్కడో వాస్తవంగా జరిగిన లేక జరిగే అవకాశమున్న విషయంగా నాకు అనిపిస్తుంది. గోపికలు వాస్తవంగా ఉన్నారు; కేవలం సంకేతాత్మకం కాదు. అది ఒక గుప్తజ్ఞానానికి చెందిన వాస్తవం. గుప్తజ్ఞానం సంకేతార్థం రెండూ ఒకటి కాదు. సంకేతార్థం అనేది కేవలం మనోనిర్మితమైనది లేక ఊహాగానం అనుకోవచ్చు, కానీ గుప్తజ్ఞానం అనేది ఒక వాస్తవం అది ఎక్కడో ఒకచోట ఉండే ఉంటుంది, భౌతిక జగత్తువెనుక దాగిఉన్నప్పటికీ భూమిపై జీవితానికి అది వాస్తవమే, అది దీనిని ప్రభావితం చేయడమేకాక ఇక్కడ ఒక రూపం కూడా తీసుకుంటుంది. గోపికలకు సంబంధించిన లీల ఎలా కల్పించబడింది అంటే దివ్య గోకులంలో అది ఎల్లప్పుడూ జరుగుతూనే ఉంది. బృందావనంలో అది భూమి మీదకూడా వ్యక్తం అయ్యింది. దానిని ఎల్లప్పుడూ మనం సాక్షాత్కరించుకోవచ్చు, దాని అర్థాన్ని ఆత్మలో అనుభూతం చేసుకోవచ్చు. పురాణాలు రచించిన వారు అది భూమిపైన అభివ్యక్తి చెందిన

అవతారపురుషుడైన శ్రీకృష్ణుని లీలగా దానిని భావించారు, అలాగే భారతీయ ధార్మిక మనసు దానిని ఆ విధంగానే అంగీకరించింది.

ఇటువంటి ప్రశ్నలు వాటినుండి వచ్చిన ఊహాగానాలు ఆధ్యాత్మిక జీవనానికి ఏమాత్రం సంబంధం లేని విషయాలు. ఆధ్యాత్మిక జీవనానికి కావలిసింది శ్రీ కృష్ణునితో అనుసంధానం కావడం. శ్రీకృష్ణుని చైతన్యంలో, ఉనికిలో, ఆధ్యాత్మిక సంబంధంలో, అంతరాత్మలో సంయోగం చెందడంలో ఎదగడం, ఇది సాధించేవరకు, ఆకాంక్షను భక్తిని పెంపొందించుకోవడం, ఆ మార్గంలో ఏ మేరకు సాధ్యమో అంత వెలుగును పొందడం. ఇవన్నీ పొందినవారికి, శ్రీకృష్ణుని ఉనికిలో జీవిస్తూ, ఆయన వాణిని వినగలుగుతూ శ్రీకృష్ణుని సఖుడిగా, గురువుగా, మార్గదర్శిగా, ప్రియుడిగా, బోధకుడిగా అంతకంటే ఎక్కువగా శ్రీకృష్ణుని వలన వారి సంపూర్ణ చైతన్యమును పరివర్తన చెందించుకున్నవారికి, ఆయన ఉనికిని తమలో నెలకొల్పుకొన్నవారికి ఇటువంటి ప్రశ్నలవల్ల కేవలం బాహ్యమైన, పైపై ఆసక్తి మాత్రమే ఉంటుంది. అలాగే తమలో అంతరంగ బృందావనమును, గోపికలతోటి సలిపిన లీలను అనుభవిస్తూ, శరణాగతి చెంది ఆ సౌందర్యాన్ని ఆనందాన్ని మంత్రముగ్ధులయి అనుభవిస్తూ, వేణుగానాన్ని ఆస్వాదిస్తూ ఉన్నవారికి మిగతావిషయాలు పట్టవు. అయితే ఇంకొక దృక్కోణం నుండి చూసినప్పుడు, మనం గనక అవతారం యొక్క చారిత్రక వాస్తవాన్ని అంగీకరించి నట్లైతే అత్యధికమైన ఆధ్యాత్మిక లాభాన్ని పొందుతాము.

కనీసం ఒకసారైన దైవం భూమి పై అవతరించి, సంపూర్ణంగా అభివ్యక్తమై, ఇంకా పరిణామం చెందుతున్న అసంపూర్ణమైన భూతల ప్రకృతిలోకి తన దివ్య పరాప్రకృతితో అవతరించాడు అనే సత్యంపట్ల గట్టి విశ్వాసం కలిగి ఉండడానికి అవకాశం ఉంది.

CWSA 28: 482-84

శ్రీ కృష్ణుని కథలు

బృందావన శ్రీ కృష్ణుడు ఆతని లీలలకు సంబంధించిన కథలు వాస్తవాలా లేక కేవలం లోతైన ఆధ్యాత్మిక అనుభవాలకు సంబంధించిన ప్రతీకలా అనే ప్రశ్నకు సమాధానం ఆధ్యాత్మిక అనుభవాలకు, మార్మికతకు, గుప్త విజ్ఞానానికి మనం ఇచ్చే ప్రాధాన్యతపై ఆధార పడి ఉంది, ఇంకా చెప్పాలంటే అభౌతికమైన

ఇతర చేతనాతలాలకు సంబంధించిన సమాచారం, అలాగే విశ్వ చైతన్యానికి, మానవ చైతన్యానికి, సమిష్టి మానవ చైతన్యానికి గల సంబంధాలపై ఆధారపడి ఉంటుంది.ఆధ్యాత్మిక మార్మిక సత్యాల నేపథ్యంలో చూసినట్లయితే క్లిష్టమైన మాధ్యమం అయిన మానవుని చేతనలో ఇప్పుడు రూపొందుతున్నది ఒక ప్రతిబింబం లేదా ఒకరకమైన రూపకల్పన.అది కాంతిలో, శక్తిలో, సౌందర్యంలో, ప్రభావంలో, పరిధిలో మరింత గొప్పది. అవి విశ్వ చైతన్యంనుండి వచ్చినవి. ఆ విశ్వచైతన్యం యొక్క ప్రతిబింబంతో పోల్చినప్పుడు మానవుడు ఒక పరిమితమైన, పరిణామంలో ఇప్పుడున్నటువంటి స్థితిలో ఇంకా అజ్ఞానంతో నిండివున్న ఒక భాగం వంటివాడు. ఏ జాతి యొక్క చైతన్యంలో దేవతలు వారి రూపాలను సృష్టించిన ప్రజ్ఞ ఆవిష్కృతం అయిందో దాని గురించిన వివరణ పాక్షికం, పైపైది ఇంకా తప్పుదారి పట్టించే వివరణ మాత్రమే అవుతుంది. మానవుని మనసు వీటికి అసలైన సృష్టి కర్త కాదు, అది కేవలం ఒక మధ్యవర్తి మాత్రమే. ఏదైనా సృష్టించాలంటే విశ్వచైతన్యం నుండి వచ్చిన ఒక ప్రాథమిక ప్రేరణను, సూచనను లేక ఒక ప్రసారాన్ని అందుకొనే శక్తి కలిగి ఉండాలి. అప్పుడు దానితో ఎంతవరకు సాధ్యమో అంతవరకు అది చేయగలుగుతుంది. దైవాన్ని గురించి మనిషికి ఉండే ఆలోచనలన్నీ బుద్ధికి సంబంధించినవి. ఆ రూపాలు ప్రతిబింబాలు కొన్ని దైవానికి చెందినవైతే మరికొన్ని ఇతర శక్తులకు, అంశలకు చెందినవి. తనకు విశ్వచైతన్యం నుండి లభించిన సూచనలకు అనుగుణంగా తన బుద్ధితో వీటిని మానవుడు రూపొందించుకుంటాడు. ఎప్పటివరకైతే మానవుడు దైవాన్ని గురించిన ఉన్నతమైన వాస్తవికమైన ఆధ్యాత్మిక మార్మిక జ్ఞానాన్ని పొందలేదో అప్పటివరకు దైవాన్ని గురించి తన మనసుతో చేసే కల్పనలన్నీ పాక్షికమైనవి అసంపూర్ణమైనవి.దేవతలు ముందునుంచే ఉన్నారు, వారిని మానవుడు సృష్టించలేదు. వారిని తనరూపానికి అనుగుణంగా పరికల్పన చేసుకున్నాడు, విశ్వ చైతన్యం నుండి వచ్చిన సూచనలను అందుకొని ప్రాథమికంగా తన శక్తి మేరకు దేవతలను రూపొందించుకొన్నాడు. ఒక చిత్రకారుడు లేదా భక్తుడు దైవాన్ని గురించి ఒక దర్శనం పొందినప్పుడు అది ఆ జాతి మానసంలో స్థిరపడిపోయి అందరికీ ఒకే విధంగా తెలియబడుతుంది, ఆ అర్థంలో చూసినట్లయితే దేవతలను సృష్టించింది మానవుడే అనుకోవచ్చు. అయితే ఈ రూపాలను అతను దర్శించాడు కానీ సృష్టించలేదు. అతను దేవతలకు

ఇచ్చిన రూపాలు అతనికి పైనుండీ ఇవ్వబడినవి మాత్రమే. శ్రీకృష్ణుడిని సంప్రదాయపరంగా మనం చూస్తున్న రూపంలో ఎందరో ఒక శాశ్వత సౌందర్యాన్ని దర్శిస్తున్నారు, వారు దర్శించింది సత్య మైనది, సుందరమైనది కావచ్చు కానీ ఒక వేళ అటువంటి శాశ్వతమైన రూపం శాశ్వతమైన సౌందర్యంతో కనక వాస్తవంగా ఉంటే అది వీరు దర్శించిన దానికన్నా వేయి రెట్లు ఎక్కువ సుందరంగా ఉంటుంది. భరతమాత కేవలం ఒక భూభాగం కాదు, ఒక నిజమైన దేవత, ఒక శక్తి. అన్నీ దేశాలకు ప్రత్యేకమైన దేవతలు ఉన్నారు. వారు ఏ దేశ ప్రజలనైతే ప్రభావితం చేస్తున్నారో వారికంటే శాశ్వతంగా విశ్వచైతన్యంలో సత్తాలో భాగంగా ఉన్నత తలాలలో ఉండి మానవచేతనకు మెరుగైన రూపాన్నిస్తూ ప్రభావితం చేస్తూ ఉన్నారు. మానవుడికి తన చేతన, తన జాతి చేతన పనితీరు మాత్రమే దృష్టిపథంలో ఉండడంచేత, అంతకు మించి ఇంకేదైనా పని చేస్తున్నదా, ప్రభావితం చేస్తున్నదా అనేది తెలియదు గనక అంతా తనవల్లనే జరుగుతోందని అంతకు మించినది విశ్వానికి చెందినది, ఇంకొకటి ఉందనే ఆలోచన రాదు. శ్రీకృష్ణుడి చైతన్యం అనేది ఒక వాస్తవం, అయితే శ్రీకృష్ణుడే లేకుంటే ఆతని చైతన్యం ఎలా వస్తుంది; ఏకపక్షమైన ఆధ్యాత్మిక పరికల్పనల్లో తప్ప చైతన్యం అనేది ఉండాలంటే ఒక వ్యక్తి అస్తిత్వం అట్టి చైతన్యాన్ని కలిగి ఉండాలి. ఒక వ్యక్తి ఉంటేనే అతని వ్యక్తిత్వానికి విలువ, వాస్తవికత అనేవి ఉంటాయి. వాటిద్వారా అతను తనను తాను వ్యక్తపరుచుకుంటాడు, కాని అతను వాటివల్ల రూపొందలేదు. శ్రీకృష్ణుడు ఒక వ్యక్తి, ఒక అస్తిత్వం కలవాడు, ఒక దివ్యపురుషుని గానే అతనిని మనం కలుసుకుంటున్నాం, ఆతని వాణిని వింటున్నాం, ఆయనతో మాట్లాడు తున్నాం, ఆతని ఉనికిని అనుభూతి చెందుతున్నాం. శ్రీకృష్ణుడిని వదిలి శ్రీకృష్ణుని చేతనను మాత్రమే గుర్తించడం అనేది ఒక మానసికమైన పొరపాటు, అది విభజించలేని దానిని విభజిస్తూ ఉంటుంది, అలాగే వ్యక్తికానిదానికి, అంటే అది నైరూప్యమైనదిగనక, వ్యక్తి కంటే కూడా ఎక్కువ ఔన్నత్యాన్ని వాస్తవికతను, శాశ్వతత్వాన్ని కలిగి ఉంటుంది. అటువంటి విభజనలు మనసుకు దాని పనితీరుకు పనికి వస్తాయి గాని వాస్తవం కానేరవు. వాస్తవంలో ఒక పురుషుని వ్యక్తిత్వం అతని అస్తిత్వం నుండి వేరు కాదు.

CWSA 28: 481-82

శ్రీకృష్ణుని లీలలు - ప్రతీకలు

ఇప్పుడు అవతారాలు వారికి సంబంధించిన ప్రతీకల గురించి. ఆధునిక దృక్పథంతో అవతారాలకు సంబంధించిన చరిత్ర, జీవిత విశేషాలు, బయటకు కనిపించే వాస్తవాలు, జీవితంలో జరిగిన విశేషమైన సంఘటనలు మాత్రమే అధ్యయనం చేయడం అనేది ఒక మౌలికమైన తప్పిదం అని నా అభిప్రాయం. నిజానికి ప్రాధాన్యత కలిగిన విషయం ఏమిటంటే వారి చర్యల ద్వారా అస్తిత్వం ద్వారా వారితో పాటు వారు తీసుకువచ్చిన ఆధ్యాత్మిక వాస్తవికత, శక్తి, ప్రభావం. మొట్టమొదటగా ఒక ఆధ్యాత్మిక వ్యక్తి జీవితంలో వారు ఏమి చేశారు, వారి సమకాలీనుల దృష్టిలో వారు ఏమిటి అనేది గాక వారు స్వయంగా ఏమిటి, అంతరికంగా వారు ఏమి చేశారు అనేది ప్రాధాన్యత వహిస్తుంది; నిజానికి అదే వారి జీవితంలో వారి బాహ్య జీవితానికి ప్రాధాన్యతనిచ్చే అంశం కూడా. వారి ఆంతరిక జీవితమే వారి బాహ్య జీవితానికి శక్తిని ఇస్తుంది, అంతేగాక వారి ఆంతరిక జీవితం విశాలమైనది సంపూర్ణమైనది, ఏ చరిత్రకారుడూ, జీవితకథా రచయితలూ వారి జీవితంలో కోకొల్లలుగా ఉండే విశేషాలను అన్నింటినీ సంపుటీకరించలేరు, చెప్పలేరు. వారి బాహ్య జీవితంలో చెప్పుకోదగినవన్నీ వారు ఆంతరికంగా సాధించిన దానికి ప్రతీక మాత్రమే, అలాగే ఇంకా చెప్పాలంటే వారి ఆంతరిక జీవనంకూడా వారిలోని దివ్యత్వ కదలికకు ఒక బాహ్యమైన వ్యక్తీకరణగా, సజీవమైన ప్రతీకగా మనం భావించవలసి ఉంటుంది. ఈ కారణం వల్లనే శ్రీ కృష్ణునికి సంబంధించిన కథలు ఆయన భువిపై చేసిన కార్యాలకు సంబంధించిన విశేషాలు లేక సమకాలీనుల దృష్టిలో శ్రీకృష్ణుడు ఒక దివ్య పురుషుడు లేదా శ్రీకృష్ణుని రూపంలో దైవం తనని తాను వ్యక్తం చేసుకున్నది అనే విషయాలను మనం విచారించవలసిన అవసరం లేదు. బుద్ధుని రాజ్యపరిత్యాగం గురించి, ఆయనను మారుడు పరీక్షించడం గురించి, బోధివృక్షం కింద ఆయన పొందిన జ్ఞానోదయం గురించి చెప్పిందంతా ప్రతీకాత్మకమైన విషయాలే, అలాగే ఒక కన్యకు జన్మించడం, ఎడారిలో సైతాను ప్రలోభాలను తిరస్కరించడం, యేసు శిలువ వేయబడడంకూడా అటువంటి ప్రతీకలే, అవి దేనిని బలపరుస్తున్నాయో అంతవరకు అవి సత్యమే. క్రీస్తు లేదా బుద్ధుడు వారి జీవితాలలో జరిగిన విశేషాలు అందరి మానవుల జీవితంలో కూడా జరిగినవే అయితే వారికి

ఆధ్యాత్మిక ప్రపంచంలో అంత గొప్ప స్థానం ఎందుకు దొరికినట్టు? అంటే వారిద్వారా ఇంకేదో వ్యక్తీకరించబడింది, అది వారి జీవిత విశేషాలు, బోధలకంటే కూడా గొప్పది అయివుండాలి. వారిగురించిన చరిత్ర మనకు దానిగురించి ఏ మాత్రం చెప్పలేదు, అయినప్పటికీ అదే అత్యంత ప్రాధాన్యంగల విషయం.

CWSA 28: 478-79

గీతాచార్యునిగా శ్రీకృష్ణుడు

భగవద్గీత అర్థాన్ని, లక్ష్యాన్ని చక్కగా అర్థం చేసుకోవాలంటే, చెప్పినవారిని, విన్నవారిని, సమయాన్ని, సందర్భాన్ని పరిగణించాల్సిన అవసరం ఉంది. చెప్పిన వారు ప్రభువైన శ్రీ కృష్ణుడు, విన్నవాడు ఆయన స్నేహితుడైన అర్జునుడు, ఇద్దరూ గొప్ప యోధులు. సందర్భం కురుక్షేత్రమనే అతిభయంకర నరసంహారానికి ముందు జరిగిన సంవాదం.

మహాభారతం కేవలం ప్రతీకాత్మకమైనదిగా చెప్పేవారు చాలామంది ఉన్నారు. శ్రీకృష్ణుడు పరమాత్మ అని, అర్జునుడు జీవాత్మ అని, కౌరవులు మానవుని ఆంతరిక శత్రువులు, జీవాత్మ ఎదుగుదలకు అడ్డుగా ఉన్నవారు, పాండవ సైన్యం మోక్షమార్గానికి సహాయకారి అయిన అనేక శక్తుల సముదాయం, ఇలా చెప్పడం మహాభారతాన్ని కింది స్థాయికి లాగడం అవుతుంది, అదే సమయంలో భగవద్గీత లోతైన ప్రాధాన్యతను తగ్గించివేసి క్రియాశీల వ్యక్తులకు దాని ఉపయోగాన్ని,మానవుని అభివృద్ధిని తద్వారా శూన్యంగా చేయడం అవుతుంది. కురుక్షేత్ర సంగ్రామం కేవలం భగవద్గీతకు ఒక నేపథ్యం కాదు. గీత ద్వారా ఏ ధర్మం బోధించబడిందో దాని పాలన ఆ యుద్ధంలోని ముఖ్యోద్దేశం, అలాగే ఉత్తమమైన సందర్భం. కురుక్షేత్ర మహాయుద్ధాన్ని ఒక ప్రతీకగా భావించడం అంటే గీత బోధించిన గొప్ప ధర్మాన్ని కేవలం మౌనసన్యాసులకు పరిమితం చేయడమే, అప్పుడది ~~ఈ~~ ప్రపంచంలో మన జీవితానికి పనికిరానిది అవుతుంది, అప్పుడది వీరులకు, జీవితానికి దారిచూపే ధర్మం అనిపించుకోదు.

గీతను ఉపదేశించిన శ్రీకృష్ణుడు భగవంతుడే అని శాస్త్రాలు చెబుతున్నాయి, గీతలో సైతం శ్రీకృష్ణుడు తాను భగవంతుడు అనే విషయాన్ని ప్రకటించారు, నాలుగో అధ్యయంలోని అవతార సిద్ధాంతం, పదవ

అధ్యాయంలోని విభూతి సిద్ధాంతం భగవంతుడు అన్నీ జీవులలో అంతర్యామిగా ఉండడం, కొన్ని జీవులలో అధికంగా వ్యక్తం కావడం, శ్రీకృష్ణుడిలో సంపూర్ణంగా వ్యక్తం అవడం గురించి చెబుతున్నాయి. అనేకమంది శ్రీకృష్ణుడు అర్జునుడు కురుక్షేత్ర యుద్ధాలను కేవల ప్రతీకలుగా చెబుతున్నప్పటికీ గీత నిజమైన అర్థాన్ని గ్రహించాలంటే ఇటువంటి ప్రతీకలను విస్మరించవలసి ఉంటుంది. ఒకవేళ అవతార సిద్ధాంతం నిజమైతే అప్పుడు శ్రీకృష్ణుడిని ప్రతీకగా భావించడం సాధ్యం కాదు. అందుచేత భగవంతుడే ~~ఈ~~ జ్ఞానాన్ని, బోధని మనకు ఉపదేశించారు అని తెలుసుకోవాలి.

*బెంగాలీ రచనలు **92-93***

ప్రపంచాన్ని మినహాయించి భగవంతుడిని ప్రేమించడమంటే, ఆయనకై చేసే తీవ్రమైన కాని, అపరిపూర్ణ ఆరాధన అవుతుంది.

*

ఒక పక్క ఒంటరియైన కృష్ణుడు, మరో ప్రక్క తన పదునైన ఆయుధాల తోనూ, శతఘ్నులతోనూ మోహరించిన, సాయుధ సుశిక్షితమైన సైన్యం వున్నప్పటికీ, ఒంటరియైన దైవాన్నే ఎంచుకో. నీ దేహం పైనుండి ప్రపంచం తొక్కుకుంటూ పోయినా, దాని పదునైన ఆయుధాలు నిన్ను ఖండాలు ఖండాలుగా చీల్చివేసినా, దారి ప్రక్కనున్న ఆకారం లేని బురదగా నీ అంగాంగాలను దాని ఆశ్వికదళం తొక్కివేసినా పట్టించుకోవద్దు. ఎందుకనంటే మనసు యెల్లప్పుడూ ఒక ప్రతిబింబం, దేహం ఒక గుల్ల. తన తొడుగు నుంచి ముక్తమైన అధ్యాత్మ, విజృంభిస్తుంది, విజయం సాధిస్తుంది.

CWSA 12:457



కృష్ణ

ఈ భయంకరమైన మధురమైన విశ్వంలో
ఆత్మ జన్మించడంలోని అర్థాన్ని చిట్టచివరకు కనుగొన్నాను,
పుడమి ఆకలిగొన్న హృదయం స్వర్గాన్ని అతిక్రమించి
శ్రీ కృష్ణుని పాదాలకై ఆకాంక్షించడం నేను అనుభూతి చెందాను.

ఆ అమృతనయనాల సౌందర్యం నేను కాంచాను,
ఆర్తి నిండిన ప్రియుని వేణుగానాన్ని కూడా విన్నాను,
మరణంలేని పారవశ్యత కలిగించిన విస్మయాన్ని చవిచూచాను,
నా హృదయంలోని వేదన శాశ్వతంగా మూగబోయింది.

ఆ సంగీతం మరింతగా చేరువ అయ్యింది
ప్రాణం అపరిచితమైన ఆనందపారవశ్యంతో వణికింది;
తన ప్రభువు స్పర్శను, కౌగిలిని, ఉనికిని ఆశిస్తూ
సర్వ ప్రకృతి విశాలమైన తన్మయంతో నిశ్చలమయింది.

ఈ ఒక్క క్షణం కోసమే ఎన్నో యుగాలు జీవించాను;
చిట్టచివరకు జగతి పరిపూర్ణమై స్పందించింది నాలో.

Cwsa 2 :608 - *శ్రీ అరవిందులు*

అవతారంగా శ్రీకృష్ణుడు

శ్రీకృష్ణుడు అవతార పురుషుడు. ఆయన ఈ మానుష రూపంలో మనిషి శరీరం, మనస్సు, ఆత్మకున్న ధర్మాన్ని స్వీకరించాడు. దాని ప్రకారమే ఆయన లీలను చూపి, ఆట ఆడాడు. మనం కనుక ఆయన ఆటలోని మర్మాన్ని, దాని అర్థాన్ని గ్రహించగల్గితే ఈ లోకపు ఆటను దీని విధానాన్ని, దీని లక్ష్యాన్ని గ్రహించగలం. సంపూర్ణ జ్ఞానం ద్వారా జరిగే బలపూర్వక కార్యాచరణే ఈ మహాకేళికున్న ప్రధాన లక్షణం. ఈ కార్యాచరణలో, కేళిలో అంతర్లీనంగా వున్న జ్ఞానమే గీతలో వ్యక్తీకరించబడింది.

మహాభారతంలోని శ్రీకృష్ణుడు కార్యశీలుడైన ధీరోదాత్తుడు, మహాయోగి, జగత్‌లోనే మహామనీషి, సామ్రాజ్య స్థాపకుడు, రాజకార్య దురంధరుడు, యోధుడు, క్షత్రియ దేహంతో వున్న బ్రహ్మవేత్త. ఆయన జీవితంలో సర్వోన్నత శక్తి, మహాశక్తి నిగూఢ కేళిని, అసమానమైన దాని అభివ్యక్తిని చూడవచ్చు. తత్ సంబంధిత నిగూఢతకు గీత సవివరణ.

శ్రీకృష్ణుడు లోకాలకు ప్రభువు, విశ్వవ్యాప్త వాసుదేవుడు అయినా ఆయన వ్యాపకత్వాన్ని కప్పివేసుకొని, ఒక తండ్రిగా, ఒక పుత్రునిగా, సోదరుడిగా, భర్తగా, మిక్కిలి అన్యోన్యమైన మిత్రుడిగా, శత్రువుగా అనేక సంబంధాలను మనుషులతో కల్పించుకొని ఈ జగన్నాటకంలోకి ప్రవేశించాడు. భక్తి విధానానికున్న ఉన్నత అంతరార్థాన్ని ఆర్యజ్ఞానంలోని పరమరహస్యాన్ని తన జీవితంలో నిక్షిప్తం చేసుకున్నాడు. వాటికి సంబంధించిన ప్రధాన సూత్రాలు గీతాప్రబోధంలో అంతర్భాగమై ఉన్నాయి.

శ్రీకృష్ణావతారం ద్వాపరయుగానికి, కలియుగానికి సంధికాలంలో వచ్చింది. ప్రతి పరిణామ సహితమైన కల్పాలలో, ఆవృత్తుల్లో భగవంతుడు ఇట్లా సంధికాలంలో పూర్తిస్థాయిలో అవతరిస్తాడు. కలియుగం నాలుగు యుగాల్లో ఎంత అధ్వాన్నమైనదో, అంత శ్రేష్ఠమైనది. ప్రస్తుత యుగం కలిపురుషుని శాసనకాలం. అతడు పాపాలను ప్రేరేపిస్తాడు. మనిషి వికాసానికి ముఖ్య శత్రువు. ఈ కలికాలంలోనే మనిషి అతిగా దిగజారి పోవటం, పతనమవ్వడం జరుగుతుంది. కాని అవరోధాలకు విరుద్ధంగా పోరాడడం ద్వారా బలాన్ని పొందడం కూడా జరుగుతుంది. పాతది నశించడం ద్వారా కొత్త సృష్టి వస్తుంది. ఈ ప్రక్రియను ఈ కలియుగంలోకూడా చూడవచ్చు.

దుష్టత్వ మూలకాలు ప్రపంచ పరిణామ కాలక్రమంలో నశించనున్నాయి. అవి చాలా స్పష్టంగా వాటి ఒక్కొక్క అక్రమమైన వృద్ధి వల్లనే అంతమౌతాయి. మరోపక్క నూతనసృష్టికి చెందిన బీజాలు వేయబడుతూ, అవి మొలకలెత్తుతూ ఆ విత్తనాలే తదుపరి సత్యయుగానికి వృక్షాలవుతాయి. అంతేకాకుండా జ్యోతిష్య శాస్త్రపరంగా చూస్తే గ్రహాలన్నీ ఒకానొక ప్రత్యేక గ్రహ కాల అవధిలో వాటి వాటి ఉపకాల పరిధుల్ని ఆనందిస్తాయి. ఈ కలికాల అవధిలో ప్రతి యుగం అంటే సత్య, త్రేతా, ద్వాపర కలియుగాలు వాటి వాటి ఉపనియమిత కాల అవధిలో మళ్ళీమళ్ళీ ఆనందిస్తాయి. ఈ విధంగా యుగావృత గమనం, ఈ కలియుగంలో ఒక గొప్ప పతనాన్ని, ఒక ఉత్థాన సరళి అనుసరిస్తూ పోతుంది. మరో గొప్ప పతనం, మళ్ళీ ఒక గొప్పఉత్థాన కెరటం. ఇలా ఇవన్నీ భగవంతుని ఉద్దేశ్యాలను పూర్తి చేస్తుంటాయి. ద్వాపర కలియుగాల సంధికాలంలో భగవంతుడు తన అవతారం ద్వారా దుష్టత్వానికి చెందిన అక్రమ వృద్ధిని అనుమతిస్తాడు. అలా దుష్టత్వాన్ని అంతం చేస్తాడు. మంగళకర బీజాలను నాటుతాడు. అవి అంకురించడానికి తగు వాతావరణ పరిస్థితుల్ని సిద్ధం చేస్తాడు. అప్పుడు కలికాల అవధి ప్రారంభమవుతుంది. సత్య యుగాన్ని తేవడంలో ఉపకరించే కార్య సరళిని, రహస్య జ్ఞానాన్ని శ్రీకృష్ణుడు గీతలో పొందుపర్చాడు. కలియుగంలో సత్య యుగపు ఉపకాల అవధి సమయం వచ్చినప్పుడు లోక వ్యాప్తంగా గీతాసూత్ర ప్రబోధ ప్రచారం ఆపశక్యం కానిదవుతుంది. కొద్దిమంది అభ్యాసానికి ప్రజ్ఞకు పరిమితం కావడానికి బదులుగా జన సామాన్యంలోనూ, అటు విదేశీ గడ్డపైన కూడా వ్యాపించిపోతుంది.

కాబట్టి ఆయన వాగ్ధార అయిన గీత నుండి శ్రీకృష్ణుడ్ని వేరు చేయలేం. గీతలో శ్రీకృష్ణుడు దాగి అంతర్లీనంగా ఉన్నాడు. గీత అంటే ఆయన వాణి రూపంలో ఉన్న శ్రీకృష్ణుడే.

*- బెంగాలీ రచనలు **94-95***

యోగ యోగేశ్వరుడు

గీత ప్రసాదించిన జ్ఞానాన్ని స్వీకరించిన గ్రహీత ఒక గొప్ప పరాక్రమవంతుడు, ధీరోదాత్తుడైన అర్జునుడు, దేవేంద్రుని కుమారుడు. పాండవులలో శ్రేష్ఠుడు. ఎలాగైతే ప్రబోధకుడ్ని తెలుసుకోక పోవడం ద్వారా గీత అంతరార్థాన్ని, గీత లక్ష్యాన్ని కనుక్కోవడం ఎంత కష్టమో అంతగానే ప్రబోధాన్ని స్వీకరించే

గ్రహీతను తెల్సుకోకపోవడంతో దాని అర్థం సంకటంలో పడుతుంది. అర్జునుడు శ్రీకృష్ణునికి అత్యంత సన్నిహితుడు. శ్రీకృష్ణుని సమకాలీనులంతా వారి వారి సామర్థ్యం, గత కర్మలకనుగుణంగా మానవరూపంలో పరమ పురుషోత్తమునితో వివిధ రీతుల్లో అనుబంధాలు ఏర్పాటు చేసుకోవడం కోసం అదే కార్యక్షేత్రంలోనికి దిగివచ్చారు. ఉద్ధవుడు శ్రీకృష్ణుని భక్తుడు, సాత్యకీ ఒక విశ్వాసపాత్ర సహచరుడు, ఆయన అనుగామి. రాజా యుధిష్ఠరుడు ఆయన బంధవుగానూ, స్నేహితుడుగానూ ఆయన సలహా మేరకే నడుచుకొనేవాడు. కానీ వేరెవ్వరూ అర్జునుడంతగా శ్రీకృష్ణునితో అత్యంత గాఢానుబంధాన్ని ఏర్పరచుకొన్నవారు లేరు. అత్యంత చనువుతో ప్రియాతిప్రియ అనుబంధాలు అన్నీ ఒకే వయసులో వున్న ఇద్దరి మధ్య సాధ్యమైనాయి అంటే అది శ్రీకృష్ణార్జునుల విషయంలోనే. అర్జునుడు శ్రీకృష్ణుని బావమరిది. ఆయన అంతరంగ సఖుడు. ఆయనకు ఎంతో ప్రాణ సమానమైన సుభద్రకు భర్త. గీతలోని నాల్గవ అధ్యాయంలో అర్జునుడు గీతలోని పరమ రహస్యాన్ని వినడానికి తగిన వ్యక్తిగా శ్రీకృష్ణుడు ఎంచుకోవడానికి వారి మధ్య వున్న ఈ అన్యోన్యతే కారణం అని ప్రత్యేకించి చెప్పాడాయన.

శ్లో॥ స ఏవాయం మయాతే –ధ్యయోగః ప్రోక్తః పురాతనః
భక్తో –సి మే సఖా చేతి రహస్యం హ్యేత దుత్తమమ్॥ (4:03)

మరుపుకు గురైన ఈ ప్రాచీన యోగాన్ని నేను ఈనాడు నీకు వ్యక్తపరుస్తున్నాను. ఎందుకంటే నీవు నాకు అత్యంత సన్నిహిత సఖుడవు, నా భక్తుడవు. ఎందుకంటే ఈ యోగం సర్వోత్తమమైనది. ఈ లోకానికి చెందిన చరమ రహస్యమిది. 18వ అధ్యాయంలో కూడా కర్మయోగానికి చెందిన ప్రధాన సూత్రాన్ని వివరిస్తున్నపుడు ఇదే గీతలోని కీలకాంశమా అన్నట్లు తన వాగ్మూలాన్ని పునరావృతం చేయడం జరిగింది.

శ్లో॥ సర్వ గుహ్యతమం భూయః శృణు మే పరమం వచః
ఇష్టో–సిమే దృఢమితి తతో వక్ష్యామి తే హితమ్॥ (18:64)

అన్నిటి రహస్యమైన నా పరమ వాక్కును మరోమారు విను. నీవు నాకు చాలా ప్రీతిపాత్రుడవు. అందుకే అన్ని మార్గాల్లోకి శ్రేష్ఠమైన ఈ యోగం గూర్చి నీకు చెబుతున్నాను.

బెంగాలీ రచనలు 95-96

మిత్రుడిలా మరియు ప్రియతముడిగా శ్రీకృష్ణుడు

అర్జునుడు మూర్తీభవించిన ఒక భక్తుడు మరియు స్నేహితుడు కావటం వలన భగవంతుడు అతనిని ఎంచుకున్నాడు. వివిధ రకాలయిన భక్తులు ఉంటారు. సాధారణంగా భక్తుడు అనగానే గురుశిష్య సంబంధం మనసుకు స్ఫురిస్తుంది. ఆ భక్తి వెనుక అనుమానం లేకుండా ప్రేమ వుంటుంది. కానీ సాధారణంగా విధేయత, గౌరవం మూఢమయిన సమర్పణ తన ప్రత్యేకమైన లక్షణాలు. ఒక స్నేహితుడు మరొక స్నేహితుని పట్ల గౌరవాన్ని చూపించడు. వాళ్ళు ఛలోక్తులు విసురుకుంటారు. ఆటలాడుకుంటారు, కలసి వినోదిస్తారు, ప్రియమైన సంబోధనలు చేసుకుంటారు. ఆటలలో ఎగతాళి చేసుకుంటారు, అవమానించుకుంటారు, తిట్టుకుంటారు. అర్థంలేని వాదోపవాదాలు చేసుకుంటారు. స్నేహితుడు మరొక స్నేహితుడికి ఎల్లప్పుడూ విధేయంగా ఉండాలని లేదు. ఒకవేళ తన స్నేహితుని బుద్ధి కుశలత, నిజాయితీలతో కూడిన సన్నిహితుల పట్ల ఆరాధనతో అతని సలహాను పాటించినప్పటికీ అది మూఢంగా కాదు. అతనితో వాదిస్తాడు, అనుమానాలు వెల్లడిస్తాడు. కొన్ని సార్లు అతని అభిప్రాయాలను వ్యతిరేకిస్తాడు. మిత్రుల మధ్య సంబంధంతో నేర్చుకోవలసిన మొదటి విషయం భయం లేకపోవడం, రెండవ విషయంలో బాహ్యమయిన మర్యాదను చూపించక పోవటం, ప్రేమ మాత్రమే స్నేహితునికి మొట్టమొదటి మరియు చిట్టచివరి పదం. గీతా జ్ఞానాన్ని అందుకోవటానికి అర్హుడైన వాడు భగవంతుని మహత్వాన్ని, శక్తిని ఆయన జ్ఞానపు లోతును, వైపరీత్యాన్ని తెలిసిన వాడయినప్పటికీ విభ్రాంతి చెందకుండా, నిర్భయంగా అతనితో నవ్వుతూ తీసుకోగలగాలి.

క్రీడలో భాగంగా స్నేహబంధంలో అన్ని రకాల సంబంధాలు ఉంటాయి. గురుశిష్యుల సంబంధం స్నేహంపై ఆధారపడినపుడు అది మధురమైన బంధమవుతుంది. అర్జునుడు గీతా ప్రారంభంలో శ్రీకృష్ణునితో ఏర్పరచుకున్న బంధం సరిగ్గా అటువంటిదే. నువ్వు నా ఉత్తమ శ్రేయోభిలాషివి మరియు స్నేహితుడివి. నేను నిన్నుగాక మరెవరిని శరణు వేడగలను? నేను ఆలోచించే శక్తిని కోల్పోయాను. బాధ్యతల భారంతో భయకంపితుడనౌతున్నాను. ఏమి చేయాలో తెలియక అనుమానాలతో ఊగిసలాడుతున్నాను. విషాదంలో మునిగిపోయి ఉన్నాను. నన్నురక్షించు. నాకు సరైన సలహా ఇవ్వు. ఇహపరాలలో

నా బాధల బాధ్యతను నీ చేతులలో ఉంచుతున్నాను. జ్ఞానం ధ్యేయంగా ఈ విధమైన స్ఫూర్తితో అర్జునుడు మానవాళికి హితుడు మరియు ఉపకారియైన శ్రీకృష్ణుని సమీపించాడు. తల్లి బిడ్డల మధ్య ఉండే సంబంధం కూడా స్నేహంలో భాగమవుతుంది. వయసులో పెద్ద అయి వివేకంలో ఉన్నపుడు, తనకన్నా చిన్నవాడు, తక్కువ జ్ఞానం కలిగిన స్నేహితుణ్ణి తల్లి బిడ్డను చూసినట్లుగా రక్షణ యిచ్చి సంరక్షిస్తాడు. ఎప్పుడూ తన ఒడిలోనే ఉంచుకుని అపాయాల నుండి దుష్టుల నుండి కాపాడుతాడు. శ్రీకృష్ణుడు తన మాతృప్రేమ తత్వాన్ని తనతో స్నేహాన్ని నెలకొల్పుకున్న వారిపై కూడా కలిగి ఉంటాడు. స్నేహం తనలో మాతృ ప్రేమ లోతులనే కాక వివాహ బంధంలోని బలీయతను, ఆనందోత్సాహాలను కలిగి వుంటుంది. స్నేహితులు పరస్పరం సాహచర్యాన్ని కోరుకుంటారు. విడిపోయినప్పుడు దుఃఖిస్తారు. ప్రియమైన స్పర్శకు పరవశిస్తారు. ఒకరికొకరు తమ ప్రాణాన్ని త్యజించడంలో కూడా ఆనందాన్ని పొందుతారు. సేవాబంధం కూడామైత్రిలో భాగమయినపుడు మాధుర్యాన్ని సంతరించుకుంటుంది. పైన చెప్పినట్లుగా పరమాత్మతో ఎంత ఎక్కువ ప్రియమైన బంధాలు నెలకొల్పుకోగలిగితే అంతగా స్నేహం వికసిస్తుంది. వ్యక్తి గీతాజ్ఞానాన్ని స్వీకరించటానికి మరింత అర్హతను పెంపొందించుకుంటాడు.

మహాభారతంలో శ్రీకృష్ణుడి స్నేహితుడైన అర్జునుడిది ప్రధానమైన పాత్ర. గీతలో కర్మయోగం ప్రథమ బోధన. జ్ఞానం, భక్తి, కర్మలు ఈ మూడు మార్గాలు పరస్పరం విభేదించుకోవు. కర్మ మార్గంలో జ్ఞానంపై ఆధారపడి భక్తియొక్క శక్తితోకర్మలు చేయటం, భగవంతుని కోసం పని చేయడం ఆయన సంకల్పానుసారం ఆయనతో మమేకమై పనిచేయటం గీత యొక్క బోధన అయి వుంది. ఐహికమయిన బాధలకు భయభ్రాంతులయిన వారు, జీవితంలో నిరాసక్తతతో, వైరాగ్యంతో దుఃఖించేవారు, భగవంతుని ఈ లీలలో ఆసక్తిని కోల్పోయిన వారు, ఈ క్రీడను విడిచి అనంతత్వంలో తలదాచుకోవాలనుకునేవారు, వారి మార్గం వేరు. గొప్ప యోధుడు వీరులలో అత్యంత ధైర్యసాహసాలు కలిగిన అర్జునునిలో అటువంటి భావన గాని కోరిక గాని లేదు. శ్రీకృష్ణుడు తన పరమ రహస్యాన్ని ఒక తపస్వికో, వివేకియైన వేదాంతికో తెలియజెప్పలేదు, లేదా తన బోధనకు, అహింసకు బద్ధుడైన ఒక బ్రాహ్మణుని

ఎన్నుకోలేదు. అత్యంత శక్తి నైపుణ్యాలు కలిగిన ఒక క్షత్రియ యోధుణ్ణి తన అసమానమయిన జ్ఞానాన్ని స్వీకరించడానికి పాత్రుడిగా భావించాడు. అతను మాత్రమే ఈ గంభీరమయిన బోధనా రహస్యాలలోకి ప్రవేశించగలిగి జీవన సమరంలో ఓటమి విజయాలకు చలించకుండా నిలబడగలడు. ఈ ఆత్మ బలహీనులకు లభ్యం కాదు. మోక్షాన్ని కోరుకోకుండా కేవలం భగవంతుని కనుగొనాలనే ఆకాంక్ష కలవారికి మాత్రమే భగవంతుని సామీప్యత యొక్క రుచి తెలుస్తుంది. తన నిజ ప్రకృతిలో శాశ్వతంగా ముక్తుడనని ఎరిగి, ముముక్షుత్వాన్ని అజ్ఞానము యొక్క చివరి ఆశ్రయంగా తిరస్కరించగలగాలి. ప్రకృతి గుణాలకు అతీతంగా రాజసిక తామసిక అహంకారాన్ని తిరస్కరించిన తరువాత సాత్త్విక అహంకారానికి కూడా బద్ధుడు కావటాన్ని నిరాకరిస్తాడు. క్షత్రియ ధర్మాన్ని అనుసరించడం ద్వారా అర్జునుడు తన రాజసిక లక్షణాలను పరిపోషించాడు. అదే సమయంలో సాత్విక ఆదర్శాన్ని అంగీకరిస్తూ రజోశక్తికి ఒక సాత్వికమయిన రూపాన్ని యిచ్చాడు. అటువంటి వ్యక్తి గీతాబోధనను స్వీకరించటానికి అద్భుతమైన వ్యక్తి.

బెంగాలీ రచనలు 97-99

మానవుడయిన దివ్యకృష్ణుడు

గీతా జ్ఞానసారాన్ని ఆశ్రయించేటపుడు మహాభారతంలో కురుక్షేత్ర యుద్ధ భూమిలో మనకు అర్జునుని గురువుగా పరిచయం చేయబడిన మానవ దివ్యకృష్ణుని ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను మాత్రమే పరిగణిస్తాము. చారిత్రక కృష్ణుడున్నాడనేది అనుమానం లేని విషయం. చాందోగ్య ఉపనిషత్‌లో మనం తొలిసారిగా ఆ పేరు వింటాం. ఆయన గురించి మనకు తెలిసినదల్లా ఆధ్యాత్మిక సంప్రదాయంలో ఆయన పరబ్రహ్మను తెలిసినవాడు. వ్యక్తిపరంగానూ, జీవన విశేషాలలోనూ అందరికీ దేవకీసుతునుగా సుపరిచితుడు. అదే ఉపనిషత్తులో మనం విచిత్ర వీర్యుడి కుమారుడైన రాజు ధృతరాష్ట్రుడి పేరు వింటాం. ఈ యిద్దరు గాథలలో సన్నిహితంగా కలసి ఉండటం వలన మహాభారత నాటకంలో కీలకమయిన నాయకత్వ పాత్రలు పోషించడం వలన వారు సమకాలీనులని ఈ పురాణం ఎక్కువ భాగం కురుక్షేత్ర యుద్ధంలోని చారిత్రక పాత్రలతో జాతి స్మృతిలో ముద్రించబడిన చారిత్రక అంశంగా భావించాలి. క్రీస్తు యుగానికి ముందు నుండి శ్రీకృష్ణార్జునులు మతపరమైన

ఆరాధనలో భాగమని మనకు తెలుసు. వారొక మత వేదాంతపరమైన సంస్కృతికి అనుసంధానమై ఉన్నారని భావించడానికి కారణమై ఉన్నారని, వారి నుండి గీత అనేక విషయాలను, తన జ్ఞానము, భక్తి, కర్మల సమన్వయాన్ని సమకూర్చుకున్నదని, బహుశా మానవరూపంలోని కృష్ణుడు ఈ విద్యకు తొలి గురువు, స్థాపకుడు, రక్షకుడనీ మనకు తెలుసు. గీత తన తరువాతి రూపంలో మార్పులు చెందినప్పటికీ భారతీయ ఆలోచనా దృక్పథంలో కృష్ణుని బోధనను ప్రతిబింబిస్తుంది మరియు ఆ బోధనతో చారిత్రాత్మక కృష్ణునికి, అర్జునునికి, కురుక్షేత్ర యుద్ధానికి గల సంబంధాన్ని వివరించి అది ఒకనాటకీయమైన కట్టుకథ కాదని స్పష్టం చేస్తుంది. మహాభారతంలో కృష్ణుడు ఒక చారిత్రాత్మకయిన పాత్రగాను అవతార మూర్తిగాను చిత్రీకరించబడ్డాడు. కృష్ణుడి ఆరాధన అవతార మూర్తిత్వం క్రీస్తుపూర్వం 5వ శతాబ్దం నుండి ఒకటవ శతాబ్దం కాలానికే ఆవిష్కరించబడింది. అప్పుడే ఆ పురాతన గాథలో పురాణ సంప్రదాయక పద్య కావ్యమయిన ప్రస్తుత మహాభారతంగా రూపుదిద్దుకుంది. బృందావనంలో అవతారమూర్తియొక్క తొలి జీవనపు కథా కవితలో లేదా గాథలో ఒక సూచన ఉంటుంది. ఏదయితే పురాణాలలో ఒక తీవ్రమయిన, శక్తివంతమయిన సంకేతంగా రూపొందిందో, అది భారతీయ మత మనస్సులో ప్రగాఢమయిన ప్రభావాన్నిచూపింది. అనేకమయిన గాథలతో నిండిన హరి వంశంలో కూడా పురాణ కథలకు ఆధారమయిన శ్రీకృష్ణుని జీవిత విశేషాలుంటాయి.

CWSA 19:15-16

సంప్రదాయాలకు అతీతంగా

మనసు పైకి ఎదిగినపుడు మాత్రమే వాస్తవంగా ఆచారాలకు అతీతం కాగలరు మనుషులు. శ్రీకృష్ణుడు దీనిని చేయగలిగాడు, ఎందుకంటే ఆయన మానసిక మానవుడు కాదు, కానీ మనిషి కన్నా గొప్పదైన ఒక చైతన్యం నుండి స్వేచ్ఛగా క్రియ జరిపిన ఒక అధి మానసిక దేవుడు. రాముడు అలా కాదు, ఆయన సాత్విక మానవ మనసుకు చెందిన అవతారమూర్తి. మానసిక, భావోద్వేగ, నైతికతలకు చెందినవాడు- ఆ యుగానికి, ఆ జాతికి చెందిన ధర్మాన్ని అనుసరించాడు. అది ఆయన్ను సహజ స్వభావపరంగా గాంధికి ప్రియం చేసివుండచ్చు. నీకు అప్రియమై వుండచ్చు కానీ గాంధి వైయక్తికంగా

కృష్ణుడి నుండి వివర్తనం చెందటం కృష్ణుడు అవతారం కాదని నిరూపించలేదు, అలాగే నువ్వు శ్రీరాముడి నుండి వైయక్తికంగా వివర్తనం చెందినంత మాత్రాన ఆయన అవతారం కాదని రుజువు చేయలేవు. ఇంతకూ నా ముఖ్యఅంశం ఏమంటే అవతారతత్వం అన్నది వీటి మీద అసలు ఆధారపడదు, దానికి గల ఆధారం, అర్థం, పరమార్థం వేరు.

ఈ రాత్రి శ్రీరామునిపై కొత్తగా పుట్టిన నీ వ్యాఖ్యానాలకు ఒక సంపూర్ణ సమాధానమివ్వడానికి నాకు సమయం లేదు. నువ్వు అవతారమును నైతిక, ఆధ్యాత్మిక పరిపూర్ణతకు చెందిన (సీలె, బంకిమ్‌లు ప్రవేశ పెట్టిన) నూతన దండంతో కొలుస్తూ ఆ ప్రమాణానికి అంటిపెట్టుకుని వున్నావు. కాబట్టే భ్రాంతికి లోనవుతున్నావు.. అదే సమయంలో నేను పూర్తిగా ఇంకో దృక్కోణంలో, దృఢంగా ఈ మానవ కొలతల ప్రమాణాన్ని నిరాకరిస్తున్నాను. బుద్ధుడు తప్ప మిగిలిన పురాతన అవతారాలు పరిపూర్ణతకు ప్రమాణాలు కాదు, ఆధ్యాత్మిక బోధకులు కాదు. శ్రీకృష్ణ పరమాత్మ బోధించిన గీతతో సహా, అది శ్రీకృష్ణుడు సాధారణచేతనకు అతీతమైన చేతనా సమయంలో చెప్పినది. ఆ తర్వాత వెంటనే అది మరుగున పడిపోయిందని ఆయనే చెప్పాడు. వారి గురించి చెప్పాలంటే వారు భూమిపై మానవజాతి పరిణామక్రమంలో నిర్దిష్ట అంశాలను స్థిరపరచడానికి ఒక దివ్యజోక్యం యొక్క సాధనాలు, విశ్వమానవుని ప్రతినిధులు. నేను దానినే విశ్వసిస్తాను. ఈ వాదనలో మరే ఇతర ప్రమాణాన్నైనా సమ్మతించడానికి నిరాకరిస్తాను.

CWSA 28:494

అధిమానస దైవతంగా కృష్ణుడు

శ్రీకృష్ణుడు అతిమానసిక ప్రకాశం కాదు. కృష్ణుడు క్రిందకు దిగి రావటమన్నది అతిమానసిక అవరోహణను, ఆనందాన్ని తీసుకురావడం కాకపోయినా దానికి సిద్ధం చేస్తున్న అధిమానస దైవం యొక్క అవరోహణ. కృష్ణుడంటేనే ఆనందమయుడు ఆయన అధిమనసు ద్వారా పరిణామక్రమాన్ని బలపరుస్తూ దానిని తన ఆనందం వైపు నడిపిస్తాడు.

మనసు, ప్రాణాలలో అధిమానసిక చైతన్యం పనిచేయడం కొరకు శ్రీకృష్ణుడు పనిచేశాడు.

భూమిపై శ్రీకృష్ణుని అభివ్యక్తి ఇక్కడి మానవునికి అధిమానస చైతన్యాన్ని

అందుకునే సంభావ్యతను తెరచిందని చెప్పడం జరిగింది, దానికోసమే ఆయన నిలబడ్డాడు. రాముడు మానసిక మానవునిలో ఒక అవతారం. శ్రీకృష్ణుడు అధిమానస దైవం. అనగా తాను భగవంతుడనని, ఎలాగో అనుకొన్న ఒక దేవత అయితే ఆయన అవతారం కాదు, దైవము కాదు కానీ తాను దైవాన్నని చెప్పుకొన్న యెవరో-

నాకు తెలిసి చాలా కొద్దిమంది ఆయన్ను (కృష్ణుడిని) ఒక అవతారంగా గుర్తించారు. నిశ్చయంగా అది ఒక సాధారణ గుర్తింపు కాదు. ఆయనకు దగ్గరగా వున్న కొద్దిమంది కూడ వారినలా గణించనట్లు కన్పిస్తోంది - అంత ప్రముఖులు కాని విదురుడు, తదితరులు మాత్రమే గుర్తించారు.

కృష్ణునికి దగ్గరగా వున్న వాళ్ళుపైకి కనిపించడానికి ఇతర మనుషుల లాగే వున్నారు. వారంతా ఒకరితో ఒకరు సాధారణ మనుష్యుల లాగే మాట్లాడుకున్నారు, పనిచేశారు, వారి చుట్టూ వున్న వాళ్ళు వారిని దేవుళ్ళుగా తలంచలేదు. స్వయానా శ్రీకృష్ణుడే చాలామంది చేత ఒక సాధారణ మానవునిగా తలంచబడ్డాడు. కొద్దిమంది మాత్రమే ఆయన్ను దైవంగా పూజించారు.

యుగే యుగే అన్నది ఆంగ్లంలో కాలం నుండి కాలానికి అన్నవిధంగా ఒక సాధారణ అర్థంలో ఉపయోగించబడింది, పౌరాణిక గణాంకాల ప్రకారం సాంకేతికంగా యుగాన్ని సూచించలేదు. కానీ 'బహూని' అన్నపదం ప్రత్యేకించి 'తవచ' అనే పదంతో జోడించినపుడు చాలా జన్మలను సూచిస్తుంది. అప్పుడు ఈ అనేక జన్మలు అన్నీ పరిపూర్ణ అవతారాలు కాలేవు. ఈ అనేకానేక జన్మలు అవతారం నుండి అవతారానికి అనుసంధాన తాడును కొనసాగించే విభూతి జన్మలు. ప్రతి జన్మలో కృష్ణునితో అర్జునుని సహచరత్వం గురించి ఏమీ చెప్పబడలేదు. కాని అలా - అనేక - కాకపోయి ఉండవచ్చు.

CWSA 28:499-500

రాధాకృష్ణులు

రాధాకృష్ణుల ప్రేమ సన్నివేశం కేంద్రంగా కల కవితా సంకలన సంకేత రూపంలో భగవంతుని కొరకై అంతరాత్మ కోరిక వెల్లడించబడింది. ఇది వ్యక్తిలోని ప్రాకృతిక అంతరాత్మ ప్రేమ ద్వారా దివ్యఅంతరాత్మను

అన్వేషించడం, ఆయన సౌందర్యానికి వశమయ్యి ఆధీనమయ్యి ఆయన మాంత్రిక మురళికి ఆకర్షితమయ్యి, ముంచెత్తే ఈ ఏకైక భావోద్వేగంలో మొదటి కోరిక ద్వారా దశలవారిగా ఏకతలోని ఆనందానికి, విభజనలోని వేదనలకు, శాశ్వత పరితాపము, పునఃసంయోగము, భగవంతుని కొరకు మానవ ఆత్మ జరిపే ప్రేమకేళికి సాగిపోవడానికి మానవ శ్రద్ధలను, బాధ్యతలను త్యజించడం. అక్కడ ఒక స్థిరపడిన చక్రము, అనుక్రమము, ఒక సూక్ష్మ భావగీతలయ, ఋజుత్వ విజ్ఞప్తి యొక్క ఒక సంప్రదాయ వాక్సరణి, తరచుగా అతి సౌందర్యము వున్నాయి. సిద్ధించిన ఈ భావగీత రూపం జన్మను పరిపూర్ణం చేయడానికి ఇద్దరు ప్రధమకవుల కౌశల్యము నుండి ఒక్కసారిగా ఉప్పొంగింది, వీరిలో ఒకరు బెంగాలీ భాషను ఉపయోగించిన విద్యాపతి, ఇతను పదాన్ని పద కూర్పును పూర్ణం చేసే కళాకారుడు, ఇంకొకరు చండీదాసు, ఇతను ఏ భాషలోనైనా దివ్యప్రేమగీతాలను మధురంగా, గొప్పగా ఆలపించే ప్రేరణ పొందిన గాయకుడు. ఇక్కడి సంకేతం మానవభావావేశానికి చెందిన అత్యంత బాహ్యరూపంలో కొనసాగింది, ఇలా స్థిరంగా కొనసాగుతూ చాలామంది చేత ఇది అర్థం లేనిదిగా భావించబడింది, చైతన్య ప్రభువు మతానికి చెందిన అంకితభావకవులు ఇదే రూపాలను ఉపయోగించడం చేత, వారి భావన తిరస్కృతమైంది. సంకేతానికి వెనుక వున్న ఆధ్యాత్మిక అనుభవ మొత్తం కృపావిష్టుడైన ఆ బోధకునిలో రూపం దాల్చింది, దివ్యప్రేమ పారవశ్యతా అవతరణ, దాని ఆధ్యాత్మిక వేదాంతం ఆయన బోధనలో స్పష్ట రూపాన్ని తీసుకున్నాయి. ఆయన అనుచరులు మునుపటి గాయకుల కవితాత్మక సంప్రదాయాన్ని కొనసాగించారు. వీరు కౌశలంలో వారికన్నా తక్కువ యోగ్యులైనా రూపంలో ఎప్పటికీ అందంగా, విషయంలో తరచుగా గాఢంగా, చలింపజేసేటువంటి గొప్ప కవితా విశేషాన్ని మిగిల్చారు. వేరొక రకమైన కౌశలం రాజపుత్ర రాణి మీరాబాయి పరిపూర్ణ ప్రేమ గీతాలలో సృష్టించబడింది, ఇక్కడ కృష్ణ సంకేతం యొక్క ప్రతిబింబాలు ప్రత్యక్షంగా గాయకురాలి అంతరాత్మ అన్వేషించే దివ్యప్రేమికుని ప్రేమగీతంలోకి మళ్ళుతుంది. కవికి సంకేతరూపం నిర్వ్యక్తికంగా ప్రకటితమవడాన్ని బెంగాల్ కవిత్వం ఇష్టపడింది. ఇక్కడ ఒక వ్యక్తిగత గుర్తు భావోద్వేగానికి ప్రత్యేక తీవ్రతను ఇచ్చింది. దీనికి ఒక దక్షిణాది కవయిత్రి తనను తాను కృష్ణుడికి పెళ్ళికూతురుగా ఊహించుకోవడంతో ఇంకా తిన్నని మలుపు ఇవ్వబడింది.

వైష్ణవ మతానికి, కవిత్వానికి చెందిన ఈ విధమైన ప్రత్యేక శక్తి మానవ భావావేశాల మొత్తాన్ని భగవంతుని వైపు మళ్ళించడంలో వుంది, అక్కడి ప్రేమావేశం అన్నింటి కన్నా తీవ్రమైనది, అన్నింటినీ కరిగించివేసేదిగా ప్రాధాన్యం ఇవ్వబడింది, ఎక్కడ భక్తిమతం యొక్క బలమైన అభివృద్ధి వుందో అక్కడ ఈ భావన పునరావృతమయ్యింది, ఇది భారతీయ కవుల సాహిత్యం లో కన్నా ఎక్కువ శక్తితో, నిజాయితీతో మరెక్కడ ఉపయోగించబడలేదు.

CWSA 20:379-80

కృష్ణుడు-కాళిక

శ్రీకృష్ణుడు, అర్జునునకు ప్రత్యక్షమయ్యే క్షణంలో పరాకాష్ట చెందేందుకు సంసిద్ధంగావడానికి యుగధర్మం దశాబ్దాలుగా చేసిన కార్యం అది. సమస్తము కురుక్షేత్ర విపత్తు వైపుగా అనివార్యంగా జరిగింది. సాధారణ మానవులు ఇది అర్థం చేసుకోలేదు. ఈ విపత్తును నివారించడానికి ఎవరైతే ప్రయత్నించారో, వారు చర్య తీసుకోవడం, లేదా తీసుకోకపోవడం అదంతా రణం సంభవించడానికే దారి తీసింది; దాని గురించి స్వల్పంగా దర్శించినవారు విధి చక్రాల గమనాన్ని ఆపడానికి ప్రయత్నించినదంతా వ్యర్థమయ్యింది; ఫలితాలను ఆశించకుండా కర్మ నిర్వర్తించిన నిష్కామ యోగి శ్రీకృష్ణుడే హస్తినాపురానికి ఆశారహిత రాయబారాన్ని కొనసాగించాడు; కానీ యుగధర్మం దీన్నంతా భరించింది, ఇది కేవలం నదులు సముద్రం వైపు పరుగులు తీయడంలాగా, ప్రకాశించే జ్వాల వైపు శలభాలు రెక్కలతో ఎగిరిపోయినట్లుగా, శక్తివంతమైన, దురహంకార భారత దేశం తన రాజవంశాలతో, దాని ఆయుధాలతో, రథాలతో, మహాసేనలతో పళ్ళు పటపట కొరుకుతూ, ఛిన్నాభిన్నం చేసే మహా కోరలలో తనను తాను కోల్పోయే వినాశకుడి తెరచివున్న నోరు వైపుగా పరుగెత్తడంగా మనుష్యులు తర్వాత మాత్రమే చూశారు. శాశ్వతుని లీలలో భయంకర చలనాలు వున్నాయి, అలాగే అందమైన మధుర చలనాలు వున్నాయి. కురుక్షేత్ర మృత్యునృత్యం లేకుండా బృందావన నృత్యకేళి సంపూర్ణం కాదు; ప్రతిదీ గొప్ప విశ్వసామరస్య చలనంలోని ఒక భాగమే, అది వైషమ్యం నుండి సమ్మతికి, ద్వేషము, కలహాల నుండి బాధను, పాపాన్ని సౌందర్యము, మంచి, ఆనందాలలోకి (శివమ్, శాంతమ్, శుద్ధమ్, ఆనందమ్) రూపాంతరం చెందించడం ద్వారా జరిగే పరిణామ సఫలతకు

పురోగమింపజేస్తుంది.

యుగధర్మ ప్రయోజనాన్ని ఎవరు ప్రతిఘటించగలరు? భారతదేశంలో బలమైన వాళ్ళు ఒక వందమంది గొప్పవేదాంతులు, యోగులు, సూక్ష్మవిజ్ఞత గలవారు, నాయకులు, భావనకు చర్యకు అధీశులు, పుష్పించిన మహామేధతో వున్న ఒక ఉన్నత నాగరికతతో వున్నారు. వీరంతా ఎడమవైపుకు తిరగడానికి బదులు కొంచెం కుడివైపుకు తిరగడమన్నది మొత్తం విపత్తును విముఖం చేసింది. ధనుసును పక్కన పెట్టినపుడు అర్జునుడు ఆలోచించాడు. పాండవుల సకల ఆశలు అతని మీదే వున్నాయి, అతను లేకుండా వారి విజయమన్నది ఒక స్వప్నం, యుద్ధం చేయడం ఉన్మాదక చర్య అయినా శక్తిమంతమైన అర్జునుని నిస్సహాయతకు భగవంతుని అనుజ్ఞను సఫలం చేయవల్సిందిగా యుగధర్మం ఉద్ఘోషిస్తుంది.." నువ్వు లేకున్నా శత్రుదళంలో మోహరించి పోరాడే వారు వుండరు, ఎందుకంటే వీరు కేవలం దేహంలో మాత్రమే జీవించివున్నారు; ఆ దళంలో వెనుక నిలబడి దానిని సఫలం చేయాలనుకున్నవాళ్లు ఇప్పటికే మరణించినవారు. భగవంతుడు సంరక్షించే వాళ్ళను ఎవరు వధించగలరు? భగవంతుడు వధించిన వారిని ఎవరు రక్షించగలరు? వధించే వ్యక్తి కేవలం ఆ సందర్భంలో ఆ పని జరగడానికి ముసుగు వెనుక వున్న సాధనం మాత్రమే, ఇటువైపున దానికి చెందిన కార్యమవుతుంది. ఈ ప్రపంచంలో జరిగిన అన్ని విషయాలలాగే కురుక్షేత్రంలో జరిగిన గొప్ప వధ కూడ సత్యం. సమస్త సృష్టిలో వినాశనము, కాపాడటాలను అమర్చేది భగవంతుని లీల.

CWSA 13:30-31

లోకాత్మ దర్శనం

లోకాత్మ దర్శనం భగవద్గీతలో అత్యావశ్యక మూలకం. శ్రీకృష్ణుడు అర్జునుని మనస్సులో కలిగిన సందేహాలను, సంకోచాన్ని తన తర్కంతో, జ్ఞాన గర్భిత పదాలతో పటాపంచలు చేశాడు. కాని తర్కము, హితబోధ నుంచీ ఉత్పన్నమైన జ్ఞానమూలాలు అంత దృఢమైనవి కావు. ఎప్పుడైతే ఆ జ్ఞానం నిజం చేయబడుతుందో అప్పుడే అది స్థిరంగా స్థాపించబడుతుంది. ఈ కారణంగానే తనలోని దైవం అగోచరంగా బలంగా ప్రేరేపించడం ద్వారానే అర్జునుడు లోకాత్మను దర్శించాలనే కోరికను వ్యక్తపర్చాడు. ఒక్కసారి

లోకాత్మకుసంబంధించిన దర్శనం కలుగగానే సందేహాలన్నీ శాశ్వతంగా నశించిపోయాయి. అప్పుడు అతని మనస్సు శుభ్రం అయ్యి, నిర్మలమయ్యి గీతలోని సర్వోత్కృష్ట రహస్యాన్ని గ్రహించగల్గే అర్హతను పొందింది. లోకాత్మ దర్శనం కన్నా ముందు గీతలో వర్ణించిన జ్ఞానం ఆధ్యాత్మిక సాధకునికి ఎవరికైనా ఉపయోగపడే బాహ్యరూపం జ్ఞానం. కాని ఆ దర్శనం తరువాత వికసించిన జ్ఞానం చాలా నిగూఢమైన సత్యం, పరమ రహస్యం, శాశ్వతమైన సూక్తి. మనం కనుక ఆ దర్శనానికి సంబంధించిన వర్ణనను ఒక కవితాత్మక అలంకారిక కూర్పుగా చిత్రీకరిస్తే గీతలోని సత్యం, గంభీరత, యధార్థత నాశనమౌతాయి. యోగం ద్వారా అందిన పరిపూర్ణమైన మార్గదర్శకాలు ఏవో సాధారణ తాత్విక దృక్కోణాలుగా లేదా కవితాత్మిక భావనలుగా కుదించబడతాయి. లోకాత్మ దర్శనం ఒక కట్టుకథ కానీ, కవితాత్మక దృష్టాంతం కాని కాదు, అది సత్యం, అది అలౌకికమైన సత్యం కూడా కాదు. విశ్వసత్త ప్రకృతిలో కలిసే ఉంది. ప్రపంచ స్వరూపం అలౌకికమైన దృగ్విషయం కాదు. లోకాత్మ అన్నది ఈ కారణ జగత్తుకు సంబంధించిన సత్యం. ఆ కారణ జగత్తుకు సంబంధించి రూపాలు యోగనేత్రానికి కనిపిస్తాయి. అర్జునుడు స్వతః సిద్ధంగా

వైశ్వనర్తనం

వైశ్వ నర్తనానికి రెండులయలు గలవు
బాధ, దుఃఖ, యాదృచ్ఛికతల తాళగతులలో చిందులు వేయు
కాళిపదఘట్టనలను సదా మనమాలకింతుము
భయంకర, మధుర పాచికలాట జీవన సయ్యాట
ఉపదేశముపొందిన తెర మరుగైన వాని అగ్నిపరీక్ష
మృత్యు కౌగిలితో ఆటలాడు యోద్ధ
విధి భయంకర వ్యాయామశాలలో మల్లయోధుడు
దివ్య కృపకేకైక మార్గం బలిదానం.
మర్మాలకు మనిషి విషాదాలో బీగాన్నిచేసె
స్వప్నకాల వ్యర్థాల నుండి సత్యపు యిరుకుదారి
పదార్థ సమాధినుండి లేచుటకు అంతరాత్మ సప్తద్వారాలు
ఆమె విషాద నాట్యవస్తు సామాన్య ప్రేరకాలు
కాని మధురము, హాసభరితము, ప్రహర్ష, ప్రేమల ఆతని ముసుగును
ప్రకృతి ద్వారా ఎపుడు కృష్ణనర్తనము తొలగించు?

CWSA 2:590

యోగనేత్రంతో ఉన్నాడు కాబట్టి ఆ కారణ జగత్తులో విశ్వాత్మను చూచాడు.

బెంగాలీ రచనలు 86-87

రూపం, రూపరహితం

దైవం తన రూపానికి, రూపరహిత స్థితికి బంధింపబడి లేడు, తనను వెతికే అన్వేషకుడికి ఒక రూపంలో ప్రకటితమౌతాడు. ఆ రూపంలో ఆయన సంపూర్ణంగా ఉన్నా, అదే సమయంలో విశ్వమంతా వ్యాపించే ఉంటాడు. ఎందుకంటే దేవుడు కాలానికి, ప్రదేశానికి అతీతంగా ఉంటాడు. వాదానికి దొరకడు, కాలం, స్థలం ఆయన చేతిలో ఆటబొమ్మలు. తన దేశ కాలాదులు అనే వలలో సమస్తజీవుల్ని చిక్కింపజేసి ఆడుకొంటున్నాడు. ఆ వలలో మనమెప్పటికి ఆయనను చేజిక్కించుకోలేము. మనం ఈ అసాధ్యాన్ని తర్కము, తాత్విక వేదనతో సాధించాలనుకొన్న ప్రతిసారీ ఆ విదూషకుడు ఆ వలనుండీ తప్పించుకొని మన ఎదురుగా, వెనుకగా, దగ్గరగా, దూరంగా నవ్వుతూ నిలబడతాడు. తన విశ్వ రూపాన్ని వ్యాపింపజేసి, విశ్వాతీత రూపాన్ని ధరించి, మేధస్సును కూడా ఓడించేస్తాడు. ఎవరైతే 'నాకు దైవం తెలుసు అంటారో వాళ్లకి ఏమీ తెలియనట్టు, ఎవరైతే నాకు దైవం తెలుసు అయినా నాకు ఆయన గురించి తెలియదు' అంటారో వారికి నిజమైన జ్ఞానం ఉన్నట్టు.

బెంగాలీ రచనలు 88

ప్రపంచ స్వరూపం

కారణజగత్తులో నిర్ణయింపబడినవన్నీ మన స్థలకాలాలకు అతీతంగా సూక్ష్మ జగత్తులో ప్రతిబింబింపబడి, పాక్షికంగా భౌతిక ప్రపంచంలో నియమ సూత్రాలకు అనుగుణంగా అభినయించబడతాయి. శ్రీకృష్ణుడు అర్జునునితో 'ధృతరాష్ట్రుని పుత్రులు తన చేత ఎప్పుడో సంహరింపబడ్డారు' అని చెప్పాడు. అయినా వాళ్ళు యుద్ధరంగంలో ఆయన ఎదుట, జీవిస్తూ యుద్ధం చేస్తున్నారు. ఆ దేవాది దేవుని మాటలు అబద్ధపు వాగ్మూలాలు కాదు లేదా అలంకారికమైన శబ్దాలు కావు. ఆయన అప్పటికే కారణ జగత్తులో సంహరించాడు. లేకపోతే ఈ లోకంలో సంహరించడం అసంభవం. మన నిజ జీవితం కారణ జగత్తులోనే ఉంది. దాని నీడ మాత్రమే ఈ భౌతిక ప్రపంచంపై పడుతుంది. కాని నియమాలు, కాలం, ప్రదేశం, ప్రేమ, రూపం అన్నీ కారణ జగత్తు తలంలో

భిన్నంగా ఉంటాయి. లోకాత్మ అనేది కారణ జగత్తులో ఒక రూపం, అది యోగనేత్రానికి ఈ భౌతిక ప్రపంచంలో కనిపిస్తుంది.

బెంగాలీ రచనలు 89-90

శ్రీకృష్ణుని ఉపదేశాలు

శ్రీ అరవిందుల ఉపదేశాలు

'యోగంలో ప్రతిష్టితమైన కామనరహిత బుద్ధి, కర్మకన్న ఉత్కృష్టమైనదైతే, మన పెద్దలను వధించడమనే ఘోర కర్మకు నన్నెందుకు నియోగించావు?' అని అర్జునుడు అడిగాడు. అర్జునుని ప్రశ్నను చాలామంది పునఃప్పృచ్ఛించారు. శ్రీకృష్ణుడు చెప్పిన సమాధానాన్ని కొంతమంది అతి చెడ్డదని సైతం అనడానికి సందేహించలేదు. సన్యాసం కంటె నివృత్తి గొప్పదని తనకివ్వబడిన కార్యాన్ని కోరికలేకుండా చేయడం, తన యిచ్ఛవచ్చిన రీతిని కర్మచేసే స్వేచ్ఛ కంటె చాలా గొప్పదని శ్రీకృష్ణుడు విశదీకరించాడు. పరిత్యాగము అంటే కోరికను త్యజించడం, స్వార్ధాన్ని త్యజించడం. ఆ పరిత్యాగాన్ని నేర్చుకొనడానికి, ఏకాంతాన్ని ఆశ్రయించవలసిన పనిలేదు. కర్మక్షేత్రంలో, కర్మ ద్వారా ఆ పాఠాన్ని నేర్చుకోవాలి. యోగమార్గంలో ఎగబ్రాకడానికి కర్మ ఆలంబనం. వైవిధ్యభరిత క్రీడా ప్రపంచంలో, దాని జీవులకు ఆనందాన్ని తీసుకురావడానికి సృజించబడింది. ఈ ఆనంద క్రీడను ముగించడం భగవంతుని పని కాదు. ప్రపంచాన్ని ఆనందంతో ముంచెత్తడం కోసం జీవులను తన స్నేహితులు గానూ, క్రీడా సహచరులుగానూ అతను తయారుగమ్మంటున్నాడు. మనం అజ్ఞాన అంధకారంలో ఉన్నాం. అలా యెందుకనంటే, క్రీడ కోసం పురుషోత్తముడు తనను తాను దూరం చేసుకుని ఆ విధంగా, తనను తాను తన చుట్టూ అజ్ఞానాన్ని నిలుపుకొన్నాడు. ఆయనతో స్థిరీకరించబడిన అనేక మార్గాలున్నాయి. వాటిని అనుసరించినట్లయితే అతనిని అంధకారం నుండి బయటకు తెస్తాయి. భగవంతుని సహవాసంలోనికి తీసుకువస్తాయి. ఎవనికైనా క్రీడలో ఆసక్తి లేకపోయినట్లయితే, విశ్రాంతి కావాలనుకుంటే ఆతని కోరికను భగవంతుడు నెరవేరుస్తాడు. ఆయున కోసమే, ఆయున మార్గాన్ని అనుసరించినట్లయితే, ఈ ప్రపంచంలో గాని లేక మరెక్కడైనా గాని తన సరియైన క్రీడా సహచరునిగా ఆతనిని భగవంతుడెన్నుకుంటాడు. కృష్ణుని అత్యంత ప్రియమిత్రుడు, క్రీడా సహచరుడు అర్జునుడు, అందుచేత గీత

సర్వోన్నత రహస్యఉపదేశాన్ని అతడు స్వీకరించగలిగాడు.

బెంగాలీ రచనలు : 83-84

కర్మ మార్గము :

కర్మను త్యజించడం ప్రపంచానికి అపకారం కలిగిస్తుంది. కర్మను త్యజించడం సన్యాస తత్త్వం. పరిత్యాగం లేక నివృత్తిలేని సన్యాసం అర్థరహితం. సన్యాసం వల్ల ఏ ప్రయోజనం పొందుతాడో, దానిని నివృత్తిచే కూడా పొందవచ్చు. అనగా అజ్ఞానం నుండి స్వేచ్ఛ, సమత, శక్తి, ఆనందం, శ్రీకృష్ణునితో ఐక్యత. సర్వులతోనూ పూజించబడే మనిషి ఏం చేస్తే, దానిని జనం ఆదర్శంగా భావించి అనుసరిస్తారు. అందుకే సన్యాసం ద్వారా కర్మను విడిచివేస్తే, అందరూ ఆ మార్గాన్ని అనుసరిస్తారు. సాంఘిక విలువలలో అయోమయాన్ని నెలకొల్పుతారు, అధర్మపాలనను తీసుకొస్తారు. కర్మఫలంపై కోరికను విడిచివేసి, మనిషి మామూలు జీవన ధర్మాన్ని కొనసాగిస్తే, ప్రతి వానిని తనకే స్వంతమైన కర్మ విధానాన్ని అనుసరించ ఉత్తేజపరిస్తే, అపుడు నీవు నా జీవన ఉన్నత ధర్మంలో ఒకటై నా సన్నిహిత మిత్రుడవవుతావు అని దైవం అర్జునితో చెప్తాడు. ఇంకా శ్రీకృష్ణుడిలా వివరిస్తాడు. కర్మద్వారా సరైన మార్గాన్ని అనుసరించడం నియమం, చివరగా మార్గం చివర్లో ప్రశాంతతను పొందుతావు. అంటే, చేస్తున్నవాడిననే ధ్యాసను కూడా పరిత్యజించడం. సన్యాసం ద్వారా కర్మను పరిత్యజించడం కాదిది. అహంకారాన్ని తిరస్కరించడంలో వున్న బ్రహ్మాండమైన పరిశ్రమ, కృషి ఇమిడి వున్న సమస్త ప్రాణిక ఆవేశాన్ని, దైవంతో ఐక్యంగావడం ద్వారా వదిలివేయడం ఇది. సమస్త గుణాలను అధిగమించి, ఆతని క్రియాశక్తిచే లోనుండి నెట్టబడుతున్న ఒక పరికరంగా కర్మలను చేయడం ఇది. అటువంటి సందర్భంలో పనిచేసేది అంతరాత్మ శాశ్వత చేతన, అతను కాదు చేసేది., అతడు సాక్షి, దైవం యొక్క భాగం. కర్మకోసం సృజించబడిన అతని దేహం ద్వారా ఆతని స్వీయ అస్తిత్వ ధర్మంచే దైవశక్తి పనిచేస్తోంది. అంతరాత్మ సాక్షి, భోగి, పనిచేసేది ప్రకృతి, దైవం అనుమంత. ఆవిధంగా దీప్తివంతమైన అస్తిత్వం, దైవశక్తి స్వీకరించే ఏ కర్మకైనా సాయపడలేక మందగింపజేయచూడదు. శక్తికి లోబడి, భగవంతునిచే నియమించబడిన కర్మలో దేహం, మనసు, బుద్ధి తమంత తాము తమను నియమించుకొంటాయి. కురుక్షేత్రంలో జరిగినటువంటి ఒక భయంకర

సామూహిక హవనం సైతం, అది భగవంతునిచే ఆమోదించబడినపుడు అంతరాత్మపై తన స్వధర్మాన్ని (ఆంతరిక ధర్మాన్ని) నెరవేర్చడంలో అది సంప్రాప్తిస్తే, పాపంతో మైలపర్చలేదు. కాని ఈ జ్ఞానాన్ని, ఈ గమ్యాన్ని కొద్దిమంది మాత్రమే పొందగలరు. అది సామాన్య మానవునికి జీవన ధర్మంకాజాలదు. అయినపుడు సామాన్య రాదారులగుండా నడిచే వారి కర్తవ్యం ఏమిటి? ఆతడు ప్రభువు, నేను ఉపకరణాన్ని అనే జ్ఞానం, వారికి సైతం కొంతవరకు అందుబాటులోకి రావచ్చు. ఈ జ్ఞానం ద్వారా ఎల్లవేళలా దైవాన్ని జ్ఞప్తియందుంచుకొని తమ ఆంతరిక జీవన ధర్మాన్ననుసరించడమనేది వారికివ్వబడిన దిశా నిర్దేశం.

"స్వధర్మం స్వతహాగా లోపభూయిష్టమైనప్పటికీ, చక్కగా తీర్చిదిద్దబడిన పరధర్మం కంటే, కర్మలను స్వధర్మాన్ననుసరించి చేయడం ఉత్తమం. స్వకీయ అస్తిత్వధర్మంలో అసువులు బాయడం ఉత్తమం. పరధర్మాన్ననుసరించడం

కృష్ణ

ఓ దివ్య ప్రకాశమా, పరిధిలేని చిదాకాశమా,
ఎవరిని నీవు బంధించి దాచి పెట్టావు, మరణంలేని అంగములనా,
వైభవోపేతమైన వదనాన్నా?
దేశ కాలాలు వట్టిగా అలా పడిఉన్నాయి, "మేము శూన్యమై ఉన్నాం ఇంకేమీ లేదిక్కడ" అంటున్నాయి.
ఆత్మ జగత్తు ప్రయాస పడుతున్నాయి 'నేను, నేను మాత్రమే' అని కేకలు పెడుతున్నాయి.
అక్కడ ఒక్కటే ఉంది, ఆత్మకే అది ఆత్మ, ఆకాశానికి ఆత్మ, కాలానికి స్రోతస్సు
హృదయాలకు హృదయం, మనసులకు మనసు, అతనొక్కడే ఉత్కృష్టమై కూర్చునిఉన్నాడు.
మూగదైన అద్భుతమైన తనలోతానే అంతర్ముఖమైన మహాశూన్యమైన నిరపేక్షం కాదది
ఆ చేతులు పాదివి పట్టుకుని ఉన్నాయి, ఎర్రని పెదవులు వేణువును ఊదుతున్నాయి.
అంతటినీ ఆతను ప్రేమించే, అంతటినీ కదిలించే, అంతా ఆతడే, అందరూ ఆతని వారే
ఆతని మధురమైన పారవశ్యతలో ఆతని ఇష్టాన్ని సంతృప్తిపరచు అంగములు అనేకం.
రెండు ఏకమై ఉన్నాయి, రెండు ఒక ఉన్నతమైన వైవిధ్యాన్ని తమలో,
పట్టుకోవడానికి రెండు, ఉండుటకు ఒకటే, ఇది ఆతని విచిత్రమైన రహస్యం.
అంతటినీ ఆతను ప్రేమించే, అంతటినీ కదిలించే

- *శ్రీ అరవిందులు*



విపత్కరం."

- బెంగాలీ రచనలు

ఒక ఆసక్తికరమైన ఐతిహ్యం

రాధ ప్రార్థన

మదర్ ప్రప్రథమంగా 'రాధ ప్రార్థన'ను ఆంగ్లంలో **1932** జనవరి **12**వ తేదీన వ్రాశారు. ఆ మరుసటి రోజున దానికి ఫ్రెంచి బాషలో రూపమిచ్చారు. అప్పుడు శ్రీ అరవిందులు ఫ్రెంచిబాష నుండి ఆంగ్లంలోనికి తర్జుమా చేశారు.

రాధను గురించి ఒక నృత్యరూపకాన్ని ప్రదర్శించబోయే ఒక శిష్యురాలికి ఈ ప్రార్థనను వ్రాశారు. శిష్యురాలికి వ్రాసిన లేఖలో మదర్ ఇలా వ్రాశారు.

చివర్లో రాధ కృష్ణుని ముందు నిలిచినపుడు ఆమె అంతరంగంలోని ఆలోచన, అనుభూతికి ఒక సూచికగా, నిన్న నేను చెప్పిన దానిని పూర్తి చేయడానికి దీనిని నేను వ్రాసి వుంచాను.

'నా మనసు ప్రతి ఆలోచన, నా హృదయ ప్రతిభావావేశమూ నా అస్తిత్వ ప్రతి కదలికా, ప్రతి అనుభూతీ, ప్రతిస్పందన, నా దేహ ప్రతి జీవకణమూ, నా రక్తపు ప్రతిబొట్టూ, సర్వం, సర్వం నీదే. సంపూర్ణంగా ఎటువంటి మినహాయింపు లేకుండా నీదే. నా జీవన్మరణాలను, నా సుఖమూ లేక నా విషాదాన్ని, నా సంతోషం లేక నా బాధ నీవు నిశ్చయించవచ్చు. నాతో నీవేది

చేసినా, నీ నుండి నాకేది ప్రాప్తించినా, నన్ను దివ్య ప్రహర్షంలోనికి తీసుకుపోతుంది.

CWSA 32:662 - *శ్రీ అరవిందులు*

శ్రీకృష్ణునిపై సుభాషితాలు

భగవంతుడొక గొప్ప, క్రూర చిత్రహింస పెట్టేవాడు, ఎందుకనంటే ఆతడు ప్రేమిస్తాడు గనుక. ఇదినీకర్థం కాదు, ఎందుకనంటే నీవాయనను దర్శించలేదు, కృష్ణునితో ఆటలనాడలేదు.

'కృష్ణునితో ఆట' అంటే అర్థమేమిటి? భగవంతుడొక గొప్ప, క్రూర చిత్రహింస పెట్టేవాడు' అంటే అర్థం ఏమిటి?

కృష్ణుడు అంతర్యామియైన దైవం, ప్రతివాని యందూ, సమస్త వస్తువలందూ గల దైవసాన్నిధ్యం. సాధికారికంగా, పురుషోత్తముని ఆనందం, ప్రేమల పార్శ్వం. దరహాసించు కోమలత్వం, సయ్యాటలాడు సంతసం ఆతడు. ఏకకాలంలో ఆతడు క్రీడాకారుడు, క్రీడ, తన సమస్త క్రీడా సహచరులు కూడా. క్రీడ, దాని ఫలితాలు పూర్తిగా ఎరిగి, భావించి, సంకల్పించి, వ్యవస్థీకరించి, వాటిని సమూలంగా, సచేతనంగా క్రీడించినవాడు. క్రీడా ఆనందానికి తప్ప మరి దేనికీ అందులో స్థానం లేదు. కృష్ణుని దర్శించడం అంటే, ఆంతరిక భగవంతుని దర్శించడం, కృష్ణునితో క్రీడించడం అంటే ఆంతరిక భగవత్తత్వంతో మమేకంగావడం, ఆయన చేతనలో పాలు పంచుకోవడం. ఈ స్థితిని సాధిస్తే వెంటనే దివ్యక్రీడ ఆనందంలోకి ప్రవేశిస్తావు. ఈ తాదాత్మ్యత ఎంత అధికంగా సంపూర్ణమౌతుందో అంత అధికంగా ఆ స్థితి పరిపూర్ణం అవుతుంది.

కానీ చేతనలో ఏదోమూల సాధారణ అవగాహనను నిలుపుకొంటే, మామూలుగా అర్థం చేసుకొనడాన్ని, మామూలు సంవేదనను నిలిపి ఉంచుకొంటే, అపుడు ఇతరులు బాధపడడాన్ని చూసి, అపుడు అంతటి బాధను కలిగించే క్రీడ చాలా క్రూరమైనదిగా తెలుసుకొని, అటువంటి క్రీడలో ఆనందాన్ననుభవించే భగవంతుడు తప్పక ఒక భయంకర చిత్రహింస పెట్టే వాడు అనే నిర్ణయానికొస్తావు. అలాగాక దైవంతో తాదాత్మ్యతానుభవం గనుక

నీకుంటే, ఆతని క్రీడలో నింపుతున్న ఆతని బ్రహ్మాండమైన అద్భుత ప్రేమను నీవు విస్మరించలేవు. ఈ విధంగా నిర్ణయానికి రావడం అనేది నీ దృష్టికి గల పరిమితి అని అర్థం చేసుకుంటావు. తనంత తానుగా చిత్రహింస పెట్టే వానిగా ఎంతమాత్రము చూడవు. పైగా సదా సాపేక్షమై ఉండి, సదా అధిగమించిపోవ దగినదైన ఒక పరిపూర్ణతవైపు, మనుషులు సాగించే పురోగమనాత్మక నడకలో, త్వరగా చేర్చే దారులలో, ప్రపంచానికి మనుషులకు మార్గదర్శకత్వం వహించే గొప్ప ప్రయోజనం కలిగించే ప్రేమ ఆతడు అని చూడగలవు.

కానీ సామరస్యంతో, ఆనందంతో అధికాధికంగా పురోగమించగల, ముందడుగు వేయడానికి బాధగాపైకి కన్పించే ప్రేరకం ఇహనెంతమాత్రం అవసరం లేని రోజొకటి వస్తుంది.

CWM 10:52

భాగవతుడు

కృష్ణుడు అసలెన్నడూ నివసించలేదు, ఆతడొక మిథ్య అని కొందరంటారు. వారన్న దాని అర్థం భూమిమీద అని. (భాగవత పురాణంలో చెప్పినట్లు కృష్ణుని కథ) భాగవతంలో వ్రాయబడి లేదు.

భూమిపై ఎక్కడైనా బృందావనం ఉన్నదా?

మొత్తం భూమి, దానియందున్న ప్రతిదీ ఒక విధమైన సాంద్రీకరణయే. చర్మ చక్షువులకు కన్పించని, యితర లోకాలలో వున్న దాని ఏదో దానికి సంబంధించిన ఒక సాంద్రీకరణయే. ఇచట అభివ్యక్తమైన ప్రతీదీ, దాని మూలాన్ని, భావనను, లేక సారాన్ని సూక్ష్మ లోకాలలో ఎక్కడో వుండినదే. అభివ్యక్తిదొక అపరిత్యాజ్యషరతు. అభివ్యక్తి ప్రాముఖ్యత సదా అభివ్యక్తమైన దాని మూలం మీద ఆధారపడి ఉంటుంది. దేవుళ్ళ లోకంలో, ఒక ఆదర్శప్రాయమైన, సామరస్య పూర్వక బృందావనం వుంది. కాని భువి బృందావనం, దాని ఒక వికృత రూపం, ఒక రేఖాచిత్రం మాత్రమే.

వారి ఇంద్రియాలలో గాని, వారి మనసులలో గాని ఆంతరికంగా అభివృద్ధి చెందిన వారు, (సామాన్యులకు) దృగ్గోచరం కాని ఈ సత్యతలను దర్శిస్తారు. వాటి నుండి ప్రేరణను పొందుతారు. అందుచేత భాగవత రచయిత లేక

రచయితలు యధార్థంగా నిజమైన, అస్తిత్వం కలిగి ఉన్నటు వంటి ఆంతరిక మొత్తం ప్రపంచంతో తప్పక సంపర్కంలో ఉన్నారు. వారు వర్ణించిన లేక వ్యక్త పరచిన ప్రతిదానినీ దర్శించారు, అనుభవించారు.

భూమిపై జీవిస్తూ మానవ రూపంలో కృష్ణుడు ఉన్నాడా, లేడా అన్నది చాలా ప్రాధాన్య విషయం (పూర్తిగా బహుశా చారిత్రకత దృష్ట్యా తప్పించి) ఎందుకనంటే కృష్ణుడు ఒక నిజమైన సజీవ,సక్రియ అస్తిత్వం. భువి పురోగతి, రూపాంతరీకరణములో ఆయన ప్రభావం గొప్ప వాస్తవాలలో ఒకటి.

CWM 10:60-61 - *శ్రీమాత*

భయంకరమైన శక్తిగా, రౌద్రం నిండిన ప్రేమగా వ్యక్తమయ్యే కృష్ణుడే కాళి. తన ప్రంచముష్టిఘాతాలచే, ప్రాణం, మనసులో వున్న ఆత్మను, శాశ్వత అధ్యాత్మగా ముక్తం చేయడానికి ఆమె బాధిస్తుంది.

CWSA 12:496

పుణ్యవంతుల దృష్టికి తనను తాను కనపడకుండా చేసుకొనడానికి కృష్ణుని మాయోపాయం, ఒక మారు వేషం పాపం. పాపియందు భగవంతుని, నీ హృదయాన్ని పరిశుద్ధం చేస్తున్న నీలోని పాపాన్ని, చూడవోయి ఓ మహానుభావా, నీ సోదరుని నీవు ఆలింగనం చేసుకో.

CWSA 10:346

దైవం ఏదై వుండాలి, ఆతడెలా కర్మ చేయాలి, ఎలా కర్మ చేయగూడదు అనే మానసిక భావాలకు విలువేముంది - దారిలో అవి అలా వచ్చి పోతుంటాయి. పట్టించుకోవలసింది దైవాన్ని గురించి మాత్రమే. నీ చేతన దైవాన్నాలింగనం చేసుకొన్నపుడు, అప్పుడే దైవం అంటే ఏమిటో నీకు తెలుస్తుంది, అంతకు ముందు కాదు. కృష్ణుడు కృష్ణుడే. ఆతడేం చేశాడు, ఏం చేయలేదు, అనేదాన్ని గురించి పట్టించుకోగూడదు. కేవలం ఆయనను దర్శించడం, ఆయనను కలుసుకోవడం, దివ్యవెలుగును, దివ్య సన్నిధిని, దివ్యప్రేమను, బ్రహ్మానందాన్ని అనుభూతి చెందడం, ఇదే ముఖ్యం. సదా ఆధ్యాత్మిక ఆకాంక్ష - అదే ఆధ్యాత్మిక జీవన ధర్మం.


CWSA 29:56


అత్యున్నత స్వర్గాలకు మనలను ఆయన సన్నద్ధం చేసేంత వరకు ఒక శత్రువు ముసుగులో, ఆయన స్నేహతత్త్వాన్ని, సమస్త జీవుల దివ్య సఖుడు దాచి వుంచుతాడు. అప్పుడు కురుక్షేత్రంలోలాగా, బాధావ్యధల, వినాశాల అధిపతి భయంకర రూపాన్ని ఉపసంహరించుకొంటుంది. సుందర ముఖారవిందం, లాలిత్యం తరచుగా ఆలింగనం గావించుకొన్న కృష్ణుని దేహం, భయకంపితమైన అంతరాత్మపై ప్రకాశిస్తుంది, ఆతని శాశ్వత సఖుని, క్రీడా సహచరుని నిష్కల్మష నేత్రాలు ప్రకాశిస్తాయి.

*

శాశ్వతుని దివ్యానందపు మూర్తిత్వం కృష్ణుడు. ఎందుచేతనంటే, ఆయన వల్ల, ఆయన క్రీడవల్ల, ఆయన ఆనందం వల్ల, ఆయన మాధుర్యం వల్లనే సమస్త సృష్టి సంభవమయ్యేది.

బ్రహ్మ అమృతత్వం, విష్ణు శాశ్వతత్వం, శివుడు అనంతత్వం. కృష్ణుడు పురుషోత్తముని, శాశ్వత, అనంత, అమర, ఆత్మనిగ్రహ, స్థిర-చిత్తత తననుండి అనేక తనలను బహిర్గతం చేయగల ఆత్మాభివ్యక్తి, ఆత్మావిష్కరణ.





అఖిల

అఖిల భారత పత్రిక

డిశంబర్ 2023

శివుని పార్శ్వములు

విషయ సూచిక

సంపాదకీయం :

శివనామము తలచినంతనే, మహదాశ్చర్యము, మహాబల సంపన్నత, దాతృత్వము, కారుణ్యం, నూతన సృష్టిని వెంటతెచ్చే విలయతాండవ నృత్యం, స్మృతి పథంలోనికి ఆవాహన గావించబడ్డాయి. మహాబలీయ విరాగి, మంగళకర తపస్వి అయిన శివుని, బహుముఖాలు, బహు పార్శ్వాలకు ఈ సంచిక ప్రత్యేకించబడింది.

అనువాదం : కె.వి. రావు



దయామయి

మాధుర్యమయి! 'దైవికమైన ఏవగింపు' అంటే ఏమిటి?

వత్సా! అదిసంపూర్ణంగా దయతో నిండివున్న ఏవగింపు.

ఇది ఒక విధంగా ఇతరుల్లో వున్న ఏవగింపు భావనను నివారించే నిమిత్తం, ఒక ప్రకంపనను తనపైకి తీసుకొనే భావోద్వేగం. నిమ్న కదలికలను, తప్పు ఫలితాలను (నిశ్శబ్దం) ఒక స్తబ్ధమైన భావంతో, తప్పుచేసిన వ్యక్తిపైకి నెట్టివేయడానికి బదులు అవి రూపాంతరీకరింపబడే నిమిత్తం, జరిగిన తప్పును, భౌతికమైన ఫలితాలను సాధ్యమైన మేరకు తగ్గించివేసే నిమిత్తం వాటిని తనలోనే లయం చేసుకొంటుంది. ఒక పురాణ కథలో శివుని గొంతుపై ఒక నల్లని మచ్చ ఉంటుంది. దానికి కారణం ప్రపంచంలోని చెడునంతా ఆయన మ్రింగాడు. నా ఉద్దేశ్యంలో ఇదే దైవికమైన విసుగుదలను వ్యక్తీకరించే ప్రతీకాత్మక మార్గం. అందుకే ఆయన కంఠంపైన నల్లని మచ్చపడింది.

CWM 6:286 — శ్రీమాత

శివుని పార్శ్వములు

అచేతన సృష్టికర్త (మహాతపస్వి)

ఆ శీతల ప్రవిమల హిమ లోకంలో
విరిసిందొక నిశ్చల, నిర్మల రూపం.
అనంతాల కనుసన్నలలో, అంతే లేని మంచు పల్లకిలో,
అనుచ్యమై, అమేయమై, అమోఘమై వెలిగే తేజం.

నిటలాక్షుడి అమర శిరముపై
వెలసెను జటాజూటాల పటలం.
ఆ నిశ్చల, నిశాంత దేహముపై,
వ్యాపించెను వినీల వాయుమండలం.

ఫాలముపై పాలిన వెన్నెల రేఖ
కానరాని చీకటి అంచును తడిమింది.
శూన్యాన్ని నింపింది. నింగిని తాకే శిఖ
ఎదురులేని శక్తికి చిహ్నంగా నిలిచింది.

అనంతపు లోతుల్లో ఇప్పుడు జనించి
విశాల శీతల సీమను ఆవరించి
నిశ్చల మోముపై కదిలిందొక ఓ చిన్న వణుకు,
తెల్లని బృహత్తును రగిలించిందొక నిప్పు చెణుకు.

త్రిశూలపు కాంతి మొనలు త్రికాలాన్ని తెలిపాయి,
దివ్య రూపాన్ని వెల్లడించి, గుండె తెరని త్రెంచాయి.
వజ్రపు కేంద్రంలో దాక్కున్న నిజం,
బ్రద్దలైన గుండెలో బంగరు తేజం.

మౌనంగా, మూగగా జ్వలించే కేంద్రంలో
తారాడెను లోకాలు, పారాడెను తారలు,
మండే విశ్వపు బీజం, ఆదమరచిన అగ్నికీల,
పరవశించి ఎగసిపడే చైతన్యపు హేల.

CWSA 2:548-49

దివ్యసాక్షాత్కారం

అమరం, అచలం. అస్వనం, అనన్యమస్మితం,
సురాసురుల స్వామి, ఠీవిగ కొలువున్న మౌనం,
రాజసాన ఒదిగిన రాయంచ చందం,
నిరుక్త ప్రేమకు రూపం, పరమశివుని దర్శనం.
పాపులు, పతితులు ఆరని జ్యోతిని ఆశ్రయించగా,
మేలిమి ధామాల నుండి వేల్పులు తరిమివేయగా
తీపి నవ్వుతో అభయమిచ్చాడు పతితపావనుడు
పారివచ్చిన రక్కసి మూకల నక్కున జేర్చుకున్నాడు.
నిరాశ్రయులు, నికృష్టులు, ప్రేమరహితులు, పదవీచ్యుతులు,
క్రూరులు, అక్రూరులు - కారెవరూ అతడికి అప్రియులు.
అఖిల ప్రపంచం ఆతని నీడను సేదదీరుతుంది,
ఆస్వామి పద సన్నిధిలో ఊరడిల్లుతుంది.
అంతలో దృశ్యం మారింది. వెనకటి ప్రశాంత నేపథ్యంలో
పర్జన్యంలా, రణరుధిరంలా నిలిచాడొక ప్రళయభీకరుడు.
అతడి కుడిచేత బట్టిన భయంకర శూలం
కదిలితే అదిరింది సమస్త భువనం.
దివి అక్కసు కక్కింది, ఉత్పాతాల ఉప్పెన భువిని ముంచెత్తింది.
ఆతని పదఘట్టనకి నగాలు నుగ్గయ్యాయి,
ఆతని కన్నుల తీవ్రతలో అగ్గులు భగ్గుమన్నాయి.
పాపపుణ్యాల తలపులో నరుల గుండెలు గుభేలుమన్నాయి.
వారి కేకలు దిక్కులు దాటాయి -
"క్షమించు రుద్రా! క్షమించు! నీ కాలరూపాన్ని చాలించు!
నీ శాంతరూప దర్శనాన్ని ప్రసాదించు!"
ప్రచండ శక్తి, ప్రగాఢ ప్రేమ - ఒకే దైవపు రెండు ముఖాలు.
అతని శిక్షను మోసేవాడు, అతని ప్రేమకు నోచుకుంటాడు.
భయాన్ని అధిగమించి, బాధను, ఓటమిని
దిగమింగి, చావును ఎదురొడ్డేవాడు,
ప్రేమ దాల్చిన ముసుగుని, ప్రళయంలోని ప్రశాంతతని గని,
అజ్ఞానపు తెరలు వీడి దివ్యరూపాన్ని పొడగంటాడు.

ఇలలో, మృతిలో మానవ విభుడు తోడై ఉంటాడు.
శ్వాస నిలిచిపోగానే తపనలన్నీ తొలగుతాయి.
అనంతుడి లీలను చూసి ఆనందిస్తాడు,
ఆతని అజేయశక్తితో మమేకమౌతాడు,
ఆతని ఏకత్వాన్ని, సనాతనతని తెలుసుకుంటాడు.
తానే ఆ రుద్రుడు, పర్జన్యుడు, వైశ్వానరుడు,
తానే పరమశివుడు, ప్రచండ ధవళ తేజుడు,
కాలపు రెక్కల పైన దిక్కులు తడిమే బలం,
అమరుల హృదిలో వెలిగే పరమనైశ్చల్యం.

CWSA 2:279-80

భూతనాథుడు

ఎలక్ట్రాన్

దాని పునాదిపై వెలసింది నామరూప విశ్వం,
ఈ లోకానికి సారం, ఎలక్ట్రాన్, దైవకణం.
సనాతన శక్తి నుండి ఎగసిపడ్డ పుంజం,
కానరాని అనంతుడి కుటిల కుటీరం.

దాని రగిలే చిన్నారి తేరుపై శివుడు లోకం చూస్తాడు,
అనన్యుడు అనేకముఖుడై ఇలలో అవతరిస్తాడు.
అదృశ్య రూపాల్లో అనన్యుడి దోబూచులాటలు
కాలంలో సనాతనుడి చిన్ని కొలువులు.

పరమాణు సమూహాల కానరాని విన్యాసం
అద్భుత ఏకత్వాలకి ఎనలేని ఆధారం
ఖనిజాల, ఉద్భిజాల, ఖగ, మృగ, నర లోకం-
మానవ హృదిలో విశ్వైక్యత ఆవిర్భావం.

ఎల్ల లేక ఎదిగెనతడి ఆత్మప్రకాశం,
వెల్లడించె సనాతనుడి విశ్వదర్శనం.

CWSA 2:600

గంగాధరుడు

ఆలకించు గంగా, నా మొర ఆలకించు దేవీ!
హరి పద కమలములందు చివ్వున ఎగసి,
సువర్ణ ఝరివై ఆర్ణవమ్మును జేరెదవు,
విమల పయోనిధివి, శుద్ధ హిమసలిలవు,
ఆలకించు మాతా, మొర ఆలకించు తల్లీ!
సముత్తుంగ హిమ వేదికపై
శ్వేత శృంగముల సుఖాసనముపై
నిశ్చల, నిఖిల నిర్వాత సీమలో
కొలువున్నాడు మహేశ్వరుడు.
భక్తజనావళి ఆర్తి తీరగా
భూతగణావళి బారులు దీరగా
గంగాజలము జూటముల వీడగా
కొలువున్నాడు మహాశివుడు.

చల్లని తెల్లని కొండలను వీడి
శాశ్వత శీతల బృహదాద్రులని దాటి
ముంచెత్తెను మానవ సీమను
నీ అమలిన అకళంక తరంగాలు.
గంగోత్రిని జనించి
లోయలను జయించి
శివాద్రి పై తరించితివి -
నరసీమను వరించితివి.

విమల వారణాసి పురాన అరుదెంచె
కొలనుల, కోవెలలను స్పృశించె -
దివి బాలను అక్కున జేర్చుకొనెను జనని.
పల్లవించి పరవశించెను అవని.

రాముని పాదము సోకిన స్థలం,
చిన్నారి కృష్ణుని జన్మస్థలం.

నీ తాండవానికి రంగస్థలం.
గంగా, భాగీరథీ, జాహ్నవీ, జననీ!
ఈ ఆర్యభూమి పునీతం కానీ.

CWSA 2:256-57

అనన్యుడు
(హరిహరుడు - నీలకంఠుడు)

మాయకి బద్ధులై, అనన్యశక్తికి అధీనులై,
భ్రమిస్తారు జనులు తమ స్వేచ్ఛ అని, సంకల్పమని.
ద్వేషికి తెలియదు ద్వేషానికి లక్ష్యం తానేనని,
ప్రియుడికి తెలియదు తన ప్రేయసి తానేనని.

అసంఖ్యాక దేహాల్లో ఒకే ఆత్మ కొలువున్నది,
కృష్ణుడు వేణువులూదిన విపిన వీధి ఇదే
పరమశివుడు కొలువున్న పవిత్ర నిశీధి ఇదే
పరమనిజం శివకేశవు లిరువురూ ఒకరన్నది.


మనలోనే కృషుడు తన ఆనందపు పరిమళాన్ని వెలయిస్తాడు
మనలోనే శివుడు మన బాధల భారాలని తీరుగ మోస్తాడు.
మనలో వున్న నిఖిలాత్మ మన యాతనలను భరిస్తోంది,
వెతలన్నీ తీరాలని, రాతలు మారాలని అలమటిస్తోంది.

నా ప్రత్యర్థి పతనం, నాకు తగని పరాభవం,
నా శత్రువు ముఖంలో, కలిగెను కృష్ణుని సందర్శనం.

CWSA 2:626

శ్రీ అరవిందులు





శివుడు
(పురుషుడు - ప్రకృతి)

విమల విరాజమాన విను సీమల్లో
నిలిచాడొక దివ్యపురుషుడు, దిగంబరుడు,
విలయాగ్ని తెర చాటున, వీరగణాల కొలువులో,
మౌనంగా భాసించే అనన్యుడు, ఏకాంతుడు.

ప్రగాఢ ఆత్మానందపు స్పర్శకు మేలుకొని
విశ్వాంతరాళాలలోకి తన దృష్టిని సారించాడు.
అచేతన విశ్వమౌనంలో గుప్తంగా తపించే
జగజ్జనని మూగ మోదాన్ని పొడగన్నాడు.

ఆతని కనుచూపు స్పర్శకి కాస్త మేలుకున్నదామె,
ఆతని హృదయ లయలకి ఆమెలో కలిగింది చలనం.
బ్రహ్మాండపు సంచారం ఆతని బృహత్తాండవం,
ఆమెలో జీవం పెల్లుబికింది, ప్రఫుల్లమయ్యింది మానసం.

ఆమే తానైన ఆతని కనులార చూసింది,
మేలుకున్న చేతన ఆత్మను పెనవేసుకుంది.

శివుడు ప్రజ్ఞారూపుడు

మనకున్న వేదాంతపరమైన భావాలకు అనుగుణంగా, ప్రపంచం మరియు వస్తువిశేషాలు సాధారణంగా కానీ లేదా విశేషంగా కానీ ఈ విధంగాఉనికిలోకి వచ్చాయి. అవి మొట్టమొదట బీజరూపంలో నిశ్శబ్దంగా, వ్యక్తీకరించబడని భావరూపంలా ఉన్నాయి, గాఢనిద్రవంటి ప్రపంచంలో ఇంకా ఆలోచన లేదా ఆచరణాత్మక చర్య ప్రారంభం కాలేదు, కేవలం జడమైన, ప్రభావహీనమైన ఆలోచన మాత్రమే ఉంది. శ్వేతావర్ణంగల స్వచ్ఛమైనసన్యాసి, నిశ్చలమైన, ఆలోచనాపరుడైన యోగి అయినటువంటి శివుడు, తనలో సమస్త సృష్టిని ప్రజ్ఞరూపంగా నిలిపి ఉంచాడు, ఆయన జ్ఞాని, ఆదర్శవంతుడైన దేవుడు. కానీ శివుడు తామసికుడు.సృష్టి ఉనికిలోకి రావడానికి ముందు చలనాన్ని ప్రేరేపించడానికి రజస్సు అవసరం. అటుపైన వస్తువిశేషాలు విత్తనం నుండి మొలకెత్తి మానసిక ప్రపంచంలో అస్థిరమైన అనిశ్చితమైన ఆకారాన్ని పొంది, భౌతికమైన జన్మ తీసుకోవడం కోసం అక్కడ వేచి ఉంటాయి.జ్వలించేవాడు, ఆకారంలేనివాడు, అనేక ఆకారాలు కలిగిన వాడైన బ్రహ్మ, వాటిని తన ప్రతిభావంతమైన స్పందించే చురుకైన ఊహల, ఆలోచనల మాధ్యమంలో ఉంచాడు. అలాగే అతని కుమార్తె వాక్, ఈ ప్రపంచంలో అందరికంటే ముందు పుట్టిన దేవత, ఆమె వాటికి ఆకారం, దేహం ఇచ్చి సృజనాత్మక ఊహాత్మక దేవత అయిన హిరణ్యాగర్భుడిగా ఉంచింది. చివరిగా అవి శాశ్వతమైన ఆకారాన్ని తీసుకుని భౌతిక శరీరం, రూపం ఉన్న జీవులుగా అవుతాయి. అక్కడ విష్ణువు వారిని తన స్థిరమైన మరియు దృశ్య ప్రపంచంలో ఆచరణాత్మక దైవమైన విరాట్‌గా ఉంచాడు, దైవిక కల్పన వారిపట్ల విసుగుచెందనంత వరకు, శివుడు విధ్వంసకుడిగా వారిని మళ్లీ వెనక్కి ఆకర్షించే వరకు, వారి బాహ్య రూపం విచ్ఛిన్నమై, వారికి ఆధారమైన ఊహలు చనిపోయి, తిరిగి వారు బీజ స్థితిలోకి వచ్చేంతవరకు వారు సృష్టిలో ఉంటారు.

CWSA 8:176

నీలకంఠుడు -కరుణామయుడు

ప్రకృతి విభజన, అహంభావం నుండి ప్రారంభమైనందున, అసురుడు మొదట రావాలి; అతను ఇక్కడ మనలో పెద్ద దేవుడు, మనిషి యొక్క స్వర్గం, ఇంకా భూమికి మొదటి పాలకుడు. అప్పుడు భగవంతుడు వచ్చి

కాపాడి సమన్వయం చేస్తాడు. ఈ విధంగా పాత పురాణం మనకు అమరత్వం కోసం జీవన సాగరాన్ని మథనం చేయడానికి దేవతలు, అసురులు కలిసి పనిచేశారని చెబుతుంది, అయితే, అది పొందిన తర్వాత, విష్ణువు దానిని దేవతల కోసం ఉంచాడు, భయంకరమైన, హింసాత్మకమైన ఆసురులను మోసం చేశాడు.. ఇది అన్యాయం అనిపిస్తుంది; ఎందుకంటే అసురుడిపై కృతజ్ఞతా హీనమైనఅదనపు భారం మోపబడింది. అతను ప్రారంభిస్తాడు అలాగే ముందుకు నడిపిస్తాడు; అతను తన మార్గంలో కోయడం, ఆకృతి చేయడం, నాటడం వంటివి చేస్తాడు; దేవత అనుసరిస్తాడు, సవరిస్తాడు, ముగిస్తాడు, పండిస్తాడు. అసురుడు వెయ్యి అడ్డంకులను ఎదుర్కొని తీవ్రంగా, వేదనతో మనం ఉపయోగించాల్సిన శక్తిని సిద్ధం చేస్తే మరొకరు విజయాన్ని ఆనందాన్ని అనుభవిస్తారు. అందువల్ల మహాదేవుడైన శివునికి కళంకితుడైన తుఫానువంటి అసురుడు చాలా ప్రియమైనవాడు. జీవన సాగరం నుండి వెలువడిన భయంకరమైన చేదు విషాన్ని శివుడు తన కోసం తీసుకుని అమృతాన్ని ఇతరులకు వదిలివేశాడు. శివుడు జ్ఞానంతో, ప్రేమతో ఆ విధంగా ఎంచుకున్నాడు, ఆసురులు అంధకారంతో కోరికలతో ఎంచుకున్నారు. నిజంగా చాలా భిన్నమైన వాటిని కోరుకున్నారు అలాగే వారి తుఫానువంటి అహంభావంతో మోసపోయారు. అందువల్ల విష్ణువు నిర్ణయం నిలుస్తుంది. దేవతలకు కిరీటం అమరత్వం వస్తుంది. గర్వించే, శ్రమించే అసురుడికి ఏమీ రాదు, తనను తాను దైవంగా మలచుకుంటే తప్ప.

CWSA 13:154

నటరాజు

శివుని తాండవాన్నిమరణం లేదా విధ్వంసం యొక్క నృత్యంగా భావించడం ఒక ఆసక్తికరమైన పొరపాటు.అయితే, నటరాజును చూసినవారు ఎవరైనా సరే సరిగా చూడగలిగితే ఇందుకు విరుద్ధంగా అది ఆనందభరితమైన విశ్వం యొక్క (చలనం) నృత్యాన్ని వ్యక్తపరుస్తోంది అని తెలుస్తుంది. దానితో పాటు దాని వెనుకనున్న చలనరహితమైన శాశ్వతత్వం, అనంతమైన ఆనందం యొక్క లోతైన రహస్యాలను అది చూపిస్తుంది. పాశ్చాత్యుల దృష్టికి అతి భయంకరమైన కాళి యొక్క వ్యక్తిత్వం కూడా ఇలాగే కనబడుతుంది. మనిషిలోని ప్రపంచంలోని చెడు శక్తులైన అసురులను సంహరించడానికి విశ్వమాత ఈ భయంకరమైన రూపాన్ని అంగీకరిస్తుంది.

CWSA 10:282

దయాళువైన భిక్షువు

మన శివుడు దేవుళ్ళలో సర్వోన్నతుడు, అయినప్పటికీ అతను ఒక భిక్షువు,జితేంద్రియుడు, దేనిని పట్టించుకోనివాడు, అన్నింటినీ మరచిపోయేవాడు; అలాగే మన కృష్ణుడు యవ్వన ప్రాయంలోని వాడు, నవ్వు, వినోదం, ప్రేమను ఇష్టపడేవాడు. ఆటలాడడం అతని స్వభావం. ఐరోపా దేవుడు ఎప్పుడూ నవ్వడు, ఆడడు. ఎందుకంటే ఇలాంటి పనుల వల్ల అతని ఘనత దెబ్బతింటుంది. అతని దివ్యత్వానికి భంగం కలుగుతుంది. బహిర్ముఖ వైఖరి దాని వెనుక ఉంది. సంపదను వారు వైభవానికి సంకేతంగా భావిస్తారు, వారు సంకేతాన్ని చూస్తే తప్ప ఒక వస్తువును చూడలేరు, వారికి దైవం లేదు, సూక్ష్మ దృష్టి లేదు, ప్రతిదీ భౌతికమైనదే. మన శివుడు ఒక భిక్షువు, కానీ ఆధ్యాత్మిక అన్వేషకుడికి అతను ముల్లోకాల సంపదను జ్ఞానాన్ని సులభంగా ఇస్తాడు; అతను తప్పులను క్షమించేగుణం కలవాడు.జ్ఞానులకు అందని జ్ఞానం అతనికి జన్మతః ఉంది. మన ప్రియతముడైన, ఎల్లప్పుడూ ఆనందపూర్ణుడై ఉండే కృష్ణుడు, కురుక్షేత్ర వీరుడు, లోకాలకు తండ్రి, విశ్వానికి స్నేహితుడు, సహచరుడు. భారతదేశ అపారమైన జ్ఞానం, సూక్ష్మ దృష్టి, అపరిమిత దివ్యదృష్టి భౌతికత తెరలను చీల్చి అంతర్గత వైఖరిని, నిజమైన సత్యాన్ని, అంతర్గతసూక్ష్మ సూత్రాలను బయటకు తెస్తుంది.

*బెంగాలీ రచనలు: **253-54***

సృష్టికర్తగా, లయకారుడిగా శివుడు

అతడు మూడు విధాలుగా ఉన్నాడు, ప్రజ్ఞ, హిరణ్యాగర్భ, విరాట్. ప్రజ్ఞ, సుషుప్తిని పరిపాలించేవాడు, జడ మరియు నిర్జీవ ఉనికి లేదా యాంత్రిక శక్తుల గుడ్డి ఆటలో జీవించి మేల్కొనే తెలివైన శక్తి, హిరణ్యాగర్భ, స్వప్నావస్థకు ప్రభువు ఉపచేతనలో తెలివితేటలుగల ఆధ్యాత్మిక సత్తా అనే సముద్రం నుండి వెలికితీసిన చేతనపూరిత మానసిక శక్తులతో వివిధ రూపాల్లో స్థూల జీవన పదార్థాలను తయారు చేస్తాడు, విరాట్, జాగ్రతావస్థకు ప్రభువు, హిరణ్యా గర్భుడు నిర్మించిన వివేకవంతమైన సృష్టిని పరిపాలించే, సంరక్షించి నిర్వహించేవాడు. అతను శివుడు, బ్రహ్మ, విష్ణువుగా మళ్లీ మూడు అంశలై ఉన్నాడు; శివుడు, విధ్వంసకుడు, యోగి, జడ జీవితానికి ప్రభువుబీ సమాధికి

అధిపతి, బహిష్కరించబడినవారికి, ఆశ్రయం లేని వారికి ఆశ్రయం; సృష్టికర్త అయిన బ్రహ్మ, ప్రాణం పోస్తూ క్షణమైనా తన చేతిని ఖాళీగా ఉంచడు; విష్ణువు, సంరక్షించేవాడు, కాపాడేవాడు, శక్తి, ప్రేమ, జీవం ప్రకాశ మాధుర్యాలకు అధిపతి.

ప్రభువైన ఈశుడికి సంబంధించిన పై అంశాలకు నామాలు రూపాలు కల్పించి హిందువులు ఆరాధిస్తారు, ఈ నామ రూపాలలో అతను తన ఆరాధకులకు దర్శనం ఇస్తాడు. జ్ఞానయోగి శివునిగా, సంపూర్ణ సమాధికి గురువుగా ఆయనను ఆరాధించడానికి ఇష్టపడతాడు; తన భక్తుని యొక్క ఆధ్యాత్మిక భావోద్వేగాలను ఎక్కువగా ఆకర్షించే ఏ రూపంలోనైనా భక్తుడికి అతను కనిపిస్తాడు. సర్వోన్నతమైన భగవంతుని రూపాలు, వాటిలో ఈశుడి గొప్ప శక్తి, జీవించడానికి, సృష్టించడానికి అతని సంకల్పం, దాని అత్యున్నత, స్వచ్ఛమైన, అత్యంత స్ఫూర్తిదాయకమైన శక్తివంతమైన సృజనాత్మక శక్తిగా వ్యక్తీకరించబడింది, కర్మయోగి వాటికే అంకితం కావాలి; ఎందుకంటే కర్మ అనేది చలనంలో ఉన్న శక్తి మాత్రమే అలాగే కర్మయోగిదైవిక శక్తి యొక్క స్వచ్ఛమైన మాధ్యమం, ప్రపంచంలో నిస్వార్థ నాయకుడై ప్రపంచంలో ఒక నూతన సృష్టి చేసేవాడై ఉండాలి.

ఈశుడు తన అవతారాలైన బుద్ధుడు, రాముడు, శ్రీకృష్ణుడువంటి వారుఈ నిస్వార్థమైన దైవిక శక్తిని మనకు అందించారు. అందువలన అటువంటి మహాత్ములయిన దైవాంశ సంభూతులైన అవతారాలనుకర్మయోగి తన ఆరాధనకు ఎంచుకొనవచ్చును. లేదా అతను ఈశుడిని శక్తి రూపంలో, దుర్గా-కాళి రూపంలో, ఆరాధించవచ్చు, అది ఈశుడిమానవ మనస్సు ఊహించలేని విశ్వశక్తి అత్యంత శక్తివంతమైన సాక్షాత్కారం. అతను రూపాలను విసర్జించగలిగితే, అతను ఈశ్వరుడ్ని, సర్వశక్తిమంతుడైన ప్రభువు అనే భావనలో ఆరాధించవచ్చు. పరమేశ్వరుడ్ని హిందువులు హరిగా, క్రైస్తవులు దైవంగా, మహమ్మదీయులు అల్లాగా ఆరాధిస్తారు. నాస్తికుడుఅన్ని జీవులలో ఉనికిలో పని చేస్తున్న ఒక బలమైన శక్తిని గుర్తించి, ఆ శక్తి యొక్క సంకల్పానికి మరియు లక్ష్యానికి తన స్వీయాన్ని చర్యలను అప్పగించినట్లయితే, లేదా అతను విశ్వంలో గుర్తించడానికి నిరాకరించిన దైవత్వాన్ని మానవులలో గుర్తించినట్లయితే, తన సోదర మానవుల నిస్వార్థ సేవకు అంకితమై కర్మయోగ

మార్గంలో అడుగు పెట్టినట్లైతే, అతను తిరస్కరించిన దైవాన్ని చేరుకోవడంలో విఫలం కాడు.

కర్మయోగి ఏదోఒక ఫలానా నామమో రూపమో తనకంటే గొప్పదిగా గుర్తించి, దానిని పొందడానికి తన అల్పమైన నేనును వదిలించుకోవలసిన అవసరం లేదు. కానీ తన లోపల బయట ఉన్న శక్తిని గుర్తించి, దాని సంకల్పానికి, చర్యలకు తన స్వీయసంకల్పాన్ని, స్వీయ ఆరాధనను త్యాగం చేయడం చాలా అవసరం, ముఖ్యం. అతను ఆ శక్తికి ఏ పేరైనా పెట్టుకోవచ్చును, అతను దానికి పేరు పెట్టినా పెట్టకపోయినా, అది ప్రభువైన ఈశుడే. ఆతని ఉనికిని అతను విశ్వంలోని ప్రతి వస్తువు చుట్టూ, విశ్వంలోని చలనం లోనూ అనుభూతి చెందాలి.

CWSA 17: 176-78

శాంతిమయ శివుడు

దైవం ఎక్కడో దూరంగా ఉన్నాడని ఆయన నుండీ ఆనందమనే ఒక వస్తువును నీవు ఆశిస్తున్నావని, ఇలా దైవం గురించి ఒక స్థిరమైన అభిప్రాయంతో ఉన్నట్లు నీవు కనిపిస్తున్నావని ఆమె నీకు చెప్పారు. ఆయన నీకావస్తువును ఇచ్చే అవకాశం ఉంటే, ఆయనతో సత్సంబంధాన్ని కల్గి ఉంటావు, కాని ఆయన అలా లేనప్పుడు నీవు ఆయనతో గొడవపెట్టుకుని, తిరగబడి వివిధ రకాల పేర్లతో పిలుస్తావు! అసలు వివిధ రకాలు నీలో వున్న ఈ రకమైన అభిప్రాయం కూడా అవరోధమే అని ఆవిడ అంటున్నారు. దైవాన్ని సాక్షాత్కరించుకొనే మార్గంలో అదికూడా సత్యానికి చాలా దూరంగా ఉంది. అన్నిటికంటే నీవు అసలు కోరుకొనే ఆనందం ఏమిటి? దానిలో మనస్సు కేవలం ఒక సుఖకరమైన మానసిక స్థితిని తప్ప ఏమీ చూడలేదు. అదే అయితే దానిలో భక్తులు, జ్ఞానులు పారవశ్యాన్ని కనుగొనలేరు. ఆనందం ఎప్పుడైతే నీలోకి వచ్చిందో, దైవమే నీలోకి ప్రవేశించినట్లు నిన్ను దైవమే ఆక్రమించేసినట్లు లేక నీవు ప్రకాశంలో మునిగిపోతే, తనకు తానే వెలుగు వరదలాగా నిన్ను చుట్టుముట్టినట్టు. అయితే దైవమన్నది అతులితం. ఇంకా ఇతర అంశాలున్నాయి, వాటన్నింటిలో ఒక సన్నిధి, ఒక వ్యక్తి, ఒక దివ్య పురుషుడు న్నాడు. దైవమే కృష్ణుడు, శివుడు, దైవమే పరమేశ్వరి దివ్యమాత.

అయినా ఆనందం ద్వారా నీవు ఆనందమయ కృష్ణుని అనుభవం పొందవచ్చు; ఎందుకంటే ఆనందం శ్రీకృష్ణుని సూక్ష్మ శరీరం, ఆయన ఉనికి, శాంతి ద్వారా నీవు శాంతిమయ శివుని అనుభవం పొందవచ్చు. ఆ ప్రకాశంలో ప్రకటిత జ్ఞానం, ప్రేమ, ఉద్ధరింపచేసే, నెరవేర్చే శక్తితో దివ్యమాత సన్నిధిని పొందగలవు. ~~ఈ~~ విధమైన అనుభవం భక్తుల, జ్ఞానుల యొక్క అనుభవాలను ఉల్లాసభరితంగా చేసి, ఎడబాటు, వ్యధాభరిత రాత్రుల గుండా చాలా సులభంగా వారు దాటిపోగల్గేలా చేస్తుంది. ఎప్పుడైతే ఆత్మానుభవం కల్గుతుందో, అది స్వల్పమైన లేదా సంక్షిప్తమైన ఆనందాన్ని, శక్తిని, లేదా విలువను ఇస్తుంది. అది మరోలా జరుగదు. ఆ అనుభవం ద్వారానే ఆనందం తనంతట తానే ఉండగల్గే, మరలగల్గే, వృద్ధి చెందగల్గే వికాస శీలమైన శక్తిని సంగ్రహించి పెడుతుంది. ఆమె అలా అన్నప్పుడు దానికి అర్థం దైవాన్ని ఆనందాన్ని ప్రసాదించమని అడగవద్దు అని. ఆయనను ఆయననే నీకు ఇచ్చి వేయమని అడగమని. అదేమి తెలియజేస్తుందంటే ఆనందం ద్వారా ఆనందంలో ఆయనకు ఆయన ఇచ్చివేసుకుంటాడు. నాకు దైవం తెలియదు, నేను ఆయనను అనుభూతి చెందలేదు, ఆయనను కలుసుకోలేదు అని నీవు అనడానికి కారణం ఉండదు, అది కూడా ఇంకా ఇతర అనుభవాలకు ద్వారమై శరీరంలో, మానవ రూపంలో, వస్తు పదార్థాలలో దైవాన్ని చూడడం సులభమౌతుంది.

CWSA 29:14-154 — *శ్రీ అరవిందులు*

ప్రశ్న : మీరు మీ శక్తిని లెనిన్, కెమల్, గాంధీ ఇలా ఎవరికి పంపాలనుకుంటే వారికి పంపగలరు. కాని శివుణ్ణి, లేదా కృష్ణుణ్ణి తమ ఇష్ట దేవతలుగా పిలుస్తూ మీ నుండి ప్రతి స్పందనను, జవాబును పొందుతున్నారు, ఇది నాకర్థం కావడం లేదు.

ఎవరు శివుడు?. కృష్ణుడెవరు? ఇష్టదైవం ఎవరు? ఉన్నది ఒక్కటే దైవం, వేలాది దైవాలు కాదు.

CWSA 25:493 — *శ్రీ అరవిందులు*

శివ శక్తుల గాథ

ప్రజాపతులలో గొప్పవాడైన దక్షునికి సతీ అనే కుమార్తె ఉంది. అతను తన కుమార్తెను మిగిలిన తన పిల్లలకంటే ఎక్కువగా ప్రేమించేవాడు. ఋషులు ఆమెకు విశ్వానికి గొప్ప ప్రభువైన మహాదేవునితో వివాహం జరిపించారు. ఋషుల ఎంపిక దక్షుడికి నచ్చలేదు, ఎందుకంటే మహాదేవుడు సరైన ఇల్లు కూడా లేని బైరాగి అని, అతను చేతిలో భిక్ష పాత్రను ధరించి, శరీరమంతా బూడిదను రాసుకొని, పులితోలు మాత్రమే చుట్టుకొని స్మశానంలో ఉండే పిశాచాలతోనూ, రాత్రిపూట తిరగాడే రాక్షసులతోనూ సంచరిస్తూ ఉంటాడని దక్షుని అభిప్రాయం. తన అల్లుడు, గంజాయి తాగే సోమరి, ఎలాంటి జీవనోపాధి లేని, ఇల్లు, ఆస్తి, విద్యార్హతలు లేనివాడని ప్రపంచంతో, సంబంధం లేని వాడని తెలుసుకున్న కొద్దీ దక్ష ప్రజాపతికి తన అల్లుని పట్ల ఎగతాళి పెరిగింది. అట్టలు కట్టిన పొడుగాటి జుత్తుతో భిక్ష పాత్రను పట్టుకొని తిరిగే ఈ నిరుపేదను ప్రపంచానికే ప్రభువని చెప్తున్న ఋషులను దక్షుడు మూర్ఖులని, దుష్ట సలహాదారులని శపించాడు. కాబట్టి అతను గొప్ప యాగం చేయవలసి వచ్చినప్పుడు, అతను దేవతలందరికీ ఆహ్వానాలు పంపాడు, కాని ఉద్దేశపూర్వకంగా తన అల్లుడిని మినహాయించాడు. దాని ఫలితం వినాశనానికి దారితీసింది. సతీ, తన స్వామి పట్ల జరిగిన అవమానానికి దుఃఖంతో, ఆగ్రహంతో నిండిపోయింది, తన శరీరాన్ని త్యజించి, మనుష్య లోకం నుండి అదృశ్యమైంది. అప్పుడు మహాదేవుడు కోపోద్రిక్తుడు అయ్యాడు, మహా బలవంతుడైన ఆ విశ్వనాశకుడు, దక్షుని యాగాన్ని నాశనం చేసి, యాగశాలను ధ్వంసం చేసి, దక్షుడిని అతని యాగశాలలోనే చంపాడు.

*

భారత జాతీయ కాంగ్రెస్ అని పిలువబడే దక్షుడు భారతదేశంలో కూడా ఉన్నాడు. దక్షుని వలె ఇది ఒక గొప్ప శక్తి, అనేక సంతతితో ఉన్న ప్రజాపతి, పూర్తి గౌరవం, నిగ్రహం, జ్ఞానం, దేవతలచే కూడా ఎంతోగౌరవాన్ని పొందగలిగిన వాడు . ఈ దక్షుడికి కూడా అతను ప్రేమించిన ఒక కుమార్తె ఉంది, ఆమె యువ భారత దేశం. తన వివాహానికి సమయం వచ్చినప్పుడు, ఋషులు తనకు ప్రతిపాదించిన వరుడిని, భారతదేశ గమ్యమై ఆమెకు అదృష్ట

ప్రభువైన మహాదేవుని ఆమె వరించింది. పవిత్రమైన వారణాసిలో ఆమె మొదటిసారిగా మహాదేవుని ముఖాముఖిగా చూసి, ఆయనకు తనను తాను అర్పించుకుంది, అయితే వివాహం కలకత్తాలో స్వరాజ్యం, స్వదేశీ, బహిష్కరణ, జాతీయ విద్య అనే నాలుగు మంత్రాలతో పవిత్ర కలయిక సూత్రంగా జరిగింది. ఈ వివాహం దక్షునికి నచ్చలేదు, కానీ ఋషులు గంభీరంగా వున్నారు, సతి దృఢంగా ఉంది, కాబట్టి అతను దారిని ఇవ్వక తప్పలేదు. ఋషులను దక్షుడు నిర్మొహమాటంగా శపించాడు. "నిరాశ్రయుడైన బిచ్చగాడు, అతను తాగిన గంజాయి వలన సగం వెర్రివాడై, క్రూర మృగాలు, రాక్షసులతో కలిసి కొండలపై తిరుగుతూ ఉండేవాడు, సంస్కారం, జ్ఞానం, విద్య లేనివాడు, మాటలో మొరటుగా, మర్యాదలో కరుకుగా, వికార వస్త్రధారిగా ఉన్నవాడు, అనాథ, గతం, వర్తమానం భవిష్యత్తు ఏమి పట్టని, ఇలాంటి వాడిని నా సతీదేవికి ఏవిధంగా ఇచ్చారు? అయినప్పటికీ, ఈ ఉన్మాదులు అతన్ని ప్రపంచానికి ప్రభువుగా సర్వశక్తిమంతునిగా పిలుస్తారు. ఇంకా ఎన్ని రకాలుగా పిలుస్తారో!" కాబట్టి దక్షుడు తన దుఃఖాన్ని, కోపాన్ని దాచిపెట్టాడు, కానీ ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించుకున్నాడు. మహాదేవుడు భారతదేశ గమ్యం, ఎప్పుడు మొరటుగా ఉంటూ, చేతిలో భిక్ష పాత్రను ధరించి తిరుగుతూ ఉంటాడు. అతడు నిర్ధనుడు, ఉండటానికి ఇల్లు అయినా లేని నిరాశ్రయుడు ఎప్పుడూ పులి చర్మాన్ని కట్టుకొని, ఒంటికి బూడిద రాసుకొని తిరుగుతూ ఉంటాడు. అతను పెళ్లికి వచ్చినప్పుడు, అతి భయంకర వేషంలో, దుష్ట సహవాసంతో, ఉన్మత్త ప్రేరణతో భంగు త్రాగి, "బం బం బందే మాతరం" అని బిగ్గరగా అరుస్తూ వచ్చాడు. అతను అప్రతిష్ఠుడు, ఇప్పటివరకు దక్షుడు సంపాదించుకున్న స్నేహితుల వంటి మర్యాదగల, సంస్కారవంతమైన పెద్దమనుషులతో సహవాసం చేయడానికి అనర్హుడు, అతడు అనాథ, శుద్ధి, శుచి లేనివాడు, వికృత వేషధారి, ప్రస్తుతం సరైన ఉనికి గాని, భవిష్యత్తులో సరైన ఉనికి ఏర్పరచుకోవడానికి స్పష్టమైన అవకాశాలు గాని లేనివాడు, అతని సహచరులు దండం పట్టుకుని మొరటుగా తిరుగుతుంటారు, వారు జాతీయ స్వచ్ఛంద సేవకులు. కానీ దక్షుని అభిరుచికి అనుగుణమైన సుందరమైన పెళ్లి పందిరిలో ఇతర మాయా రూపాలకు తావులేదు, అలాగే ఆ అసహ్యకర వ్యక్తి ఈ విశ్వానికి సృష్టికర్త మాత్రమే కాకుండా దానిని సంహరించే వాడు కూడా అని, భారతదేశ, ప్రపంచ విధిని తన చేతుల్లో పట్టుకున్న వ్యక్తి అని

దక్షుడు ఎలా గ్రహించగలిగాడు? మహాదేవుని సమర్థత ఋషులకు మాత్రమే తెలుసు, ఋషుల ప్రయత్నాలకు వారిని అందరూ వారికున్న బాధలకు వారిని దార్శనికులని, ఉన్మాదులని పిలుస్తారు.

దక్షుడు పెళ్లయిన తర్వాత సంవత్సరంలో ఒక గొప్ప వార్షిక యాగాన్ని చేయ తలపోసి, దానిని చాలా వైభవంగా నిర్వహించడానికి పనులు ప్రారంభించాడు, అయితే అతను మహాదేవుని యాగం నుండి మినహాయించాలని నిర్ణయించుకున్నాడు, మునుముందు కోరదగని అల్లుడు దూరంగా ఉండేలా ప్రవేశ నియమాలను రూపొందించాడు. దాని ఫలితం అందరికీ తెలిసిందే. దక్షుడు మినహాయించాలని ప్రయత్నించిన భారతదేశ గమ్యం కోపంతో వచ్చి యాగ మందిర తలుపులను తట్టింది. దక్షుని కిరాయి మనుష్యులు అతనిని తిరిగి కొట్టడానికి ప్రయత్నించినప్పుడు, అతను యజ్ఞ వేదిలోకి చొరబడి, యజ్ఞాన్ని విధ్వంసం చేసి అక్కడే దక్షుడిని చంపాడు.

*

అందరూ దక్షుని తరపున వేడుకొనగా, మహాదేవుడు అతనిని తిరిగి బ్రతికించాడని, కానీ దక్షుని తల కోసం వెతికితే దొరక్కపోవడంతో దురదృష్టవశాత్తూ ప్రజాపతి మొండానికి మేక తల పెట్టినట్లు కథనం. ఆధునిక దక్షుడు చనిపోయినప్పుడు, అతనిని పునర్జీవింపచేయాలనే కోరిక ఉంది, కానీ తల కనుగొనబడలేదు. కొందరు అది పోయిందని చెప్పారు, మరికొందరు దీనిని చెల్లిపోయిన అధికారంగా చెప్పి మరింత చట్టపరమైన భాషలో వాదించారు. దీని ప్రకారం, ఈ మేధావులు ఒక మేక తలని కనుగొని, దానిని ఒక మతం అని పిలిచి, దానిని దక్షుని భుజాలపై తగిలించి, అతని శరీరానికి ప్రాణం పోసి, మేషశిరంలో కాళ్లు లేని వికృత వైపరీత్యంగా భవిష్యత్తులో దక్షునిగా పంపబడతాడు. దురదృష్టవశాత్తూ వారు మేక తలను తప్పుడు రీతిలో పెట్టటం ద్వారా ఆ పనిని మరింత వింతగా చేసారు, తద్వారా దాని ముఖం వెనుకకు తిరిగింది, వికలాంగుడైన రాక్షసుడు తనను తాను ముందుకు నెట్టుకోవడానికి ప్రయత్నించినప్పుడు, అతని పురోగతి తిరోగమనమే, అతను ముందుకు వెళ్లడం అంటే వాస్తవానికి వెనక్కు వెళ్లడం, ఎందుకంటే అతని కళ్ళు గతం వైపు మళ్ళాయే కానీ భవిష్యత్తు వైపు కాదు.

పరాక్రమవంతుడైన మహాదేవుడు సతీదేవి మృతదేహాన్ని భుజాలపై మోస్తూ ప్రపంచ పునాదులను కదిలించే కరాళ నృత్యం చేశాడు. సతీ తన పాత శరీరాన్ని విడిచిపెట్టింది, కానీ ఆమె చనిపోయిందని మనుషులు అనుకున్నారు. కానీ ఆమె చనిపోలేదు, మనుష్యుల దృష్టి నుండి మాత్రమే తనను తాను ఉపసంహరించుకుంది. దేవతలు సతీదేవి శరీరాన్ని ముక్కలుగా చేసి, భారతదేశం అంతటా పడేలా చేశారు. ఈ విషయంలో కూడా పోలిక ఉంది, ఎందుకంటే కాంగ్రెస్ మరణానంతరం కాంగ్రెస్ పుత్రికగా ఉన్న భారత ఐక్యత వర్గాలుగా, సమూహాలుగా విడిపోవాలి. ఈ సంప్రదాయం ఇప్పటికే సంఘాలను అభివృద్ధి చేస్తోంది, రాబోయే కాలంలో జాతీయవాదులు కూడా సంఘాలుగా విడిపోతారు, వాటిలో కొన్ని మనకు వర్తించే ప్రస్తుత తీవ్రవాద హెూదాను అసంబద్ధం చేస్తాయి, భారతదేశ రాజకీయ జీవితం అరాచకంగా మారుతుంది. కానీ అది ఎప్పటికీ స్థిరంగా ఉండదు. గొప్ప ప్రయత్నము, బృహత్కాంక్ష, అసమాన ఆత్మత్యాగం ఉన్న ఎత్తైన పర్వత రాజుకు సతీ తిరిగి పుడుతుంది. ఆమె ఇదివరకుటి కంటే అందమైన, ఉత్తమ శరీరంతో మళ్లీ జన్మించి భయంకర తపస్సు ద్వారా ఆమె మరోసారి మహాదేవుని కలుసుకుని, సంతోషకర, ఉన్నత భవిష్యత్తు కోసం దివ్య విధానంలో, శుభశకునంగా వివాహం చేసుకుంటుంది. ఈ విషయం దేవుని పుస్తకంలో వ్రాయబడింది, దీనిని ఏదీ నిరోధించలేదు. సతీ మహాదేవుని వివాహం చేసుకుంటుంది, భారతదేశ జాతీయ జీవితం దాని దివ్య, శక్తివంతమైన గమ్యాన్ని చేరుకొని, దానిని స్వాధీన పరుచుకుంటుంది.

CWSA 6-7:1073-77 *శ్రీ అరవిందులు*

శివుడు రుద్రుడు:

ధీరత్వం ఉన్న వ్యక్తి ప్రతి సంఘటనను సూక్ష్మంగా చూడగలడు, అతను ఒకేసారి చూడలేకపోతే, ఆ సమస్య అంతిమ ప్రయోజనం (ఎందుకు సృష్టించబడిందో) కోసం, దానికి సంబంధించిన జ్ఞానోదయం కోసం వేచి ఉంటాడు; బాగా నిరీక్షిస్తూ, నిశ్చలంగా ఆలోచిస్తే, జీవిత పరమార్థం మనసులో మెదులుతుంది. ఒక అనంత ప్రయోజనం స్వల్ప విషయాలలోనూ, ముఖ్య విషయాలలోనూ, మంచి, చెడు సంఘటనల రూపంలోనూ బహిర్గతమవుతుంది:

సర్వజ్ఞ భగవత్ సంకల్పం పిచ్చుక పడిపోవడంలోనూ, చీమ మరణంలోనే కాకుండా, గొప్ప నగరాలను కూడా నాశనం చేసే భూకంపం లోను, వేలాది మందిని నిరాశ్రయులను చేసే వరదలలో తనను తాను వెల్లడి చేసుకుంటుంది.

రుద్రుడు, శివుడు తమను తాము ఒకే సత్యంగా బహిర్గతం చేసుకుంటారు. అప్పుడు యోగి భగవంతుడిని అన్ని జీవులలో మాత్రమే కాకుండా అన్ని సంఘటనలలోను చూడగలడు. వరద ఆయనే, భూకంపం ఆయనే, ఉన్నత జీవితానికి దారితీసే మృత్యువు ఆయనే, మనల్ని ఉన్నతమైన ఆనందానికి సిద్ధం చేసే బాధ ఆయనే. ఇది వాదనకు అందని విషయం, దానిని అనుభవించి తెలుసుకోవాల్సిందే. పరిపశ్యంతి ధీరాః అటువంటి దృష్టి ప్రశాంత హృదయానికి, కలవరపడని అవగాహనకు మాత్రవే సాధ్యమవుతుంది.

CWSA 13: 61-62 — *శ్రీ అరవిందులు*

శివుడు నూత్న సృష్టి

శివుడు - శక్తి

శ్రీమాత పలికినపుడు ఉల్లాసకరమైన, సంతోషకరమైన చిరునవ్వు ఆమె పెదవులపై తారట్లాడింది. నీవు ఇక్కడ ఉన్నందుకు అదృష్టవంతురాలివి. ప్రకృతి మాత ఇప్పుడిప్పుడే ఆధ్యాత్మికతతో కలసి పనిచేయడానికి తన పూర్తి సమ్మతిని తెలిపింది అని ఆమె అన్నారు.

తక్షణమే శ్రీమాత తమ ధ్యానంలో చూసిన హావభావాల చిత్రమంతా నా మనోఫలకం మీదికి వచ్చేసింది. ఆమె ఎందుకు ఆనందంగా ఉందో నాకు అవగతమయ్యింది.

అప్పుడే ఆమె వ్రాసింది నాకు చూపుతూ ఆమె పలికారు :

ఇదే నూతన సంవత్సర సందేశం కానుంది. అమ్మా! ఇది నీవెవరికి చెప్పకు.

నేను అలాగే ఒక మాట కూడా ఎవరికి చెప్పనని హామీ ఇచ్చాను.

ఆ సందేశం :

ఓ ప్రకృతీ! పదార్థమాతా!

నీవు సహకరించగలవని పలికావు.

ఈ విశేష సహకార శోభకు పారావారమే లేదు.

అప్పుడు శ్రీమాత నాకొక క్లుప్తమైన వివరణ ఇచ్చారు. తరువాత నా చేతుల్ని దగ్గరకు గట్టిగా కలిపి నా కళ్ళలోకి లోతుగా చూచారు. నన్ను చాలా సున్నితంగా కౌగిలించుకున్నారు. ఆమె నుండీ పుష్పాలను స్వీకరించి గోల్కొండ అతిథి గృహం వైపుకు వెళ్ళిపోయాను.

మరుసటి ఉదయం శ్రీమాత నాకు శివుణ్ణి, శక్తిని చిత్రించిన ఒక పెద్ద కార్డును పంపారు.

దానిపై ఇలా ఆమె వ్రాశారు :

ఆధ్యాత్మిక శక్తికి పదార్ధ ప్రకృతికి మధ్య ఒక సహకార పార్శ్వంగా దీనిని తీసుకోవచ్చు.

ఆ ముందు సాయంకాలం ఆమె చెప్పిన దానికి నేనొక నివేదికను పంపించాను అది :

ప్రకృతి ఎప్పుడూ తన స్వంత విధానాల్లోనే పోతుంది. ఆధ్యాత్మిక అంశాలు కూడా వాటి స్వంత మార్గాల్లోనే పోతున్నాయి. ప్రకృతి ఆధ్యాత్మికం రెండూ కలసి ప్రయాణించలేవు. ఇంతవరకూ వాటి మధ్య సయోధ్య లేదా సహకారం ఉండకపోవడమే కాక రెండింటి మధ్య ఎల్లప్పుడు పరస్పర వైరుధ్యం ఉంటుంది.

ఎప్పుడు నూతన సంవత్సరం ఆరంభమౌతుందో అప్పుడు అంతులేని సహకారం వాటి మధ్య ఉండబోతుంది. సమృద్ధి, హర్షోల్లాసం, వైభవం, మహత్వం వెల్లివిరియబోతుంది. అతి మానస లోకానికి చెందిన నూతన ప్రపంచం ఆవిర్భవించబడుతుందనే వాగ్దానం చేయబడుతుంది. ఎందుకంటే ప్రకృతి మాత పదార్థమాత 'నేను సహకరిస్తాను' అని చెప్పింది. కాబట్టి ప్రతి ఒక్కరూ ఆమెను ప్రేమించాలి.

మదర్ యూసెడ్ సో 8.11.57

శివుడు రూపాంతరీకరణ మార్గాన్ని సన్నద్ధం చేస్తున్నాడు. నీకు అయిన దర్శనం లక్ష్యానికి సంబంధించిన ఒక మార్గం. శివుడు సంసిద్ధంగా, ప్రకాశాన్ని కుమ్మరించే శక్తిగా, సాధకుడు ఇంకా పురోగమించడానికి సంసిద్ధంగా ఉన్నాడా అన్నది కూడా పరీక్షిస్తున్నాడు. ఇతడెప్పుడైతే ఆయనను సాగిపోనిస్తాడో ఇక నూత్న, ఉచ్ఛతర భావాలు, దైవీశక్తుల పురోగమన కవాతు, దేవతలు,

దేవతా శక్తుల ప్రసారం, ప్రకృతి రూపాంతరీకరణ, ఒక ఉచ్ఛతర చేతనలోకి అతివేగంగా జరిగిపోతుంది. ఈ శక్తుల గమనాన్నే నీ దర్శనంలో బహుశ చూచావు.

CWSA 30:155

శివుని కానుక

ఆ రోజులు నాకు గుర్తున్నాయి. అప్పుడు శ్రీ అరవిందులు ఇక్కడే ఉన్నారు. క్రింద హాల్లో సాధక బృందానికి ధ్యాన కార్యక్రమం నిర్వహించడానికి నేను క్రిందికి దిగి వెళ్ళేదానిని. అక్కడ వున్న స్తంభాలపై అంచుల్లో ఆ సమయానికి దేవతలొచ్చి కూర్చునే వారు. శివుడు, కృష్ణుడు, లక్ష్మి, త్రిమూర్తులు, ఇలా అంతా ధ్యానంలో పాల్గొనేందుకు వచ్చేవారు. వారిలో ఒకరు చిన్నగా, ఒకరు పెద్దగా ఉన్నారు. వారంతా క్రమం తప్పకుండా, నియమంగా నిత్యం వచ్చేవారు. అది ఒక రమణీయ దృశ్యం. కాని ఈ రకంగా పరాత్పరుణ్ణి ఆరాధించే పద్ధతి వారిలో లేదు. ఆ భావనతో వారికి పెద్ద ఉపయోగం కూడా లేదు. ప్రతి దేవత తన అస్తిత్వానికున్న రీతిని బట్టి తమ శాశ్వత దివ్యత్వం పట్ల ఎఱుకతో ఉన్నారు; ప్రతి ఒక్కరికి తాను ఇతరులందరిలాగా ప్రాతినిధ్యం వహించగలనని తెలుసు (అదే జనప్రియ ఆరాధనకు ఆధారం. ఒక ప్రత్యేక ఉపాసనా వర్గానికి చెందిన ప్రతి భక్తుడికి తన ఆరాధ్య దేవత ఒక మార్గమని పరిపూర్ణంగా తెలుసు అది వాళ్ళకీ తెలుసు) వారంతా ఒక వర్గంగా తమను భావించుకొంటారు. కాని అంతరాత్మిక జీవనం అందించే గుణగణాలు వారిలో లేవు. అంటే ఒక లోతైన ప్రేమ, ప్రగాఢమైన సానుభూతి సమైక్యతా భావనలాంటివి వారిలో ఉండవు. వారు వారికున్న ప్రత్యేక దివ్యత్వం పట్ల మాత్రమే ఎఱుకతో ఉంటారు. వారికంటూ నిర్దిష్టమైన కదలికలుంటాయి. ఉపకరణాలుగా ఉందామనే భావన గాని, పరాత్పరుని పట్ల ఈ విధమైన విధేయమైన ఆరాధన గాని వారికుండదు. వారు పరమాత్మకు ప్రాతినిధ్యం వహిస్తున్నామని భావించరు. కాబట్టి ప్రతి దేవత తన ప్రత్యేక ప్రాతినిధ్య భావనతో పూర్తిగా తృప్తిపడిపోతాడు.

కానీ దీనికి కృష్ణుడు మినహాయింపు... 1926లో నేనొకవిధమైన అధిమానసిక సృష్టిని ప్రారంభించాను. ఈ భూమి మీదకు, ఈ పదార్థంలోకి

అధి మనస్సును తీసుకొచ్చాను. (రకరకాల అద్భుతాలు సంభవించడం ప్రారంభమయ్యింది) నేనే ఈ దేవతలనందరినీ అవతరించమని, వారంతా ఒకే దేహంగా వారిని వారు ఏకీకృతమవ్వమని అడిగాను (వారిలో కొందరైతే దానిని ససేమిరా ఒప్పుకోలేదు) మంచిది. నా ఈ నయనాలతో స్పష్టంగా కృష్ణుణ్ణి చూచాను. ఆయన నిరంతరం శ్రీ అరవిందులతో సత్సంబంధంతో, సన్నిహితంగా ఉంటున్నాడు. ఆయన శ్రీ అరవిందుని దేహంలోకి దిగి రావడానికి సమ్మతించాడు. అది నవంబర్ **24**, "మదర్"కి ఆరంభం. (**1926** సంవత్సరం నుండీ శ్రీ అరవిందులు అధికారికంగా 'మదర్'ను 'మదర్'గా సాధకులకు పరిచయం చేశారు. అంతకు మునుపు మదర్‌ను శ్రీఅరవిందులు 'మిర్రా' అని సంబోధించేవారు.

శ్రీమాత : శిష్యునితో సంభాషణ, ఆగష్టు 2, 1961

రూపాంతరీకరణను సాధించే మూడు విధానాలు :

రూపాంతరీకరణ అనే ప్రశ్న విషయంలో, మూడు రకాల విధానాల ద్వారా దానిని సాధించవచ్చు. అవి మూడు మార్గాలు. దానిని పూర్తి చేయడంలో ఈ మూడింటిని జోడించాలి.

మొదటిది : సహజంగానే చాలా ముఖ్యమైన మార్గం, అదే ఆధ్యాత్మికం అని పిలువబడుతుంది. ప్రేమ, చేతన, శక్తికి చెందిన చేతనతో సంపర్కం. అవును, అదే, ఈ మూడు పార్శ్వాలు. పరమోచ్చ ప్రేమ -చేతన - శక్తి. దానితో సంపర్కం, దానితో ఏకమవ్వడం. అంటే తత్‌ను అందుకోగల్గేలా సమస్త భౌతిక కణాలను సమర్పించుకోవడం. తత్‌ను అభివ్యక్తీకరించడం 'తత్'గా ఉండటం. తక్కిన అన్ని సాధనాల్లోనూ ఇది సబలమైనది, అత్యావశ్యకమైనది.

ఒక మార్మికమైన మార్గం ఉంది. అది అన్ని మధ్య స్థిత లోకాలు జోక్యం చేసుకొనేలా చేస్తుంది. మధ్యస్థాయి ప్రాంతాలు, మూర్తిమత్వాలు, శక్తులకు చెందిన సవివరణాత్మక జ్ఞానం, అది అన్నింటిని వినియోగించుకుంటుంది. అక్కడ వ్యక్తి అధి మనస్సుకు చెందిన దివ్యత్వాలను ఉపయోగించుకొంటాడు. ఇది రెండవ మార్గం. శివుడు, కృష్ణుడు, మాతృ స్వరూపంలోని అన్ని పార్శ్వాలు - ఈ రెండవ మార్గానికి చెందినవే.

ఇక పైన ఉన్నత మేధోపరమైన విధానం. అది విజ్ఞానాన్ని అధిగమించే ఒక శక్తికి బహిర్ ప్రసారం. అది దిగువ నుంచే సమస్యను పట్టుకొంటుంది. దీనికి, దీనికంటూ ప్రాముఖ్యత ఉన్నది. సవివరంగా చేబూనే ఒక దృక్కోణం నుండీ ఈ విధానం అంచనాలను కుదించేసి ఒక తిన్ననైన, విశదమైన కార్యాన్ని గైకొనివస్తుంది. ఈ మూడు విధానాలు సమైక్యపర్చబడితే చాలా స్ఫుటంగా కార్యగతి వేగవంతమౌతుంది.

మొదటి విధానం లేకుండా ఏదీ సాధ్యం కాదు. అది లేకపోతే తక్కినవన్నీ భ్రామికమౌతాయి. అవి ఏ గమ్యాన్ని చేర్చలేవు. అనిర్దిష్టంగా అక్కడే గిరగిరా తిరుగుతుంటావు. ఆ రెండింటికి దీనిని తొడిగితే అప్పుడు కార్యం చాలా స్పష్టంగా, ఖచ్చితంగా, నేరుగా, వేగవంతంగా జరుగుతుందని అనుకొంటున్నాను.

CWM 11:60

భగవంతునిగా శివుడు

కాళిక

ఈ రోజు ప్రార్థన చేస్తున్నపుడు కాళీమాత చిత్రాన్ని చూశాను. ఆమె నల్లగా, నగ్నంగా శివుని వీపు మీద కాలు పెట్టి నిలబడి వుంది. ఎందుకు కాళీమాత అటువంటి రూపంలో కనిపిస్తుంది, ఏ తలంలో ఆమె ఇలా కనపడుతుంది?

ప్రాణికంలో అలా కనిపిస్తుంది. ఆమె నాశనం చేసే శక్తి అయిన కాళిక, కష్టాలతో వున్న అజ్ఞానంలోని ప్రకృతిశక్తికి సంకేతం, వాటి నుండి బయటపడటానికి చేసే ఒక అంధ సంఘర్షణలో ప్రతిదానిని అణగదొక్కుతూ, విచ్ఛిన్నం చేస్తూ తనపాదం దైవం మీద నిలదొక్కుకునేవరకు అలా చేస్తుంది.- అప్పుడు ఆమె తనలోకి తాను ప్రవేశిస్తుంది, నాశనకార్యం పూర్తవుతుంది.ఈ సంకేతప్రాముఖ్యత అది.

CWSA 32:68-69

దేవతల చిత్రాలు

నేను ఎక్స్‌తో జరిపిన సంభాషణలో ఏథెన్సా మహేశ్వరికి ప్రతినిధి లేదా ఒక రూపం అన్నాడు. శివుని వంటి దేవతల గురించిన నా దర్శనాలు కొన్ని

మానవరూపాలను పోలి వున్నాయి, కానీ ఇది మానవమనసుకు సంబంధించిన తలాల మీద చూడటం వల్ల, నా మనసు ఆవిధంగా చూడటం వల్ల అయివుండ వచ్చు. పదార్థ సృష్టికి ముందు ప్రాణిక, మానసిక ప్రపంచాలు ఉనికిలో వున్నాయి, దానికి ముందు ఉన్నత ప్రపంచతలాలు ఉన్నాయి. అయితే ఈ తలాలపై దేవతలు రూపాలతో, ఆకారాలతో వున్నారా లేక కేవలం రూపాలు లేకుండా నిర్వ్యక్తికశక్తులలా వున్నారా?

దేవతలకు సంబంధించినంతవరకు వారు సమ్మతించిన రూపాలను మనిషి రూపొందించవచ్చు : కానీ ఈ రూపాలు కూడ ఆ దేవతకు చెందిన తలం నుండి మనిషిని ప్రభావితం చేస్తాయి. సమస్త ప్రకృతికి రెండు పార్శ్వాలు వున్నాయి, రూపసహితము, రూపరహితము. దేవతలు కూడ రూపరహితంగా వున్నా రూపాలు కలిగి వుంటారు., కానీ ఒక దేవాధిపతి అనేక రూపాలు తీసుకోవచ్చును, ఇక్కడ మహేశ్వరి , అక్కడ పలాస్ ఎథెనా. మహేశ్వరికి గల అల్పస్థాయి ప్రకటనల్లో దుర్గ, ఉమ, పార్వతి, చండి తదితరులు. దేవతలు మానవరూపాలకు మాత్రమే పరిమితం కాదు- మనిషి కూడ వారిని ఎప్పుడూ మానవరూపాలలో మాత్రమే చూడడు.

CWSA 32:66-67

స్థితి, గతి అన్నవి ఏకత, బహుళతల లాగ కేవలం నిరపేక్షతకు చెందిన మన మానసిక ప్రాతినిధ్యాలు అని మనం గుర్తుంచుకోవాలి. నిరపేక్షత ఏకతకు, బహుళతకు అతీతమైనట్లుగా స్థితికి, గతికి కూడ అతీతం. కానీ ఇది ఏకతలో, స్థిరంలో తన శాశ్వతస్థిరతను తీసుకుని, అలాగే గతిలో, బాహుళ్యతలో అనంతంగా, అచింత్యంగా, సురక్షితంగా తన చుట్టూ తాను తిరుగుతుంది. ప్రపంచ-అస్తిత్వం పరమశివుని ఆనంద తాండవం, అది భగవంతుని దేహాన్ని అసంఖ్యాకంగా బహుళీకరించి చూపుతుంది. ఇది ఆ స్వచ్ఛమైన అస్తిత్వాన్ని ఖచ్చితంగా ఎక్కడ ఏదిగా ఎప్పటికీ వుందో, ఎప్పటికీ వుంటుందో అక్కడ దానిగానే విడిచిపెడుతుంది. దాని ఏకైక సమగ్ర లక్ష్యం నర్తించడంలోని ఆనందమే.

కానీ మనం నిరపేక్షము తన స్వరూపంలో స్థితికి, గతికి ఆవల, ఏకతకు, బహుళతకు ఆవల వర్ణించలేము, లేదా ఆలోచించలేము గనుక ఇది మన వ్యాపకం కాదు- మనం ఈ ద్వివిధ వాస్తవాన్ని అంగీకరించాలి, శివశక్తులను

సమ్మతించాలి, ప్రమాణాప్రమాణాలు వర్తించని , ఏకము, స్థిరము అయినటువంటి దేశకాలరహిత శుద్ధసత్తు దృష్ట్యా దేశకాలాలలో ఈ కాలవశక్యం గాని చలనం ఏమిటి అన్నది తెలుసుకోవడానికి అన్వేషించాలి. స్వచ్ఛమైన హేతువు, అంతఃస్ఫూర్తి, అనుభవాలు శుద్ధసత్తను గురించి, సత్‌ను గురించి, ఏమి చెప్పాలనుకుంటున్నాయి అన్నది చూశాము అయితే శక్తి గురించి, చలనం గురించి ఏమి చెబుతాయో చూద్దాం.

మొట్టమొదట మనల్ను మనం వేసుకోవలసిన ప్రశ్న ఆ దివ్య క్రియాశక్తి కేవలం శక్తేనా, గతికి సంబంధించిన మేధోరహిత ఊర్జం మాత్రమేనా? లేక దాని నుండి ఉద్భవించినట్లుగా కనిపించే చైతన్యం, మనం నివసిస్తున్న ఈ భూప్రపంచంలో ఇంద్రియగోచర ఫలితాలలో ఒకటి మాత్రమే కాదు, దాని స్వీయ సత్యము, రహస్యము అయిన స్వభావమా? వేదాంతపరిభాషలో దివ్యక్రియా శక్తి కేవలం ప్రకృతి, చర్యసంబంధ చలనం, క్రమవిధానమా? లేక ప్రకృతి సృష్ట్యాత్మక స్వ-చేతనకు చెందిన తన స్వభావశక్తిలో నిజంగా చిత్ శక్తేనా? మిగిలినదంతా ఈ మూలసమస్య పైనే ఆధారపడుతుంది.

CWSA 21-22:85-86

శివుడు, బుద్ధుడు

అమ్మా ! బుద్ధుని గురించి నాకు ఒక ప్రశ్న వుంది.దైవం భూమి మీద జీవించగలడని చూపడానికే అవతారం భూమి మీదకు వస్తాడని మీరు చెప్పారు. అయితే ఆయన దానికి వ్యతిరేకమైనదానిని ఎందుకు బోధించాడు ? ఆయన అవతారమా, కాదా?

అది!.... కొంతమంది ఆయన అవతారమని అంటారు, కొంతమంది కాదంటారు. కానీ నీకు సత్యం చెప్పాలంటే.....

దైవం ఏదైనా చేయగలడని నిరూపించడానికి అవతారంగా భూమిమీదకు వస్తాడని భావిస్తున్నాను ఇది మొదటిది... ఇది ఎక్కువగా పదాలతో నిరూపణ చేయడానికి కాదు, ఒక నిర్దిష్ట సాక్షాత్కారాన్ని నిరూపించడానికి ఒక రూపాంతరీకరణాత్మక, విధ్వంసాత్మక పార్శ్వంకన్నా నిర్మాణాత్మకమైనది, రక్షించేది అయిన భగవంతుని దృక్పధమిది. భారతదేశానికి తెలిసిన పేర్లను ఉపయోగించాలని చూస్తే అవి విష్ణువు అవతారాలనుకుంటాను, అవి దైవం భూమిమీదకు రాగలడని నిరూపించడానికి వచ్చినవి : శివుడు అభివ్యక్తమైన

ప్రతిసారి ఇలాగే, మాయకు వ్యతిరేకంగా పోరాడటానికి, అక్కడ వున్నదాన్ని ధ్వంసం చేయడానికి ప్రయత్నించిన వ్యక్తులలో అభివ్యక్తమయ్యాడు.

బుద్ధుడు కూడా అట్లా ఒకరని భావించడానికి నావద్ద కారణాలున్నాయి. ఖచ్చితంగా చెప్పాలంటే శివుని శక్తిలోని కొంతభాగాన్ని ఆయన ప్రకటించాడు. అదే దయ, సమస్త దుఃఖాన్ని అదేవిధంగా అర్థం చేసుకోవడము, నాశనం చేసే అదే శక్తి- స్పష్టంగా రూపాంతరం చెందించే ఉద్దేశ్యంతో, నిర్మించడానికి బదులు నాశనం చేస్తాడు. ఆయన కార్యం నిర్మాణాత్మకంగా కనిపించదు, మనుష్యులను అహంకారపూరితంగా వుండవద్దని ఆచరణాత్మకంగా బోధించడం చాలా అవసరం; ఆ దృక్పథంలో ఇది అత్యావశ్యకం. కానీ లోతైన సిద్ధాంతంలో అది భూరూపాంతరీకరణకు ఎక్కువగా సహాయపడలేదు.

నేను చెప్పినట్లుగా ఉన్నతచైతన్యం పృథ్వి జీవనంలోకి దిగి రావడానికి సహాయపడే బదులు, అది లోతైన చైతన్యం వేరుకావడాన్ని బలంగా ప్రోత్సహించింది, బాహ్యప్రకటన మొత్తంలో ఇది మాత్రమే నిజమైనదని అతడు చెప్పాడు.

CWM 7:292-93

పురాణాలలోని దేవతలు

మారుతూ నిలబడే ఈ క్రమం ఏ సిద్ధాంతాన్ని కూడ నాశనం చేయడంతో ముందుకు కదలదు, ముఖ్య వైదిక రూపాలు, ఇతర ప్రత్యామ్నాయాలు క్రమీణ అంతరించిపోవడం ద్వారా ముందుకు కదులుతుంది. అక్కడ సంకేత రూపాంతరీకరణ, కర్మకాండ, ఆచారము లేదా కొత్తగా శిక్షణ పొందిన రూపాల ఒక ప్రత్యామ్నాయము, యధార్థ విధానంలో కేవలం సూచనలైన విషయాల ఒక ఉద్భవం, యధార్థ భావనా బీజం నుండి అపూర్వ భావజాల రూపాల అభివృద్ధి వుంది. ప్రత్యేకంగా అక్కడ ఇంకా ఎక్కువ విశాలము, లోతు అయిన అంతరాత్మిక, ఆధ్యాత్మిక అనుభవం వుంది.మొదట్లో వారు తమ బాహ్యవైశ్విక జ్ఞానం చేత నిలబడ్డారు కానీ త్రిమూర్తులనబడే బ్రహ్మ,విష్ణు, మహేశ్వరుల చేత కప్పబడి, ఆ తర్వాత మొత్తంగా అంతరించారు. బాహ్య సాంకేతిక దృక్పథాలలో ఒక లోతైన సత్యాన్ని, ఆధ్యాత్మిక అనుభవ విస్తారశ్రేణిని, ఒక గాఢ అనుభూతిని, ఒక విశాల భావనను ప్రకటించే ఒక నూతన సర్వదేవతల ఆలయం కనిపించింది. వేద యజ్ఞం కేవలం విచ్ఛిన్నమైన, తగ్గించే ముక్కలుగా

కొనసాగింది. యజ్ఞశాల స్థానంలో దేవాలయం వెలసింది : యజ్ఞ సంబంధ కర్మకాండ పూజించే దేవాలయ సదాచారంగా రూపాంతరం చెందింది. మార్పుచెందే మానసిక దేవతల అస్పష్ట చిత్రాలు ఇద్దరు గొప్ప దేవుళ్ళైన శివుడు విష్ణువు, వారి శక్తులు, వారి సంతానాల స్పష్టమైన భావనారూపాల్లోకి వ్యక్తమైన మంత్రాలలో రూపం తీసుకున్నారు. భౌతిక చిత్రాలలో స్థిరపడిన ఈ నూతన భావనలు ఆంతరిక ఆరాధనకు, బాహ్య పూజకు ఆధారంగా మారి యజ్ఞ స్థానాన్ని భర్తీ చేశాయి. వేద మంత్రాల ఆంతరిక జ్ఞానమైన అంతరాత్మిక, ఆధ్యాత్మిక మార్మిక కృషి ఇంకా తక్కువ గాఢ ప్రకాశంలో అదృశ్యమయ్యింది. కానీ ఇంకా విశాలంగా, సమృద్ధిగా, పౌరాణిక, తాంత్రిక, యోగాలకు చెందిన క్లిష్ట మానసిక ఆధ్యాత్మిక ఆంతరిక జీవితంలోకి అంతర్థానమయ్యింది.

CWSA 20:208-209

దేవతలు స్వతంత్రులు

కనుక ఈ దేవతలు వారి వారి స్వీయ శక్తులతో స్వతంత్రులు, వారికిఇష్టమైనది చేసే స్వేచ్ఛ వుంది.

నేను ఇంకో ఇంట్లో ఉన్నపుడు (ఇక్కడ కాదు) శివునితో ఎక్కువగా సన్నిహితంగా ఉన్నాను. భూమి మీద అభివ్యక్తమవ్వమని ఆయన్ను అడిగాను, “నేను అలా చేయలేను. అతిమానస జాతి భూమిపైన వున్నపుడు మాత్రమే నేను వస్తాను.” అన్నాడు. ఇక నేను చెప్పడానికి ఏమి లేదు, ఆయన స్వతంత్రుడు.

నేను ఈ భూమిమీద జన్మించినప్పటి నుండీ ఈ దేవీదేవతలు స్థిరంగా నాతో వున్నారు.

పాతరోజుల్లో నేను వరండాలో నడుస్తుంటే కృష్ణుడు నాతో పాటుగా నడిచేవాడు.

నూతన సృష్టిలో, అతిమానస నూతన ప్రపంచంలో ఈ దేవీదేవతలు మనుష్యులకు సహాయం చేస్తారని నాకు తెలుసు.

మదర్ యు సెడ్ 25-02-1966

నిర్వ్యక్తికత, వ్యక్తికత

జగత్ భూమికలో సైతం, ఈ రెండు పార్శ్వములలో ఏదో ఒక దాని ద్వారా మనం సదా దైవాన్ని సమీపిస్తున్నాం. భగవంతుడు సత్యం, న్యాయం, ధర్మం, శక్తి, ప్రేమ, ఆనందం, సౌందర్యంగా మనం భావించవచ్చు, సంవేదించవచ్చు, చెప్పవచ్చు. ఒక విశ్వజనీన శక్తిగా, లేక ఒక విశ్వజనీన చేతనగా ఆయనను మనం దర్శించవచ్చు. కాని ఇది కేవలం నిరాకార అనుభవం మాత్రమే. స్వయంగా మనం కేవలం గుణాల చేత లేక శక్తుల లేక ఒక మనోవిజ్ఞానపరమైన పరిమాణానికి సంబంధించిన ఒక సంఖ్య కాదు, కాని ప్రకృతిలో ఒక జీవిగా ప్రకటితమౌతున్న వారమైనట్లే, దైవం కూడా ఒక వ్యక్తి, ఒక సచేతన పురుష, ఆవిధంగా అతడు తన స్వభావాన్ని మనకు వ్యక్తం చేస్తాడు. ఋజు ప్రవర్తన గల ఒక భగవంతునిగా, ప్రేమ, కారుణ్యాల ఒక భగవంతునిగా, శాంతి, పరిశుద్ధతల ఒక భగవంతునిగా, ఈ స్వభావానికి సంబంధించిన విభిన్న రూపాల ద్వారా మనం ఆయనను ఆరాధిస్తాం. ఆ విధంగా ఆయనను ఆరాధించే మూర్తిత్వ రూపానికి సంబంధం లేనివిగా మనం ఎడంగా పెట్టే ఇతరమైనవి కూడా దైవంలో వున్నాయనేది సుస్పష్టం. ఏ మాత్రం జంకులేని ఆధ్యాత్మిక దర్శనం, అనుభవ ధైర్యంతో మరింత కఠినమైన లేక భయంకర రూపాలలో కూడా ఆయనను మనం కలుసుకోవచ్చు. ఇందులో ఏ ఒక్కటీ సమస్త దివ్యత్వం కాదు. అయినప్పటికీ ఆయన మూర్తిత్వపు ఈ రూపాలు, ఆయనకు సంబంధించిన నిజమైన సత్యాలే. తక్కినదానినంతా తన వెనుకకు నెట్టివేసినట్లు మనతో ఆయన ఈ మూర్తిత్వాలలో మనల్ని కలుస్తాడు, మనతో వ్యవహరిస్తున్నట్లు కన్పిస్తాడు. ఆతడు విడివిడిగా ప్రతి ఒక్కటీ, అన్నీ కలిపి కూడా. ఆతడు విష్ణువు, కృష్ణ, కాళి, మానవీయతలో ఆతడు, క్రీస్తుమూర్తిత్వంగా, లేక బుద్ధిని మూర్తిత్వంగా మనకు తెలుపుకుంటాడు. మన ప్రథమ, కేవలం కేంద్రీకృతమైన దర్శనాన్ని దాటి ఆవలకు చూచినపుడు, విష్ణువు వెనుక, శివుని సమస్త మూర్తిత్వాన్ని, శివుని వెనుక విష్ణువు సమస్త మూర్తిత్వాన్ని చూడగలం. ఆ మూర్తిత్వం ద్వారా తనను తాను అభివ్యక్తం చేసుకొనే అనంతగుణుడు, అనంత దివ్యమూర్తిత్వం ఆయన. ఒక పరిశుద్ధ ఆధ్యాత్మిక నిర్వ్యక్తికతలోనికి లేక నిర్వ్యక్తిక పరమాత్మ భావన సమస్తానికి ఆవలకు ఉపసంహరించుకొని, ఒక ఆధ్యాత్మికీకరించబడిన

నాస్తికతను లేక అజ్ఞేయవాదాన్ని సమర్ధిస్తున్నట్లు కన్పిస్తాడు. ఆతడు మనిషి మనసుకు ఒక 'అనిర్దేశ్యం'గా తయారవుతాడు. కాని ఈ తెలియరాని దాని నుండి, ఇచట తనను తానభివ్యక్తం చేసుకొన్న సచేతన పురుష, దివ్యవ్యక్తి ఆయన; ఇంకా ఇలా అంటాడు "ఇది కూడా నేనే, మనసు దృష్టికావల ఇచ్చట కూడా ఆతడు నేనే, పురుషోత్తముడను"

CWSA 23:585-586

ఇష్టదేవత

కృష్ణుడు, శక్తి, శివుడు మధ్య 'యక్స్'కు గల అంతర్వివేకానికి సంబంధించిన సందేహాలకు, చిరునవ్వు చిందించకుండా ఉండలేక పోతున్నాను. కేవలం దైవానికి మాత్రమే సంబంధించిన ఒకటి, లేక రెండు రూపాలకు మనిషి ఆకర్షితుడైతే మంచిదే. కానీ ఏకకాలంలో అనేక రూపాలకు ఆకర్షితుడైతే వానిని గురించి అతడు బాధపడవలసిన అవసరం లేదు. ఒక కొంత అభివృద్ధి చెందిన మనిషి స్వభావంలో అవశ్యం అనేక పార్శ్వాలుంటాయి. విభిన్న పార్శ్వాలు అతనిలో విభిన్న మూర్తిత్వాలనాకర్షిస్తాయి లేక పాలిస్తాయి. సర్వమూ ఎవరి అభివ్యక్తులో ఆ ఏకైక దైవం, ఏకైక ఆ దివ్యశక్తిలో వాటన్నింటినీ అతనామోదించి సమరసం గావించగలడు.

శివుడు తపస్సు ప్రభువు, శక్తి తపశ్శక్తి

ఒక భగవత్తత్త్వంగా కృష్ణుడు ఆనందానికి, ప్రేమకు, భక్తికి ప్రభువు.

దేవి దైవశక్తి - దైవం చిత్ శక్తి, లోకాల తల్లి, మహా ఊర్జం. సమస్త శక్తులు ఆమెవే. కొన్ని సమయాలలో దేవి శక్తి అంటే విశ్వజనీన ప్రపంచ మహాక్రియా శక్తి, కాని ఇది మహాశక్తిలో ఒక పార్శ్వం మాత్రమే.

మహాకాళి, కాళి ఒకటి కాదు, కాళి కొంచెం తక్కువరూపం. ఉన్నత స్తరాలలో మహాకాళి మామూలుగా బంగారు వర్ణంలో దర్శనమిస్తుంది.

CWSA 28:459-60

భారతీయ సంప్రదాయపు వేదకాలానంతర దేవుళ్ళు

ఏకైక జగదధిదేవత మూడు శక్తులు, మూర్తిత్వాలు బ్రహ్మ, విష్ణు, శివ.

రూప నిర్మాణము, సృష్టి వెనుక నిలిచియుండు దైవశక్తి బ్రహ్మ. సృష్టికర్తగా విష్ణువు సాంప్రదాయకంగా లయకారుడైన శివసైతం. మొత్తం ముప్పురు భగవంతుళ్ళు తరచుగా విశ్వాన్ని సృజించేవారుగా చెప్పబడ్డున్నారు.

శివునకు, అధిమనస్సుకు మధ్య ప్రత్యేకమైన సంబంధమేమీ లేదు. భగవంతుళ్ళందరి కన్నా ఉన్నత తర ప్రాంతం అధిమనస్సు.

మహా శివ అంటే, మామూలుగా శివుడు అని పూజించబడే శివుని కంటే ఒక మహనీయ అభివ్యక్తి - ఒక మహనీయ దైవ అభివ్యక్తికి సంబంధించిన సృజనాత్మక తాండవం.

CWSA 28:459-60

భారతీయ కళల్లో శివుడు

అభివృద్ధికి సంబంధించిన ఒకానొక దశలో మన కళారంగం, లేక సాహితీ రంగం ఉపయోగించిన సంకేతాలు, సంప్రదాయాల యెడల అతిశయించిన గౌరవం చూపించడానికి ఐరోపీయ భావాలచే ఆక్రమించబడని భారతీయులు సైతం మొగ్గు చూపడమనేది గొప్ప కళను ప్రశంసించడంలో మరో అవరోధం అయ్యింది. ఉదాహరణకు శివుని వర్ణించడంలో లేక కాళిని వర్ణించడంలో ఒక ప్రత్యేక విధానానికి అలవాటు పడి వున్నాను. మరో విధాన్ని దేన్నైనా నేను తిరస్కరిస్తాను. నా అభిప్రాయాలతో కళాకారునికేమీ సంబంధం లేదు. శివుని లేక కాళి సారభూత సత్యాన్ని అతడు చిత్రించాలి. అది వారి శివతత్త్వాన్ని, లేక కాళీ తత్త్వాన్ని తయారు చేస్తుంది. ఇతరుల దర్శనాన్ని అనుకరించవలసిన బాధ్యత అతనికుండదు. శివుని, కాళిని అతను మరో విధంగా దర్శించి ఉంటే దానికే అతడు విశ్వాసపాత్రుడై ఉండాలి. దేవుళ్ళను, గడ్డం లేక మీసం లేకుండా చిత్రించడంను గురించి, దానిలోని ఔచిత్యాన్ని గురించి రూపానికి, నియమానికి, బానిసత్వ ధోరణితో బ్రతకడం, ఇది సాహితీ ధోరణికి ఒక ఉదాహరణ. భగవత్తత్త్వాన్ని తయారు చేసేది మీసమా లేక గడ్డమా లేక సంకేతమా అనే దాన్ని సాహితీవేత్త చూడడు. అతడు చూసేది దివ్యమైన మహనీయతను, అమరమైన శక్తి, సౌందర్యాన్ని, శౌర్యాన్ని, పరిశుద్ధత లేక ఆంతరిక శాంతిని. అదిగో ఆ అధి దైవత్వాన్ని కళాకారుడు గీయాలి, రంగులలో చిత్రించాలి. అతను ధ్యానంలో దర్శించిన రూపాల నుండి యెంచుకొన్న దానికే బద్ధుడై ఉండి చిత్రించాలి. ఆతని కళాత్మక వివరణ, జాతి ఆలోచనలలో, ఊహలలో విడదీయలేని స్థానాన్ని

సంపాదిస్తుందా లేదా అనేది జాతిలో దానిశక్తిని లోతైన దృష్టిని జాగృతం చేస్తుందా లేదా అనేది దానిమీద ఆధారపడి ఉంటుంది. మనం గట్టిగా కోరేదంతా అది ఒక నిజమైన భగవంతుడు ఒక నిజమైన శివుడు, ఒక నిజమైన కాళి, అతని ఆలోచన చంచలత లేక ఏదో ఇలా వచ్చి అలాపోయే ఆతని విద్య, లేక కళాత్మక నేపథ్యంలో పెరిగినదానిని సాకారం కాకుండా ఉండాలనే తనలోనే ఉన్న జ్ఞాన ఊట మూలం దగ్గరకాతడు వెళ్ళాలి లేక స్వేచ్ఛకై ఆతనికి హక్కు ఎక్కడ లేదో అక్కడిదాకా పోవాలి. సత్యాన్వేషణే స్వేచ్ఛకు గల షరతు అని ఇప్పటికే చెప్పాం. ఉన్నత లక్షణ స్థానాన్ని తన ఊహ ఆక్రమించేటట్లు కళాకారుడు అనుమతించకూడదు.

CWSA 28:466-67

భగవంతుళ్ళ అవతారం, విభూతులు

అంతరాత్మ కేంద్రమైన దివ్య విష్ఫులింగం (నిప్పురవ్వ) దేవతలలో ఉండదు. ఎందుకనంటే భువిపై మాత్రమే, పదార్ధ విశ్వాన్ని గురించి సైతం నేను చెప్పడం లేదు. భువిపై మాత్రమే దివ్య ప్రేమ అవతరణ జరుగుతుంది. అది పదార్ధ కేంద్రంలో దివ్య సన్నిధి మూలం. వారికి చైత్య పురుష లేదు గనుక సహజంగానే, వారికి చైత్యపురుష తెలియదు. చైత్య పురుషానుభవం కోసం, వారిలో ఎక్కువమంది లేక, కొంతమంది భౌతిక దేహాన్ని స్వీకరించాలని కోరుకుంటారు.

సంపూర్ణంగా దిగిరాకుండా, ఒక నియమంలాగా వాళ్ళు ఆ పనిని పాక్షికంగా అంటే తమ నుండి ఒక ప్రతిరూపాన్ని పంపడం ద్వారా చేస్తారు. ఉదాహరణకు వివేకానందుడు శివుని ఒక అవతారంగా ఒక విభూతిగా చెప్పారు. కానీ స్వయంగా శివుడు అతిమానస ప్రపంచంతో పాటు తాను భువిపైకి వస్తానని స్పష్టంగా ప్రకటించాడు. అదీగాక దాదాపు ఈ జీవులన్నీ అభివ్యక్తమౌతాయి. వాళ్ళు ఆ క్షణం కోసం వేచి చూస్తున్నారు. ప్రస్తుతం ఎట్టి సంఘర్షణ, అజ్ఞానాలను వారు కోరుకోవడం లేదు.

CWM 10:202-03

సాకారం-నిరాకారం

వ్యక్తి రూపమైన దానిపై తన ఏకాగ్రతను స్థిరంచేస్తూ, ప్రపంచంలో ప్రపంచానికి ఆవలవున్న వాటి ద్వారా దానిని కొనసాగించుకుంటూపోయే భక్తుడు, వ్యక్తిరూప భగవంతుడినే ధృవీకరిస్తాడు, నిర్వ్యక్తికమైన దానిని

తిరస్కరించ, లేక నిర్లక్ష్యం చేయ మొగ్గుచూపుతాడు. ద్వివిధ ధృవీకరణలూ సత్యమే, ద్వివిధ తిరస్కారాలూ అసత్యమే. ఏ ఒక్కటీ రెండవదానికంటే గొప్పది కాదు. వ్యక్తిరూపాలలో శివుడు, విష్ణువు కంటె లేక శివునికంటె విష్ణువు, లేక సర్వ-పురుష, కృష్ణుడు లేక కాళి కంటె గొప్పకానట్లు నిర్వ్యక్తిమైనది, వ్యక్తిరూపమైన దానికంటె గొప్పకాదు. పార్శ్వములకు బంధించుకొని ఆతని ఆత్మాభివ్యక్తిలో భగవంతుని యధార్థ అస్తిత్వాన్ని నిర్లక్ష్యం చేసే, పాక్షిక లేక గొప్పదని యెంచిన యోగపు దోషాలు, అటువంటి అతిశయించబడిన భేదాలు. మన పరిపూర్ణత కోసం ఆయన పార్శ్వాల నానాత్వాన్ని, ఆతని దివ్యమారు రూపాలను మనం అంగీకరించాలి. కానీ భగవంతుని అనన్య ఏకతను భగ్నం చేయడం కోసం వాటిని సాకుగా తయారు చేయకూడదు.

CWSA 17:428

శివుని పుష్పం

ఒకసారి, నాకేమీ చెప్పకుండా ఎవరో ఒక తులసీ దళాన్ని తెచ్చి యిచ్చారు. దానిని వాసన చూచి 'ఓహ్ భక్తి' అన్నాను. అది సంపూర్ణంగా భక్తికిచెందిన ఒక కంపనం. అది కృష్ణుని యెడల భక్తికి సంబంధించిన కృష్ణునకు అర్పితమైన మొక్క అని తరువాత చెప్పారు.

మరోసారి మొక్కజొన్న పొత్తును పోలి ఉండే పెద్ద, ఘాటైన వాసన వున్న రేకులు గల పెద్ద పుష్పాలలో (నిజంగా పుష్పాలు కాదవి) ఒకదానిని తెచ్చిచ్చారు. వాటి వాసన చూచి 'విరక్త పరిశుద్ధత' అని అలవోకగా వాసన మాత్రమే చూచి చెప్పాను. శివుడు తపస్సు చేస్తున్నప్పుడు అది శివుని పుష్పమని చెప్పారు.

వీళ్ళకు ప్రాచీన జ్ఞానం వుంది, వాళ్ళు పరిరక్షించిన వైదిక జ్ఞానమది. వేరు మాటలలో అది చాలా పటిష్ఠమైన సత్యం, అది మనసుపై, ఆలోచనపై లేక సంవేదనలపై సైతం ఆధారపడదు, అదొక కంపనం.

జొన్నపొత్తులాంటి కాడ గలిగిన ఈ పుష్పం (మొగలి-అను) సంగతేమిటి?

అవును ఈ పుష్పం తపస్సు చేస్తున్న శివుడు.

ఇందులో ఆసక్తి కలిగించే విషయమేమిటంటే, దాని వాసన అద్భుతంగా పాములను ఆకర్షిస్తుంది. ఎంతో దూరాన్నుండి అవి వచ్చి పొదల్లో నివసించే విధంగా ఆ వాసన వాటినాకర్షిస్తుంది. పాము పరిణామ శక్తి అని మీకు తెలుసు

గదా, అది శివునిస్వంత ప్రాణి. వాటినాతడు సదా తన శిరసుపైన, కంఠం చుట్టూ పెట్టుకొంటాడు. ఎందుకనంటే పరిణామ శక్తికి, రూపాంతరీకరణ శక్తికి అవి ప్రతీకలు. పాములు ఈ పుష్పాన్ని ఇష్టపడతాయి. అవి తరచుగా నదుల సమీపంలో పెరుగుతాయి. అటువంటి మొక్కలు గుబురుగా ఎక్కడెక్కడ వున్నా అక్కడ పాముల్ని చూడగలవు.

ఇది నాకు చాలా ఆసక్తి కలిగించిన విషయం. ఎందుకనంటే అదిలా ఉండాలని మనం కాదు నిర్ణయించేది, ప్రకృతిలో యివి సచేతన కంపనాలు. వాసన, రంగు, ఆకారం అనేవి కేవలం ఒక యధార్థ చలనపు అప్రయత్న ప్రకటన.

భౌతికంగా పాము దేనిని సూచిస్తుంది? పదార్థ ప్రపంచంలో దేనినది ధరిస్తుంది.

పరిణామ కంపనం.

- శ్రీమాత : శిష్యునితో సంభాషణ ఫిబ్రవరి ***4,1961***

సమస్త సంభూతులకు, అసంభూతులకు శివుడు అధిపతి. ఆయన నుండియే ఈ సమస్త సృష్టి జాలువారుతోంది. ఇది శివుని ఒక అంశ మాత్రమే. రెక్కలు గల అధ్యాత్మ ఏ ఆవాసంగానూ ఆతనికాపేరు రాలేదు. హృదయం మాత్రమే ఆయనను దర్శిస్తుంది. ఎవరు శివునెరుంగుదురో వారు ధన్యులు, శాశ్వతంగా దేహం నుండి ముక్తమౌతారు.

CWSA 18:243

1926లో జరిగిన శివునితో సంభాషణ

ఇది కేవలం శ్రీ కృష్ణుని ప్రమేయంతో జరిగింది, కానీ శ్రీ అరవిందులకు వ్యక్తిగతంగా అది పెద్ద విషయమేమి కాదు. ఇది ప్రస్తుత సృష్టిలో పాల్గొనడానికి అంగీకరించిన గతం నుండి వచ్చిన నిర్మాణం, అంతకు మించి ఏమీ లేదు. ఇది సర్వోన్నత సత్యం, పరాత్పరుడు అయిన దైవం యొక్క అవరోహణ, కొంతకాలం క్రితం నుండి (మొదలై) ఇప్పుడు కొత్త అభివ్యక్తిలో పాల్గొనడానికి సమ్మతిస్తోంది.

శివుడు మాత్రం అందుకు నిరాకరించాడు. 'కాదు' అన్నాడు, 'నేను నీవు నీ పని పూర్తికావించిన తరువాత మాత్రమేవస్తాను. నేను ఇప్పుడు

ఉన్నటువంటి ఈ లోకంలోకి రాను, కానీ నేను సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నాను.' అతను ఆరోజు నా గదిలో నిలబడి ఉన్నాడు, అతని తల పైకప్పుకు తాకేంత ఎత్తుగా ఉంది (నవ్వుతూ)! అతను తన స్వంత ప్రత్యేకమైన కాంతితో మెరిసిపోతున్నాడు, ఎరుపు మరియు బంగారు వర్ణాల కలయికతో ఉన్న కాంతి... అద్భుతమైనది! అతను తన అత్యున్నత చైతన్యాన్ని వ్యక్తపరిచినప్పుడు అతను ఎలా ఉంటాడో అలా అతడు సర్వశక్తి సమన్వితుడై ఉన్నాడు! కాబట్టి నేను లేచి నిలబడి... (నేను కూడా చాలా పొడవుగా తయారయ్యాను, ఎందుకంటే నా తల అతని భుజంపై వాలి ఉంది, అతని తలకి కొంచెం దిగువన ఉంది) అప్పుడు అతను నాకు చెప్పాడు, "లేదు, నన్ను నేను ఒక శరీరానికి బంధించుకోలేను, కానీ నేను నీవు కోరినది ఏదైనా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను. అప్పుడు నేను చెప్పింది ఒక్కటే (నిజానికి అదంతా మాటలతో పనిలేకుండా తెలియచేయబడింది) "నేను భౌతిక అహం నుండి బయట పడాలనుకుంటున్నాను."

సరే, నా చిన్నారి (నవ్వుతూ), అది జరిగింది! ఇది అసాధారణమైనది!... కాసేపటి తర్వాత, నేను శ్రీ అరవిందులను కలుసుకొని, 'ఏమి జరిగిందో చూడండి! కణాలు ఇకపై కలిసి ఉండకపోవడాన్ని గురించి నాకు హాస్యాస్పదమైన అనుభూతి కలుగుతున్నది (అమ్మ నవ్వుతుంది), అవి ఇప్పుడు చెల్లాచెదురు అయిపోయాయి ! శ్రీ అరవిందులు నా వైపు చూసి నవ్వి, "ఇప్పుడే కాదు" అన్నారు. అంతే అదంతా అదృశ్యమైంది.

కానీ నేను కోరుకున్నది శివుడు నిజంగానే ఇచ్చాడు!

కానీ 'ఇప్పుడే కాదు' అని శ్రీ అరవిందులు అన్నారు.

లేదు, ఇంకా దానికి సమయం రాలేదు. ఇది చాలా ముందుగా జరుగుతోంది, చాలా ముందుగా (నిశ్శబ్దం)

ఇప్పటికీ ఇది నాకు రెండు సంవత్సరాల క్రితం జరిగింది. కానీ ఇప్పుడు మరొకటి జరుగుతున్నది - ఇప్పుడు విషయాలు దీనికి భిన్నంగా ఉన్నాయి.

శ్రీమాత : శిష్యునితో సంభాషణ, ఆగస్ట్ 6, 1961

ఒకరే ఆ నలుగురు

రెండు ఒకటే అవడం, అన్నీ ఒక్కటే కావడం - ఇది సచ్చిదానంద లోకాలలో శాశ్వతమైన, కాలాతీతమైన అభివ్యక్తి యొక్క సూత్రం.

ఎవడు రెండుగా ఉండి అనేకంగా మారే రెండుగా ఉన్నాడో - ఇది మనస్సు, ప్రాణం మరియు పదార్థం అనే మూడు లోకాలలో కాలానుగుణంగా శాశ్వతంగా వ్యక్తమయ్యే సూత్రం.

ఎవరు తనలో తాను ఎప్పటికీ రెండుగా ఉంటూ మరియు ఎప్పటికీ అసంఖ్యాకంగా ఉంటూ, అలాగే నిత్యం అనంతం అయినవాడు, ఇది కాలం, కాలాతీతానికి అతీతంగా అత్యున్నతమైన అపరిచ్ఛిన్నమై ఉన్న సర్వోన్నతమైన దానికి సూచన.

ఒకటే నాలుగుగా ఉన్నది శాశ్వతంగా, అతిమానసంలో ఉండే నాలుగు అంశాలుగా, ఉనికి, చైతన్యం, శక్తి మరియు ఆనందాలుగా ఉన్నది.

బ్రహ్మ, విష్ణు, శివ, కృష్ణ, ఇవి శాశ్వతమైన నాలుగు అంశాలు, చతుర్ముఖ అనంతం.

బ్రహ్మ శాశ్వతమైన ఉనికి యొక్క వ్యక్తిత్వం, అతని నుండి, అతని ఉనికి ద్వారా, అతని శక్తి ద్వారా, అతని ప్రేరణ ద్వారా ప్రతిదీ సృష్టించబడింది.

విష్ణువు శాశ్వతమైన చేతనపూర్ణమైన వ్యక్తిత్వం: ఆతని విస్తృతిలో, అతని స్థిరత్వంలో, అతని పదార్థంలో అన్నిటికీ ఆధారమై ఉన్నవాడు.

శివుడు శాశ్వతమైన శక్తికి వ్యక్తిత్వం; అతని ద్వారా, అతని అభిరుచి ద్వారా, అతని లయ ద్వారా, అతని ఏకాగ్రత ద్వారా అన్నీ సృష్టించబడతాయి. కృష్ణుడు శాశ్వతమైన ఆనందానికి చెందిన వ్యక్తిత్వం: అతని క్రీడ వల్ల, అతని ఆనందం వల్ల, అతని మాధుర్యం వల్ల సకల సృష్టి సాధ్యమైంది.

బ్రహ్మ అంటే అమరత్వం, విష్ణువు శాశ్వతత్వం, శివుడు అనంతం; కృష్ణుడు పరమాత్మ యొక్క శాశ్వతమైన, అనంతమైన, అమరమైన స్వీయ-స్వాధీనం, స్వీయ-ప్రకటన, స్వీయ-వ్యక్తీకరణ, స్వీయ-శోధన.

CWSA 12:289 *శ్రీ అరవిందులు*

నంది

నంది, బలం మరియు శక్తికి చిహ్నం. అది కూడా వేదాలలో ఒక దేవతా రూపం, ప్రకృతిలోని మగ శక్తులకు ప్రతిరూపం. శివుని వాహనం కూడా. ఇది కలలో లేదా అనుభవంలో పైన చెప్పిన ఏదో ఒక సంకేతం కానీ అదే ఇక్కడ మొట్టమొదటిది.

CWSA 3: 166



పార్వతి

ఆమెజగత్ కారిణి, జగత్ జననీ
ఆమె శబ్దబ్రహ్మం యొక్క రూపం
మరియు ఆమె సత్తా ఆనందమయం.

నువ్వే సనాతనివి, లెక్కలేనన్ని ప్రాణులకు తల్లివి,
కమలంలో జన్మించిన వాని, విష్ణువు, శివుడి శరీరాల సృష్టికర్తవు,
లోకాలను సృష్టించి, సంరక్షించే, లయం చేసే సృష్టికర్తవు నువ్వు.
సనాతనమైఉండి కూడా ఎప్పుడూ నవయవ్వన వతివి
పర్వత-రాజు కుమార్తె అయినప్పటికీ, నీవు సున్నితత్వంతో నిండి ఉన్నావు.
నీవు వేదమాతవు అయినా వేదాలు నిన్ను వర్ణించజాలవు
మానవులంతా నిన్ను ధ్యానించవలె కాని వారి మనసులు నిన్ను అర్థం చేసుకోలేవు

CWSA 1:574-575

శివుడు - కాళీ

సత్‌లో శక్తి అంతర్లీనంగా ఉంది అనేది ప్రాచీన భారతీయ మనస్సుచే ఆమోదించబడిన సమాధానం. శివుడు మరియు కాళీ , బ్రహ్మం మరియు శక్తి ఒక్కటే తప్ప ఇద్దరు కాదు. ఉనికిలో అంతర్లీనంగా ఉన్న శక్తి విశ్రాంతిగా ఉండవచ్చు లేదా అది కదలికలో ఉండవచ్చు, కానీ అది విశ్రాంతిగా ఉన్నప్పుడు కూడా అది ఉన్నది, అది తక్కువగా ఉండదు, రద్దు చేయబడదు, తగ్గించబడదు, ఏ విధమైన మార్పుకు లోబడదు. ఈ ప్రత్యుత్తరం పూర్తిగా హేతుబద్ధమైనది మరియు విషయాల స్వభావానికి అనుగుణంగా ఉంది కనుక మనం దానిని అంగీకరించడానికి వెనుకాడాల్సిన అవసరం లేదు. ఎందుకంటే శక్తి అనేది ఏకమైన అనంతమైన ఉనికికి పరాయిది అని అనుకోవడం అసాధ్యం, అది బయటి నుండి ప్రవేశించింది లేక ఉనికిలో లేదు కాని ఏదో ఒక సమయంలో దానిలో ఉద్భవించింది అనుకోవడం కూడా అసాధ్యమే. మాయా సిద్ధాంతం లో కూడా మాయ, బ్రహ్మంలో తనను తాను భ్రాంతికి లోనుచేసుకొనే శక్తి, శాశ్వతమైనదానిలో సంభావ్యతగా శాశ్వతమైనది అని అంగీకరించాలి. అప్పుడు ఏకైక ప్రశ్న దాని అభివ్యక్తి లేదా నిరభివ్యక్తి. సాంఖ్య సిద్ధాంతం ప్రకారం చూసినా ప్రకృతీ పురుషుడు, శాశ్వతమైన సహజీవనాన్ని, అంటే ప్రకృతి యొక్క విశ్రాంతి లేదా సమతుల్యత మరియు సమతుల్యత యొక్క కదలిక లేదా భంగంయొక్క మారుతూ ఉండే స్థితులను నొక్కి చెబుతుంది.

CWSA 21-22: 9 — *శ్రీ అరవిందులు*

సావిత్రిలో శివుడు

ఆమె అస్తిత్వం ఆమెకు తెలిసే దాచబడింది
ఆమె సర్వోత్కృష్టునికి ప్రియురాలు అని ఆమెకు తెలుసు;
ఈ దేవతలు మరియు దేవేరులు - అతను మరియు ఆమె;
అందం ఆనందాలకు ఆమె తల్లి,
బ్రహ్మ యొక్క విస్తారమైన సృష్టిలో ఉన్న వాక్కు
సర్వశక్తిమంతుడైన శివుని ఒడిలో జగత్-శక్తి
అన్ని జీవులకు గురువు మరియు తల్లి
వారి జతగా సృష్టించిన ప్రపంచాలను చూస్తూ,
కృష్ణుడు రాధ ఎప్పటికీ ఆనందంలో కలగలిసి పోయారు.
ఆరాధకుడు ఆరాధించబడేది తమనుకోల్పోయి ఒకటిగా అయ్యారు.

సావిత్రి : 525

*

తెరుచుకుంటున్న చిత్రం రాబోయే విషయాలను చూపించింది.
శివుని తాండవం గతాన్ని చీల్చివేసింది;
పడిపోతున్న ప్రపంచాలు ఉరుములా అనిపించాయి;
భూమి అగ్నితో మృత్యు గర్జనతో నిండిపోయింది
ఆతని ఆకలి సృష్టించిన ప్రపంచాన్ని అంతం చేయడానికి
విధ్వంసపు ఇనుప రెక్కల రొద నిరంతరంగా మోగింది:
ఆసురుని యుద్ధ నినాదం నా చెవిలో పడింది
ఆందోళన, పుకారు సన్నద్ధమైన రాత్రిని కదిలించాయి.
సర్వశక్తిమంతుని జ్వలించే మార్గదర్శకులను నేను చూశాను...
జీవితం వైపు తిరిగే స్వర్గపు అంచుపై

సావిత్రి: 343 *శ్రీ అరవిందులు*



తపస్సు

దైవాన్ని సిద్ధింపజేసుకొనే లక్ష్యం గల ఒక క్రమశిక్షణ

(మదర్ ఈ పుష్ప ఆధ్యాత్మిక విశిష్టతను, వివరణను తెలియజేశారు.)

శాస్త్రీయ నామం :
థోర్న్ఏపిల్

Vol. 53, No. 12
December 2023


Date of Publication
1st December 2023

Registered: PY/41/2021-23

AKHILA - Akhila Bharata Patrika (Telugu)

Registered with the Registrar of Newspapers for India: No. 23593/72 (monthly)

Matter shall reveal the Spirit's face. — Sri Aurobindo



Owner: Sri Aurobindo Society
Printer: Swadhin Chatterjee for Sri Aurobindo Ashram press
Publisher: Pradeep Narang for Sri Aurobindo Society
Published from: Society House, 11 Saint Martin Street, Puducherry - 605001
Printed from: Sri Aurobindo Ashram Press,
No. 38, Goubert Avenue, Puducherry - 605 001, India
Editor: K. V. Rao

Single copy Rs. 30 **Annual Subscription Rs. 200 (in India)**

A Monthly Published by
SRI AUROBINDO SOCIETY-605001